# చీకటిలో చీలికలు

నవల

- గొల్లపూడి మారుతీరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 200

కౌముది మాసపత్రికలో

జనవరి 2016 సంచిక నుంచి మార్చ్ 2019 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

ఈ నవల మూడు ముద్రణలకి నోచుకుంది.. చాలా పాపులర్ కావడం వల్లకాదు - చాలాకాలం ఆగి ఆగి ప్రింటయింది. ఈ నవలకి ఎంతలేదన్నా 55 ఏళ్ళ వయస్సుంది ఎప్పుడూ ఎవరూ "అమ్మో - ఎంత మంచి నవల" అని అనలేదు. అయితే ఎక్కువమంది మహానుభావులు విమర్శించిన నవలగా దీనికి చిన్న ముందుమాట వ్రాయాలనిపించింది.

1959 ప్రాంతంలో అప్పుడే చదువు పూర్తయి, నిరుద్యోగిగా వున్న రోజుల్లో ఈ నవల వ్రాశాను. అప్పటికి - బుచ్చిబాబు, చలం - యిలాంటి వారి ప్రభావం నా మీద వుంది. తెలిసిందంతా చెప్పెయ్యాలనీ, నాకు తెలిసిన రచయిత ఎంత గొప్పగా చెప్పాలనే యావ అప్పటిది. ఆ వాసన ఈ నవలలో ఎక్కువ. ఎలా కలిశారో పుట్టపర్తి నారాయణాచార్యుల వారిని ఆ రోజుల్లో కలిశాను. వారిని ఈ నవలకి ముందుమాట వ్రాయమన్నాను. (ముందు మాటలూ, అంకితాలు బొత్తిగా అలవాటు లేదు) ఆయన వ్రాశారు. ముందుమాట వ్రాశారు గనుక విమర్శించలేదేమో కానీ, మొహమాటపడి బాగుందన్న గుర్తు.

1962లో విశ్వనాథ సత్యనారాయణగారికి చిత్తూరులో సన్మానం జరిగింది. ఆయన గుంటూరు శేషేంద్రశర్మగారి (అప్పటి చిత్తూరు మునిసిపల్ కమిషనరు) యింట్లో బస చేశారు. అక్కడ నా నవలలో ఒకటి రెండు పేజీలు చదివారేమో. ఆ సాయంకాలం సభలో ఆర్ముద తమ కిన్నెరసాని పాటల్ని పిప్పరమెంటు పాకం అన్నందుకు ఆయన్ని తిడుతూ పనిలో పని నాకూ రెండు వడ్డించారు. "ఇందాక ఎవరో రచయిత నవల చూశాను. ఆకాశంలో నక్షత్రాలు మరో లోకంలోకి ఎగిరిపోతున్నాయంటాడు" ఇలా సాగింది. నాకు ఆ రచయిత ఎవరో వెంటనే అర్థమయింది. నా పక్కన కూర్చున్న శేషేంద్రశర్మగారు, మల్లాది వసుంధరగారూ, మల్లాది రామచంద్ర శాస్త్రిగారూ యిబ్బంది పడుతున్నారు.

సభ ముగిసింది. రాత్రి విశ్వనాథ వారికి చెప్పినట్టున్నారు. ఆ విమర్శించిన రచయిత నేనేనని. మర్నాడు మధ్యాహ్న భోజనం శర్మగారింట్లో జి. కృష్ణగారూ, వి.డి. ప్రసాదరావుగారు ప్రభృతులు వచ్చిన గుర్తు. అప్పుడు ఈ ప్రసంగం టేపు వేశారు. నన్ను విమర్శించే ప్రసంగం వచ్చేటప్పటికి  సత్యనారాయణగారు నావేపు తిరిగి "మిమ్మల్ని తిట్టినట్టున్నాను" అన్నారు నవ్వుతూ.

నేనూ నవ్వేసి "ఆ విధంగానయినా ఆ మాత్రం నవల చదివారు. అదీ నాకు ఆశీర్వాదమే" లాంటి మాటలేవో అన్నాను. ఏమయినా, విశ్వనాథగారు కించపడ్డారు. అనవసరంగా నన్ను విమర్శించినందుకు. ఆయన "నిండు మనంబు నవ్యనవనీత సమానము" కోవలో మనిషి. ఆ ఆలోచన మనస్సులో పీకుతున్నట్టుంది. ఆ సాయంకాలం అప్పటి సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు, చిత్తూరు వారు విలాససభ అధ్యక్షులు ఆర్.బి రామకృష్ణరాజుగారు రామవిలాససభలో సభ ఏర్పాటు చేశారు. విశ్వనాథ వారు బజారుకెళ్ళి శాలువాలు కొనుక్కొచ్చి - ఆ సభలో మా రచయితలు - నేనూ, మధురాంతకం, పల్లంపాటి, రాజేంద్ర సదానంద (వీరంతా వున్న గుర్తు) అందరికీ శాలువాలు కప్పారు - అదీ వారి ఔదార్యం.

ఆ రోజుల్లోనే తిరుదణ్ణామలైలో వుంటున్న చలం గారి దగ్గరికి వెళ్తూండేవాణ్ణి. వారికి 'చీకటిలో చీలికలు' నవల పంపాను. "మీ పుస్తకం అందింది. ఈ నక్కకి అది కూజా భోజనం" అని వ్రాశారు.

తరువాత నాలుగైదు పుస్తకాలొచ్చాయి. "నర్తకి అదే పనిగా చదువుతోంది. అయ్యో అందరూ చచ్చిపోతున్నారే" అని మధ్య మధ్య బాధపడుతోంది అంటూ తరువాత చదివినట్టున్నారు.

"అందులో వర్ణనలన్నీ అనవసరం. కృత్రిమం మీరు కూడా అవన్నీ చూసి వుండరు" లాంటి వాక్యాలు గుర్తున్నాయి.

ఆనాటి 'చీకటిలో చీలికలు' దగ్గర్నుంచి నిన్న మొన్నటి 'ఎర్రసీత' వరకు - ఓ రచయిత మానసిక పరిణామాన్ని తెలియజెప్పడం కూడా సమగ్ర సాహిత్య పరిచయ లక్షణం.

# 1

**సాయంకాలపు చల్లదనాన్ని** మరచిపోలేక రాత్రి ఆకాశం వణుకుతూ, ఒగరుస్తోంది. ఏదో పేరు తెలీని పిట్ట అరుపు నిశికడుపులో తిరిగి విసుగు కలిగిస్తోంది.

నిశ్చలమయిన రాత్రి -

చిక్కటి చీకటులు వొళ్ళంతా పూసుకుని, సహనంతో తలవొంచి, నక్షత్రాల నిరీక్షణలో నిలిచే రాత్రి -

కాలికింద ఎండుపుల్ల పుటుక్కుమనే సరికి తుళ్ళిపడ్డాడు విశ్వేశ్వరం. భయమంటే ఎరగని గుండె, చీకటి తెరల్లో రెపరెపలాడింది.

ఎనిమిదేళ్ళ కిందటి పుంత. ఎరిగిన తోవయినా అలవాటు లేకపోవడం వల్ల దారి తప్పుతున్నాడు. మొగలిడొంకలూ, గుబుర్లు అడ్డు వస్తున్నాయి. నిశీథిలో నీడలా సాగిపోతున్న విశ్వేశ్వరం సగం త్రోవ గడిచాక ఒక్కసారి ఆగిపోయాడు ఏదో ఆలోచన తోచి -

ఇంతరాత్రిలో ఇలాంటి రాత్రిలో అక్కడికి వెళ్ళడం మంచిదా అనుకున్నాడు. బుద్ధి వెనక్కు లాగింది. మనస్సు పీకుతోంది. ఎక్కడో పేగు కదిలింది. రక్తమంతా వణికి, ఒక్కసారి పొంగి మెదడులోకి ప్రాకింది.

దూరంగా యిల్లు కనిపిస్తోంది. ఏళ్ళు గడిచినా, ప్రపంచం మారినా ఆ యిల్లు మారలేదు.

ఇంటి ముందు వచ్చి ఆగాడు. లోపల్నుంచి ఏ అలికిడీ వినిపించడం లేదు. ఎవరో లోపల వున్నారనడానికి చిన్న దీపమే నిదర్శనం.

తలుపు కంతలోంచి చూశాడు. దీపపు వెలుగులో ఎవరిదో చెయ్యి మాత్రం లీలగా కనిపిస్తోంది.

చలనం లేకుండా వున్న ఆ చేతిని చూసి భయపడ్డాడు విశ్వేశ్వరం. ఒక్కసారి గుండె ఝుళ్ళుమంది మరో ఆలోచనా లేకుండా తలుపు తట్టాడు.

చెయ్యి కదిలింది. తలుపు తెరుచుకుంది. "ఎవరూ?"

తనని తనే ఆ ప్రశ్న వేసుకున్నాడు విశ్వేశ్వరం.

"ఎవరు తను?"

ఆగి - "నీలవేణీ!" అన్నాడు.

పలికింది.

"నేను విశ్వేశ్వరాన్ని - నీకు జ్ఞాపకం వుంటే"

క్షణం మాట్లాడలేదామె. ఆమె ముఖం దీపపు నీడలో కనిపించడం లేదతనికి.

"లోపలికి రండి" అందామె.

గడపదాటి లోపలికి అడుగువేశాడు. గదంతా గజిబిజిగా, సామాన్లన్నీ గుట్టగా పడేసి వున్నాయి.

చాప దగ్గర బల్లమీద వుంచి కూచుంది నీలవేణి.

అతన్ని కూచోమని చెప్పలేదు. చుట్టూ చూసి ఓ పెట్టె ముందుకి లాగాడు కూచుందుకి -

ఎలా మాటలు ప్రారంభించాలో తోచలేదతనికి. ఆమె ఏదన్నా అడుగుతుందా అనుకున్నాడు.

ఎనిమిదేళ్ళ తర్వాత -

ఆ కాస్త వెలుగులో, నీలవేణి ముఖం గుండ్రంగా, బలహీనంగా, పల్చగా వాడినట్టు తోచింది.

ఎంతో ఆలోచించి "కామేశ్వరమ్మగారు పోయారటగా?" అన్నాడు.

"వారం రోజులయింది"

"దారిలో అనంతశయనం గారి పాలేరు కనిపిచాడు. సాయంకాలం యింటికివెళితే ఆయనే చెప్పారు"

నీలవేణి మాట్లాడలేదు.

"ఒంటరిగానే వుంటున్నావా?"

తలెత్తలేదామె. కాగితం ముక్కని చింపుతూ అంది "ఇంకెవరున్నారు?"

"పీతాంబరం?" ఎదురు ప్రశ్న వేశాడు.

క్షణం మాట్లాడలేదామె. తర్వాత నవ్వి చిన్నకాగితం ముక్కని దీపపు మంటలో కాల్చింది.

నవ్వుకి అర్థం తెలుసుకునేంత లోకానుభవంలేదు విశ్వేశ్వరానికి. ముఖ్యంగా నీలవేణి నవ్వు.

"పోనీలే, అంతా తెలిసి తిరిగి వచ్చేశాను" అన్నాడు.

"మిలటరీ నుంచి వచ్చాశారేం?"

"గొడ్డు చాకిరీ చేయించి, సగం తిండి పెడుతున్నారు. మనిషిని చూడు ఎలా అయిపోయానో?"

ఎంతోసేపయాక మొదటిసారి తలెత్తి అతణ్ణి చూసింది.

సన్నగా, పీలగా, రివటలా అయాడు విశ్వేశ్వరం. కళ్ళు ఎక్కడో లోతున మెరుస్తున్నాయి. వ్రేళ్ళన్నీ వెల్లుకొచ్చిన గడ్డి మొక్కలా వాడిపోయి డీలాపడిపోయాడు. వయస్సు ముప్పై ఎనిమిదయినా కండలు తిరిగిన శరీరం కావడం వల్ల ముప్పయిలా అవుపిస్తాడు.

"నామీద కోపమా నీకు?"

తెల్లబోయి చూసింది. "ఎందుకూ?"

"ఎనిమిదేళ్ళ క్రిందటి నా చేతకాని తనానికి - నిన్ను వదిలేసి పోయానని"

"అవన్నీ మరచిపోయాను"

"అనంతశయనంగారి యింట్లోంచి వచ్చేశావేం? అతనంత మంచి మనిషిని ఎక్కడా చూళ్ళేదు నువ్వు - కూతురులాగా చూసుకుంటానన్నాడు. అందుకే చేతకాక తప్పించుకుని పారిపోయాను"

అతని కంఠంలో జీర గుర్తించి నీలవేణి మనస్సు ఆర్ద్రతతో వణికింది.

ఇక అప్పటి విషయాలు ఎవరూ కదప దల్చుకోలేదు.

"ఇప్పుడిక నువ్వేం చేస్తావ్?"

"ఏమో! తెలీదు" ఆ స్తబ్ధత చూసి చకితుడయాడు విశ్వేశ్వరం.

"నిన్ను తీసుకుపోవడానికి వచ్చాను"

తలెత్తి మాట్లాడలేదు. ఆలోచిస్తోంది.

ఓ చిన్న పురుగు దీపం చుట్టూ తిరిగి మంటలో పడి మాడిపోయింది.

"మళ్ళీ పారిపోతానని భయమా?" నవ్వాడు.

ఏదో ఆలోచిస్తోంది. చేతిలో చీర వెయ్యి ముడతలు పడింది.

భూమిని మౌనంగా కౌగిలించుకున్న గడ్డిపువ్వులాగా, ఏకాంతంలో నిశ్శబ్దంగా నిలిచిన వొంటి నక్షత్రం లాగా కనిపించింది చీకట్లో నీలవేణి.

"నీలవేణిని వదిలిపోకూడదు" అనుకున్నాడు.

"నాతో నువ్వూ రావాలి నీలూ!" అన్నాడు.

కంఠంలో నిశ్చయానికి విస్తుపోయి తలెత్తింది. ఆమెనలా పిలవడం అదే మొదటిసారి. ఆమె కళ్ళల్లో చీకటి నీడలు పడ్డాయి. కన్నీళ్ళు చీలికలయి చెక్కిళ్ళ మీద మెరిసింది. భయపడ్డాడు విశ్వేశ్వరం.

"ఛీ! ఏడుస్తావేం? ఇన్నాళ్ళూ ఎందుకో తెలీకుండా పిచ్చిగా తిరిగాను. నాకెవ్వరూ లేరనిపించింది. మళ్ళీ చాలాకాలానికి నువ్వు గుర్తుకొచ్చావు. నా మాట కాదనకు"

చీరతో కళ్ళు తుడుచుకుంది.

"రేపు ఊరికి పోదాం. ఇవన్నీ యిక్కడే వదిలెయ్. అనంతశయనంగారితో ఉదయమే మాట్లాడి వస్తాను."

ఎంతకీ మాట్లాడకపోవడం చూసి నిరుత్సాహితుడయాడతను.

"ఏం? ఇంకా ఏదో అనుమానం"

"వస్తాను. రేపు వెళ్దాం"

తృప్తిపడ్డాడు విశ్వేశ్వరం.

అక్కడో దుప్పటివుంటే తీసుకుని అరుగుమీదకి వచ్చాడు.

అప్పటికి మేఘాలు వీడాయి.

గదిలో గాజుల చప్పుడు వినిపించింది. దీపం పెద్దదయింది. పెట్టె సర్దుతోంది నీలవేణి.

అలసిపోయిన విశ్వేశ్వరం అయిదురోజుల తర్వాత వొళ్ళు మరచి నిద్రపోయాడు.

## 2

పడమటి ఆకాశమంతా ఎర్రటి కెంపురజం జల్లినట్టు మెరుస్తోంది. ఎదురుగ్గా శాఖలు విప్పిన గన్నేరు చెట్టు. నీడల్లో పక్షులన్నీ పలవరిస్తున్నాయి. సీతాకోక చిలుకలా రంగులు మార్చుకుంటోంది ఆకాశం. ఇంటికెదురుగ్గా అనంత పద్మనాభస్వామి ఆలయంలో గంటలు మోగుతున్నాయి.

ఇంత చక్కటి వాతావరణాన్ని వదులుకుని ఎక్కడికీ పోవాలనిపించదు వరదరాజులకి, ఆఫీసు నుంచి ఎప్పుడు వస్తాడో, ఆ కుర్చీల్లోనే.

పక్కయింటి పంజాబీ అమ్మాయి మొక్కలకి నీళ్ళుపోస్తోంది. అప్పుడే రేకులు విడి, నిండుగా, బరువెక్కిన బంగారంలాంటి బంతిపువ్వు సొమ్మసిల్లినట్టు తలవొంచింది. పువ్వుకంటే అమ్మాయే బాగా కనిపించిది.

"డాలీ.."

ఎవరో పిలిచారు. నీళ్ళు పోస్తున్నదల్లా లోపలికి వెళ్ళిపోయింది.

యౌవనంలో వొళ్ళు విరిచిన అమాయకపు ఎర్రటి అందం డాలీది.

పక్కనే వున్న సివప్పన్న కిళ్ళీకొట్టు దగ్గర ఎవరో గొడవ పడుతున్నారు. మధ్య మధ్య ఏడుస్తున్న స్త్రీ గొంతు వినిపిస్తోంది.

కుర్చీలో వెనక్కి చేరబడి కళ్ళు మూసుకున్నాడు వరద.

చెల్లెలు ఎక్కడికో వెళ్ళింది. ఆఫీసు నుంచి వస్తూనే ఆ కుర్చీ శరణ్యమయింది.

గంటస్థంభం ఎనిమిది చూపి ఏడుగంటలు మ్రోగించి ఆగిపోయింది ఉదయం. ఇప్పుడూ అలాగే వుంది.

గేటు చప్పుడయేసరికి తలెత్తాడు వరద. మసక వెలుతురులో వ్యక్తి ఎవరో తెలీడంలేదు.

"గులాబీ!" అన్నాడు.

జవాబు రాలేదు. ఆ వ్యక్తి గన్నేరు చెట్టుదాకా వచ్చాడు.

"ఎవరూ!"

"నేను విశ్వేశ్వరాన్ని"

లేచాడు వరద, "అక్కడాగిపోయావేం. లోపలికిరా" లేచి మంచం వాల్చబోయాడు.

"ఇక్కడ కూచుంటాలే" అంటూ వాకిట్లో మంచం మీద చతికిలపడ్డాడు విశ్వేశ్వరం.

మసక వెలుగులో అతని ముఖం స్ఫుటంగా కనిపించటంలేదు వరదకి. అయినా గొంతునుబట్టి మనిషి చాలా దిగజారిపోయినట్టు గుర్తించాడు.

ఏం మాట్లాడకుండా స్తబ్దుగా కూర్చున్నాడు విశ్వేశ్వరం.

కుర్చీలో కూర్చుంటూ "ఎప్పుడొచ్చావు?" అన్నాడు వరద.

"పదిరోజులయింది"

"ఇన్నాళ్ళయి కనిపించలేదేం మరి? ఇల్లు మరిచిపోయావా? మనుషుల్నా?"

ప్రశ్న అడగడం అనవసరమని వరదకి తెలుసు. అయినా అడిగేశాడు.

"ఓ అవసరమయిన పనిమీద వున్నాను" అన్నాడు విశ్వేశ్వరం. అతను ఎప్పుడూ జాగ్రత్త చేసుకు వుంచుకునే జవాబుల్లో అదొకటి.

వరద ఏమీ మాట్లాడలేదు.

గుడిలో దీపాలు వెలిగాయి.

"నువ్వెలా వున్నావు?" అడిగాడు విశ్వేశ్వరం.

"నాకేం? నిక్షేపంలా వున్నాను"

"ఇంకా వ్రాస్తున్నావా?"

"అంటే? యీపాటికి మానేసి వుండాలనుకున్నావా?"

"..."

"వ్రాస్తున్నాను. ఇప్పటికి నా మీద నాకు నమ్మకం కుదిరింది."

మొహం మీద పట్టిన చెమటని లాల్చీతో తుడుచుకున్నాడు విశ్వేశ్వరయ్య. ఏళ్ళు గడిచినా మారలేదతను. అనుకున్నాడు వరదరాజులు. ఎనిమిదేళ్ళ క్రిందటి డ్రాయింగు మాష్టరుగానే కనిపించాడు. అప్పటికీ యిప్పటికీ తేడా - జుత్తు చాలావరకూ నెరవడం. మరికాస్త సన్నబడి, పొడుగ్గా, అసహ్యంగా అవుపిస్తున్నాడు.

"ఎందుకొచ్చావు?"

"ఊరికినే చూసిపోదామని"

"అందుక్కాదులే, నాకు తెలుసు ఎందుకొచ్చావో చెప్పు" ఇంకా అతను తటపటాయించటం గమనించి "డబ్బుకావాలా?" అన్నాడు వరద.

"ఉంటే ఇయ్యి"

జేబులు వెదికాడు. నాలుగు రూపాయలూ, మరికాస్తా చిల్లరా మిగిలింది. "చాలకపోతే మళ్ళీ రేపురా" అన్నాడు చేతిలో పోస్తూ. పిడికిలి మూసి అలానే కూచున్నాడు విశ్వేశ్వరం. మరి కాస్సేపటికి అడిగాడు "ఉద్యోగం కావాలి నాకు. మీ ఆఫీసులో"

"నీకు ఉద్యోగం ఎవడిస్తాడు? రేపు ఎక్కడుంటావో నీకే తెలీదాయె. ఇరవైరోజులు వరసగా నాకు కనిపించు. అప్పుడు ప్రయత్నం చేస్తాను."

ఇంకేమీ మాట్లాడలేదు విశ్వేశ్వరం. లేచి నిలబడ్డాడు. వెళ్ళిపోబోయి మళ్ళీ వెనక్కి తిరిగి "ఈ డబ్బు మళ్ళీ నీకు తెచ్చి యివ్వలేను" అన్నాడు.

విచిత్రంగా చూశాడు వరద.

"ఇస్తావని అనుకోలేదులే, ఆరోగ్యం కాస్త జాగ్రత్తగా చుసుకో. తిరగ్గానే సరికాదు. నాలుగు చిత్రాలు వేయకూడదూ - డబ్బు వస్తుంది? అయినా డబ్బిచ్చి చిత్రాల్ని కొనుక్కునేంత పెరగలేదులే మన మనుషులు."

"రంగులూ, కుంచెలూ"

"నీకు ఉత్సాహం వున్న తర్వాత యివన్నీను. సరే వెళ్ళు" అన్నాడు.

విశ్వేశ్వరం వెళ్ళిపోయాడు గేటు దాటి.

ఎదురుగ్గా ఆలయంలోకి వెళ్ళి గంట మోగించే వరకూ కనిపిస్తూనే వున్నాడు.

గుడి వెలుగులో మాసిన గెడ్డంతో, కొమ్మలన్నీ కాలిన కొబ్బరి చెట్టులా వాడిలిపోయి కనిపించాడు.

"ప్రపంచం మరిచిపోయిన మనిషి" అనుకున్నాడు వరద.

తొందరగా తలుపు తోసుకు లోపలికి వచ్చింది గులాబి.

"ఆలస్యమయిపోయిందన్నయ్యా. వెళ్తానంటే వినత ఆపేసింది" అంటూ తలుపు తీసింది.

"నువ్వేమైనా అంటే 'నేను ఉండమన్నానని చెప్పు' అంది"

"ఏం? నువ్వు చెపితే చాలదా యేమిటి?"

"ఏమో బాబూ అదంతా నాకు తెలీదు."

ఫ్లాస్కు తీసుకొచ్చి కాఫీ యిచ్చింది.

"గోవర్ధనరావుగారు ఎలా వున్నారు?"

"అన్నట్టు - మరిచాను. నిన్ను వెంటనే అక్కడికి రమ్మని చెప్పమన్నాడు గోవర్ధనరావుగారు."

"ఎందుకు?"

"ఏమో? తెలీదు. 'వరద కోసం ఎదురు చూస్తూంటానని చెప్పు. ఇదిగో ఇక్కడే కూచుంటాను. అతను వచ్చేవరకూను' అంటూ హాల్లో కూచుని మరీ మరీ చెప్పారు కూడాను."

గోవర్ధనరావుగారి మంచితనం గురించి ఆలోచిస్తున్నాడు వరద, ఏభయ్యోపడి దాటినా అతనిలో జవసత్వాలూ, ఉత్సాహం, జీవితం మీద ఆశా ఎప్పటికప్పుడు అతనికి ఆశ్చర్యాన్ని కలిగిస్తూనే వుంటాయి.

"నాలా బ్రతకడం అందరికీ సాధ్యం కాదోయ్. ఈ గర్వం, ఈ తెగింపూ వున్నవాడికే సాధ్యమౌతుంది" అంటాడు, అతని 'తెగింపు'కు అర్థం ఏమిటో. దేనికి తెగించాడో అర్థంకాదు.

"వెళ్ళున్నయ్యా. లేకపోతే ఆయన చాలా బాధపడతారు"

"..."

"ఆయనమాట ఎలా వున్నా... వినత "

ఆశ్చర్యపోతూ చూశాడు వరద.

చీకటి నీడల్లో గులాబి ముఖం నవ్వుతో మెరిసింది.

దగ్గరికి వచ్చి మెల్లిగా అంది.

"వెళ్తూంటే చెవిలో గోణిగింది."

"ఏమని"

"రాగానే కుర్చీలో కాళ్ళు జాపుకు కూచోకుండా ఓసారి యిటువేపు రమ్మను. మాట్లాడాలి."

"ఏమిటి మాట్లాడాలి?"

"నాకేం తెలుసు?" మళ్ళీ నవ్వింది. దాపరికం లేకుండా, నిండుగా - నవ్వులోకూడా అమాయకత్వం, చల్లదనం తోస్తుంది.

"సరే వెళ్తాను" అని లేచాడు.

"వెళ్ళు.. కాని యిల్లు మరచిపోకు. వినత మాట్లాడ్డానికి కూచుందంటే గంటలు చాలవు" అంది

"మల్లెపువ్వులు కుర్చీమీద వున్నాయి"

మాట వినడంతోటే ఒక్క ఉదుటున పరుగెత్తింది గులాబి.

వెనుతిరిగాక ఆమెను చూశాడు వరద.

కొమ్మలన్నీ విచ్చుకుని విశాలంగా పెరిగిన చెట్టులాగ, రేకులన్నీ పూర్తిగా విచ్చుకుని పరిపూర్ణతతో నవ్వే గులాబిలాగా కనిపించింది గులాబి. యౌవనం ప్రతీ అవయవాన్ని కుదిపి పలకరిస్తోంది.

"ఎంత పెరిగింది గులాబి!" అనుకున్నాడు మొదటిసారి.

ఎవరికీ తెలీని దారంట వచ్చి యౌవనం ఆమె భుజం మీద చెయ్యి వేసింది.

సంఘానికి ఎదురుతిరిగేంత పెరగలేదు వరద అప్పటికి -

అందుకని పెళ్ళి విషయం అతన్ని భయపెట్టింది. వీధిలోకి వచ్చాడు.

**హాల్లో కూచుని** ఎవరితోనో మాట్లాడుతున్న గోవర్ధనరావుగారు ద్వారం దగ్గర వరదని చూడగానే "అదిగో వరదరాజులు వచ్చేశాడు" అన్నారు.

అందరూ అటువేపు తిరిగారు.

"నీ గురించే చూస్తున్నాం, రావోయ్" అన్నారు గోవర్ధనరావుగారు కుర్చీ చూపుతూ.

ఆఫీసు బట్టలయినా మార్చుకోకుండా వచ్చేశాడు వరద. ఇక్కడి ప్రశాంతత అతనిక్కాస్త ఉపశమనం కలిగించింది.

తన కుర్చీ ఎదురుగ్గా ఆరోగ్యం కూర్చుని వుంది. టేబులు మీద కాఫీని కప్పుల్లోపోస్తూ వరదని పలకరించింది..

"నువ్వు చాలా అమాయకుడివోయ్. ఆయన పిలవగానే పరిగెత్తుకు వచ్చేవల్లే వుంది. అసలాయన పిలుపుకి అర్థం వుండదు."

నవ్వింది. ఆరోగ్యం నవ్వులో ప్రత్యేకమైన అందం వుంది. ఏవో రహస్యాల్ని నవ్వు వెన్క దాచుకుంటున్నట్టు తోస్తుంది వరదకి. నెమ్మదిగా మాట చివర అంటుంది. "నువ్వప్పుడే ముగింపు చేసెయ్యకు మరీ. ఏదీ? ఇంకా వచ్చాడా, విషయం ఒక్కొక్కటీ జారుస్తాను" అని తనని తాను సమర్ధించుకున్నారు గోవర్ధనరావుగారు.

దీపం నీడలోంచి మల్లెపువ్వుల వాసన మాత్రం వస్తోంది. మనిషి కనిపించడంలేదు. కొంచెం పక్కకి వంగుతేనేకానీ ఆ వ్యక్తి కనిపించదు. అయినా వినతని గుర్తుపట్టాడు వరద.

కానీ ఆ పక్కనున్న వ్యక్తి ఎవరో అర్థం కాలేదు. సన్నగా, పొడుగ్గా ఉన్నాడతను. కళ్ళల్లో చెప్పలేని ఆలోచన, పెదాల విరుపులో పట్టుదలా విస్తుపోయేట్టు చేస్తోంది వరదని.

గోవర్ధనరావుగారు ఆ వ్యక్తి వేపు తిరిగి -

"ఇతనేనోయ్ 'వరదరాజులు'. ఆడవాళ్ళలో కూడా లేనంత నెమ్మది. ఎవరేం చెప్పినా నమ్మేస్తాడు. తగని సిగ్గు. ఇతని సిగ్గులో సగం వుంటే ఈపాటికి మా వినతకి పెళ్ళయేది" నవ్వాడు.

"అయితే యివాళ్టి నుంచీ వరద దగ్గర పాఠాలు నేర్చుకుంటాను" అంది వినత.

అంతా నవ్వారు.

వరద విసుగ్గా కుర్చీలో కదిలాడు. ఎప్పుడూ వచ్చే యిల్లే అయినా, అంతా కొత్తగా తోచింది ఆనాడు. ఆరోగ్యం కనిపెట్టి, "కాఫీ తీసుకోవోయ్! అంత మరీ కష్టపడకూడదు ఆఫీసుల్లో. కాస్త దొంగతనం కూడా నేర్చుకోవాలి. కావలిస్తే ఆయన్నడుగు" అంది.

భార్యకేసి సగం కోపంతో చూశారు గోవర్ధనరావుగారు.

"నేను గవర్నమెంటు ఉద్యోగంలో డబ్బు దోచి యీ భవంతులన్నీ కట్టించానని దీని అనుమానం. ఓ యబ్బో! నువ్వు పుట్టకముందే మీ బైబిలు చదివానులే" అన్నారు ఆమె వేపు తిరిగి.

ఆరోగ్యం క్రిష్టియను. గోవర్ధనరావుగారు బౌద్ధమతం పుచ్చుకున్న హిందూ. వీరిద్దరికీ ఎలా పొత్తు కుదిరిందో వరదకి అర్థం కాదు. ఆరోగ్యం ఏమన్నా అన్నదంటే గోవర్ధనరావుగారు జవాబుతో సిద్ధమవుతారు. ఈవిడా అంతే. చివరికి యిద్దరూ నవ్వుతో రాజీపడతారు.

వాతావరణంలో చిన్న మార్పు తెచ్చింది ఆరోగ్యం యీ మాటల్తో. వినత మాట్లాడకుండా ఇంతవరకూ కూర్చోవడం ఆశ్చర్యం కలిగించింది వరదకి.

"ఈ కుర్రాణ్ణి జాగ్రత్తగా చూడవోయ్ వరదరాజులూ! చూస్తే నీకేమనిపిస్తుంది?

కొత్త వ్యక్తిని చూపిస్తూ అడిగారు గోవర్ధనరావుగారు. ఆ ప్రశ్న అందరి లోను ఆశ్చర్యాన్ని కలిగించింది.

వరద చాలాసేపు తికమకపడ్డాడు. చివరికి "మంచిగా కనిపిస్తారు" అన్నాడు.

ఇల్లెగిరిపోయేట్టు నవ్వారు గోవర్ధనరావుగారు.

ఎంతోసేపటికి ఆగి "మంచితనం యీ కాలంలో చవక అయిపోయిందిలే. డబ్బిచ్చి ఎవడన్నా కొనుక్కోవచ్చుదాన్ని. మరేదైనా తోస్తే చెప్పు."

"పట్టుదల.."

"అచ్చా! ఆ విషయమే చెప్పబోతున్నాను. వీళ్ళ నాన్నగారు మా అన్నయ్య దగ్గర పనిచేసేవారు. తల్లీతండ్రీ ఎప్పుడు పోయారో నాకూ తెలీదనుకో. అబ్బో! యిదంతా పదిహేనేళ్ళ క్రిదంటి విషయంలే. ఇప్పుడితను ఎమ్మే పాసయి, యింట్లో కాళ్ళు ముడుచుక్కూచున్నాడు. కాశీపతి మీద నాకు తగని నమ్మకం. ఈ కళ్ళని చూసి 'ఎప్పటికన్నా పెద్దవాడు కాకపోతాడా' అని అనుకునేవాణ్ణి"

ఆగాడు. ఓసారి భార్య, కూతురు ముఖం చూశాడు. వాళ్ళిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకోవడం కనిపెట్టి, "సరేలే ఇలాంటి విషయం మాట్లాడేప్పుడు ఆడవాళ్ళుండడం మంచిదికాదు. మొదట వీళ్ళ సంగతి తేల్చేద్దాం. అసలు నిన్నిక్కడికి ఎందుకు పిలిపించేనో తెలుసా?"

వరద మాట్లాడలేదు.

"రెండుసార్లు పోయాక, ఈ సంవత్సరం వినత బియ్యే అనిపించుకుంది. నాకు ఏభై రూపాయల ఖర్చు, వరదకి మిఠాయి యివ్వమ్మా! పిలిపించేవరకూ బ్రతకనిచ్చేనా నన్ను?"

"అందుకేనేవిటి? అలా మాట్లాడకుండా కూచుంది."

"లేకపోతే ఏం చెయ్యాలేం?"

మధ్యలో గోవర్ధనరావుగారు అందుకుని "ఆడవాళ్ళతో మాట్లాడడం కూడా ఆర్టేనోయ్. ఇంకా నువ్వు సగంలోనే వున్నావు. ఏదీ కాస్త మిఠాయి తినిపించమ్మా."

పళ్ళెం ముందుకు తోసింది వినత.

"వినత పరీక్ష ప్యాసవడం, మా గంట స్థంబం గడియారం ఆగకుండా నడవడం, ఒహటి - మిఠాయితో సరిపెట్టడం ఏమీబాగోలేదు" అంటూ అందుకున్నాడు వరద.

అంతా గొల్లుమన్నారు

కోపం వచ్చి "గుమస్తాలందరికీ లాభనష్టాలు ఆలోచించడంతోటే సరిపోతుంది. నే పోతా" అని లేచింది.

ఆరోగ్యం అప్పటికే కప్పులు తీసుకుని వెళ్ళిపోయింది.

బల్లదగ్గర ముగ్గురూ మిగిలారు.

"చాలా రోజులయిందని ఉత్తరం వ్రాసి నేనే పిలిపించానోయ్ కాశీని. ఇప్పుడు కాదు - నాలుగేళ్ళ క్రిందట చూస్తే నా అంత వుండేవాడు కాశీపతి, మద్రాసు నుండి వచ్చేసరికి. ఇప్పుడది కాదు విషయం - ఓ తమాషా అయిన ఆలోచన చేసుకొచ్చాడు కాశీపతి, ఏమోయ్ నువ్వు చెప్తావా? నన్ను చెప్పమంటావా?"

"మీరే చెప్పండి" అన్నాడు కాశీపతి. వరదవేపు తిరిగి "ఏదో పిచ్చి ఆలోచనలెండి. ఎంతవరకు జరుగుతుందో చెప్పలేను."

"విషయం ఏమీటి?"

"ఇదయ్యా - మరి నసుగుడెందుకు. స్పష్టంగా చెప్తాను విను. ఎమ్మే రెండేళ్ళ కిందటే పాసయాడు కాశీ. అయినా నివాసం పల్లెటూరే. 'ఉద్యోగంలో చేరవోయ్' అన్నాను. నాకిష్టం లేదన్నాడు. మనందరికీ ఇష్టం వుండే చేశామా యీ ఉద్యోగాలు. అయినా నాకు యితని మీద నమ్మకం వుంది. సరేలే ఏదో ఆలోచించి వుండలేకపోడనుకున్నాను. చివరికి యిదా ఆలోచించాడు."

చుట్ట వెలిగించారు గోవర్ధనరావుగారు.

"అంతా చెప్పేముందు ఒక్కటడుగుతాను చెప్పు. డిస్ట్రిక్టు కలెక్టరు టాక్సీ స్టాండుపెడితే ఎలా వుంటుందంటావ్?"

నవ్వాడు వరద. "అదేమిటి?"

"మరలాగే వుంటుంది. ఎమ్మే పాసయిన వాడు పుస్తకాల షాపు పెడితేను"

కించపడ్డాడు కాశీపతి.

"అదికాదండి. నా వుద్దేశం వినండి -"

మధ్యలో అడ్డొచ్చారు గోవర్ధనరావుగారు "మరి రెండు ముక్కలు నన్ను చెప్పనీ. చదువు మాట ఎలా వున్నా డబ్బూ, దస్కం కలవాడికి పుస్తకాల షాపులూ, గట్రా - మరి నువ్వేం చేస్తావ్?"

"అది వేరే విషయం. ముందు ఆ పని మంచిదా కాదా అని ఆలోచించండి. అసలు పూర్తిగా పుస్తకాల షాపు కాదు నేను చెయ్యబోయేది"

"మరి?" ఆగాడు వరద.

"ఇదో తరహా లైబ్రరీ"

ఆశ్చర్యపోయాడు వరద.

"లైబ్రరీ ప్రారంభిస్తారా?"

"పూర్తిగా అదికూడా కాదు"

అంతకంతకూ గోవర్ధనరావుగారికి మతిపోతోంది. చుట్టపొగ వదుల్తూ పక్కకి తిరిగి కూచున్నాడు.

"ఇది ఓ తరహా యిచ్చిపుచ్చుకోవడమన్నమాట. మొదట కొన్ని పుస్తకాల్తో సంస్థ ప్రారంభమౌతుంది. ఆ పుస్తకాలు పాతవయినా, కొత్తవయినా ఫరవాలేదు. ఇక్కడికి వచ్చేవాళ్ళంతా డబ్బున్నవాళ్ళే రానక్కరలేదు. తక్కువ డబ్బుకి కూడా పెద్ద సాహిత్యం తీసుకుపోయే అవకాశాలున్నాయి. ఉదాహరణకు - షేక్స్‌పియర్ సాహిత్యం పెద్ద వాల్యూం వుందనుకోండి. దాని ఖరీదు యిరవై రూపాయలుంటుంది. కొత్త పుస్తకం అయితే యిరవై రూపాయలకి దాన్ని యిచ్చేస్తాం. అంతతో మనపని అయిపోలేదు. మరొక రసీదు కూడా దానితోపాటు యిస్తాం. పుస్తకం ఓసారి అయిపోయాక దాని అవసరం అయిపోతుంది.. అప్పుడు తిరిగి దాన్ని షాపుకి తీసుకొచ్చి యిచ్చేయవచ్చు. ఇప్పుడు ఆ షేక్స్‌పియర్ ఖరీదు పద్దెనిమిది రూపాయలే అవుతుంది. ఓసారి వాడబడినందువల్ల. అంటే 20రూపాయలు ఖర్చు చెయ్యలేని మరో వ్యక్తి చదివేందుకు అవకాశం యిస్తున్నామన్నమాట. ఓ ఆరునెలలయేసరికి షేక్స్‌పియర్ ఖరీదు నాలుగురూపాయలకి వస్తుంది. ఈ లోపల పుస్తకం పాడయిందా బీరువాలోంచి తీసేస్తాం. లేదా యింకా ధర తగ్గుతూనే వుంటుంది. అప్పుడు దాన్ని స్కూలు విద్యార్థి కూడా చదువుకొందుకు వీలవుతుంది. అప్పుడు బెర్నార్డు షా ఖరీదు రూపాయి. పోతన ఖరీదు రెండు రూపాయలు.. ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా ఏభైరూపాయలూ" ఆగాడు. తన వివరణ తనకే కొత్తగా కనిపించి నవ్వుకున్నాడు కాశీపతి.

అంతా విన్నాక యిటు తిరిగి "ఏమన్నా అర్థమయిందా?" అన్నాడు గోవర్ధనరావుగారు వరదతో.

మతిపోయింది వరదకి. ఇదేదో కొత్త తెగింపులాగా, ప్రపంచానికి కొత్తపుంత వేయడానికి పూనుకున్న కొత్త నియంతలాగా కనిపించాడు కాశీపతి. అతడివేపు నిర్ఘాంతపోయి చూస్తూ కూచున్నాడు వరద. గోవర్ధనరావుగారి మాట అతనికి వినిపించలేదు.

"ఈ విధంగా చెయ్యడం వల్ల మీకేం లాభం?"

"లాభనష్టాలు తర్వాత ఆలోచించాలి, నిజానికి నష్టం వుండదని నా అభిప్రాయం. అయినా మొదలెట్టి జరిపితేనేకానీ ఏమీ చెప్పలేను నేను. పుస్తకం తిరిగి యిచ్చే ప్రతీవ్యక్తి దగ్గరా కొంత శాతం డబ్బు తగ్గిస్తాం, అది చాలు సంస్థ నడిచేట్టు చూసుకోడానికి

షేక్స్పియర్ చదివాక తెస్తాడనుకోండి. ఈసారి పద్దెనిమిది రూపాయలకే తిరిగి యిస్తాం. ఆ రెండు రూపాయలూ సంస్థకి మిగులుతాయన్నమాట. ఆ పద్దెనిమిది రూపాయలు అతను రొఖ్ఖం తీసుకోవచ్చు. లేదా ఆ ఖరీదుగల పుస్తకాలు తీసుకోవచ్చు."

"కానీ మొదలెట్టడానికి కొంత డబ్బు వుండాలిగా? మొదట కొన్ని పుస్తకాలు బీరువాల్లో చేరాలి, అదెలాగ?"

"నాకున్న సమస్యల్లా అదే! - ఆలోచన వుందిగాని, డబ్బుతక్కువ. దీనికి మొట్టమొదట పని, నన్ను నమ్మగలిగిన వాళ్ళని సంపాదించుకోగలగడం."

"తర్వాత?"

"కాస్త గొప్పగా బ్రతికేవాళ్ళందరికీ యీ ప్రోగ్రాంను విపులీకరించడం, నమ్మగలిగినవాళ్ళు షేర్లు కొంటారు. లేనివాళ్ళు లేదు. కానీ మొదటే ఓ నిబంధన వుంచుతాను. అయిదేళ్ళవరకూ ఆ డబ్బు వాపసు యివ్వబడదు. లాభాలన్నీ సంస్థ అభివృద్ధికి వినియోగిస్తాం. నష్టాలొస్తే భరాయించాలి."

"ఇలా అయితే ఎవరయినా ముందుకు రావడం కష్టం. మొదటి విషయం యీ ప్రోగ్రాం మీద నమ్మకం కుదరకపోవడం. రెండో విషయం డబ్బు."

నవ్వాడు కాడీపతి, నవ్వినప్పుడు అతని ముఖంలో ఠీవి, ఆత్మవిశ్వాసం వరదని విస్మితుణ్ణి చేసింది.

"ఇన్ని బాధలుండడం వల్లే రెండేళ్ళుగా నిరుద్యోగిగి వుండిపోయాను వరదరాజులుగారూ! ఇదీ అసలు విషయం."

"పోనీ, మీ పని సానుకూలమయే వరకూ ఏదన్నా ఉద్యోగం చేయకూడదా?"

"అదే నా పాయింటు" - కుర్చీ రెండు కాళ్ళమీదా వెనక్కు చేరబడి వున్నవాడల్లా ముందుకు వంగారు గోవర్ధనరావుగారు. ఆ తొందర్లో చుట్ట వంటిమీద పడి చెయ్యికాలింది.

"లాభం లేదు వరదరాజులుగారు! ఒక్కసారి ఉద్యోగం అని దిగామా జీవితాంతం ఆ ప్రవాహంలో కొట్టుకుపోతాం. ఏళ్ళయినా సరే. ఎదురు నిలబడాలి. అందుకని యీ ఉద్యోగాల వేపు అసలు రాను."

"అదే మీ కుర్రాళ్ళలో వున్న చిక్కు. ఉద్యోగం చేస్తూ ఈ బుద్ధిజం మీద రిసెర్చ్ నేను జరపలేదూ? గవర్నమెంటు ఉద్యోగం వదిలి అమెరికా వెళ్ళగలిగాను బుద్ధిస్టు ఎసోసియేషన్ స్కాలర్షిప్పుతో - నువ్వు 'ఊ' అను నీ కాళ్ళ దగ్గరికి వెయ్యి ఉద్యోగాలు వచ్చేట్టు చూస్తాను. నీకేమోయ్ ఎమ్మేవి?"

నవ్వాడు కాశీ.

"మీకర్థం కాదులెండి. ఇంకా నేను కొన్నాళ్ళు ఎదురీదాలి. అప్పుడేమైనా ఫలితం కనిపిస్తుందేమో."

ఇంతవరకూ స్థిమితంగా కూర్చున్నాడు వరద. ఈ మనిషికి ఎంత ఆత్మవిశ్వాసం వున్నదీ అని ఆలోచిస్తున్నాడు. నిజమే అతనన్నది. తను రచయితగా బ్రతకదల్చాడు. అయినా వూరికే వుండటం చేతకాక హార్బర్లో గుమస్తా అయాడు. ఇరవై ఎనిమిదేళ్ళ జీవితంలో ఎనిమిదేళ్ళు యిలాగే గడిచిపోయాయి. ఉద్యోగం వదలడానికి పిరికితనం. ఆశల్నీ, ఆశయాల్నీ వేళ్ళతో పెకిలించి అంతంలేని మహాప్రవాహంలో యీడ్చుకుపోతోంది జీవితం.

ఒడ్డుతెగి ప్రవాహంలో పడిన కాగితం పడవలాగా, ఆటుపోటుల్ని దాటుతూ సాగిపోతున్నాడు వరద.

ఒక్కసారి నిలువునా వణికాడు

"చాలా మంచిపనే చేశారు మీరు. ఈ దరిద్రపు ఉద్యోగాల్లో పడకండి. మీ ఆలోచనల్ని మీ ధైర్యాన్ని సడలించకండి" అన్నాడు ఓ యుగం తర్వాత.

ఈలోగా గోవర్ధనరావుగారు ఏం చెప్పారో అతనికి వినిపించలేదు.

కాశీపతి ముఖం ఆశ్చర్యంతో మెరిసింది. గోవర్ధనరావుగారు బిత్తరపోయారు. వరద ముఖంలో నిర్ధారణ యిద్దర్నీ కదిలించింది.

"అయితే మీరు నా ప్రోగ్రాంలో మంచిని ఊహిచగలిగారా?" అన్నాడు కాశీ సంతోషంతో.

వరద మాట్లాడలేదు.

"ఈ సంస్థకి పేరు కూడా నిర్ణయించాను. 'ఇంటిలిజెన్స్ ఎక్స్ఛేంజ్' తెలుగులో దీనికి సరిపోయే మాటలు దొరకలేదు. అందుకని యింగ్లీషులోనే వుంచుతాను ఏమంటారు?"

"మీ ప్రోగ్రాం విషయం నేనేం చెప్పలేను. అది బాగుండనూవచ్చు. పూర్తిగా కాకపోనూవచ్చు. కానీ మీ పట్టుదల నాకు నచ్చింది. ఇలాంటి సమయాల్లో మనిషికి 'ఆత్మబలం' చాలా అవసరం. అది మీ దగ్గర తగినంత వుంది."

పూర్తిగా హర్షించకుండానూ, పూర్తిగా నిరుత్సాహపర్చకుండానూ చెప్పిన మాటలు కాశీపతిని ఓ విధంగా సంతోషపరిచాయి. గోవర్ధనరావుగారు లోపల్లోపల సంతోషపడినా, ఇంకా కాశీపతిని ఓ విధంగా సంతోషపరిచాయి. గోవర్ధనరావుగారు లోపల్లోపల సంతోషపడినా, ఇంకా కాశీపతి తప్పటడుగు వేస్తున్నాడేమోనన్న ఆలోచన మాత్రం వదులుకోలేదు.

"మరి వెళ్తానండి" అంటూ లేచాడు వరద.

"ఎక్కడికి?"

"ఇంటికి పోవాలి - తొమ్మిదయింది."

"అమ్మా, వినతా!" అని పిలిచారు గోవర్ధనరావుగారు. వచ్చాక "వరద యింటికి వెళ్తానంటున్నాడు చూడు" అన్నారు నవ్వుతూ.

"మిఠాయి చాలదన్నాడుగా? భోజనం ఏర్పాటు చేయించాను" అంది.

దిమ్మరపోయి చూశాడు వరద.

"భేష్! మంచి శిక్షే. ఈ రోజుతో యితని బ్రాహ్మణ్యం సరి. అయితే వడ్డించమనండి. లేస్తున్నాం"

"నాగురించి గులాబి ఎదురుచూస్తుంది. ఇవాళ్టికి వెళ్ళనివ్వండి"

"మరేం బెంగపెట్టుకోలేదులే. ముందే చెప్పాను" అంది వినత.

"ఆడవాళ్ళు ప్రోగ్రాం వేస్తే తిరుగుండదోయ్. ముందు లోపలికి పద. కాశీపతితో చిన్న విషయం మాట్లాడి వచ్చేస్తున్నాను" అన్నారు గోవర్ధనరావుగారు.

ఇంకేం చెప్పలేక వినత వెనక నడిచాడు వరద.

వసారా దాటి వంటగది వేపు నడవబోతూండేసరికి వినత ఆపుజేసింది - "పైకి అన్నానేగాని, యిష్టం లేదనా? అమ్మో! భోజనానికి అప్పుడే కాదులే. యిలా పద"

వినత మీద నిజంగానే కోపం వచ్చింది వరదకి. గదిలో టేబులు మీద వున్న పుస్తకం జరిపి కూర్చున్నాడు.

ఎదురుగ్గా గుమ్మానికి చేరబడి మట్టంతా చీరకి పూనుకొంది వినత. అతని మౌనం చూసి నవ్వుకుంది. కోప వస్తే మాటలు రావు వరదకి.

"ఇంక తిట్టు నన్ను"

తలెత్తాడతను "ఎందుకూ?"

"కోపం వచ్చిందిగా?"

"నీమీద నాకెందుకూ కోపం?"

"ఒకటి, భోజనానికి వుంచేసానని, రెండు, విషయం చెప్పకుండా రప్పించానని, మూడు... "

"ఏమిటి మూడు?"

"నేను పరీక్ష పాసయానని" నవ్వింది.

"నాకింకా అనుమానమే నువు పాసయావో లేదోనని, గులాబి యీ విషయం చెప్పనేలేదు. గోవర్ధనరావుగారు పిలిచారంటే పరిగెత్తుకు వచ్చాను."

"అందుకనే అలా చెప్పాను. తీపి తినిపించడానికి పిలిచాను."

రెండోసారి తలెత్తాడు వరద. ఆమె కళ్ళల్లో చిలిపితనం చూసి వణికాడు. అక్కడ నిలబడ్డ ఆమె కొత్తగా కనిపించింది.

అలానే చూస్తూ కూచున్న అతణ్ణి చూసి ఆమె సిగ్గుపడ్డది.

"ఏమిటలా..?"

"నాకంటే పెద్దదానివయావు"

"ఏ విషయంలో?"

"మొదట చదువులో"

"తర్వాత?"

"డబ్బు సరే.."

"ఇంకా చెప్పు -"

"అందం"

"అబ్బో నాకు తెలీదే?" అంది. ఎంత దాచుకుందామని ప్రయత్నించినా రక్తం చెక్కిళ్ళల్లోకి ప్రాకడం గమనిస్తూనే వున్నాడు వరద.

"సిగ్గు నీ ముఖంలో బావుందదు. ఎందుకంటే -"

ఇంతలో 'ఏమిటేమి'టంటూ గోవర్ధనరావుగారు వచ్చారు. అతన్ని చూసి ఎవ్వరూ వినత అతని కూతురని అనుకోరు. ఆరోగ్యం, పెదాల్లో వంపు, ఆమె మార్దవత, గోవర్ధనరావుగారి చిలిపితనం, కాస్తపాటి కోపం పంచుకుని పుట్టింది వినత, పేకమేడ వంపులు ఆమె శరీరంలోని యెత్తు పల్లాలు.

కాశీపతి మేడమెట్లకి చేరబడి కాళ్ళు తుడుచుకుంటున్నాడు.

"సిగ్గు గురించి మొదటి పాఠం చెపుతున్నాడు. నాన్నగారూ!" అంది వినత.

"మరీ అంత అల్లరిచెయ్యకూడదమ్మా మొగాళ్ళ దగ్గర. అందుకే నువ్వు పిలిస్తే రాడు వరదరాజులు. ఇవాళ నాచేత ఓ పెద్ద అబద్ధం ఆడించిందోయ్. దీని ప్రోత్సాహం మీదే మీ చెల్లెలితో అబద్ధం చెప్పాను."

"పులి. గొల్లవాడు కథ. ఈసారి వచ్చి చెవి మెలేస్తాను."

"అంతేగానీ రావడం మానేయకు. నువ్వు రాకపోతే నాకేం తోచదు" అన్నారు గోవర్ధనరావుగారు.

"పోనీ మీరే వరద యింటికి వెళ్తూండండి నాన్నగారూ" అంది వినత.

"ఎందుకు వెళ్ళనమ్మా. నీ మొగుడు వొచ్చాక అలాగే వెళ్తాను. ఏంవోయ్ కాశీ" అంటూ అటు నడిచారు గోవర్ధనరావు గారు అర్ధయుక్తంగా మాటమార్చి.

ఈ సంభాషణలో యిరుక్కోడం తెలీక ఆకాశం నలుపుని చూస్తూ అటు తిరిగి నిలబడ్డ కాశీ, గోవర్ధనరావుగారి పలకరింతకి యిటు తిరిగి నవ్వాడు.

"సిగ్గుపడ్డం బాగా తెల్సే నీకు" అని జడపట్టుకు మొహం మీద కొట్టాడు వరద.

కోపంతో దొంగచూపు చూసింది వినత.

"***స్త్రీకి అందం ప్రకృతి ప్రస్తావించిన మొదటి వరం***" అనుకున్నాడు వరద ఆమె కళ్ళల్లో మెరుపును చూసి.

రాత్రి పది -

గోవర్ధనరావుగారింటి నుంచి బయలుదేరి రేండు మలుపులు తిరిగి బజారు వీధిన పడేసరికి దూరాన ఓ వ్యక్తి కనిపించాడు వరదరాజులుకి. ఎంతదూరంలో వున్నా ప్రాణంలేనట్లు, నీడలా నడిచిపోతున్న రవణమూర్తి గుర్తే!

"రవణా!" అనరిచాడు -

దగ్గరికి వచ్చాక

"ఎక్కడినుంచి?" అన్నాడు.

జవాబుగా మందుసీసా చూపించాడు రవణమూర్తి. అయితే యిదేం కొత్తకాదు. డాక్టరుకీ, రవణమూర్తికీ అవినాభావ సంబంధం.

"చెల్లెలికి మళ్ళీ బాగోలేదు" అన్నాడు.

"ఏమిటి కథ?"

నవ్వాడు రవణమూర్తి. అతను మట్లాడితే నూతిలో గొంతుకలాగ ధ్వనిస్తుంది. హెచ్చు మాట్లాడడు. ఏ విషయంలోనూ జోక్యం కలిగించుకోడు. ఎంతో జీవితాన్ని చూసినట్టు అన్నిటిమీదా విరక్తితో, నిరుత్సాహంగా నవ్వుతాడు. "నీకు తెలీందేముందిరా! పాతకథే!"

"టీ.బీనా? సుజాతకే?" నిర్ఘాంతపోయాడు వరద.

"ఊఁ"

"ఇదివరకెప్పుడూ సుజాతకి రాలేదుగా!"

"ఇప్పుడొచ్చింది. అంతే"

"ఎన్నాళ్ళ క్రిందట నుంచి?"

"ఏమో? తెలీదు. ఎన్నో రోజులు దాచి వుంచింది. మొన్న రెండు వారాల క్రితం రాత్రి దగ్గుతూ లేచింది. బయటికెళ్ళి నిలబడింది. ఆయాసంతో వచ్చి పడుకుంది. గట్టిగా అడిగితే చెప్పింది" నవ్వాడు.

"ఏ చేస్తున్నావ్?"

మందుసీసా చూపించాడు. మెల్లిగా అన్నాడు "తమ్ముడుపోయి సంవత్సరం కూడా కాలేదు. అమ్మ మరీ దిగజారిపోయింది" ఉన్నట్లుండి రెండు చేతుల్తో తలపట్టుకున్నాడు. "మా కుటుంబానికి యిది శాపంలా వుంది. సంవత్సరం తిరక్కుండానే దీనికీ బాధ చూడు" గుండె గొంతుకలో కదిలింది మాట్లాడుతూంటే.

భయంతో రెపరెపలాడాడు వరద. నాలుగు వారాల క్రితం రవణమూర్తి పార్కు దగ్గర కనిపించాడు. అప్పటికీ యిప్పటికీ బాగా చిక్కిపోయాడు. కళ్ళు లోతుకుపోయి, బెంగతో ముఖం నల్లబడి నీరసంగా కనిపించాడు. క్షయవ్యాధితో బాధపడి మరణించినవారు యిప్పటికే ఆ కుటుంబంలో అయిదుగురున్నారు. రెండేళ్ళక్రితం తండ్రి, ఇన్‌కంటాక్స్ ఆఫీసరుగా పనిచేసే అన్నయ్యా, పదేళ్ళ తమ్ముడూ అంతా పోయారు. ఎప్పుడు ఎవరికొస్తుందోనన్న భయం ఆ కుటుంబాన్ని తినేసింది. ఎవ్వరికీ ఆనందం లేదు. జీవితం మీద ఆశల్లేవు. ఇప్పుడిక తల్లీ, చెల్లెలూ, యితనూ మాత్రం మిగిలారు. ఇప్పుడీ దుర్ఘటనతో వేరు తెగిన చెట్టులాగా డీలా పడిపోయాడు రవణమూర్తి. ఇరవై నాలుగేళ్ళయినా ఓ పక్క ఆఫీసు పనితో, మరోపక్క మానసికంగానూ నలిగి ముప్పై ఏళ్ళవాడిలా అవుపిస్తాడు. అతని కళ్ళల్లో తెలీని పిరికితనం ఎవరిలోనూ ఉత్సాహం రేపని దారిపక్క గడ్డిమొక్కలాంటివాడు రవణమూర్తి.

"వెళతాను" అన్నాడు ఎంతోసేపటికి

అప్పటికే పది దాటింది.

"నేనూ వస్తాను పద" అన్నాడు వరదరాజులు.

"ఇంతరాత్రి ఎందుకులేరా? ఇది మామూలేగా. గులాబిని యింట్లో ఒంటరిగా వదిలేశావు కాబోలు."

"మరింకేం చెప్పకు, నువ్వు నడుస్తూ వుండు. సాయిబు దుకాణంలో పళ్ళు తీసుకుని వెనుకనే వస్తాను."

రవణమూర్తి వెళ్ళిపోయాడు.

మరో అరగంటకి రవణ యింటి ముంగిటకి వచ్చాడు వరద.

ఇద్దరి మనుషుల కన్నా ఎక్కువ పట్టని గదిలో చిన్న దీపం వెలుగులో పడుకుని వుంది సుజాత. ఆమె తల్లి ఓ మూల ముడుచుక్కూర్చుని నిద్రపోతోంది.

"మూడు రాత్రుల నుంచి అమ్మకి నిద్దరలేదు. ఇవాళ సాయంకాలం ఆమెకీ జ్వరం వచ్చినట్టుంది" అన్నాడు రవణమూర్తి.

వరదని చూసి లేచి కూచుంది సుజాత.

"కూచోండి" అంటూ పరుపుమీద పక్కకి జరిగింది.

బల్లలాక్కుని కూచున్నాడు వరద.

మందు గ్లాసులో పోస్తూ నిలబడ్డాడు రవణమూర్తి.

ఎప్పుడు వచ్చినా సుజాతని కూర్చుని చూడలేదతను. ఎప్పుడూ పాడుతూనో, కబుర్లు చెబుతూనో, పక్కయింటి పిల్లల్తోపాటు ఆడుతూనో కనిపించేది. వయస్సు పందొమ్మిదయినా చిన్నపిల్లలా. మరీ చిన్నపిల్లలా ఆడుతుంది.

"చూడండి వరదగారూ, ఏమీలేందే నన్నీ మంచం మీద పడేశారు" అంది అమాయకంగా.

"ఏమీ లేకపోవడమేమిటి? కళ్ళు చూసుకో"

"పోండి. మీరూ అన్నయ్యలాగే మొదలుపెట్టారు" అంది కోపంగా.

మందిచ్చాడు రవణమూర్తి. ఒక్క గుక్కలో నోట్లో పోసుకుంది.

"నేను చచ్చిపోతానేమోనని అన్నయ్య భయం. నాకేం చూడండి. ఎంత హాయిగా వున్నానో?"

రోగం సూచనలేవీ లేనట్లు మామూలుగా వుండాలని ప్రయత్నించింది సుజాత. కానీ ఆ నవ్వు వెనక, ఆ చిలిపితనం మాటున నీరసం, నిరుత్సాహం, భయం కనిపిస్తూనే వున్నాయి.

"రోగం పరమౌతానేమో?" అన్న తపన.

''నీకేం ఫరవాలేదు సుజీ ఒక్క నెలలో తేరుకుంటావ్''

''మీరింకా నన్ను అనుమానిస్తున్నారు. నేనిప్పుడే బావున్నాను.''

కించపడ్డాడు వరద. ''నువ్వు కులాసాగా వుండడమే వాడికీ కావలసింది. పోనీ కొన్నాళ్ళపాటు విశ్రాంతిగా వుండు.''

పికిలి పిట్టలా గెంతుతూ, మెరుపులా కనిపించి మాయమవుతూ వుండాల్సిన సుజాత బలహీనంగా, మసక వెలుతురులో రోజాపువ్వులా సగం ఎరుపుతో కనిపించింది. సగం చెరిగిన బొట్టుతో, నీరసంతో లోపల్లోపల ఎండిపోతున్న చెట్టులా వుంది సుజాత. బాధతో, అసహాయతతో నవ్వు మలినమై, పేలవంగా పెదాల్ని మాత్రం కదిలించింది.

''వెళతాను సుజీ, గాభరాపడకు. మంచం మీంచి లేచిపోయావంటే వీడు బెదిరిపోతాడు. అమ్మ ఆరోగ్యం కూడా పాడవుతుంది. తర్వాత నీ యిష్టం.''

''ఇలా పడుకుంటే నాకెప్పుడు యిలాగే వుంటుంది. గుడివేపు పొలాన్నీ, మీ గులాబీని, వినత యింట్లో మల్లెతీగెనీ చూస్తే మళ్ళీ హాయిగా వుంటాను.

ఆశ్చర్యంగా చూశాడు రవణమూర్తిని, నీడలోకి వత్తిగిల్లి కళ్ళు తుడుచుకుంటున్నాడు వాడు.

నల్లటి దుప్పటి వంటినిండా కప్పుకుని పాములా మెలికలు తిరిగి పడుకుంది సుజాత.

రవణమూర్తి భుజం మీద చెయ్యేసి బయటికి తీసుకొచ్చాడు వరద.

''ఏం చెయ్యనురా దీన్ని? చెపితే వినదు. పెద్దదైనా అల్లరి పోలేదు'' అన్నాడు జాలిగా.

''మొదటి విషయం - నువ్వు బెంబేలు పడకు. మీ అమ్మకి ధైర్యం చెప్పు. సుజాతకేం? మరో రెండు వారాల్లో లేచి తిరుగుతుంది చూడు నా మాట అబద్దమయితే''

''వీధి చివరవరకూ వస్తాను పద'' అన్నాడు రవణ.

''వద్దులే అర్థరాత్రి దాటింది. గుడిపక్క పొలాలవేపు నడిచిపోతాను'' అని వచ్చేశాడు.

ఇంటికి చేరేసరికి ఒంటిగంట దాటింది.

అనంతపద్మనాభస్వామి ఆలయం దగ్గర్నించీ కీచురాళ్ళ అరుపులు విపరీతంగా వినిపిస్తున్నాయి.

చూరుకింద నీడలో వొళ్ళు మరిచి నిద్రపోతోంది గులాబి.

వెన్నెల నీడలో సొమ్మసిల్లినట్లు. నిశ్చలంగా, తనదికానట్టుగా శరీరాన్ని మరిచి నిద్రపోతోంది గులాబి.

''ఇక ఇలా వంటరిగా వదిలి ఎక్కడికీ పోకూడదు'' అనుకున్నాడు వరద మనసులో.

వెన్నెట్లోకి పూర్తిగా మంచాన్ని లాక్కుని నడుం వాలిస్తే పిచ్చిగా నిద్రపట్టింది.

## 5

వారంరోజుల తర్వాత ఒకనాటి వుదయాన తీరిగ్గా వుత్తరం వ్రాసుకుంటున్న వరదరాజులు కాలిని ఏదో కరిచినట్టయి తుళ్ళిపడి తలెత్తాడు. ఆ కదలికకి అల్లంత దూరం పరిగెత్తి వెనక కాళ్ళ మీద కూచుని భయం భయంగా చూసింది వుడత ఒకటి.

నవ్వొచ్చింది వరదకి.

తలెత్తాడు వరద.

అవతలి వాటాలో డాలీ బట్టలు ఆరవేస్తోంది. తమ యింటికీ అక్కడికీ మధ్య బంతి పూచెట్ల వరస వుంది. పువ్వుల మధ్య ఒకటిగా కలిసిపోయి పచ్చగా మెరుస్తోంది.

అబ్బురపడి చూస్తూ కూచున్నాడు.

డాలీని చూస్తే వెన్నెల గుర్తుకొస్తుంది. తెల్లగా పాలలాగా, మెరుగు పురుగులాగ. మల్లెపువ్వులాంటి డాలీ. అసలు పేరు అచల. ఇంట్లో అందరూ డాలీ అంటారట. చెల్లెలు చెప్పింది. పసుపురంగు పొడవుపాటి గౌను వేసుకుంది అచల. ఒళ్ళు కనిపించేటంత పల్చటివోణీ. మీదికి ఎగిరి బట్టల్ని తాడు మీద వేస్తోంది. ఎగురుతున్నప్పుడు వొళ్ళంతా కదిలి చేపల్తో బరువెక్కిన వలలాగ, వేసంగి ఎండలో గాలికి వూగే మామిడి గుబురులాగా కనిపిస్తోంది.

ఏదో పాట మెల్లిగా మాటల మధ్య విరుగుతోంది పాట అర్థమయితే బావుణ్ను. 'యెంకి' పాటపాడుతోంది కాబోలు. ఆ సాహిత్యంలోనూ 'యెంకి' వున్నదేమో మరి.

తూనీగలాగా గెంతుతూ రంగురంగుల పావడాతో వచ్చింది ఓనాటి మధ్యాహ్నం. వెల్లకిలా పడుకుని ఏదో ఆలోచిస్తున్నాడు వరద. అతణ్ణి చూడగానే లేడిపిల్లలాగా గెంతింది. అంత చిలిపితనాన్నీ దాచేసుకుని తలుపు చాటున నిలబడింది. ఆ పావడా రంగూ, ఆ లేత వంటి మెరుపూ యింకా తలుపు చాటు నుంచి తెలుస్తూనే వుందతనికి.

వెళ్ళిపోతూ చూసిన చూపు యిప్పటికీ గుర్తే! ఆ కళ్ళల్లో ఆకలీ, తపనా అతన్నెప్పుడూ కుదిపి పలకరిస్తాయి.

మబ్బు విడిన సూర్యుడి మొదటి కిరణం ఆమెని దాటి వరద వంటిని తాకి మండించింది - గ్రీష్మం తరుముకు వచ్చిన ఉమ్మెత్తపువ్వు పిచ్చిరంగు ఆమెది. విచ్చలవిడిగా జల్లేసిన అందం. ఏ కాశ్మీరులోయ ప్రాంతాల మనుషుల్లోనో తోచే అమాయకత ఆ ముఖంలోది. ప్రకృతిని మొదటిసారిగా చూసినప్పటి దుగ్ధ ఆ కళ్ళల్లో -

పచ్చగా బంగారంలా మెరుస్తున్న అచల - గాజుప్లేటు చటుక్కున క్రిందపడి ముక్కలయింది. తుళ్ళిపడి యిటు తిరిగి డాలీ, వరదని చూసి భయపడింది. చటుక్కున చెట్టు వెనక మాయమయింది.

లేవబోయాడు వరద. కాలులో గాజుముక్క దిగి రక్తం చిమ్మింది. కాలుపట్టుకు కూర్చుండిపోయాడు.

గేటు తలుపు తోసుకు లోపలికి వచ్చాడు విశ్వేశ్వరం.

మరీ అంత తెల్లగా లేని పైజమా వేసుకున్నాడు. కాస్త శుభ్రంగా, ఈ వారం రోజుల్లోనే కాస్త బలిసినట్లు కనిపించాడు. జుత్తు ఓదారికి తెచ్చి దువ్వాడు. కాస్తంత ఉత్సాహంగా కనిపిస్తున్నా పాతమందకొండితనం, బద్ధకపు ఛాయలూ పోలేదు.

"కాఫీ తాగుతావా?"

"ఊ" అన్నాడు గన్నేరు చెట్టుకి చేరబడి నిలబడి.

"లోపలికి రా. యెండగా వుంది"

కుర్చీ వెనక్కులాగి గాజు ముక్కల్ని చూసుకుంటూనే లేచాడు వరద, ఒక్క గెంతు గెంతి దాటేశాడు విశ్వేశ్వరం.

బుద్ధుడి విగ్రహాన్ని టేబులు మీద వుంచి బల్లమీద కూచున్నాడు విశ్వేశ్వరం, కాఫీ చెప్పి వచ్చి కుర్చీలో కూచున్నాడు వరద.

"వారం రోజుల తర్వాత మళ్ళీ యీనాడు దర్శనం. ఉద్యోగం యిప్పిస్తే మట్టుకు వస్తావని నిదర్శనమేమిటి?"

"పోనీ, నాకు ఉద్యోగం వద్దులే"

"అయితే బాధేలేదు. ఏం చేస్తానో చెప్పు"

"అదంతా వేరే ఆలోచించాను. ఇప్పుడు ఓ పనిమీద వచ్చాను"

ఫ్లాస్కులో కాఫీ రెండు కప్పుల్లో పోసి తెచ్చింది గులాబి.

ఎప్పుడో ఎనిమిదేళ్ళ క్రితం చూసింది విశ్వేశ్వరాన్ని.

"వీడు జ్ఞాపకం వున్నాడా?" అని వరద అడిగితే, నల్లగా నిటారుగా వున్న అతణ్ణి విచిత్రంగా చూసింది.

"ఎక్కడ జ్ఞాపకం - నే వెళ్ళిపోయేసరికి యింకా స్కూల్లో చదువుతోంది" అన్నాడు విశ్వేశ్వరం నవ్వి.

అయినా డ్రాయింగు పాఠాలు చెప్పకుండా బడిలో కునికిపాట్లు పడే విశ్వేశ్వరం మేష్టారు ఆమెకి గుర్తే. అతని చేతకానితనాన్ని చూసే వుద్యోగంలోంచి తీసేశారు. కానీ యిప్పుడు మొద్దుబారి, సన్నగా, ఏవగింపుగా తయారయిన అతణ్ణి చూసి విస్తుపోయింది.

గులాబి వెళ్ళిపోయాక "జాగ్రత్తగా విని నన్నర్థం చేసుకో" అని మొదలెట్టాడు విశ్వేశ్వరం.

"ఏ విషయం?"

"కొన్నాళ్ళు పై వూరిలో వుండి రావాలి. ఎక్కడికని అడక్కు. .."

ఆగాడు.

వసారాలో ఎండపడి గదిలోకి వెలుగొచ్చింది.

"ఎందుకని?"

"ఓ అమ్మాయిని నీ దగ్గర నాలుగురోజులు వుంచాలి - మీ యింట్లో"

దిమ్మరపోయాడు వరద. విశ్వేశ్వరాన్ని విచిత్రంగా చూశాడు. రూపాయలు అడిగినప్పుడు ఎంత స్తబ్దుగా వున్నాడో యిప్పుడూ అలాగే వున్నాడు విశ్వేశ్వరం. బల్లమీది కేన్వాసు మీద గోళ్ళతో గీతలు పెట్టున్నాడు.

"అమ్మాయినా?"

"సుమారు యిరవై వుంటుంది వయస్సు. సంస్కారంగల కుటుంబంలో పెరగలేదు. ఏది మంచో ఏది చెడో తెలీదు. చాలా తక్కువ మాట్లాడుతుంది. కాస్త నల్లగా, పొట్టిగా వుంటుంది"

ఇన్ని మాటలూ తలవొంచుకు చెప్పాక తలెత్తి తెల్లబోయి చూస్తున్న వరదని చూసి నవ్వాడు. ఏదో అర్థం వరద ముఖంలో వూహించుకుని -

"డబ్బులాకాదు. ఈమెని మళ్ళీ తీసుకుపోతాను" అన్నాడు.

"................"

"అసలు యిటువంటి అగత్యమే రాకుండా వుండాల్సింది. ఇప్పుడిక మరో గత్యంతరంలేదు"

"అంటే?"

"ఇంక అవేవీ అడక్కు వరదరాజులు - ఇంతవరకూ నువ్వు నన్నే విషయంలోనూ నమ్మలేదు. అందుక్కారణం నేనే. ఈసారి నమ్మగలిగితే నీలవేణిని తీసుకువస్తాను రేపు. వీలుపడదంటే వెళ్ళిపోతాను"

వరదకి ఏమాట అనడానికీ తోచలేదు. ఇలాంటి పని సాధ్యమా అన్న ఆలోచన మాటిమాటికీ అతని మనస్సులో కదుల్తోంది. చివరికి విశ్వేశ్వరం వేపు తిరిగి -

"నీలవేణి ఎవరు?" అన్నాడు.

కాస్సేపటివరకూ ఏమీ మాట్లాడలేదు విశ్వేశ్వరం.

"అదికూడా యిప్పుడు నేను చెప్పను. గులాబికన్నా మూడేళ్ళు పెద్ద, ఇక్కడికి వచ్చినా నీకేం కష్టం కలిగించదనుకుంటాను. అదైనా నీకు ధైర్యం వుంటే.."

"నా మాట ఎలా వున్నా నలుగురి విషయం.."

మధ్యలో నవ్వాడు విశ్వేశ్వరం. "నలుగురి కోసం బ్రతికేట్టయితే వద్దులే. పోతా" అని లేచాడు.

బల్లకాలు ఒకటి విరిగి కరకరలాడింది.

వరద లేవలేదు. వెళ్ళమనలేదు. అలానే కూచున్నాడు. వసారాలోకి వచ్చి వొళ్ళు విరుచుకున్నాడు విశ్వేశ్వరం. కళ్ళు చిట్లించి ఎడం వైపు చూశాడు. ఏమనుకున్నాడో ఏమో వెనక్కి తిరిగి.

"ఇప్పుడీ పని జరక్కపోతే నేను పూర్తిగా నాశనమైపోతాను" అన్నాడు గాలిలో.

అప్పటికీ వరద చలించలేదు.

ద్వారం దాటి గుడి మలుపు తిరిగే సమయంలో వరద పిలుపు వినిపించి వెనక్కి తిరిగాడు విశ్వేశ్వరం.

అతని కళ్ళు చూసి భయపడ్డాడు. మెల్లిగా నడిచి వచ్చి గేటు వూసల్ని పట్టుకు నిలబడ్డాడు.

గుడివేపు చూస్తూ అన్నాడు వరద.

"నీమీద నాకెప్పుడూ గౌరవంలేదు. అందుక్కారణం నీకూ తెలుసు. ఈమెను యిక్కడ వదిలిపోవడం వల్ల నీకు మంచి జరిగితే అలాగే వెళ్ళు. కానీ మొదట నీ గురించి నువ్వు ఆలోచించుకో" జవాబుకి కూడా ఎదురు చూడకుండా లోపలికి వెళ్ళిపోయాడు వరదరాజులు.

ఎంతోసేపు నిలబడి రోడ్డు పక్కనుంచే రాళ్ళు తన్నుకుంటూ, తలవొంచుకుని నడిచిపోయాడు విశ్వేశ్వరం.

## 6

మర్నాటి సాయంకాలం విశ్వేశ్వరం నీలవేణితో బండిదిగే సమయానికి అదంతా మరిచిపోయాడు వరద.

విశ్వేశ్వరం నీడలో ఒదిగిపోయి కనిపించే నీలవేణిని చూస్తూ నిలబడ్డాడు.

విశ్వేశ్వరం అడిగిన మొదటి ప్రశ్న యిది, "గులాబీ యేదీ?"

"గుడిలోకి వెళ్ళింది"

చెట్టు దగ్గరే నిలబడిపోయాడు విశ్వేశ్వరం.

"ఆ మంచం లాక్కుని కూచో"

ఇద్దరూ కూచున్నారు.

వరద ఎదురుగ్గా కాకి రెక్కపొడుచుకోవడాన్ని చూస్తున్నాడు. వరద ఏమైనా మాట్లాడతాడేమోనని ఎదురు చూస్తున్నాడు విశ్వేశ్వరం.

నీలవేణి చోద్యం చూస్తోంది.

ఎంతోసేపటికి విశ్వేశ్వరం లేచాడు.

"నే వెళ్తాను" అన్నాడు.

వరద 'ఊఁ' అన్నాడో 'ఆ' అన్నాడో కానీ విశ్వేశ్వరం దాటి మెల్లిగా వెళ్ళిపోయాడు.

ఒక్కసారి ఎలక్ట్రిక్ దీపాలన్నీ వెలిగాయి. లేచి ఎగరబోతున్న కాకి కీచుమని తీగలకి వ్రేలాడిపోయింది.

వరద మనస్సు జివ్వుమంది.

నీలవేణి కూచుని బంతిపువ్వులవేపు చూస్తోంది.

బంతిపువ్వుల వెనక డాలీ యిద్దర్నీ దొంగచూపులు చూస్తోంది.

గేటు వేపు చూస్తూనే "మిమ్మల్ని యిక్కడికి తీసుకు రావడం నాకిష్టంలేదు" అన్నాడు మెల్లగా.

భయపడి, బెదిరి యిటు తిరిగింది నీలవేణి. అతని కళ్ళని అర్థం కానట్లు చూసింది -

ఏదో మాటలు కూడదీసుకుని మెల్లమెల్లగా అన్నాడు వరద.

ఈ సమయంలో గులాబివుంటే బావుణ్ణని తోచింది.

"మీరు అనేదా మిమ్మల్ని?"

"మీ యిష్టం"

"వాడు ఏమీ చెప్పలేదు మీ గురించి"

మాట్లాడలేదు -

"వీడికెలా దొరికారు? "

"...."

అప్పుడేపడిన గన్నేరుపువ్వుని చేతిలోకి తీసుకుంది.

"అంతకు ముందు ఎక్కడ వుండేవారు?"

"గూడూరు"

"వీడెలా తెలుసు మీకు?"

"..."

"ఒంటరిగా వచ్చేశారేం యింట్లోంచి?"

చటుక్కున ఆశ్చర్యంతో తలెత్తిందామె అతనివేపు చూడడానికి.

గమనించి "చెప్పాలని లేకపోతే వద్దు..."

పక్కకి తిరిగి ముఖం కప్పుకుంది. కొంతసేపటికి - ఆమె ఏడుస్తున్నట్టు తోచింది వరదరాజులుకి. లేచి మెల్లిగా గేటువరకూ నడిచాడు. గేటుకి చేరబడేసరికి నల్లటి రంగు చొక్కాకి అంటుకుంది. తుడవబోయి చేతులకి చేసుకున్నాడు.

నవ్వొచ్చింది.

వెనకవున్న నీలవేణి గురించి ఆలోచిస్తున్నాడు.

అన్ని ప్రశ్నలు అడగడం తనదే తప్పనిపించింది - ***ఏ పురుషుణ్ణీ స్త్రీ మొదటి చూపులో నమ్మదు. నమ్మిన ఎవరినీ జీవితంలో వదులుకోదు స్త్రీ.***

ఏమీ తెలీని ఆమె జీవితాన్ని ఊహించ ప్రయత్నించాడు వరద. మసకబారే చీకట్లలో బంతిచెట్ల ఆకుల చాటునుంచి ఆమె చామనఛాయ ముఖం యిక్కడికీ కనిపిస్తోంది. ఇంకా బంతిపువ్వులు వేపే చూస్తోంది.

సంపెంగ పువ్వు వాసన గుప్పుమనగానే యిటు తిరిగాడు వరద. ప్రసాదం పుచ్చుకుని పళ్ళెంతో వచ్చింది గులాబి.

బరువుగా, నిండుగా వున్న జుత్తంతా మెలికలు తిప్పి ముడివేసి రెండు పువ్వులు తురిమింది. సంపెంగ పువ్వుల మధ్య గులాబి అద్దంలో మెరుపు నీడలా తోచింది.

పళ్ళెంలో పువ్వు తీసి కళ్ళకద్దుకున్నాడు వరద. గన్నేరు చెట్టు వరకూ నడిచి మళ్ళీ వెనక్కి వచ్చిందామె.

"అన్నయ్యా"

ఇటు తిరిగాడు.

"అక్కడ.. మంచం మీద.."

"నీలవేణి" - పూర్తిచేశాడు వరద.

ఇంకా అలానే నిలబడివుండడం చూసి "ఆమెకీ ప్రసాదం యివ్వు విశ్వేశ్వరం తెచ్చాడు. కొన్నాళ్ళు మనింట్లోనే వుంటుంది. ఇంకేం అడక్కు ఆమెని"

స్త్రీ కళ్ళని అర్థం చేసుకునే శక్తివుంటే గులాబి కళ్ళల్లో అతనికి గ్రంథాలు బోధపడేవి. నెమ్మదిగా లోపలికి వెళ్ళిపోయింది.

అన్నయ్య మాటమీద ఆమెకి గౌరవం ఎప్పుడూ వుండనే వుంది.

పూర్తిగా చీకటి కమ్ముకుని కంటిముందు నీడలు పడే సమయానికి తలుపు చేరేసి లోపలికి వస్తూండగా బల్లి కుడివేలిమీదికి గెంతింది. తుళ్ళిపడ్డాడు వరద.

నీలవేణి యింకా అక్కడే వుంది

ఏదో మాట్లాడబోయే సమయంలో "వరదరాజులు భయ్యా" అంటూ తలుపు తోసుకుని గోవర్ధనరావుగారు వచ్చారు కర్ర టకటకలాడిస్తూ.

నీలవేణి లేచింది.

ఆమెతో "గులాబి లోపల వుంది" అని రెండడుగులు ముందుకు వేసి "రండి గోవర్ధనరావుగారు, చీకటిగా వుంది, దీపం తెస్తానుండండి" అన్నాడు.

నీలవేణి దీపంతో వసారా మధ్యకి వచ్చి నిలబడింది.

వరద భుజం వీద చెయ్యేసి నెమ్మదిగా రెండు మెట్లూ ఎక్కాడు వృద్ధుడు.

కుర్చీలో కూచుంటూ, "ఓ గ్లాసు మంచినీళ్ళు తెచ్చిపెట్టమ్మా గులాబీ" అన్నారు తీరిగ్గా గాలిపీలుస్తూ.

నీలవేణి దీపం గట్టుమీద వుంచి లోపలికి వెళ్ళింది.

"ఏంవోయ్, కనిపించడం మానేశావ్?"

"ఆఫీసు పని ఎక్కువయిందండి. ఏరోజు కారోజు వస్తాననుకోవడం తీరా బయలుదేరబోయేసరికి పడకపోవడం."

"నువ్వురాకపోతే నాకేం తోచదయ్యా, నాల్రోజులు రాకపోతే మంచమెక్కావే మోనని యిలా పరిగెత్తుకొచ్చాను."

అతని ఆప్తతకి వరద కదిలాడు.

నీలవేణి నీళ్ళు తెచ్చి నీడలో నిలబడింది. సంతృప్తిగా తాగి "అమ్మాయికి పెళ్ళి ఎప్పుడు చేస్తావోయ్?" అన్నారు గోవర్ధనరావుగారు ఆమెకి గ్లాసు అందిస్తూ.

లోపల్నుంచి "రామనామ మెంతో మధురమూ" పాడుతోంది గులాబి.

ఇప్పుడు ఈమెని జాగ్రత్తగా పరికించారు గోవర్ధనరావుగారు ఆశ్చర్యపోతూ.

"గులాబీ" అన్నాడు యింకా అనుమానం తీరక.

ఇప్పటికి వరద మాట్లాడాడు.

"ఈమె పేరు నీలవేణి. ఇప్పుడే వచ్చింది" ఇంకేదో చెప్పబోయేంతలో

"సరి, సరి ఇక బోధపడిపోయింది. చీకట్లో చూపు అందింది కాదు" అన్నాడు తలరాసుకుంటూ.

నీలవేణి వెళ్ళిపోయింది –

"చూశావుటోయ్ యిదీ?" అని ఆరంభించారు గోవర్ధనరావుగారు. ఊరికినేరారు ఆయన. ఏదో తగినంత విషయాన్ని పోగుచేసుకునే వస్తారు. ఉపన్యాసాలు చెప్పడం తోటే అతని బ్రతుకంతా గడిచింది. అమెరికానుంచి వస్తూనే ఢిల్లీ 'బుద్ధిస్టు' కార్యాలయం వాళ్ళు యిక్కడికి బదిలీ చేశారు. ఉపన్యాసాల్ని జ్ఞానమందిర్‌లో నడపడానికి పదిహేనేళ్ళగా యిక్కడ స్థిరపడిపోయేరాయన. ఇప్పటికీ అడపా తడపా ఉపన్యాసాలివ్వడం కద్దు.

తలరాసుకుంటూ చేతికర్రని గెడ్డం కింద ఆనించి మాట్లాడారు.

"కాశీపతి ఎవరితోనో సంప్రదింపులు జరపడానికి విజయవాడ వెళ్ళాడు, ఇంకా ఆ లైబ్రరీ విషయంలోనే మునిగి తేలుతున్నాడు. "

వరద మాట్లాడకపోయేసరికి కాస్త నిరుత్సాహపడినా మళ్ళీ అందుకున్నారు. "నాకు మట్టుకు యిదంతా వెర్రితలలు వేయడమేననిపిస్తుందయ్యా. ఏభైఏళ్ళు యీ ప్రపంచాన్ని చూశాన్నేను. దాన్ని మన త్రోవన తిప్పుకోడానికి చూసేవాళ్ళకంటే, దాని త్రోవన నడిచినవాళ్ళే ఎక్కువ బాగుపడ్డారు. ఉదాహరణకి – నేను"

ఏ లాయరు కంఠంలోనూ లేచి నిర్ధారణ, ఏ వేదాంతీ మలచలేని తర్కం యీ వృద్ధుడి గొంతులో గరగరలాడింది.

"ఏం నా మాట నమ్ముతావా?"

"చెప్పండి."

**"పుస్తకాలషాపు పెట్టే,** నేనూ సగం డబ్బు భరిస్తానన్నాను, లేదా ఉత్త లైబ్రరీ పెట్టావా, భేషో, కాని అటుకీ, యిటుకీ కాని యీ మధ్యరకం ఫక్కీ నాకేం పొందిందికాదు."

ఇంత వయస్సయ్యాక యీ కాశీపతి తరహా అతన్ని బాధపెట్టినట్లు గమనించాడు వరద.

"పోనీ, అతని ప్రయత్నాలు అతణ్ణి చెయ్యనివ్వండి మీకేం పోయింది? గెల్చుకొచ్చాడా, లేస్తాడు, దెబ్బతిన్నాడా, పాఠం నేర్చుకుంటాడు."

"అలాక్కాదోయ్, ఇప్పుడు ఆపకపోతే, చెప్పేంకాదని తర్వాత కించపడతారువాళ్ళే ఆ వేడిరక్తం యిప్పట్లో యిలా కప్పదూకుళ్ళు వేయిస్తుంది. "

"నా మట్టుకు నాకు యిందులో తప్పేం కనిపించలేదు. కాశీపతి ఆలోచన నాకెందుకో సమంజసంగానే కనిపిస్తోంది."

"ఆ" అన్నారు గోవర్ధనరావుగారు, బొద్దు మీసాల్ని ఓసారి దువ్వుకుని కుర్చీలో వెనక్కి చేరబడి క్షణకాలం కళ్ళుమూసారు.

"లాభసాటిగా వుంటుందంటావా?" చివరిసారిగా అడిగారు.

"లాభం విషయం అతను ఎత్తుకోవడం లేదుగా?"

"అతను సరే, మనం కాస్త దూరం ఆలోచించాలి"

"ఎందుకో అతను నెగ్గుకు రాగలడనే ధైర్యం నాకుంది. ఆ సత్తా ఆ వుత్సాహం అతని దగ్గర వున్నాయి"

ఈ పొగడ్తకి ఉబ్బి తబ్బిబ్బయిపోయారు గోవర్ధనరావుగారు. కుర్చీలోంచి బాగా ముందుకు వంగి ఆ చీకట్లో కళ్ళు పెద్దవి చేసి అన్నారు.

"అసలు యీ తిరకాసంతా యెందుకోయ్. కుర్రాడు కాస్త దారినపడితే వినతని ముడిపెట్టాలని మనం లేపిన కుర్రాడు, మన మాటవిని కృతజ్ఞతతో వుంటాడు. అదీగాక కాశీపతి అంతమంచి కుర్రాణ్ణి వూరికే వదలబుద్ధి కావటంలేదు"

గోవర్ధనరావుగారి మాటల్ని విన్నా విననట్టు చెట్టువేపే చూస్తూ కూచున్నాడు వరదరాజులు. ఏమనుకున్నారో యేమో, ఎంతోసేపయాక గోవర్ధనరావుగారు లేచారు.

"ఇకపోతాను వరదరాజులూ, ఓసారి ఎప్పుడయినా కాశీపతిని యిక్కడికి పంపిస్తాను. నువ్వూ చెప్పిచూడు. ఎంత ఆలోచించినా యీ ప్రోగ్రాం నాకేం నచ్చటంలేదు" అన్నారు.

"అలాగేనండి" తలూపాడు.

"నిన్న భోజనం దగ్గర నీమాట వచ్చింది. 'వరద రావడంలేదు' అని బుంగమూతి పెట్టింది వినత. ఓసారి రా, లేకపోతే నీమీద యుద్ధం లేవదీస్తుంది" మెట్లుదిగుతూ నిట్టూర్పుల మధ్య ఆయాసంగా మాటలు జారేసి చివరికి ఉప్పెనలా నవ్వారు.

గేటు వరకూ నడిచాడు వరద.

రెండు అడుగులు వేసి మళ్ళీ వెనక్కి తిరిగి "రవణమూర్తి జాడేలేదు. నీకెక్కడయినా కనిపిస్తున్నాడా?"

"వాడి చెల్లెలికి వంట్లోబాగోలేదండి"

"జ్వరమా"

"కాదు. టి.బి. అని తేల్చారుట"

"అరెరె, అయితే ఓసారి వెళ్ళిరావాలి" అనుకుంటూ ముందుకి నడిచిపోయారు గోవర్ధనరావుగారు.

ఆయనతో గడిపిన రెండుక్షణాల్లో మనసెంతో తేలిక పడినట్టనిపించింది వరదరాజులుకి, అలా నిండు మనస్సుతో మాట్లాడేవాళ్ళు అరుదు. అదే మాటిమాటికీ అనిపించసాగింది.

వసారా దాటేసరికి లోపల్నుంచి నవ్వులు వినిపించాయి. గులాబి ఏదో చెప్తోంది.

"అన్నయ్య ఎప్పుడూ అంతే, మరుపుదల ముందు, అన్నయ్య తర్వాతా పుట్టారు"

ఇంట్లోకి వచ్చేసరికి యిద్దరూ ఆగిపోయారు.

తలుపుకి చేరబడి నీలవేణి నిలబడింది.

కాళ్ళు కడుక్కొందుకి పెరట్లోకి నడిచాడు వరదరాజులు.

"వినతాసుతవాహనుడై" అందుకుంది గులాబి.

## 2

ఇరవై రోజుల తరువాత ఒకనాటి ఉదయం గులాబి మంచం దగ్గర కూచున్న వరదకు కాఫీ తెచ్చి యిచ్చింది నీలవేణి.

"జ్వరం యివాళ కూడా తగ్గలేదు" అన్నాడు నీరసంతో కళ్ళుమూసుకున్న గులాబిని చూస్తూ.

కుంచుకుని రేకులు ముడిచిన పువ్వులాగ, బలహీనతతో తెల్లటి మంచుముద్దలా పడివుంది గులాబీ

ఆ ఏకాంతాన్నీ, ఆ స్తబ్దతనీ చూసి భయపడ్డాడు.

దివారాత్రాలు ఆ మంచం మీదే గడిపాడు.

కలలు విరిగినట్లు, లేచి తగ్గుతోంది జ్వరం. ఆశ, నిరాశల మధ్య అతని మనస్సు సతమతమవుతోంది.

ఇన్నిటి మధ్యా నీలివేణి వునికి అతనికి నిబ్బరాన్నిచ్చింది.

ఆమె ప్రోత్సాహం అతనికి ఆటవిడుపు -

కాఫీగ్లాసుతో గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడ్డాడు వరదరాజులు. వంటప్రయత్నంలో వుంది నీలవేణి.

కెంపురంగు చీరె వదులుగా కట్టుకుంది. ముడివెయ్యని తడిజుత్తు వీపంతా పరుచుకుని తడిపేసింది. చామనఛాయ ముఖం పసుపుతో మెరిసింది. కిటికీ వెలుగుకి ఎర్రటి బొట్టు పదింతలై తెలీని చిత్రకారుడి కుంచె మరకలా కనిపించింది. ఈ ఇరవై రెండేళ్ళలో ప్రపంచం యింత అపూర్వ సృష్టిని ఎలా మరిచిపోయిందా అని అనుమానం.

హఠాత్తుగా విశ్వేశ్వరం గుర్తుకొచ్చాడతనికి. ఇలాంటి సమయంలో అతను రాకపోతేనే మంచిదనిపించింది. ఇప్పటి తన పరిస్థితుల్లో యీమె అవసరం ఎంత వున్నదో యీ యిరవై రోజులయి పూర్తిగా అవగాహనకి వచ్చింది.

వంగినప్పుడు ఆకారాన్ని కూడదీసుకుంటున్న శరీరపు వంపులు శిల్పి సంతరించిన గీటుల్లా తోచాయి.

"విశ్వేశ్వరం యింతవరకూ రాలేదు" అన్నాడు మెల్లగా.

ఆమె తుళ్ళిపడింది. గుమ్మానికి చేరబడి నిలబడ్డ అతన్ని చూసి తడబడింది.

పీట వేసుకుని కూచున్నాడు వరద. పొగ కళ్ళల్లో తిరిగి కన్నీళ్ళు తెప్పించింది నీలవేణికి. కిటికీలోంచి ఎండ ఆమె కళ్ళల్లోపడి మెరిసింది.

"ఎప్పుడొస్తాడో నీతో చెప్పాడా పోనీ?"

గోడకి ఆన్చిన తెల్లటి స్టీలు కంచంలో ఆమె ముఖం మరింతయి కనిపించింది.

"ఇప్పట్లో వాడొచ్చినా నిన్ను పంపేదిలేదు. నువ్వెళ్ళిపోతే ఏం చెయ్యాలో కూడా నాకు తెలీదు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు."

ఆమె తలవొంచుకునే పనిచేసుకుంటోంది. జుత్తు పాయజారి నుదుటిమీద కదిలింది.

ఏదో అనబోయేంతలో నీటి కోసం పెరట్లోకి వెళ్ళింది నీలవేణి, చాలాసేపు కూచుని లేచి వచ్చేశాడు వరదరాజులు.

***అన్నీ తనవిగా చేసుకునే శక్తి చొరవా ఆడవాళ్ళకే వుంది. స్నేహాన్నీ, పరిస్థితుల్నీ, యింటినీ, చివరికి మనుషుల్నికూడా.***

తనని పిల్చినట్లయి చెల్లెలు మంచం దగ్గరికి వెళ్ళాడు వరదరాజులు.

----

సాయంకాలం "ఢక్కన్ స్వీట్ వాలా" పక్కనుంచి నడిచివస్తూంటే ఎవరో తనని పిల్చేసరికి వెనక్కి తిరిగాడు.

కాశీపతి నీలిరంగు కోటు కనిపించింది. గోవర్ధనరావుగారు గుర్రపు బండిలోంచి కాళ్ళుపైకి వేలాడేసి కూచున్నారు. బండి రోడ్డుపక్కకి వచ్చి ఆగింది.

"ఎక్కవోయ్ వరదరాజులూ త్వరగా ఎక్కు" లోపల్నుంచి గోవర్ధనరావుగారు అరిచారు. ఆశ్చర్యపోతూ లోపలికి చూశాడు వరద, వెలిగి ఆరిపోతున్న "హిజ్‌మాస్టర్స్ వాయిస్" కుక్కబొమ్మవేపు చూస్తోంది వినత లోపల్నుంచి.

"రండి యింటికి" అన్నాడు కాశీపతి.

"వస్తాను. యివాళ కాదు"

"బతిమాలిన కొద్దీ బెట్టు సరిచేయడం వరద పంథా, రాత్రి వస్తాడు. పదండి నాన్నా" అంది వినత.

"నువ్వుండమ్మా, అన్ని సమయాల్లోనూ ఆటలాడితే బావుండదు, రావోయ్ వరదరాజులూ" అన్నారు గోవర్ధనరావుగారు.

గుఱ్ఱం బండీ అంతటనీ ఓసారి కుదిపి సకిలించింది.

చెల్లెలు విషయం చెప్పడమా వద్దా అని ఆలోచించాడు వరద.

"సరే పదండి, నేనూ వస్తున్నాను" అన్నాడు.

"మీరు బండి ఎక్కరా యేమిటి?"

"స్థలం చాలదు ఒహటి, అందరూ కూచుంటే బండి నడవదు"

"అయితే నేనూ నడుస్తాను" అని టోపీ తీసుకు దిగాడు కాశీ.

"మెల్లిగా నడపవోయ్ బండీ" అన్నారు గోవర్ధనరావుగారు.

చూస్తూండగానే గుఱ్ఱం పరుగుతీసి మరి రెండు క్షణాల్లో మలుపు తిరిగింది, "పని సక్రమంగా జరిగేట్లుందండి, విజయవాడలో యిద్దరు ధనవంతులు దొరికారు, నాలుగువేపులా సంపాయించి వచ్చాను"

"డబ్బులేదుకాని, నేనూ యిచ్చేవాణ్ణే" నవ్వాడు వరద.

"థాంక్స్, నా మాటల్నీ, నా ప్రోగ్రాంని నమ్మితే నాకు డబ్బు యిచ్చినట్టే లెక్క, అంతా డబ్బిచ్చే వాళ్ళే అయితే పనిచేసే వాళ్ళెవరు?"

అహమ్మద్ ఖాన్ టీ దుకాణంలో రేడియో అందరికీ అయాచితంగా సంగీతం వంచి పెడుతోంది.

ఇద్దరు కుఱ్ఱాళ్ళు దూరంగా పోతున్న నీలి బ్లౌజు కేసి చూసి సిగరెట్టుతో రెండుసార్లు చెయ్యి కాల్చుకున్నారు.

కుఱ్ఱాడు తింటున్న రొట్టివేపే చూస్తు నడిచిపోతున్న కుక్క ఒహటి కాలువలోపడి మళ్ళీ వళ్ళు దులుపుకు లేచింది.

"పుస్తకాల విలువ తగ్గించడం కాదు. చదువర్ల విలువ పెంచడం నా వుద్దేశం" అంటున్నాడు కాశీపతి.

మరిరెండు మలుపులు తిరిగేసరికి గోవర్ధనరావుగారి పచ్చమేడ కనిపించింది.

అరగంటసేపు జట్కాలో కూచోడం వల్ల నడుం నొప్పిపుట్టి వెనక్కి చేరబడ్డారు గోవర్ధనరావుగారు.

దూరాన బల్లమీద కూచుని మల్లెపూలు గుచ్చుతోంది వినత.

ఇద్దరూ వచ్చి మధ్య బల్లదగ్గర కూచున్నారు.

గదికి ఓ మూలన చీకటిలో కలిసిపోయి ఆరోగ్యం కూచున్నట్లు గమనించాడు వరద.

వీళ్ళిద్దరూ కూర్చోగానే కళ్ళుమూసుకునే ప్రారంభించారు గోవర్ధనరావుగారు.

"మొగాడిలో యెముకతో తయారయినందుకయినా ఆడదానికి మంచిగుణాలు వచ్చాయికాదు"

వరద తెల్లబోయాడు.

"అదేమిటి?" అన్నాడు కాశీ.

"అదిగో, ఆ మూల బైబిలు చదువుతున్న ఆవిడ నడుగు 'ఈవ్' ఎలా పుట్టిందో"

ఎవ్వరూ మాట్లాడలేదు. వరద వినతవేపు చూశాడు అర్థంకాక.

ఇటువేపే చూస్తూ సూదిలో వేలు గుచ్చుకుని రక్తం కారుతున్న బొటనవేలును నోట్లో వుంచుకుంది.

"చేతకాక వూరుకున్నారుగాని, వీళ్ళిద్దరూ నన్నీపాటికి షూట్ చేసేసేవారు" మళ్ళీ అన్నారు గోవర్ధనరావుగారు.

ఈసారీ ఎవ్వరూ నోరు మెదపలేదు.

"ఎసోసియేషన్ పెన్షన్ తప్పిస్తే మనకి ఆధారమేముంది చెప్పూ? నెక్లెసు చేయించాలట కూతురుగారికి - ఈవిడ రికమెండేషన్"

ఆరోగ్యం వేపు చూశాడు వరద. ఇతను విస్మితుడవడం చూసి ఫక్కున నవ్విందామె.

"ఆయన చెప్పిందాంట్లో సగమే నిజం వుంటుంది రాజూ, మర్చిపోకు. "

"మళ్ళీ బైబిలు పట్టుకు అబద్ధ కూడాను" అన్నారాయన.

"బట్టలు మార్చుకు వస్తాను - మీరు వెళ్ళిపోకండి" అని లేచి మేడ మీదికి వెళ్ళాడు కాశీపతి.

మల్లెచెండు కూర్చటమవడంతో తలలో తురుముకు లోపలికి వెళ్ళిపోయింది వినత.

ఇప్పుడు ముందుకి వంగి కళ్ళు పెద్దవి చేసి మెల్లిగా అడిగారు గోవర్ధనరావుగారు.

"ఆ విషయం కదిపావా కాశీతో?"

"ఏ విషయం"

"అదే, లైబ్రరీ"

"ఇంకా లేదండి"

నిట్టూర్చాయన, "ఏమవుతే కానీ, వచ్చే వైశాఖంలో పెళ్ళి నిశ్చయించేశానయ్యా, నెక్లెసు విషయం కాదనుకో, చర్చిలో పెళ్ళి జరపాలంటుందీవిడ"

వరద ఆశ్చర్యపోయాడు. గోవర్ధనరావుగారు ఎంత గుంభనంగా వుండగలరా అని.

"మరి మీరే మంటారు?"

"బుద్ధిజం మాట ఎలా వున్నా హిందూ మత సంప్రదాయంలో జరిపించాలని నా అభిప్రాయం ఎంత మారినా హిందూ అంటే నాకు గౌరవం వుండనేవుంది. ఏమంటావ్?"

ఏమీ చెప్పలేక తికమకపడ్డాడు వరద.

"ఇది మీ యిద్దరికీ సంబంధించిన విషయం, మీరే తేల్చుకోవాలి"

"అవునులే, దంపతుల జోలికి కుర్రాళ్ళు రావడం మంచిదికాదు, అందులో మాలాంటి వాళ్ళ దగ్గర" సాభిప్రాయంగా ఆరోగ్యం వైపు చూడబోయి మెడ తిప్పలేక ఆగిపోయేడు గోవర్ధనరావుగారు. బైబిలు మూసేసి లోపలికి వెళ్ళిపోయింది ఆరోగ్యం. ఆమె ముఖంలో కోపం చూడడం వరదకు అదే మొదటిసారి.

"చూశావా ఆ కోపం? నా మీద లేకపోతే పోనీ, నా వయస్సు మీదయినా గౌరవంలేదు దానికి" నిట్టూర్చారు.

వినత మూడు కప్పుల్తో కాఫీ తెచ్చి టేబిలు మీద వుంచింది. మల్లెపువ్వుల గుబాళింపు హాలంతా కమ్మింది.

వరదకి కప్పు అందిస్తూ "ఇవాళ టీ తాగాలి నువ్వు" అంది.

వినత కాస్త నయమోయ్ మొగాడయితే పెళ్ళిచేయకుండా విదేశాలు పంపించేవాణ్ణి ఏమయితే అయింది నువ్వు మాత్రం పెళ్ళి చేసుకోకు"

వరద దొంగతనంగా ఆమె ముఖం చూశాడు. అప్పటికే పక్కకి తిరిగి నవ్వుకుంటున్న వినత, యితను చూడగానే ఫక్కున నవ్వేసింది.

"ఇంత అల్లరి పిల్లలకి శిక్ష ఏమిటో తెలుసా, అమాయకుడూ, నెమ్మదయిన వాడికి ముడిపెట్టడం. కాశీపతిని అందుకే ఎంచాను" అన్నారు గోవర్ధనరావుగారు, ఈ పాటికి ఆయన కోపం పోయింది.

సిగ్గుతో, ఏదో ఆలోచనల్తో, సగం మెలుకువపాటుతో ఆమె చేతిలో కప్పు వణకడం చూసి.

"కప్పు టేబులు మీద పెట్టి సిగ్గుపడమ్మా - మీ నాన్న ధనవంతుడు కాడు" అన్నాడు.

రెండు చేతుల్తో ముఖం కప్పుకుంటూ మాయమయింది వినత.

ఏదో మార్పు ఆమెలో కనిపించింది వరదకి. అదే ఆలోచిస్తూ కూచున్నాడు.

కాశీపతి సన్నటి గోధుమరంగు ఖద్దరు పంచె, కుచ్చిళ్ళు పోసి కట్టి గ్లాస్కో లాల్చీతో వచ్చాడు.

"ఈ యిల్లు టిపికల్, ఒకరు హిందూ, మరొకరు క్రిష్టియను, ఇంకొకరు బుద్దిస్టు, సమతకి చిహ్నం" టీ రెండు గుక్కల్లో ముగించి గర్రున త్రేన్చారు.

ఇంటిమీదే దృష్టి వుంది వరదరాజులుకి

టీ ముగించి లేచాడు, "ఇక వెళ్తానండి"

"నాతో చెపితే లాభంలేదు. వినతని పిలుస్తానుండు" పిలిచారు. ఎక్కడో దూరాన సన్నని కంఠం జవాబిచ్చింది.

"మీతో రెండు విషయాలు మాట్లాడాలనుకున్నానే" అన్నాడు కాశీపతి.

"రేపు వుదయాన్నే ఓసారి మా యింటికి రాకూడదూ - కాఫీ తాగి పోదురుగాని?"

"అవునోయ్ కాశీ. వరదరాజులు యిల్లొకసారి చూడాలి నువ్వు, కణ్వాశ్రమంలా వుంటుంది.

"సరే, రేపుదయం వస్తాను"

వినత వచ్చింది.

నేరేడు పండు రంగు పరికిణీ, తెల్లటి చోళీ వేసుకుంది మోటగా పెరిగిన జుత్తుని బలంగా వెనక్కి త్రిప్పి ముడేసింది. సిగలో సగం విడిన మల్లెలు, చెక్కిళ్ళమీద ఎరుపు సరుగుడు చెట్ల వెనక సాయంకాలం ఎర్రదనంలాగు - గుండెలోతులో రక్తాన్ని కరళ్ళు గట్టించింది.

"ఉండూ, నేనూ వస్తున్నాను" అంది.

వరద నిశ్చేష్టుడయి ఆగిపోయాడు.

"వరదతో వెళ్తాను నాన్నా" అందామె.

ఎక్కడికని అడగనూ లేదు, తలెత్తనులేదు - 'ఊ' అన్నారు గోవర్ధనరావుగారు.

చుక్కచుక్కగా టీ చప్పరిస్తున్నాడు కాశీపతి.

ఎవరూ వినరన్న ధైర్యం వచ్చాక "ఎందుకొచ్చావ్ నాతో?" అన్నాడు వరద.

"ఏం రాకూడదా?"

"అదికాదు నీ గురించి నువ్వాలోచించుకోవలసిన వయస్సిది"

"నాకు తెల్సు"

వినతతో మాట్లాడడానికి భయం వరదకి. తొందరపడి ఆమె అనేసిన ఏమాటతో మనస్సు బాధపడుతుందోనన్న పిరికితనం అతన్ని పీకుతూంటుంది - అందుకని యింకేం ప్రశ్నించలేదు.

పార్కు పక్కనుంచి నడుస్తూంటే

"ఓసారి కూర్చుందాం పద" అంది.

"ఇంటిదగ్గర పనివుంది, వెళ్ళాలి"

"ఓయబ్బో, గులాబి తిట్టదులే. నేను ఆపేశానని చెప్పు"

"అదికాదు వెళ్ళాలి"

కన్నీటి పర్యంతం అయింది వినత.

"రెండు విషయాలు నీతో మాట్లాడాలి. వింటానంటే చెప్పు, లేకపోతే వెళ్ళిపోతాను"

ఎలక్ట్రిక్ దీపపు నీడలో ఆగి అడిగింది.

ఆమె కంఠం బొంగురుపోవడం చీకట్లో గుర్తించాడు వరద. గుర్తించి యింకేమీ అడ్డుచెప్పలేదు.

"పద" అన్నాడు.

గుబురుగా పెరిగిన క్రోటన్సు మొక్కల నీడన చతికిల బడ్డాడు.

దూరంగా గడ్డిమొక్క చేతిలోకి తీసుకు కూచుంది వినత, దీపపు వెలుగు సూటిగా కళ్ళల్లో పడడంతో ముఖం చిట్లించింది.

"చెప్పు తొందరగా" అన్నా ఎంతోసేపటికిగాని నోరు విప్పలేదు వినత.

"ఇందాక నాన్నగారి మాట విన్నావుగా?"

"ఏమిటి?"

"నా పెళ్ళి విషయం?"

"ఊఁ, వైశాఖంలో చేస్తారట.."

"నాకీ పెళ్ళి యిష్టంలేదు."

నిర్ఘాంతపోయాడు వరద. ఆమెకళ్ళు క్రిందికి దించుకుని బొటన వ్రేలితో గొప్పు తవ్వుతోంది.

"అదేం?"

"కాశీపతి తెల్సుగా? జీవితం మీద అలా ఆశలు పెట్టుకు బ్రతికేవాడు నాకక్ఖరలేదు."

"అనుకున్నది అనుకున్నట్టు జరిగితే లక్షాధికారి అవుతాడు కాశీపతి"

"జరక్కపోతే?"

"మీ నాన్నగారు వుండనే వున్నారు. ఆయన ఆదుకోక పోరు"

"అంతకన్నా ఆత్మహత్య మరొకటి వుండదు. అలా బ్రతకడం నాకసహ్యం"

"మరి మీ నాన్నగారితో చెప్పలేదేం?"

"ఆయన నన్నడగలేదు. అందుకని"

"కానీ కాశీపతి తెలివయినవాడూ, మంచివాడూను"

"అది 'తెలివి' కాదు, బలహీనత, ఏదో కలల్లో బ్రతకడం, మొగాడిలో బలహీనతల్ని ఒప్పుకుని జోకొట్టి నిద్రపుచ్చడం స్త్రీకి తెలుసు. కానీ ఆమె గౌరవాన్ని పొందగల గొప్పతనం కూడా అతనికి వుండాలి"

ఒక్కసారి ఆమె ముఖం చూశాడు వరద, అసహాయత ఆమె ముఖాన్ని రగిల్చింది ఉదాసీనతతో, దుఃఖంతో కళ్ళు ఎరుపెక్కాయి, ఇంత ఆలోచించడం ఆమెకి చేతకాదనుకున్నాడు వరద, కానీ యిప్పుడు హఠాత్తుగా -

"ఇవేనా నాతో చెప్పాల్సిన విషయాలు?"

"నన్నిప్పుడేం చెయ్యమమావో చెప్పు"

"మీ అమ్మని అడుగు, చెప్తుంది"

"నిన్నడిగితే?"

"చేతనయితే కాశీపతిని నీకిష్టమయినట్టు మార్చుకో, లేకపోతే అతనికి తోచినట్లు నువ్వు మారాలి"

"ఎంతసేపూ 'కాశీపతి' అంటావేగానీ, నీ గురించి నువ్వు ఆలోచించవేం?" అంది హఠాత్తుగా.

దిమ్మెరపోయి చూశాడు వరద. ఆమె పెదవులు ఆ సరికే దుఃఖంతో, వంపు తిరిగాయి. మరొక్క మాటచాలు ఆమె ఏడవడానికి.

"నా గురించి యిందులో ఆలోచించడానికి ఏముంది కనుక? పెళ్ళయాక నిన్ను చూడడానికి ఓసారి తప్పకుండా వస్తాను"

కిందపెదవితో దుఃఖం ఆపుకోవాలన్నా ఆగలేదు. కంఠంలో జీర తెలిసింది వరదకి.

ఎలక్ట్రిక్ దీపం వున్నట్లుడి ఆరిపోయింది. పార్కు మూసేసే వేళయిందని తోటమాలి అరుస్తున్నాడు.

చీకటిలో యిద్దరూ మునిగిపోయారు.

"నా గురించి ఎప్పుడూ ఆలోచించలేదా నువ్వు?" చీకట్లో మెల్లిగా అడిగింది.

భయపడ్డాడు వరద, ఎవరన్నా చూసినా బావుండదు. తలుపు వేస్తే గేటు గెంతిపోవాలి.

"ఇక పోదాం పద" అన్నాడు.

"ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పు"

గుండె గొంతులో కదిలిది.

"నాతో నువ్వు బ్రతకలేవు" అన్నాడు వరద నిర్లిప్తంగా

"అంటే?"

"కాశీపతికంటే ఎక్కువ ఆశల్లో బ్రతుకుతున్నాను నేను. జీవితం మీద నాకెంతో నమ్మకం, దుగ్ధ. కానీ అతనికున్న పట్టుదలా, ధైర్యమన్నా నాకులేదు"

మాట్లాడలేదు వినత.

"నా దగ్గర నువ్వు చాలా తగ్గి బ్రతకాలి"

"అంటే నీలాగా నిర్లక్ష్యంగా తిరగాలా? అన్నిటినీ పోయి"

"అదికాదు? "

"మరి?"

"నిన్ను నీకు పూర్తిగా తెలీదు. నీకు ఎదుటి వ్యక్తి మీద అధికారం కావాలి, ప్రేమ కాదు. అతనికంటె పెరిగి బ్రతకాలనుకుంటావు. నేను చాలా మామూలుగా, నాకంటే తక్కువతనంతో బ్రతికే వాళ్ళకోసం పాకులాడతాను. నిజానికి యివాళ నువ్వన్నట్టు ఎప్పుడూ చూడలేదు నేను. ఇవాళ నేను కావాలని తోచినా, రెండేళ్ళ తర్వాత నేనెంత అనవసరమో తెలుస్తుంది నీకు. చెత్తబుట్టలాగా దూరంగా తోసేస్తావు అప్పుడు. అర్థమయిందా?"

"ఊహూఁ! లేదు" అంది.

"స్త్రీని స్త్రీగా చూడడం నాకు తెలీదు. అనుభవంతో స్త్రీని మలిన పరచడం అన్యాయం. నిజానికి"

"పో. పిచ్చి"

"నా తరహా అంతే.."

"అయితే నువ్వు నాకక్కర్లేదు" అంది పట్టుదలగా.

అప్పటి ఆమె ముఖం చూడాలనుకున్నాడు వరద. "ఇప్పుడు నిన్ను నువ్వు తెలుసుకున్నావ్. అసలు వినతలా మాట్లాడావు. నిజానికి నువ్వు ఏడవకూడదు. వేటి గురించీ ఆలోచించక నిర్లక్ష్యంగా గెంతుతూ బ్రతకాలి. కాశీపతి కొంత నీ యిష్టాయిష్టాల్ని గౌరవించగలడనుకుంటాను."

"ఇక పోదాం పద" అంది వినత.

ఎల్కక్ట్రిక్ దీపం కొట్టుకు కొట్టుకు వెలిగింది. - ఒక్కసారిగా వెలుగుని చూడలేక ముఖం కప్పుకుంది వినత.

"నీ గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. ఇలాంటి రోజు వస్తుందని కూడా తోచలేదు నాకు. వస్తాను. త్వరగా యింటికిపోవాలి."

"ఏం తొందర?"

"గులాబికి వంట్లో బాగోలేదు. వారం రోజుల్నుంచీ జ్వరం."

కళ్ళు పెద్దవి చేసి చూసింది. క్షణకాలం క్రితం వరకూ కన్నీటితో మెత్తబడిన కళ్ళు ఆశ్చర్యాన్ని సరిగ్గా వ్యక్తం చేయలేకపోయాయి.

"అయితే నేనూ వస్తాను పద."

రెండడుగులు వేశాక తుళ్ళిపడి ఆగిపోయాడు వరద. నీలవేణి గుర్తుకొచ్చింది.

"ఇప్పుడు వద్దులే. నా మాట విను" అన్నాడు.

"అదేం?"

"కారణం మరోసారి చెప్తాను. చాలా రాత్రయింది. ఇంటివరకూ వచ్చి వెళతాను పద" అన్నాడు.

ఇంకేమీ మాట్లాడకుండా ముందు నడిచింది వినత.

వినతకీ, తనకీ మధ్య ఏదో తెలీని దూరం పెరిగినట్టు తోచింది వరదకి. ఇన్ని విషయాలు ఎప్పుడు ఆలోచించలేదతను. ఇన్నాళ్ళయి ఏదో అవ్యక్తమయిన బంధం వాళ్ళిద్దరినీ ఒకే ముడిలో బిగించింది. ఇప్పుడు మరో వ్యక్తి జొరబడి శబ్దం లేని కత్తెరతో ఆ ముడిని కోసేశారు.

ఇద్దరూ విడిపోయారు. దూరదూరంగా యిద్దరూ విడిపోతున్నారు. చీకటినీడల్లో దూరాన నడుస్తున్న వినత కనిపించలేదు.

చెప్పకుండానే వెనక్కి తిరిగి యింటి ముఖం అయాడు వరద.

సగం తోవ గడిచాక వెనక్కి తిరిగి చూస్తే వరద కనిపించలేదు వినతకి. ఆశ్చర్యపడలేదామె.

**ఉన్నట్టుండి** ఒక్కసారి ఉప్పెనలా గాలి వీచింది.

గోడనున్న కేలెండరు తెగి కిందపడింది.

తుళ్ళిపడి కళ్ళువిప్పాడు వరద.

ఇటు తిరిగేసరికి కాశీపతి అనీబిసెంటు భగవద్గీత వ్యాఖ్యానం చూస్తూ కనిపించాడు.

"అప్పుడే వచ్చారా?"

తలెత్తాడు కాశీ "తొమ్మిదయింది రాత్రి బాగా నిద్రపట్టనట్లుంది"

వినత గుర్తుకొచ్చింది. "అవునండి క్షణంలో వస్తానుండండి"

పక్కగదిలోకి వచ్చాడు వరదరాజులు. గులాబి లేచి రొట్టె తింటోంది.

తుఫాను గాలి భరించాక వాలిపోయిన మొక్కలాగా కనిపించింది.

"కాస్త నయం" అంది నీలవేణి.

"డాక్టరు రేపట్నుంచీ రాడట. కాంపౌండరు వచ్చి చెప్పి వెళ్ళాడు నిన్న."

"అదేం?"

"క్రితం నెల డబ్బు యివ్వలేదటగా?"

జ్ఞాపకం వచ్చింది వరదకి. "అవును. రవణమూర్తికి యిరవై కావలిస్తే అప్పిచ్చాను"

"ఇంక నాకు మందు అక్కర్లేదన్నయ్యా"

"నే వెళతాలే డాక్టరుగారి దగ్గరికి" అని పెరట్లోకి వెళ్ళాడు.

కాశీపతికి కాఫీ యిచ్చి వెళ్ళింది నీలవేణి. వరద చెల్లెలనుకున్నాడతను.

మరో అయిదు నిముషాలకి వచ్చి మంచం మీద మఠం వేసుక్కూచున్నాడు వరద.

"చిన్నవయస్సులోనే భగవద్గీత ఎత్తుకున్నారే. అందులోనూ అనీబిసెంటు వ్యాఖ్యానం" పుస్తకం బల్లమీద వుంచేస్తూ అన్నాడు కాశీ.

"ఓ రచనకు భగవద్గీత అవసరం వచ్చింది. అందుకని"

"ఏమిటా రచన?"

"నవ్వుతారు చెబితే?"

"ఆ తెగింపు లేకపోతే ఆనడు మీకూ నా ప్రోగ్రాం చెప్పేవాణ్ణేకాదు" చెప్పండి వింటాను.

కాస్సేపు తికమకపడి వివరించాడు వరద.

"ప్రపంచమంతా డబ్బుతో నడుస్తోంది. ధనమూలమిదం - స్వర్గంలో వున్న ఐశ్వర్యాన్నంతా తీసేస్తే రేపటినుంచీ దేవతలు జేబులు కొట్టడం ప్రారంభిస్తారు" అన్నాడు ప్రమదనాథబిశీ. మరోవింత ఆలోచన వుంది. భగవంతుడిలో వున్న శక్తినంతా తీసేసి రెండు స్కాండల్స్‌తో అతణ్ణి వదిలేస్తామనుకోండి. అదిగో మీరు నవ్వుతారు" ఆగాడు వరద.

కాశీపతికి నవ్వొచ్చినమాట నిజమేకానీ అతి ప్రయత్నం మీద ఆపుకున్నాడు. "నవ్వడం లేదు. చెప్పండి."

"మానవుణ్ణి న్యాయాన్యాయ విచారణ చేయడమేగాని, ఆ స్థితిని అనుభవించి వుండడు భగవంతుడు. తమాషా అయిన సంఘటనల్ని ఎదుర్కొంటాడు. ఏమంటారూ?"

"అవన్నీ దాటగల సమర్థుడేగా దేవుడు?"

"ఆ శక్తులన్నీ అతనిలోంచి తీసేశాక మాట నే చెప్పేది, కష్టపడితేనేగానీ తిండి దొరకదు, సంఘం వెలివేస్తుంది. అప్పులూ, అబద్ధాలూ, సేల్స్‌టాక్సూ, బస్సుల దగ్గర గుద్దులాటలూ, కలెక్టరాఫీసులో లంచాలు, కిరాయి మనుషుల కన్నుగీట్లూ తెల్లబోయి చూస్తాడు. మరుక్షణంలో ఆత్మహత్య చేసుకుంటాడు. తప్పదు."

తెల్లబోయి చూశాడు కాశీపతి.

"ఇలాంటి 'ఫేంటసీ'లు ఎవరూ మెచ్చుకోరు. కనీసం అర్థం చేసుకోడానికయినా ప్రయత్నించరు. అయినా యీ ఆలోచనల్ని మానుకోలేను నేను."

"మీ రచనలు ఎప్పుడయినా ప్రచురించారా?"

"ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఆ విషయం ఎప్పుడూ ఆలోచించనేలేదు. నాకోసం వ్రాసుకుంటాను వీటిని. ఈ ఆలోచనల్లో నాకేదో ఆటవిడుపు కనిపిస్తుంది"

ఏమీ మాట్లాడలేదు కాశీపతి. గోడనున్న వూర్వశి నవ్వుతూ కనిపించింది. పురూరవుడి మీద కసితో, ఆకలితో చూసే అతని వేపు నిర్లక్ష్యంగా, అందాన్నంతా ఆ నడుం వంపులో దాచుకుని, పురూరువుడి కోర్కెల్నీ, ఆశల్నీ, తపననీ గాలిలో తేలిగ్గా ఎగరేసి దుర్గతో చూసే అతని కళ్ళకి నిరాశని మిగిల్చి.

"ఏమిటాలోచిస్తున్నారు?" అన్నాడు వరద.

నవ్వేశాడు ఏం చెప్పాలో మాటలు తోచక.

"మీరు మాట్లాడండి. మరి కాస్సేపు నా మాటలు వింటే నాకు పిచ్చెక్కిందేమోననుకుంటారు మీరు" నవ్వాడు.

అప్పటికీ యేమీ మాట్లాడలేదు కాశీ.

నీలవేణి వచ్చి కాఫీ కప్పును తీసుకువెళ్ళింది. పక్క గదిలో ప్లేటు కిందపడి పగిలిన చప్పుడయి తుళ్ళిపడ్డాడు కాశీపతి.

"మిమ్మల్ని మీ ప్రయత్నం నుంచి తప్పించమని నిన్న మళ్ళీ చెప్పారు గోవర్ధనరావుగారు" అన్నాడు వరద కాస్సేపటికి.

ఆశ్చర్యపోతూ చూశాడు కాశీ.

"మీరేమన్నారు?"

"నా మట్టుకు నాకు మీ మీద నమ్మకం వుంది. ఎప్పుడయినా ప్రెస్ కూడా మీరు ప్రారంభిస్తే నన్ను పిలవండి"

నవ్వాడు కాశీ.

"అదంతా అయిదేళ్ళ తర్వాత మాటలెండి. మొదటి విషయం నాకు పెళ్ళి చేసుకోవడం యిష్టం లేదండి."

తుళ్ళిపడ్డాడు వరదరాజులు.

"అదేం?"

"ఎందుకో చెప్పలేను. కానీ నా ఆశయాలకి యీ పెళ్ళి ఆటంకంగా తోస్తుంది. ఈ హడావుడిలో పడి అసలు పని మరచిపోతానేమోనని భయం."

"ఈ మాట ఎవరితోనన్నా అన్నారా?"

"లేదండి, అంటే బాధపడతారని వూరుకున్నాను. ఇప్పుడున్నంత స్వాతంత్ర్యం కూడా అప్పుడుండదు. నా పిచ్చి వూహలకి వాళ్ళుకించపడుతూంటారు. వినత కూడా నన్ను పూర్తిగా నమ్మలేదని నా అభిప్రాయం"

నిన్నటి వినత మాటలు జ్ఞాపకం వచ్చాయి. ఏమీ మాట్లాడలేకపోయాడు.

"స్త్రీకి సుఖం కావాలి. తన అభిప్రాయాన్ని గౌరవించే వాడికంటే, తన యిష్టాయిష్టాల్ని గౌరవించేవాడినే ఎంచుకుంటుంది ఏమంటారు?"

"అవునేమో?"

"ఆ సత్తా నాకు లేదు. నా పిచ్చిలో కొట్టుకుపోవడమే నాకిష్టం."

ఎంతోసేపటికి అన్నాడు వరద. "పోనీ యీ మాటలన్నీ గోవర్ధనరావుగారితో అని చూడండి"

"ఆయన క్రుంగిపోతారు నాకు తెలుసు. అయినా నే చేసేదేమీలేదు. ఈ ఒక్క అడ్డంకు తప్పిస్తే వినతని చేసుకొనడానికి నాకేం అభ్యంతరం వుండదు."

"మీకు సరిపోయేట్టు వినత మారగలదేమో కనుక్కొన్నారా?"

సిగ్గుపడుతూనే నవ్వాడు కాశీపతి "ఆడవాళ్ళని అర్థం చేసుకోవడం నాకు బొత్తిగా తెలీదండి. ఇన్నాళ్ళున్నా, ఆమెతో ఒకటి రెండుసార్లు కంటే ఎక్కువ మాట్లాడలేదు నేను. ఏమనుకుంటుందోనని"

కందిరీగ ఒహటి గదిలోకి వచ్చి గొడవ చెయ్యసాగింది. అద్దంలో నీడని చూసి ముక్కుతో ఒహటే పొడుస్తోంది.

"దసరాలోపున పని ప్రారంభించాలనుకుంటున్నాను. అంతవరకూ ఆగినా బావుంటుంది. మీ మాటంటే గోవర్ధనరావుగారికి గౌరవం వుంటుంది."

కదిలాడు వరద. "ఇలాంటి విషయాల్లో నేను కల్పించుకుంటే బావుండదేమో చూడండి. పైగా మీరు నాచేత చెప్పించారని అపోహపడచ్చు.

"అదీ నిజమే" అన్నాడు కాశీపతి.

చెవిదొప్పకి టప్పున వచ్చి కొట్టుకుంది కందిరీగ. భయపడి లేచాడతను.

"ఇహ నేను వెళ్తానండి"

ద్వారం వరకూ వచ్చాడు వరదరాజులు.

టోపీ పెట్టుకుంటే విదేశస్తుడిలా వుంటాడు కాశీపతి. సన్నగా పొడవుపాటి మెడా, తెల్లగా, నిండుగా వుంటాడు. ముఖానికల్లా అందం వంపు తిరిగిన పెదాల మీదికి ఇంద్రధనస్సులా వంగిన ముక్కు, పెద్ద కళ్ళు నిలదీసి పుష్పించినట్లుంటాయి.

సందు మలుపులో ఓసారి ఆగి మాయమయాడు.

వెనుదిరిగేసరికి స్థంభం చాటున ఓ వ్యక్తి కనిపించాడు వరదరాజులుకి.

బంతిపువ్వులు కోస్తోంది నీలవేణి

నమస్కారం చేశాడతను.

"ఎవరండి?"

"నా పేరు రామ్మూర్తి"

ఇటు తిరిగి నీలవేణి, అప్పుడే కోసిన బంతిపువ్వు తురుముకుంటూ అంది, "మీ కోసం నిన్న నాలుగుసార్లు వచ్చారాయన. చివరికి రాత్రి పదిగంటలకి కూడా కనిపించి వెళ్ళారు."

"రండి" అంటూ లోపలికి నడిచాడు వరద.

సగం మూసి, పూర్తిగా మాసికలు బడ్డ ముతక ఖద్దరు పంచె, చిరుగుల్ని కప్పుకొందుకా అన్నట్లు పైన పైన నల్లటికోటు వేసుకున్నాడు. బాగా మాసిన గెడ్డం వెనుక, తెల్లటి పల్చటి ముఖం మనిషిలో సంస్కారాన్నీ, బ్రతికి చెడిన వ్యక్తిత్వాన్నీ పట్టిస్తోంది.

కుర్చీలో ఒదిగి కూచున్నాడు రామ్మూర్తి.

మంచం మీద కూచుని 'చెప్పండి' అన్నాడు వరద.

తను కూచున్న చోటు నుంచి గదిలో మంచం మీద ఒత్తిగిలి పడుకున్న గులాబి కనిపిస్తోంది.

ఏదో చిత్రాన్ని చూస్తున్నట్లు ఆశ్చర్యపడ్డదామె.

కోసిన పువ్వుల్ని నీడలో వుంచి గన్నేరు చెట్టుకి నీరుపోస్తోంది నీలవేణి. జీవం లేనట్లు ఎక్కడో లోతున మెరుస్తున్న కళ్ళూ, అసహాయతతో వణుకుతున్న పెదాలు, పొట్టిగా వున్న ఆ వ్యక్తిని విస్తుపోతూ చూస్తున్నాడు వరదరాజులు.

నీలవేణి నవ్వలేదు. నీళ్ళుపోస్తున్నదల్లా ఆగి, "ఉద్యోగం కోసం వచ్చారీయన. ఏమండీ అంతేనా?"

తలూపాడు రామ్మూర్తి.

నిర్ఘాంతపోయాడు వరదరాజులు. "నేను వుద్యోగం యిప్పిస్తానని ఎవరు చెప్పారు?"

"హార్బర్లో ఎవరో అన్నారండి"

"అయితే అతనెవరో మీతో అబద్ధం చెప్పాడు. నేను మామూలు గుమాస్తాని"

కాస్సేపు ఎండవేపు చూస్తూ నిలబడ్డాడతను. ఇంకేమీ చెప్పకుండా గేటుదాకా నడిచిపోయాడు.

ఎందుకో అతణ్ణి చూసి పూర్తిగా చలించాడు వరద. మాట చెప్పడానికే వెయ్యి ప్రయత్నాలు చేస్తున్న యితనేం పని చెయ్యగలడా అనిపించింది. హఠాత్తుగా బలరాం దాసు గుర్తుకొచ్చాడు. నుదుటిని పచ్చటి గంథపు బొట్టూ, పిలక సహాయంతో వెయ్యి తలలు మార్చే సమర్థుడు దాసు. కదిపితే ఫలితం వుండకపోదు - మనసులో ఏదో మూల ఆశతోచింది. తనూ ఓ మనిషిని ఆదుకోగలడన్న వుత్సాహం కలిగింది. ఎండలో పొట్టిమనిషి కోటు మరీ తెలుస్తోంది. ఒదిగి దూరంగా అతని కళ్ళల్లో దైన్యత వరదై కట్టివేసింది.

గేటువరకూ తొందరగా నడిచి "చూడండి" అన్నాడు.

గేటు నీడలో ఒత్తిగిలి ఆగాడతను.

"మీ పేరేమిటన్నారు?"

"రామ్మూర్తి"

"పదిగంటలకి ఓసారి ఆఫీసుకు రాగలరా?"

"అలాగే"

"ప్రయత్నిస్తాను. నేనూ మాములు గుమాస్తాని. అయినా మీ అదృష్టం ఎలా వుందో చూద్దాం."

కృతజ్ఞత కూడా ఎలా చెప్పుకోవాలో తెలీదతనికి. నుదుటిన పట్టిన చెమటని కోటుతో తుడుచుకున్నాడు. రెండు చేతులూ ఎత్తి నమస్కారం చెయ్యబోయే సరికి వీపు చిరిగింది. సిగ్గుతో యింతయి పోయాడు రామ్మూర్తి.

బీదతనం మింగేసి జీర్ణించుకున్న పాతిక దాటని వ్యక్తిని చూస్తూ ప్రతి నమస్కారం చెయ్యడం మరిచిపోయాడు వరదరాజులు.

కుప్పగా పోసిన బంతిపువ్వుల మీద నిలబడ్డ విషయం కూడా మరచిపోయి చోద్యం చూస్తోంది నీలవేణి.

మంచం మీంచి లేచి వచ్చి గుమ్మానికి ఆనుకుని నిలబడ్డది గులాబి.

వరద లోపలికి రాగానే "నువ్వు చాలా మంచివాడివన్నయ్యా" అంది.

ఆశ్చర్యపోయాడు వరద

## 3

నుదుటిన వేలెడు గంధపు బొట్టూ, మెళ్ళో రుద్రాక్షలు, చెవిలో గన్నేరుపువ్వుతో ప్రత్యక్షమయ్యే బలరాందాసులో పొట్టకోస్తే ఏ కోశానా మంచి అంటూ కనిపించదు. వాడి తలా, వీడి తలా కొట్టి కట్టిన మూడు భవంతులూ, కాగితాలూ మార్చీ, తలలూ మార్చే తంగరాపులు చేసీ సంపాయించిన ఏభై ఎకరాల మాగాణీ, రెండు ఎడ్లబళ్ళూ, రెండు బానల కడుపూ ఇదీ బలరాందాసు స్వరూపం.

నాలిక చివర మాత్రం శ్రీమన్నారాయణుడున్నా, నుదుటి ముడతల్లోనే వేయిపాపాల్ని దాస్తాడు. హెడ్డు గుమాస్తా బలరాందాసు వచ్చి ఆర్నెల్లయినా కాకుండా హరిశ్చంద్రుల్లాంటి సెక్షను హెడ్డు నీలకంఠంగారిని బదిలీ చేయించేసేడంటే అందరూ ముక్కుమీద

వేలేసుకున్నారు. దాసు చేతుల్లో పడకేపోవాలి, పడ్డాడో ముప్పతిప్పలూ పెట్టి తిమ్మిని బెమ్మిని చేసి వూరుకుంటాడు. అతని చేతిమీంచే ముగ్గురు 'ఎస్సెల్సీ ఫెయిల్డు'లు గుమస్తాలయి కూచున్నారు ఆ మరుసటి పండక్కే కొత్త యిల్లు కట్టించి గృహప్రవేశం చేసాడు బలరాందాసు.

కానైతే ఒకానొక రికమెండేషన్ కాగితం పొరపాటున వరద చేతిలో యిరుక్కుపోయింది. మొదట అది చూసి నిర్విణ్ణుడయిపోయాడు వరదరాజులు. ఇందులో యింత కుతంత్రం వుందా అని. తీరా అంత తెలిశాక దాసంటే కడుపులోంచీ దేవుకొచ్చింది. సమయం కోసం దాచి వుంచాడు వుత్తరాన్ని.

ఆనాడు రామ్మూర్తి విషయం చెప్పాడో లేదో బొరల్చాచుకుని లేచిపోయాడు బలరాందాసు.

"హత్తెరీ గుమస్తాగాడివి, నువ్వా రికమెండేషన్లు చెయ్యడానికి బయల్దేరావ్ అణాకానీ చెయ్యని బికారి గాళ్ళందరికీను"

తోటి గుమస్తాలంతా విస్తుపోయి చూసారు.

"అన్ని రికమెండేషన్లూ మీరే చెయ్యండి. ఈసారి మాత్రం యితణ్ణి కాస్త చూడండి. మరి రెండు రోజులు తిండిలేకపోతే చచ్చిపోతాడు" అన్నాడు.

మొదటిమాటలో గంగ వెర్రులెత్తిపోయాడు దాసు. "నేను రికమెండు చేయగా నువ్వెప్పుడన్నా చూశావా? మళ్ళీ ఆ మాటంటే వుద్యోగం పీకించేస్తాను" అనరిచాడు.

"ఊరుకోవోయ్, పులి నోట్లో ఎందుకు చెయ్యి పెడతావ్?" అని గొణిగాడు పక్క గుమాస్తా.

వళ్ళు మండింది వరదకి. ఉన్నపాటున రెక్క పట్టుకుని లేవదీసాడు బలరాందాసుని. తన కుర్చీ దగ్గరికి ఒక్కసారి యీడ్చుకొచ్చాడు. డ్రాయరు తీసి రెండు నెల్లయి దాచిన వుత్తరాన్ని ముందు పడేసాడు.

దాన్ని చూడడం తోటే చెట్టంత మనిషి నీరయిపోయాడు దాసు.

"ఏదో నిర్ణయించుకోండి. నేను రేపే రాజీనామా యిస్తాను. ఉద్యోగం అంటే నాకేం లక్ష్యం లేదు. కానీ యీ వుత్తరాన్ని పైకి పంపించి మరీ చేస్తాను" అన్నాడు.

తన పిడికిట్లో దాసు భుజం వణకడం గమనించాడు వరద. తెల్లగా మెరిసే బట్టతల గబగబా చెమటపట్టింది. కిక్కురుమనకుండా తన స్థలానికి వెళ్ళి కూచున్నాడు బలరాం దాసు. మళ్ళీ తలెత్తితే ఒట్టు.

బిత్తరపోయారు అంతా.

రాయిలా ఓ మూలకి చేరబడి పోయాడు పొట్టి రామ్మూర్తి.

"రేపు యింటికి రండి" అని వరద అన్నాక మరో క్షణం అక్కడ ఆగకుండా వెళ్ళిపోయాడు.

వేయి యంత్రాలు ఒక్కసారి నడుస్తున్నట్టూ, సముద్రాలన్నీ ఏకమయి రోదిస్తున్నట్లూ, చుట్టూ లేచిన ఏవో మంటలు తనని కాల్చేస్తున్నట్టూ తోచింది వరదకి. ఎంత యిరకాటంలో పడినా వీలు చూసుకుని కోరలు చాచకపోదు సింహం. బలరాందాసు స్తబ్ధత చూసి భయమేసి కుర్చీలోంచి లేచి వెళ్ళిపోయాడు.

డాక్టరు సుందరేశం గారి కాంపౌండరు సైకిలు మీద తొందరగా ఎక్కడికో పోతున్నాడు. పిలిచాడు వరద. విసుక్కుంటూ సైకిలు దిగాడతను.

"నిన్న డాక్టరుగారు రాలేదట?"

"అవును, రాలేదు"

"ఏం?"

"రెండు నెలల బిల్లు ఆగిపోయింది"

"పారిపోతామా వూర్లోంచి"

"మీరు పారిపోరు కానీ, మందులు కొట్లోంచి వూరికే రావు. అది డాక్టరుగారి అభిప్రాయం" సైకిలెక్కి వెళ్ళిపోయాడు కాంపౌండరు.

డబ్బిస్తే నవ్వుతూ వస్తారు డాక్టరుగారు. పెద్ద పండక్కి చేతులు కట్టుకుని చందాకి వస్తాడు యీ కాంపౌండరే. డబ్బిస్తే సగం మొహమాటపడుతూ "పేషెంట్లని బాధపెట్టడానికి నేను చాలా డెలికసీ ఫీలవుతానోయ్. వచ్చే క్రిస్మస్‌కు 'ఫ్రీ సర్వీస్' పెడదామనుకుంటున్నాను" అంటూనే డబ్బు జేబులో దోపుకుంటాడు. డబ్బులేక గాని, యిస్తే పిలకని మరొకసారి ముడేసి, గుమాస్తా వుద్యోగం వేయించావాడే దాసు.

అయితే డాక్టరు చిరునవ్వు ఖరీదు పాతిక రూపాయలు. దాసు సహాయం ఖరీదు నూరు. రామ్మూర్తి బీదతనానికీ, తన కోపానికీ విలువల్లేవు.

ఆఫీసులోకి వెళ్ళబుద్ధికాలేదు వరదరాజులుకి. నాలుగడుగుల్లో సుందరేశం గారి డిస్పెన్సరీ వుంది. ఆ విషయమేదో తేల్చుకుందాం అనుకున్నాడు.

డిస్పెన్సరీలోనే యిల్లు. క్రోటన్సూ, ఫెరన్లూ గోడ చుట్టూ వేశారు. భోగన్ విల్లా పందిరి అందంగా పెరిగింది. క్రీపరు స్తంభాన్ని పట్టుకు మేడమీదకి పాకింది.

డిస్పెన్సరీ గుమ్మంలో ఎవరో కుర్రాడు కునికిపాట్లు పడుతూ కురుపుమీద వాలే యీగల్ని తోలుకుంటున్నాడు. నెలలు నిండిన ఒకామె కూర్చోలేక బాధపడుతోంది.

ముందు హాల్లో కూచుని ఎవరితోనో 'రన్‌మోర్' వేశారు డాక్టరుగారు.

"పేషెంట్లు గోల పెడుతున్నారండీ" అని ఎవరో అరిస్తే.

"డర్టీఫెలోస్, అంతా ట్రాష్ పోగయ్యారు. రేపు రమ్మను" అని విసుక్కున్నారు.

డ్రింకులో యీగపడిందని విసుక్కుని కాంపౌండర్ని పిలిచి దాన్ని పారపోయించి మళ్ళీ తెప్పించారు.

చెట్ల నీడకి వచ్చి మెట్ల మీద చతికిలబడ్డాడు వరదరాజులు.

రెండు గంటలు దాటినా ఆటముగిసే సూచనలు కనిపించలేదు. ఒక్కొక్కరే రోగులందరూ వెళ్ళిపోయారు. టిఫిన్లు పట్టించుకుని లోపలికి వెళ్ళాడు కాంపౌండరు.

మాంఛి నిగాలో వుంది ఆట.

"డాక్టరుగారున్నారా?" గుమ్మం దగ్గరికి వచ్చాడు.

మెల్లగా పైపు పీలుస్తూ మేడమీదకి పాకుతున్నారు సుందరేశంగారు.

గొంతువిని వెనక్కి తిరిగి "ఓహ్ నువ్వటోయ్" అన్నారు.

"నేనేనండి"

"సాయంకాలం వస్తావా మాట్లాడుదాం?"

అంకుశంతో పొడిచినట్టనిపించింది. గుమ్మందాటి లోపలికి వచ్చాడు వరద. నిలువునా వణికిపోతున్నాడు.

"మాట్లాడ్డానిక్కాదండి రెండు మాటలు చెప్పిపోదామని వచ్చాను"

"చెప్పయితే"

"రెండు నెలల బిల్లూ మీకు సమయానికి యివ్వలేకపోయాను. క్షమించండి. కానీ యీ మధ్యే క్రాసువర్డు పజిలుకి డబ్బుకట్టాను. బహుశా లక్షాయాభైవేలు రావచ్చు. ఆ డబ్బు వస్తే ఓ బంగళా కట్టిద్దామనుకుంటున్నానండి. అప్పుడు మా 'కుక్క' నోటికి అయిదువేలు చెక్కు తగిలించి మిమ్మల్ని పిలిపిస్తానండి, వచ్చి వైద్యం చేద్దురుగాని. నమస్కారం"

ఎప్పుడు వీధిలోకి వచ్చాడో, ఏం చేస్తున్నాడో తెలీకుండా వూరు చివరివరకూ నడిచి వచ్చేసాడు.

సాయంకాలపు నీడల్లో స్మశానపు పొలిమేరల దగ్గర తెలివి తెచ్చుకుని "యిలా వచ్చేనేవిటి నేను?" అనుకున్నాడు.

వొళ్ళంతా నొప్పిగా జ్వరం వచ్చినట్లుంది. కాళ్ళు రెండూ రక్తం దిగి బరువెక్కిపోయాయి. నుదురు నెప్పితో లేచిపడుతోంది.

ఇల్లు చేరేసరికి రాత్రి ఎనిమిదయింది.

వసారాలో గోడకి చేరబడి కూర్చున్నది నీలవేణి. దగ్గరగా ముడి చుట్టుకుని, తలలో బంతిపువ్వుల్ని మెట్లెక్కి వసారాలో ఆగిపోయాడు వరద. రోజంతటి ఆయాసం ఆమె అందంలో మూర్ఛపోయింది.

గన్నేరు చెట్టు నీడలో వున్న వ్యక్తుల్ని పోల్చుకోలేకపోయాడు.

"నమస్కారం సాబ్" ఖాసిం వెలుగులోకి వచ్చాడు.

పదేళ్ళు పక్క యింట్లో వుండి, అద్దె యిచ్చుకోలేక వూరవతలి కొంపల్లోకి పోయాడు ఖాసిం. ఉద్యోగం పోయింది. అక్కడా, యిక్కడా వొళ్ళు వంచి రోజులు గడుపుతున్న మనిషి. వరదరాజులంటే అతనికి తగని గురి.

ఇప్పుడతని నీడలో వున్న మనిషిని గుర్తుపట్టాడు వరదరాజులు. నీలవేణి దీపం పెద్దది చేసి దూలానికి తగిలించడంతో అమీనా ముఖం స్పష్టంగా కనిపించింది.

ఏడాది క్రితం చూసిన కంటే బాగా పెరిగింది అమీనా.

ముట్టుకుంటే శరీరం ఎర్రబడుతుందా అన్నట్లు పల్చగా రక్తంపై పొరలో కదులుతున్నట్లు నాజూగ్గా వుంది. సిగ్గు ఆమెకి ప్రత్యేకమైన అందం.

"ఏం? ఖాసిం. కులాసాయేనా?" అన్నాడు కుర్చీ లాక్కుని.

ఇరవయ్యేళ్ళుగా స్థిరపడిపోయాడు ఖాసిం యిక్కడ. అందరికంటే తెలుగు బాగానే మాట్లాడతాడు.

"కులాసాయేనండి"

"ఏమిటివాళ? కూతురుతో సహా వచ్చావ్?"

"మాట వినడం లేదండి యిది. మీతో చెప్దామని లాక్కొచ్చాను" సిగ్గుపడింది అమీనా. తండ్రిని వెనక్కు లాగింది.

"చుప్" అని కసురుకున్నాడు ఖాసీం. మంచు బిందువు పడ్డపువ్వులా కుంచుకుపోయిందామె.

"డబ్బు లేకపోయినా దీని చదువు యింతవరకూ యిాద్చానండి. ఇంక నా తరంకాదండి"

నీలవేణి స్తంభానికి చేరబడి చీకట్లోకి చూస్తోంది.

అమినా తండ్రి వెనక నిలబడ్డది.

ఖాసిం ఆగి ఆగి మాటలు అంటున్నాడు. "నాకు వుద్యోగం కూడా లేదండి. కుట్టుపని చేస్తున్నాను. చదువు చెప్పించమని కూచుంది"

"అవునా అమీనా!?" అన్నాడు వరదరాజులు.

అమీనా మరీ సిగ్గుపడింది. మనిషంతా తగ్గిపోయి మరీ చిన్నదయి తండ్రిచాటున ఒదిగిపోవాలనుకుంది. ఆ ప్రయత్నంలో ముఖమంతా ఎర్రబడింది.

తడబాటు గుర్తించి నీలవేణి నవ్వుకుంది. "పెళ్ళి చేసెయ్. కష్టం వుండదు" అంది. "అదే మంచిది" అన్నాడు వరద.

"పెళ్ళి చేసుకోదటండి. అయినా యిప్పుడు డబ్బు కూడా లేదు. ఎవడో నవాబుని కానీ చేసుకోదు యీ రాణి."

"అయితే చదువుతావా యింకా?"

"అదేనండి గొడవ"

"నువ్వు కాదు. ఆమెని చెప్పనీ"

"చెప్పు" అని ఆమెను ముందుకు తోసాడు ఖాసిం. నేలమిద గుండ్రంగా కాలుముడుచుక్కుచుంది అమీనా. అందాన్ని కుప్పపోసినట్లు, వెన్నెలరూపు దాల్చినట్లు కనిపించింది.

"చదువుతావా?"

తలూపింది.

"అలా సిగ్గుపడితే ఎవడు పెళ్ళిచేసుకోడు"

మాట్లాడలేదామె.

"చదివించు ఖాసిం. ఉత్సాహాన్ని చంపకూడదు మనం. ఇప్పుడు నువ్వుకాదంటే తల్లితండ్రుల మీద ఓ దురభిప్రాయం కలుగుతుంది. ఈ వయస్సులో మనసుకి తగిలిన దెబ్బ జీవితాంతం పీకుతుంది"

అన్నిమాటలూ అర్థంకాకపోయిన మొదటి వాక్యానికి జవాబు చెప్పాడు ఖాసిం.

"డబ్బులేదండి. చెప్పించాలనే వుంది - అమ్మలేదు గదా అని దీనిమీదే నా ప్రాణం"

డబ్బు పేరు వినగానే రక్తం పొంగింది. రోజంతా కళ్ళముందు కదిలింది. బలరాందాసు గారూ, డాక్టరుగారి నిర్లక్ష్యం, కాంపౌండరు విసుగుదలా, రామ్మూర్తి అసహాయత, అమీనా స్తబ్దత, అన్నీ వెయ్యి రూపాల్లో అతని కళ్ళముందు తిరిగాయి.

డబ్బు, డబ్బు డబ్బు.

మంచినీ, అదృష్టాన్నీ, సంతోషాన్నీ పడికట్టు రాళ్ళు వేసి సంతలో తూచి అమ్ముతోంది ప్రపంచం. డబ్బు పోసి ఎవరన్నా దాన్ని కొనుక్కోవచ్చు.

తొందరగా అర్థంలేని వేగంతో రక్తమంతా వరద మెదడులోకి పాకింది. కణతలు తెలీని క్రోధంతో, పగతో వుబ్బాయి.

నీలవేణి స్థంభంతో కలిసిపోయి రాయి అయిపోయింది.

శిక్షననుభవించడానికి తలవొంచిన నేరస్తునిలా కనిపించింది అమీనా.

డబ్బుగోడల మధ్య క్రిందికి, క్రిందికిపోయే ప్రపంచాన్ని పిచ్చి భ్రమతో చేసే పిచ్చి అమీనా

"రేపే కాలేజీలో చేర్పించు ఖాసిం. చదువు పూర్తయ్యేవరకు నా సగం జీతం యిస్తూంటాను. చదువు మాత్రం మాన్పించకు."

దిగ్భ్రాంతి చెందిపోయాడు ఖాసిం. నీలవేణి తెల్లబోయి అతన్ని చూసింది.

ఏదో చెప్పాలనుకున్నాడు ఖాసిం.

"ఇంకేం చెప్పకు. చీకటిపడింది వెళ్ళు. ఫస్టు తారీకున కనిపిస్తే మొదటి జీతం యిస్తాను" అని లేచి లోపలికి నడిచాడు వరద.

నీలవేణి దీపం తీసుకుని లోపలికి వచ్చేసరికి పీట వేసుక్కూచున్నాడు వరద.

ఒళ్ళు మరిచి నిద్రపోతోంది గులాబి.

ఒక్కమాటయినా అనకుండా వడ్డించింది నీలవేణి.

చల్లగాలిలో మంచం మీద పడుకుని "ఇవాళ చాలా విచిత్రమయిన రోజు" అనుకున్నాడు వరదరాజులు.

4

మర్నాడు కాస్త ఆలస్యంగా లేచాడు వరదరాజులు.

గులాబిని పలకరించబోతే "నిన్నరాత్రి ఖాసింతో అన్నమాట నిజమేనా అన్నయ్యా?" అంది.

ఏమిటి?"

"జీతంలో సగం యిస్తాననడం"

"నీలవేణి చెప్పిందా?"

"అప్పటికి నేనింకా నిద్రపోలేదు"

ఎంతోసేపటి వరకు మాట్లాడలేదతను. రాత్రి ప్రశాంతత అంతా కొద్ది కొద్దిగా మాయమవుతోంది.

మబ్బు వేసిన ఆకాశం నల్లగా వుంది. రొజ్జగాలి కిటికీలోంచి దూకుడుగా వీస్తోంది. కిటికీ తలుపులు మూసి ఆ నీడలో నిలబడి అన్నాడు.

"అమీనా మొహం చూశాక వూరుకోలేకపోయాను. ఇప్పుడు కాదంటే బావుండదు."

"మరి మనం బ్రతకడం?"

"ఒక్క డబ్బేనా బ్రతకడానిక్కావలసింది? మంచితనం, నిజాయితీ"

మాట పూర్తికాకుండానే నవ్వి అటు తిరిగి పడుకుంది గులాబి.

అతని మనస్సు కలుక్కుమంది.

వంట యింట్లోకి వచ్చి నీలవేణికి ఎదురుగ్గా గుమ్మం మీద కూచున్నాడు. రాత్రి నుంచి ఒక్కమాట మాట్లాడలేదామె. నిశ్శబ్దంగా గ్లాసు అందించింది.

"అలవాట్లన్నీ మానేస్తానిక. రేపట్నుంచీ బీదవాణ్ణి"

నీలవేణి మాట్లాడితే బావుణ్ణనుకున్నాడు.

"ఓ మంచి పని చెయ్యడానికి ఓర్పు చాలా అవసరం మరి"

"...."

"ఏం, నే చేసింది తప్పా?"

"తప్పే!"

గ్లాసు పట్టుకు ఆగిపోయాడు వరద.

"ఇందులో తప్పేముందీ, చెప్పు పోనీ"

నీలవేణి ముఖం ఎర్రబడింది. "ఒకరికి సహాయం చెయ్యడమంటే యిదికాదు. ఇది పిచ్చితనం. గొప్పతనం కోసం, కీర్తికోసం, బికారి వేషం వేయడం అసహ్యం."

"గొప్పతనం కోసం కాదు నేనీ పని చేసింది" కారణం చెప్పుకోలేని ముద్దాయిలాగ, వుదాసీనంగా అన్నాడు.

"మరి, అమీనాను సంతోషపరచడానికా?"

మనస్సుకి ఎక్కడో తగలాల్సిన చోట తగిలిందామాట.

నవ్వింది నీలవేణి, ఎంతకీ సమాధానం రాకపోయేసరికి.

"ఎందుకు చేస్తున్నారో, ఏం చేస్తున్నారో తెలీకుండా చేశారన్నమాట అంత త్యాగం"

నిర్ఘాంతపోయాడు వరద.

"అంతకంటే చేతులు ముడుచుక్కూచుని నాకేం చేతకాదనడం నయం"

"నీలవేణీ!" అరిచాడు వరదరాజులు.

ఆమె తుళ్ళిపడింది. ఆ కంఠంలోని కర్కశత్వం, ఉద్విగ్నత ఆమెను భయపెట్టాయి.

స్త్రీ సహజమైన పిరికితనంతో ఏదో పని కల్పించుకుని అక్కడి నుంచి లేచిపోయింది.

అదే సమయంలో బయట నుంచి రవణ పిలిచాడు.

మనిషి నిలువుగా దిగజారిపోయాడు వరదరాజులు. తన బలహీనతల స్వరూపాన్ని ఆమె మాటలు చక్కగా కూర్చి చూపాయి. వరదరాజులు బయటికి వచ్చాడు రవణమూర్తి పిలుపుతో.

అప్పటికే కుర్చీ బయటవేసి మాయమయింది నీలవేణి. కొత్త వ్యక్తిని చూసి ఆశ్చర్యపడ్డాడు రవణమూర్తి.

వరద ముఖంలో స్తబ్దత చూసి భయపడ్డాడతను.

"ఏం వచ్చావు?"

"నిన్న వుదయం నుంచీ సుజాతకి ఎక్కువయింది ఆయాసం. ఉండుండి స్పృహ తప్పుతోంది."

వరద మాట్లాడలేదు.

"ఏం చెయ్యాలో తోచక భయమేసి యిలా పరిగెత్తుకు వచ్చాను"

"ఏం కావాలో చెప్పు" చాలా మామూలుగా అడిగాడు వరద.

నీలవేణి యిల్లు తుడుస్తూ తలుపు దగ్గర ఆగింది ఆ మాట విని, ఇది గమనించాడతను.

రవణ యీ మాటలికి విస్తుపోయాడు. ఎప్పుడూ అలాంటి ప్రశ్న వేయలేదు వరదరాజులు.

"నాకేం తెలీదు నువ్వే అంతా చూడాలి" అన్నాడు రవణ తలవొంచుకుని.

నీలవేణి ఆకు పచ్చరంగు చీరె తలుపు చాటు నుంచి యింకా కనిపిస్తూనే వుంది వరదకి.

ఏదో తెలీని కఠినత్వంతో అన్నాడు "అందరికీ సహాయం చేస్తూ కూచోలేను నేను. డబ్బు నా దగ్గర అసలు లేదు. తర్వాత నీ యిష్టం"

మరీ నీరసించి జీవం లేని కొయ్యలా తయారయాడు రవణమూర్తి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. ఎక్కడో లోతున నీడల్లో కళ్ళూ, నల్లబడి మొద్దుబారిన పెదాలు, శల్యంలా మిగిలాడు రవణ.

ఈ మాటల్తో మిన్ను విరిగింది. సిగ్గుపడ్డాడు. వరద చాలా మారిపోయినట్టు తోచింది. లేచి వెళ్ళబోయి అంతలో ఆగాడు.

"హైదరాబాదు శానిటోరియంకు తీసుకువెళ్ళాలనుకున్నాను. నువ్వు వుంటే బావుంటుందనుకున్నాను"

అప్పటికీ వరదలో చలనం లేకపోయేసరికి హతాశుడై వెళ్ళిపోయాడు రవణమూర్తి.

లోపల ఏదో ఫోటో నేలపడి విరిగింది.

కుర్చీలో కూలబడ్డాడు వరద.

గాజుముక్కలన్నీ పోగుచేసి పారేసి వచ్చింది నీలవేణి.

వసారాలోకి రాగానే "ఇలాగేనా బ్రతికేది మనిషి?"

"..."

"ఎదుటివాడు చస్తున్నా సరే రాయిలాగా కదలకుండా కూచోడం మంచి పాఠమే నేర్పావు"

చకితురాలయి చూసిందామె.

"క్షమించండి. మీలాంటి వాళ్ళతో చెప్పడం నాదే తప్పు. నా మీద కోపం అతని మీద తీర్చుకుంటే ఏం లాభం? ఆయన చెల్లెలు నిజంగానే ఆపదలో వుందేమో? వెళ్ళి సహాయం చెయ్యండి" అని వెళ్ళిపోయింది.

రవణమూర్తి విషయం తల్చుకునేసరికి మనస్సు చెదిరింది. వాడికి మరో ఆసరా అంటూ లేదు. కుర్రాడిలాగ, కష్టం వస్తే తన దగ్గరికి పరిగెత్తుకు వస్తాడు.

చిన్నబుచ్చుకుని వాడిపోయిన ముఖం వరదని మరీ కదిపింది. వెంటనే లేచి వాడి యింటికి బయల్దేరాడు.

ఆ సాయంకాలమే సుజాతను తీసుకుని రవణమూర్తితో కలిసి హైదరాబాదు బయలుదేరాడు వరదరాజులు. సీతారామమ్మగారు ఒంటరిగా యింట్లో వుండిపోయారు.

"డాక్టరు విషయం?" అంది నీలవేణి.

"రేపటినుంచీ సరిగ్గా వచ్చి మందు వేస్తాడు" అన్నాడు వరదరాజులు.

రామ్మూర్తి మధ్యాహ్నం వస్తే "రేపు బలరాందాసు దగ్గరకు వెళ్ళండి. ఉద్యోగం యిస్తాడు. నేను వచ్చాక విషయాలన్నీ చక్కబడేట్టు చూస్తాను" అన్నాడు.

ఇప్పటికి ఓ తరహా నిబ్బరం కలిగిందతనికి - ముఖ్యంగా నీలవేణి మాటల్తో.

నిశ్చింతగా రాత్రి రైలెక్కాడు వరదరాజులు.

**వచ్చిన నాలుగురోజులకి స్థిమితం** చిక్కింది సుజాతకి.

బలహీనంగా నల్లటి రెప్పల్ని కదల్చి "మీరూ వచ్చారా?" అంది ఎదురుగ్గా నిలబడ్డ వరదని చూసి.

"వచ్చాను, ఇప్పుడెలా వుంది?"

"ఒళ్ళంతా తేలిపోతున్నట్టుంది. లేచి నడవగలిగితే బావుణ్ను."

"అలా అనిపిస్తుందేకానీ నీరసం లేవనీయదు. పడుకో" అన్నాడు వరద మంచానికి దగ్గరగా కుర్చీ లాక్కుంటూ.

"మీకు కోపం వచ్చిందని చెప్పాడు అన్నయ్య"

సిగ్గుపడ్డాడు. "అదేం లేదు ఇద్దరం కలిసే వచ్చాం. వాడు బజారుకి వెళ్ళాడు పాలు త్రాగుతావా?"

తలూపింది.

నర్సుని పిలిచి గ్లాసు తెప్పించేసరికి మళ్ళీ నిద్రపోయింది.

కిటికీ తలుపు తీసేసరికి ఎండ గదిలో పొడవుగా పడింది.

శానిటోరియం ఆవరణంలో ఎదురుగ్గా కనుచూపు మేర వరకూ పెద్ద కోనేరు కనిపిస్తోంది. చుట్టూ అంచు కట్టినట్లు పిచ్చి మొక్కలు పెరిగాయి. దూరాన తాటితోపు వెనుక సూర్యుడు ఎర్రబడుతున్నాడు. మర్రికొమ్మ ఒకటి నీటిలోకి వంగిన చోట చిన్న పడవ ఒడ్డుకి కొట్టుకుంటోంది. సాయంకాలపు ఆకాశపు రంగులు నీలపు నీటిలో నీడలు లేపుతున్నాయి. మెత్తగా వ్యాపించిన యిసకా, చెట్లూ అన్నీ పచ్చబడి ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

ఆ చిక్కటి ఎర్రదనాన్ని చూడలేక సిగ్గుపడి, తన్మయత్వంలో పున్నాగం చెట్టుకి వేలబడింది.

విశాలంగా వ్యాపించిన ఆ ప్రదేశాన్నంతా ప్రకృతి వొళ్ళు విరుచుకు నిద్రపోతున్నట్లుంది.

"మందులక్కర్లేదు. ఇక్కడ కూచుంటే చాలు. మనిషి బాగుపడడానికి" అనిపించింది వరదరాజులుకి.

అల్లంత దూరంలో పిచ్చిగా అల్లుకున్న మొగలి డొంకల దగ్గర ఎవరో కూచున్నట్లు తోచింది వరదకి. రవణమూర్తి వీపు గుర్తుపట్టి ఆశ్చర్యపోయాడు. మెల్లిగా మెట్లుదిగి అటువేపు నడిచాడు.

ఒక్కొక్కటిగా రాయి విసురుతూ స్థిమితంగా కూచున్నాడు రవణమూర్తి. అలికిడి విని తుళ్ళిపడ్డాడు.

"ఓహ్! నువ్వా!" అన్నాడు వరదని చూసి.

"ఇక్కడ కూచున్నావేం వొంటరిగా?"

మాట్లాడలేదు రవణమూర్తి.

"అటు చూడు" అన్నాడు కాస్సేపటికి.

ఏమీ కనిపించలేదు వరదరాజులకి.

మరీ ఒడ్డుకి వున్న కలువపువ్వుకి నల్లటి కండచీమలు పట్టాయి. నీటిని దాటి నేలమీదకు ఓ రేకు వాల్చడం అది చేసిన నేరం. రేకు మీదిగా పాకి మొండెం కొరికేశాయి. మరో క్షణంలోనో, సగంలోనే ఒరిగి నేలమీద పడేట్టు మెల్లిగా వూగుతోంది పువ్వు.

గాలిమాత్రం బలహీనంగా నిట్టూర్పుతోంది పక్కన.

కలువపువ్వు తెగి పడింది. సౌందర్యాన్ని ఆకలి ఆధీనం చేసుకుని అనుభవించింది. మానవత్వాన్ని పాపంలాగా, తెల్లటి కలువపువ్వుని నల్లటి చీమలన్నీ బారులు తీర్చి మోసుకుపోతున్నాయి. ఒడిలిపోయి నీరసించి మెల్లిగా కదుల్తోంది యింకా రేకు విడనిపువ్వు

ఇంత చూస్తున్నాక రవణమూర్తికి మాట పెగల్లేదంటే ఆశ్చర్యం లేదు.

"నాలుగు రోజుల క్రితం చచ్చిపోతే బావుణ్ణనిపించింది. కాని యిప్పుడు మళ్ళీ బ్రతుకు మీద ఆశ కలుగుతోంది" అన్నాడు రవణ చాలాసేపటికి.

తుళ్ళిపడ్డాడు వరద.

పుట్టవరకూ తెచ్చాయే కానీ పువ్వుని లోపలికి తీసుకెళ్ళలేక తికమకలు పడుతున్నాయి చీమలు.

"ఇక సుజీకి భయంలేదు. బ్రతుకు మీద ఆశవుంది. ఏమంటావ్?"

"మరి నాలుగు రోజులు పోతే లేచి గెంతుతుంది. పల్చటి శరీరం కావటం వల్ల గాభరా పెట్టింది."

"లేచిందా మళ్ళీ?"

"పాలు కావాలంది లేచి. తీరా తెచ్చేసరికి నిద్రపోయింది"

"నేను వెళతా" లేవబోయాడు రవణ.

"ఉండు" అన్నాడు వరదరాజులు. "ఆనాడు మా యింటికి వచ్చావు గుర్తుందా? ఆమె గురించి అడగలేదేం?"

విచిత్రంగా చూశాడు రవణమూర్తి "ఎవరు?"

"నీలవేణి"

"అడగాలని తోచలేదు నాకు"

"విశ్వేశ్వరం తెలుసు కదూ?"

"గుర్తుంది. బొమ్మలు వేసేవాడు"

"వాడు తెచ్చి వుంచాడు. మరి నాలుగు రోజుల్లో వచ్చి తీసుకుపోతానని వుంచాడు. ఈ పాటికి వచ్చేవుంటాడు బహుశా"

ఏమీ మాట్లాడలేదు రవణమూర్తి.

"నువ్వొచ్చిన రోజు నిజంగానే నాకు పిచ్చెక్కింది. నీ దగ్గరికి వెళ్ళమని ఆమే పంపింది."

"......"

ఇటు తిరిగేసరికి రవణమూర్తి కనిపించలేదు. దూరాన శానిటోరియం మెట్లమీద సన్నటి నీడలా కనిపించాడు రవణ.

విస్తుపోయాడు వరదరాజులు.

చీకటిపడేవరకూ అక్కడే కూచుని లోపలికి వచ్చాడు.

మరి పదిరోజులకి సుజాత చాలావరకూ కోలుకుంది. డాక్టర్లే ఆశ్చర్యపోయారు. "ఎక్స్‌రే చూసి మొదట భయపడ్డాం, ఊపిరితిత్తులు ఆపరేట్ చేయాలేమోనని. కానీ, సులువుగానే తేరుకుంది" అన్నారు.

సాయంకాలం నడిచి రావటానికి అంగీకరించారు. కోనేటి నీడల్ని చూస్తూ కూచోడం అలవాటయింది ఆమెకి.

పాత ఎరుపుదనం చెక్కిళ్ళలోకి పాకింది. కళ్ళు మెరుపుల్నీ పాత చిలిపిదనాన్ని కూడదీసుకుంటున్నాయి. నవ్వులో యిదివరకటి బలం వచ్చింది.

నాలుగు రోజులు తీవ్రంగా వర్షం కురిశాక లేచిన గడ్డి పరిమళంలాగా ప్రదేశమంతా చుట్టుకుంది ఆమె అందంలో మత్తు.

"మీ అంత అమాయకులుండరండీ. అన్నయ్య పిరికి తనం చూసి మీరూ పరుగెత్తుకు వచ్చారు" అంటోంది సుజాత రాళ్ళు ఒక్కటొక్కటిగా నీటిలో విసురుతూ నీరు వరద ముఖం మీద పడితే కిలకిలమని నవ్వింది.

ఆ పెదాల్ని తెల్లబోయి చూసాడు వరదరాజులు.

"ఇంత అల్లరిపిల్ల మంచం మీద మెలికలు తిరిగి పడుకోడం చూసి జాలివేసి వచ్చాను"

సిగ్గుపడి రెండు చేతుల్తో ముఖం కప్పుకొంది.

"గులాబిని చూడాలని వుందండి" అంది కాస్సేపటికి.

"అబద్ధం. ఇంటికి పారిపోవాలనుందను"

చల్లగాలి వేస్తే నడుం చుట్టూ కొంగు తిప్పి తలమీద కప్పుకుంది.

"ఒక్కోరోజు అన్నయ్యని వదిలి కనబడకుండా పారిపోదామనిపిస్తుంది. మూడురోజుల క్రిందటే బయటపడేదే యీ రోగం. చెప్పకుండా దాచాను. నాకంటే, అన్నయ్య దిగజారిపోవడం చూసి వణుకు పుడుతుంది నాకు. "

సాయంకాలపు నీడల్లోకి రాయి విసిర్తే కొంగల గుంపు బారుగా లేచిపోయింది.

కిలకిలమని నవ్వింది సుజాత.

తనని అబ్బురపడి చూస్తున్న వరదని గమనించి, "ఎందుకండీ అలా భయపడినట్లు చూస్తారు? నాకింకే రోగం రాదు. చూడండి కావలిస్తే" అతని రెండు చేతుల్నీ తీసుకుని తన నుదుటిమీద ఆనించుకుంది.

మూడు ఉత్తరాల్ని చేత్తో పట్టుకువచ్చాడు రవణమూర్తి.

"ఏవిటన్నయ్యా అవి?" రాతిమీద కాలుమోపి అటూ యిటూ ఊగుతూ నిలబడడానికి ప్రయత్నించి కుడివైపు పడబోయి అన్నయ్య భుజం పట్టుకుని నిలబడింది.

"గోవర్ధనరావుగారు శుభలేఖలు పంపించారు. వినతకి పెళ్ళట"

"భలే, భలే రేపే యింటికి పోవచ్చు" శుభలేఖ లాక్కుని జామచెట్టు కొమ్మ దగ్గరకి పారిపోయింది సుజాత.

"ఇంత త్వరలోనా?" అన్నాడు వరదరాజులు.

"నీకూ వచ్చింది శుభలేఖ" మరేవో రెండు వుత్తరాలు అందించి రాయిమీద చతికిలబడ్డాడు.

శుభలేఖలో విశేషం లేదు. శుక్రవారం రాత్రి వినతకి, పెళ్ళి వరుడు కాశీపతి. అదీ వృత్తాంతం. పొడవుపాటి కవరు చించాడు వరదరాజులు.

గోవర్ధనరావుగారు "నువ్వెళ్ళిపోయిన దగ్గర్నుంచి నాకేం తోచటంలేదు. కాశీపతి మారాడు. వినతని మొదట పెళ్ళిచేసుకోనన్నాడు. మొన్న రాత్రి హఠాత్తుగా మేడ దిగి 'రేపు శుక్రవారం పెళ్ళి కానిచ్చేయండి. హైదరాబాదు వెళ్ళాలి' అన్నాడు. తప్పకుండా పెళ్ళికి రావాలి నువ్వు"

ఇదీ విషయం.

తర్వాత వుత్తరం వినత తొందరగా రాసి ముగించింది.

"పెళ్ళికి నువ్వు తప్పకుండా వుండాలి. మొదట నన్ను పెళ్ళిచేసుకోనన్నాడు కాశీపతి. తర్వాత ఏమనుకున్నాడో ఏమో వెంటనే జరిగిపోవాలన్నాడు. నాన్నగారి చేత కూడా వుత్తరం వ్రాయిస్తున్నాను. తప్పకుండా రా. అన్నట్లు సుజాతకి ఎలా వుంది?"

కాగితం తిప్పి వెదికాడు యింకేమన్నా వ్రాసిందేమోనని, ఈ నాలుగు వాక్యాలూ తప్ప యింకేవీ లేవు.

ఉత్తరాల్ని జేబులో వుంచుకుంటూ "ఏం చేద్దాం?" అన్నాడు రవణ వేపు తిరిగి.

ఎండుపుల్లతో నేలన గీతలు పెడుతున్నాడు రవణ.

"రెండు అచ్చుతప్పులున్నాయండోయ్" అంది సుజాత శుభలేఖ పట్టుకొచ్చి ఇసుకలో కూచుని "చూడండి 'కాశింపతి' అని వేశారు. ఈవిడ పేరు 'వినతమ్మ'" నవ్వి గాలిలో ఎగరేసింది కార్డుని, చక్రంలా తిరిగి తిరిగి నీటిలో పడి తేలింది. చప్పట్లు చరుస్తూ నవ్వింది సుజాత.

"చల్లగాలి వేస్తోంది. లోపలికి పద సుజీ" అన్నాడు రవణ.

"ఏమండీ రేపు వెళ్ళిపోదామా?" అంటోంది సుజాత.

"విండ్ బావులేదు మిష్టర్. యిలా చీకటిపడేవరకూ పేషెంటుని పైన వుంచేస్తే రేపట్నుంచి పర్మిషన్ యిచ్చేదిలేదు" అని విసుక్కుంటూ వచ్చింది స్టాఫ్ నర్సు. ముగ్గురూ లేచారు.

"ఇంక మాకు పర్మిషన్‌తో పనిలేదండీ. రేపే వెళ్ళిపోతున్నాం కదూ అన్నయ్యా?" నర్సు భుజం మీద చెయ్యేసి ముందుకి నడిచిపోయింది సుజాత.

వరద ఆమె వేపే చూస్తున్నాడు.

"నువ్వు వెళ్ళు. సుజీకి పూర్తిగా రిలీఫ్ ఇచ్చేవరకూ నేను రావడం బావుండదు. అదీగాక నేను వచ్చేస్తే బాధపడుతుంది. అల్లరి చేసి నర్సులందరి ప్రాణం తీస్తుంది."

"ఇద్దర్నీ బయలుదేరి రమ్మన్నాడు గోవర్ధనరావు గారు"

"ఎలా మరి? పరిస్థితులన్నీ చెప్పు. ఈసారి ఎప్పుడయినా వినతకి ఉత్తరం వ్రాస్తాను"

"సరే అయితే. రేపు ఉదయం బయల్దేరుతాను" అన్నాడు వరదరాజులు. శానిటోరియంలో లైట్లన్నీ వెలిగాయి.

అడవి మధ్య దేవుడి మందిరంలాగా చీకట్లో వెలిగింది తెల్లటి భవనం.

రాత్రి పెళ్ళనగా సాయంకాలం బండి దిగాడు వరదరాజులు.

వచ్చేసరికి అప్పుడే యింట్లో హడావుడి చేస్తోంది గులాబి.

"అడుగో అన్నయ్య వచ్చేశాడు. నీలిరంగు చీరె బావుంటుందా, చిలక ఆకుపచ్చ బావుంటుందా నా వొంటికి? చెప్పన్నయ్యా"

పెట్టెమీద కూచుని చుట్టూ చీరలు పరుచుకున్న గులాబిని ఆశ్చర్యంతో చూస్తోంది నీలవేణి.

"ఏమిటిదంతా?"

"రాత్రి వినత పెళ్ళి. నీకు కబురు పంపలేదూ? ఉత్తరం వ్రాయించానందే వినత"

"ఇక్కడికి వచ్చిందా?"

"మొన్న సాయంకాలం కబురుపంపింది. నీకు శుభలేఖ పంపినట్టు చెప్పింది. నువ్వొస్తావని కూడా చెప్పి పంపింది. చెప్పు మరి. చిలక ఆకుపచ్చ రంగు చీర కట్టుకోనా?"

"విశ్వేశ్వరం వచ్చాడా?" నీలవేణిని వుద్దేశించి అన్నాడు వరదరాజులు.

"రాలేదన్నయ్యా. వచ్చినా ఇప్పుడప్పుడే పంపేది లేదులే. చెప్పు. యీ చీర"

"అదే బావుంటుంది నీ వొంటికి" మాట తప్పించుకుందుకు అనేశాడు. పెట్టెలోని తువాలు తీసుకు స్నానానికి వెళ్ళాడు.

చీకట్లో పెరట్లో జరగబోయేసరికి నీలవేణి దీపం తెచ్చి గది గుమ్మం దగ్గర నిలబడింది.

"అబ్బ, బరువమ్మా యీ చీర" అనుకుంటోంది గులాబి.

"విశ్వేశ్వరం వస్తాడనుకున్నాను" నీళ్ళు గుమ్మరిస్తూ అన్నాడు.

మాట్లాడలేదామె. ఏం ఆలోచిస్తోందో యేమో తలుపుకు చేరబడి అలానే నిలబడింది.

వంటిమీద చల్లటి నీళ్ళు పడేసరికి నరాలన్నీ తిరుగుబాటు చేశాయి. రక్తంలోంచి వేడి కదిలి మెదడుకు పాకింది. కళ్ళు మూసుకున్నాడు.

నూతిగట్టు మీంచి కప్ప ఒకటి గెంతింది. తుళ్ళిపడ్డాడు.

తల తుడుచుకుంటూ లోపలికి వచ్చేసరికి తెల్లటి చీర కట్టుకుని తలదువ్వుకుంటోంది గులాబి.

నవ్వుకున్నాడు వరద.

"చూశావన్నయ్యా? నీలవేణి రాదట పెళ్ళికి"

ఆగిపోయాడతను "అదేం?"

"తనని ప్రత్యేకంగా పిలవలేదని కోపం కాబోలు అమ్మాయిగారికి"

దీపం పెద్దది చేసి స్టూలు మీద వుంచుతోంది నీలవేణి.

"అయితే అందరం మానేద్దాం. ఒకరు వెళ్ళి ఒకరు మానేస్తే బావుండదు"

"మీరు వెళ్ళండి నేనెందుకు?" అంది తలుపు పట్టుకు నిలబడుతూ.

"వెళితే అందరూ వెళ్ళాలి. లేకపోతే అందరూ మానేద్దాం" అంది గులాబి.

"వస్తుందిలే. అన్నం వడ్డించు."

"వేగం బయల్దేరాలన్నయ్యా. ఏదో నాటకం వుందిట" నేను రెడీ. నీలవేణి వడ్డించాలి బర్మాముడిలో పిన్నులు గుచ్చుతూ అంది.

నీలవేణి ఊదారంగుచీర కట్టుకు తయారయింది. సాత్వికతలోంచి అందం పుట్టినట్లు, చీకటిలోకి విసిరిన వెలుగు చీలికలాగ కనిపించింది. తక్కువతన్నాన్నీ, నిరాడంబరతనీ తలలో తురుముకున్నట్లు తోచింది. ముఖ్యంగా నుదుటిలోతులో నీడ కొత్త అందాన్నిచ్చింది.

ఇల్లు చాలదని ట్రావెలర్సు బంగళా అద్దెకి తీసుకున్నారు గోవర్ధనరావుగారు.

ముగ్గురూ జట్కా దిగేసరికి బంగళా అంతా నిశ్శబ్ధంగా వుంది. పైన రెండు కుక్కలు ఒకదాన్నొకటి కరుచుకుంటున్నాయి. స్తంభాలకి కట్టిన ఆకుల్ని నవుల్తోంది ఆవుహౌహటి.

అంతా నిశ్శబ్ధంగా నిద్రపోతున్నట్లుంది బంగళా.

"ఇలా దయచేయండి సార్. హాల్లో నాటకం జరుగుతోంది" అని వున్నట్లుండి ఎవరో పలకరించారు. ఆ మాటలన్న వ్యక్తిని గుర్తుపట్టలేకపోయాడు వరద. తెల్లగా పొడుగ్గా వున్నాడు. ఖద్దరు పాంటూ, మెడ దాకా పట్టిన కోటూ వేసుకున్నాడు. భుజాల్ని కిందకు లాగేస్తున్నంతటి బరువుతో పెద్ద సంచీ వుంది చేతిలో.

మనుషుల్ని మనుషుల్లాగా కాకుండా పేకముక్కల్ని తిరగేసినట్లు తిప్పుకుపోతున్నాడు. ఎప్పుడీమాట అన్నాడో, ఎక్కడికి మాయమయాడో తెలీదు. హాలువేపు వేలు చూపించి 'పోతున్నా' అని అరిచి మేడమెట్లు మీదికి నడిచాడు.

హాల్లో ఏదో సంగీతం సన్నగా వినిపిస్తోంది. ఓ మూల ఎత్తుస్టేజి వేశారు. అప్పటికే ఏదో నాటకం జరుగుతోంది. హాలంతా చీకటిగా వుంది.

ఆరువందల అడుగుల క్రిందకి గనుల్లోకి దిగినట్లు వేడిగాలి హాల్లోంచి వస్తోంది. లోపలంతా నేలమీద మనుషుల ఆకారాలు మాత్రం కనిపిస్తున్నాయి. ముగ్గురూ వచ్చి ద్వారం దగ్గర ఒదిగి నిలబడిపోయారు.

'భోదిసత్వుడి' చరిత్రలో ఏదో అంకం వేస్తున్నట్టు వున్నారు. యశోధరాదేవి భర్త వెళ్ళిపోయాడని తెలీడంతోటే స్త్రీ సహజమయిన బలహీనతతో ఏడుస్తోంది.

సన్నగా, వేరు బలంగా లేని చెట్టు పెరుగుదలలా వుంది యశోధర. రొమ్ముల్ని మరీ అసహ్యంగా బిగించి ముడివేసారు. మీదికి ఎత్తుగా దువ్వికట్టిన జుత్తు వైశాల్యంలో ముఖం ఏదో కనిపించకుండా పోయింది. చెక్కిళ్ళ ఎరుపుదనం కనిపించనంతటి వెడల్పాటి నోరు, బలంగా కొనదేలిన ముక్కు, ఏదీ స్పష్టంగా కనిపించకుండా అలికేసినట్లుంది మొహం. కొడుకుని భుజానికి ఆనించుకుని రచయిత కవిత్వం సహాయంతో ఏడుస్తోంది. ఆమె దుఃఖంలో దైన్యత కంటే, విరహం భరించరానిదిగా వుంది. మాటిమాటికీ నీలిరంగు లైట్లనే గమనిస్తూ విరహోత్కంఠితలాగా విలపిస్తోంది.

"ఛీ! ఖర్మం పైన నిలబడదామన్నయ్యా. గాలయినా వేస్తుంది" అంది గులాబి విసుగ్గా.

విలపించే యశోధరలో వుండుండి చైతన్యం కలుగుతుంది. హఠాత్తుగా స్తబ్దురాలవుతుంది. కొడుకు సొమ్మసిల్లి నిద్రపోయాడు. సన్నగా లేచే సోమరిగాలి తెరలలో తరంగాలు లేచి రేకలలాగ భావిష్యత్తంతా కళ్ళముందు మెదులుతుంది. ధ్యాన నిష్టలో వున్న బుద్ధుడు. వెర్రి ఆనందంతో, కళ్ళు చెదిరించే వెలుగుల్ని చూస్తూ అతని కాళ్ళ దగ్గర నిలబడ్డ ప్రపంచాన్ని చూస్తుంది. అతని ముఖంలో తేజస్సు, తెలీని మెరుపు, వెలుగు చీకటలు సంకలనంతో మెరిసే కన్నులు, జ్ఞానంతో వొళ్ళుమరిచి, స్పృహ తప్పిన భర్తను చూసి నివ్వెరపోతుంది. తనకు తెలీకుండానే లేచి నమస్కరిస్తుంది.

వెనక కిన్నరీ రమ్యకంఠాలు జీరవోయిన గొంతుల్ని ఏకస్థం చేసి, పలుకుతున్నాయి.

"బుద్ధం శరణం గచ్ఛామి

ధర్మం శరణం గచ్ఛామి

సంఘం శరణం గచ్ఛామి"

ఈ ఝురులమధ్య పరవశంతో, ఆనందంతో, ఆశ్చర్యంతో, మూగవోయిన మనస్సుతో తెలికయి సొమ్మసిల్లిపడిపోతుంది యశోధర.

తెలివితెచ్చుకుని చూసేసరికి నిజంగానే పక్కమీద భర్త కనిపించాడు. కొడుకు నిద్రపోతూంటాడు.

"అయ్యో! నా అదృష్టమా?" అనుకుంటుంది.

ఇదీ ఇతివృత్తం.

నాటకం అంతట్లోకి బుద్దుడు మాత్రం నిండుగా, గంభీరంగా కనిపించాడు. నాటకం మధ్యలో నిద్రపోతున్న కుర్రాడు లేచి కేరుమన్నాడు. యశోధరకు ముందుగానే మూర్ఛవచ్చింది. ఇలా అవకతవకగా ముగిసింది నాటకం.

ఒక్కసారి లైట్లన్నీ వెలిగాయి. ఎవరికీ ఆ వెలుగులో కళ్ళు కనిపించలేదు. చెమటతో అంతా తడిసి ముద్దయ్యారు.

ఎవరికి తోచిన కుర్చీలు వాళ్ళు మోసుకుని అంతా పై వసారాలోకి వచ్చేశారు క్షణంలో హాలంతా ఖాళీ అయిపోయింది.

హాలు చివర ఎవరినో చూసి "అదిగో విజయ" అని అరుస్తూ నీలవేణి చేయిపుచ్చుకుని బరబరా యీడ్చుకుపోయింది గులాబి.

ఒక్కసారి స్థిమితంగా గాలిపీల్చుకున్నాడు వరదరాజులు.

వసారాలో నాలుగు గుంపులుగా అతిథులంతా విడిపోయారు.

తనకి తెలిసిన ముఖం ఒక్కటీ కనిపించకపోయేసరికి స్తబ్దుడై స్తంభానికి చేరబడి నిలబడిపోయాడు వరదరాజులు.

ఎక్కడినుంచి పసిగట్టారో, పరుగెత్తుకుంటూ వచ్చిపడ్డారు గోవర్ధనరావుగారు..

"నాకు తెల్సునోయ్ నువ్వు వస్తావని. మరో నిముషం ముందు రావలసింది. బ్రహ్మాండమయిన నాటకం చూద్దువు" భుజం మీద చెయ్యేసి నడుస్తూ అన్నారు గోవర్ధనరావుగారు.

"చివరి క్షణాల్లో వచ్చానండి"

తలనెరిసిన మరి అయిదుగురు నేలన పరిచిన తివాసీ మీద ఆసీనులయి వున్నారు. అక్కడికి తీసుకొచ్చి "కూచోవోయ్" అన్నారు.

ఓ మూల చోటు చేసుకు కూచున్నాడు వరదరాజులు. అందులో ముగ్గురు మాత్రం తనకి తెలుసు. ఇరవై యేళ్ళు గవర్నమెంటు ప్రాసిక్యూటర్ పనిచేసి రిటైరైన కృష్ణశాస్త్రిగారు, మరో సంవత్సరంలో రిటైరు కాబోతున్న ఇంగ్లీషు లెక్చరరు వేదాంతంగారు, మూడో వ్యక్తి రిజిస్ట్రారు ఆఫీసులో హెడ్ గుమాస్తా జోగినాయుడుగారు. మిగతా యిద్దర్నీ పరిచయం చేశారు గోవర్ధనరావుగారు.

"ఈయన మా అన్నగారు. చెంగ్రలావుగారి పేరు వింటే కర్నూలంతా హడల్. సబిన్స్పెక్టరు చేసి రిటైరయారు" అన్నారు. నిండుగా, ముగ్గురుకి సరిపోయే స్థలంలో మఠం వేసుకుని ఠీవిగా కూచుని దేశీ చుట్ట వెలిగిస్తున్నారాయన.

"ఈ కుర్రవాడు వరదరాజులున్నాడే చాలా మంచివాడు. చెప్పుకోదగ్గ బుద్ధిమంతుల్లో ఒకడు" అని గోవర్ధనరావుగారు పరిచయం చెయ్యడంతోటే భ్రుకుటి ఓసారి ముడిచి వరదరాజుల్ని సగం చూపు చూసి "ఇతనేనేవిటి నువు చూపిస్తానన్న నలుసు?" అన్నారు చెంగ్రలావుగారు నిర్లక్ష్యంగా.

చెంగ్రలావుగారి కనురెప్పలు మరీ దళసరయి చూస్తున్నా చూడనట్టే తయారయాయి. ముప్పై ఆరేళ్ళ సర్వీసులో ప్రతీసారీ దొంగల్ని చూసే చూపే అలవాటయిపోయింది. కనుబొమ్మలు ముడత పడడం చూసిన వాడికి నిజంగానే దడ వస్తుంది.

ఆయన ప్రశ్నకి అవునని తలూపారు గోవర్ధనరావుగారు.

అయిదో ఆయన ముభావంగా గోడకి చేరబడ్డాడు. "ఈయన ఇస్రాయేలుగారు, క్రిస్టియను. తెలుగు కవిత్వం మా చక్కగా చెప్తారు" అన్నాక నిండైన నవ్వు నవి యిటు తిరిగేవారాయన.

"నాటకం చూసారా" అన్నారు ఏదో మాట కదిపే ఉద్దేశ్యంతో.

"లేదండి, చివరి సంభాషణలు జరుగుతూండగా వచ్చాను."

"అయితే యింకేం? ఆయువుపట్టు చూసేశారన్నమాట. అన్నమంతా పట్టి చూడాలటండీ? మీ అభిప్రాయమేమిటి?"

వరద చెప్పడానికి తటపటాయించాడు.

ఇంగ్లీషు లెక్చరరుగారు జోక్యం చేసుకుంటూ యిటు కదిలి కృష్ణశాస్త్రిగారితో "నేను చెప్పాను కదండీ. చివరికి వచ్చేసరికి టెంపో నీరు కారిపోయింది. షేక్స్పియరియన్ ట్రాజెడీని ఎలా డిఫైన్ చేసారంటే"

"ఇది షేక్స్పియర్ నాటకం కాదు కదండీ" అన్నాడు జోగినాయుడు.

"అదీ పాయింటు" ఆ అవకాశం కోసమే చూస్తున్నట్లు కృష్ణశాస్త్రిగారు గుర్రున త్రేన్చి మధ్యలో వున్న పళ్ళెంలో చెక్కపొడి నోట్లో పోసుకున్నారు.

"నమస్కారమండి" అంటూ కావిరంగు పంచె కట్టుకున్న ఆజానుబాహుడొకడు వచ్చి చేరాడు.

"ఈయన రాఘవేంద్ర భాగవతారుగారు. రేపు సాయంకాలం రుక్మిణీ కళ్యాణం పెట్టించాం" అన్నారు చెంగ్రలావుగారు గర్వంగా.

"ఏమండీ. ఆ కథేనా నిర్ణయించుకున్నారు?" అనడిగారు ఇస్రాయేలుగారు.

"చిత్తం అదేనండి"

"రుక్మిణీ కళ్యాణం అంటే ఎక్కడ నుంచి ప్రారంభిస్తారు? శిశుపాల వధ దగ్గర్నుంచేనా?" అంటున్నారు జోగినాయుడుగారు.

"శిశుపాల వధకీ, రుక్మిణీ కళ్యాణానికీ సంబంధం ఏమిటయ్యా? బహుశా ఉత్తర గోగ్రహణం నుంచి ప్రారంభిస్తారులా వుంది" అని సవరించబోయారు వేదాంతంగారు.

వీళ్ళిద్దరి మధ్య తికమకపడిపోతున్నాడు భాగవతారు.

ఇక ఆపుకోలేక ఫక్కున నవ్వేశాడు వరద.

ఇంతలో కాశీపతి వచ్చి "ఏమండీ వరదరాజులు గారూ ఇక్కడ కూర్చున్నారేవిటీ? లేవండి" అని లేపి తీసుకుపోయాడు. చాక్లెట్‌రంగు సూటు వేసుకున్నాడు కాశీపతి. మీదికి దువ్విన జుత్తుని మాటిమాటికీ సవరించుకొంటూ పోర్టికోలోకి తీసుకొచ్చాడు.

"ఎంతసేపయింది వచ్చి?"

"ఇప్పుడే అంతా ఓ పావుగంటయింది."

"మీరు రాలేదేమో అని గాభరా పడుతున్నాను. శుభలేఖ పంపానన్నారు మావగారు. ఇక వ్రాయుడమెందుకులే అని ఆగిపోయాను."

వసారా అంతా మనుషులు నిండిపోయారు.

ఓ పక్క కాథలిక్ చర్చి ప్రీస్టు గాబ్రియేలు గారు, మిషన్ స్కూలు ప్రిన్సిపాలు సైమన్‌కాటమ్, యింకా మిగతా క్రిష్టియన్లు ఓ బల్లచుట్టూ చేరారు.

ఆడవాళ్ళ హడావుడితో, నవ్వులతో హాలంతా ప్రతిధ్వనిస్తోంది. నాటకం అవగానే కుర్రాళ్ళంతా చేరి స్టేజి మీద పేకాట వేశారు.

ఆశ్చర్యంతో అంతా చూస్తున్నాడు వరదరాజులు.

"కార్యక్రమమంతా తమాషాగానే వేయించారులెండి. ఇలాంటి పెళ్ళి ఎక్కడా చూసి వుండరు" అన్నాడు కాశీపతి నవ్వుతూ.

"ఆరోగ్యంగారు ఎక్కడా కనిపించరేం?"

"ఆవిడ కోరినట్టు మావగారు జరపడం లేదని కోపం వచ్చింది. మేడమీద కూర్చున్నారు. ఇక చెంగల్రావుగారింట్లో నిత్యం అయిదుగురు బ్రాహ్మణులు లేస్తారు. హిందూ సంప్రదాయం ప్రకారం చేసి తీరాలని భీష్మించుక్కూచున్నారాయన. చివరికి అదీ యిదీ గాని పద్ధతి ఏర్పాటు చేశారు మావగారు"

"ఏమిటది?"

"పెళ్ళంతా హిందూ సంప్రదాయంలో జరుగుతుంది. రేపు వుదయం చర్చిలో వధూవరులు ప్రార్థనలు చేసి ఆశీర్వాదం తీసుకుంటారు. ఈలోగా బౌద్ధభిక్షువుల సంప్రదాయ కీర్తనలూ, నాటకం వగైరా" నవ్వుతున్నాడు కాశీపతి.

తెల్లబోయాడు వరద.

"నాకంతా ఆటగా వుంది లెండి"

"పెళ్ళి ఎన్నిగంటలకి?"

"తెల్లవారు ఝామున నాలుగుకి. అందుకే యీ హడావుడి అంతా."

ఎవరో వచ్చి "బయట మీకోసం ఒకాయన నిలబడ్డారండి" అన్నాడు కాశీపతితో

కాశీపతి బయటకి వెళ్ళాడు.

మళ్ళీ గోవర్ధనరావుగారి దగ్గరకు వచ్చాడు వరదరాజులు.

ఇంతలో మిల్రటీబూట్లు టకటకలాడిస్తూ పెద్ద బెడ్డింగు వీపున మోసుకొచ్చాడొకాయన.

"ఓయ్ పోలయ్యా! ఇతనెవడో చూడు" అన్నారు చెంగల్రావుగారు.

బుద్ధుడు వేషం వేసిన పోలయ్య టక్కున సెల్యూట్ చేసి, ముందుకి వచ్చి మిల్రటీ అతణ్ణి ఆపబోయాడు.

బెడ్డింగు ఒక్క వూపున నేలన పడేసి "జెండాపై కపిరాజు. వచ్చేశాను మావయ్యా. ఎవడీ సైంధవుడు?" అంటూ పోలయ్యను తోసుకుని నలుగురి మధ్యకీ వచ్చాడతను.

గోవర్ధనరావుగారూ, చెంగల్రావుగారూ ఒకేసారి గుర్తుపట్టారతన్ని.

"వెంకూ!" అనరిచారు గోవర్ధనరావుగారు.

"వెంకూ, పెంకూనై, వెంకటపతి బి.ఏ." చతికిలబడ్డాతను.

ఇంతలో బాణంలా దూసుకొచ్చి చెంగల్రావుగారి వెడల్పాటి వీపు వెనక దాగుంది ఒకామె. "తమ్ముడు చూడు నాన్నా!" అంటూ.

వెంటనే పద్నాలుగేళ్ళ రాఘవులు పరిగెత్తుకొచ్చాడు.

ఇద్దరూ వెంకటపతిని చూసి ఒక్కసారి 'బావా' అన్నారు.

పసుపురంగు చీర కట్టుకుని, వాలుజడ వేసుకుందామె. తెల్లగా, మరీ తెల్లగా పాలిపోయినట్టుంది. గుండ్రని ముఖం, చిన్న పెదవులూ చెంగల్రావుగారిలో ధీమాని తెచ్చి యిచ్చాయి. కళ్ళల్లో అల్లరి తెచ్చిపెట్టుకున్నట్టుగా అతకనట్లుంది.

**వెంకటపతి** మరదల్ని చూస్తూనే అరిచాడు.

"హల్లో బ్యూటీ! మావయ్యా దీనికి చదువు మానిపించేశావా లేదా? అది చెప్పు ముందు"

"క్రిందటి వేసవికే చస్తే చదవనని అదే మానేసింది" రాఘవులు నిక్కచ్చిగా చెప్పాడు.

"ఏం లేదు. ఇతిహాస కాలంనాటి కణ్వాశ్రమంలో శకుంతల ఎంతో, మోడరన్ కాలేజీలో అమ్మాయి అంత. టు సె యినె షార్ట్ కట్ ఎవడో దుష్యంతుడు చేరాడా? మరో కాళిదాసు పుట్టాలి శాకుంతలం వ్రాయడానికి"

"భలేబావుంది ఉపమానం" చప్పట్లు చరిచారు భాగవతారు.

"మరో కాళిదాసెందుకూ? మన ఇస్రాయేలుగారు చాలు" అన్నారు వేదాంతంగారు ఎంతోసేపట్నుంచి దాచుకున్న కోపాన్ని వెళ్ళగక్కుతూ.

చర్రున లేచాడు ఇస్రాయేలు గారు "మీ ఇంగ్లీషు కంటే మా తెలుగు నయమే" అంటూ.

వాళ్ళిద్దర్నీ స్థిమితపర్చి అందర్నీ పరిచయం చెయ్యబోయారు గోవర్ధనరావుగారు.

"ఎందరో మహానుభావులు, అందరికీ వందనములు" అని త్యాగరాజకృతి అందుకున్నాడు వెంకటపతి.

"చిన్నతనంలో వీడికి తల్లిపోయిందండి. అప్పట్నుంచీ యిలాగే పెరిగాడు. నేనన్నా, పిల్లలన్నా వీడికి తగని చనువు. ఇక మాటలా? చూస్తున్నారుగా" చెంగల్రావుగారు అంటున్నారు.

"ఎక్కడ నుంచి వస్తున్నావ్?" అన్నారు గోవర్ధనరావుగారు.

"రాజధానీ నగరం నుంచి వేంచేశాం. ఏరోజు పోలిటిక్సు ఆ రోజు జీర్ణం చేసుకుంటున్నాం."

"శుభలేఖ సమయానికే అందిందా?"

"రెండు రోజులు ముందే చేరింది. మొదట పెళ్ళికి కొడుకుగారిని పరిచయం చేసుకుంటాం. ఆడపెళ్ళి వారి మీద అధారిటీ చెయ్యవచ్చు. వెరీస్ బ్రైడ్ గ్రూమ్? పెళ్ళిలో యింగ్లీషు మాట్లాడటం, శివాలయంలో బైబిలు చదవడంలోనే వుంటుంది మజా"

"బాయిట ఎవరితోనో మాట్లాడుతున్నాడు కాశీపతి. వెళ్ళి చూడు" అన్నారు గోవర్ధనరావుగారు.

చెంగల్రావుగారి రెండో అబ్బాయి రాఘవులు మధ్య హాలులోంచి వచ్చి "వరదరాజులు ఎవరండీ?" అని కుడివేపు నుంచి దర్యాప్తు చేస్తూ వస్తున్నాడు. స్థంభాన్ని ఆనుకుని నిలబడ్డ వరద అతణ్ణి ఆపి "నేనే, ఏం?" అన్నాడు.

"మా అక్కయ్య మిమ్మల్ని పిలుస్తోంది. జరూర్"

"ఎవరు"

"తెల్లబోతారేం సార్ పెళ్ళికూతురు పదండి?"

పెరటివేపు పెద ఖాళీస్థలం వుంది. ముందు భాగానికి తీసుకొన్నంత జాగ్రత్తలు వెనకభాగానికి తీసుకోలేదు. ఏవో క్రీపర్లు పిచ్చిగా పెరిగి యింటిమీదకి ప్రాకాయి.

బొగడ చెట్టుకు ఆనుకుని ఆకు విరుస్తోంది వినత.

ఇక్కడికి వచ్చాక ఇదే మొదటిసారి చూడడం ఆమెని.

వివశమయి నరాలు పొంగి, చీకటిలో చీలికలాగు, జీవితమంతా ఒకే కోరిక చుట్టూ మలుచుకుని యికనేం చేయాలో చేతకానట్టున్న వింత ఆ క్షణంలో వరద మనస్సును తుత్తునియలు చేసింది.

నిశ్శబ్దంగా ఎదుటికి వచ్చి నిలబడ్డది.

''పిలిచావా?''

ఎంతకీ మాట్లాడకపోయేసరికి భయపడ్డాడు.

''ఏదో భయమేస్తోంది'' అంది మెల్లిగా వణుకుతూ

ఆశ్చర్యపోయాడు.

విసురుగా లాక్కుపోతున్న విధి శక్తికి తీగలాగా కనిపించింది వినత.

తన శక్తినీ, ధైర్యాన్నీ వరదలో వెతుక్కోబోయింది.

కానీ ఎక్కడికో అందనంత దూరంగా వెళ్ళిపోయాడతను.

''ఛ భయమెందుకూ? జీవితంలో జరగబోతున్న ఒకే ఒక మంచి ఘట్టం. తెచ్చుకోవాలన్నా యింకెప్పుడూ రాదు ఈ క్షణం.''

కోరికలాగ మెరిసే నల్లటి కళ్ళని మంచు పొరకమ్మింది. గుండె గొంతులో కదిలింది. శరీరమంతా దుఃఖంలో నలిగి, చీలికలయి, ముద్దగా, మంచి తాకినట్లు వణికింది. కణత మీద చర్మం రెపరెపలాడింది.

అంతా క్షణకాలం.

పదిరోజుల తరువాత ఎండపొడ చూపిన ఆకాశం వెలుగులాగ చిన్న నవ్వు అంతలో ఆమె ముఖాన్ని వెలిగించింది. మనస్సు కూడదీసుకుంది తన బేలతనానికి. అంతలో సిగ్గుపడింది.

''కాశీపతి మొదట పెళ్ళికి యిష్టపడలేదు తెలుసా?''

''నువ్వు ఉత్తరంలో వ్రాశావుగా''

''ఎందుకంటావ్?''

''తెలీదు. అయినా పిచ్చి ఆలోచనల్ని పెంచుకుని జీవితం పాడుచేసుకోకు. కాశీపతి మంచి మనిషి. తన జీవితానికి నువ్వు అతకగలవా అని భయపడుతున్నాడంతే.''

మాట మార్చింది ''నీకు శుభలేఖ సమయానికి అందదేమోనని భయపడ్డాను. ఎలాగయితేనేం వచ్చేవే!?''

''ఏం రాననుకున్నావా? ఉత్తరంలో మాటల్నే గానీ మనస్సుని చదవడం నాకు చేతకాదు. చేతనయితే ఆగిపోయేవాణ్ణి.''

''పో.. అన్నిటికీ పెడర్థాలు తీస్తావ్''

''పెళ్ళికూతురు ఎక్కడ?'' అని హాల్లోంచి అరుస్తున్నాడు వెంకటపతి.

''ఇంత మంచి బావ వున్నాడని ఎప్పుడూ చెప్పలేదేం నాకు?''

నవ్వింది వినత. "వెంకు మాటేనా? మతి చలించిందని? ఆసుపత్రికి తీసుకెళ్ళబోయారు. ఆ రాత్రే పారిపోయి మిల్ట్రీలో చేరాడు. ఉత్త పిచ్చిమనిషి"

"పిచ్చి ఎందుకని? అందరి పిచ్చినీ చూసి నవ్వుతాడనా పిచ్చివాడని పేరు పెట్టారు?"

"ఇంకా నీకు తెలీనట్లుందే వాడి విషయం? అయితే పరిచయం చేస్తానురా. నీకే తెలిసి వస్తుంది"

"వెంకూ" అంటూ హాల్లోకి వచ్చింది వినత.

"ఆడబోయిన తీర్థం. హాల్లో పెళ్ళికూతురుగారూ? నీకో ప్రెజెంటు తెచ్చాను. చెప్పుకో" అంటూ వచ్చాడు వెంకటపతి.

"ఏమిటి?"

"జర్మన్ రిస్టువాచి. బావగారికి వేళకి వంటచేసి పెట్టటానికి" జేబులోంచి తీసి యిచ్చాడు.

నీడలోంచి ముందుకు వచ్చాడు వరదరాజులు.

"ఇతను వరద. రచయిత. ప్రపంచం మీద విసుగేసి తన రచనల్ని ఎవరికీ చూపించరు. ఆడవాళ్ళ మనస్సుని అర్థం చేసుకోవడంలో గొప్పవాడు. ఏం? అంతేనా?"

ఆశ్చర్యబోయి ఆమె ముఖం చూశాడు వరద.

"ఎందుకలా తెల్లబోతావ్? స్నేహితుడితో చెయ్యికలుపు"

"రైటో, మొదట రచయిత కాబోయి పొరపాటున మిల్ట్రీ వాడినయాను. అయినా ఫరవాలేదు. రచయిత దేశానికి మెదడు నిచ్చేస్తాడు. నేను శరీరాన్ని" ముగించాడు వెంకటపతి.

"నిన్ను గురించి పొగుడుతున్నారీయన"

"క్వయిట్ అన్ ఎక్స్‌పెక్టెడ్ యింతవరకూ నన్నంతా తిట్టేవాళ్ళే. కమాన్ సార్ లెటస్ హావే చాట్" అంటున్నాడు.

వినత హాల్లోకి వచ్చింది.

ఎక్కడిదో హార్మోనియం మోసుకొచ్చాడు వెంకటపతి. ఎదురుగ్గా వేసుక్కూచుని చేతిలో నవల లాక్కుని.

"చూడు నాన్నా" అంది విజయ వుదాసీనంగా

"పోనీ పాడమ్మా" అన్నారాయన.

"వెల్ రికమెండెడ్ కుమారి విజయగారు పాటలు పాడతారు రండొహోయ్" అంటూ 'బంయ్'మని హార్మోనియం మెట్లు నొక్కాడు.

నీరసంగా కాలు విరిగిన కుక్కలా మూలిగింది హార్మోనియం.

"అలా ఒక్కొక్కరోజు అన్నీ కూడతాయి. దీని గొంతుక్కి తగ్గట్టే హార్మోనియం గో ఆన్ ప్లీజ్" అంటూ శ్రుతి వేశాడు.

చుట్టూ మనుషులు చేరారు. రాఘవులు వరదని తోసుకొచ్చి అడ్డంగా నిలబడ్డాడు.

"పోనీ, మంచిపాట పాడమ్మా నిద్రయినా పోతుంది" అన్నారు వేదాంతంగారు.

పదిసార్లు రకరకాలుగా సిగ్గుపడి మెల్లిగా యెంకిపాట యెత్తుకుంది.

"ఎత్తిన విల్లు దించకూడదు. ఎవరయినా పాడవచ్చు" అని ప్రకటించాడు వెంకటపతి.

క్రిష్టియన్లంతా కలిసి సంప్రదాయపు కీర్తనలు సాగించారు.

"దేవుని స్తుతియించుడీ - ఎల్లప్పుడు

దేవుని స్తుతియించుడీ

ఆయన మహిమను ప్రసిద్ధి చేయా.."

ఆవేశంతో వాయిస్తున్నాడు పతి. అంతమాత్రం అనుభవం కూడా వున్నదని వూహించని వరద ఆశ్చర్యపోయాడు.

లేచి హాల్లోకి వచ్చాడు.

వెనక తోటలోని గుడ్డివెలుగులో బొగడ చెట్టుకు ఆనుకుని నీలవేణి కనిపించింది వరదకి. హాలు దాటి అటువేపు నడిచాడు. ఆకుల నీడలో చెట్టుకి చేరబడి నిలబడింది.

చీకట్లో నిలబడి, "నీలవేణి ఏడుస్తుందా" అని భయపడ్డాడు. దగ్గరికి వచ్చి "నీలవేణీ" అన్నాడు.

ఆమె భయపడింది. అడివి నీడల్లో ఆకు వణుకుదలలాగ కదిలింది.

"మీరా!?" అంది.

"ఇక్కడున్నావేం?"

"ఏం లేదు. ఊరికినే"

"ఏడుస్తున్నావా?"

నవ్వి "ఏడుపెందుకూ?"

"ఏదో బాధపడుతున్నావు నువ్వు. గులాబీ యేదీ?"

"వినత తీసుకెళ్ళింది. ఏవో వస్తువులు చూపడానికనుకుంటాను"

"నువ్వు?"

తెచ్చిపెట్టుకున్న నవ్వు ఎంతోకాలం నిలవలేదు.

"నాకేం సరదాల్లేవు. ఇలాంటివి చూడడం నాకు కొత్త. మీరు వెళ్ళిపోండి. నన్ను వొంటరిగా వదిలేయండి"

ఇక ఆపుకోలేక రెండు చేతుల్తో ముఖం కప్పుకు ఏడ్చింది. అవధుల్ని దాటి లేచే తరంగాల్లాగా దుఃఖం కట్టు తెగి మనిషినంతా కదిపింది.

భయపడ్డాడు వరద. ఆర్ధ్రతతో అతని మనస్సంతా వూగిసలాడింది. చేతనయితే ఆమెనొక్కసారి హృదయానికి హత్తుకుని సముదాయించాలనుకున్నాడు.

కానీ అదో స్వప్నం.

ఆమెని ముట్టుకున్నాక. ఆమె ఉద్విగ్నతనీ, తనలో మలినాన్ని కాల్చేసేట్టు చూసే ఆమె కళ్ళని తట్టుకోలేడు.

మెల్లగా అక్కణ్ణుంచి వచ్చేసాడు. మేడమీంచి గులాబి వినత నవ్వులు వినవస్తున్నాయి. విజయ కూడా అక్కడే చేరింది. అప్పటికే అందిన బహుమానాలన్నీ గదిలో బల్లమీద పేర్చింది వినత. ఒక్కొక్కటే తీసి గులాబికి చూపుతోంది.

వరద గుమ్మం దగ్గరకు రాగానే "రా వరదా? ఇంకా నిన్ను పిలవాలనుకుంటున్నాను. ఇవిగో యివన్నీ"

"గులాబీ" అన్నాడు వీలయినంత మామూలుగా వుండడానికి ప్రయత్నిస్తూ అతని కళ్ళు చూసి భయపడింది గులాబి.

"ఏం అన్నయ్యా!" అంది.

ఆమె చెయ్యిపుచ్చుకు మౌనంగా మెట్లు దిగాడు. హాల్లోకి వచ్చాక "నీలవేణిని అలా ఒంటరిగా వదిలేయడం బాగోలేదు. ఆమెను తీసుకెళ్ళు. లేకపోతే కించబడుతుంది."

గులాబి ఆశ్చర్యపోయింది.

"ఏది నీలవేణి?"

"అక్కడ, తోటలో నిలబడింది చూడు."

గులాబిని చూసి నవ్వింది నీలవేణి.

"వస్తువులన్నీ బావున్నాయా?" అంది.

"మేడమీదికి వెళ్దాం పద" అంది గులాబి ఆమె చెయ్యి పట్టుకుని

"సరేపద" అంది నీలవేణి.

హార్మోనియం పాడయిందని పాటలు ఆపుజేసారు.

"ఎవరోయ్ ఆ అమ్మాయి?" అన్నారు చెంగల్రావుగారు వరద అక్కడికి రాగానే.

"మా చెల్లెలు."

"ఆ రెండో అమ్మాయి"

తికమకపడ్డాడు వరదరాజులు.

"పేరు నీలవేణి."

"అంతేనా అడ్రసు?" అంటున్నాడు వెంకటపతి.

చాలా అర్ధమయింది చెంగల్రావుగారికి. అప్పుడే చుట్ట వెలిగిస్తూ వచ్చిన గోవర్ధనరావుగారితో, 'ఇతగాడికి పెళ్ళికాలేదని చెప్పావ్?' అనడిగారు తమ్ముణ్ణి.

"అవును కాలేదు. యిప్పుడేం?"

"కాకపోవడమేమిటి? అతన్నడుగు."

"అదేమిటోయ్?"

వరదకి చికాకేసింది.

"నాకింకా పెళ్ళికాలేదండి. ఆమె నా స్నేహితురాలు. ప్రస్తుతం మా యింట్లోనే వుంటోంది. అంతే"

"ఎలాగెలాగ?" నిద్రపోతున్నవాడల్లా లేచి కూర్చున్నారు లాయరు కృష్ణశాస్త్రిగారు.

వివరించెదను అవి ధరింపుడు. "ఓ పెళ్ళికాని పిల్ల, మరో పెళ్ళికాని రచయిత యింట్లో వుంటోందట. దీన్ని మీరేమంటారు?" పతి అంటే,

"ఇంకా అనడమేమిటి? సాంఘిక దురన్యాయం కాదుటయ్యా?"

"అచ్చా! సంఘం మిమ్మల్ని బోనులో పెట్టి క్రాసు ఎగ్జామిను చేస్తోంది. జవాబు చెప్పుకోండి సార్" అన్నాడు వెంకటపతి.

"అతనేం చెప్తాడండీ తేట తెల్లంగా తెలిసిపోతే? యువర్ ఆనర్" ఆ ఆవేశంలో కోర్టురూము అలవాటు ప్రకారం అనేసి నాలిక కరుచుకున్నారు కృష్ణశాస్త్రిగారు.

"మీ అందరికీ జవాబు చెప్పుకోవాల్సిన గతేం ఆయనకి పట్టలేదు. మీ సర్టిఫికెట్ అతనికేం అక్కరలేదు. అతనిలాగా బ్రతకడం మీకు చేత కాలేదని, మీరు అతనంత పెరగలేకపోయారని మీలా రొటీన్‌లో పడి పెళ్ళిళ్ళు చేసుకుని పిల్లల్ని కనలేదని మీ జలసీ. ఈ స్వార్ధానికీ, సంకుచితత్వానికి మీరంతా కలిసి ఓ పేరు పెట్టారు. దానిపేరు సంఘం" ఇది వెంకటపతి గొంతు.

"నువ్వారుకోవయ్యా. నీకెందుకూ?" అని సర్దుకోజూశారాయన.

"ఒక్కటేమాట వినండి సార్" అని వరదరాజులు వేపు తిరిగి అన్నాడు ***"అందరి గురించి బ్రతికేవాడు తన గురించి తాను బ్రతకలేడు. తన గురించి తాను బ్రతికేవాడు మిగతా ప్రపంచాన్ని చంపేసుకోవాలి.*** మీలో ఏవన్నా చేవ వుంటే యీపాటికే వీళ్ళందర్నీ వదిలి దూరంగా పొండి. లేకపోతే మీకు ఖరీదు గట్టి మీ సుఖదుఃఖాల్ని బజార్లో సంతలో అమ్మేస్తుంది యీ సంఘం" లేచాడు పాంటు దులుపుకుని, "దీని ఉపయోగం ఏమిటయ్యా అంటే ఈ సంఘంలోని కొందరు వ్యక్తుల్ని మ్యూజియంలో వుంచి ఓ అణా టికెట్టు పెడితే చాలామంది నిరుద్యోగుల ప్రాబ్లమ్ తగ్గుతుంది. మరి కాస్త 'ఛాయి' వేసుకు వస్తారు" లేచాడు.

బిక్క చచ్చిపోయాడు కృష్ణశాస్త్రి.

"ఆ మాటలేం పట్టించుకోకండి. పిచ్చి వెధవ వాడు" అన్నారు చెంగల్రావుగారు.

"ముహూర్తం దగ్గరపడుతోంది అంతా లేవండి. వాయించండోయ్ బజంత్రీలు" అనరుస్తున్నాడు లక్ష్మింపతి.

"పెళ్ళికొడుకు నిద్రపోయినట్టున్నాడు లేపండి" అన్నారు చెంగల్రావుగారు. అంతా హాల్లో పోగయ్యారు.

స్థంభం నీడలో వొళ్ళు తెలీకుండా నిద్రపట్టేసింది వరదకి.

మెలుకువ వచ్చేసరికి తూర్పున తెల్ల చారలు తోచాయి. రెండు జీవితాల్ని కలిపి ఒక్క ముడిన బిగించింది సంఘం. కాశీపతి ఉత్తరీయానికి వినత చీరని ముడివేశారు.

లేచి ఒక్కొక్కరికి నమస్కారాలు చేస్తున్నారు నూతన వధూవరులు.

అనుకున్నట్లుగానే బలరాందాసు కదిలాడు. రామ్మూర్తికి నైట్ డ్యూటీ దొరికింది. కానైతే ఉద్యోగం స్థిరం కాదు. ఏదైనా ఓడ వస్తే వుంది లేకపోతే లేదు. రోజూ వరదరాజులు దగ్గర అనుమతి తీసుకువెళ్ళాలి. ఆఫీసు బాధ్యతంతా తనమీదే వుంటుంది. అదీగాక రాత్రంతా మేలుకోవడం కష్టతరం. కానీ తప్పదు. వేరే గత్యంతరంలేక రామ్మూర్తి వస్తూనే వున్నాడు.

డాక్టరుగారు మందిస్తున్నారు. ఓసారి కంపౌండరు కనిపించి సైకిలు దిగాడు పిలవకుండానే. "పండగ దగ్గరపడుతోంది. నమస్కారం" అన్నాడు సాభిప్రాయంగా.

"ఈ పండక్కి నేను మీ యింటికి వస్తాను. నాకేదయినా యిచ్చి పంపండి. డబ్బు విలువ మీరు నేర్పారు" అన్నాడు వరదరాజులు.

తెల్లబోయి సైకిలెక్కాడు కంపౌండరు.

వెంకటపతి నవ్వుతూనే ఎన్నో పాఠాలు నేర్పాడు తనకి. సంఘాన్ని చూసి భయపడకూడదు. బద్ధకంతో ముసలితనంతో, యీ కృష్ణశాస్త్రులూ, వేదాంతులూ, చెంగల్రావులూ, సంఘాన్ని కుళ్ళబెట్టేశారు. ఇంకా పురుడు వెళ్ళని యీ అవధుల్ని ఎంత వేగంగా తెంచుకుపోతే అంత మంచిది. ఎప్పుడో ఒకప్పుడు ఈ పాతపద్ధతుల్లో పేర్చిన కులాలన్నీ, పెద్ద గాలివానతో కూలిపోతాయి. అప్పుడీ మనుషులూ వుండరు. ఈ కట్టుబాట్లూ వుండవు. బుద్ధి గడ్డితిని వెనక్కి తిరిగిరావడం మరిచిపోయిన కాలం యిది.

ఇంతవరకూ విశ్వేశ్వరం పత్తాలేడు.

***మనిషిలో మంచితనాన్ని ఎంతవరకూ ఉపయోగించుకోవచ్చునా అని చూస్తుంది ప్రపంచం.*** మొదటే విశ్వేశ్వరం మీద నమ్మకం లేదు వరదకి. ఇప్పుడిక వ్యక్తిత్వపు విలువలు మీద కూడా నమ్మకం పోయింది. నీలవేణి 'సమస్య' అన్న విషయమే మరిచిపోయాడు.

ఆఫీసుకు వెళ్ళడం, ఆలోచించడం, భోజనం చేయడం, నిద్రపోవడంలాగే, దేనికీ విచారించకపోవడం నేర్చుకున్నాడు.

జీవితంలో చాలా వాటిల్లాగా నీలవేణి కూడా తన జీవితంలో కలిసిపోయింది.

నెల తిరక్కుండానే వినత కాశీపతితో హైదరాబాదు వెళ్ళిపోయింది.

యౌవనం భవిష్యత్తుని సుఖానికి అమ్మేసుకుని అనుభవాన్ని కొనుక్కుంది. ***సుఖం నల్లమందులాంటిది. జీవితంలో ఎన్నో ఆవేశాల్ని, ఎన్నో వాంఛల్ని మత్తిలజేసి జోకొట్టి నిద్రపుచ్చుతుందది.***

ఉన్నట్టుండి ఓరోజు రవణమూర్తి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. "నాకు భయంగా వుంది. అమ్మని పంపించు. వీలయితే నువోసారి రా" ఇదీ అందులోని విషయం.

బలరాందాసుకి అసలే తనమీద గుర్రుగా వుంది. అవకాశం దొరికితే నొక్కేసే ప్రయత్నం చేస్తున్నాడు. ఇప్పట్లో సెలవు దొరికేట్టులేదు.

ఆ సాయంకాలమే రవణమూర్తి యింటికి వెళ్ళాడు. చాలా రోజుల్నించి సీతారామమ్మగారి విషయమే మరిచిపోయాడు. వరదరాజుల్ని చూసి పొంగిపోయింది. "అబ్బాయేమన్నా వుత్తరం రాశాడా?" అంది.

చెప్పడానికి సంశయించాడు వరద. అప్పటికే చాలా కృంగిపోయి నీరసంగా వున్నదామె. పిల్లలిద్దరూ రెండు కళ్ళు ఆవిడకి. భర్త మరణం, మిగతా పిల్లలు పోవడం వీటన్నిటితో దుఃఖంతో కుమిలిపోయింది. అయినా యిదో కొత్త దెబ్బ.

"మిమ్మల్ని చూడాలని వుందిటండీ సుజాతకి. రమ్మని రాశాడు. ఇవాళ వెళ్తారా?"

"తప్పకుండా వెళతాను. నువ్వుకూడా రాకూడదూ ఓసారి. ఎవరున్నా లేకపోయినా నువ్వు వుంటే ధైర్యం వాడికి."

"శలవు చూసుకుని నేను వస్తానండి. వచ్చే ఆదివారం నాటికి వస్తానన్నానని చెప్పండి వాడికి" అన్నాడు.

"కాఫీ తాగిపోదువుగాని వుండు, ఏమీ తోచదు నాకు. పిల్లలకి చేసి పెట్టడానికి కూడా అనువయింది కాదు" అని పొయ్యి రాజేసింది.

వరదకి తల్లి చిన్నతనంలోనే పోయింది. అలా ప్రాణం పెట్టేవాళ్ళ నీడలో కూచోడం అదే కొత్త.

నీరసంతో దిగజారిపోయి, బొమికెలు మిగుల్చుకుని ఆ దుఃఖంతో ఒకే పేగుగా మిగిలింది సీతారామమ్మ.

దుఃఖం, ప్రేమా తప్పిస్తే జీవితంలో ఏమీ చూడలేదామె. చెడు ఎలా వుంటుందో తెలీదు. ఆమెకు తెలిసిందల్లా నీరసం, ఓర్పూ, సానుభూతీ, భయం , పిల్లల ఆరోగ్యం గురించి వణుకూను. మంచితనం ఆమెలో పుట్టిందా అనిపిస్తుంది.

కాఫీ యిస్తూ " సుజీ మళ్ళీ లేచి వెలుగు చూస్తుందంటావా?" అంది.

ఏమీ జవాబు చెప్పలేక వూరుకున్నాడు వరద.

"సాయంకాలం ఆమెని రైలెక్కించాడు. రైలు కదుల్తూంటే ఆమెకు దుఃఖం ఆగింది కాదు.

"మంచితనం ఒకరు తెచ్చుకుంటే వచ్చేది కాదయ్యా నువ్వు నాకు మరో కొడుకువి" అంది.

రైలు వెళ్ళాక ఏం చెయ్యాలో తోచలేదు వరదరాజులకి. అంత అభిమానాన్నీ, ప్రేమనీ దాచుకొందుకి తన గుండెలో చోటులేదు. ఉక్కిరి బిక్కిరయి మనస్సంతా ఆ ఆర్ద్రతతో చిన్నాభిన్నమయింది.

స్టేషను దాటగానే చాలా సమస్యలు అతణ్ణి మూర్చాయి. పరాకుగా నడకసాగించాడు.

బస్సంతా రద్దీగా వుంది.

అదంతా మరో ప్రపంచం.

"ఖాళీలేదు. బుట్టలెక్కించకు, రైట్"

''కాలేజీ డౌనుకి టిక్కెట్''

''ఎక్కణ్ణుంచి''

''ఏమండోయ్, చీర ముట్టేస్తున్నారు'' అందొకావిడ వరదని కదుపుతూ.

కాస్త ముందుకి జరిగి వెనక్కి చూసాడు వరదరాజులు. పద్మిని కనిపించింది.

''వరదరాజులుగారూ'' అందామె ఆశ్చర్యంగా.

నాలుగేళ్ళ క్రిందట చూసిన మొహం. అప్పుడు ఉద్యోగంలో కొత్తగా చేరింది పద్మిని. తుక్కుతూ తోలుబొమ్మలాగ వుండేది. ఆఫీసు వాళ్ళంతా వరదని 'పరాకుమనిషి' అని పిలిచేవాళ్ళు. ఫైళ్ళు సరిగా టైముకి యివ్వడు. ఆఫీసుకు ఎప్పుడొస్తాడో తెలీదు. రాత్రి పదివరకూ కూచుంటాడోసారి. ఓరోజు ఆమె కూడా అలానే పిలిచింది. తలెత్తి ఆశ్చర్యంతో చుసాడు. పొట్టిగా, నల్లగా వుంది. నవ్వొచ్చింది. ''మీ పెదాలు నలుపు చూస్తే ఏం జ్ఞాపకం వస్తుందంటే'' కావాలని ఏదో అనబోయాడు.

''ఏయ్ మిష్టర్ మర్యాదగా మాట్లాడ్డం నేర్చుకో''

మర్నాడే సెక్షను హెడ్డు బలరాందాసుకి రిపోర్టు అందింది.

''ఆఫీసులో కవిత్వం వెలగబెట్టే లాభంలేదు బాబూ'' అన్నాడు మందలింపుగా

''ఆమె పెదాలు చూస్తూంటే మా పక్కయింటివాళ్ళ కుక్కముట్టి గుర్తుకొచ్చింది.''

దాసుకి కూడా నవ్వాగలేదు. ''సరే, నీ సీటుకి పో'' అన్నాడు.

ఇప్పుడు చాలా మారింది పద్మిని. అప్పుడు చూసిన వాళ్ళెవరూ పోల్చుకోలేనంతగా మారిపోయింది. ఎర్రటి బెనారస్ సిల్కుచీర వదులుగా కట్టుకుంది. మెడనిండా మెరుస్తూ శరీరం రంగుకి 'కాంట్రాస్టు'లాగా, శరీరాన్ని కిందికి లాగేస్తూ బంగారం నగలు.

గుండ్రంగా, విశాలంగా, బొద్దుగా కనిపించింది పద్మిని. అర్థంలేని నీలికళ్ళు కదలికా, నల్లగా, బరువుగా కదిలే నీటిమీద నాచులా కదిలే చెక్కిళ్ళూ, పొడవుపాటి మెడా ఇదీ పద్మిని.

ఒత్తుగా పెరిగిన జుత్తుని మీదకి తిప్పి ముడివేయడంతో ముఖమంతా గుండ్రంగా బంతిలాగా కనిపిస్తోంది. తెల్లటి జాకెట్టు బిగుతుగా జబ్బల్ని కప్పింది. బలంగా ఎదిగిన రొమ్ములు మొనలుదేరి శరీరానికంతటికీ ఠీవినిచ్చాయి. ఎత్తుమడమల జోడూ, చేతిలో సంచీ, మాటిమాటికీ సవరించుకుంటున్న గిల్టుఫ్రేము కళ్ళజోడు. నాగరికతను అనవసరంగా ఆమె మీద అతికినట్టుంది. వీటన్నిటనీ వదిలేసి పారిపోవాలన్న విసుగుదల స్పష్టంగా ఆమె ముఖంలో కనిపిస్తోంది.

''ఏం చేస్తున్నారు?'' అన్నాడు యిటు తిరిగి.

''నామాటకేం మీరు చెప్పండి. ఇంకా ఆ బోడి ఉద్యోగమేనా?''

నవ్వాడు వరద, ''ఆడవాళ్ళలా తెగింపుచేసి పారిపోవడం మొగవాళ్ళకి చేతకాదు. అదే ఉద్యోగం, అదే సీటు. కానీ నన్ను మారుపేరు పెట్టి పిల్చేవాళ్ళంతా వెళ్ళిపోయారు.''

సిగ్గుపడింది పద్మిని, ''ఏదో అప్పట్లో చిన్నతనం. క్షమించండి.''

''ఏం చేస్తున్నారు మీరు?''

''ఆడవాళ్ళేం చేస్తారు? పెళ్ళి చేసుకున్నాను'' తనమాట తనకే నవ్వు తెప్పించినట్టుంది, పక్కున నవ్వింది.

''మంచిపని చేసారు. ప్రపంచంలో చెలామణి కావడానికి పెళ్ళి ఓ మంచి సర్టిఫికెట్. వినత తనని వెంకటపతికి పరిచయం చేసిన మాటలు గుర్తుకొచ్చాయి.

"ఆడవాళ్ళని అర్థం చేసుకోవడం బాగా చేతనవును."

"ఆ ముందు సీట్లో కూర్చున్నాయన్ని చూశారా? తెల్లబట్టలు"

మోడరన్ గేలంట్రీ గురించి ఉపన్యాసం యిస్తున్నాయన్ని చూసాడు వరద. ఒక అరవాయనా, ఓ తాపి మేస్త్రీ, తెలుగూ యింగ్లీషూ రాని సాయిబూ, ఓ కాలేజీ విద్యార్థీ మధ్య కూచుని ధారాపాతంగా ఉపన్యసిస్తున్నాడతను. మధ్య మధ్య భార్యవేపు దొంగచూపులు చూస్తున్నాడు.

"సిటీ సర్వీసంతా గవర్నమెంటువారు తీసుకుని నేషనలైజ్ చేస్తేనే గాని ఊరు బాగుపడదండి"

బీడీ కాలుస్తున్న సాయిబు పొరపాటున కాలేజీ విద్యార్థి చెయ్యి విద్యార్థి కాల్చేసాడు. దాంతో విద్యార్థి లేచిపోయి కేకలు మొదలెట్టాడు.

"యూ రిచెడ్ ఫూల్. బీడీ ఆర్పుతావా? ధణుతు ఎగరగొట్టమన్నానా"

"మాఫ్‌కర్ దో భాయ్" అంటున్నాడు సాయి.

"ఊరుకోవయ్యా తప్పయిపోయింది"

"నీకేం పోయిందయ్యా నాయుడూ చెయ్యికాల్చేసాడు డర్టీబెగ్గర్"

బస్సు ఆగిపోయింది.

"ఎప్పుడన్నా యింటికి రండి. లైట్ హౌస్ దగ్గర వుంటున్నాం. ఆయన్ని పరిచయం చేస్తాను" అంది పద్మిని.

ఇక బస్సు కదలదని నిశ్చయించుకుని బస్సు దిగిపోయాడు వరదరాజులు.

"వెళ్ళాలనుకుంటే ఉద్యోగం వదులుకు వెళ్ళు, అంతేకానీ సెలవు చేస్తే మంజూరు చెయ్యను" అన్నాడు బలరాందాసు.

అన్నిటికీ తగువు పెట్టుకునే ఓపికలేదు వరదరాజులుకి. 'ఎలావున్న'దంటూ ఓ ఉత్తరం వ్రాసి రవణకి పోస్టుచేసి ఊరుకున్నాడు, దానికి జవాబేలేదు.

విశ్వేశ్వరం ఆశ పూర్తిగా పోయింది. రానురాను నీలవేణి మారడం గమనించాడు. మామూలుగా మనిషిలో చలనం తక్కువయినా యిదివరకటి ఆకాస్త వుత్సాహం కనిపించకపోయే సరికి భయపడ్డాడు వరద.

"విశ్వేశ్వరం రాలేదని భయపడుతున్నావా?" అని కదిపాడు ఓ రోజున.

"అదికాదు"

"మరి?"

"నేనిప్పుడేం చెయ్యాలి?"

ఆ ప్రశ్నకి జవాబు తనకే తెలియదు.

"అలాంటి విషయాలు ఆలోచించకు."

"ఎప్పుడు వెళ్ళాలి నేను?"

దిమ్మెరపోయాడు వరద. "ఎక్కడికి?"

జవాబు చెప్పలేదు నీలవేణి, అవును. ఎక్కడికి వెళతాను అనుకొంది. కొన్ని ప్రశ్నలు ఆమెకి వినిపించడం మానేశాయి. నవ్వింది.

"ఆలోచించను యికనుంచీ"

"విచిత్రమైన వ్యక్తి" అనుకున్నాడు.

ఇదివరకులా యిప్పుడు గోవర్ధనరావుగాని యింటికి వెళ్ళడంలేదు. అయినా ఆ విషయం అట్టే ఆలోచించలేదు. ఇది వరకుకంటే తన టేబులు మీద యిప్పుడు కాగితాలు పెరిగాయి. అదంతా బలరాందాసు చిన్న చూపని తెలుసు. తెలీని పట్టుదలా, లోపల్లోపల రగిలే మంటా అతన్ని యంత్రంలా నడిపిస్తున్నాయి.

ఎప్పుడో అగ్నిపర్వతం బ్రద్ధలవుతుంది. ఆ లావాల చెట్లూ, చేమలూ అన్ని భస్మీపటలమయి అయిపులేకుండా పోతాయి.

సమయంకోసం ఎదురు చూస్తున్నాడు.

ఓ రోజు యింటికి వచ్చేసరికి ఎనిమిదయింది. గోవర్ధనరావుగారు తనకోసం ఎదురుచూస్తున్నారు.

"ఏంవోయ్, రావడం మానేశావు?"

"ఇదిగో, ఇప్పుడొస్తున్నాను ఆఫీసునుంచి"

"నాకే తోచక యిలా వచ్చాను, మొదట బట్టలు మార్చుకో"

పంచే తువాలుతో వచ్చి కూర్చునేసరికి గోవర్ధనరావు నిర్లిప్తంగా చీకటిలోకి చూస్తున్నాడు.

"నీలవేణి మంచిదేనోయ్. ఇప్పుడిప్పుడు తెలుస్తోంది. కూతురు యింట్లో లేకపోయినలోటు" అన్నాడు.

దీపాలకి పట్టిన మసి తుడుస్తోంది నీలవేణి. పెరట్లో నీళ్ళు తోడుతోంది గులాబి.

గోవర్ధనరావుగారు చెప్తూనే వున్నారు.

"ఇల్లంతా చిన్నబోయిందోయ్, ఆ కిరస్తానీ ఆవిడకీ నాకు ఎప్పుడూ పడదుకద - మా కీచులాటలు తీర్చే మనిషి లేకపోయేసరికి దిగులు పట్టుకుంది"

"ఆరోగ్యం గారు ఎలా వున్నారు?"

"దానికేం, బాగానే వుంది. రోజూ చర్చికి వెళ్ళివస్తోంది. కానీ చెప్పొద్దూ? పైకి చెప్పదు కానీ లోపల అదీ బెంగపెట్టుకుంది. అంతేనయ్యా ఆడపిల్లల్ని పెంచినన్నాళ్ళూ పెంచడం, పెద్దయ్యాక ఓ అయ్యచేతుల్లో వుంచి చెయ్యి దులుపుకోవడం"

వరద యేమీ మాట్లాడలేదు.

"చాలా నీరసించినట్టున్నావోయ్ ఏం? వంట్లో బాగులేదా?"

"బాగానే వుంది."

"మరెందుకలా నిరుత్సాహంగా వున్నావ్?"

నవ్వాడు వరద.

"మీ కుర్రాళ్ళు అలా దిగులుపడకూడదోయ్ ఏ విషయానికీను. నన్ను చూడు ఎన్నేళ్ళొచ్చినా దేనికీ బాధపడను. ప్రతీదాన్ని దాటుకు పోవడం అలవాటు చేసుకోవాలి. అది ముఖ్యం."

"..."

"ఏదో ఆలోచిస్తున్నట్టున్నావ్"

గాలికి అరిటాకు ఊగి చినిగిపోయింది. నాలుగు పువ్వులు మసక చీకటిలో చుక్కల్లా రాలాయి.

"ఒహటి చెప్పండి. ఏదో మంచిపని చెయ్యాలనే ఆలోచనలతో రోజులు ప్రారంభిస్తాం. కానీ కొంతకాలం జరిగేసరికి దేనికీ మనకు తాహతు లేదనిపిస్తుంది. అప్పుడెలా?"

ఆశ్చర్యపోయారు గోవర్ధనరావుగారు వరద హఠాత్తుగా అడిగిన ప్రశ్నకు.

తేరుకుని - "అచ్చా - నీ మనస్సులో కనిపిస్తున్న లోటుని ఇప్పటికీ అర్థం చేసుకోగలుగుతున్నావ్ - ఒక్కొక్క ప్రశ్నకీ సమాధానం చెపుతాను విను" అన్నారు.

కుర్చీమీద కూచుని వెనక్కి చేరబడుతూ అడిగారు గోవర్ధనరావుగారు.

"మంచి పనంటే నీ వుద్దేశం ఏమిటో మొదట చెప్పు. నేను ఓ గులాబీ మొక్కని పెంచాలనుకుంటాడు. అది నాకు మంచిపని మరొకడు దైవప్రార్థనలు చేస్తాడు. మరొకడు పెళ్ళిళ్ళు చేయిస్తాడు. కుర్రాడు గాలిపడగలు ఎగరేయడంలో తృప్తిపడతాడు, అవునా, అంచేత మంచి అనే పదానికి పరిమితి, స్వరూపం అంటూ లేదోయ్. 'దీనికంటే మంచి' అని చెప్పగలం. కానీ యిది మంచిది అని చెప్పడానికి తూకపు రాళ్ళులేవు. అవునా? మొదట దీన్ని ఒప్పుకో"

"అవును"

"ఇహపోతే, నువ్వనుకున్న మంచి పనితో ప్రపంచానికి సంబంధం లేదు - 'నేను మంచిపని చేస్తున్నాను. నువ్వుకాస్త ఆగు' అంటే ఆగదు. నాకు తగినట్టు మార్పుచెందు' అన్నా లాభంలేదు, అంచేత ప్రపంచంతో రాజీపడడం నేర్చుకోవాలి - ఆస్తిక, నాస్తిక వాదాల్ని వదిలెయ్, కొంతవరకూను. జీవితం నువ్వు చెయ్యాల్సిన మొదటి పని, భగవంతుడు నీకిచ్చిన ఒక్క వరం నీ జీవితం నువ్వేదీ చెయ్యలేవు."

"అది సరే"

"విషయానికి వస్తాను. నువ్వు చెయ్యాలనుకున్న మంచిపని వ్యక్తి పరంగా ఎట్లా సంకుచితమయిందో, అలాగే అన్ని కాలాలకీ అది సరిపోకపోవచ్చు. రోడ్డు పక్క నీడకోసం ఒహడు చెట్టువేస్తాడు. పదేళ్ళు. యిరవై యేళ్ళు లేదా ఏభై ఏళ్ళు అది లోకానికి సాయపడుతుంది. తర్వాత ఆ వ్యక్తి సౌహార్థం, అతను చేసిన పనీ కనిపించదు. ఓ రచయిత రాసిన కావ్యం అతని శక్తిని ప్రపంచం అంగీకరించేవరకూ నిలబడుతుంది. సంగీత విద్వాంసుడి గొప్పతనం అతని కంఠం వున్నంతవరకూను, వీళ్ళంతా ఏదో విధంగా మంచిపనంటూ చేస్తున్నవారే. అందువల్ల అన్ని కాలాలకు పనికి వచ్చే మంచిపనంటూ ఏదీ వుండదు."

వరద ముఖంలో ఆత్రుత గమనించి నవ్వుకున్నాడు వృద్ధుడు.

"అంతమాత్రాన నిరుత్సాహపడితే లాభం లేదోయ్, అలా అయితే యీ మాత్రం నాగరికతకూడా మనిషిలో నిలిచేది కాదు. సమిష్టిగా మానవులందరు కొన్ని నెలలు, వత్సరాలు యుగాలుగా శ్రమిస్తున్న మంచితనం ఫలితం యీనాటి మన సౌఖ్యం. నువ్వు అందులో శత సహస్రాంశం శ్రమదానం చేస్తావు. చెయ్. ఇవాళ కాకపోతే రేపు ఫలితం అనుభవానికి వస్తుంది. నువ్వు రాసిన పుస్తకంతో ఒక్కడు మారగలిగితే చాలదూ?"

ఆగారు గోవర్ధనరావుగారు, వరదరాజులు మాట్లాడలేదు.

"ఒకవేళ పూర్తిగా చెయ్యలేకపోతావు, అప్పుడు విచారం లేదు. పని పాడవుతే పాడవనీగాక, నువ్వు ప్రయత్నించగలిగానన్న తృప్తి మిగులుతుంది. ఇన్నిటికీ ముఖ్యం మొదట నీమీద నీకు విశ్వాసముండాలి. నువ్వు చేసే పనిమీద విశ్వాసముండాలి. నిజానికి ఆ విశ్వాసమే ముఖ్యం. మన మనస్సును మనం నమ్మగలగడం మనం నేర్చుకోవలసిన రెండవ పాఠం? అదెప్పుడూ నిన్ను మోసం చెయ్యదు. నీకు తోచిందేదో చెయ్. మిగతాది దేవుడికి వదిలెయ్. మన విశ్వాసం మనల్ని నడుపుకు పోవాలి"

ఇంత విన్నాక కాస్త తృప్తి కలిగిందతనికి. గోవర్ధనరావుగారు మళ్ళీ అన్నారు.

"మనిషిగా బ్రతకడానికి కావల్సిన 'మంచి' సరంజామా నీ దగ్గర చాలావుంది, అన్నిటినీ గురించి ఆలోచించి మనస్సు పాడుచేసుకోకు. చాలాసార్లు 'పతనమవుతున్నావా?' అన్న ఆలోచన రావచ్చు. కానీ చివరకు నిన్ను నువ్వు పూర్తిగా చెప్పుకోగలవు. అన్నాళ్ళుగా నీలో దాగిన వివాదాలూ, అంతర్యుద్ధాలూ అన్ని మాటల రూపంలోనో, యింకే రూపంలోనో బయటికి వస్తాయి. అప్పుడు నీ జీవితానికి అర్థం కనిపిస్తుంది. కనిపించకపోయినా యిక బాధ కలగదు. ఎందుకంటే, గమ్యాన్ని చేరలేకపోయినా, చేరడానికి గుంజాటన పడ్డావన్న తృప్తి మిగులుతుంది ఆఖరికి - అది చాలు"

పూర్తిగా అలసిపోయారాయన, వరదరాజులుకి యింకా మాటలు పెగలలేదు. ఏదో ఆలోచిస్తూ కూచున్నాడు.

**ఒకరోజు ఉన్నట్టుండి** వెంటనే బయల్దేరి రమ్మని రవణమూర్తి దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది.

వరదరాజులు గాభరాపడ్డాడు. ఇంకా వారమన్నా కాలేదు సీతారామమ్మగారిని పంపి. అప్పుడే ఈ టెలిగ్రాం.

రాత్రే బయల్దేరాడు రామ్మూర్తిగారిని యిల్లు కనిపెట్టమని చెప్పి.

తీరా వెళ్తే - శానిటోరియం గుమ్మంలోనే తారసపడ్డాడు రవణమూర్తి. మొదట అతన్ని పోలిక పట్టలేకపోయాడు వరదరాజులు. నల్లగా మాడిపోయి, మాసిన గెడ్డంతో బికారిలాగా ఉన్నాడు. నీటిలో తేలే కొయ్యలాగ రంగు మారి, తేలికయి బలహీనంగా ఊగుతున్నాడు.

వరదని చూస్తునే బాధతో మూలిగాడు. గొంతులో ఇదివరకటి ఉత్సాహమయినా కనిపించలేదు.మాట్లాడాలనే ఆసక్తిలేకుండా తప్పనట్లు నోరు కదుపుతున్నాడు. అల్లంత దూరంలో వరదరాజుల్ని చూస్తూనే మెట్లమీద కుచున్నవాడల్లా లేచి ఎదురు వచ్చాడు.

"నీకోసమే చూస్తున్నాను" అంటూ సామాను కూడా దింపుకోనియ్యకుండా తోటవేపు నడిపించి తీసుకుపోయాడు.

"ఎలా వుంది సుజాత?" అడిగాడు వరద ఆతృతగా.

రాయిమీద కూర్చునేవరకూ ఏమీ మాట్లాడలేదు. కూర్చున్నాక చెమటపట్టిన మొహాన్ని తుడుచుకుని మొదలుపెట్టాడు.

"ఇలాంటి కష్టం యిక ఎవరికీ రాదు" అన్నాడు.

"ఏమిటీ?"

"అమ్మ చచ్చిపోయింది."

తలమీద పిడుగు పడ్డట్టు కంపించాడు వరదరాజులు.

"ఎప్పుడూ?"

"నీకు టెలిగ్రాం పంపిన రోజున సాయంకాలం."

రవణమూర్తి కదల్లేదు. ఏడవలేదు. నిశ్చలంగా కళ్ళుమూసుకున్నాడు క్షణకాలం.

వరదరాజులు స్తబ్దుడయి రవణమూర్తి మాటకోసం ఎదురు చూస్తూ కూచున్నాడు.

"మరో విషయం, ఇంతవరకూ ఈ సంగతి సుజాతకి తెలియదు. చెపితే దాని ఆరోగ్యం పాడవుతుందన్నారు డాక్టర్లు. దాన్ని ఆపలేక చస్తున్నాను. చిన్నపిల్లకూడా కాదు. 'అమ్మ ఏదని' అడుగుతోంది."

ఇప్పుడిక ఆగలేక బావురుమన్నాడు రవణమూర్తి. ముఖం రెండు చేతుల్తో కప్పుకుని నీరసంగా కదిలాడు. ఆ ఒంటరితనం, ఆ అసహాయత ఎవరూ అనుభవించనిది.

"ఇప్పుడేం చెయ్యాలి?" అన్నాడు వరద.

కాస్సేపటికి తేరుకున్నాడతను. "ఏం చెయ్యడానికీ ఆలోచన పోవడంలేదు, గుంటూరులో ఓ మావయ్య ఉన్నాడు మాకు. ఏదో దూరపు చుట్టరికం. అమ్మ అక్కడికి వెళ్ళిందన్నాను. ఎందుకు వెళ్ళింది అంటుంది."

"అసలు ఎలా పోయారు ఆవిడ?"

"నువ్వు పంపిన తర్వాత నీ వుత్తరం చూసుకుని స్టేషనుకి వెళ్ళాను. అమ్మను చూసేసరికి నాకు మతిపోయింది. మనిషి చాలా మారిపోయినట్టనిపించింది. అంత పాలిపోయి, నీరసించి వుండగా నేనెప్పుడూ చూడలేదు. నన్ను చూస్తూనే ఏడ్చింది. చెయ్యి అందించి రైలు దించాను. మాట్లాడుతూండగానే నా చేతుల్లో సొమ్మసిల్లిపోయింది. వెంటనే యిక్కడికి తీసుకొచ్చాను. ఎవరో అమ్మమీద పగతీర్చుకుంటున్నట్టు అనిపించింది. క్షణక్షణానికీ శరీరం తెల్లబడింది. 'ఎప్పుడు వస్తుంద'ని ఒకటే అడగడం సుజాత. వస్తుందన్నాను. ఆ రాత్రి ఓసారి అమ్మకి స్పృహ వచ్చింది. ఏదో గొణిగింది. సుజీని చూస్తాను అంది. నాకు భయమేసింది. ఆమె అనారోగ్యాన్ని చూసి సుజాత కృంగిపోవచ్చు. ఏం చెయ్యాలా అని ఆలోచించేలోగానే అమ్మకు మళ్ళీ స్పృహ తప్పింది. అంతే. మరిక కళ్ళు విప్పలేదు. రెండోరోజు సాయంకాలం నా తొడమీద తలవుంచుకుని ప్రాణం వదిలింది."

నిట్టూర్చాడు.

గొంతు పొడిబారి మాట రావడంలేదు వరదకి. చివరికి అన్నాడు, "నువ్విప్పుడు మరీ జాగ్రత్తగా వుండాలి. దుఃఖం పెంచుకోకు, అమ్మ గురించి భయపడి దిగజారిపోతే సుజాతకి ప్రమాదం రావచ్చు. సుజాత ఎక్కడుంది?"

"మధ్య హాల్లోకి మంచం మార్చారు."

"అయితే మొదట నేనక్కడికి వెళ్తాను. అమ్మ విషయంలో మిగతా ఏర్పాట్లన్నీ నువ్వుచెయ్"

అలాగే నన్నాడు రవణమూర్తి, లేస్తూనే వరదరాజులు రెండు చేతులూ పట్టుకున్నాడు.

"సుజీతో యిక్కడ వుండలేను, ఇంటికి పోదాం."

"అదెలా! రోగం పూర్తిగా పోనిదే వెళ్ళనివ్వరు డాక్టర్లు."

"నేనిక యిక్కడ వుండలేను. ఇవన్నీ మరచిపోయి ఎక్కడికయినా పారిపోవాలనుంది. యింటికి పోతే కాస్త నయం."

ఆ కళ్ళల్లో వేదన చూసి ఆగాడు వరద, "సరేలే, నేను డాక్టర్లతో మాట్లాడి చూస్తాను. నిజమే ఈ పరిస్థితుల్లో ఎవడికయినా అలా అనిపిస్తుంది" అన్నాడు.

మెట్లెక్కుతూండగానే సుజాత అరుస్తూ పరిగెత్తుకొచ్చింది. "ఏమండోయ్ నన్ను మరిచిపోయారు? వినత పెళ్ళి ఎలా జరిగింది?" అంటూ.

అంతరాంతరాళల్లో యిద్దరూ వణికారు.

"వెళ్ళి పడుకో సుజీ, అలా మాటిమాటికీ లేవకూడదు, హెచ్చు మాట్లాడకూడదు అంటున్నాడు రవణ.

"అన్నయ్య పిచ్చి వరదగారూ. వినత పెళ్ళికి రానందుకు ఏడ్చాను. ఇప్పుడింక యింటికి పోవచ్చునండి. మీరు డాక్టర్లతో చెప్పండి" అంది.

"అందుకే వచ్చాను. ఇవాళే మాట్లాడుతాను. ముందు నువ్వు పడుకోవాలి పద"

"నే వెళ్తాను" అన్నాడు రవణ.

"ఎక్కడికి?" అంది.

"ద్రాక్షపళ్ళు తెమ్మన్నాను. వెళ్ళనీ వాణ్ణి."

రవణ వెళ్ళాడు. సుజాత వినత విషయం, పెళ్ళికొడుకు విషయం అడుగుతూ మంచం దగ్గరికి నడిచింది. టేబులు మీద దూదితో చేసిన పిల్లి బొమ్మవుంది.

"చూశారా దీన్ని - హాస్పిటల్ దూదితో తయారుచేసాను. కళ్ళు రెంటికీ రెండు నల్లటి గుండీలు కావాలి - ఒకటి దొరికింది"

పిల్లికి ఓ కన్నులేదు.

"భేష్ నీ పిల్లికి ఒకటే కన్ను. రెండోది అనవసరం."

నవ్వాడు వరద.

"ఏవండీ, సంగీత విద్వాంసులకి ఎందుకు టి.బి వస్తుందంటారు?"

ఆశ్చర్యపోయాడు వరద." ఎందుకేవిటి? వాళ్ళు దేవుళ్ళు కారుగా?"

"మనస్సు నిండా అంత తీపి, గొంతులో అంత అమృతం ఛ! వాళ్ళకి రోగాలు రాకూడదండి."

"అదేం?"

"రెండు రోజుల క్రితం వరకూ ఒకావిడ ఆ ఎదురుగ్గా వుండే మంచం మీదుండేది. ఎంత మంచి గొంతనుకున్నారు? కిటికీలోంచి చూస్తూ ఎప్పుడూ ఒకేపాట పాడేదండి. ఏమిటంటే

"పాడమంటివి పాతపాటను
యెడద తడబడి యెగురునట్టుల
పాడుపడి బరువైన నా హృది
పలవరించు నటుల్.."

"ఎప్పుడూ దిగులుగా కూచునేది, ఉత్సాహంగా వుంటే పాడేది. లేకపోతే లేదు. ఆమెకోసం ఎవరూ వచ్చేవాళ్ళు కారు. ఓ రోజు నేనే కల్పించుకుని మాట్లాడాను. పేరు చాలా మంచిదండి వైదేహి. పాటలంటే భర్తకి యిష్టంలేదట, పాటలు పాడడం ఆమెకి అలవాటు - భోజనం, నిద్రలాగ, ఎప్పుడూ తిట్టి కొట్టేవాడట, మరో సంవత్సరానికి టి.బి రాగానే అసహ్యించుకుని తగలేశాడట. అంతే చెప్పింది. తర్వాత ఏడుస్తూ కూచుంది, మంచం దగ్గరి నుంచి వచ్చేశాను, సాయంకాలం మళ్ళీ పాడింది.

"యెంత పాడిన సుంతయేనియు
యెరుగనైతివి జాడయయ్యో
వింతవితగ పరుగులిడుయెద
వంతచెందెనటుల్"

"ఇప్పుడెక్కడుంది ఆవిడ?"

"ఆ రాత్రే రక్తం కక్కుకుంది. తెల్లవారేసరికి చచ్చిపోయింది. నేను లేచేసరికి మంచం ఖాళీగా పడివుంది."

గుండె ఝల్లుమంది వరదరాజులుకి.

"కష్టాల్తో బ్రతికిన ఆమె పోయిందని విచారించనక్కర్లేదు. కానీ అంతమంచి కంఠం పోయిందే, మళ్ళీ ఎలా వస్తుందీ యిప్పటికీ ఆ పాట నాకు గుర్తే!"

"అలాంటివి నువ్వు ఆలోచించకూడదు సుజీ, మనస్సు పాడు చేసుకోకూడదు. హాయిగ తోటవేపు చూస్తూ పడుకో!"

"భలే! ఆలోచించకుండా పడుకోవడం రచయితల దగ్గర నేర్చుకోవాలి. మరో విషయం, నాలుగురోజుల క్రిందట ఓ ముసలావిడ

పక్క గదిలో పోయిందటండి"

తుళ్ళిపడ్డాడు వరదరాజులు.

"అంతకు రెండురోజుల క్రిందటే యిక్కడికి వచ్చిందట. వస్తూనే పోయింది. నన్నటువేపు వెళ్ళొద్దన్నాడు అన్నయ్య. అదేమిటో పెద్దవాళ్ళని చూస్తే మా అమ్మ జ్ఞాపకం వస్తుందండి. ఎన్నో ఏళ్ళయినట్టుంది అమ్మని చూసి. ఓసారి చూడాలని వుంది" అంది కిటికీవేపు తిరిగి కూర్చుంటూ.

కూర్చోలేకపోయాడు వరద. లేచి ఆమెకు ముఖం కనిపించకుండా యిటు తిరిగి నిలబడ్డాడు.

"ఆమె యింకా అక్కడే ఉందంటండీ, ఎవరో రావాలిట. మొన్న సాయంకాలం అన్నయ్యలేకుండా చూసి అటువేపు వెళ్ళాను. లోపలికి తొంగి చూసి ఆశ్చర్యపోయాను. "

"ఏమిటీ?"

"మా అన్నయ్యకూడా యిక్కడే వున్నాడు. ఇంకా యిద్దరు ముగ్గురు డాక్టర్లు నర్సులు కూడా వున్నారు. భయపడి వచ్చేశాను" వరద వణుకుతున్నాడు, లోపల్నుంచి ఏదో పిరికితనం అతణ్ణి దహించింది. ఇక నిలబడలేక కిటికీ దగ్గరికి వచ్చి ముఖం తిప్పుకున్నాడు.

"ఇంక మాట్లడకు సుజీ - పడుకో" ఆ కంఠంలో కొత్తదనం చూసి ఆమె ఆశ్చర్యపడింది.

పడుకుంటూ అడిగింది "వరదగారు?"

"చెప్పు"

"అమ్మ ఎలావుంది?"

తికమకపడ్డాడు. "బాగానే వుంది."

"మావయ్య దగ్గరికి వెళ్ళిందటగా?"

"అవును. పంపమని వ్రాస్తే నేనే పంపిచాను."

చీకటిపడింది.

"వెలుగు తగ్గినా వీళ్ళింకా దీపం తీసుకుని రారు.. చూడండి" తొందరగా మంచం మీంచి లేవడంతో గ్లాసు కిందపడి పగిలింది.

భయపడి యిటు తిరిగాడు వరదరాజులు.

"ఎంత పిరికివారండి? ఆ మాత్రానికే" నవ్వింది, అతని కళ్ళల్లో నీటిని చూసి "అదేం? ఏడుస్తున్నారు"

"ఛ ఏడుపెందుకూ? దుమ్ము పడింది. దీపం తీసుకురమ్మని చెపుతానుండు" అని బయటకు వచ్చాడు వరారాజులు.

బయటికి వచ్చాక.

వేయి తుపానులు గడిచాక తీరం చూసిన నావికుడి మనస్సులా వుంది అతని మనస్సు.

రెండు రోజుల తర్వాత అతి ప్రయత్నం మీద డాక్టర్ల అనుమతి సంపాదించి సుజాతని తీసుకుని తిరిగి వచ్చేశారు యిద్దరూను.

వచ్చేసరికి మునిమాపు వేళయింది. రవణమూర్తి ఇంటిదగ్గర బండి దిగి "రేపు ఉదయం వస్తాను. సుజాత జాగ్రత్త" అని యింటికి వచ్చాడు వరదరాజులు.

మన్నుతిన్న పాములాగా నిశ్చలంగా వుంది ఆకాశం. అనంత పద్మనాభస్వామి ఆలయంలో దీపం వెలుగుతూనే వుంది.

గేటు దగ్గర నీడలో ఎవరో కూర్చున్నారు. వరదరాజులు వచ్చేసరికి అతను లేచి నిలబడ్డాడు.

"ఎవరది?"

"నేనండి, రామ్మూర్తిని"

ఆశ్చర్యపోయాడు వరద. "ఇంటికి వెళ్ళలేదూ?"

"లేదండి ఇప్పుడింక వెళ్తాను."

"రాత్రి డ్యూటీకి వెళ్తున్నారా!"

"ఊఁ"

"చాలా కృతజ్ఞుణ్ణి మీ సహాయానికి"

మాట్లాడలేదతను.

గేటు తెరిచి లోపలికి నడిచాడు వరద.

మెట్లుదాటి లోపలికి వచ్చేవరకూ రామ్మూర్తి మంచితనం, సాత్వికత కళ్ళల్లో మెదుల్తోంది.

***బీదతనంలోంచి 'మంచి' పుట్టి డబ్బులో కాలి, 'చెడు'తో నుసయి ప్రపంచమంతా ప్రాకింది.***

వసారాలో దీపపు వెలుగులో తన మడత కుర్చీలో కూర్చున్నారెవరో, ద్వారానికి చేరబడి మాట్లాడుతోంది నీలవేణి.

కొత్తవ్యక్తిని పరిచయం చేసుకోడానికి మనస్కరించలేదు వరదరాజులుకి, ప్రవాసం విడిన పక్షి స్వేచ్ఛలాగ, నాలుగురోజుల తర్వాత మొదటి ఆటవిడుపు అనుభవిస్తున్నాడు. అతనికిప్పుడు విశ్రాంతి కావాలి.

వరదని చూసి అతను లేచాడు. "నమస్కారం సార్" అన్నాడు.

వరద నీలవేణివేపు చూస్తున్నాడు, రోజురోజుకీ వాడిపోతున్న లతలాగ, లోపల్లోపల ఏదో అగ్ని కాల్చివేస్తోంది నీలవేణి మనస్సుని. రెక్కలు విచ్చుకు ఎగరలేక దిగులు పడ్డ పాలపిట్టలాగ ముడుచుకుంది. చీకటినీడల్లో తెల్లటి చీర వంటి నిండా చుట్టుకున్న ఆమె గుండ్రంగా బంతిలా కనిపించింది.

నూతన వ్యక్తికి నమస్కారం చెయ్యడం మరచిపోయాడు వరద.

"నాపేరు పీతాంబరం, నీలవేణి..?" ఆగిపోయాడు.

ఆ మాట విని స్థంభాన్ని పట్టుకు ఆగాడు వరదరాజులు.

"నీలవేణి నా చెల్లెలు" సందిగ్ధం మధ్య పెనిగిన గొంతుతో మెల్లిగా అన్నాడు పీతాంబరం.

వరద ఆశ్చర్యంతో అతని ముఖం చూడలేదు. నీలవేణిని గమనించాడు, రెండు నెలల్రితం తన యింటికి వచ్చినప్పటి ఆమె ముఖంలో ఛాయ ఎలా వున్నదో అదే ఛాయ అదే నీడ ఆ ముఖంలో ద్యోతకమవుతున్నది. అయితే యిది వరదకి కొత్తకాదు.

"కూచోండి" అని లోపలికి వెళ్ళాడు.

పెరట్లో గులాబితో ఏదో మాట్లాడుతున్నాడు వరదరాజులు, మళ్ళీ బయటికి వస్తాడేమోనని ఇద్దరూ అనుకున్నారు. కానీ అతను రావడం మరచిపోయాడు.

ఉదయాన్నే గోవర్ధనరావుగారింటికి వెళ్ళాడు వరదరాజులు. పుస్తకాలన్నీ ముందు పడేసుకుని ఒక్కొక్కటీ బీరువాలో సర్దుతున్నారాయన. పెద్దగాలివాన వెలిశాక కమ్ముకునే నిశ్శబ్దం ఆ యింట్లో కనిపించింది. వినత లేని లోటు తెలుస్తోంది. అంత యింటికీ యిద్దరు మాత్రం మిగిలారు. గోవర్ధనరావుగారు, ఆరోగ్యం.

''వంటమనిషిని మాన్పించేసిందోయ్. ఏమీ తోచడంలేదట. లోపల వండుతూ కూర్చుంటోంది.''

ఎదురుగ్గా నేలమీద కూచుని పుస్తకాల్ని చూస్తున్నాడు వరదరాజులు. తత్త్వశాస్త్రాలు, చరిత్రలు, వేదాంత గ్రంథాలూ, భారతం, భాగవతం, బైబిలూ, ఖురాన్ తెలుగు అనువాదం యివన్నీ ముందు పడేసుక్కూచున్నారు. వీటన్నిటి సంగ్రహింపులాగ వాటి మధ్య కూచున్న గోవర్ధనరావుగార్ని విచిత్రంగా చూస్తున్నాడు వరద. అతని ఆశ్చర్యాన్ని గమనించి నవ్వారాయన.

''ఇవన్నీ నేను చదివి పరిపూర్ణమయాననుకోకు. మా వెంకు అన్నట్లు పుస్తకాలు సంపాయించటం ఈ కాలపు ఫేషను.''

నవ్వుతూ ఆటబొమ్మలాగ గెంతుతూ, అందరి ఆటా కట్టించే తెల్లటి, సన్నటి వ్యక్తి గుర్తుకొచ్చాడు - వెంకటపతి.

''వెంకటపతి ఎక్కడికి వెళ్ళాడు?''

''ఏమో? ఎవరికి తెలుసు? రేపు వాడెక్కడుంటాడో వాడికే తెలీదు. మైసూరు వెళ్తాడట. వెన్నెట్లో బృందావన్ గార్డెన్సులో కూర్చోవాలనుందిట. నెల సెలవుంది. అజంతా కూడా వెళతాను అన్నాడు. నిన్ను కలుసుకోవాలనుకున్నాడు. మౌనంగా వున్న వాళ్ళల్లో మంచితనం ఎక్కువ వుంటుందట. హెచ్చు మాట్లాడి నేను చెడిపోయాను. ఏమీ మాట్లాడకుండా ఆయన చెడిపోయాడు అంటాడు''

నవ్వారు గోవర్ధనరావుగారు.

''అనుకొన్నంత తెలివితక్కువ వాడేంకాదు వెంకటపతి. తక్కువ కాలంలో చాలా అనుభవాన్ని గణించాడు. అలాంటివాళ్ళు అరుదు'' అన్నాడు వరదరాజులు భారతీయ తత్త్వ శాస్త్రానికి పట్టిన చెదని దులుపుతూ.

''అనుభవం కలిగింది సరే, అంతమాత్రాన వాడు పరిపూర్ణుడు కాలేదు. ఎవరికీ సాధ్యంకాని జీవితం మీద నిర్లక్ష్యం వాడి దగ్గరుంది. అది చాలు వాడికి, దేనికీ బాధపడడు అలాంటివాడిని దక్షిణ ధృవం దగ్గర పడేసినా సుఖంగానే గడుపుతాడు''

రెండు కప్పుల కాఫీతో ఆరోగ్యం వచ్చింది. మట్టిరంగు చీర వదులుగా కట్టుకుంది. గుండ్రంగా లుంగ చుట్టిన పెద్ద జుత్తూ, గుండ్రని ముఖం వినతని గుర్తు తెస్తుంటాయి. ఆ కళ్ళల్లో వెలుగు మరొక్కరిలోనే చూడగలిగాడు వరదరాజులు. అంతటి మెరుపూ, ఓర్పులో పూర్తి విలువలు, వేసంగి సాయంకాలపు పువ్వుల్లో స్వచ్ఛత, నెమ్మదితనం ఆ కళ్ళల్లో కనిపిస్తుంది. ఒక్క ఆరోగ్యం కళ్ళల్లో, మరొకరు నీలవేణి.

వరాని చూసి నవ్వింది.

ఆమె నవ్వుని వరదరాజులు ఎప్పుడూ నమ్మడు. ఆ నవ్వు వెనక పెద్ద భవిష్యత్తుని దాచుకున్నట్లు కనిపిస్తుంది. శాఖలు విప్పుకున్న మర్రి ఎన్నో కులాయాలను దాచినట్లు.

బెర్నార్డ్‌షానీ, మార్క్‌ట్వేన్‌నీ కలిపి చిన్నబల్లగా తయారు చేసి కాఫీల్ని అక్కడ వుంచింది.

''ఇన్నేళ్ళుగా చూస్తున్నానుగా? ఈ పుస్తకాలు చదివినందువల్ల ఈయనకి ఉపయోగం కనిపించలేదు. కానీ పుస్తకాల వల్ల ఉపయోగం వుంది. యిలా ఎత్తుపెట్టడానికి, టేబుళ్ళ క్రింద వత్తుకి. నిప్పుచెయ్యడానికీను. ఏమంటావ్?'' నవ్వింది.

గోవర్ధనరావుగారు మాట్లాడలేదు. కాఫీని అందుకుంటూ ''నా అతిధులంటే ముఖ్యంగా దీనికి గౌరవం లేవోయ్. ఒక్క నువ్వొస్తేనే నాకు కాఫీ దక్కుతుంది. నిన్ను పూర్తిగా అభిమానిస్తుంది. అదృష్టవంతుడివే'' అన్నారు.

కాఫీలో పంచదార బొత్తిగా లేదు. అయినా త్రాగుతున్నాడు వరదరాజులు. గోవర్ధనరావుగారు కాఫీ చప్పరించి, ''ఎంత మంచివాడివయినా యింత ఓర్పు పనికిరాదయ్యా నీకు, పంచదార లేకుండా నువ్వెలా కాఫీ తాగుతున్నావో కాని, వంటవాడు పోయినదగ్గర్నుంచీ, ఈ పదిరోజులయి యీావిడ వంట తినలేక చస్తున్నాను.''

ఫక్కున నవ్వేసింది ఆరోగ్యం. పంచదార కోసం లోపలికి పరిగెత్తింది.

భార్యాభర్తలు యింత అన్యోన్యయంగా ఉండగలరా అని ఆలోచిస్తున్నాడు వరదరాజులు.

"ఆరోగ్యం లాంటి భార్య దొరకడం నిజంగా నా అదృష్టం అనుకో. అందరికీ ఈ అదృష్టం కలగదు. దాన్ని వదులుకుంటే నా సంతోషమంతా పోయినట్టే."

ఆరోగ్యం వచ్చింది.

"వినతని తల్చుకుంటూ పంచదార వేయడం మానేసిందో లేదో అడుగు"

"కాదు" అందామె.

"మరి?"

"సుజాతనీ, ముఖ్యంగా రవణమూర్తినీను"

కాస్త నిర్ఘాంతపోయాడు గోవర్ధనరావుగారు.

"అవునవును. సుజాత విషయం చెప్పావు కావేం? ఎలా వుంది అమ్మాయి?"

"కాస్త కులాసాగానే వుందండి. కానీ రవణమూర్తి తల్లిపోయింది."

చేతిలో భగవద్గీత వదిలేశారు గోవర్ధనరావుగారు. ఆరోగ్యం పంచదార కలుపుతున్నదల్లా ఆగిపోయింది.

"అదేం?"

"నీరసం, బెంగ, ముసలితనం, వీటితో దిగజారిపోయి అక్కడికి వెళ్ళగానే మరణించింది. చివరికి కోపం వచ్చి 'రోగం ముదిరితే యీ మాటు యిక్కడ చేర్చుకోము. తీసుకెళితే తీసుకువెళ్ళండి. మీ యిష్టం' అన్నారు. ఏం చెయ్యం, తీసుకొచ్చేశాం."

వాతావరణమంతా మరీ మందకొండిగా తయారయింది. గోవర్ధనరావుగారు లేచి కళ్ళజోడు తీసుకుని కళ్ళు తుడుచుకున్నారు.

"అంతకన్నా ముఖ్య విషయం తల్లిపోయినట్టు సుజాతకి తెలియదు. ఆరోగ్యం పాడవుతుందని చెప్పవద్దన్నారు డాక్టర్లు."

ఆరోగ్యం మాట్లాడలేకపోయింది.

"నేను రవణమూర్తి దగ్గరకి వస్తాను వరదరాజులూ! ఇప్పుడు వెళదామా?" అంది ఆరోగ్యం.

వరద సంశయించాడు.

గోవర్ధనరావుగారు ఆమె ముఖం చూసారు. చాలా నిర్ధారణగా, నిశ్చయంగా అన్నదామె. అప్పటి ఆమె ముఖంలో సాధుత్వం, కరుణ చూసి ఆశ్చర్యపోయేడు ఆయన.

"నేనూ వస్తాను పదవోయ్. రవణ కుర్రవాడు. ఓర్పు అవసరం. కోటు వేసుకు వస్తానుండు" అని లోపలికి వెళ్ళారు.

"పోనీ, సాయంకాలం వెళ్తాన్నేను. ఎలా వుందో కనుక్కుని చెప్పు" అన్నదామె.

కోటూ, చేతికర్రా తీసుకువచ్చారు గోవర్ధనరావుగారు.

"ఏదీ యీవిడ?"

"సాయంకాలం వెళతారట. మనం వెళదామా? యీ పుస్తకాలూ?"

"అలాగే వుండనీయ్. మనిషిని ఉద్ధరించమనేగా యివన్నీ చెప్పేవి. పదముందు" అన్నారు.

ఇద్దరూ వీధిలోకి వచ్చేసరికి ఎండ వాలుపట్టి మండిస్తోంది. అప్పటికింకా ఎనిమిదయి వుండదు.

వరదరాజులు భుజం మీద చెయ్యివేసి నడుస్తూ మాట్లాడారు గోవర్ధనరావుగారు.

"రవణమూర్తిలాంటివాళ్ళు బ్రతక్కూడదోయ్. అంత అమాయకుల్ని లోకం అనవసరంగా, నిర్లక్ష్యంగా, నిర్దయతో చంపేస్తుంది.

కాలం, సంఘం, విధి అన్నీ మోసం చేస్తాయి. అలాంటి వాళ్ళకి సహాయం చెయ్యలేం. చూసి జాలిపడగలం. అంతే.''

రవణమూర్తి గురించే ఆలోచిస్తూ నడుస్తున్నాడు వరదరాజులు.

ఇంతవరకూ సంతృప్తి, సుఖం ప్రశాంతత రుచిచూడలేదు రవణ. ఎప్పుడో ఒకప్పుడు కుటుంబమంతా టి.బితో నాశనమవుతుందని తెలుసు. ఆ క్షణం కోసం ఎదురుచూడడం తప్పిస్తే చేసేదేమీ లేదు. కోరికలూ, ఆశలూ లేని మనిషి రవణమూర్తి. ఎవరిలోనూ ఉత్సాహం రేపని గడ్డిమొక్కల్లాగ, అన్నిటికీ తలవొంచే పువ్వులగా ఎక్కడో పెరిగి ఎప్పుడో వాడిపోతాడు. ఉన్నప్పుడు ప్రపంచం అతన్ని గమనించలేదు. లేనప్పుడూ అతని గురించి బాధపడదు.

చీకటులు అందంగా ఉన్నాయి.

ప్రాంతఃప్రసక్తిని నిశీధి నీడలు చివరి ఆశ కూడా వదులుకొని మృత్యువును ఆహ్వానించే మనస్సులా వున్నాయి.

సగం మనస్సుతో వెలుగుతున్నట్టున్నాయి చుక్కలు.

చల్లటి రొజ్జుగాలిలో నల్లటి దుప్పటి కప్పుకు పడుకున్న కుక్కలా వుంది ప్రపంచం.

చలి ఎరగని కొండనలుపూ, నిశ్శబ్దానికి తోడుగా కూచున్న ఆ లోతు నిద్రా, బద్ధకంతో వొళ్ళు విరుస్తున్న కుక్కా, ఆలోచనల్లో వరద మనస్సూ మిగిలాయి.

ఈ రొటీను బ్రతుకు మీద జీవితంలో మొదటిసారి విసుగేసింది. ఓ చెత్త, దరిద్రపు బలహీనతకి సంఘం ఓపేరు పెట్టింది – 'సహాయం' తను బ్రతకు బ్రతకడం ఎలాగో తెలీని చేతకానివాడు, మరొకరి చేతకానితనానికి దోహదం చెయ్యబూనడం, ఈ బలహీనతల సమిష్టిరూపం వరదరాజులు. అతనంటూ వేరేలేడు. సైకో ఎనలిస్టుచేతుల్లో పడేస్తే ధాతువు లన్నిటినీ వేర్వేరుగా ఏరి వరదని వేర్వేరు బలహీనతలుగా ఏరి చూపిస్తాడు. స్త్రీలో కన్నీటిని చూడలేని బలహీనత, అందాన్ని చూసి మూర్ఛపోవడం, గొప్పతనాన్ని నమ్మడం, కష్టాన్ని చూసి జాలిపడడం, 'మంచి' మీద గౌరవం, జీవితం మీద ఆశ ఇవన్నీ తీసేస్తే వరదలేడు.

మరొకరి విషయమంటూ పట్టించుకోకూడదనుకున్నాడు వరద మొదటిసారి.

ముట్టెకు పట్టుకున్న గడ్డిపురుగును వదిలించుకోలేక అరవడం ప్రారంభించింది కుక్క.

చర్చిలో పన్నెండు కొట్టేరు.

తొందరగా నడిచాడు వరదరాజులు. గేటు తీసుకు లోపలికి వచ్చాడు.

ప్రియుని కౌగిట్లో మూర్ఛపోయిన ముద్దలాగు శాఖలన్నీ విప్పుకుని స్థిమితంగా గన్నేరు చెట్టు.

గేటు చప్పుడు కాగానే స్తంభానికి చేరబడి అక్కడే నిద్రపోయిన నీలవేణి తుళ్ళిపడి లేచింది. దీపం ఎప్పుడో ఆరిపోయింది. ఆ చీకట్లో మెట్ల దగ్గర ఆగిపోయి ''గులాబీ'' అన్నాడు దారితోచక.

దీపం వెలిగించి తెచ్చింది నీలవేణి.

ఆమెను చూసి నివ్వెరపోయాడు వరద. మాట్లాడకుండా లోపలికి నడిచాడు.

దళసరి నెమలి కంఠం రంగుచీరె కట్టుకుంది. తలలో కనకాంబరం పువ్వు లేత యెరుపూ, నుదుటి మీద బొట్టులో రక్తిమ, అంతా ఎర్రటి పువుతీవెలాగు, మరొక్క క్షణమాత్రం మెరవగల సంజెపొద్దు మొదటి చుక్కలాగ వుంది.

పచ్చటి గోరంచు ముతకపంచె కట్టుకుని తువాలు కప్పుకుని వచ్చాడు వరద.

భోజనం చల్లబడి సాగుతోంది నోటికి అడ్డు తిరుగుతూను. తలుపుకి చేరబడి నిలబడింది నీలవేణి. చీర అంచు మాత్రం

బద్ధకంగా కదుల్తూ కనిపిస్తోంది.

"ఇవాళ్టికి ఒక నిర్ధారణకి వచ్చాను నీలవేణీ! రేపట్నుంచీ ఎక్కడికీ వెళ్ళను. ఎవరికీ సహాయం చెయ్యను. అసలు నేను చేసేది సహాయం కాదు. నా పని మానుకోవడానికి కల్పించుకున్న అవకాశం."

మాట్లాడలేదామె.

"పైగా యిప్పుడిక నా అవసరం కూడా లేదు రవణకి. సుజాత కులాసాగా వుంది"

"..."

"నువ్వు నేర్పిన మొదటి పాఠం - అవునా?"

అప్పటికీ మాట్లాడలేదామె. తలెత్తాడు. ఓ దీపపు పురుగు ఆమె చుట్టూ తిరిగి ఝుంకారం చేస్తోంది.

మరికాస్సేపటికి అన్నాడు "ఒక్క విషయం అడగనా?"

"ఊఁ"

"పీతాంబరం ఎవరు?"

తుళ్ళిపడింది నీలవేణి.

"ఆయనే చెప్పారుగా?"

"నువ్వు చెపితే నమ్ముతాను"

"..."

"యిష్టం లేకపోతే వద్దు"

"ఏమీకారు నాకు"

"నిన్న అతణ్ణి సరిగా చూడలేదు. ఈసారి వచ్చినప్పుడు చెప్పు, మాట్లాడుతాను"

"సాయంకాలం వచ్చారు"

ఆశ్చర్యపోయాడు వరదరాజులు. ఏదో చెప్పాలనుకుని చెప్పలేకపోతున్నాడు యింతకాలం. తనని కూడా మార్చేంత శక్తిగల నీలవేణి దుర్భలత్వం, కాలుష్యం ముందు ఓడిపోతుందేమోనని భయం. ఆమె భూతకాలం పెద్ద భూతంలాగ, ఆమె చుట్టూ తిరిగే వ్యక్తులు ఆమెకి తగని నీడల్లాగ ఊహించుకున్నాడు. ఆ నిశ్చలత్వానికీ, ఆ స్తబ్దతకీ విలువ కట్టడం తనకి చేతకాదు. జీవితం మరి వెయ్యి శిక్షలు విషించినా నీలవేణి మారదు. అలాగే ఉంటుంది. విశ్వేశ్వరంలోంచి ఆ నైర్మల్యాన్నీ, ప్రశాంతతనీ పోగుచేసుకుందాం అనిపిస్తూంటుంది ఒక్కొక్కప్పుడు.

"నీతో ఎప్పుడయినా చెప్పాలనిపిస్తుంది నీలవేణీ. నువ్వెవరో నాకు చెప్పలేదు. విశ్వేశ్వరం నిన్నెలా చూశాడో చెప్పలేదు. పీతాంబరం ఎవరో అంతకన్నా తెలీదు నాకు. పొరపాటు పడకు. చాలామంది మీద లేని గౌరవం నీమీద వుంది నాకు. కానీ వీళ్ళందరినీ చూస్తే ఏమనిపిస్తుందంటే నువు ఏవో చెప్పలేని దుర్ఘటనల మధ్య నలిగిపోతున్నట్లు, నమ్మకం వుంటే నాతో చెప్పు. మార్చగలనేమో చూస్తాను. లేదా నీ యిష్టం."

ఆమె మాట్లాడలేదు.

పక్కగదిలో పిల్లి ఏదో దొర్లొంచి పెద్ద శబ్దం చేసింది. తలెత్తాడు వరదరాజులు.

నీలవేణి ఏడుస్తోంది.

భయంవేసిందతనికి. ఆమె విషయం అడగబోయి కన్నీటిని చూడడం యిది రెండవసారి.

''మరెప్పుడూ అడగనులే'' అని గొణిగాడు.

తన దుఃఖం తనకే అసహ్యంగా కనిపించి నీలవేణికి. లేచి కళ్ళు తుడుచుకుని నీళ్ళందించింది.

చేతులు కడుక్కుని లోపలికి వచ్చేసరికి కనకాంబరాల్ని బల్లమీద ఉంచుతోంది నీలవేణి. నీటిపై పొరని పరిగెత్తే చేపల్లా వున్నాయి కళ్ళు. దుఃఖం మధ్య నీలవేణి వింతగా కనిపిస్తుంది.

చిన్న గాలికి ఆకులు కదిలాయి. మంచానికి మధ్యగా గన్నేరుపువ్వు పడుకుని పలవరిస్తోంది. దాన్ని కదపడం యిష్టంలేక మంచం చివర కూచున్నాడు.

నిద్దట్లో గులాబి పలవరిస్తోంది.

గదిలో దీపం సగం తగ్గిన వెలుగూ, నీలవేణి ఆవులింతా వినిపిస్తోంది.

**కురియని నీటిభారాన్ని** మోసుకుని బాలింతల్లాగ కదుల్తున్నాయి మేఘాలు. క్షణంలోనో, సగంలోనో వర్షం వచ్చేట్టుంది. ప్రవాసం విడిచిన ఖైదీ స్వేచ్ఛ అనుభవిస్తోంది గాలి. ఆ దూకుడుకి గన్నేరు చెట్టు విరిగి పడుతుందా అనిపించింది.

ఎదురుగ్గా అనంత పద్మనాభస్వామి ఆలయంలో గజస్థంభం గంటలు గాలికి మ్రోగుతున్నాయి.

కుర్చీలో కూర్చున్న వరదరాజులు గేటు తెరుచుకుని లోపలికి వస్తూన్న ఆరోగ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఇదివరకెప్పుడూ యిలా రాలేదామె. అందుకని వింతగా చూశాడు.

తెల్లటి చీర వంటినిండా తిప్పి బరువుగా వ్రేలాడే సిగమీద కప్పుకుంది. నీడపడిన వాతావరణం మధ్య తెల్లటి చీరెలో ఆరోగ్యం లావణ్యం ఏదో పక్షి వయ్యారాన్ని గుర్తుతెస్తోంది. నల్ల కలువ లాగా పల్చని, సున్నితమయిన మనిషి. విశాలమయిన నల్లటి నుదురు మీద బొట్టు వుంటే ఎంత అందంగా ఉంటుందో అనిపిస్తుంది. ముక్కు వంపులో ధిక్కారం, పెదవుల చివర నవ్వూ ఆమె సొత్తు.

లేచి నిలబడి 'గులాబీ' అని పిలిచాడు వరదరాజులు.

పెరట్లో బంతి చెట్టుకి గొప్పు తవ్వుతున్నదల్లా గులాబి పరిగెత్తుకు వచ్చింది. నీలిరంగు చీరముందు కుచ్చెళ్ళు బొడ్డు దగ్గర దోపుకుని, కొంగు నడుం చుట్టూ తిప్పింది. ఎర్రపువ్వుల జాకెట్టు మరీ బిగువయి భుజాల్ని అదిమిపట్టింది. జుత్తు ముడివిడి భుజాల మీదికి, తలమీదికి పాయలుగా జారింది. నుదురు, ముక్కు చెమటపట్టి మెరుస్తున్నాయి.

స్థిరాన్ని వెదుక్కుందుకి వేరులన్నీ జాపి బలాన్ని కూడదీసుకుంటున్న చెట్టులాగ కనిపించింది ఆమె. యౌవనం అవయవాల్ని మలిచి, బలాన్ని పుంజుకుంటోంది. ప్రతీ అవయవం గట్టిపడి తానుగా నిలిచి పలకరిస్తోంది.

ఎక్కడో పొలాల మధ్య ఉండాల్సిన మనిషి గులాబి. సగం పెరిగిన జొన్నకంకులాగ వంపులు తిరిగి పిటపిటలాడే వయస్సు.

జుత్తు వెనక్కి తీసుకోబోయేసరికి నుదురంతా మట్టయింది. ఆరోగ్యాన్ని చూసి ముడుచుకు పోయిందామె. వరదరాజులు కూడా సిగ్గుపడ్డాడు.

''చాప వెయ్యన్నయ్యా. యిప్పుడే వస్తానుండండి'' అని పారిపోయింది.

ఆరోగ్యం క్షణం మాట్లాడలేకపోయింది. వెంటనే నవ్వి ''ఇంత అందాన్ని దాచడం మంచిది కాదోయ్. త్వరగా పెళ్ళి చేసేయ్'' అంది కూచుంటూ.

''మరో కాశీపతి దొరకాలి దీన్ని చేసుకోడానికి''

"అయితే కష్టమేనే"

మాట్లాడకుండా కూచున్నాడు వరదరాజులు.

"అలా కూచుంటే కాదు. మీ యింట్లో ఓ అమ్మాయి వుందిట. చూసిపోదామని వచ్చాను. పిలువ్" అంది.

నివ్వెరపోయాడు వరద.

"ఎవరు చెప్పారు?"

"ఆయనే అన్నారు. ఇంట్లో ఏమీ తోచకుండా కూర్చునే సరికి వెళ్ళిరమ్మన్నారు. సుజాతని చూసి వస్తున్నాను."

"ఎలా వుంది సుజీ?"

"బాగా నీరసించిపోయింది. రోగం పూర్తిగా తగ్గినట్టే అన్నాడు రవణ. అమ్మాయి మాట ఎలా వున్నా అతణ్ణి చూస్తే జాలేసిందోయ్. అంత చిన్న వయస్సులో మోయలేనన్ని కష్టాలు. దురదృష్టం మాట ఎలా వున్నా అతను పెళ్ళి చేసుకుంటే కొంత సహాయమన్నా ఉంటుందన్నాను. నువ్వేమంటావ్?"

"వాడి ఆరోగ్యం మీద వాడికే నమ్మకం లేనప్పుడు యింకో వ్యక్తి జీవితం పాడు చెయ్యడం ఎందుకులే అంటాడు. మీకూ తెలుసుగా ఆ కుటుంబం సంగతి? టి.బిని దాటి బ్రతికిన వాళ్ళు లేరు."

"అదీ నిజమేలే" అని నిట్టూర్చింది ఆరోగ్యం.

నల్లటి వెడల్పాటి అంచు పరికిణీ మీద వల్లెవాటు వేసుకుని గుండ్రంగా బొట్టు దిద్దుకు వచ్చి కూచుంది గులాబి.

"బంతిపూచెట్టుకి గొప్పు తవ్వుతున్నాను."

"నీకు పువ్వులు యిష్టమన్న సంగతి మరిచిపోయి పళ్ళు తీసుకొచ్చాను. అయితే వినత వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ మా యింటికి రావాల్సిన అవసరం తీరిపోయిందనుకున్నావా యేం? లేకపోతే మీ అన్నయ్య వద్దన్నాడా?"

"లేదండీ రేపు వస్తాను తప్పకుండా" సిగ్గుపడింది.

"గులాబి ముఖంలో సిగ్గు బావుంటుందోయ్. పెళ్ళి త్వరగా కానియ్. నేను పెత్తనం చేస్తాను."

రెండు చేతుల్తో ముఖం కప్పుకుంది గులాబి.

"ఏదీ? ఆ అమ్మాయి కనిపించదే?"

"నీలవేణి ఏదీ?" అన్నాడు గులాబితో.

"వస్తుంది. స్నానం చేస్తోంది."

మరో క్షణంలో కాఫీ తీసుకువచ్చింది నీలవేణి.

సగం ఎండిన వరికంకు రంగు చీర కట్టుకుంది. తొందరగా జుత్తు వెనక్కి తిప్పి ముడివేసింది. తడిసిన వెంట్రుకలు నుదుటిని పట్టి నీరసంగా వేలాడుతున్నాయి. బొట్టు రంగు తడిలో మరీ ఎర్రబడి కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. కాఫీ తెచ్చి ఆరోగ్యం ముందు వుంచి గులాబి పక్కన కూచుంది.

"ఈమేనా ఆయన చెప్పిన అమ్మాయి?"

"అవును. పేరు నీలవేణి" అన్నాడు వరద.

"నిన్నంతా యీమె గురించి పొగుడుతూ కూచున్నారు. భోజనం విషయంలో కోపంతో విసుక్కునేసరికి - "ఓర్పు నీకింకా తక్కువ. ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళి నేర్చుకో" అన్నారు. అందుకని యివాళ పనికట్టుకు వచ్చాను" నవ్వింది.

సిగ్గుతో నీలవేణి ముఖం ఎర్రబడింది.

"అంత గొప్పతనం నాలో ఏముంది? నాకేం చేతకాదు. అందుకని హెచ్చుమాట్లాడను" అంది చీర సవరించుకుంటూ.

"అలాక్కాదు. ***తనకేమీ తెలీదన్న విషయం తెలుసుకొందుకే కొందరికి జీవితమంతా గడిచిపోతుంది.*** నీలో గొప్పతనానికి అది మొదటి మెట్టు."

ఆ విషయంతో తనకేమీ సంబంధం లేనట్లు, నాటకంలా చూస్తున్నాడు వరద. ఆరోగ్యం సంస్కారం ప్రతీ మాటలోనూ కనిపిస్తుంది. మంచి భాష మాట్లాడుతుంది.

"మర్యాదగల వ్యక్తుల మధ్య పెరగలేదు నేను. ఎలా బ్రతకాలో కూడా తెలీదు" కళ్ళల్లో అసహాయత, వేదన చూసి విస్తుపోయింది ఆరోగ్యం.

"అంత తెలియనితనం నీలో లేదు నీలవేణీ. నీకు చాలా తెల్సు. తెల్సుననుకుంటున్న చాలామంది కంటే నువ్వు గొప్పదానివే. ఆయన చెప్పింది నిజం" అంది.

ఈ పొగడ్తల మధ్య గులాబి నలిగిపోయింది. "కాఫీ తీసుకోండి" అంది.

"వరద ఎప్పుడు వచ్చినా ఏదోలేని కాఫీ యిస్తానని పరిహాసం చేస్తారాయన. మీరెలాంటి కాఫీ యిచ్చారో చూస్తానుగా" అంది తాగుతూ.

వరదని చూసి "మనిషిని చూపడంతో నీ పని అయిపోలేదోయ్. ఆమె విషయం యింకా చెప్పు. ఎవరి విషయం వాళ్ళు చెప్పుకోవడం చాలాకష్టం. ముఖ్యంగా ఆడవాళ్ళకి."

నవ్వొచ్చింది వరదకి.

"నాకూ ఏమీ తెలీదు ఆమె గురించి. మీకేమైనా చెపితే విందామని కూచున్నాను."

"నిజం!" అంది ఆరోగ్యం నీలవేణి వేపు తిరిగి.

నీలవేణి సిగ్గుపడలేదు. "నిజానికి నా విషయం ఏమిటో నాకూ తెలీదు. ఎప్పుడయినా తెలిస్తే చెప్తాను" అంది.

నిర్ఘాంతపోయింది ఆరోగ్యం.

"భలే మనుషులే మీరంతా, నీ దగ్గరికి ఎలా వచ్చిందో చెప్పు పోనీ"

"విశ్వేశ్వరం అని నాకో స్నేహితుడున్నాడు"

"అవునవును. నాకూ తెల్సు?"

"ఎలా తెలుసు?"

"ఒకటి రెండుసార్లు నీతో చూసాను. బహుశా అతను కూడా నిడదవోలు నుంచే వచ్చాడనుకుంటాను?"

"అవును. వాడి తండ్రి ఉండే రోజుల్లో అక్కడే ఉండేవాడట. తర్వాత చాలా సంవత్సరాలు ఇక్కడే గడిపారు. వాడికి 'మనిషి' అని పేరు పెట్టకపోతే ఎవరికీ తెలియదు. ఉన్నపాటునే నిలిపి పేరు చెప్పమంటే తడబడతాడు"

కాఫీగ్లాసు తీసుకుని లేచింది నీలవేణి.

"వాడిని చూసి ఎందుకో జాలిపడేవాడిని. ఎందుకు బ్రతకాలో తెలీదు. అవసరం లేని, పనికిరాని చెత్తకాగితాల బుట్టలా తయారుచేసుకున్నాడు జీవితాన్ని. కొన్నాళ్ళు బడిలో పనిచేశాడు. మరి కొన్నాళ్ళు మిలటరీలో తిరిగాడు. సుమారు నాలుగు నెలల క్రితం యిక్కడికి వచ్చాడు. ఓ సాయంకాలం యీ నీలవేణిని తెచ్చి యిక్కడ వదిలిపోయాడు. ఇంతవరకూ వాడి జాడ తెలీదు."

ఎవ్వరూ మాట్లాడలేదు. ఆరోగ్యం నిట్టూర్చింది.

"అంత తన మీద తనకే నమ్మకం లేని మనుషులు బ్రతక్కూడదు" అంది. ఆ మాటలో కనిపించిన జుగుప్స, అసహ్యత చూసి ఆశ్చర్యపోయాడు వరదరాజులు.

"అవసరంలేని పుస్తకాన్ని పారేయడం ఎలాంటిదో, నీలవేణిని వదిలేయడం కూడాను. ఇక్కడ వదిలేసి పోయాడు. బహుశా యీ పాటికి యీ విషయం మరచిపోయి వుంటాడు."

ఇంకేమీ మాట్లాడలేదు ఆరోగ్యం లేచి నిలబడుతూ "దేవుని మీద నాకు చాలా నమ్మకం వుంది. ఎలాగయినా చివరికి నీలాంటి మంచివాడి దగ్గర చేరడం నీలవేణి అదృష్టం" అంది.

అప్పటి నీలవేణి ముఖం చూడాలనుకున్నాడు వరదరాజులు. కానీ ఆమె ఎక్కడనో తనకు తెలీని చోట ఉండిపోయింది.

"చీకటి పడింది. ఇక వెళ్ళాలి. ఏదీ నీలవేణి?"

వచ్చి గుమ్మం దగ్గర ఆగిపోయిందామె.

"ఇలా రా. నిన్నొకసారి దగ్గరగా చూడాలి"

పళ్ళు సంచిలోంచి తీసి యిస్తూ "ఇంతకంటే మంచి బహుమానం యీసారి తెస్తాను. ఎన్ని కష్టాలొచ్చినా సరే నీ మంచితనాన్ని మాత్రం వదులుకోకు. కొనుక్కోవాలనుకున్నా దొరికేది కాదది" దగ్గరకు వంగి ఆమె నుదుటిని ముద్దుపెట్టుకుంది ఆరోగ్యం.

"ఇక పదవోయ్. నన్ను వీధి చివర వరకూ విడిచివద్దువుగాని"

"పదండి" అని లేచాడు వరదరాజులు.

గులాబిని చూసి "రేపు తప్పకుండా రావాలి పిల్లా నువ్వు. మంచి కోవా చేసి వుంచుతాను నీకు తినిపించడానికి" బుగ్గమీద చిటికేసి నడిచిపోయింది.

ఇద్దరూ గుమ్మానికి ఆనుకుని నిలబడిపోయారు.

వరద తిరిగి వచ్చేసరికి బాగా చీకటి పడింది.

వాకిట్లో వాల్చిన మంచం మీద పీతాంబరం కూచుని వున్నాడు. ఇంతవరకూ అతన్ని సరిగ్గా చూడనయినా చూడలేదు వరదరాజులు. చీకట్లో కూడా మెరుస్తున్న పైజమా. చేతుల్ని దాటి వేలాడుతున్న లాల్చీ వేసుకున్నాడు. పొట్టిగా, బలంగా, నిండుగా, ఛామనఛాయగా ఉంటాడు. పళ్ళు కొంచెం ఎత్తుబడి క్రింది పెదవిని నొక్కి అమాయకతను పెంచాయి. తెలీని కళ్ళు చికిలింతకు సన్నబడినట్టు ముడుచుకుని తెచ్చిపెట్టుకున్నట్టుగా ఉత్సాహంతో కనిపిస్తాయి. నిశ్చయంగా, పూర్తిగా నిండుగా వినిపించే గొంతుకలోంచి మాట స్వగతంలా కదుల్తోంది.

వరదరాజుల్ని చూసి లేవబోయాడు.

"కూచోండి. మీ కోసమే చూస్తున్నాను. వస్తారని తెలుసు" అన్నాడు వరద.

కుర్చీ లాక్కుని కూచుంటూ "మీ పేరు మాత్రం తెలుసు. మిగతా విషయాలు చెప్పండి. ఎక్కడ వుంటున్నారు?"

చెప్పాడు పీతాంబరం.

ఆగిపోయిన వాచీని సరిచేస్తోంది నీలవేణి.

"ఇప్పుడిప్పుడే నీలవేణి గొప్పతనం మరొకరు చెప్పగా విన్నాను. మీకేమైనా తెలిస్తే చెప్పండి"

ఆమె నవ్వుకోవడం గమనించి స్థిమితపడ్డాడు పీతాంబరం. వరదరాజులు ముఖం చూసి అతను నిజంగా చెపుతున్నదీ, పరిహాసానికంటున్నదీ గ్రహించడం కష్టం.

"కొన్నాళ్ళు రూర్కెలాలో పనిచేసేవాణ్ణిసార్. తర్వాత సరిగ్గా పదినెలల క్రితం, భిలాయ్‌కి వచ్చాను సూపర్‌వైజర్‌గా. విసుగేసి నెల్రకితం ఉద్యోగం మానేసి వచ్చేశాను."

నివ్వెరపోయాడు వరద. "ఎంత జీతం యిచ్చేవారక్కడ?"

"మూడువందల ఏభై?"

"వదులుకు వచ్చాశారేం?

నవ్వాడు పీతాంబరం. "నా ఉద్యోగం ఉబుసుపోవడానికి సార్. డబ్బు ఖర్చు చేయడం తెలీక ఛస్తున్నాను. మా మావయ్య గూడూరు మైకా మైన్స్ ప్రొప్రయిటరు. డబ్బు అడగనని ఎప్పుడూ కోపం తెచ్చుకుంటాడు"

నవ్వొచ్చింది వరదరాజులుకి.

"బావుందే! ప్రపంచానికంతటికీ లేని ఓ కొత్త సమస్య మీకు మిగిలింది. రక్తమాంసాల కోసం మిగతా వాళ్ళు గుంజాటన పడుతున్నారు. మీరు అస్థిపంజరం కోసం."

"డబ్బులో ఏముందండీ, దాయాదుల విషయం ఆలోచించనంత కాలం ధనవంతుడు గొప్పవాడే ఏదీ? మీ మంచితనాన్ని నాకు అమ్మేయండి. కావలిసినంత డబ్బు యిస్తాను"

ఆశ్చర్యపడ్డాడు వరద. నవ్వాడు పీతాంబరం. "నాక్కావలసింది డబ్బు కాదు సార్. మనిషిక్కావల్సింది డబ్బుకంటే యింకా ఎక్కువ విషయాలున్నాయి."

"ఏమిటంటారు?"

"ఉదాహరణకి, మంచి స్నేహితుడు, తనని చూసి ఏడ్చేవాళ్ళు, కాస్త అభిమానం చూపిస్తూ ఎప్పుడూ కాళ్ళదగ్గర పడివుండే కుక్క"

నీలవేణి వాచీ ముఖానికి అడ్డం పెట్టుకుని నవ్వుతోంది.

"ఆయన మాటలు హెచ్చు పట్టించుకోకండి. పిచ్చెత్తుతుంది" అంది.

ఎండుటాకు ఒకటి ఎగిరివచ్చి వాకిట్లో పడింది.

"ఏం, కుక్క విశ్వాసాన్ని మీరు నమ్మరా? నేనెప్పుడూ కుక్కని పెంచుతాను"

"మరిప్పుడు లేదేం?"

"ఇప్పటికి మూడింటిని పెంచానండి. రెండు కుక్కలు కోసం చచ్చాయి. మూడోదాని కోసం నేను చచ్చేంత పనయింది. బ్రేక్‌లో వేయించాను. భిలాయి వస్తున్నప్పుడు, ప్రయాణం పూర్తయ్యేసరికి ఎవరివో నెయ్యి జాడీలన్నీ కెలికి వదిలిపెట్టింది. ఆ యజమానిని బ్రతిమాలలేక చచ్చాను"

నవ్వాగలేదు వరదకి. "చివరికి ఏమయింది?"

"ఓసారి దానికి చెప్పకుండా నేను టూర్ వెళ్ళిపోయానండి. ఇంట్లోనే వుండిపోయింది. రొట్టె, పాలు అన్నీ పడెయ్యడానికి నౌకర్ని ఉంచాను. కానీ నేను వెళ్ళిన దగ్గర్నుంచీ ఏడుస్తూ కూచుందట. రొట్టె ముట్టుకోవడం మానేసింది. అయిదురోజుల తర్వాత నేను వచ్చి తలుపు తెరిచేసరికి ద్వారం దగ్గర తలుపు సందులో తలవుంచి చచ్చిపోయి వుంది. నెలరోజులు ఏడ్చానండి దానికోసం. దాన్ని ఏమని పిలిచేవాడినో తెలుసా?" నీలవేణి వేపు తిరిగి అన్నాడు.

"చెప్పండి"

"నీలూ అని"

వరద విస్తుపోయి ఆమె ముఖం చూశాడు.

కృష్ణుడు విగ్రహానికి పట్టిన దుమ్ము దులుపుతోంది ఆమె.

"ఇంక కుక్కని పెంచడం మానుకున్నానండి. కొన్నాళ్ళకి నాకే కుక్క బుద్ధులన్నీ పుడతాయేమోననిపించింది. ఉదాహరణకి, స్నేహితుల కోసం ప్రాణం పెట్టడం దాని దగ్గర్నుంచే నేర్చుకున్నాను. రొట్టె, పాలు తినడం కూడాను" నవ్వు సాగించాడు పీతాంబరం.

వరద వింతగా చూస్తున్నాడు.

పీతాంబరం కాస్సేపటికి ఆగి "క్షమించండి సార్. నాకిక్కడ స్నేహితులెవరూ లేరు. నీలవేణి యిక్కడే వుందని ఎలాగో తెలుసుకు వచ్చాను. మీరు నాకు మొదట నేస్తం. ఏమంటారు?"

"మీ కుక్క అంత విశ్వాసంగా."

నవ్వి అతణ్ణి చెయ్యి పుచ్చుకున్నాడు పీతాంబరం. "అదంతా మరిచిపోండి. ఇంగ్లీషులో ఓ వాక్యం వుంది. 'నన్ను ప్రేమించగలవాళ్ళు నా కుక్కని కూడా ప్రేమించగలగాలి' అని. కానీ మీరు మొదట నా కుక్కనే ప్రేమించినట్లు తెలుస్తోంది. అందుకని నన్ను ప్రేమించడంలో ఏమీ అభ్యంతరం ఉండదనుకుంటాను" యిల్లెగిరిపోయేట్లు నవ్వు సాగించాడు.

"అయితే సఖ్యతకి చిహ్నం టీ - స్నేహానికి రాజకీయ నాయకుల కౌగిలింతలాగ - మొదట టీ ఆర్డరివ్వండి" అన్నాడు సిగరెట్టు వెలిగిస్తూ.

"ప్రస్తుతం ఏం చేస్తున్నారు?"

"రోజుకి ఎన్ని సిగరెట్లు ఖర్చు అవుతాయో స్టాటిస్టిక్స్ తీస్తున్నానండి. ఎలా వుంటుందంటారు యీ పని?" అని నవ్వి "నిజానికి యిప్పటి వరకు ఏ పనీలేదు సార్. ఉద్యోగం పోయినా ఈ 'సార్' వదల్లేదండి. రోజంతా హోటళ్ళు పట్టుకు తిరగడం - సాయంకాలం యిక్కడికి రావడం యిప్పటికిది కార్యక్రమంగా పెట్టుకున్నాను."

నీలవేణి టీ తెచ్చి యిచ్చింది.

"అయిదేళ్ళ క్రిందట యీ నీలవేణిని చూసాను నేను. షామైన్స్ దగ్గర కనిపించింది ఓనాటి సాయంకాలం. అప్పట్లో యీమెతో పాడువుపాటి మనిషి వుండేవాడు. విశ్వేశ్వరం అనుకుంటాను అతని పేరు. అప్పటికప్పుడే పదిరోజుల్నుంచీ డ్యూటీకి రావడం మానేశాడు. ఆ విషయం కనుక్కొందుకుని వెళ్ళాను. పిలిస్తే పరిగెత్తింది. బహుశా నన్ను ఏ కీచకుడో అనుకుని వుంటుంది పాపం. తిన్నగా వెళ్ళి ఓ స్తంభానికి గుద్దుకొంది. ఆ నుదుటి మీద ఎడమ వేపు మచ్చను గురించి ఎప్పుడయినా అడిగారా మీరు?"

వరద ఆశ్చర్యంగా చూశాడు. జుత్తుపాయ మధ్య నుంచి నల్లగా కనిపించే మచ్చని, యిన్నాళ్ళూ ఎలా చూడలేదా అనుకున్నాడు.

నీలవేణి సిగ్గుపడి గన్నేరు చెట్టు మీద ఆరేసిన బట్టల కోసం వాకిట్లోకి వెళ్ళింది.

"ఇక లేస్తాను సార్! చీకటి పడింది" అన్నాడు పీతాంబరం.

వరద లేచాడు.

పీతాంబరం అతని రెండు చేతులూ పుచ్చుకుని "నా మాటల్ని అట్టే మనస్సుకు పట్టించుకోకండి సార్. రెండుసార్లు పిచ్చెత్తిందని నన్ను మద్రాసు హాస్పిటల్లో పారేశారు. తప్పించుకు పారిపోయాను. హాయిగా బ్రతకాలనుకున్న వాళ్ళని బ్రతకనివ్వదండి యీ ప్రపంచం. యివన్నీ తర్వాత చెప్తాలెండి. నన్ను మాత్రం మీ స్నేహితుడుగా బ్రతకనివ్వండి చాలు"

మఫ్లరు మెడ చూట్టూ తిప్పుకుని చేతులు వెనక్కి ముడుచుకు వెళ్ళిపోయాడు పీతాంబరం.

చెట్టుకు చేరబడి చూస్తోంది నీలవేణి.

"రాత్రి అడిగితే చెప్పలేదేం యితని గురించి?"

తుళ్ళిపడింది.

బట్టలు నేలకి జారి మన్నయాయి. తీయబోయింది.

"అవలా వుణ్నీ. మొదట జవాబు చెప్పు"

"ఆయన విషయం పూర్తిగా నాకే అర్థం కాదు. నవ్వుతూ నవ్వుతూ అంతలో మండి పడతారు. ముఖం చేతుల్లో కప్పుకుని ఏడుస్తారు. తలగోడకేసి కొట్టుకుంటారు. మళ్ళీ అంతలో స్నేహితులు కావాలని ఆతృతతో తిరుగుతారు"

బట్టల్ని దులిపి లోపలికి వెళ్ళిపోయింది నీలవేణి.

అలానే కమ్ముకుంటూన్న చీకట్లోకి చూస్తూ నిలబడ్డాడు వరద. పడమటి ఆకాశాన్ని పట్టుకు వేలాడుతున్న నక్షత్రం తెగిపడింది.

శ్రావణమాసపు ముసురు రోజుల్లో ప్రపంచమంతా చలితో, చెమ్మతో వణుకుతున్న సమయంలో, ఒకానొక వ్యక్తి మనస్సు మాత్రం సందేహంతో, సంశయంతో కాలుతోంది.

నిప్పును ఒడిలో కట్టుకున్నట్లు అంటారే. అలాగ ఓ ఉత్తరాన్ని వొళ్ళో వుంచుకున్నాడు.

పేరూ, వూరూ లేని ఓ కవరు వరదరాజులుకి వచ్చి చేరింది. "గూడూరు మైకాగనుల్లో పనిచేస్తున్నాడు విశ్వేశ్వరం. అక్కడికి ఎనిమిది మైళ్ళ దూరంలో వున్న పనివాళ్ళ కొంపల్లో ఉంటున్నాడు. అయిదో వరసలో చివరి యిల్లు."

ఇదీ అందులో ఉదంతం.

విశ్వేశ్వరం విషయం గుర్తుచేసుకోక పోవడం వల్ల ఎవరికీ ఏమీ నష్టంలేదు. కాని యిన్నాళ్ళ తర్వాత మళ్ళీ యిది గుర్తుకొచ్చేసరికి ఎవరో మనస్సంతా చెయ్యిపెట్టి కెలికినట్లయింది.

ఎదురుగ్గా నిలబడి 'ఏం చేస్తావ్?' అని అడగాలనిపించింది.

గన్నేరు చెట్టు మరీ పచ్చబారి పసుపు రాసుకున్న ముత్తయిదువలాగా వుంది.

మొగ్గవిడి, పువ్వులు విచ్చుకుని, పూర్తి జీవంతో మెరిసి, తడిబారి కుళ్ళిపోతున్నాయి.

వర్షంలో ముద్దయి రెక్కపొడుచుకు ఏడుస్తోంది కాకి.

ప్లాస్టిక్ వర్షం కోటు తొడుక్కుని సగం వంగి నడుస్తూ వచ్చాడు పీతాంబరం.

"ఏం అలా కూచున్నారు?"

"ఈ ఉత్తరం చూడండి. మీకూ కాస్త అర్థమవుతుంది"

తీసి చదివాడు పీతాంబరం.

"వీడా? వీడు డర్టీరోగ్ అండి. ఈ ఉత్తరం రాసిన వాళ్ళెవరో డబ్బు దండుగ చేసుకున్నారు. అంతే" మొండి చెయ్యిలా వున్న కొమ్మకి కోటు తగిలించి వచ్చి కూచున్నాడు.

ఏదో అష్టపది పాడుతోంది గులాబి.

"ఒక్కసారి వెళ్ళి పలకరించి రావాలనుంది. ఏం లేదు. నీలవేణి విషయం కూడా అడగొచ్చు. ఏమంటారు?"

"అబ్బే! అనవసరమండి. మీరు వెళ్తే అక్కడ జరిగే విషయం ఏమిటో చెప్పమంటారా?"

సిగరెట్టు వెలిగించాడు.

"మిమ్మల్ని ఎరిగివున్నా మరిచిపోయినట్టు మొహం పెడతాడు వాడు. అధవా పలకరించినా నీలవేణి విషయం ఎత్తుకోడు. ఒకవేళ మీరడిగితే 'నీకిష్టం లేకపోతే వీధిలో విసిరెయ్' అంటాడు. కుళ్ళిపోయిన టమాటోని విసిరేయమన్నట్టు. నన్నడిగితే, అలాంటివాళ్ళు గనుల్లో పనిచెయ్యడానికి పనికొస్తారండి. మంచి స్థలం ఎంచుకున్నాడు బ్రతకడానికి"

విశ్వేశ్వరం మీద ఉండే అసహ్యతని ఎక్కడా తగ్గకుండా చూపించాడు పీతాంబరం.

ఇంకా ఉత్సాహం ఎక్కువయింది వరదరాజులకి.

"విశ్వేశ్వరం విషయం ఎలా వున్నా అంతరాత్మ మీద నమ్మకం పోలేదు. ఓసారి వాణ్ణి కదిపి వస్తాను"

"సరే మీ యిష్టం. మా మావయ్య మైన్స్‌లోనే ఉంటాడు బహుశా. ఉత్తరం యిస్తాను. మీకన్ని సౌకర్యాలూ వాళ్ళు చేస్తారు. కానీ వాడు పశువులా వ్యవహరిస్తే తర్వాత బాధపడకండి"

"పదేళ్ళు వాడితో బ్రతికాను. చాలావరకూ వాణ్ణి అర్థం చేసుకున్నాననుకుంటాను"

"సరే. మీ యిష్టం."

మరో అరగంట సేపు కూచుని వెళ్ళిపోయాడు పీతాంబరం. వీధిలో ఎవరో బిచ్చగాడు పదం ఎత్తుకున్నాడు.

"నాకు తెలియక నీవు
పంజరము జొచ్చావు
ఎందుడి వచ్చావు చిలకా?
శక్తిలేకనె నిన్ను
చేతిమీదుగ విడిచి
చింతించుచుంటినే చిలకా?
ఎటనుండి వచ్చావో
యింకెటకు పోతావో
ఎరుకలేదే నీకు చిలకా?"

బిచ్చం వేసి తిరిగి వస్తూన్న నీలవేణికి ఉత్తరం అందించాడు.

"విశ్వేశ్వరం గురించి ఎవరో వ్రారు?"

చదివింది.

"రాసిందెవరో తెలుసా?"

"తెలీదు" అంది స్థంభానికి ఆనుకుని

"ఏం చెయ్యమంటావు?"

"అంటే?"

"విశ్వేశ్వరం దగ్గరికి వెళ్ళేదా?"

వర్షం తుంపర్లుగా ప్రారంభమయింది. చిన్న జల్లు కొట్టి నీలవేణి చీరంతా తడిపేసింది. వొంటిచుట్టూ కొంగు తిప్పుకుని ద్వారం దగ్గరికి వచ్చి నిలబడింది నీలవేణి.

మళ్ళీ అడిగాడు వరదరాజులు.

"విశ్వేశ్వరం దగ్గరికి వెళ్ళేదా?

"వద్దు" అంది.

వెళ్ళమంటుందనుకున్నాడు వరద. నిర్ఘాంతపోయాడు.

"ఏం?"

"ఏమీ లాభం వుండదు ఆయన మళ్ళీ తిరిగిరారు"

"నీ మీద కోపమా వాడికి"

"కాదు"

"అయితే నా మీద 'పగ' అయి వుంటుంది"

"అదేం కాదు"

"నీలవేణీ విషయమేదో దాస్తున్నావు నువ్వు. ఇలాగయితే నాకు చికాకు వేస్తుంది. అందర్నీ ఉంచుకుని పోషించడానికి నేనేం సత్రం పెట్టుకుని కూచోలేదు."

దిమ్మెరపోయింది నీలవేణి.

**జీవితంలో** మొదటిసారిగా కలిగిన విసుగుదల తనకే వింతగా కనిపించింది వరదకి.

మెల్లగా అన్నదామె. "ఎవర్నీ బాధపెట్టడం నాకిష్టంలేదు. మీకేది మంచిదని తోస్తే అది చేయండి. కానీ ఆయన్ని మాత్రం పిలవొద్దు."

నీలవేణి లోపలికి వెళ్ళిపోయేవరకూ అచేతనంగా కూర్చున్నాడు. తడిలో క్రిందపడి రెండు పిచ్చుకలు దెబ్బలాడుకుంటున్నాయి.

లేవబోయేసరికి పీతాంబరం కాల్చిపారేసిన సిగరెట్టు కాలిని మండించింది.

భోజనం చెయ్యడం మరిచిపోయి ఆఫీసుకు వెళ్ళిపోయాడు వరదరాజులు.

రామ్మూర్తి తనపని చూస్తున్నాడు వచ్చేసరికి.

రోజంతా మాటిమాటికీ విశ్వేశ్వరం గుర్తుకొస్తున్నాడు.

అందరూ అనుకున్నంత చేతకానివాడూ, తెలివితక్కువవాడూ కాదు విశ్వేశ్వరం.

అందర్నీ కట్టిపడేయగల యీ ప్రపంచాన్నంతా వదులుకుని ఆ మారుమూల కూర్చోవడంలో అతనికేదో తృప్తీ, ప్రశాంతతా దొరికి వుండవచ్చు. వెళ్ళి చూస్తే తన మనస్సులోని గుంజాటన అంతటికీ అర్థం దొరుకుతుంది. ఓ వ్యక్తిని పూర్తిగా తెలుసుకున్నట్టవుతుంది. నీలవేణిని వదిలేసి పోయినందుకు విశ్వేశ్వరం మీద కోపం కంటే ఆశ్చర్యం ఎక్కువయింది వరదరాజులుకి. "ఇలాంటిపని సాధ్యమా?" అని కూడా ఆలోచించి వుండడు విశ్వేశ్వరం. చాలా మామూలుగా, నిత్యకృత్యాల్లో చాలా పనుల్లాగే, రూపాయల్ని అప్పు తీసుకున్నట్టే, ఓ స్త్రీని వదిలి వెళ్ళిపోవడం కూడానని భావించాడు.

సాయంకాలమంతా నీలవేణి అతనికి కనిపించలేదు. ఉదయం తొందరపడ్డాననుకున్నాడు.

సాయంకాలానికి మబ్బు విడింది. పడమటి ఆకాశం వేపు మట్టికొండలు గాజుపలకల్లా మెరుస్తున్నాయి. చల్లపడి బరువెక్కిన భూమినుంచి గాలులు యీలపాటల్తో లేచాయి. నగలన్నీ వొలిచిన వెలయాలు నిరాడంబరతలా వుంది ప్రకృతి.

కోవెల పక్క మైదానమంతా చిన్నబోయినట్లుంది.

బలహీనంగా సూర్యుడి చివరి కిరణాలు ప్రకృతిని వెన్నుతట్టి లేపాయి.

ఆకాశాన్ని నీలిచారలు.

పీతాంబరం కోసం ఎదురు చూశాడు వరద. కానీ అతను రాలేదు. రవణమూర్తి యింటికి నడిచాడు.

మసీదు నిండా దీపాలు వెలిగించారు. లోపల ఎవరో పాటలు పాడుతూ ఆవేశంతో గెంతుతున్నారు. రోడ్లన్నీ వర్షానికి కడిగేసినట్లు కొత్తగా వున్నాయి. పిల్లి ఒకటి కాలువలో పడి చలిలో అరుస్తోంది.

సగం దూరం వెళ్ళి మనసుపోక తిరిగి వచ్చేశాడు.

అర్ధరాత్రి ముత్యాల్లాగ రెండు చినుకులు రాలాయి. చెట్టు ఆకుల నుంచి. ఓ పక్క నక్షత్రాలన్నీ కుప్పవోసినట్లు మెరుస్తున్నాయి.

గుడిలో గబ్బిలాలు ఒకటే అరుస్తున్నాయి. పక్కవాటాలో ఎవరో ఆవులిస్తున్నారు. ఓ పిట్ట రెక్కలు టపటప కొట్టుకుని చెట్టుమీంచి లేచిపోయింది. ఆకులన్నీ కదలి చీకటి కన్నీరు కార్చినట్లు బొట్లు రాల్చి మనస్సు పవిత్రం చేసుకున్నాయి.

ఏదో శబ్దమయి యిటు తిరిగాడు వరదరాజులు. నీలవేణి మైదానం వేపు చూస్తూ నిలబడింది.

కోవెలలోని దీపపు వెలుగు మాత్రం రవంత వుంది.

నిర్ఘాంతపోయి లేచాడు.

నీలవేణి ఏడుస్తోంది.

తుదీ మొదలూ లేని చీకటుల్లో, దుఃఖమే తానయినట్టు నిలబడ్డది.

నీలవేణి విషాదంలో మెరుపులున్నాయి.

ఆమె దుఃఖాన్ని చూసి బెంగతో చెట్లన్నీ కదలికమాని చూసాయి. నిశ్శబ్దంగా కారిన కన్నీరు చెక్కిళ్ళు దాటి ఎత్తు రొమ్ముల్లో మాయమయింది. చీకటి రూపం దాల్చి రోదిస్తున్నట్లు, సౌందర్యం ప్రపంచాన్ని మరిచి 'వియోగం'తో రిచ్చపడినట్టు మూర్ఛబోయిన చీకటి ఆకాశం మీది గాలిపాటలాగ నిశి కడుపులో తిరిగి విసుగెత్తిన గాలి గొంతులో నిట్టూర్పుగా యిరుక్కుని పెనుగులాడుతున్నట్లు తనలో తానే దుఃఖిస్తోంది నీలవేణి.

అలికిడి విని తుళ్ళిపడింది.

ఎదురుగ్గా గేటుని ఆనుకుని ఆగాడు వరదరాజులు.

"ఏడుస్తున్నావా?"

తప్పించుకోలేక దొరికిపోయింది. కన్నీళ్ళకి అర్థం మార్చడం కోసం ప్రయత్నించి విఫలురాలయింది.

"ఉదయం తొందరపడ్డాను కదూ?"

మాట్లాడలేదామె.

"మరెప్పుడూ అనను. సరేనా?"

"నామీద ఎందుకు జాలిపడుతున్నారు మీరు? నన్నెక్కడికయినా పంపించేయండి"

ఒక్క గాలి రివటకి తెల్లటి చీర కొంగులేచి అతని ముఖానికి టప్పున కొట్టుకుంది. బలంగా వంపులు తిరిగిన వెన్ను తీరు స్పష్టంగా కనిపిస్తోంది.

కొంగుని చేతిలోకి తీసుకున్నాడు.

"నిన్నేం చెయ్యాలో తెలీక ఊరుకున్నాను. తెలిస్తే యీ మంచితనాన్నీ యీ మౌగ్ధత్వాన్నీ యిలా అందరికీ కనిపించే చోట వుండనిచ్చే వాణ్ణికాదు. నిన్ను దాచుకోవడం నాకు చేతకాదు. అందుకే నలుగురి మధ్యా ఉంచేశాను" అందామనుకున్నాడు.

"ఎక్కడికి వెళ్తావు?" అని మాత్రం అన్నాడు.

మాట్లాడకుండా తలవొంచుకుందామె.

"నీ గురించి నువ్వు పూర్తిగా తెలుసుకునేవరకూ ఎక్కడికీ వెళ్ళవు నువ్వు. చాలా రాత్రయింది. వెళ్ళి నిద్రపో. నాలాంటి స్నేహితులు నీకు దొరకడం అరుదు. అది మాత్రం గుర్తుంచుకో" అన్నాడు.

మొదటిసారిగా అతని ముఖాన్ని సూటిగా గమనించింది.

ఆ కళ్ళల్లో పరిచయాన్ని, పెదాల్లో పట్టుదలనీ చూసి అబ్బురపడి తల దించుకుంది. ఉన్నట్టుండి దూరాన ఎవడో పిచ్చివాడు నవ్వుతున్నాడు.

ఇద్దరూ తుళ్ళిపడ్డారు.

## 5

పీతాంబరం ఉత్తరం గూడూరులో చాలాపని చెరవేర్చింది.

అనంతశయనంగారు చాలా మంచి వ్యక్తి. మేనల్లుడి దగ్గర్నుంచి వచ్చాడనగానే మంచి బంగళాలో బస ఏర్పాటు చేసారు. సాయంకాలం కలుస్తానన్నారని నౌకరు కబురు చెప్పి పోయాడు.

బంగళా అంతా ఖాళీగా వుంది. గోడలకు వేసిన రంగు దగ్గర్నుంచీ కుర్చీలూ, బల్లలూ, అంతా డబ్బుమయంగా కనిపిస్తుంది. సుఖానికి అది పరాకాష్టయేమో అనిపించేంత చక్కని గదులు. నౌకర్ని పిలవడానికి బెల్. ఇద్దరు పరిగెత్తుకొస్తారు పిలిచేసరికి.

ఇంతమంచి బంగళాని ఖాళీగా ఉంచేశారేమో అని ఆశ్చర్యమేసింది.

గదిలో ఎవరో ఓ ముసలాయన ఫోటో వుంది. మోకాళ్ళవరకూ పెద్ద లాంగుకోటూ, చెవుల వరకు తిప్పిన మీసాలూ, అంతా జమిందారీ కోవలో ఉంది. ఇటుపక్క గాంధీగారి వెలిసిపోయిన రంగు ఫోటో. ప్రతిక్షణం జ్ఞాపకం చేస్తూ బంగళా మీద పెద్ద గడియారం.

వెనుకవైపు మాత్రం మిగిలిన కాస్త జాగాలో వరసగా మొక్కలు వేసారు. అవి పూలమొక్కలేం కావు. ఏవో గుబురుగా పెరిగే పిచ్చిమొక్కల్ని దారి ఆనవాలు కోసం వరసతీర్చి పాతారు. కుడివేపు చింతచెట్టు మాత్రం కొమ్మలు విచ్చుకుని వయస్సు మళ్ళిన వృద్ధుడి స్థిమితాన్ని చెప్తోంది.

నౌకర్ని పిలిచి అక్కడ కుర్చీ వేయించుకున్నాడు.

ప్రతి చిన్న గాలికి మొక్కలు ఊగి వింత శబ్దాలు చేస్తున్నాయి. గడ్డి అంతా వంపుపట్టి ఊగుతోంది అప్పుడే లేస్తున్న వాలు ఎండలో దూరాన ఏదో మెరుస్తూ కనిపించింది వరదరాజులుకి. లేచి లేచి దగ్గరికి వెళ్ళి చూసేసరికి చిన్న మైకాముక్క. దాని నునుపు, పల్చదనం ప్రయత్నించి విప్పబోతే పొరలు పొరలుగా విడిపోయి ఏమీలేనితనాన్ని నిరూపించుకోవడం అంతా తమాషాగా ఉంది.

మళ్ళీ ఆ మెరుపు చూడడానికి అక్కడే ఉంచబోయాడు. కానీ యిదివరకటి వెలుగు కనిపించలేదు. నల్లగా మసిబారిన రేకులా వుంది. చేతిలోకి తీసుకువచ్చి కూచున్నాడు.

ఉడుత ఒకటి కుర్చీకి అల్లంత దూరంలో నిలబడి అప్పుడే జారిన చింత చివురును మొసవుతోంది.

అటువేపే చూస్తూ కూచున్నాడు వరద.

కాస్సేపటికి యిటు తిరిగేసరికి పదేళ్ళ అమ్మాయి విచిత్రంగా తనవేపే చూస్తోంది.

పచ్చటి గౌనూ, పచ్చటి రంగు బూట్లూ వేసుకుంది. పచ్చటి చెట్ల మధ్య కలిసిపోయింది. కళ్ళల్లో విచిత్రం, ముఖం కోలదనంలో తీవీ - సరదా వేసింది వరదకి.

చెయ్యిజాపి పిలవబోతే.

"నీళ్ళు పోసుకుంటారా అంది అమ్మ"

ఆశ్చర్యపోయాడు.

కుడివైపు గోడకి వున్న ద్వారం చాటున ఎవరో ఉన్నట్టనిపించి లేచాడు.

కుర్చీ మేకుకి పంచె తగులుకుని చిరిగింది. లోపలికి వెళ్ళి తువాలు తెచ్చుకుని అమ్మాయి వెనుక నడిచాడు.

పక్క యిల్లు మరీ తీరుగా, ముచ్చటగా వుంది. పెరటివేపు మల్లెపందిరి వేసారు.

స్థంభం పట్టుకుని నిలబడింది అమ్మాయి. చెట్ల మధ్య కలిపి సన్నగా, లేతచివురుగా కనిపిస్తోంది.

"నీ పేరేమిటి?"

"చంప"

స్నానాలగదికి తోవ చూపించింది.

తువాలు చుట్టుకుని తలతుడుచుకుంటూ వచ్చేసరికి యింకా నిలబడ్డది చంప.

రాగానే "మధ్యాహ్నం తాతగారు వస్తానన్నారు. మిమ్మల్ని గనులు చూపించడానికి తీసుకువెళతారట నువ్వు కూడా వస్తావా?!"

"నాకు విసుగు. భోజనం ఎన్ని గంటలకు చేస్తారు?"

తోడుకట్టి పెంచిన మొక్కలాగ శిక్షణలో పెరిగింది. రెండు జడలూ భుజం మీంచి తిప్పి అల్లుకుంటోంది.

"రెండు మల్లెపువ్వులు కోసుకునేదా?"

విచిత్రంగా చూసింది "ఎందుకూ?"

"మా యింట్లో ఈ అమ్మాయుంది. తీసుకువెళతాను"

"ఎవరు?"

"గులాబి"

"భలే, గులాబికి మల్లెపువ్వులు తీసుకెళ్ళండి" నవ్వింది.

కొమ్మతో పాటు చిన్నగుత్తిని కోసి గుమ్మంలోంచి నడిచాడు.

చింతచెట్టు క్రింద నీడసాగి వెనక్కి జరిగింది.

కుర్చీ వేడెక్కి కాలుతోంది. ఓ చింతకాయ పేర్చినట్టు కుర్చీ మీద పడింది. కుర్చీ తీసుకుని లోపలికి వచ్చాడు.

పెద్ద ఫైలు పట్టుకుని ఓ వ్యక్తి కూచున్నాడు.

"ఎవరినో కలుసుకోవాలన్నారట సార్ మీరు?"

"అవును. ఏం?"

"పేరు చెపితే ఏ బాచ్‌లో ఉన్నారో చెప్తాను."

"అప్పటిపేరు విశ్వేశ్వరం, యిప్పుడు తెలీదు. చూడండి ఎక్కడన్నా కనిపిస్తాడేమో?"

ఫైలు విప్పకుండానే అన్నాడతను.

"సన్నగా, మాసిన గెడ్డంతో ఉండే పిచ్చివాడు కదండీ"

ఆశ్చర్యపోయాడు. "అవును. సన్నగా, పొడుగ్గా వుంటాడు."

"అవునండి. నాకు బాగా తెలుసు. అందర్లోకీ బద్ధకపు మనిషి అతనే. ప్రొప్రయిటరుగారి రికమండేషన్ మీద ఉన్నాడుగాని లేకపోతే యీపాటికి పీకిపారేసేవాళ్ళం. మధ్యాహ్నం డ్యూటీకి వస్తాడండి. బహుశా మీకు మైన్‌లో కనిపించవచ్చు."

"ఎక్కడ ఉంటాడో తెలుసా పోనీ?"

"అది చూస్తేగానీ చెప్పలేను" అని కాగితాల్ని నేలమీద పరిచాడు.

"డి క్లాస్ లేబరు క్వార్టర్స్. ఫిఫ్త్ రో, యిరవయ్యో యిల్లండీ"

"ఇందులో కూడా తరగతులున్నాయేమిటి?"

"ఉన్నాయండి. పనిని బట్టి లేబరు జీతం ఏర్పాటవుతుంది. ఏ క్లాసైతే నాలుగు రూపాయలు. బి క్లాసుకు మూడు రూపాయలు. సి క్లాసుకు రెండున్నర. చివరి తరగతికి రెండు. వాళ్ళ పనల్లా త్రవ్వకం అవుతున్న మట్టిని ట్రాలీల్తో యీడ్చి బయటికి చేరవేయడం"

"ఇప్పుడీ విశ్వేశ్వరం ఆ పని చేస్తున్నాడా?"

"అవునండి. ఇతను ట్రాలీ డ్రైవరు. వాటిని త్రోసుకెళ్ళడం అతని పని. ఆ పని కూడా సరిగ్గా చెయ్యడండి."

ఫైలు ఎత్తుకుని వెళ్ళిపోయాడతను.

రాను రాను ఎండ మరీ విపరీతమవుతోంది.

మిగతా ప్రపంచమంతా వదులుకుని యీ కూపంలోకి వచ్చి విశ్వేశ్వరం ఏం తృప్తి అనుభవిస్తున్నాడో బోధపడటంలేదు. అతన్ని చూడాలన్న ఆతృత మరీ ఎక్కువయింది.

మంచం మీద వెల్లకిలా పడుకున్నాడు. ఎండ తీవ్రతరమవుతున్న కొద్దీ చల్లదనం పోయి ఊపిరి తిరగనంత గాడ్పు లేచింది.

శోష వచ్చినట్టు తలాడిస్తోంది చింతచెట్టు. గడ్డిమొక్కలన్నీ మొద్దుబారిపోతున్నట్టు ఒసిలిపోతున్నాయి.

పొద్దుట తడిసిన పచ్చగడ్డి బిరుసుబారి నిలబడింది.

దీపంలో మాడిన శలబం చివరి మూలుగులాగ గాలిచప్పుడు వినిపిస్తోంది. పక్క యింట్లో ఎవరో తమాషాగా పాటలు పడుతున్నారు. ఆ పాటలకి అర్థంలేదు. ఏవో మాటలు కూర్చి వింత ధ్వనులు చేస్తున్నారు. నడుము దగ్గరకి వొచ్చేంత ఎత్తున వుంది గోడ.

దగ్గరికి వెళ్ళి అటువేపు చూశాడు వరద.

పెద్ద వసారానిండా పెళ్ళి భోజనాలకి బంతి తీర్చినట్టు కూచున్నారు ఆడవాళ్ళు. చూద్దామన్నా మొగవాళ్ళు కనిపించడంలేదు. ముందు కుప్పలుగా మైకాచిప్స్ పోసుక్కూర్చున్నారు. వాటి పొరల్ని తీస్తూ ఇంతపాటలు సాగిస్తున్నారు. ఏదో తెలీని ఆవేశంతో చేతులు నడిచిపోతున్నాయి. వసారాకి మధ్యన వరసగా ఉయ్యాల్లో పిల్లలు నిద్రపోతున్నారు. ఒకావిడ మాత్రం పిల్లల్నందర్నీ చూస్తోంది.

అదే జీవిత లక్ష్యంలాగ, అదే ధ్యేయంలాగ, పొరలన్నీ వేరు చేస్తూ పాడుకుంటున్నారు వారంతా.

"భోజనానికి వస్తారా?" అంటోంది చంప.

రెండు జడల్ని మీదికి ముడివేసి ఎర్రటి బొట్టుపెట్టుకుంది.

"వాళ్ళంతా ఎవరు?"

"ఎవరూ?"

ఆమెను రెండు చేతుల్తో ఎత్తి గోడమీద కూచోపెట్టాడు. అతని జుత్తు ముఖానికి తాకేసరికి సిగ్గుపడింది చంప.

"వాళ్ళంతా పనివాళ్ళు. నన్ను దింపేయండిపోతా"

అతని చేతుల్లోంచి ఒక్క గెంతు గెంతి పారిపోయింది.

ఆలోచిస్తూ లోపలికి వచ్చేశాడు వరదరాజులు.

కోసుకొచ్చిన మల్లెపువ్వుల్ని పిచ్చుక ముక్కుతో పొడుస్తోంది. దాన్ని తరిమేసి వాటిని చేతిలోకి తీసుకుని పడుకున్నాడు.

చంప జుత్తు పరిమళంలా వాసన వేస్తున్నాయి మల్లెలు.

స్త్రీకి సిగ్గు పుట్టుకతోటే వస్తుంది. మొదట చూసినప్పటి కంటే సిగ్గుపడి తన చేతిలోంచి పారిపోయిన చంప బాగుంది. ఆ చెక్కిళ్ళల్లో ఎరుపు రక్తంలా వుంది.

ఎండకి సొమ్మసిల్లి క్రమ్మగా రేకువాల్చుతోంది మల్లెపువ్వు. వాడిన కొద్దీ వాసన హెచ్చుతోంది.

ప్రక్క వసారాలోంచి పాటలూ, విశ్వేశ్వరం జీవితం గురించి ఆలోచనలూ, చంప సిగ్గూ అన్నీ సుడులు తిరిగి కళ్ళని మోసం చేసి జ్ఞానాన్ని ఎక్కడికో లాక్కుపోయాయి.

రెండుగంటలకి అనంతశయనంగారు నిద్రలేపితే లేచి చూసుకుని విస్తుపోయాడు. ఒళ్ళు మరిచి నిద్రపోయినందుకు.

ఆకలి కణకణలాడిస్తోంది.

"బాగా నిద్రపట్టినట్టుంది. మీ పనంతా చంపకు అప్పచెప్పాను. భోజనానికి మిమ్మల్ని పిలవకుండా పడుకుంది. గనులు చూడ్డానికి రారా ఏమిటి?"

వొళ్ళంతా మత్తుగా, బరువుగా వుంది. నిజానికి లేవాలనిపించలేదు. కానీ విశ్వేశ్వరాన్ని చూడాలనే ఆతృత వుంది. అందుకని వస్తానన్నాడు.

"మొదట ముఖం కడుక్కుని భోజనానికి లేవండి. మరో గంటలో కారు వస్తుంది. తర్వాత తిన్నగా వర్కింగ్ స్పాట్‌కి వెళ్దాం."

లేచాడు.

ఎండ చూడలేనంత తీవ్రంగా వుంది. పక్క వసారాలోంచి యింకా పాటలు వినిపిస్తూనే వున్నాయి.

"ఈ బంగాళా ఖాళీగా వదిలేశారేం?"

"ప్రత్యేకంగా పనికోసం, ఎవరయినా అతిధుల కోసం ఉంచేశానండి."

నీళ్ళు వేడెక్కి మరుగుతున్నాయి. ఒక్క పక్షీ ఎగరడం లేదు ఆకాశంలో. మూర్ఛపోయినట్లు చింతచెట్టు ఆకులన్నీ వంగిపోయాయి. చెట్టుకింద చల్లగా ఉంది.

"మా పీతాంబరం ఎక్కడున్నాడిప్పుడు? చూసి మూడేళ్ళయింది" అన్నాడు అనంతశయనంగారు పంచె మీదకి ఎత్తికడుతూ.

"పదిహేనురోజుల క్రితమే నాకు పరిచయమయారాయన. ఇప్పుడక్కడే వున్నారు."

"మీ గురించి చాలా రాశాడు నిన్నటి ఉత్తరంలో, రచయితల్ని కళాకారుల్ని చూస్తే నాకు ప్రాణమండి. గనుల్లోంచి వస్తూ మా గార్డెన్ హౌస్‌కి తీసుకువెళతాను. చూడండి. అక్కడ మీకు అద్భుతమైన విశేషాలు చూపిస్తాను."

అనంతశయనంగారు పొట్టిగా, బొద్దుగా వుంటారు. సగం వరకూ బట్టతలా, పల్చని నుదురూ, గుబురుగా పెరిగిన కనుబొమలూ, దళసరి గెడ్డం, వెడల్పాటి నోరూ, చాలా గంభీరంగా కనిపిస్తారు. ఎవర్నీ సుళువుగా నమ్మరు. నమ్మిన వ్యక్తికి ప్రాణం పెట్టే మనిషి. మెడలో సన్నటి బంగారు గొలుసు, చేతికి బంగారపు గడియారం. చాలా హుందాగా కనిపిస్తారు. కళన్నా, చిత్రలేఖనమన్నా పిచ్చిప్రేమ. వాటి విషయం ఏమీ తెలీదు. అయినా సాయంకాలం గార్డెన్ హౌస్‌కి చంపతో వెళ్ళి కూర్చుని వస్తూండడం దినచర్య.

భోజనం చేస్తూ కోడల్ని పరిచయం చేసారు. పేరు శుభాంగి.

"అబ్బాయిని మైన్స్ దగ్గర చూపిస్తాను. వాడికదే లోకం. చీకటిపడే వరకూ అక్కడే కూచుంటాడు" అన్నారు.

టేబుల్ మీద కావల్సినవన్నీ అమర్చి ఉంచేశారు. మధ్య మధ్య ఆమె కలగజేసుకుంటోంది.

తెల్లగా మరీ తెల్లగా కలువరేకులా వుంది. వంటినున్న బంగారమంతా చేసుకున్న పాపంలా మోస్తోంది. ముక్కు వంపు తప్పిస్తే ఆమెలో యింకే అందంలేదు. కానీ శరీరం నునుపు, ప్రతిబింబం చూసుకోగల పల్చటి చెక్కిళ్ళు చూసి ఆశ్చర్యపోయాడు వరద. సంతరింపులు పూర్తిగాని దంతపు బొమ్మలా ఉంది.

చెయ్యి కడుక్కున్నాక తువాలుతో చంప వచ్చింది. అప్పుడే నిద్రనుండి లేచినట్టుంది.

"ఏం కోపం వచ్చిందా?"

"ఉహూఁ"

"ఇంకెప్పుడూ ఎత్తుకోనులే. సాయంకాలం మల్లెపువ్వులిస్తావా మరి?"

"నేనూ వస్తున్నాను గనులకి"

"మా బంగళాలో వుండిపోకూడదూ? నాలాటివాళ్ళకి వుబుసుపోతుంది" అంటూ వచ్చారు అనంతశయనంగారు.

"విశ్వేశ్వరం మీకెలా తెలుసో చెప్పండి ముందు" మనుమరాలు అందించిన తువాలుతో చేతులు తుడుచుకుంటూ అడిగారు.

"చిన్నప్పటినుంచీఈ తెలుసు నాకు. వాడిని బాగా అర్థం చేసుకున్నవాళ్ళు తక్కువ. నిజానికి లేరనే చెప్పాలి. ఇదివరకు నాక్కాస్త అర్థమయ్యేడనుకున్నాను. ఇప్పుడిప్పుడు లేదనిపిస్తోంది."

"బాగా చెప్పారు. నేనూ అతణ్ణి కాస్త అర్థం చేసుకున్నాననుకుంటాను. అందుకనే వాళ్ళంతా తీసిపారేయమన్నా పనిలో ఉంచాను. మొదట అతన్ని మీరు చూసాక మిగతా విషయాలన్నీ మాట్లాడుకుందాం. అతన్ని సాయంకాలం యిక్కడికి పిలిపించుదామా?"

"పిలిస్తే బాధపడవచ్చు. నేనే వెళ్ళి కలుస్తాను?"

"నేనూ వస్తున్నాను తాతయ్యా" అంది చంప.

"దీన్నెవడు పెళ్ళి చేసుకుంటాడో గాని, సంవత్సరం తిరక్కుండా పారిపోతాడు. దీనితో బ్రతకలేక. ప్రొద్దుట అడిగితే రాను పొమ్మంది. ఇప్పుడు చూడండి మళ్ళీను"

రెండు చేతుల్తో ముఖం కప్పుకుని పారిపోయింది చంప.

మైన్స్ దగ్గరికి వచ్చేసరికి నాలుగయింది. ఎందుకూ పనికిరాని మైకా ముక్కలు ముక్కలుగా పడి పర్వతాల్లా లేచాయి. ఎండవాలులో వెండిలా మెరుస్తున్నాయి. వెండికొండల మధ్య చిన్న వూరులా అవుపిస్తోంది. తవ్వు జరుగుతున్న ప్రదేశం. ఆఫీసు గదులూ,

గోడలూ, మనుషులూ అంతా నలుపుబారి ఏదో భీభత్సాన్ని గుర్తుతెస్తున్నారు. ఓ పక్క నీలిరంగు ఆకాశం, మంటల్లా కాలుస్తున్న ఎండ, మెరిసే మైకా కొండలు. ఫ్యాక్టరీ మనుషుల నలుపూ, అంతా ప్రకృతి గీసిన త్రివర్ణ చిత్రంలా వుంది.

ఓపిక లేని కుక్కలాగా పాకుతోంది కారు. సగం మీదికి ఎగబ్రాకి ఆగిపోయింది. "కారు పాడయింది. ఆగాలి" అన్నాడు డ్రైవరు.

దూరంగా పొగగొట్టాలూ, మనుషుల సందడీ వినిపిస్తోంది.

"నడిచిపోదాం. అన్నీ చూస్తూ పోవచ్చు" అన్నాడు వరదరాజులు.

తెల్లటి షరాయి, నల్లటి పువ్వుల గౌను వేసుకుని పంజాబీ అమ్మాయిలా తయారయింది చంప.

రోడ్డుపక్కన ఉన్న కాలువ అంచుమీంచి నడుస్తోంది.

పెద్ద పందిరిలాగ రేకులు వేసారు రోడ్డు పక్కన. రెండు వందలు పైగా పనివాళ్ళు కూచుని డబ్బులు పంచుకుంటున్నారు.

"ప్రొద్దుట ఎనిమిది గంటలకి మైన్‌లోకి వెళ్ళారు వీళ్ళు. ఎప్పటికప్పుడు డబ్బు యిచ్చేస్తాం. రెండు గంటలక్రితం వీళ్ళు వచ్చేశాక మరో బాచ్ లోపలికి దిగింది" అన్నారు అనంతశయనంగారు.

"వీళ్ళంతా ఎక్కడ ఉంటారు?"

"సరిగ్గా యిక్కడికి ఎనిమిది మైళ్ళదూరంలో వీళ్ళకి యిళ్ళు కట్టించాం. వీళ్ళ సౌకర్యాలన్నీ మేమే చూడాలి. నీటిసరఫరా, యిల్లూ, ఆస్పత్రి వగైరా అన్నీ మేమే ఏర్పాట్లు చేశాం"

"షరీఫ్ జీ!" అని పరిగెత్తింది చంప.

**పర్వతంలాంటి** నల్లటి మనిషి ఎదురుగ్గా వచ్చి ఉన్నపాటున చంపను ఎత్తుకున్నాడు. అనంతశయనంగారిని చూసి నమస్కారం చేసాడు.

"ఇతను ఇక్కడి యింజనీరండి. పేరు రమేశ్‌చంద్. సౌరాష్ట్రం నుంచి వచ్చాడు. తెనుగు బాగా మాట్లాడతాడు"

"ఎలా వున్నారు సార్. ఓకే?" అన్నాడు రమేశ్‌చంద్.

నమస్కారం చేసాడు వరదరాజులు.

"గనులకంటే ముఖ్యం యిక్కడి మనుషుల్ని చూడాలి. పదండి. నేను తిప్పుతాను మిమ్మల్ని. సాబ్ పయిన కూర్చుంటారు. లోపలికి ఆయన నడవడం కష్టం" అన్నాడు.

"అలాగే" అన్నాడు వరద.

"నువ్వూ వస్తావా చంపా?"

"అబ్బ. నేను రాను. ఫాన్ దగ్గర కుచుంటాను" అని కుడివేపు కొండమీదకి పరిగెత్తింది.

నవ్వారు అనంతశయనంగారు చుట్ట వెలిగిస్తూ

"ఎయిర్ సకర్స్ దగ్గర కూర్చోడం దానికి సరదాలెండి. లోపల్నుంచి వచ్చే వేడిగాలి ముందు కూచుంటుంది. ఆరోగ్యం పాడవుతుందంటే వినదు."

తెల్లటి సూటు వేసుకున్న వ్యక్తి అక్కడికి వచ్చాడు. చూస్తూనే అనంతశయనంగారి అబ్బాయిని పోల్చేశాడు వరదరాజులు. తండ్రికిలాగే సగం వరకూ బట్టతల మిగిలింది వయస్సు తక్కువయినాను. చాలా శుభ్రంగా, అందంగా కనిపించాడు.

"మా అబ్బాయి. సురేంద్రనాథ బెనర్జీ. స్వాతంత్రోద్యమంలో తిరిగాను కొన్నాళ్ళు. ఆ రోజుల్లో పుట్టాడు."

వరదరాజుల్ని చూసి నమస్కారం చేసాడు బెనర్జీ. "అరగంట లేటయారు సార్. నాన్నగారితో వస్తున్నారంటే అప్పుడే అనుకున్నాను. అరగంట క్రితమే ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. లాంప్స్ రెడీగా వున్నాయి. త్వరగా వెళ్ళండి. రమేష్ మీతో వస్తాడు వర్కింగ్ స్పాట్ వరకూ వెళ్తారా?"

"ఇక్కడేం తెలీదు నాకు. మీరేం చూపిస్తే అది చూస్తాను."

"పైవన్నీ నేను చూపిస్తాను. లోపలికి మీతో వచ్చేవాణ్నే, కానీ ఆరోగ్యం బాగోలేదు. పదండి మోటారు ఆపరేటర్స్. ఎయిర్ సకర్స్ చూద్దురుగాని."

యంత్రాల బరువుకీ, వేగానికీ భూమి కదుల్తోంది. ఏవేవో పేర్లు చెప్పి వాటన్నింటినీ చూపించాడు. రెండు తడిక టోపీలూ, లాంప్ పట్టుకుని వచ్చాడు రమేష్ చంద్.

"లిఫ్ట్ ఆర్డర్లో వుందా?"

"ఉంది సార్"

"రెండో మైన్‌స్పాట్‌కి తీసుకువెళ్ళు యీయన్ని. ఎక్కడ విసుగేస్తే అక్కడ, లిఫ్ట్ యిచ్చి పైకి తీసుకొచ్చేయండి" అన్నారు. వరదరాజులు వేపు తిరిగి "మిగతా వాటి మాట ఎలావున్నా మా మైన్స్‌లో మాత్రం మీకేం కష్టం ఉండదండి. ఎక్కడికక్కడ చల్లగాలి వేస్తుంది. ఎక్కడన్నా దిగడం కష్టమని తోచి మీదకి వచ్చేయ్యాలనిపిస్తే లిఫ్ట్ సిద్ధంగా వుంటుంది. ఇంక బయల్దేరండి'

తడిక టోపీ పెట్టుకుని లాంప్ పట్టుకుని బయల్దేరాడు వరదరాజులు. ముందర రమేశ్‌చంద్ నడుస్తున్నాడు.

దారి రానురాను మరీ చీకటయి తోవ తెలీకుండా పోయింది. బయట కన్నా యిక్కడ దీపపు వెలుగు చాలా సహాయం చేస్తోంది. అన్నివేపులా గట్టిరాయి. మెట్లు పొరపాటున జారితే కన్పించడు. అవకతవకలుగా వంకరులు తిరిగి ఎక్కడికో లాక్కుపోతున్నాయి మెట్లు.

"జగ్రత్త సార్. ఈ దారులన్నీ మీకు కొత్త. జాగ్రత్తగా నడవకపోతే జారిపోతారు"

మెల్లిగా అడుగు తీసి అడుగువేస్తున్నాడు వరదరాజులు. ఎక్కడి నుంచో రాళ్ళమధ్య నుండి చల్లటిగాలి వీస్తోంది. కిందకి పోతున్నకొద్దీ వొళ్ళంతా చెమటతో తడుస్తోంది. కాళ్ళన్నీ చెమ్మగా వున్నాయి. చుక్కలు చుక్కలుగా నీరు కారుతోంది. గుడ్డివెలుగులో రాళ్ళకి అంటివున్న మైకా మెరుస్తోంది .మీదికి చూస్తే ఆకాశపు వెలుగు చిన్న నక్షత్రంలాగా కనిపిస్తోంది. పావుగంట గడిచాక ఆగాడు.

"ఎంతదూరం వచ్చాం?"

వెనక్కి తిరిగాడు రమేశ్. "బాగా అలసిపోయారు కూర్చోండి. సరిగ్గా 550 అడుగులు భూమట్టానికి క్రిందకి వచ్చాం ఇక 25అడుగుల్లో త్రవ్వు జరుగుతున్న చోటుకి వస్తాం. జాగ్రత్తగా వినండి. ఇక్కడికీ శబ్దం వినిపిస్తూంటుంది."

ఎక్కడో దూరంగా మనుషుల అలికిడి, పెద్ద యంత్రాలు కదులుతున్న చప్పుడూ వినిపిస్తోంది.

ఓ గబ్బిలం లేచి తలకి గట్టిగా కొట్టుకుని వెలుగువేపు ఎగిరిపోయింది.

భయపడ్డాడు వరద.

"ఇంతదూరం రోజూ నడిచి వెళ్తారా పనివాళ్ళు?"

నవ్వాడు రమేశ్‌చంద్ శరీరం కలిసిపోయింది. దూరాన ఓ గుడ్డి దీపం మాత్రం కనిపిస్తోంది.

"మెల్లిగా రండి. మీకు సరిగ్గా నాలుగడుగుల క్రిందన మెట్లు పూర్తవుతాయి. రాళ్ళమీంచి మారుతూ నడవాలి" అరిచాడు రమేశ్.

ఆగిపోయాడు వరద. తలంతా వర్షంలో తడిసినట్టు ముద్దయింది. తడికె టోపీ నరాల్ని కొరికేస్తోంది. కిరసనాయిలు దీపం ఉండుండి వీచే చల్లటి గాలికి రెపరెపలాడుతోంది. దారి సన్నబడి ఒక్క మనిషి నడవడానికి వీలయినంత మాత్రం మిగిలింది. కాలికింద

రాళ్ళు బలం లేకుండా కదులుతున్నాయి. కాలుజారితే ఎక్కడ వుంటారో తెలీదు. ఈ నరకంలో ఎనిమిది గంటలు ఎలా బ్రతుకుతారో పనివాళ్ళు. వాళ్ళ జీవితానికి ఆసరా అది. ఆలోచనల్లో కాలుజారింది వరదకి. భయంతో నీరసంగా అరిచాడు. ఒక్క ఉదుటున వెళ్ళి ముందు నడుస్తున్న రమేశ్‌చంద్ మీద పడ్డాడు. రమేశ్‌చంద్ అరిచాడో లేదో వినిపించలేదు. దూరంగా తూలిపోయాడు. లైట్లు రెండూ ఆరిపోయాయి. తడిక టోపీ ఎక్కడికో తుళ్ళిపోయింది. ఓ రాయికి బలంగా వరదరాజులు నుదురు ఆనుకుంది. శోష వచ్చినట్టు ఉండిపోయాడు వరద. రమేష్ గొంతు వినిపించలేదు అతనికి. భయమేసింది. బలమంతా పూరించి అరిచాడు.

ఎక్కడో అరుపు వినిపిస్తోంది. ఓపికలేక అక్కడే కూర్చుండిపోయాడు. నుదురు పగిలినట్టుంది. చేత్తో తడుముకుంటే చిక్కటి ద్రవం చేతికి తగిలింది. అది చెమటో రక్తమో తెలీదు.

ఇంతలో ఓ దీపం మెల్లగా క్రిందనుంచి వచ్చింది. రమేష్ గొంతు వినిపించింది.

"సార్!" అని అరుస్తున్నాడు.

"ఇక్కడే ఉన్నాను. మీకేమైనా దెబ్బతగిలిందా? రాయి జారింది. అందుకని పడిపోయాను."

"కుడి భుజం కీలు బెణికింది. పదండి, ఇక మిమ్మల్ని వదిలిపోను" అన్నాడు. మళ్ళీ రెండు దీపాలూ వెలిగాయి.

"నా టోపీ పోయింది. ఎలా?" అన్నాడు వరదరాజులు.

"నాది ఉంచుకోండి. మీద రాయి చాలా బలమైంది. తగిలితే తల పగులుతుంది.

టోపీ ఉంచుకుని మళ్ళీ నడిచాడు.

"ఇక్కడ వీళ్ళంతా మనుషుల్లా బ్రతకరు సార్. రోజూ వెలుగుని చూసేది తక్కువ. ఎంతసేపూ చీకట్లోనే యిక్కడి బ్రతుకు."

చివరికి క్రిందకి దిగాల్సిన భాగం పూర్తయింది. సమతలంగా కొంతదూరం పోవాల్సి వుంది. నేలకి అడుగు ఎత్తున చిక్కని ద్రవంలా వుంది నీటిలో కలిసిన బురద. ట్రాలీ నడవటానికి మధ్యగా పట్టాలున్నాయి. వెడల్పు విశాలంగా వున్నా, ఎత్తు మాత్రం తక్కువయి మనిషి సగం వంగితేనే గానీ నడవడానికి వీల్లేకుండా వుంది.

"జాగ్రత్త సార్. ఇది మూడో స్టేజి. ఇక మరోమారు అడుగుల్లో త్రవ్వు జరుగుతున్నచోటికి వస్తాం" అన్నాడు రమేశ్.

అప్పటికే గొందిలా తయారయింది ఆ ప్రదేశం. గాలి బరువెక్కి కదలడం మానేసింది. ఊపిరి పీల్చడం చాలా ప్రయత్నం మీద జరుగుతోంది. లాల్చీ ఒంటికి అంటుకుపోయింది. కోటు తీసేసి భుజం మీద పడేసుకున్నాడు రమేశ్‌చంద్.

"ఇక్కడ మీరు చూసే జంతువుల్ని ప్రపంచంలో ఎక్కడా చూడరు. వీళ్ళని మనుషులనడం అనవసరం. బయట ప్రపంచం ఏమవుతుందో వీళ్ళకి తెలీదు. భూమికి 800 అడుగుల క్రిందన బ్రతుకుతారు వీళ్ళు. రాత్రి నిద్రపోవడం. ఉదయాన ఈ సొరంగంలో బ్రతకడం యిదీ వీళ్ళ కార్యక్రమం, పదండి ముందుకు"

ఒకర్ని మోసుకుని ముగ్గురు వస్తున్నారు.

"ఏంగురయ్యా!" అన్నాడు రమేశ్.

"సింగరాయుడి నెత్తిమీద రాయి పడిందండి. తల పగిలినట్లుంది. మీదకి చేరేస్తేగాని బ్రతికేట్టులేడు."

"అయితే వెళ్ళండి త్వరగా. లిఫ్ట్‌లో వెళ్ళకూడదూ?"

"వీల్లేదన్నారటండి ప్రొప్రయిటరుగారు. ఎవరు పెద్దమనుషులొచ్చారట. వాళ్ళకోసం ఉంచారట."

అప్పటికి వచ్చాడు వరదరాజులు. చివరిమాటలు వినిపించాయి. "మనకి లిఫ్ట్ అక్కర్లేదు. వీళ్ళని పంపేయండి" అన్నాడు.

రమేశ్‌చంద్ వాళ్ళతో ఏదో చెప్పాడు. మరో దోవంట అతన్ని మోసుకుపోయారు వాళ్ళు.

ఏవో పిచ్చిపాటలు దగ్గరలో వినిపిస్తున్నాయి. చిన్న నీడల్లాగ చీకట్లో మనుషులు కనిపిస్తున్నారు. కొండ దొలుస్తున్న శబ్దం గుండెను కదిలించేదిగా వినిపిస్తోంది.

ఉన్నట్టుండి వేడిగాలి ప్రదేశమంతా వ్యాపించింది. పొగలాగ, మట్టితో, నీరుతో బరువెక్కి చెమ్మగా శరీరమంతా సుడులు చుట్టేస్తోంది.

ఊపిరాడక ఆగిపోయాడు వరదరాజులు.

"ఏమిటండీ యిది?"

"నారాయుడూ 234" అనరిచాడు రమేశ్‌చంద్.

జవాబు వచ్చింది.

నీరసంతో రాయికి చేరబడిపోయాడు వరద.

"వెంటిలేటర్స్ పాడయాయటండి. గాలిమీదకి పోవడం లేదు. ముందుకు రాగలరా?"

మంటల్లో వున్నట్లు వొళ్ళంతా ఉడికిపోతోంది. ఆలోచన పోవడంలేదు. ఊపిరి పీల్చుకోవడానికి వీల్లేకుండా గాలి ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది.

"తగ్గే సూచనల్లేవా యేమిటి?" అన్నాడు.

"మరో అరగంటక్కాని మంచిగాలి రాదు బహుశా. మీదకి కబురు వెళ్ళాక యింజనీర్లు రావాలి. కాస్త ప్రయత్నించగలరేమో చూడండి. మరొక్క మలుపు తిరిగితే 50 గజాల్లో వర్కింగ్ స్పాట్ వుంది."

కీళ్ళన్నీ నొప్పిపుట్టి వణుకుతున్నాయి. చల్లటి, తేలిక గాలి పీల్చుకోవాలన్న ఆశ ఎక్కువయింది. వెనక్కి తిరిగిపోవాలనిపించింది.

"వీళ్ళపాపానికి చివరి ఘట్టం. రాగలిగితే రండి. ఒక్క నిముషంలో తిరిగి వచ్చేద్దాం."

చివరిసారిగా యీ సంక్షోభం మధ్య విశ్వేశ్వరాన్ని చూడాలనే కాంక్ష మళ్ళీ అతన్ని ముందుకు తోసేసింది. గాలి మరీ బరువెక్కుతోంది. పక్కనే వున్న రమేశ్‌చంద్ కనిపించడంలేదు.

లేచాడు వరదరాజులు "పదండి" అన్నాడు. తన చేతిలో దీపం ఆరిపోయింది. అయినా దూరాన చిన్న వెలుగు కనిపిస్తోంది. పక్కనుంచే ఓ ట్రాలీని తోసుకుంటూ నలుగురు వెళ్ళారు.

"వీళ్ళకి రోజంతా పనిచేసినందుకు రెండురూపాయలు యిస్తారు" అంటున్నాడు రమేశ్.

మలుపు తిరిగేసరికి అయిదారు దీపాల వెలుగు కనిపిస్తోంది. సుమారు 30 మంది పనిచేస్తున్నారు.

ఒక వ్యక్తి రెండు దీపాలు పట్టుకుని ఎదురుగ్గా వచ్చాడు.

"వెంటిలేటర్స్ పాడయినట్టున్నాయి. మీదకి కబురు వెళ్ళిందా?"

"ఇప్పుడే పంపానండి" అని వరదని చూసి నమస్కారం చేసాడు.

"ఈ గ్యాంగు యిన్‌చార్జి సార్ యితను, నారాయుడు. అడగండి, వీళ్ళ జీవితాలన్నీ చెప్తాడు"

చీకట్లో నారాయుడి వంటిమీద బట్టలేమి కనిపించడంలేదు, వ్యక్తిత్వం, కోరికలూ, సిగ్గూ, స్వేచ్ఛ, భయం, అనుమానం, అన్నిటినీ మరిచిపోయి ఎన్ని యుగాల క్రితం జంతువుల్నో జ్ఞాపకం చేస్తున్నారు వీళ్ళు.

"ఇంత నరకంలో ఎలా గడుపుతారిక్కడ?"

"అలవాటయిపోయింది సార్, ఇక్కడికి రాకుండా ఉండలేం, ఒక్కరోజు లోపలికి రాకపోతే తోచదు మాకే బాధలూ లేవు. ఒక్క గుండె జబ్బు తప్పిస్తే"

"అదేమిటి?"

"అప్పుడే నా ఊపిరితిత్తులు పాడయానని చెప్పాడు డాక్టరు. నాకిప్పుడు ముప్ఫై రెండు సార్, మరి నాలుగయిదేళ్ళు బ్రతుకుతానంతే, ఆరేళ్ళు బ్రతికితే ఎక్కువన్నారు. "

నిలువునా వణికిపోయాడు వరదరాజులు.

"ఈ పనిమానేస్తే ఏం?"

నవ్వాడు నారాయుడు

"అలాంటివి మేం ఆలోచించం సార్. మా నాన్న యిక్కడే రాయిపడి చచ్చిపోయాడు. పదేళ్ళ నుంచీ ఈ గనిలో దిగడమే నాకు తెల్సు, నా కొడుక్కు కూడా ట్రాలీ యీడవడం నేర్పారు."

మాట్లాడే ఓపికా, ఆశ్చర్యపడే ఉత్సాహం పోయింది వరదకి, క్రమేపీ సత్తువనీ, ప్రాణాన్నీ తినేస్తున్నట్టుంది గాలి. బలంగా నరాలన్నీ కూడదీసి మాట్లాడితేగాని మాటవినిపించడంలేదు.

"రండి త్రవ్వు చూద్దురుగాని"

యంత్రాల శబ్దానికి భూమి దద్దరిల్లిపోతోంది. అడపా, తడపా మీదినుంచి యిసికా, రాళ్ళూ జారుతున్నాయి. చుట్టూరాళ్ళు రాయికి రాయికీ మధ్య నల్లటి పొరల్లో నల్లటి మైకా పెచ్చులు మెరుస్తున్నాయి. రాయిని ఏదో యంత్రపు కోరతో త్రవ్వి పోస్తున్నారు నలుగురు పనివాళ్ళు.

"విశ్వేశ్వరం ఎక్కడున్నాడు?" అన్నాడు రమేశ్‌తో.

"డి 67 ఎక్కడ?" అంటున్నాడతను.

"ఇప్పుడే చివరికి వెళ్ళాడండి ట్రాలీతో, క్షణంలో వస్తారు, ఆకు కావాలా?"

"ఆకేమిటి?" "అలసట తీరడానికి సార్, నమిల్తే నోట్లో నీరు ఊరుతుంది. దాహం వుండదు."

వద్దన్నాడు, క్షణం యుగంలా గడుస్తోందక్కడ. మరోక్షణం ఉంటే ముఖం తిరిగేట్టుంది.

"పోదాం పదండి" అని వెనక్కి తిరిగాడు.

"లిఫ్ట్ పిలిపించేదా సార్, నిముషంలో వస్తుంది"

"మొదట యీ గాలిని దాటాలి, పిలిపించండి"

నారాడియుతో చెప్పి తొందరగా వరదరాజులు వెనక నడిచాడు రమేశ్‌చంద్.

అరవై గజాలు దాటగానే గాలి కాస్త పల్చబడింది. తేమ తగ్గక పోయినా కాస్త ఊపిరి పీల్చుకునే అవకాశం కలిగింది.

"ఇటు వెళ్ళాలి. లిఫ్ట్ యిటువేపు వుంది" అంటున్నాడు రమేశ్.

దూరాన ట్రాలీ వస్తున్న చప్పుడూ వినిపించింది.

"ఆగండి, విశ్వేశ్వరం వస్తున్నట్టుంది"

దీపం ఎత్తి అరిచాడు రమేశ్‌చంద్, ట్రాలీ పదిగజాల ముందుకు పోయి ఆగింది.

వరద ఆత్రుతగా అటువేపు నడిచాడు, చీకట్లో నలుగురి ముఖాలూ నీడల్లా కనిపిస్తున్నాయి. దీపపు వెలుగులో అతన్ని విచిత్రంగా చూస్తున్నారు వాళ్ళు.

''విశ్వేశ్వరం..'' అన్నాడు బలహీనంగా.

మధ్యన నిలబడి నుదురు తుడుచుకుంటున్న వ్యక్తి తలెత్తాడు.

వెలుగులో అతని ముఖం స్పష్టంగా కనిపించింది వరదరాజులుకి.

నల్లబడి - నీరసించి - ప్రేతంలా వున్నాడు. కళ్ళు నిర్జీవంగా దృష్టి జ్ఞానంలేనట్టు కదుల్తున్నాయి.

''విశ్వేశ్వరం కళ్ళల్లో వింత కనిపించింది. అంతలో మాసిన గెడ్డాన్ని రెండు చేతుల్తో తుడుచుకుని అటువేపు తిరిగాడు.

అతని భుజాన్ని పట్టుకున్నాడు వరద - చెమటతో మన్నుతో వొళ్ళు జారింది.

''నాతో మాట్లాడకు, నాతో మాట్లాడకు''

ట్రాలీ బలబలలాడుతూ కదిలిపోయింది. రాయిలా నిలబడిపోయాడు వరదరాజులు.

రమేశ్‌చంద్ అతణ్ని కలుసుకున్నాడు ''ఏం సార్! చూశారా అతణ్ని?''

''....''

''అదేం అలా వున్నారు? మీరు స్పృహ తప్పుతున్నట్టుంది, వుండండి''

ఒక్క ఉదుటున అతణ్ణి రెండు భుజాలమీదికి ఎత్తుకున్నాడు రమేశ్‌చంద్, తొందరగా అడుగులు వేసాడు.

''నేను నడవగలను, దింపేయండి'' అని మూలుగుతున్నాడు వరదరాజులు. కానీ లిఫ్ట్‌లో పడేసేవరకూ వదల్లేదతను.

నిజంగానే స్పృహ తప్పినట్టనిపించింది వరదకి.

లిఫ్ట్ తొందరగా మీదకి కదిలింది. నరకాన్ని వదిలి మరో ప్రపంచానికి తేలిపోతున్నట్లుంది. మీద తెల్లగా ఒంటి నక్షత్రంలాగా ఆకాశం వెలుగు కనిపిస్తోంది.

మరి కాస్సేపటికి బయటిమాటలు వినిపించాయి. అనంతశయనంగారి నవ్వు పోలికపట్టగలిగాడు వరదరాజులు.

లిఫ్టు ఆగగానే బెనర్జీ, చంపని ఎత్తుకుని పరుగెత్తుకు వచ్చాడు.

''నుదుటికి దెబ్బ తగిలిందేమిటిసార్? జార్జ్! చల్లటి నీళ్ళు తీసుకురాండి'' అరిచాడు బెనర్జీ.

బకెట్‌తో నీళ్ళు తెచ్చారు. ముఖం కడుక్కున్నాక కాస్త స్థిమితం చిక్కింది. ఎండ ఆసరికి కొండలవేపు మాయమవుతోంది. కొండ నీడల్లోంచి చల్లగాలి వస్తోంది. వొళ్ళంతా గాలిలో తేలిపోతున్నట్లు హాయిగా ప్రశాంతంగా వుంది.

''నిలబడకండి, ఫెయింట్ అవుతారు నాకు తెల్సు, ఐస్‌క్రీం తీసుకుందాం పదండి''

ఎండుగడ్డితో పాకలాగ వేసిన చోటుకి వరదని తీసుకువచ్చాడు బెనర్జీ. నేలంతటా చల్లనినీరు జల్లారు. మధ్య కుర్చీలో అనంతశయనంగారు కూర్చుని పత్రిక చదువుతున్నారు.

''ఏమండీ? గని ఎలావుంది?'' అంటున్నారు.

ఏదో కొత్తప్రపంచంలోకి వచ్చినట్లుంది.

ఫాను తెప్పించాడు బెనర్జీ, ఐస్‌క్రీమ్ తిన్నాక చాలావరకూ తేరుకున్నాడు వరదరాజులు.

ప్లాస్టర్ తెప్పించి అతికారు.

''భయపడిపోయారు - నే చెప్పలా? - అయిదుసార్లు వెళ్ళాను నేను'' ఆటపట్టిస్తోంది చెంప.

రమేశ్‌చంద్ ముఖం కడుక్కుని దూరంగా ఇనపగొట్టం మీద కూచుని కులాసాగా సిగరెట్ వెలిగించాడు.

"ఎప్పుడో చేసిన పాపాలకి ప్రత్యక్షంగా శిక్ష అనుభవిస్తున్నారు వాళ్ళు, వాళ్ళు మనుషులుకారు ఏదో తెలీని శక్తివాళ్ళను మోసుకుపోతోంది.

"చీకటిపడుతోంది పదండి ఇప్పుడు గార్డెన్ హౌస్‌కు వెళ్దాం. ఈ నరకం చూశాక ఆ స్వర్గం విలువ తెలిసి వస్తుంది" అని లేచారు అనంతశయనంగారు, చంప చెయ్యిపట్టుకు లేస్తూ.

"మీరు రారా ఏమిటి?" అన్నారు బెనర్జీతో.

"మీరు ముందు పదండి. రాత్రి డ్యూటీ పనివాళ్ళకి జీతాలు ఏర్పాటు చేసి భోజనానికి కలుస్తాను" అన్నారాయన.

"నమస్కారం సార్, ఎప్పుడన్నా వస్తుండండి" అని చెయ్యి ఆడిస్తున్నాడు రమేశ్‌చంద్.

కారు కొండదిగి తాపీగా మైకా గచ్చుమీంచి పాకుతోంది - వెనక్కి చేరబడి స్థిమితంగా ఊపిరి పీల్చుకున్నాడు వరదరాజులు.

గార్డెన్ హౌస్ దగ్గర కారు ఆగేసరికి నిద్రపోతున్నాడతను.

"ఇవాళరాత్రి మీ బస యిక్కడ ఏర్పాటు చేయించేదా - మూడు రోజులవరకూ తెలివిరాదు"

చంప బంతిపువ్వుల్ని చూసి పరిగెత్తింది.

"మా తాతల దగ్గర్నుంచి వస్తున్న ఆస్తి యీ బంగళా - మైన్స్ మాటెలా వున్నా యిదంటే ప్రాణం నాకు" అన్నారు అనంతశయనంగారు.

కాస్త దూరం పోయాక దారి రెండుగా చీలి మీదికి లేచిపడుతున్న ఫౌంటెన్ చుట్టూ తిరిగింది.

అప్పుడే దీపాలు వెలిగించారు. ఫౌంటెన్ నీరు దీపాల కాంతిలో రంగు రంగులుగా కనిపిస్తోంది. చుట్టూ పొడవుపాటి బల్ల వేసారు దారి పొడుగునా రకరకాల ఫెరన్సు ఉంచారు. కొమ్మలు గాలికి వంగి అటూ యిటూ ఊగిసలాడుతున్నాయి.

కుడిపక్క పొడవుగా పర్ణశాలలా పందిరి వేశారు ఎండుగడ్డితో.

"వేసవికాలంలో ఇక్కడ వుండే చల్లదనం ఏ బంగళాలోనూ ఉండదండి, గాడ్పులు ఎక్కువగా వుంటే యిక్కడికి కార్లో వచ్చేస్తాను"

పర్ణశాలకింద రెండు సోఫాలూ, ఓ టేబులు ఫానూ, చిన్న బీరువాలో లైబ్రరీ, నీళ్ళకూజా అన్నీ చక్కగా ఏర్పాటు చేసి ఉన్నాయి.

"ఇక్కడ కూచుందామా, లోపలికి వెళ్దామా?"

"పదండి, చూసి పోదాం."

అల్లంత దూరంలో ఎర్రటి బంగళా అగుపిస్తోంది. చుట్టూ వెదురుతో అల్లిన పరదాలు వేలాడుతున్నాయి, మెట్ల దగ్గర పర్వతంలాగ నౌకరు కూర్చున్నాడు. చేతికర్రా, చుట్టతో ముణుకులు మీద తల ఆనించి మసక చీకట్లోకి చూస్తున్నాడు.

చెట్ల మధ్య నుంచి ఒక్క గెంతు గెంతి తాతయ్యను భయపెట్టింది చంప. నిజంగానే తుళ్ళిపడి సర్దుకున్నాడు అనంతశయనంగారు.

తీరా మెట్లు ఎక్కి పక్కనే ఉన్న నౌకరు బొమ్మని చూసి దిమ్మరపోయాడు వరదరాజులు.

"బొమ్మటండి యిది?"

పకపక నవ్వుతోంది చంప, బంతిపువ్వులన్నీ తలలో గుచ్చుకుంది. సన్నజాజుల్ని కోసి గుప్పెట్లో పట్టుకు ఎగురుతోంది.

"ఇంకా రండి. లోపల చాలా వుంది."

నత్తగుల్ల ఆకారంలో మెలికలు తిప్పినట్టుంది బంగళా. ముందు విశాలమైన హాలు, ముఖం ప్రతిబింబించేట్టు నునుపయిననేల, లతలూ, పువ్వులూ, నగిషీలూ లేకుండా ఏ గోడా మిగల్చలేదు. సన్నటి ప్రేముల్తో నాలుగు గోడలకీ ఒకే రేఖా చిత్రం పుస్తకంలో పుట విప్పినట్టు గీశారు. బోధిసత్త్వుడి జీవిత చరిత్ర చితలేఖనంలో మిళితమయి కళ్ళను చెదిరిస్తున్నది. ఎదురుగ్గా నిలువెత్తు రాధాకృష్ణుల చిత్రం. పక్కనే మేడమీదకి పోయేందుకు మెట్లు –

చంప పరిగెత్తిపోయి రాధపక్క నిలబడ్డది

దిమ్మరపోయాడు వరద.

**రాధకూ చంపకూ** ఏమీ బేధం కనిపించడంలేదు. అవే కళ్ళు. అదే మెరుపు. అదే ముగ్ధత్వం. కాస్తపాటి చిలిపిదనం. అంతా ఆమెగానే కనిపించింది రాధ.

కృష్ణుడి మురళీనాదం వింటూ పరవశంతోవున్న రాధిక దృశ్యం చంప నవ్వుతో సిగ్గుపడింది.

"ఈ లోపలికిరండి" అంటూ రాధాకృష్ణుల పటాన్ని తొలగించారు. మరో పెద్దగదిలోకి తోవ కనిపించింది. ఏదో కొత్త ప్రపంచంలోకి వచ్చినటుంది వరదకి.

లోపలికి అడుగుపెట్టగానే అగరొత్తుల పరిమళం గుప్పుమని కమ్ముకొంది.

"ఆయన కాశీనాధ చట్టోపాధ్యాయ. ఈ బంగళా అంతా అలంకరించడానికి బెంగాలునుంచి రప్పించాం. మరో ఆరునెలలు యిక్కడ పనిచేస్తారు. హాల్లో చిత్రాలన్నీ ఈయన గీసినవే?" అంటున్నారు అనంతశయనంగారు.

అగరొత్తుల పొగమధ్య సన్నగా రివటలాటి విగ్రహం కనిపించింది వరదకి, ఎర్రటి కెంపురంగుపంచె మాత్రం కట్టుకున్నాడాయన. పొడువుపాటి ధోవతి నేలవరకూ వేలాడుతోంది. పచ్చగా, బంగారంలాగ మెరుస్తున్నాడు. తలమీద ఏ మాత్రం జుత్తు మిగల్లేదు.

ఓ మూల సగం గీసిన నగ్నస్త్రీ చిత్రం వుంది. కండరాలన్నీ వంపులు తిరిగి మత్తెక్కించేట్టుగా వ్రాశాడు. నల్లగా పొడవాటి జుత్తు భుజాలమీంచి జారి పిరుదులవరకూ ప్రాకింది. ఒక్క క్షణం ఎదురుగ్గా ప్రాణంతో నిలిస్తే అవయవాలన్నీ ఎదురుతిగేంతటి సజీవత్వం ఉట్టిపడుతోంది.

"సగంలో ఆపేశారేం?" అడిగాడు వరద.

నవ్వుతోంది చంప. "అతనికి తెలుగురాదు" అన్నారు అనంతశయనంగారు. బెంగాలిభాషలోనే అడిగారు. నవ్వుతూ సగం సగం కలిపిన రెండు రంగు బేసిన్లని చూపాడతను.

"వంటికి సరైన రంగు కుదరక ఆపేశానంటున్నాడు. ఆ రంగు కోసం తంటాలు పడుతున్నాడు" అన్నారాయన.

"చాలా గొప్పచిత్రాల్ని వేసారు. వీటిని చూడడమే జీవితంలో ఓ అవకాశం" అందామనుకున్నాడు. "చాలా సంతోషించానని చెప్పండి" అన్నాడు.

జవాబుగా నమస్కారం చేశాడు కాశీనాథ్‌చట్టో, వెంటనే సగం కలుపుతున్న రంగుల దగ్గిర చతికిలబడి పనిలో నిమగ్నమయాడు.

"నేనిక్కడకి వచ్చినప్పుడల్లా పురాణం చెప్పేందుకు ఓ శాస్త్రిగారిని శ్రీకాకుళంనుంచి రప్పించాను. ఇక్కడే ఉంటాడాయన. ప్రతినెలా జీతం ఏర్పాటు చేశాను" అన్నారు బంగళావెనుక తోటలోకి నడుస్తూ –

అందంగా చుట్టూ మొక్కలు పెంచారు. మధ్య చిన్న 'పూల్' ఉంచారు. గట్టుమీద కూచుని నీళ్ళల్లోకి కాళ్ళు వేల్లాడేసి ఆడిస్తోంది చంప.

"స్నానం చేస్తాను తాతయ్యా. సింగన్న ఏడీ?"

"సాయంకాలం స్నానం మంచిదికాదమ్మా వాణ్ణి పిలువు. కలువ పువ్వు కోసిస్తాడు. "

నీటికి మధ్య ఒకే ఒక్క కలువపువ్వు పెట్టినట్లుంది.

"మీరు చాలా అదృష్టవంతులు, డబ్బున్నా ఉపయోగించుకోవడం తెలీనివాళ్ళు చాలామంది ఉన్నారు" అన్నాడు వరదరాజులు.

పొంగిపోయారు అనంతశయనంగారు.

బంగాళా చుట్టూ తిరిగి ముందు ఫౌంటెన్ దగ్గరికి వచ్చేసరికి చుట్టూ ఎర్రలైట్లు వెలిగించారు. క్రీపర్లు సరిగ్గా కత్తిరించలేదని బెనర్జీ నౌకర్లమీద ఎగురుతూ కనిపించాడు.

వీళ్ళని చూసి, "మీరింకా యిక్కడే వున్నారా? ఎలా వుంది మా పేరడైజ్, యీ బంగళా డిజైన్ ఢిల్లీ నుంచి తెప్పించాను. గార్డెన్ వర్క్ అంతా నాది" అంటూ పైప్ వెలిగించాడు.

"ముఖ్యంగా చిత్రాలు బాగా నచ్చాయి"

"పూర్‌మెన్, ఆ బెంగాలీకి తిండిలేక తిరుగుతూంటే ఓ ఫ్రెండ్ నా దగ్గరికి తీసుకొచ్చాడు. ఏం చేస్తావంటే బొమ్మలేస్తానన్నాడు. నాకు నవ్వొచ్చింది. 'నా బొమ్మ వెయ్యి' అన్నాను. ఓ అరగంటలో నా బొమ్మతో పాటు వెనక ఫ్యాక్టరీ గొట్టాలూ, యంత్రాలూ, చివరికి నా ఫీలింగూ అన్ని చిత్రంలో తెచ్చేశాడు. నాకాశ్చర్యమేసింది. రెండుపూటలా తిండి తినడు. పాలుమాత్రం తాగుతాడు. ఆకలిలోంచి కవిత్వంలాగే, చిత్రలేఖనంకూడా వచ్చిందేమో మరి? టీ తెప్పించేదా?"

బంతిపువ్వు కోయబోయాడు వరద.

"ప్లీజ్" ఆపేడు బెనర్జీ, "అక్కడి పువ్వుకోస్తే గార్డెన్ సిమ్మెట్రి పాడవుతుంది, ఇంటికి బుట్టలో పువ్వులు పంపిస్తాను" అన్నాడు.

అతని జాగ్రత్తకి నవ్వొచ్చింది వరదకి.

"ఇక పదండి, నాలుగు స్పెషల్స్ ఆర్డరు చేయించాను డిన్నర్‌కి, వేగంగా వెళ్ళి తయారుకావాలి."

కారులో ఒక్క నిముషంలో యింటికి తీసుకొచ్చేశాడు బెనర్జీ.

"కొత్తకారండీ, పారిస్ ట్రేడ్‌లో చిన్న సహాయం చేశానని అయిదువేలు తక్కువలో యిచ్చేశాడు అమెరికా ఏజెంటొకడు. చాలా తక్కువలో కొట్టేశాను" అన్నాడు.

భోజనాలయాక పేకాటకని కారులో వెళ్ళిపోయాడు బెనర్జీ.

చింతచెట్టు నీడలోకి మంచం వేసుకుని పడుకున్నాడు వరదరాజులు. అనంతశయనంగారి ఆతిధ్యం, చంప స్నేహం, బెనర్జీ చురుకు, కాశీనాథ్ చిత్రాలు- వీటన్నిటికీ వెనక. మాటిమాటికీ విశ్వేశ్వరం కనిపిస్తూనే వున్నాడు. ఈ లోకాన్ని వదిలేసి ఏదో కొత్తలోకంలో బ్రతుకుతున్న నీడలాగ, తక్కువతనాన్ని పెంచుకుని చిత్తుబతుకు యీడుస్తున్న విశ్వేశ్వరానికి అందులో ఏ సుఖం కనిపించిందా అని విస్తుపోయాడు.

చిన్నగాలికి చింతచివుళ్ళు కదిలి యీలపాట పాడాయి.

"హరికథ పెట్టించమన్నారా అని అడుగుతున్నారు నాన్నగారు" అని వచ్చింది చంప.

పొడవుపాటి ఎర్రటి వూలు స్వెట్టర్ వేసుకుని చలిలో ముడుచుక్కూచున్న పిల్లిలా వుంది.

''తలనొప్పిగావుంది - పడుకుంటానని చెప్పు''

మంచినీళ్ళచెంబు అక్కడే వదిలేసి పారిపోయింది చెంప. మంచం పక్కనే కీచురాళ్ళు చేరి గోలచేస్తున్నాయి.

ఎక్కడో పిల్లులు దెబ్బలాడుకుంటున్నాయి. ఒక్కసారి ఉన్నట్లుండి పెద్దగాలి వీచి యిసిక మంచాన్ని కప్పేసింది. కళ్ళల్లోకి, నోటిలోకి యిసికపోయి ఉక్కిరిబిక్కిరయాడు వరదరాజులు.

గదిలో ఏదో చప్పుడయింది. లేచివచ్చి దీపం వెలిగించాడు ముసలాయన. ఫోటో నేలని కౌగిలించుకున్నట్లు పడి బద్దలయింది. దళసరిగా గాజు పెంకులు ముత్యాల్లా గదంతా తుళ్ళిపడ్డాయి.

మంచాన్ని మోసుకొచ్చి గదిలో ఓ మూలకి వేశాడు. లైటార్పి పడుకోవడానికి భయమేసింది.

కళ్ళు మూయబోతే ఆలోచనలన్నీ సుడులు తిరిగి స్థిమితం లేకుండా చేసాయి.

మాటిమాటికీ విశ్వేశ్వరం మాటలు చెవులును గింగుర్లెత్తిస్తున్నాయి.

మధ్యాహ్నపు అలసట వీలు చూసుకుని లేచి ఆలోచనల్ని జయించింది. నిద్ర తియ్యదనంలో ఆలోచనలూ, ఆశ్చర్యం, సంశయం, సందిగ్ధం, కోరిక అన్నీ మూర్ఛపోయాయి.

నిర్లిప్తత మస్తిష్కాన్ని జయించి చీకటిని పాలించింది.

తూర్పు ఆకాశాన్ని యింకా నల్లచారలు పట్టి విడువకముందే ఎవరికీ చెప్పకుండా బయల్దేరాడు వరదరాజులు, విశ్వేశ్వరం కోసం.

నూతిగిలక చప్పుళ్ళూ, నీళ్ళపోతలూ, ఆడవాళ్ళ గాజుల చప్పుళ్ళూ బరువుగా వినిపిస్తున్నాయి. చెరువు వేపు గుంపులుగా నడిచిపోతున్నారు ఆడంగులు.

గనిలో పనిచేసే వాళ్ళు యిళ్ళు తెలీదు వరదరాజులుకి. టొపారంలేని గుర్రబ్బండీని ఆపి అడిగాడు.

''అబ్బో, అది చాలా దూరమే. రామలింగస్వామి గుడిదాటి మూడుమైళ్ళు. దారిలో నడవాలి'' అన్నాడు బండివాడు.

గుర్రం నాలుగడుగులు వేసాక మళ్ళీ ఆపి ''బండి ఎక్కుతారా, పొలాల దగ్గర దింపేస్తాను. రెండు మైళ్ళు నడిస్తే గుడిసెలు చేరతారు''

మరో మాటలేకుండా బండి ఎక్కాడు వరదరాజులు. ఎండుగడ్డీ, వరీ మోసుకురావడానికి ఉపయోగపడే ఎత్తుబళ్ళవి, రాయీ, రప్పా బేధం లేకుండా ఎత్తుపల్లాల్లోపడి యీడ్చుకుపోతోంది గుర్రం, శీలలన్నీ కదిలి కిర్రుమని ఒకటే రొదచేస్తున్నాయి.

టుంపులాగ, నూనెకారుతూ పొట్టిగా వున్నాడు బండివాడు.

''ఏం ఆసామీ - పనోళ్ళ యింటికి పోతుండారు?'' అన్నాడు.

''పనుందిలే - పనివాళ్ళు ఎన్నిగంటలకి వెళ్ళిపోతారేమిటి గనుల్లోకి?''

''అదేం తెలీదు. పొద్దుపొడిసే యేళకు వెళ్ళడం, చీకటికి యేళకు యిళ్ళు చేరడం''

ఎంతసేపు కూర్చున్నాడో అంతుపట్టలేదు వరదరాజులుకి. ఊరుదాటి సుమారు నాలుగుమైళ్ళు నడిచివుంటుంది బండి.

వంగపువ్వు రంగుకోక కట్టుకున్న పిల్లదగ్గర బండి ఆపేసాడు బండివాడు.

తెల్లగా, పల్చగా, కొమ్మలా వుంది - మరీ కిందకి వున్న ఎర్రటి గడ్డిపువ్వుని తీసి తలలో తురుముకుంటూంటే భుజాలు వంగి వింతగా కనిపించాయి.

''ఇదిగో, ఇలా పొలానికి అడ్డం పడండి సామీ, అల్లక్కడ కనిపించేవే గూడేలు''

వరదరాజులు బండి దిగి డబ్బు యివ్వబోయాడు. తెల్లబోయాడు బండివాడు.

''సీత్తెరీ.. డబ్బుకుపని సేసెవోణ్ణి కాదుసామీ, యెల్లిరండి''

వరదరాజుల్ని విచిత్రంగా చూస్తోంది పిల్ల, సిగ్గుపడ్డాడు వరద.

నల్లగా పక్కలకి జారిన జుత్తుమధ్య పాపిటలా పొలాల మధ్య తోవకనిపిస్తోంది. నిలువెత్తు పెరిగిన వరికంకులు యౌవనంతో బరువెక్కిన యువతి కళ్ళల్లో చపలత్వంలాగ ఊగిసలాడుతున్నాయి.

దూరాన ఖైదుగోడల్లాగ ఎర్రటి యిసుకతో కట్టిన కట్టడం కనిపిస్తోంది. వీటిమధ్యన మరీ ఎత్తుగా పెద్ద తడికల్తో యిళ్ళు కనిపిస్తున్నాయి. నల్లటి తారుపూశారు ప్రతి యింటికీ. పూర్తికాని ఆకలి చిత్రంలా అవుపిస్తోంది దూరాన దృశ్యం.

ముల్లుగుచ్చుకునేసరికి కాలు జివ్వుమంది. కుప్పగా వరివెన్నుల్ని పట్టుకుని, ఒంటికాలుమీద నిలబడి ముల్లుని తొలిగించబోయాడు.

''అమ్మ, దొంగా!'' అన్నమాటలు వినిపించాయి.

ఉన్నట్టుండి తననెవరో పొలం మధ్యకి లాగేస్తున్నారు.

భయంతో అరవబోయాడు వరదరాజులు.

ఏదో అర్థంకాని మెత్తదనం అతని నుదిటిని రగిల్చింది, చెప్పలేని, ఊహించలేని పిచ్చివాసన వొళ్ళంతా చుట్టింది. నీలిరంగు వింతపువ్వుల చల్లదనం చెక్కిళ్ళని వణికించింది. ఎవరో తనని చుట్టేసి క్రిందకి లాగేస్తున్నారు.

ఆ చేతుల మధ్య వరదరాజులుకు అసహాయతతో మూర్ఛవచ్చినట్లయింది.

''పిచ్చిమావా!''

అక్కడంతా చీకటిగా వుంది, వరికంకులు గుండెలకి తాకి గిలిగింతలు పెట్టున్నాయి. వెచ్చటి శ్వాస మెడని కదలించింది.

కదలబోతే మళ్ళీ దగ్గరికి లాక్కొని బలంగా వూడిపడ్డచేతులు.

బరువయిన నల్లటి దళసరి చీరకొంగు అతని నడుం చుట్టు తిరిగింది. పెదాలు అమాయకంగా గడ్డాన్ని రాస్తున్నాయి. చెక్కిలి గరుకుదనంలో అటూ యిటూ కదిలాయి బలహీనంగా.

ఏదో అనబోయి అనలేకపోయాడు. ఏదో చెయ్యబోయి చెయ్యలేకపోయాడు.

ఆమె ముక్కునత్తు నుదుటిని బలంగా గుచ్చింది. నల్లటి చీర మలుపు విడి ఒసిలింది. వరదరాజులు కాలు కదిలింది. అతి ప్రయత్నంతో తప్పించుకుని లేచి నిలబడ్డాడు.

అలసటతో వరికంకుల మధ్య ఉండిపోయిందామె.

ఒక్కతెను నాకేల ఓపజాలని సుఖము

''ఫో మావా మరెప్పుడూ నీ పొలానికి రాను'' ముఖం కప్పుకునే వుంది.

ఆమె బొట్టంతా చెరిగి తెల్లటి లాల్చీ అంతా ఎరుపెక్కింది. వొళ్ళు దులుపుకున్నాడు.

అతణ్ణి చూశాక ఆమె కెవ్వున కేకవేసింది.

లాల్చీకి తగులుకుని ముక్కు నత్తు యిరుక్కున్నచోట రక్తం చిమ్ముతోంది.

వరదని చూసి బయంతో నిలువునా వణికింది ఆమె.

కళ్ళల్లో అంత అమాయకత, రక్తంలో అంత ఆవేశం ఎప్పుడూ చూడలేదు వరద.

''మావనుకున్నావల్లే వుంది''

మాట్లాడలేదామె. అతను వెళ్ళిపోతే బావుణ్ణనుకుంది. కిందికి.. మరీ కిందికి తల దించుకుని భూమికి ఆనించుకుంది. ఎంతకీ అతను వెనుదిరక్కపోయేసరికి - ఒక్క క్షణంలో వరికంకుల మధ్య మాయమయింది.

అచేతనంగా నిలబడిపోయాడు వరదరాజులు, చెమటతో లాల్చీ తడిసి వొంటికి అంటుకుంది. ఆమె వంటి పరిమళం యింకా కదుల్తోంది.

ఒక్క ఉదుటున మెదడుకు పాకిన వేడి రక్తం దారులు వెదుక్కుని చల్లబడుతోంది.

మరి నాలుగడుగుల్లో పొలం దాటి రోడ్డుమీద పడ్డాడు.

ఎండ పదునెక్కి సూదుల్తో గుచ్చుతున్నట్టుంది.

ఆవులన్నీ మందలుగా బయల్దేరి దారికి అడ్డంగా నిలబడిపోయాయి. ఓ కన్నులేని నల్ల ఆవు దారి తప్పి గోడకు ఆనుకుని ఆగిపోయింది.

నల్లటి బట్టల్లో పేరుపెట్టి పిలుచుకుంటూ అప్పుడే వచ్చి ఆగిన బస్సువేపు పరుగెత్తుతున్నారు పనివాళ్ళంతా. చిన్నా పెద్దా విచక్షణ లేకుండా తడిక టోపీ చేత్తో మృత్యువుని ఊహించలేని శలభాల్లాగా బస్సులో పడుతున్నారు. ఏవో పిచ్చిపాటలు ప్రారంభించారు.

అందరూ ఉత్సాహంగా, నవ్వు ముఖాల్తో వున్నారు. కానీ ఆ నవ్వుకు వెనక ప్రపంచం అంటే అర్థం తెలీని అమాయకత, తెలీని నీరసం, మృత్యువు నీడలు కనిపిస్తునే ఉన్నాయి.

పెద్దకేకల్తో బస్సు కదిలింది.

దారిపక్క చిన్న టీ దుకాణం వుంది, నాలుగు తడికెలు దగ్గిరగా చేర్చి చిన్న గదివేశారు. రెండు బల్లలూ, రాక్షసిబొగ్గు పొయ్యి, నల్లటి పెద్దపాల బిందె, టీ కలపడం ఒక్కటే చేతనయిన నల్లటి మొహం, గ్లాసులు కడగడానికి కూచున్న సగం చిరిగిన పరికిణాతో అర్థనగ్నంగా వున్న కుంటిపిల్ల నవ్వూ - యిదీ అక్కడి దృశ్యం.

పొడవాటి మనిషి కలిపిచ్చిన టీని తాగుతూ కబుర్లాడుకుంటున్నారు. మనస్సు వరకూ ఏ విషయాన్ని జేరనివ్వకుండా తేలిగ్గా రోజులు గడుపుకు పోతున్న మనుషులు అంతా అసలు మనసులు మిగిలాయా అన్నది అనుమానం. వీరందరి మధ్యా యీ రొంపిలో విశ్వేశ్వరం వొళ్ళు జలదరించింది.

ఎంతసేపు నిలబడినా విశ్వేశ్వరం జాడ కనిపించలేదు. టీ దుకాణం క్రమంగా ఖాళీ అయింది. డబ్బు లెక్కపెట్టుకుంటున్నాడు పొడవాటి మనిషి.

"విశ్వేశ్వరం రాలేదేం యివాళ?"

తలెత్తాడతను, క్షణం ఆలోచించి "నరిసే" అనరిచాడు. కుంటిపిల్ల వచ్చి బల్లని ఆనుకుని నిలబడింది.

"ఈ బాబుని బొమ్మలాయన కొంపకు తీసుకెళ్ళు" అన్నాడు.

"వరద వెళ్ళబోయేంతలో పోనీలే, మీరిక్కడే ఉండండి సామీ! అదంతా కంపుగుంది. నువ్వెళ్ళిరాయే, ఆరికి కబురెట్టు"

కుంటిపిల్ల వెళ్ళింది -

"టీ తాగుతారేటీ సామీ?"

బిందె అడుగున మిగిలిన పాలని కెలుకుతూ అన్నాడు.

"వద్దులే, వస్తాడా యిక్కడికి?"

"ఎవరికి తెలీదయ్యి, దెయ్యం మనిషి. వత్తే వత్తాడు. లేకపోతే కసిరి పొమ్మంటాడు?"

కుంటిపిల్ల దూరాన కనిపించింది.

"ఏటే!?"

"తలుపేసుందయ్యా - కుక్క కరిచింది" ఏడుస్తూ కూలబడింది.

వరదరాజులు రోడ్డుమీదకి వచ్చేశాడు.

ఎండ మరీ తీవ్రతరమయింది.

పొలాలమధ్యకి వచ్చేసరికి మనస్సుకి కాస్త ఉపశమనం కలిగింది.

ఇందాకటి అమ్మాయి కనిపిస్తుందేమోనని చుట్టూ చూశాడు. పొలమంతా నిండుగా ఆనందంతో పొంగిన మనస్సులా వుంది. ఓ చివర ఒడిసె పట్టూ ఎవరో కనిపించారు. అటువేపు నడిచాడు వరదరాజులు, దగ్గరకు చేరేసరికి పెద్ద తలపాగా, వంపుమీసాలూ, కండలు తిరిగిన భుజాలూ కనిపించాయి.

"ఇతనే కాబోలు మావ" అనుకున్నాడు.

పొలాలు దాటి రోడ్డుమీదకి వచ్చేసరికి బెనర్జీ కారు కనిపించింది. వరదరాజుల్ని చూసి కారు ఆపాడు బెనర్జీ.

"ప్రొద్దుటనుంచీ ఎక్కడికి పోయారు సార్, అదేమిటి, నీరసంగా వున్నారు, బట్టలన్నీ నలిగిపోయాయే, ఎక్కడన్నా పడ్డారా, పదండి గార్డెన్‌కి వెళ్దాం"

మాట్లాడకుండా కారులోకి వచ్చి కూచున్నాడు వరదరాజులు.

"ఇక్కడి పొలాలూ, ఇక్కడి మనుషులూ అంతా సింపుల్ ముఖ్యంగా ఆడవాళ్ళు" అంటున్నాడు బెనర్జీ.

కారువేగంలో మిగతా మాటలు వినిపించకుండా పోయాయి.

మునుమాపు వేళకి విశ్వేశ్వరం యింటిముందుకు వచ్చి దిగ్భ్రాంతుడయి ఆగిపోయాడు వరదరాజులు.

లోపల్నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

తడిక తలుపు దగ్గరగా చేరవేసి వుంది. నేలమీద దుర్వాసన లేపుతున్న చిక్కటి బురదతో కలిసి పల్చబడ్డ రక్తం బొట్లు కనిపించాయి.

"పడుకో రూపీ, అల్లరి చెయ్యకు" అంటున్నాడు విశ్వేశ్వరం.

ఆ గొంతులో కర్కశత్వం, నిర్లక్ష్యం చూసి ఆశ్చర్యపోయాడు.

ముగ్గురు పిల్లలు అరుస్తూ పక్కనుంచి పరిగెత్తిపోయారు.

తెల్లటి బట్టలమీద బురద చుక్కలు చుక్కలుగా పడింది. కాళ్ళు చల్లదనానికి జివ్వుమంటున్నాయి. దీపాలు అక్కడక్కడ వెలిగాయి. లోపల కూడా చిన్న దీపపు వెలుగు కనిపిస్తోంది.

తడిక తలుపు తట్టేసరికి లోపల శబ్దం ఆగిపోయింది. మరికాస్సేపటికి తలుపు తెరుచుకుని విశ్వేశ్వరం బయటకు వచ్చాడు.

"ఎవరూ?"

తొడలవరకూ సరిగారాని పల్చటిలాగూ, బాగా మాసికలు పడ్డ బనీనూ వేసుకున్నాడు. నల్లగా దళసరయి, మొద్దుబారిన గెడ్డం మధ్య ఎక్కడో లోతుల్లో విశ్వేశ్వరం కనిపిస్తున్నాడు. అంత చీకట్లోనూ అతని కళ్ళల్లోని ఎరుపు చూసి వణికాడు వరదరాజులు. ఇంకా అప్పటి విశ్వేశ్వరం మాటలు మనస్సులో వుండనే వున్నాయి.

"నాతో మాట్లాడకు. నాతో మాట్లాడకు."

ఇప్పుడిక కదిలాడు వరదరాజులు.

"నీతో మాట్లాడడానికి వచ్చాను. నా పేరు వరదరాజులు"

కాస్సేపటివరకూఏమీ మాట్లాడలేదు విశ్వేశ్వరం. ఏదో ఆలోచిస్తున్నాడనుకున్నాడు వరద, ఉన్నట్టుండి అన్నాడు.

"ఎందుకొచ్చావిక్కడికి. వెళ్ళిపో. వెంటనే వెళ్ళిపో"

"ఇదివరకటి ఆశ్చర్యం ఇది. యిదెంతో కాదు" - అన్నాడు వరద.

"నేను వెళ్ళను. నీతో మాట్లాడాలి. పశువులు ఎలా బ్రతుకుతాయో చూస్తానివాళ."

"చూస్తే బాధపడతావు. తర్వాత నీ యిష్టం"

"లోపలికి పద" అని ముందుకొచ్చాడు వరద.

"నామాట వినలేదు నువ్వు. ఇక నీ యిష్టం" తలుపు బార్లా తెరిచాడు విశ్వేశ్వరం. లోపల గదిమధ్యకి వచ్చి నిలబడ్డాడు వరద.

"చిన్న కొవ్వొత్తి మాత్రం వెలుగుతోంది. కుడిపక్కగా లోతుకి భూమిని తాకుతూ ఓ మంచం వుంది. నల్లటి దుప్పటి కింద ఆ కాస్తపాటి చీకటిలో ఏదో కదిలినట్లయి తుళ్ళిపడ్డాడు వరదరాజులు.

అతని విస్మయాన్ని చూసి నవ్వాడు విశ్వేశ్వరం.

"నన్ను పిచ్చి ఆస్పత్రిలో మాత్రం చేర్పించకు" అన్నాడు.

మంచం మీంచి చిన్న మూలుగు వినిపించేసరికి నరాలన్నీ జివ్వుమన్నాయి. మళ్ళీ విశ్వేశ్వరమే అన్నాడు. `నా కుక్క అది. పేరు రూసీ. ఇవాళ ఎవరినో కరిచిందట. చావబాదారు. సాయంకాలం వచ్చేసరికి విరిగిన కాలుతో తడిక దగ్గర పడుకొంది. కట్టుకట్టించి పడుకోబెట్టాను` నవ్వాడు.

వరదకి నవ్వు రావడంలేదు. కూర్చోవాలనిపించింది.

"ఏం చెయ్యను? మనుషులందరికీ నా మీద నమ్మకం పోయింది. ఓ విధంగా నేనే పోగొట్టుకున్నాను. ఇది మాత్రం నన్ను నమ్ముకుంది. ఇప్పట్లో ఇదొక్కటే నా నేస్తం"

వరద తడబాటు గమనించి "కూర్చుంటావా? కుర్చీలేవీలేవు నాకు. నా కోటు వేస్తానుండు. " దళసరి కోటు చెమ్మ నేలమీద పరిచాడు. గత్యంతరంలేక అక్కడ కూచున్నాడు వరదరాజులు.

సరయిన గాలిలేక ముక్కువాసన గదంత్తా వ్యాపించింది. కొవ్వొత్తి ఉన్న ఓ గజం మేర తప్పిస్తే అంతటా చీకటి.

ఎడమవేపు నల్లటి ఓ పెద్ద డ్రాయింగు బల్ల, రెండు మూడు పల్చటి కాగితాలు, పెన్సిళ్ళూ వున్నాయి. ఓ మూల చిన్న కుంపటి మీద నీళ్ళు మరుగుతున్నాయి.

వరదరాజులకి ఆశ్చర్యం లేదు ఆతృత లేదు విచారం లేదు, నిశ్చలంగా ఆలోచన లేకుండా కూర్చుండిపోయాడు.

ఎన్నో ప్రశ్నలు అడగాలనే వచ్చాడు, ఏమీ అడగలేకపోతున్నాడు.

"ఏం చేద్దామని వచ్చావిక్కడికి?" ఎంతోసేపటికి అన్నాడు.

"ఏమో తెలీదు"

"మొదట్నుంచీ యిక్కడే వున్నావా?"

"ఊఁ"

"ఇక్కడ సుఖంగా వుందా నీకు?"

"ఊఁ"

"ఇక్కడ సుఖంగా వుందా నీకు?"

"సుఖం అంటే ఏమిటో తెలీదు. అన్నిటినీ మరిచి పోగలగడం నేర్చుకున్నాను. అంతే"

"ఈ కాగితాలేవిటి?"

"నువ్వు చెప్పిన ఆలోచనే!"

"అంటే?"

"చిత్రాలు వ్రాస్తున్నాను"

"ఎన్ని వ్రాశావిప్పటికి?"

"చాలా వ్రాసి వుంటాను. గుర్తులేదు"

"అవన్నీ ఎక్కడున్నాయి. ఓసారి చూడనీ నన్ను"

"అక్కడ" చీకటిలో ఎర్రగా కనిపిస్తున్న నిప్పుకేసి చూపించాడు.

"అదేమిటి?"

"ఎప్పటికప్పుడు కాలిపోయాయి."

"నీకు నిజంగా పిచ్చెక్కింది" ఓర్పు నశించి అరిచాడు వరద.

"అంతకంటే మానేస్తే యేం?"

"ఏదైనా చిత్రం వుంటే చూపెట్టు పోనీ"

తల అడ్డంగా తిప్పాడు. "ఉహూఁ ఎవరికీ చూపను వాటిని"

"ఇన్ని విన్నాక నిన్నెవడూ మనిషి అనుకోడు" ఉదాసీనంగా అన్నాడు వరదరాజులు మంచానికి ఆనుకుని. ఓపికలేని మంచం కిర్రుమని కదిలి నేలని కరచుకుంది.

"అందుకనే మనుషులకి దూరంగా వచ్చేశాను. నన్ను మనిషి అనడం మంచిది కాదు. "

యింకా ఒకటి రెండు ప్రశ్నలు మిగిలిపోయాయి.

"నీలవేణి గుర్తుందా?"

"గుర్తులేదు"

**కోపం కట్టు తెగింది**. అతి ప్రయత్నంతో ఉత్తేజాన్ని ఆపుకున్నాడు వరద. "ఎందుకు ఆమెను నా దగ్గిర వదిలిపోయావో చెప్పుపోనీ. అసలు ఆమె ఎవరు? నీ దగ్గరికి ఎలా వచ్చింది? యిదంతా.."

"నన్నేమీ అడక్కు వరదరాజులూ! నీలవేణి ఎవరో నేనే ఓ రోజు వచ్చి చెప్తాను. అంతవరకూ నన్నేమీ అడక్కు. నీ దగ్గిర ఎందుకు వదిలేశానో తెలీదు నాకు. ఆ రోజు నువ్వన్న దగ్గర్నుంచీ చిత్రాల మీదికి దృష్టి మళ్ళింది. తెలిసో, తెలియకో చాలా విషయాల నుంచి మళ్ళింపు చూపావు నాకు. నన్ను నువ్వు నమ్మకపోయినా, నీమీద నాకు చాలా నమ్మకం. అందుకనే నీలవేణిని నీ దగ్గర వదిలి మరిచిపోయాను. ఇంక వెళ్ళిపో" అని లేచాడు.

వరదరాజులకి యిక కూచోవడం అసాధ్యమనిపించింది. కొవ్వొత్తి మరి అయిదారుక్షణాలు మాత్రం వెలిగేట్టుంది.

"ఎప్పుడన్నా అటు వస్తావా?"

"ఎక్కడికి?"

"ఇంటికి"

"నాకు యిల్లులేదు బంధువుల్లేరు దయచేసి ఎప్పుడూ యిటువేపు రాకు. ఎవరికీ నా విషయం చెప్పకు. నన్ను మరిచిపో. వెళ్ళిక."

మాట్లాడడానికి కూడా చోటివ్వకుండా అన్నాడు విశ్వేశ్వరం.

కుక్కలేచి గొంతెత్తి ఏడవడం ప్రారంభించింది.

"నీకు తోడు యిదెందుకూ?"

"బ్రతకడం ఎలాగో అది నేర్పింది. 'చేతనయిందా తెచ్చుకు తిను. లేదా ఎవడి దగ్గరన్నా తన్ని లాక్కో' ఇదీ నాకు నేర్పిన పాఠం. ఓ రోజు రొట్టె తింటున్న నా దగ్గరికి వచ్చి నిలబడింది. రొట్టెకోసం నా కాలు నాకింది. పొమ్మని కసిరాను. చూసి చూసి నా కాలు కరిచి రొట్టె కరుచుకు పారిపోయింది. అప్పట్నుంచీ అదంటే నాకు ప్రాణం."

వింత వింత అనుభూతుల్తో బయటికి వచ్చేశాడు వరదరాజులు.

చీకట్లో బురద సాగుతోంది.

"రోడ్డు చివరివరకూ వస్తానుండు. లేకపోతే ఎక్కడో కాలుజారిపడతావు" అన్నాడు విశ్వేశ్వరం.

దారి పొడుగునా యిద్దరు మాట్లాడకుండానే నడిచారు.

"టీ యివ్వడానికి కూడా డబ్బులేదు నాకు. ఇంక వెళ్ళు" వీధి చివరి వరకూ వచ్చి వెంటనే వెనక్కి తిరిగిపోయాడు విశ్వేశ్వరం.

తడిక తోసుకుని లోపలికి వెళ్ళేవరకూ పాత స్నేహితుణ్ణి చూస్తూ నిలబడ్డాడు వరద.

టీ దుకాణం దగ్గర మనుషులు పోగయి కబుర్లు చెప్పమంటున్నారు.

కుంటిపిల్ల గ్లాసులు కడుగుతోంది.

నల్లటి బళ్ళమధ్య చిన్న ఎలక్ట్రిక్ దీపం నరకానికి తోవ చూసే భటునిలా వుంది.

నల్లటి ఆకాశం భయపెట్తోంది.

బరువెక్కిన మనస్సు వీడిన నిట్టూర్పులాగ, కార్చిచ్చు మంటలో కాలిన వాంఛలాగ, విశ్వాన్ని కడుపులో దాచుకు రోదించే మృత్యువు నోటి లోతులా వుంది ఆకాశం.

తొందరగా నడక సాగించాడు వరదరాజులు.

విశ్వేశ్వరాన్ని గురించి విచారించడం తెలివితక్కువ తనం. ఎందుకంటే తన గురించి తను విచారించని వ్యక్తి అతను.

అతనిలో ఎంత సత్తా వుందో ఎవరికీ తెలీదు. కానీ ఒక్కటి మాత్రం నమ్మకం వరదకి. ఈ ప్రపంచానికి దూరంగా విశ్వేశ్వరాన్ని పారేసి అతని పని అతన్ని చేసుకోనిస్తే మరి పదేళ్ళకి ఏ రెంబ్రాంటో, మిల్లెటో, వాంగో, గాగినో మిగుల్తారు.

ఏ విధంగానూ ప్రపంచంతో సంబంధంలేని విశ్వేశ్వరం గురించి ఆలోచిస్తూ రాయి తన్నుకుని పడ్డాడు వరదరాజులు. బొటనవేలు చితికి రక్తం కారింది. కళ్ళనీళ్ళు తిరిగాయి.

ఈసారి జాగ్రత్తగా నడుస్తు అనుకున్నాడు. "ప్రపంచాన్ని మరిచిపోయిన మనిషి'

ప్రయాణపు బడలిక కంటే, విశ్వేశ్వరం కలిగించిన నిరుత్సాహం మరింత దిగజార్చడం వల్ల యింటికి వస్తూనే రోజంతా విశ్రాంతి తీసుకున్నాడు. నిద్రపోవడంతో మనస్సు చాలావరకూ తేలికయినట్టనిపించింది.

సాయంకాలమయింది. గన్నేరు చెట్ల నీడ బార్లాసాగి యింటిమీదకు పాకింది. శరత్తు ఛాయలు అప్పుడే పొడసూపుతున్నాయి. పువ్వులు కొత్త తెల్లదనాన్ని పూసుకు విచ్చుకుంటున్నాయి. ఆకులు మరీ పచ్చబడి కొత్తగా ఉన్నాయి.

దసరా దగ్గర పడుతోందని అనంతపద్మనాభస్వామి ఆలయానికి సున్నం వేస్తున్నారు.

రోజంతటిలో ఒకటి రెండుసార్లు మాత్రం నీలవేణి కనిపించింది.

"మొన్న సాయంకాలం గోవర్ధనరావుగారు వచ్చారన్నయ్యా! గూడూరు వెళ్తున్నట్లు ఆయనకు చెప్పలేదా నువ్వు?" అంది గులాబి.

"ఏమిటి విషయం?"

"ఊరికినే బజారు నించి వచ్చారు. వస్తే రమ్మను అన్నారు. కాస్త నీరసించినట్టున్నారు. వినత కోసం బెంగపెట్టుకున్నారేమో మరి?"

"రామ్మూర్తిగారు వస్తున్నారా?"

నీలవేణి నీళ్ళు పోసుకుంటున్న చప్పుడు వినిపిస్తోంది.

"వస్తున్నారన్నయ్యా ఎప్పుడూ ఆ చెట్టు నీడలోనే పడుకుంటారు. మంచినీళ్ళుకూడా అడగరు. తెలతెలవారుతూండగానే లేచి వెళ్ళిపోతారు. ఉండు. మొక్కలకి నీళ్ళు పోయాలి" లోపలికి పోయింది గులాబి.

మనస్సంతా గజిబిజిగా వుంది. వొళ్ళంతా నొప్పి జ్వరం వచ్చినట్లుంది. కానీ యిలా యింటిలో పడుకుంటే మరీ ఎక్కువ అయ్యేటట్టుంది. గోవర్ధనరావుగారింటికని లాల్చీ వేసుకు బయల్దేరాడు.

గేటుదాటి లోపలికి వచ్చి యింటి ముందు ఆగివున్న నీలిరంగుకారుని చూసి ఆశ్చర్యపోయాడు వరద.

మేడమీద కుడి చివర నిలబడి ఆరోగ్యం పిలుస్తోంది. "ఇటువేపు రావోయ్.. వరదరాజులూ మేడమీదికి"

ఎడమభాగంలో గొడవ గొడవగా వుంది. పిల్లల కేకలూ, రెండు కుక్కల అరుపులూ, రేడియో పాటలూ అంతా గందరగోళంగా వుంది.వరదరాజులు ఆశ్చర్యపోవడం చూసి ఆరోగ్యం నవ్వుతోంది.

"ఇంత యిల్లు మా యిద్దరికీ అనవసరమని ఓ భాగం అద్దెకిచ్చేశారోయ్! మొన్ననే వచ్చారు వాళ్ళు. ఇన్‌కంటాక్సు ఆఫీసరు. అంతా హడావుడిగా పెళ్ళివారిల్లులాగా వుంది కదూ?"

ఏమీ మాట్టాడలేదు. మడత కుర్చీ దగ్గరికి లాక్కుని కూచున్నాడు. పుస్తకాల దొంతరలూ, పటాలూ అన్నీ ఓ మూల కుప్పగా పడేసి వున్నాయి.

"ఎక్కడికి వెళ్ళావ్? ఊళ్ళో లేవన్నారాయన?"

గూడూరు వెళ్ళాను"

"ఎందుకేవిటి?"

"విశ్వేశ్వరం అక్కడున్నాడని ఎవరో రాశారు. ఇదిగో ఉత్తరం"

తీసుకు చదివింది -

"వెళ్ళి చూసి వచ్చాను"

"ఏమన్నారాయన?"

"ఏమంటాడు? నీలవేణి నా దగ్గరున్న విషయమే మరచిపోయాడు. గనుల్లో పనిచేస్తూ, బొమ్మలు రాసుకుని కాలుస్తున్నాడు ఎప్పటికప్పుడు. తోడుగా ఓ కుక్కని పెంచుకున్నాడు."

విచిత్రంగా చూసింది ఆరోగ్యం. సన్నటి కనుబొమ్మలు మీదకి లేచి కళ్ళు విశాలత్వాన్ని పెంచాయి.

"అదేమిటి?" అంది.

"నాకా విషయాలన్నీ జ్ఞాపకం చెయ్యవద్దన్నాడు. వెళ్ళిపొమ్మని తరిమేశాడు."

నీలిరంగు కారు పెద్ద శబ్దం చేసుకుంటూ గేటు దాటి పోయింది.

ఇన్‌కంటాక్స్ ఆఫీసరుగారి పెద్ద ముఖం, నీలిరంగు అద్దాల్లోంచి విచిత్రంగా కనిపించింది.

"అయితే ఏం చేసుకొచ్చావ్?"

"వాళ్ళెంత నీచంగా బ్రతుకుతున్నారో చూసి వచ్చాను. చివరిసారిగా వాడి మందకొండితనాన్ని చూసి వచ్చాను. అలాంటి వాళ్ళ గురించి ఆలోచిస్తే మనస్సు పాడవడం, కాలం వ్యర్థమవడం తప్పిస్తే యింకేమీ మిగలదు."

గాలికి ఎగిరిపోయిన టేబులు క్లాతుని లేచి సరిచేస్తోంది. గాలి వేసినప్పుడల్లా అటూ యిటూ ఊగే కథాకళి నర్తకి బొమ్మ విరిగింది. ఇప్పుడు ఇదివరకు లాగా ఊగడంలేదు.

టేబులుకి చేరబడి నిలబడి కిటికీ బొమ్మని సరిచేస్తూ, "నీ మంచితనాన్ని చూసి ఎవరయినా అలాగే చేస్తారోయ్! నువ్వు తప్పు పనిచేశావ్. అలాంటి మనిషి పీక నులిమి చంపి వెయ్యకుండా ఎందుకు తిరిగివచ్చావ్? ఉన్నా లాభం లేని మనుషులు ప్రపంచానికి అనవసరం. కాఫీ చేస్తానుండు" అని లోపలికి వెళ్ళింది.

ఏదో ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు వరదరాజులు.

మరో ఐదు నిమిషాల్లో పెద్ద సంచి మోసుకుని గోవర్ధనరావుగారు వచ్చారు. వరదని చూసి "మంచి చీర కొనడానికి బజారంతా తిరిగి వస్తున్నానోయ్, నువ్వూ వుంటే వినతకి ఏ రంగు యిష్టమో ఎంచి పెట్టేవాడిని. దసరాకి ప్రెజెంటు. ఎప్పుడు వచ్చావు ఊరునుంచి?"

"ప్రొద్దుటే వచ్చాను. మీరు వచ్చారని గులాబి అంది."

"నేను రావడానికేంలే. ఉద్యోగం, సద్యోగం లేనివాణ్ణి. మొన్న కాశీ ఉత్తరం వ్రాశాడు. దసరాకి పని ప్రారంభిస్తాడట. చాలావరకూ పని జరిగిందట. నిన్ను మరీ మరీ అడిగానని చెప్పమన్నాడు"

"నీలవేణిని పెంచుకుంటారేమో అడగవోయ్. భూతదయ గురించీ, సంఘసేవ గురించీ యీ పాటికి వంద ఉపన్యాసాలిచ్చారు" అంటూ కాఫీ తెచ్చింది ఆరోగ్యం.

"చెప్పడానికేగాని, చెయ్యడానికి కాదు. ఉపన్యాసాల ఉపయోగం. అదీ నేర్చుకోవలసిన మొదటిపాఠం. ఇకపోతే, భూతదయతో, సంఘసేవికని మొదట నిన్ను తెచ్చుకుని సుఖపడ్డాను. యిక నీలవేణికి పెళ్ళి పేరు సంపాయించడం మిగిలిపోయింది" ఆరోగ్యానికి నిజంగా కోపం వచ్చింది.

తల్లి ఒడిలో మొదటిసారిగా తలెత్తిన శిశువు కళ్ళల్లో వింతలా కనిపిస్తోంది ప్రకృతి.

ప్రవాసంలో మ్రగ్గిన ఖైదీకి దక్కిన చివరి స్వేచ్ఛను అనుభవిస్తున్నట్టు నీలి ఆకాశానికి సున్నాలు చుట్టుతూ ఎగురుతున్నాయి పక్షులు.

బంతిపువ్వులు బంగారంలా మెరుస్తున్నాయి.

అందంతో ఆగి, గర్వంతో ఠీవిగా తలెత్తిన స్త్రీ వయ్యారాన్ని జ్ఞాపకం చేస్తోంది గన్నేరు చెట్టు.

పువ్వుల గుండెలోని ఎరుపుదనం మరీ చిక్కబడి తెల్లటి బొట్టుమీద బొట్లు దిద్దినట్లున్నాయి.

కొమ్మని పట్టుకు వ్రేలాడబోయి, సోమరిగాలి తెరలకి వూగి అమాయకంగా రాలిపోతున్నాయి పువ్వులు.

ఓ రోజు వరదరాజులు లేచి బయటికి వచ్చేసరికి గన్నేరు చెట్టుకు ఆనుకుని నిలబడ్డ రామ్మూర్తీ, గట్టుమీద ముడుచుక్కూచున్న రవణా కనిపించారు.

మరీ తెల్లటి బట్టలు వేసుకున్నాడు రామ్మూర్తి. వాటి కొత్తదనం ఉదయపు వెలుగులో మరీ స్పష్టంగా తెలుస్తోంది. ఇదివరకటి కంటే కాస్త తెల్లబడి, శుభ్రంగా వున్నాడు. ఉద్యోగపు అలసట ముఖంలో యింకా కనిపిస్తూనే ఉంది. ఇది లేకపోతే రామ్మూర్తి ఏమవుతాడో ఎవరికీ తెలీదు.

రవణ చేతిలో క్రితం రోజు వాడిపోయిన పువ్వు మిగిలింది.

"ఏమండీ రామ్మూర్తిగారూ?"

రామ్మూర్తి మెట్లవరకూ వచ్చి ఆగిపోయాడు. "వంట్లో బాగుండడం లేదండి. మందు పుచ్చుకుంటున్నాను. రెండురోజులు సెలవు కావాలి. ఎల్లుండి పనిలోకి వచ్చేస్తాను"

చాలా రోజుల తరువాత అతన్ని జాగ్రత్తగా చూశాడు వరద. ఏరోజూ రాత్రి నిద్రలేకపోవడం అతన్ని మరీ నీరసం జేసింది. నైట్ డ్యూటీ అంటే సామాన్యం కాదు. అయినా యింతవరకూ ఒక్కసారన్నా ఫిర్యాదు చేయలేదు రామ్మూర్తి.

"సెలవు చీటీ రాసివ్వండి. నేనిస్తాను ఆఫీసులో"

కోటు జేబులోంచి తీసి అందించి వెళ్ళిపోయాడు రామ్మూర్తి.

వరద వెనుకనే గదిలోకి వచ్చి మంచానికి చేరబడి నిలబడ్డాడు రవణ. కృష్ణుడు పటానికి బంతిపూదండ వేస్తున్న గులాబిని చూసి "ఏవమ్మా! బాగున్నావా?" అన్నాడు.

తలూపింది గులాబి.

"సుజీ ఎలావుంది?" అడిగాడు వరద.

"బాగుంది"

స్నానం చేసి వొంటినిండా లుంగ చుట్టుకున్న చీరతో నీలవేణి వాకిట్లోకి వచ్చి గదిలో యిద్దర్నీ చూసి సిగ్గుపడి నడవలోకి పోయింది.

"విశ్వేశ్వరం దగ్గరికి వెళ్ళాను" అని ప్రారంభించబోయి అంతటా అదంతా రవణమూర్తికి చెప్పడం అనవసరమని ఆగిపోయి "ఏమిటి విశేషం?" అన్నాడు.

చాలాసేపటికి ప్రారంభించాడు రవణ. "డబ్బు కావాలి. నువ్వు యివ్వనక్కర్లేదు. ఎక్కడయినా ఉద్యోగం చూసి పెట్టు బాబు చాలు"

"పాత ఉద్యోగం?"

"సరిగ్గా పనిచేయటం లేదని తీసేశారు. సెలవు ఎక్కువ వాడుకున్నాను."

"ఈ రోజుల్లో ఉద్యోగం చూసి పెట్టటం కంటే డబ్బు యివ్వడమే సులభం. అయినా యింత తొందర్లో ఎక్కడ ఉద్యోగాలు దొరుకుతాయి?"

నడవలో కనకాంబరం రంగుచీర అంచు కనిపించింది. తడిచీర పట్టుకుని వాకిట్లోకి వచ్చింది నీలవేణి.

"ఇందాక వచ్చినాయనకు ఉద్యోగం ఇచ్చేసరికి తల(ప్రాణం తోకకు వచ్చింది. బలరాందాసు సంగతి తెలుసుగా! మరి నాలుగు నెలల వరకూ ఏ అవకాశం ఉండదు. నీకివ్వాలంటే అతన్ని తీసెయ్యాలి"

"అలా అయితే వద్దునాకు" అన్నాడు రవణ.

లేచి గుమ్మం దాటాడు రవణమూర్తి మరోమాటలేకుండా.

"సుజీకి యీ పువ్వులివ్వండి" అంది గులాబి బంతిపువ్వుల్ని కాగితంలో చుట్టియిస్తూ.

"ప్రయిత్నిస్తాను ఎక్కడన్నా.. రేపు కనిపించు"

తలూపి ముందుకు అడుగువేయబోయేసరికి కొబ్బరిచెట్టు మట్ట రాలింది. అడుగుపడితే తల పగిలేది.

తుళ్ళిపడి ఆగిపోయాడు. నీలవేణి నుదుటికి రేకు తగిలి చీరుకుని రక్తం చిమ్మింది. ఒక్క క్షణం ఆగి వెళ్ళిపోయాడు రవణ.

తడిగుడ్డతో నుదిటిని అదిమిపట్టి వాకిట్లోకి వచ్చి నీడలో నిలబడింది నీలవేణి.

అద్దంలో సగం మొహాన్ని చూసుకుంటూ గడ్డం చేసుకుందుకు కూచున్నాడు వరదరాజులు.

"ఆయన ఎక్కడ ఉంటున్నారు" అంది వాకిటవేపు చూస్తూనే.

"ఎవరు?"

"...."

"రవణా?"

తలూపింది.

"కేథలిక్ చర్చి ప్రక్కన. ఉద్యోగం కావాలిట..." ఇంకేదో అనబోయేంతలో పాలమనిషి గేటు తెరుచుకుని లోపలికి వచ్చింది.

ఎప్పుడూ చూడని వ్యక్తి ముంగిటకు వచ్చేసరికి విస్తుపోయింది సుజాత.

మొహానికి సగం సగం రాసుకున్న పౌడర్ని తొందరగా చెరుపుకుని ముందుకు వచ్చింది. ఆ తొందరలో బొట్టు చెరిగి నుదురంతా అలుముకుంది.

"మీరేనా 'సుజీ' అంటే?"

"అవునండి"

"ఇక్కడ కూర్చునేదా?"

చాప పరిచి శుభ్రం చేసింది సుజాత.

"ఎలావుంది మీ వంట్లో?"

"కులాసాగానే. మీరు."

"నా పేరు నీలవేణి. వరదరాజులు గారింట్లో వుంటున్నాను"

ఉదయం గులాబీ పంపిన బంతిపువ్వులింకా సిగలోనే ఉన్నాయి. ఇంకా సుజాత సంశయం తీరనట్టు గమనించి, నవ్వుకుని "వారు నాకేమీ కారు" అంది నీలవేణి.

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు.

మట్టిరంగు చీర కట్టుకుని, వదులుగా చుట్టిన ముడిలో పువ్వులు పెట్టుకుంది నీలవేణి.

బరువుగా ఒడ్డుకు తగిలే పడవ ఊగుదల జ్ఞాపకం చేస్తున్న శరీరం. అంచుల్లేని లోతుల్లో మెరుస్తున్న కళ్ళూ, నల్లరేకు మీద గీసిన పల్చటి ఛాయాచిత్రంలాగ కనిపిస్తున్న నీలవేణిని నిర్ఘాంతపోయి చూస్తూ కూచుంది.

ఆమె విస్మయాన్ని చూసి సిగ్గుపడింది నీలవేణి. ఏదో మాట్లాడే ఉద్దేశంతో "ఇంకెవరూ లేరా యింట్లో?" అంది.

తలూపింది సుజీ.

"మీ వదినగారిని చూసిపోదామని వచ్చాను"

మరీ తెల్లబోయింది సుజాత. "మాకెవ్వరూ లేరండి. అన్నయ్యా నేనూ"

"మీ అన్నయ్యకింకా పెళ్ళికాలేదూ?"

"మా యింట్లో ఎవరికీ పెళ్ళి జరిగదండి. మీకు తెలీదు" పేలవంగా నవ్వింది సుజీ. ఆ నవ్వు వెనక ఛాయ కనిపించటంలో నివ్వెరపోయినా మరింకేమీ అడగలేదు నీలవేణి.

ఒక్క మంచం, దానిమీద కుప్పగా పడేసిన బట్టలూ, ఓ మూల దేవుడి పటాలూ, సీతారామమ్మగారి రుద్రాక్షలూ, భగవద్గీత బైండూ, మరోపక్క బట్టలదండెం, సుజాత చీరలూ, ఓ పౌడరు డబ్బా, మందుల సీసాలూ.. అన్నీ అక్కడే వుండటం చూసి దిమ్మెరపోయింది నీలవేణి. "ఇదొక్కటేనా గది?"

"అంతేనండి. పక్కనే పెరడు, నుయ్యీ, మొక్కలూ వున్నాయి. చూస్తారా?"

"పదండి."

ఆదరాబాదరాగా తువాల్తో ముఖం తుడుచుకుని కుంకంతో బొట్టుదిద్దుకుని కుడివేపు తలుపు తెరిచింది సుజాత. చిన్న పెరడు, సగం నుయ్యీ, సన్నజాజుల పందిరి కనిపించాయి. పువ్వుల వాసన గుప్పుమంది.

అక్కడ వెలుగు తక్కువ కావడంతో పూర్తిగా చీకటి పడకుండానే కీచురాళ్ళ అరుపులు ప్రారంభించాయి.

ఓ మూల ఎర్రటి గులాబీ కనిపించింది. ఒకే ఒక్క పువ్వు చెట్టంతటినీ వంచింది. కోసి నీలవేణికి అందించింది సుజాత. నల్లటి ముఖాన్ని ఆ ఎరుపుదనం వెలిగించింది. సూర్యోదయ సమయంలో నల్లటి మబ్బు తునకలాగా కనిపించింది నీలవేణి ముఖం.

"సుజీ!" అన్న పిలుపు వినిపించింది గదిలోంచి.

"అన్నయ్య వచ్చాడు"

నీలవేణి కాస్త సిగ్గుపడింది. చెప్పీచెయ్యకుండా వచ్చిన తన రాకకి ఏమనుకుంటాడోనన్న ఆలోచన మొదటిసారిగా కలగడంతో కుంచుకుపోయింది. చీరకొంగు నడుం చుట్టూ తిప్పి భుజం మీంచి కప్పుకుంది.

"మీరిక్కడే ఉండండి. ఓ తమాషా చేస్తాను" అని పెరటి గుమ్మానికి అడ్డంగా వచ్చి నిల్చుంది సుజాత.

"డబ్బు దొరకలేదు సుజీ. రేపట్నుంచీ డాక్టరు మందివ్వరు" అంటున్నాడు రవణ.

"నీకోసం ఒకరొచ్చారు. చెప్పుకో చూద్దాం"

"ఎవరు? వరదా?"

"కాదు"

"గోవర్ధనరావుగారా?"

"ఊహూఁ"

"మరి?"

"వరదరాజులు యింటినుంచే. ఈసారి చెప్పుమరి?"

"గులాబి వచ్చిందా?"

"కాదు. నీలవేణి"

నిర్ఘాంతపోయాడు.

"నీలవేణి. నీల.."

ద్వారం దగ్గరకు వచ్చి నమస్కారం చేసింది నీలవేణి.

రవణ మాట్లాడలేకపోయాడు. "కూచోండి" అని మాత్రం అన్నాడు.

ముగ్గురు నిలబడడానికి సరిగా చోటులేని ఆ గది విడిచి బయటికి వచ్చి నిలబడ్డాడు.

"వదినెను చూడడానికి వచ్చారన్నయ్యా యీవిడ"

మరీ విస్మితుడయి గుమ్మానికి ఆనుకున్నాడు రవణ. విచిత్రంగా నీలవేణి ముఖం చూసాడు. సిగ్గుపడి తలదాచుకుంది నీలవేణి.

మంచం మీద కూలబడి పకపక నవ్వుతోంది సుజాత.

"మీ పెళ్ళయి వుంటుందనుకున్నాను" అంది నీలవేణి తలవొంచుకునే.

రవణ ఏమీ జవాబు చెప్పలేదు. సగం విరిగిన బెంచీ తీసుకుని బయట వేసుక్కూచున్నాడు.

"అన్నయ్యకి ఆడవాళ్ళని చూస్తే సిగ్గు. నాతోనే మాట్లాడండి" అని ఆమెకి ఎదురుగ్గా కూచుంది సుజాత.

నీలవేణికి నవ్వొచ్చింది.

రవణ ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"డబ్బు గురించేనా?" అంది నీలవేణి.

"నాకు మందు లేకపోతే ఏం చెప్పండి? ఆరోగ్యంగా ఉన్నానంటే వినడు. ఇప్పటికే వందలు ఖర్చయిపోయాయి. కాఫీ చేస్తానుండండి" అని లేచింది.

అక్కర్లేదంటూ లేచింది నీలవేణి.

❦❦❦

**వెళ్ళిపోతూ** అతను కూచున్న బల్ల దగ్గర కాగితం మడతని ఉంచుతూ "ఆయన మీకు వీటిని యిచ్చిరమ్మన్నారు" అని వెళ్ళిపోయింది.

మలుపు తిరిగేవరకూ ఆమెని విచిత్రంగా చూస్తూ నిలబడింది సుజాత.

కాగితం విప్పి చూస్తే రెండు పదిరూపాయల నోట్లు కనిపించేసరికి ఇద్దరూ తెల్లబోయారు.

"నీలవేణి ఎవరన్నయ్యా?"

"ఏమో నాకు తెలీదు" అన్నాడు రవణ చర్చిలోంచి ఎగిరిపోతున్న రెండు పాలపిట్టల్ని చూస్తూ.

రాత్రి గులాబి నిద్రపోయాక మగత నిద్రలో ఆలోచనల్తో పెనుగుతున్న వరదరాజులు దగ్గరికి వచ్చి నిలబడింది నీలవేణి.

"రవణమూర్తిగారింటికి వెళ్ళాను"

గన్నేరు చెట్టునీడ నీలవేణి సగం శరీరాన్ని కప్పింది. వెన్నెల చీర కట్టుకుని. మౌగ్ధత్వాన్ని తలలో తురుముకున్న అభిసారికలా కనిపించింది.

ఆమె మాట విని విస్మితుడయ్యాడు వరదరాజులు. ఏమీ మాట్లాడకుండా మంచం మీద లేచి కూచున్నాడు.

అలానే నిలబడ్డది నీలవేణి.

''డబ్బు అవసరం చాలావుంది ఆయనకి. యిరవై రూపాయలు ఇచ్చి వచ్చాను''

తెల్లబోయాడు ''నువ్విచ్చావా?''

''ఎప్పటినుంచో నా దగ్గర ఉండిపోయాయి. వాటి అవసరం నాకెప్పుడూ కనిపించలేదు''

ఆకు తెంపి పూర్తిగా నీడలోకి వచ్చింది నీలవేణి. వరద మాట్లాడుతాడనుకుంది. ఎంతకూ మాట్లాడకపోయేసరికి చిన్నబోయి మెల్లిగా అంది.

''అనుకోకుండా అబద్ధం చెప్పాను. మీరే యివ్వమన్నారన్నాను.''

మరీ ఆశ్చర్యపోయి చీకట్లోకి చూశాడు వరద ఆమె కళ్ళకోసం. ఆమె తలదించుకుని ఆకుని మడతపెట్టూ కనిపించింది.

''నువ్వేం మంచిపని చెయ్యలేదు నీలవేణి. వాడు తప్పుగా అర్థం చేసుకుంటాడు'' అన్నాడు మెల్లగా.

సర్వాంగాలూ కుంచుకుని ఒకదానికొకటి పొత్తు కుదరక ముద్దగా చేరాయి. గట్టుమీద కూర్చుండిపోయిందామె. తను చేసినపని తనకే వెగటుగా తోచింది ఆలోచించిన కొద్దీ. ఏమయినా అనుకోవచ్చు రవణమూర్తి. కాని క్షణికమయిన ఆలోచనతో, ఏదో మంచి పని చెయ్యాలనే ఉత్సాహంతో ఒంటరిగా వెళ్ళిపోయిందక్కడికి. ఇప్పుడిక వరద మాటలు విన్నాక ఎన్నో విషయాలు కళ్ళముందు కదిలి భయపెట్టాయి.

స్త్రీత్వపు పరిధుల్ని అతి సంకుచితత్వంతో గీసింది సంఘం. వాటి మధ్య నడిస్తే గౌరవిస్తుంది. దాటబోతే విచిత్రంగా చూస్తుంది. దాటితే అసహ్యించుకుంటుంది.

మాట్లాడకుండా కూచుంది.

''సరేలే. జరిగిందేదో జరిగిపోయింది. వెళ్ళు. నిద్రపో''

తప్పు చేసిన పసిపాపలాగా లేచి నిలబడి వాకిలి దాటింది. అంతలో ఆగి.

''ఆయనెందుకు పెళ్ళి చేసుకోలేదు?'' అంది.

నివ్వెరపోయాడు వరద.

జవాబు కోసం ఎదురుచూడడం గమనించి మెల్లగా అన్నాడు. ''వాళ్ళ కుటుంబంలో చాలామంది క్షయతో పోయారు. సుమారు అందరికీ అదే రోగం. అందుకని వాళ్ళింట్లో ఏ కార్యాలూ జరగవు.''

వెల్లకిలా పడుకుని కళ్ళు మూసుకున్నా వెలుగు తెలుస్తూనే వుంది. మంచం మరీ చల్లబడడం చూసి నడవలోకి ఈడ్చుకుందుకి లేవబోయి నీలవేణి యింకా స్తంభానికి చేరబడే నిలబడడం చూసి తెల్లబోయాడు.అప్పుడే చర్చి రెండు గంటలు మ్రోగించింది.

ఉదయాన్నే గన్నేరు చెట్టు నీడలో అమీనా కనిపించేసరికి భయపడ్డాడు వరదరాజులు. పాత విషయాలు ఎవరో కెలికినట్లు బయటికి వచ్చాయి. అప్పటి తన ఆవేశం అన్నీను.

వణుకుతూ లేచే రశ్మిలోంచి తూలిపోయిన ఒంటి కిరణంలా కనిపించింది అమీనా. తెల్లటి సెల్వార్, తెల్లటి కమీజు. తెల్లటి చున్నీ అంతా తెలుపు. స్వచ్ఛతకీ, మౌగ్ధత్వానికీ, మత్తుకీ చిహ్నంలాగ.

గన్నేరు చెట్టు కొమ్మ దగ్గరికి వచ్చి ఆగాడు. అప్పుడే లేచిన వెండి కిరణాలు ఆలయం గాలిగోపురానికి తగిలి పగిలాయి. ఒకే రణగొణ ధ్వనిలాగ గంటల చప్పుడూ, పిట్టల అరుపులూ, ఆడంగుల పాటలూ అన్నీ ఏకస్థమయ్యాయి.

"ఏం అమీనా?"

అమీనా మాట్లాడదు, మనస్సుని మాట్లాడిస్తుంది.

ఏదో చెప్పబోయి, చెప్పడం తెలీక స్థంభాన్ని రాస్తూ నిలబడింది.

నవ్వొచ్చింది వరదకి. లోపలికి వెళ్ళి డబ్బు తీసుకొచ్చాడు. ఇస్తూ "మీ నాన్నని రమ్మను. నిన్ను పంపితే ఎలా? మాట్లాడడమయినా తెలీదాయె నీకు? బాగా చదువుతున్నావా?"

తలూపింది.

"ఇంక వెళ్ళు. పెళ్ళి ఎప్పుడో నాకు కబురు చెయ్యమను" నవ్వాడు.

మరి తలెత్తలేదు అమీనా. వసారా దాటి మెల్లిగా బరువెక్కిన ఏటిపారుదలలాగ చూపుకి అందకుండా దాటిపోయింది. వరద ఆశ్చర్యపోతూ నిలబడ్డాడు. అంత అంత అందం బరువునీ, ఆ వయస్సునీ అమినా ఎట్లా మోయగలుగుతున్నదా అని.

తడి జుత్తుని తుడుచుకుంటూ గులాబి వాకిట్లోకి వచ్చి అన్నయ్య స్తబ్ధత చూసి విస్తుపోయింది.

"ఏమిటన్నయ్యా అలా చూస్తున్నావ్?"

తడబడ్డాడు వరద. దూరాన చేపలాగా వంపు తిరిగిన అమీనా జ్ఞాపకాన్ని వదిలి ముఖం కడుక్కునేందుకు లోపలికి వచ్చాడు.

"నిన్న రామ్మూర్తిగారు వచ్చారా?"

అవతలి యింటివేపు తిరిగి తల తుడుచుకుంటున్నదల్లా గులాబి ఆగిపోయింది. ఇటు తిరిగేసరికి ఎర్రబడిన కళ్ళల్లో ఎండపడితే జుత్తుతో మొహం కప్పుకుంది.

"రామ్మూర్తిగారు వచ్చారా నిన్న?"

ఓసారి అన్నయ్యవేపు చూసి నవ్వేసింది. వేడినీళ్ళ స్నానం చేసినప్పటి శరీరపు ఎరుపుదనం క్రమంగా చెక్కిళ్ళలోకి ప్రాకి కంఠం చుట్టూ మెలికలు తిరిగింది.

"వచ్చారన్నయ్యా. అలా నీరసంగా వుంటారేం ఆయన?"

"అదేమిటి?"

"నిన్న సాయంకాలం వీధిలోకి వస్తే గుమ్మానికి చేరబడి అలసట తీసుకుంటున్నారాయన. నన్ను చూసి తుళ్ళిపడి లేచి నమస్కారం చేశారు. నాకు భలే సిగ్గేసింది. నాకు నమస్కారం చెయ్యొద్దని చెప్పన్నయ్యా"

విచిత్రంగా చెల్లెల్ని చూశాడు వరద. ముఖంలోని ఏ భావమూ కనిపించకుండా వీపు నిండా జుత్తు పరుచుకుని అటు తిరిగి నిలబడ్డది గులాబి.

కొబ్బరి పువ్వు రాలి కిరీటం పెట్టినట్లు ఆమె జుత్తులో యిరుక్కొంది. మరి కాస్సేపటికి వెనక్కి తిరిగి యింకా అన్నయ్య తన వేపు విచిత్రంగా చూస్తూండడం గమనించి, "ఈ జుత్తు ఎంతకీ లొంగదు బాబూ! ఉండు. వస్తాను" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

దూరాన మెజిస్ట్రేటు గారి యింటి ముందు తల్లి పొదుగుని చేరడానికి తాడు గుంజుకుంటోంది దూడ.

గులాబి చెప్పిన మాటల్ని బట్టి రామ్మూర్తిని ఊహిస్తున్నాడు వరద.

చల్లటి నీళ్ళు ముఖాన్ని కొట్టుకుంటూ "ఈ ఆడవాళ్ళకి అందంతోనే సరిపెట్టి, మనస్సు మాత్రం లేకుండా చేస్తే బావుండేది" అనుకున్నాడు.

ఇప్పటికి గులాబికి సగం అర్థమయింది.

ముఖం తుడుచుకుంటూ లోపలికి రాబోతే గుమ్మం తలకి ఠక్కున తగిలి ప్రాణం పోయినట్టయింది. తలపట్టుకుని కూచుండిపోయాడు.

కాఫీ తెచ్చిన నీలవేణి ఫక్కున నవ్వేసి నవ్వు దాచుకోలేక వెళ్ళిపోయింది.

"నా కాఫీ నాకిచ్చేసి మరీ వెళ్ళు" అని వరద అంటే సిగ్గుపడి టేబులు మీద ఉంచబోయింది.

"అమీనా వచ్చిందివాళ"

బయట నుంచి జవాబు వస్తుందనుకున్నాడు. కానీ ఎంతకీ మాట వినిపించకపోయేసరికి కించపడ్డాడు.

కాఫీ చల్లబడి చేదుగా ఉంది.

"అప్పుడేదో ఆవేశంలో మాట యిస్తే యిచ్చాను. యిప్పుడు డబ్బు యివ్వడం మానేస్తే యేం?"

"...."

"పీతాంబరాన్నీ కాదు"

"...."

కాఫీలో యీగపడి కొట్టుకుంటోంది. "ఈ కాఫీ బాగోలేదు. తీసుకువెళ్ళు" అంటే గులాబి లోపలికి వచ్చింది.

"నీలవేణి ఏదీ?"

"కంట్లో నలుసు పడిందట. పెరటి దగ్గరికి వెళ్ళింది."

నిస్పృహచెందాడు వరద. ఓ పిచ్చుక గడ్డిపరకని కరుచుకు కిటికీలోంచి ఎగరబోయి సరిగా అతని వొళ్ళో గడ్డిపరకని పడేసింది.

లేచి వాకిట్లో కూర్చునేందుకు కుర్చీ లాక్కొబోతూంటే పీతాంబరం వచ్చాడు. "ఏమండోయ్ వరదరాజులుగారూ! గాంధీగారు మన ఊరు వస్తారట విన్నారా? ఊర్లో రోడ్లన్నిటికీ వన్నె తెస్తున్నారు. ప్రతీవాడి ముందూ చెయ్యి జాస్తారట ఆయన. ఓ పొడుంకాయ, ఓ ట్వీడ్ సూటూ యివ్వాలనుకుంటున్నాను కాఫీ టైమ్ దాటిపోయినట్లుందే. ఎ బిట్ లేట్ ఆ బజారు గర్ల్ తగువుపడేసరికి టైమైపోయినట్లుంది."

"బజారు గర్లేమిటి?"

"అదేనండీ. మా యింట్లో పనిచేసే కుర్రాడు యీ స్కాండల్ అంతా తెచ్చాడు. ఎవడో ఓ అమ్మాయిని రెండేళ్ళయి ఉంచుకున్నాట్ట. అన్ని వస్తువులూ కొనిపెట్టాడట. అసలు వస్తువులు కొంటేనే ఆడవాళ్ళు ప్రేమ రీడింగ్స్ పెంచుతారు. అదో పెద్ద రహస్యం. వీడేమో ఓ మంచిరోజు చూసుకుని దాన్ని వస్తువుల్తో పాటు ఎగరేసుకొచ్చాడు. వాడు ఒకటే గోల, 'నువ్వు పోతే పోయావ్. నా వస్తువులన్నా యిచ్చేయ్' అంటాడు. మా సర్వెంట్ ఆ అమ్మాయిని మెల్లిగా బుట్టలో వేసి ఆ వస్తువులన్నీ అమ్మేసి కిళ్ళీ షాపు పెట్టాడు. నిన్నరాత్రి నుంచి అక్కడో పెద్ద తగువువ్. నన్ను తీర్పు చెప్పమన్నారు."

నవ్వొచ్చింది వరదరాజులుకి.

"అయితే ఏం తీర్పు చెప్పారు?"

"మనమంతా ముక్కుకి సూటిగా పోతాం సార్. అసలు ఎక్కడ వస్తుందదంటే చిక్కు, అంతకు ముందు ఆ ఆడది ఎంత చెడ్డదయినా తన దగ్గరికి వచ్చేసరికి పతివ్రత అయిపోయిందనుకుంటాడు మొగాడు. మీరు ఆ అమ్మాయిని తెచ్చుకోలేదురా ఫూల్స్. అదే

మిమ్మల్ని తెచ్చుకున్నట్టు లెక్క. అంచేత ఆ కిళ్ళీకొట్టును ఆమె స్వాధీనం చేసి, ఆమె చెప్పినట్లు కుక్కల్లాపడి ఉండండి అన్నాను. కొన్నాళ్ళు ఆమెను ద్రౌపది పాత్ర నిర్వహించమన్నాను" అని పైపు వెలిగించాడు.

నవ్వాపుకోలేక లుంగ తిరిగిపోయాడు వరద.

"ఇలాంటివి మరి నాలుగు తీర్పులు చెపితే ఆడవాళ్ళంతా సత్యాగ్రహం చేసి మిమ్మల్ని ఊర్లోంచి తరిమేయగలరు జాగ్రత్త."

"ఆ జాగ్రత్తలు మనకి ముందే ఉన్నాయి సార్. అందుకని రేపే ఇక్కణ్ణుంచి మకాం ఎత్తేస్తున్నాం"

"ఎక్కడికి?"

"అదంతా వేరేవుంది లెండి. సాయంకాలం మీరు నాతో ఓ గంట గడపగలరా?"

"ఏమిటి విషయం?"

"అప్పుడు చెప్తాను. సరిగ్గా ఆరయేసరికి మీ ఆఫీసు దగ్గర టాక్సీతో తయారుగా ఉంటాను. గొప్పతనానికి టాక్సీ ప్రారంభం. కారు పరాకాష్ట. వస్తా. ఓ స్నేహితుడి యింట్లో మాంచి బ్రేక్‌ఫాస్టు వుంది" అని లేచాడు.

"ఉండండి నీలవేణిని పిలుస్తాను" అని లేవబోయాడు వరద.

"వద్దు. పిలవకండి సార్. ఆడవాళ్ళంత అనవసరపు పదార్థం ప్రపంచంలో మరొకటి ఉండదనుకోండి. వాళ్ళని డి.డి.టిలాగ మోతాదులో వాడుకోవాలి. వంట చెయ్యడానికీ, తలదువ్వడానికీ, షికారు తీసుకుపోవడానికీ తప్పిస్తే ఎందుకూ పనికిరారు వాళ్ళు." అని వెళ్ళిపోయాడు బూట్లు టకటకలాడిస్తూ.

పెద్ద తుఫాను వెలిసినప్పటి ప్రశాంతత కమ్ముకుంది. ఏ విషయం ఆలోచించడానికీ సమయం యివ్వడు పీతాంబరం. అతను మాట్లాడుతూన్నంతసేపూ యింకోపని తోచదు. ఏది మాట్లాడినా నిజమే అనిపించేట్టు. అంతా అయాక 'యింతసేపూ యిలా గడిపేశామేమిటి?' అనిపిస్తుంది. అదే ఆలోచిస్తూ కూచున్నాడు వరదరాజులు.

సాయంకాలం ఆఫీసు గుమ్మం దిగడంతోటే 'వరదాజీ' అంటూ తయారయాడు పీతాంబరం. మట్టిరంగు సూటు మసక చీకటిలో కలిసిపోయింది. "సరిగ్గా టైముకి తయారయాను చూశారా? బార్లీ అనే ఫ్రెంచి దొర ఉండేవాడు భిలాయిలో పంక్చువాలిటీ అతని దగ్గర నేర్చుకుని పసందయిన మద్రాసు ఇడ్డెన్లు తినడం నేర్పాను. టీ తాగుదాం పదండి. చల్లగాలికి టీ విరుగుడు. ప్రేమకి పెళ్ళిలాగ"

బజారు వీధి దాటాక టాక్సీని పంపేసి నడక సాగించాడు పీతాంబరం వరదతో కలిసి. "ఒంటరితనం గురించి ఓ టెక్స్ట్‌బుక్కు రాసి ఆంధ్రాస్‌కి సహాయం చేద్దామనుకుంటున్నానండి. మీరు ముందుమాట వ్రాయాలి దానికి. లేకపోతే మీరు పుస్తకం వ్రాయండి. నేను ముందుమాట వ్రాస్తాను."

"ఏం? వంటరితనం గురించి పుస్తకం అంత అవసరమా?"

"చెప్పానుగా కనీసం కుక్కయినా పక్కన లేకపోతే ఏమీ తోచదు సార్? యిక అమ్మాయి ఉంటేనా బెంగాలీ రసగుల్లా అంత స్వీట్‌గా ఉంటుంది లైఫ్."

నవ్వొచ్చింది వరదకి, "భలేగా మాట్లాడతారే మీరు. మొదట మీ మాటల్నీ, తర్వాత మిమ్మల్నీ స్నేహం చేసాను."

"ఎ కాంట్రడిక్షన్. మాట్లాడ్డం తెలివితక్కువవాళ్ళు చేసేపని, నేను తెలివితక్కువవాణ్ణికాదు. రండి, మన పాలెస్‌కి వచ్చేశాం" అంటూ ఓ పెద్ద యింటిముందు ఆగాడు పీతాంబరం.

"ఏమిటిది?"

"వివరాలు తర్వాత. ముందు పదండి. "శర్మా" అని పిలిచాడు. పదిహేనేళ్ళ కుర్రాడు పరుగెత్తుకొచ్చాడు "వీడు మా అసిస్టెంట్ సార్. మెరికలాంటివాడు. నేను మరి అయిదు నిమిషాల తర్వాత ఏం చేస్తానో యిప్పుడే పసిగట్టి చేసేస్తాడు. ఖర్మకాలి యిండియాలో ఉండిపోయాడు గాని ఇటలీలో వుంటే నలుగురి తలలు మార్చి ఈపాటికి ముస్సోలినీ అంతయిపోయేవాడు. మాంచి లైమ్‌జ్యూస్ తెప్పించవోయ్" అంటూ లోపలికి నడిచాడు.

ఇంటిముందు చిన్న ఖాళీస్థలం. అగ్గిపెట్టె నిలబెట్టినట్లు లేత చాక్లెట్ రంగు మేడ, వెనక చిన్నలాన్. చాలా అందంగా వుంది. మేడమీద గదిలోంచి దూరంగా రైలుపట్టాలు, వెనక నల్లటికొండలు కనిపిస్తున్న దృశ్యం యింకా ఆహ్లాదకరంగా వుంది. వెనక మైదానానికి మధ్యగా చిన్న నారింజ మొక్క చుట్టూ 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్' వరసగా పాతారు.

"ఇవన్నీ అంటే మనకాట్టే సరదాలేదు సార్. కానీ ఆడవాళ్ళున్నారే? వాళ్ళు మొదట యింటినీ, తర్వాత మనుషుల్నీ చూస్తారు."

"ఆడవాళ్ళెవరు? పెళ్ళిచేసుకోబోతున్నారా?" అన్నాడు వరద ఆశ్చర్యంతో.

"లైమ్ జ్యూస్ లేదంటండి" అని తిరిగివచ్చాడు శర్మ.

"క్రష్ చెప్పు" అని ఆష్‌ట్రే తెచ్చుకుని సోఫాలో కూర్చున్నాడు పీతాంబరం.

"వారం రోజులు క్రితం హఠాత్తుగా యీ ప్లాన్ తట్టింది. సెలిబసీ మొదట్లో హాయి అనిపిస్తుందిగానీ కొన్నాళ్ళు గడిచినకొద్దీ ఏమీ అక్కర్లేకపోవడం కూడా ఒక లోపమేనని తోస్తుందండీ. ఫరెగ్జాంపుల్ నా జీవితం."

"నేనే మీకు చెపుదామనుకున్నాను. మీలాంటివాళ్ళు పెళ్ళి చేసుకుంటే బావుంటుంది"

"కానీ నన్ను చేసుకుందుకు ఎవరూ సిద్ధమవరు. నన్నుగాక, నా డబ్బును చేసుకుందుకు వందమంది సిద్ధమవుతారు. అది సరే, యిప్పుడు విషయం అదికాదు. నాలుగురోజుల క్రితం నీలవేణి దగ్గర ఈ విషయం కదిపాను"

"ఏ విషయం?"

"ఈ ఒంటరితనానికి అర్థం లేదు సార్. ఏదో ఒక కన్సొలేషన్ కావాలి. 'నేను కావాలి' అన్న ఆలోచన. నీలవేణి నా చెల్లెలని మరిచిపోవద్దు. రేపట్నుంచి యిక్కడ ఉంటుంది మీకు చెప్పడం నా బాధ్యత. అందుకనే మిమ్మల్నిక్కడకు తీసుకొచ్చాను."

వరద మాట్లాడలేదు. టీ టేబులు మీది అజంతా ప్రతిమ చూస్తున్నవాడల్లా ఆగాడు.

"ఈ బోయ్ ఎంతకీ రాడేం? ఉండండి వస్తాను" అని లేచాడు పీతాంబరం.

పక్క గది రేడియో నుండి వీణపాట వినిపిస్తోంది. చీకట్లో దారితప్పిన మనస్సు చేసే తాత్సారానికి రూపాన్నిస్తున్నట్టు తీగలు సోమరిగా కదులుతున్నాయి. అనుభవించి, పలవరించి మనస్సునంతా ఆ తీగ కదిలికల్లో జొనిపి ఎవరో మీటుతున్నారు వీణని. లేచి బాల్కనీ మీదికి వస్తే చల్లగాలి నరాల్ని జివ్వుమనిపించింది. వెనుకవైపు మైదానంలో దీపాలు వెలిగించరు. వెలుగులో పచ్చటి గడ్డి మెరిసింది. ఇలాంటి ఊరులో యింత అందంగా బ్రతకడం సాధ్యమా అని విస్తుబోయాడు వరద.

"ఇక్కడున్నారా మీరు? డ్రింక్స్ మార్చేశాం. బోర్నవిటా సిప్ చేయండి. బ్రహ్మదేవుడు సృష్టించిన పానీయాలలో యిదే మొదటిదని నా అనుమానం" అంటూ వచ్చాడు పీతాంబరం.

వరద ఎంతసేపటికీ మాట్లాడకపోయేసరికి "మిమ్మల్ని నొప్పించినట్లున్నాను. మిమ్మల్ని బాధపెడితే ఓ పెద్ద ఆస్థిపోయినట్లే నాకు."

"దేని విషయం?"

"నీలవేణి"

"ఆమెతో మాట్లాడారా?"

"ఓసారి కదిపాను"

"ఏమంది?"

"ఏమంటుంది? ఊరుకుంది. ఆడవాళ్ళు మాట్లాడకుండానే హెచ్చు విషయాలు చెప్తారు. మీకు నచ్చకపోతే రేపే ఈ యిల్లు యిచ్చేస్తాను."

"తొందరపడకండి. ఓసారి నీలవేణితో నేనూ మాట్లాడి చూస్తాను."

"ఏమైనా కోపమా నా మీద?"

"ఛఛ! అలాంటి ఆలోచనేం పెట్టుకోకండి"

"రైట్! డెర్బీలో లక్ష గెలిచినంత సంతోషంగా ఉంది నాకు. మాట నెగ్గించుకున్నందుకు కాదు. మిమ్మల్ని బాధపెట్టనందుకు. కాకాసురుడు పడ్డ ఫిక్సులో పడిపోయాను ఇంతవరకూ. పదండి మిమ్మల్ని దిగపెట్టి వస్తాను" అన్నాడు.

ఇంటికి వచ్చేసరికి తొమ్మిది దాటింది. గులాబి లేచి ఉంది. నీలవేణి వస్తే బావుణ్ణనుకున్నాడు వరద. "ఇంత రాత్రయిందేం అన్నయ్యా?" అంటే ఏం జవాబు చెప్పకుండా కాళ్ళు కడుక్కుని భోజనానికి కూచున్నాడు. భోజనం చేస్తూండగానే గదిలో ఏదో చప్పుడయినట్లనిపించింది. "నీలవేణి మన యింట్లో యిక ఉండదు గులాబీ" అన్నాడు పక్కగదిలోకి వినిపించేట్లు గట్టిగానే. గదిలో మంచినీళ్ళు గుటకవేస్తున్న చప్పుడు వినిపిస్తోంది.

"అదేమిటి?" అంది గులాబి.

"ఏమో నాకు తెలీదు. ఆమెనే అడుగు"

గులాబి యికనేం మాట్లాడలేదు. నీలవేణి అక్కడికి వస్తుందా అనుకున్నాడు.

కాలం గడుస్తున్నకొద్దీ గాలి మరీ చల్లబడింది. ఆకలితో దిగులుపడ్డ బిచ్చగాడిలాగా ముడుచుకు నిద్రపోతున్నది గన్నేరు చెట్టు.

వాకిట్లో నిద్రపోవడం అసాధ్యమయి లోపలికి వచ్చేశాడు వరదరాజులు. పక్కగదిలో గులాబి ఊపిరి పీల్చుకుంటున్న చప్పుడు వినిపిస్తోంది. టేబులు మీద గడియారం వొంటరిగా, బరువుగా చీకట్లో కాలాన్ని లెక్కబెడుతోంది.

దీపం వెలిగించబోతే వెలగలేదు. కొవ్వొత్తి వెదుక్కుంటూ ప్రక్కగదిలోకి వెళ్ళబోయి గుమ్మమ దగ్గర ఎవరినో గుద్దుకుని తుళ్ళిపడ్డాడు వరద.

`గులాబీ` అనలేకపోయాడు. అంత చీకట్లోనూ నీలవేణిని గుర్తుపట్టాడు.

"ఇంత రాత్రిలో యిక్కడ నిలబడ్డావేం?"

జవాబుకు ఎదురుచూడకుండా వాకిట్లోకి వచ్చాడు. ఆలయమంతా ప్రశాంతంగా ఉంది. ఆ నీడల్లోకి పోయి కాస్సేపు కూర్చోవాలనిపించింది.

"నేను వెళ్ళిపోతున్నానని ఎవరు చెప్పారు?"

తుళ్ళిపడలేదు వరద. వెనక్కి తిరగకుండానే ఆమె తనకి చాలా దగ్గర్లో ఉన్నదని గ్రహించాడు.

అంతరాత్రిలో అవన్నీ మాట్లాడటానికి విసుగేసింది. కానీ ఏదో జవాబు చెప్పాలి నీలవేణికి.

"వెళ్ళిపోవాలనుంటే నాతో చెప్పవచ్చునుగా? పీతాంబరం దేనికి?"

ఆమె మాట్లాడలేదు. ఏదో మాట్లాడుతుందనుకున్నాడు.

"ఇవాళ యిల్లు చూపించాడతను. చాలా బావుంది నా మటుకు. అలాంటిచోట ఉండటం అదృష్టం."

"...."

"మనిషి మంచితనం మీద నీకు ఎంత నమ్మకమా అని ఆశ్చర్యపోతూంటాను అప్పుడప్పుడు. నువ్వు యిప్పుడు ఉండాల్సిన మనిషివి కావు. శతాబ్దం కిందట ఎక్కడో వుంటే బావుండేది. సరేలే, వెళ్ళిపడుకో. ఇలా ఎవరన్నా చూస్తే బావుండదు"

"నేనెక్కడికీ వెళ్ళడం లేదు" అంది నీలవేణి. మాటని బట్టి ఆమె మనస్సుని ఊహించబోయి వెయ్యోసారి విఫలుడయాడు వరద. ఆమె మాటకి నవ్వొచ్చింది. అల్లరి చేసిన పాపాయి ఉదాసీనత. ఆమె కంఠంలో తెలిసింది.

"నువ్వు వెళ్ళకుండా ఉండలేవు నీలవేణీ! నీకు తెలీదు. రేపు అతను వస్తాడు బహుశా. అతని మనస్సు బాధపెట్టడం నాకిష్టంలేదు" అన్నాడు. ద్వారం దగ్గిరే నిలబడిందామె. ఆమెను మెల్లగా తప్పించుకుని లోపలికి వచ్చేసాడు.

మరీ అంత బలంగాలేని నీరసపు చీకటుల మధ్య వొంటరిగా ఆగిపోయింది నీలవేణి.

స్తబ్ధుగా, చేతనారహితంగా సొమ్మసిల్లిన చీకటులు ఆమె చుట్టూ చీలినయి. అసహాయత, అసంతృప్తి, అలసట, ఆవేగం, ఆవేశం ఉద్విగ్నత, ఆ క్షణాన వేటికవి విడివడి చీల్చివేసాయి. అటువంటి ఏకాంతంలో కళ్ళు విప్పి "ఈ జీవితం ఎందుకిలా గడిచిపోతున్నదా?" అని మొదటిసారి విస్తుపోయింది నీలవేణి.

ఒక్కపెట్టున భోరుమని ఏడవాలనిపించింది.

చల్లటిగాలి రివట గంట తరువాత ఆమె ఒంటిని కొరికింది.

**అల్లంతదూరంలో** ఉండగానే రవణ ఇంట్లోంచి నవ్వులు వినిపించాయి. సుజాత నవ్వులో అల్లరీ, అమాయకత్వం తనకీ గుర్తే. కాని ఇది కొత్త వరదకి. ఈ మాత్రం ఉత్సాహంతోనయినా గడవలేదు వాళ్ళిద్దరూ. అందుకని విస్తుపోయాడు.

చూస్తూనే పరుగెత్తుకు వచ్చింది సుజాత. "వరదగారికి మనమీద కోపం వచ్చిందన్నయ్యా. అందుకనే యిన్నాళ్ళూ మనల్ని మరిచిపోయారు. ఆయనకి శిక్ష యేమిటో తెల్సా? యివాళ మనతోపాటు భోజనం చెయ్యడం" చెయ్యిపట్టుకుని లాక్కొచ్చింది అతన్ని.

కొత్తగా మొదటిసారిగా ప్రపంచాన్ని చూసిన సీతాకోకచిలుకలాగ వుంది సుజీ. పల్చని నీలిరంగు చీరె. జడలో పొట్లులు విచ్చుకుని స్థలం చాలక జారిపోతున్న మల్లెలూ, వాటి మధ్య పల్చటి నుదురూ.

"అన్ని పువ్వుల్నీ నువ్వే మోస్తే ఎలా? అంత అందాన్నీ ఒక చోటే దాచేసుకోకూడదు" అన్నాడు వరద.

నిజంగానే సిగ్గుపడింది సుజాత. "మీ కవిత్వం పుస్తకాల్లో నండోయ్. నా పువ్వుల మీదా, కాఫీ మీదా కాదు అన్నట్టు కాఫీ పెట్టానుండండి" అని లోపలికి పరుగెత్తింది.

"ఏమిటివాళ హడావిడి చేస్తోంది సుజీ?"

తలదువ్వుకుంటున్నవాడల్లా రవణ యిటు తిరిగాడు.

"ఆరోగ్యం కాస్త బాగుపడింది. చాలారోజులవరకూ బాధలేదన్నాడు. అందుకని గెంతుతోంది."

"నీ ఉద్యోగం విషయం ఏమయింది?"

"ఏమవుతుంది? నాకేమీ చేతకాదు"

"కో ఆపరేటివ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పోరేషన్‌లో ఎకౌంట్స్ చూడాలిట. చేస్తావా?"

"అంత సులువా ఉద్యోగం దొరకడం?"

"నే చూస్తాగా మిగతావన్నీ?"

"నే చెపితే అన్నయ్య వినడం లేదండీ. మీరు చెప్పిచూడండి వరదరాజులుగారూ" చేళతులు తుడుచుకుంటూ వచ్చింది సుజాత.

"అదిగో మళ్ళీ మొదలెట్టావ్?" అంటున్నాడు రవణ. అతను నవ్వగా వరద అదే మొదటిసారి చూడడం, నవ్వులో అంత నిండుదనాన్ని దాచుకుని ఎందుకు బయటపెట్టడా అనుకున్నాడు.

"ఏమ్మిట్రా అది?"

"ఏం లేదండి" వరదకి ఎదురుగ్గా నేలమీద కాళ్ళు వెనక్కి ముడుచుకు కూర్చుంది సుజాత. ఏదో పెద్దరాశిలోంచి అందం వొలికి నేలపడ్డట్టు, విచ్చలవిడిగా జల్లేసినట్లుంది.

"అన్నయ్య పెళ్ళిచేసుకుంటే ఎలా వుంటుందంటారు?" నవ్వొచ్చింది వరదకి.

కిటికీ వూచల మట్టిని వొంటికి రాసుకుంటున్నాడు రవణ.

"అసలు నాకీ విషయం ఎప్పుడు తోచిందంటే" అన్నయ్య ముఖం చూసింది "చెప్పనా ఆ విషయం?"

ఒక్క ఉదుటున వచ్చి చెవి పట్టుకుంటే కెవ్వున అరిచింది. "పోనీ చెప్పనులే వదిలెయ్ బాబూ" వదిలేశాక "అదికాదండీ మీ యింట్లో వున్న నీలవేణి అన్నారండి. మా వదినెను చూడడానికి వచ్చానని. నిజంగా నాకిప్పుడే అదిగో, అన్నయ్యకి కోపం వచ్చింది. వుండండి, నీళ్ళు మరుగుతున్నట్లున్నాయి" పారిపోయింది సుజాత వస్తూన్న నవ్వును కొంగుతో ఆపుకుంటూ.

ఆ మాత్రం ప్రశాంతత, స్థాయి ఆ యింట్లో ఎప్పుడూ చూడలేదు వరద. గొడ్డుపోయిన చెట్టు మొదటి పువ్వుని మోసినప్పటి సంతోషంలా వుందది.

ఉత్సాహం కోల్పోయిన వాడికంటే బీదవాడు ఈ ప్రపంచంలో యింకెవడూ వుండడు. అన్నీపోయి ఒక్క ఉత్సాహం మిగిలినా మిగతావన్నీ క్రమంగా కూడదీసుకోవచ్చు.

"సుజీ చెప్పింది నిజమేరా. నువ్వు పెళ్ళి చేసుకుంటే యింటికి ఓ కొత్తదనం వస్తుంది" అన్నాడు వరద వెనక్కి చేరబడుతూ.

రాధాకృష్ణుల దగ్గరున్న అగరొత్తి చివరి వెలుగు చూసి కన్నుమూసింది. నుసి మెత్తగా నేలరాలింది.

"నీకేమైనా పిచ్చా యేమ్మిట్రా? ఇవాళ్టి ఒక్కరోజు ఆనందం చూసి మోసపోకు. రేపు నేనెలా వుంటానో ఎవరికి తెలుసు?"

వంటింట్లోంచి పొగలేచి గదంతా చుట్టేసింది. దగ్గుతూ లేచి బయటికి వెళ్ళాడు రవణ. ఈ సంతోషం వెనక ఏదో తెలీని పిరికిదనం, దుర్ఘటనలకి సన్నాహం, అసంతృప్తి కనిపిస్తూనే వుంది. సుఖపడడానికి యింతకన్నా చక్కని వాతావరణం అనవసరం ఎవరికయినా. కానీ రవణమూర్తికి ఎలా సంతృప్తినీ, స్థాయినీ కలిగించాలో అర్థంకాలేదు వరదరాజులుకి.

"ఆ గదిలో పొగ బాబూ!" అంటూ గిన్నెలో కాఫీ పట్టుకుని వచ్చేసింది సుజాత.

ఉంగరాలు తిరుగుతూ సోమరిగా కదుల్తున్న పొగమధ్య సుజాత ముఖం స్పష్టంగా కనిపిస్తోంది. మెదడునంతా కడిగేసుకుని అంత నిర్మలంగా, స్వచ్ఛంగా ఉండడం సాధ్యంకాదు ఎవరికయినా. జీవితం విధించే శిక్షలన్నిటికీ పైన అసంతృప్తిని పేర్చుకు కృంగిపోతాడు రవణ. ఆనందాన్ని తెచ్చుకుని అన్నిటినీ మరిచిపోతుంది సుజాత. ఎవరినో అక్కర్లేదు. ఆమెని అర్థం చేసుకుంటే చాలు రవణ చాలా మార్పు చెందవచ్చుననిపించింది వరదరాజులుకి.

"ఎలా వుంది సుజీ నీ వొంట్లో?"

పొగమధ్య నుంచి కోపంతో చూసింది. "నన్నెప్పుడూ అలాంటి ప్రశ్నలడక్కండి. ఉన్నపాటు నా మిమ్మల్ని ఆ కిటికీలోంచి విసిరేయగలను" తన పరిహాసానికి తనకే నవ్వొచ్చి నేలమీద చదికిలబడి కిలకిలమని నవ్వింది.

"నా కాఫీ యిచ్చేసి నువ్వు కానియ్."

రవణ లోపలికి వచ్చి మంచం మీద మఠం వేసుక్కూచున్నాడు.

"నీ పెళ్ళికి వరదరాజులు గారు ఒప్పుకున్నారన్నయ్యా" అంది సుజాత కాఫీ యిస్తూ.

కిటికీ తలుపు తెరవగానే పొగ మెల్లిగా దారి వెదుక్కోంది. ఆ నవ్వు వెనక, ఆ తొందరపాటు చాటున యింకా పాతనీరసం, బలహీనతతో శానిటోరియంలో మంచం మీద నిద్రపోయిన సుజాత కనిపిస్తూనే వుంది. రవణ చెప్పింది నిజమేనేమోననిపించింది.

"కూర్చో సుజీ. అంత మరీ అలసిపోకూడదు. అప్పుడే ఎన్నాళ్ళయిందని నువ్వు తేరుకుని?"

"పోండి, ఇలాగయితే నాకు ఏడుపొస్తుంది" గ్లాసులన్నీ తీసుకుని పరిగెత్తింది.

ఆమె గొంతు మధ్య నలిగి త్యాగరాజు తుక్కుతుక్కయిపోతున్నాడు.

"ఆ విషయం చెప్పావా?"

"ఏది?"

"అదే, అమ్మ విషయం"

రవణ తుళ్ళిపడ్డాడు. దేవుడి దగ్గర యింకా సీతారామమ్మగారి రుద్రాక్షలు వేలాడుతూనే వున్నాయి.

"చెప్పాలి. ఎప్పుడో ఒకప్పుడు, తల్చుకున్నప్పుడల్లా వణుకు పుడ్తుంది" మళ్ళీ రవణమూర్తి కళ్ళల్లో పాతదుఃఖపు నీడలు కదిలాయి. స్తబ్ధుగా, అచేతనంగా కూర్చుండిపోయాడు తలవాల్చి. ఇలాంటి సమయంలో గుర్తుచేయడం తనదే తప్పేమో అని కించపడ్డాడు వరద.

"ఇప్పుడు చెప్పేస్తే? మళ్ళీ యిలాంటి అవకాశం దొరకదేమో! ఈ ఉత్సాహం మధ్యని ఏదో విధంగా బయట పెట్టేస్తే తర్వాత ఎలాగో ఓదార్చవచ్చు"

ఎన్నో రోజుల తరువాత మొదటిసారిగా అనుభవిస్తున్న యీ స్థిమితాన్ని ఒక్కసారిగా పీల్చేయడం ద్రోహమనిపించింది.

"ఇప్పుడు కాదులే. ఎప్పుడన్నా వీలు చూసుకుని చెప్పవచ్చు" అనేసి వూరుకున్నాడు వరద.

ఉన్నట్టుండి గదిలో సామాన్లు ఒక్కసారిగా దొర్లాయి. పెద్ద చప్పుడయింది. ఇద్దరూ తుళ్ళిపడ్డారు. "సుజా!" అన్నాడు రవణ. ఆమె అలికిడి ఎక్కడా వినిపించడంలేదు. జుత్తు కాలిన వాసన గుప్పుమంది. ఇద్దరూ నిర్ఘాంతపోయారు. చటుక్కున పరిగెత్తాడు రవణ. వంటగదిలో అడ్డంగా పడిపోయి కొట్టుకుంటోంది సుజాత. కుంపటిలో జుత్తుపడి కాలుతోంది. కన్నుమూసి తెరిచేంతలో ఆమె మీద నీళ్ళు గుమ్మరించాడు రవణ. ఇద్దరూ ఆమెను మోసుకొచ్చి మంచం మీద పడుకోబెట్టారు. ఇంకా కాళ్ళు కొట్టుకుంటూనే వుంది సుజాత. చేతులు వంపు తిరుగుతున్నాయి. బద్ధకంగా వొళ్ళు విరుచుకుంటోంది. కుంపట్లో మల్లెలు పడి కాలిన వాసన గదంతా కమ్ముకుంది.

క్రిందనపడి చిన్నపిల్లాడిలాగా ఏడ్చేశాడు రవణ. వీళ్ళిద్దరి మధ్యా కర్తవ్యాన్ని నిర్ణయించుకోవలసిన బాధ్యత ఒంటిగా వరదమీద పడింది. నిలబడలేనంతగా వొళ్ళంతా వొణుకు ప్రారంభమయింది. నరాలకీ, నరాలకీ పొందిక నశించి ఒకే ముద్దుగా

చుట్టుకుపోయింది సుజాత. ఎంత బలం వున్నా అలాంటి సమయంలో మరో వ్యక్తి ఉనికి ఎంతయినా అవసరం అనిపించింది. అప్పటికి తొమ్మిది దాటింది. వెంటనే బండి తీసుకుని ఆసుపత్రికి బయల్దేరాడు రవణతో కలిసి

"ఈ కుటుంబంలో ఇదివరకు ఎవరికన్నా ఫిట్స్ రావడం ఉందా?" అనడిగాడు డాక్టర్ పరీక్ష చేశాక.

లేదన్నాడు రవణ.

"అసలేం జరిగింది చెప్పండి"

పూర్తిగా విన్నాక "టి.బిలోంచి తేరుకున్న పేషెంటుని ఎప్పుడు అంత ఆవేశపడనివ్వకూడదు. ముఖ్యంగా యీమె మరీ నీరసం. ఆ ఎక్సైట్‌మెంట్ నరాలమీదా, మెదడుమీదా బాగా పనిచేసింది" అన్నాడాయన.

ఇంటికి వచ్చేసరికి పన్నెండు దాటింది. చలి శరీరాన్ని కొరికేస్తోంది. కాలు తీసి కాలు వెయ్యడానికి నరాలు తిరుగుబాటు చేస్తున్నాయి. ప్రకృతి అంతా కుంచుకుని ఏదో స్వగతం చెప్పుకుంటున్నట్లుగా వుంది.

గేటు తలుపు తెరవబోయి ఎవరిచేతిమీదో కాలేసి వెనక్కి అడుగేశాడు వరద. రామ్మూర్తిగారు వళ్ళు దులుపుకుని కోటు తీసుకుని లేచారు.

"ఎవరదీ?"

"నేనండీ, రామ్మూర్తిని"

నిర్ఘాంతపోయాడు వరదరాజులు.

"ఇక్కడున్నారేం?"

"ఆవిడ ఒక్కరూ ఉండలేరన్నారని. ఇక వెళ్ళిపోతానండి" గేటు తెరిచి లోపలికి వస్తే గులాబి లేచింది.

"సాయంకాలం పీతాంబరం గారొచ్చి నీలవేణిని తీసుకువెళ్ళిపోయారన్నయ్యా ఒంటరిగా పడుకోడానికి భయమేసింది. ఆయన్ని ఉండమన్నాను."

"నేను వెళ్తానండి"

"ఇంత చీకట్లో ఏం వెళ్తారు? ఉదయాన్నే వెళ్దురుగాని, ఇక్కడే నిద్రపొండి"

"కాదు సార్. వెళ్ళాలి. సైకిలు తెచ్చుకున్నాను

"ఇంత రాత్రివరకూ చలిలో నిద్రపోయారు. రేపు డ్యూటీలోకి రాకండి. నేను ఆఫీసులో చెప్తాను."

సైకిలు తీసుకుని కోటు మెడచుట్టూ తిప్పుకుని వెళ్ళిపోయాడు. చూపుమేరదాటిపోయేవరకూ విచిత్రంగా రామ్మూర్తిగారిని చూస్తూ నిలబడిపోయాడు వరదరాజులు.

ఆ చలిలో, అర్ధరాత్రి నిశ్శబ్దంలో తనది కాని పనిచేసిపోతున్న పొట్టి రామ్మూర్తిని చూసి తనలాగే బ్రతికే మరో వ్యక్తి కూడా ఉన్నాడనుకున్నాడు వరద.

వెనక్కి తిరగబోతే భుజం దగ్గిరే గులాబి దూరంగా చీకటిలోకి చూస్తూ కనిపించింది.

అన్నయ్య ముఖం చూసి సిగ్గుపడింది.

"ఈ జీవితానికి అర్థం ఏమిటీ?" అని వెయ్యిన్నీ తొమ్మన్నూట ఆరువందల పదకొండోసారి ఆలోచించాడు వరద.

అప్పటికీ అతనికి జవాబు దొరకలేదు.

ఆకాశాన్ని బరువుతో కిందకి తూలించే చాందినీ, ఎందుకో తెలీకుండా ప్రపంచానికి వెన్నెలని పంచిపెడ్తున్న చంద్రుడూ, అర్థం లేకుండా పిచ్చిగా పచ్చివాసనలు చిమ్మే బోగన్‌విల్లా, ప్రతిఫలం కోరకుండా చీకటికి అర్థం కల్పిస్తున్న అమాయకపు కోయిలా - యివన్నీ ఎందుకు బ్రతకాలో తనూ అందుకేనేమో? వాటన్నిటికీ ఓ పనంటూ వుంది. తనకు తోచిన భాగాన్ని ప్రకృతికి అందించి, తృప్తిపడి, పెరిగి, దానిలో కలిసిపోయి తన్మయంతో ఏకస్థమయి ఊగుతున్నయి. కాని తాను? యీ ప్రకృతితో పెనుగులాడి, కోరికతో రెచ్చి, సౌందర్యాన్ని ఆకలితో కబళించి సృష్టికార్యాన్ని నెరవేర్చడం. తనలాగే అర్థంలేని కొన్ని జీవులకు నాంది పలకడం.

నవ్వుకున్నాడు వరద. కిటికీలోంచి తోట కనిపిస్తోంది. ఎండుటాకు తెగి రెపరెపలాడుతూ క్రింద పడింది. పురుగుని తినబోయి బల్లిటప్పున క్రిందపడి గిలగిలకొట్టుకుంది.

ముగింపులేని రొటీను మధ్య తనూ, దూరాన టైపిస్టూ మిగిలారు ఆఫీసంతటికీ. తనకి పనిచేయడం తెలీదు. ఆమెకు పనిచేయడం తప్ప యింకేమీ తెలీదు. ప్రేమకోసం, తనక్కావల్సిన వ్యక్తి ఎవరన్నా దొరుకుతారా అన్న తపనతో కదుల్తూంటాయి కమల కళ్ళు. ఆ కళ్ళలో గొప్పతనానికి కాకపోతే, ప్రపంచానికి ఏ విధంగానూ అవసరంలేని ఆ ప్రాణిని ఎవరో ఎప్పుడో హత్యచేసి పోయేవారు. కంకరమీద బండి నడిచినప్పటి గరుకుదనం గొంతులో. అందాన్ని ఎరువు తెచ్చుకునేందుకు చేసే ప్రయత్నపు వెగటు, ఇన్నిటి మధ్యా ఆమె మంచితనం పెద్ద ఆయుధం.

కర్తవ్యపు విసుగుదల నుంచి తను తప్పుకొందుకు యిక్కడ కూర్చున్నట్లే, ప్రేమజీవితం నుంచీ, విరహం నుంచీ కమల యీ పనిపాటల్లో 'ఆటవిడుపు' వెదుక్కున్నదేమోననిపించింది.

ఎనిమిది దాటి నాలుగడుగులు ముందుకు జరిగింది పెద్దముల్లు.

కూడుకుని కిటికీ దగ్గర విరిగిపోతున్న చీకటిలోకి చూస్తూ 'సుజీని చూసి వద్దామా!' అనుకున్నాడు వరద ఒక్కసారి. మూడు వారాలయింది. ఇప్పుడిప్పుడే స్థిమితం చిక్కుతోంది సుజాతకి.

సుజాత జ్ఞాపకం వచ్చేసరికి పుండు రేగినట్లు ఆలోచనలన్నీ చెదిరినయి. స్థిమితాన్ని ఆసరాగా తీసుకుని ఆలోచనలు ఒక్కటొక్కటే తాడించుకు లేచినయి. ఆర్ద్రతో కుంటుపడిన లోతులేని మనస్సుని ఆ మూలాగ్రం కదిపాయి. ఆ విస్మృతిలో, ఆ ఆలోచనల బరువుకింద చేతకాని వాడయి నిరాశకి బందీ అయిపోయాడు వరద.

ఇక కూచోలేక లేచి బయటికి వచ్చేయబోతే దూరంగా కుర్చీలో వున్న కమల చటుక్కున లేచింది.

"వెళ్ళిపోతున్నారా మీరు?"

గడియారం అరగంట కొట్టింది. గది నిశ్శబ్దాన్ని కమలగొంతు కదిపి కొరికే చలిలో మంచుముద్ద మీద పడిన అనుభవాన్ని కలిగించింది.

"వెళ్ళిపోతున్నాను. ఏం?"

"నేను ఒంటరిగా కూర్చోలేను బాబూ. మిగతా పని రేపు చూసుకుంటాను వచ్చేస్తున్నా నుండండి."

దిమ్మరపోయాడు వరద. ఆమెతో ఎప్పుడూ చొరవగా మాట్లాడలేదు. కాటుక మధ్య కళ్ళేవో కనిపించకుండా పోయిన రెండు లోతు నీడల్ని తప్పించుకుని "సరే, మీ యిష్టం" అని ద్వారం దగ్గరికి వచ్చి నిలబడ్డాడు.

స్త్రీత్వం అంటే పెద్ద అనుమతి పత్రం. దానికి వేరే వివరం అక్కర్లేదు. స్త్రీని చూసీ చూడనట్లు పోతేనే జీవితం బాగున్నట్టు లెక్క. ఒక్కమాటు పొరపాటున ఆమె నీ పక్క చూసి కళ్ళు చికిలించిందా నీ పని సరి. రేపు నిన్ను చూసి నవ్వుతుంది. ఎల్లుండి నీ దారికి

అడ్డంగా నిలబడుతుంది. తర్వాత రోజు పలకరిస్తుంది. ఎప్పుడో ఒకరోజు ఎవరూ చూడని మార్గాన్న వచ్చి నీ భుజం మీద చెయ్యి వేస్తుంది.

నవ్వుకున్నాడు వరద తన బలహీనతకి. ఒక్కసారి తనని పలకరించినంత మాత్రాన స్త్రీత్వపు విలువల్ని ఎందుకంత క్రిందకు తోసెయ్యాలో అర్థం కాలేదు.

భుజం మీద తట్టి 'పదండి' అంది కమల. నైట్‌వాచర్ ఆఫీసు మూస్తున్నాడు. రోడ్డుమీదకి వచ్చేసరికి ఆకుల వెనక ఒదిగి విరిగిన మనస్సులాగే యేడ్చే గాలి చప్పుడు వినిపిస్తోంది.

"అబ్బ! చలిబాబూ!" అని చీర నడుంచుట్టూ కప్పుకుని "ఆడది కావడం ప్రత్యేకమైన దోషం. ముఖ్యంగా మన ఆఫీసులో. అందులోనూ బలరాందాసు గారు క్రిందటి జన్మలో... సరేలెండి రెండు రోజులకి సరిపడే కాగితాలు నా బల్లమీదకి చేరాయి."

నీలవేణి మొదటి పరిచయం గురించి ఆలోచిస్తున్నాడు వరద.

"అబ్బ! యీ ఆఫీసు వట్టి న్యూసెన్స్‌గా తయారయిందండి. సంక్రాంతి లోపల మానేస్తాను. అలా బిగుసుకుపోయారేం? చలికేనా? పెళ్ళిచేసుకోండి. మీ ఆవిడ ఊలుస్వెట్టర్లు అల్లిపెట్టుంది."

"ఊలు స్వెట్టర్ల కోసం పెళ్ళిచేసుకోమంటారా?"

సిగ్గుపడింది కమల. అంతలో కిలకిలా నవ్వింది. ఉధృతంగా ఉప్పెనలా నవ్వితే ఆమెలో కాస్తపాటి కరుకుదనం పోయి ఏదో పాత సౌకుమార్యం తోస్తుంది.

"మరీ చిన్నపిల్లాడిలా అడుగుతారేం? కొన్నాళ్ళు ఆఫీసు పని మానేసి ఎవరి దగ్గరన్నా పాఠాలు నేర్చుకోండి" పెద్ద లారీ శబ్దం చేసుకుంటూ పక్కనుంచి వెళ్ళిపోయింది. పక్కకి తప్పుకోబోయి వరదరాజుల్ని గుద్దుకుంది కమల.

రోడ్డు చివర నీలిరంగు దీపపు వెలుగు క్రింద ఆగాడు, దీపపు పురుగులు చివరి నృత్యాన్ని చేస్తున్నాయి. కిందపడ్డ రెక్క తెగిన పురుగుల్ని నాకుతోంది కుక్క. "బస్‌స్టాపు అటు" అంటోంది కమల అతన్ని ఆపి. కుడివేపు మూల ఎర్రటి కట్టడం కనిపిస్తోంది. కింద హాలులో పూర్తిగా నిండిన మనుషులకు చివర గోవర్ధనరావుగారి ముఖం స్పష్టంగా తెలుస్తోంది.

"విజ్ఞానమందిరం" అన్న అక్షరాలు వెలిగి ఆరుతున్నాయి.

"అప్పుడే యింటికి పోను నేను. కాస్సేపు ఉపన్యాసం వింటాను."

"మీరు బుద్ధిస్టా?" విస్తుపోయింది కమల.

"ఏం? కాకపోతే వినకూడదా?"

"ఉండండి నేనూ వస్తాను. ఎప్పుడూ వెళ్ళలేదు నేను. కాస్సేపుండి పోతాను" వరద చెయ్యి పట్టుకుని నడిచింది. జీవితంలో అక్కర్లేని వస్తువును వదులుకోవడం ఎంత అసాధ్యమో యిప్పుడు తెలిసింది వరదకి.

ప్రత్యేకమయిన శ్రద్ధతో, భక్తితో అలంకరించారు హాలుని. అంతమంది మధ్య చెదరని నిశ్శబ్దం అక్కడి ప్రత్యేకత. అంతా ధ్యానంతో హాలు చివర మాట్లాడే వ్యక్తి మాటలు వింటున్నారు.

దూరాన నిలువెత్తు బుద్ధుడి విగ్రహం.

ద్వారం దగ్గరికి వస్తూనే అచేతనుడయాడు వరద. విగ్రహాన్ని చూస్తూనే వరద చేతిని కదిపి ఏదో మాట్లాడబోయి అంతలో అతని ముఖాన్ని చూసి, అబ్బురపడి ఆగిపోయింది కమల.

ఎదురుగ్గా భోదిసత్త్వుడు.

మంచులాంటి, తెల్లటి నునుపయిన పదార్థంలోంచి అమృతాన్ని తీశారు. అతని జీవితంలోని మార్దవత్వం, నిష్ఠ నైర్మల్యం, నిశ్చలత్వం, హైందవ తాత్త్విక సిద్ధాంతాలన్నీ ఏకీకృతమయిన వెలుగూ, ఆ నుదుటి రేఖల్లో స్ఫుటంగా తోస్తుంది. అన్నీ కాకపోయినా కొన్ని, అనిర్వికార, నిశ్చల స్తబ్ధాకృతి ఎంతటి వాడినయినా నిలిపి పలకరిస్తుంది. కొన్ని శతాబ్దాల క్రిందటి అపూర్వ శక్తి అది. ఇంకా కొత్తదయి, పరిపుష్టమయి, నవనవోన్మేషమయి, శాఖలు విచ్చుకుని పెరిగిన ఔన్నత్యాన్ని చూపుతుంది.

"పోదామా యిక?" అన్న కమల ప్రశ్న అతనికి వినిపించడం లేదు. ఎదురుగ్గా మాటలకి అందని ఆ రూపం, వేయిగంటలు నినదించినట్టు మాట్లాడుతున్న గోవర్ధనరావుగారి ఉపన్యాసపు ధోరణి అతణ్ణి ఎక్కడికో తీసుకుపోతున్నయి.

అతని వెనుకస్తబ్ధుగా వచ్చి కూచుంది కమల.

ఏదో తెలీని ఆవేశంతో గోవర్ధనరావుగారు ముగింపు లేకుండా మాట్లాడుతున్నారు. రోజూ చూసే మాములు వ్యక్తిగా కాకుండా ఎప్పుడూ కనిపించని ఓ అపూర్వశక్తినిలాగా చూస్తున్నాడు వరద. కుర్చీల మధ్యనుంచి అల్లంతదూరంలో ఆరోగ్యం కనిపించింది. వరద చూసేసరికి తనవేపే చూస్తూ కనిపించింది ఆమె. చూసి నవ్వింది.

అంతా అగమ్యగోచరంగా వుంది కమలకి. బుద్ధుడి విగ్రహానికి రెండువేపులా వుంచిన దీపపు ప్రమిదల మీద పనివాడితనం ఆమెకు బాగా నచ్చింది. వాటివేపే చూస్తూ కూచున్నదామె.

అక్కడి ప్రశాంతత తన ఆలోచనల ప్రళయం మీద ఏదో చల్లదనాన్ని కమ్మినట్టనిపించింది వరదకి. తనకు తెలియకుండానే మనస్సు స్థాయి కుదురుచుకుంటోంది. గోవర్ధన రావుగారి మాటల్ని కాస్తయినా అర్థం చేసుకోడానికి ప్రయత్నించాడు. కాని అది మహా ప్రవాహం.

ఆత్మానాత్మ వివేకంతో, భగవంతుడితో, మనస్సుతో గుంజాటన పడిన యీ మత మీమాంసలు ముగిశాక, తుఫాను తర్వాత కొండల మీంచి వచ్చే చల్లటి పవనంలాగా బుద్ధుడి తత్త్వం.

కాస్సేపు ఊపిరి పీల్చుకుందుకు ఆగారు గోవర్ధనరావుగారు. అతని మాటల్లో శబ్దం యింకా గోడల్ని పట్టుకుని తిరుగుతూనే వుంది.

"ఇక పోదాం లెండి" అని పొడుస్తోంది కమల.

అతని నివ్వెరపాటు చూసి ఆరోగ్యం నోటికి చీర అడ్డం వుంచుకుని నవ్వుతోంది.

తనకేమయినా అర్థమయిందా అని తనలో తాను వితర్కించుకున్నాడు వరద.

తనలో ఏదో సంఘర్షణ జరుగుతోంది. ఇంకా వింటూ పోతే కొంతసేపటికి అంతవరకూ పూర్తి రూపం పొందని ప్రశ్నలకు జవాబు దొరకవచ్చు. ప్రశ్నలు మిగిలాయా అర్థం తర్వాత వెదుక్కోవడం సులభం.

నిజానికి అతని ప్రశ్నలకు వివరణ బుద్ధుని స్థిమితంలో దొరుకుతోంది. "ఏమీ వద్దు నీకు. దేని గురించీ ఆలోచించకు. ఈ నిర్లిప్తతని అలవాటు చేసుకో. అలవాటు కాకపోయినా ఫరవాలేదు. కనీసం ప్రయత్నించు" అన్నట్లుంది బుద్ధుడి పెదాల్లో చిరునవ్వు.

"నువ్వు వెళ్తే వెళ్ళు. నేనిప్పుడప్పుడే కదలను" అన్నాడు వరద. వీలు చూసుకుని లేచిపోయింది కమల.

గోవర్ధనరావుగారు ఉపన్యాసం ముగించాక - క్షణకాలం నిశ్శబ్ధంగా ఉండి లేచి నిలబడ్డాడు. అందరూ కలిసి ఒకే కంఠంలో అస్పష్టంగా ఉచ్చరించారు.

బుద్ధం శరణం గచ్ఛామి

ధర్మం శరణం గచ్ఛామి

సంఘం శరణం గచ్ఛామి

**అంతా** ఒక్కరొక్కరే బయటికి వెళ్ళిపోయారు. ఆరోగ్యం నవ్వుతూ వరదరాజులు దగ్గరకు వచ్చింది. ''నిజం చెప్పవోయ్, ఇదంతా విన్న తర్వాత ఆయన గురించి నువ్వేమనుకున్నా?''

ప్రశ్నను మరిచిపోయి ఆమె నవ్వుని గమనిస్తున్నాడు వరద.

''పెద్ద యుద్ధం ముగిశాక యిళ్ళకు పోతున్నంత హాయిననుభవిస్తున్నారు, చూడు'' అంది.

గోవర్ధనరావుగారు ఆరోగ్యాన్ని వెదుక్కుంటూ వచ్చారు.

''ఇక్కడున్నావా నువ్వు? అరె వరదరాజులు కూడా వచ్చాడే అయితే విజ్ఞాన మందిరాన్ని పెంచాలి''

''మీ గురించి అతనేదో చెప్పబోతున్నాడు, వినండి'' అంటోంది ఆరోగ్యం.

''చెప్పవోయ్, నా ఆరోగ్యం గురించి చెప్తావా? నా ''ఆరోగ్యం'' గురించి చెప్తావా?''

ముగ్గురూ బయటికి వచ్చారు. గుర్రపుబండి ద్వారం దగ్గరికి వచ్చి ఆగింది. ఓ వందమందికి నమస్కారాలు చెప్పుకుని బండి యెక్కారు గోవర్ధనరావుగారు.

''మరీ పిచ్చిగా మాట్లాడారివాళ. ఇలా మరి మూడుసార్లు జరిగితే సభకి మనుషుల్ని పిల్చుకు రావలసి వస్తుంది'' అంది ఆరోగ్యం.

''వేదాంతం గురించి మాట్లాడటమంటే మరేమనుకున్నావ్? ఎవరికీ బోధపడకుండా మాట్లాడగలగడం ఓ అర్హత. ఏమంటావోయ్ వరదరాజులూ?'' అన్నారు గోవర్ధనరావుగారు నవ్వుతూ.

మరీ సన్నబడిన గొంతుతో అన్నాడు. ''నాకు కొంత అర్థమయింది. చాలా కొద్దిభాగం. కాని అర్థమయినదేమిటో బాగా అర్థం చేసుకోగలిగాను.''

గోవర్ధనరావుగారు పొంగిపోయారు. బండి అంతా కదిలేలాగ ఒక్క ఉదుటున యిటు తిరిగి ''విన్నావా యీ విషయం? ఒక్క వ్యక్తి కోసం ఎప్పుడూ మాట్లాడతాను నేను, సభ అంతట్లోనూ నా ఉపన్యాసం ఉపయోగాన్ని పొందే వ్యక్తి ఒక్కడు ఉండడా అని నా ఆశ. ఇదిగో ఇప్పుడు మన వరద ఉదాహరణ. బాగా అలిసిపోయాను. బీచివేపు ఓసారి బండి మళ్ళించవోయ్'' అన్నాడు గోవర్ధనరావుగారు బండివాడితో.

''ఇప్పుడా! యింత చలిలో!?'' అంది ఆరోగ్యం.

''చలేమిటి మనకి? మాట్లాడి అలసిపోయాను. విని మీరు అలిసిపోయారు. ఆ గుర్రానికి చలివేస్తుందేమో. బండిని పంపేద్దాం.''

''చూశావోయ్. నిజం చెప్పడం వల్ల నాకొచ్చిన నష్టం'' అంది ఆరోగ్యం వరదరాజులతో.

ఏదో ఆలోచిస్తున్నాడు వరదరాజులు.

నిజంగానే గోవర్ధనరావుగారి ఉపన్యాసం అతడ్ని ఉపశమనపరిచింది. కాని యింకా రెండు మూడు అనుమానాలు మిగిలిపోయాయి. వీలయితే త్వరగా తీర్చేసుకుని స్థిమితపడాలని పించింది వరదరాజులుకి. అందుకని బీచ్‌లో కూర్చోవడాన్ని లోపల్లోపల పూర్తిగా వాంఛించాడతను.

బండి దిగేసరికి చలి మరీ ఉధృతంగా ఉంది. తల చుట్టూ కొంగు కప్పుకుని వొళ్ళు దగ్గరగా ముడుచుకుంది ఆరోగ్యం. కోటు బిగించి మఫ్లరు చుట్టుకున్నారు గోవర్ధనరావుగారు. వరద మరీ వణుకుతూండడం చూసి "ఇప్పటి కుర్రాళ్ళ బలహీనతకి యిదో కారణమోయ్. యీ శాలువా వంటినిండా కప్పుకో" అని తీసి యిచ్చారు.

ఇసుక మరీ చల్లబడి జివ్వుమనిపిస్తోంది. దూరంగా వెలిగి ఆరిపోతున్న ఎర్రదీపం, ఉండుండి కళ్ళు చెదిరిస్తున్న లైట్‌హౌసు వెలుగూ తప్ప అంతా చీకటిగా ఉంది.

స్థిమితంగా మఠం వేసి "ఇప్పుడు చెప్పు నీకు బోధపడని విషయాలేవిటో?" అన్నారు.

"నయం. బోధపడిన విషయాలేవిటో చెప్పు చూద్దాం. అంటారేమోనని భయపడ్డాను"

"ఏం విన్నానో, ఏం బోధపరుచుకున్నానో గుర్తులేదు. కానీ ఒక్కటి మాత్రం నిజం. ఉపన్యాసం అంతటిలోనూ వేరువేరు విషయాలు కాక, అంతా కలిసి నాకేదో జవాబుని యిచ్చినట్టు అనిపించింది. బహుశా విషయం కాదు. విషయం విన్నానే ఆలోచన ఆ తృప్తి నిచ్చిందేమో!"

నవ్వారు గోవర్ధనరావుగారు "భలేవాడివే నువ్వు" అంటూ.

"దేని గురించీ ఆలోచన లేకుండానే నీకు నువ్వు సహాయం చేసుకోగలవని బుద్ధుడు హామీ యివ్వడం బావుంది. ఓ విధంగా తేలిక బ్రతుక్కి ఆస్కారం చూపించినట్టనిపించింది నాకు. "ఎందుకీ మనస్తాపం నాకు?" అని ఆలోచించే ముందు 'ఎందుకు నేను ఆలోచించాలి?' అన్న ప్రశ్న వేసుకుంటే సరిపోతుంది" - అన్నాడు వరద మళ్ళీ.

అంత చీకట్లోనూ ఉత్సాహంగా ముందుకి జరిగి వరదరాజులు భుజం తట్టారు గోవర్ధనరావుగారు. చీకట్లో కలిసిపోయిన ఆరోగ్యం వేపు చూస్తూ "చూశావా, చూశావా! మన వరదరాజులు ఎంత వాడయాడో నా ఉపన్యాసం ఇన్నాళ్ళకి మంచి శ్రోతని వెదుక్కొంది" అన్నాడు. వరద వేపు తిరిగి "నువ్వూహించింది నిజమేనోయ్! ఆలోచన తనని తాను తెల్సుకోలేదు. తనను దాటి మిగతా విషయాల్ని చూడనూ లేదు" అన్నారు.

కాస్సేపటికి మళ్ళీ అన్నాడు వరదరాజులు, "ఇప్పుడు నేర్చుకున్న విషయాలన్నీ పక్కకి ఉంచి ఇదివరకటి మనిషిగా అడుగుతాను. ఒకటి రెండు విషయాలు. నవ్వుకోకండి, మరీ చిన్నపిల్లాడి అనుమానాల్లాగు ఉంటాయేమో!"

"ఫర్వాలేదు కానియ్. యౌవనం తప్పటడుగు. వృద్ధాప్యం అవకాశం. నీకూ, నాకూ అట్టే తేడాలేదు."

"జీవితానికి ఓ ఆశయం అంటూ ఉండాలి. దాన్ని నమ్ముకు బ్రతకగలగాలి. నాకు వెయ్యి ఆశలున్నాయి. ప్రతి ఆశా వెయ్యి సందేహాల్ని యిస్తుంది. ఏదో మంచిపని, కొత్తపని చెయ్యాలి. అందుకు నా కలలు చాలు నాకు సహాయం చేయడానికి"

"అంత విశ్వాసం నీమీద నువ్వే ఉంచుకోగలగడం మంచిదే!"

నవ్వాడు వరద. "ఇక్కడే నా ఆలోచనలు పొందడంలేదు. ఇంతవరకూ బాగా వుంది సరే. నేను సరైన మార్గంలో నడుస్తున్నానా, లేదా యీ మార్గం నాదే అవునా, కాదా ఇలాంటి ఆలోచనలు నన్ను బాధపెట్తాయి. నామీద నాకే నమ్మకం తక్కువనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు. ***తనమీద తనకే నమ్మకం లేనివాడు జీవితాన్నీ, ప్రపంచాన్నీ, నమ్మబూనడంలో అర్ధంలేదు***"

ఆశ్చర్యపోయారు గోవర్ధనరావుగారు వరదరాజులు మనస్సులో కూడుకుంటున్న భావాల్ని గ్రహించి. ఇప్పుడిక యిన్నాళ్ళ తర్వాత మొదటిసారిగా వరదని సగం చూడగలిగారాయన.

మెల్లిగా మాట్లాడడం ప్రారంభించారు.

మనస్సు కొన్ని భావాలు సంయమనం. ఉద్రేకాలూ, కోరికలూ, సంశయం, సంతోషం, దుఃఖం, తాపం, ఉత్సాహం యివన్నిటికీ మూలం యిక్కడ. వీటి సంజనితానికి యిది కారణం అని చెప్పలేం. మనసు కలగజేసే యీ భావప్రేరణల రూపం యీ అనుభవం.

దీనంతటికీ చివర చేరలేని ఏ దూరతీరాల్లోనో ఒక గొప్ప శక్తి. మనం ఊహించలేని గొప్పశక్తి ఉన్నదని మాత్రం చెప్పారు. అని విశ్రాంతిగా గాలి పీల్చుకున్నారాయన. ఉన్నట్లుండి సముద్రానికి అటు చివర ఓడలో దీపాలు వెలిగాయి.

"అందువల్ల యీ ఆశయాలూ, కోరికలూ నీ ప్రయత్నం కాదు నువ్వు వాటివల్లనే, వాటి కోసమే తయారయావు. అందుకని వాటినుంచి దూరం కాలేకపోయినా, వాటి గురించి ఆలోచించనంతకాలం సంతోషంగా ఉంటావు. ఢిల్లీ విల్లింగ్టన్ హాస్పిటల్లో పేషెంటుగా చేరాను విదేశాల్నుంచి వస్తునే ఆపరేషన్ అవసరమై. ఎలా కల్సిందో ఆరోగ్యం నాకు కల్సింది. నాకు ఆమె అవసరమనిపించింది. తెచ్చుకున్నాను. అక్కడ్నుంచీ నిద్రపోవడం, భోజనం చేయడం అన్న రెండు ధ్యేయాలే నావిగా మిగిలాయి."

ఆరోగ్యం మాట్లాడుతుందేమోనని ఎదురుచూశాడు వరద, గోవర్ధనరావుగారూను. ఆమె మాట్లాడలేదు. లైట్‌హౌవుస్ వెలుగులో ఆమె నిద్రపోతున్న ముఖం కనిపించింది. బరువుగా తీస్తున్న ఊపిరి స్పష్టంగా తెలుస్తోంది.

"చూశావోయ్! మత మీమాంసల్లో ఉన్న సుగుణమే ఇది, నీకు అర్ధమయిందా! అంత సంతోషం ఎప్పుడూ ఉండదు. అర్ధం కాకపోయిందా అంత సుఖంగా ఎప్పుడూ నిద్రపట్టదు, చూడు దీన్ని" అని విరగబడి నవ్వారు.

ఆ నవ్వుకి తుళ్ళిపడి లేచింది ఆరోగ్యం "మీ చర్చ అయిపోయిందా?" అంటూ, "అయింది. ఇక పద" అని లేచారు గోవర్ధనరావుగారు.

"ఇంకెప్పుడూ మీతో ఆ విషయాల్ని కదపడు వరదరాజులు. చూడండి నా మాట అబద్ధమయితే" అంది ఆరోగ్యం.

వరద మాట్లాడలేదు.

"అతన్నిప్పుడు కదపకు. రేపు ఉదయానిక్కాని అతనికి స్పృహ కలగదు" అన్నారాయన నవ్వుతూ.

నిజమే ఆయనన్నది.

తమకి చెప్పకుండానే వెళ్ళిపోతున్న వరదరాజుల్ని చూసి నవ్వుతోంది ఆరోగ్యం ఎలక్ట్రిక్ దీపం వెలుగులో నిలబడి.

"ఏదన్నా నేర్చుకోవడానికి అదీ మొదటిమెట్టు. నిన్ను పెళ్ళి చేసుకోకముందు నేను అలాగే ఉండేవాణ్ణి" అని. ఆమె కోపంగా చూస్తే అటూ యిటూ చూసి, ఎవ్వరూ లేరని నిర్ధారణ చేసుకుని, ఆమెను దగ్గరగా తీసుకుని నడిచారు గోవర్ధనరావుగారు.

3

నీటిలో సగం మునిగి ఉక్కిరిబిక్కిరి అవుతున్న మనస్సు ఉబలాటంలాగ ఉంది ప్రకృతి. ఉబ్బసంలో బాధపడే రోగి నిట్టూర్పులాగ ఉండుండి గాలితెర వీస్తోంది. ఒకప్పుడు మంచి బ్రతుకును చూసి జారిపోయిన జీవితంలా వుంది ఆకాశం.

రాత్రి పన్నెండు.

నడుస్తున్నాడు వరదరాజులు. నడుస్తూనే ఉన్నాడు. ఆలోచనల్తో పాటు దూరం కూడా పెరుగుతున్నట్లుంది. గేటు తలుపు తెరుస్తూ ఇకనుంచి యింటికి ఆలస్యంగా రాకూడదని వెయ్యోసారి అనుకున్నాడు.

చలి మరీ విపరీతమయి 'రాత్రి' మీద కసి తీర్చుకున్నట్టుంది.

నడవలో దీపం వెలుగుతూనే ఉంది.

సగం వెలుగులో సగమే కనిపిస్తోంది గన్నేరు చెట్టు. కన్పించినంత భాగం పువ్వుల్తో పిటపిటలాడుతూ. యౌవన మదంలో ఒళ్ళు తెలీని ప్రౌఢనగ్నత్వాన్ని గుర్తుతెస్తోంది.

ముందుకి అడుగువేస్తే కావలించుకున్నట్టు బంతిమొక్క కొమ్మలు నడుంకి చుట్టుకున్నాయి. తీరులేకుండా గుబురుగా పెరిగిన మొక్కల్ని చూసి 'వీటిని అదుపులో పెట్టాలి' అనుకున్నాడు. వయస్సు తెచ్చిన వయ్యారంతో వొళ్ళు విరుచుకుని పువ్వుల్తో వంకాయి మొక్కలు. డిసెంబరు పువ్వులు మరీ పెద్దవయి చలికి వణుకుతున్నాయి.

వసారాలో రెండు మంచాల్ని చూసి విస్తుపోయాడు వరదరాజులు. చావిడికి దూరంగా చెట్టు దగ్గర మంచం మీద ఏవరో పడుకున్నారు. చీకట్లో మనిషి పోలిక గుర్తించలేక రామ్మూర్తి కాబోలునని ఊరుకున్నాడు.

చూరుకింద ఏటవాలుగా మంచం వేసుకుని పడుకుంది గులాబి. కన్పించీ కనిపించని చీకటిలో పాములా మెలికలు తిరిగిన ఆమె వంటిమీద దుప్పటి ఎరుపు కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. మల్లెపువ్వులు చేతికింద నలిగి, కిందకి వేలాడుతూ దగ్గరికి వెళ్ళి చెయ్యి తప్పించి వాటిని తీసుకోబోతే బెలూచిస్తాన్ లవండర్, స్వస్తిక్ హెయిరాయిల్ వాసన గుప్పుమంది.

ఎవర్నీ లేపడానికి మనస్కరించక వాలుకుర్చీ తెచ్చుకుని వాకిట్లో వేసుకున్నాడు.

చూరుకింద కాస్త వెచ్చగా వుంది. గాలి వాలుపట్టి రానురానూ మెత్తబడింది. ప్రయాణం ఆపుకుని దిక్కులు చూస్తున్నాయి మేఘాలు.

గోవర్ధనరావుగారి మాటలూ, బుద్ధుడి విగ్రహం అతని కళ్ళముందు నుంచి ఎంతకీ తప్పుకోవడంలేదు. దాని గురించే ఆలోచిస్తున్నాడు.

లేచేసరికి కుర్చీ కిర్రుమంది. బంతిపూల మధ్య నుంచి రెక్కతాడించి ఏదో పిట్ట శబ్దం చేస్తూ లేచిపోయింది. చెట్టుకింద మంచం మీది వ్యక్తి వత్తిగిలి నిద్రపోయారు.

తుళ్ళిపడ్డాడు వరదరాజులు.

గులాబిని లేపడానికని చూరుకిందకి వచ్చాడు. సగం దుప్పటి క్రిందకి జారిపోవడంతో పిల్లిలా ముడుచుకుని పడుకుందామె. జుత్తుపాయలుగా విడి నల్లటి పట్టుదారం జల్లినట్టు చెదిరిపోయింది. దుప్పటి నేలమీద పడింది.

"గులాబీ!" అని తట్టిలేపాడు.

ఇటు తిరిగి ముడుచుకుంది.

ఎక్కడో పెద్ద యంత్రం కదలడం ఆరంభించి ఒకటే గోల చేస్తోంది. ఆ శబ్దం మధ్య తన మాట చచ్చిపోయింది.

"గులాబీ!" అని కదిపాడు మళ్ళీ.

ఎంతకీ లేవకపోయేసరికి "అబ్బ! మరీ యింత మత్తేవిటి?" అని విసుక్కున్నాడు.

మరోసారి ప్రయత్నించి, గుంజి, చేతిని కదిపి లేపబోయాడు. తుళ్ళిపడి లేవడంతో చెక్కిలికి నుదురు కొట్టుకుని మూలిగిందామె. నుదురుకి దెబ్బ తగలడంతో తలపట్టుకుని నిలబడిపోయాడు వరద.

కాని ఒక్కటి మాత్రం తెలిసింది. ఆ లవండరు పరిమళం ఆ ముఖం గులాబి కానట్టు చెప్తున్నాయి.

మొదటిసారి భయమేసింది. ఆమె చెక్కిలికి నుదురు తాకినచోట ఏదో తెలీని పరిమళం పట్టుకుంది. తుడుచుకోబోతే చేతికంటింది. సంశయంతో వణికి బంతిపువ్వులు గుబురు దగ్గరికి వచ్చి నిలబడ్డాడు.

చలిని మరిచిపోయిన నరాలన్నీ మళ్ళీ పీకుతున్నాయి. ఏదో తెలీని దుర్గంధంలో పెనిగే అలసటను చూపుతున్నాయి. బంతి పువ్వులన్నీ వరసకట్టి పేర్చునట్టున్నాయి.

ఆ మంచం మీద ఎవరా అని ఆలోచిస్తున్నాడు. బెలూచిస్తాన్ లవండరు ఇంకా ముఖాన్ని వదలడం లేదు. నుదుటికి తగిలే గాలికి పల్చబడి అంతకంతకూ సువాసన తగ్గవలసిందిపోయి ఉన్నట్లుండి గుప్పుమంది. చప్పుడయ్యేసరికి వెనక్కి తిరిగి తుళ్ళిపడ్డాడు. మరీ చీకట్లో ఎవరో నిలబడ్డారు. దుప్పటి ఎరుపు మాత్రం లీలగా తెలుస్తోంది.

"గులాబీ!" అని తన వణుకుపాటు తనకే వెగటుగా తోచి సిగ్గుపడ్డాడు.

ఇంట్లోకి పోవడానికి సిద్ధపడింది డాలీ. దారికడ్డంగా నిలబడ్డ వరదని తప్పించుకోలేక ఆగిపోయింది. ఆ తత్తరపాటులో వంటిచుట్టూ తిరిగిన దుప్పటి వదులయి జారింది. ఆ వంటి తెల్లదనం, మరీ ఎత్తరి కాని విగ్రహాన్ని పోలికపట్టాడు వరద - డాలీ.

నిర్ఘాంతపోయాడు.

చివరిచూపు చూడబోయే ముందు చేసే ప్రతాపాన్ని చేస్తోంది దీపం. ఉన్నట్లుండి పెద్దదయింది. స్థంభం నీడలో డాలీ సగం ముఖం స్పష్టమయింది.

"డాలీ!" అంటే, భయంతో తలెత్తింది.

అది భయమా? ఏమో!

అంత చీకట్లోనూ అతని కళ్ళు చూడగలిగిందామె. ఆ కళ్ళల్లో విస్మయం కంటే ఆకలి ఆమె మనస్సుని ఆకట్టింది. నీటిలో కొట్టుకుపోతున్న వ్యక్తికి ఆధారం దొరికినట్లయింది.

దొంగ కాలికింద పురుగులాగ రాత్రి చచ్చినట్టు పడి వుంది. పాత జ్ఞాపకాల్ని పుండులా రేపే నిశ్శబ్దం.

అతనింకా అలా చూస్తూనే వున్నాడు. పుక్కిటపట్టిన అమృతాన్ని మింగాలో, వదిలేయాలో తెలియడంలేదు.

వికీర్ణమయి, ఏదో మూల వెలిగే సృష్టిశక్తి వేయినాలుకల్తో లేచిన బలవత్తరమయిన క్షణంలో ఎవరో వెనకనుంచి త్రోసినట్టు అతని చేతుల్లో పడింది డాలీ.

ఊహించని పరిస్థితుల మధ్య, ఆ యౌవనపు బరువులో మొహం తిరిగింది వరదకి. చీకట్లో ఆమె పెదాలు అతని ముఖాన్ని వెదుక్కుంటున్నాయి. ఆ పెదాల తడి అతనికి మైకం కమ్మించింది. ఆ జుత్తు పరిమళంలో, ఆ సౌందర్యపు కౌగిలింతలో, ఆ మత్తులో వాతావరణమంతా బరువెక్కి అతనితోపాటు ఊగింది.

నరాలు సడలిన పరిష్వంగపు తీయదనంలో యిద్దరూ తూలి బంతిచెట్ల మీద పడ్డారు. పువ్వుల చల్లదనం నరాల్ని మరీ జివ్వుమనిపించింది.

అంతటా నిశ్శబ్దం.

అన్నిటినీ భరించి, ఓర్పుతో తనలో యిముడ్చుకోగల అర్థంలేని రాత్రి.

వదలని కోరికలాగ పెనవేసుకుంది డాలీ. ఆ వేడినీ, ఆ వంటివంపుల బరువునీ తట్టుకోలేక తూలిపోయాడు వరద. ఆమె గుండె కదలిక తన గుండెల్లోకి ప్రాకింది. ఒకే వ్యక్తిగా, ఒకే రకంగా ఆ అందాన్ని తనలో కలిపేసుకోవాలన్న దుగ్ధతో బలంగా హత్తుకున్నాడతను.

కోరిక చేతుల్లో యౌవనం నలిగిపోయింది.

కొమ్మలన్నీ సగం విరిగి మీదకి వాలిన సృష్టిశక్తుల మొదటి పెనుగులాటను ప్రపంచంనుంచి దాచాయి.

స్త్రీలో అంత కోరికా, వాంఛా ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు వరద. తన శరీరాన్ని తాకిన మొదటి స్త్రీ ఆమె. ఆ ఆవేశం అంత కసిగా, అంత స్వచ్ఛంగా, అంత మత్తుగా..

రొమ్ముల్ని పట్టిన బిగుతయిన కమీజు చినిగి జారిపోయింది.

రక్తం నీరయి అనుభూతితో ఏకమయింది. తలంతా ఆవేశంలో బరువెక్కింది. శరీరంలో ప్రతి చిన్న రక్తనాళం కదిలి బాధతో అరిచింది. కోరికతో లుమ్మతిరిగి అవయవాలు సొమ్మసిల్లాయి. ఆ చేతుల వెచ్చదనంలో, ఆ మంచుముద్ద వేడిలో మూర్ఛపోయి అనుభవంతో ఏకమయిపోయాడు.

జీవితంలో మొదటి ఆవేశంతో, అవయవాల మొదటి తిరుగుబాటుతో, కీళ్ళన్నీ సడలిన, రెచ్చిన మొదటి ఆకలితో వణికి, పల్చబడి, రేకయి, నీరసించి కోరిక కౌగిటిలో నిద్రపోయింది డాలీ.

ఆకులన్నీ సిగ్గుపడి మెల్లగా కదిలాయి. ప్రకృతంతా నిద్ర మేల్కొని దొంగతనంగా చోద్యం చూస్తోంది.

ఆమె వెచ్చని స్పర్శ అతన్ని కాల్చింది. చెమటతో మెడ తడిసి జారింది. జుత్తంతా పాములాగ చేతుల్ని చుట్టింది. బలంగా కాళ్ళని పట్టుకున్న సెల్వార్ మరీ బిగువయితొడల్ని నొక్కింది. నడుం క్రింద చల్లదనం అతని వొళ్ళంతా తిమ్మిరిలా ప్రాకింది. ఆశ బంధంలో యౌవనం మూర్ఛపోయింది.

అనుభవంతో కళ్ళు సొమ్మసిల్లాయి. తెలీని మత్తులో, పులకరింతలో పువ్వులా రెపరెపలాడింది డాలీ. ఊహించని ఆనందం కోసం తపన పడి, తెల్సుకుని మదనపడి నీరసంతో, నిస్పృహతో మూర్ఛపోయింది.

ఏదో పురుగు నుదుటిని కాటు వేసింది. జివ్వుమన్న నరాలన్నీ కూడుకున్నాయి. మీద వేసుకున్న బరువుని బలంగా త్రోసేసింది. ఒక్కక్షణంలో భయం, పిరికితనం పెనవేసుకున్నాయి. అనుభవాన్ని జ్ఞాపకం మళ్ళీ మాములు ప్రపంచంలో తోసేసింది. తనకి వేరే శరీరమంటూ మిగలని వరద ఆకులమధ్య ఉండిపోయాడు.

నేలమీది దుప్పటి తీసుకొనబోయి నీరసంగా కూలబడి తలని చేతుల్లో పట్టుకుని ఉండిపోయింది డాలీ.

గులాబి ఆవులించి నిండుగా ముసుగు కప్పుకుని వత్తిగిలింది.

భయమేసి ఏడుపొచ్చింది వరదకి. డాలీ ఏడుస్తోందా అనుకున్నాడు. ఏడిస్తే?

నరాలన్నీ వణికాయి. తల తిరుగుతోంది. పక్కకి తూలిపోతానా అనుకున్నాడు.

ఆమె దగ్గరనుంచి సన్నగా రొణగొణ ధ్వనిలాగ శబ్దం వస్తోంది. చటుక్కున వెళ్ళి ఆమె దగ్గిర చతికిలబడ్డాడు. నిండు ఊపిరి తెలుస్తూనే వుంది. ఆ సగం వెలుగులో ఆమె తల రెండు చేతుల్తో ఎత్తాడు. వణికే చేతుల మధ్య ముఖం బరువయింది.

వేసంగి ఎండలో ఒసిలిన పువ్వు రేకులా కళ్ళు వాల్చుకుని కనిపించింది డాలీ. జుత్తు మధ్య తడిగా మెరుస్తున్న తెల్లటి ముఖం పరిపూర్ణత పూరించుకున్న స్త్రీత్వాన్ని చెప్తోంది.

డాలీ ఏడవడం లేదని తెలిసి లేచిపోయాడు స్థిమితంతో.

చూరుకిందికి వచ్చి మంచం మీద కూచున్నాడు.

ముద్దుగానే వుంది డాలీ.

వాచీ మూడుకొట్టి ఊరుకుంది ఎక్కడో.

పూర్తి చీకట్లు మునిగిపోయి అనుమానం ఆకారం దాల్చినట్లు నల్లగా వుంది గన్నేరు చెట్టు.

పద్మనాభస్వామి ఆలయంలో ఏవో పిట్టలు కదిలి గంటలు మ్రోగించాయి.

బద్ధకంగా వొళ్ళు విరుచుకుని ఏదో గొణుగుతోంది గులాబి. వంటికిందపడి వంగిన కొమ్మలన్నీ దార్లు వెదుక్కుని లేవడానికి ప్రయత్నిస్తున్నాయి.

క్రింద పెదవి పగిలి రక్తం కారుతోంది. మీది పెదవితో నొక్కిపట్టి వెనక్కి చేరబడ్డాడు వరదరాజులు. దాహంతో నాలిక పిడచకట్టోంది. లేచి నీటికోసం వెదుక్కున్నాడు.

ఇంకా ఆమె అక్కడే కూర్చుని వుంది. పల్చగా వంటిని పట్టుకున్న లాల్చీ చినిగింది. వేడితో శరీరాన్ని గుప్పుమన్న చెమట క్రమంగా చల్లబడి చలిపుట్టిస్తోంది.

ఇక యీ ఆలోచనల మధ్య కూచోలేక బయటికి వచ్చేశాడు.

అప్పుడు నాలుగు.

బీచికి చేరాక, కుక్క దాలిగుంటని తవ్వుకున్నట్టు మెత్తటి యిసకలో చిన్నగోతిని చేసుకుని వొళ్ళు చేరేసి "ఈ విషయానికెందుకింత బాధపడాలా?" అనుకున్నాడు మొదటిసారి.

అంతా యాదృచ్ఛికం.

కొన్ని గంటల క్రితం గోవర్ధనరావుగారితో వచ్చినప్పుడు కనిపించిన ఎర్రటి దీపం, ఓడ యిప్పుడు లేవు. చీకటి సముద్రపు హోరుతో కలిసి రోదిస్తున్నట్టుంది.

ఎప్పుడయితే సంశయానికి ముగింపు కనిపించిందో నిద్ర తన అవకాశాన్ని చూసుకుంది. జీవితంలో చాలా దుఃఖాల్లో, చాలాసార్లు దూరంగా తీసుకుపోగల నిద్ర అతనికా క్షణంలో సాయపడింది. మరో క్షణంలో ఆ హోరుమధ్యన, వేదాంతాన్ని విని తెచ్చుకున్న స్థిమితాన్ని వదిలేసుకుని తిరిగివచ్చిన వరద, వొళ్ళు మరిచి నిద్రపోయాడు.

మరో క్షణానికి ఓ కుక్క వెదుక్కుంటూ వచ్చి అతని పక్క గొయ్యి తవ్వుకుని పడుకుంది.

## 4

చురుక్కుమనే సూర్యుడి మొదటి కిరణం తాకేసరికి తుళ్ళిపడి లేచి కూచున్నాడు. వెలుగులో సముద్రమంతా బంగారంలాగా మెరుస్తోంది. కొత్తవెలుగు చూడలేక కళ్ళు మూసుకున్నాడు.

రాత్రి సంఘటనలన్నీ పాతజీవితం జ్ఞాపకాల్లాగు తోచాయి. ఒళ్ళంతా బరువెక్కి పుండులాగ వుంది. పగిలిన కిందిపెదవీ, చినిగిన లాల్చీ రాత్రి ఘటనకు సాక్ష్యంగా మిగిలాయి.

కుక్క యింకా నిద్రపోతూ వుంది.

లేచి వచ్చేశాడు వరదరాజులు. పంచె కాళ్ళ మధ్య పడుతూ చికాకు కలిగిస్తోంది. తలంతా బరువెక్కి దిమ్మెసు కొట్టినట్టు బండలాగ వుంది. వీలయితే దాన్ని తీసేసి పక్కన పారేసి కాస్సేపు స్థిమితపడాలనిపిస్తోంది.

సగం దూరమన్నా నడవకముందే ఎవరో కుర్రాడు వెనకనుంచి అరుస్తూ పరిగెత్తుకు వచ్చాడు. నివ్వెరపోయాడు వరద.

"అక్కడ యింట్లో మిమ్మల్ని పిలుస్తున్నారండి"

"నన్నా!"

"అవును, మిమ్మల్నే"

డాబామీద ఎవరో నిలబడ్డట్లు గుర్తించాడు. వెనకనుంచి పడే సూర్యరశ్మి వెలుగులో ఓ నీడలా తప్ప యింకేమీ కనిపించడంలేదు. ఎప్పుడో చూసిన యిల్లులా వుంది. ఇంకా తటపటాయించే సమయంలో గుమ్మం దగ్గర నీలవేణి కనిపించింది. మాట్లాడకుండా వెనక్కి వచ్చాడు వరద.

ఇన్నాళ్ళయి యీ యింటిని ఎందుకు మర్చిపోయానా అనుకున్నాడు మనసులో. అక్కడి నిశ్శబ్దం, చల్లదనం పోయిన జనాన్ని తెచ్చి యిచ్చినట్లనిపించింది.

నీలవేణి తలుపుకు చేరబడి తడి జుత్తును తుడుచుకుంటోంది. వరదరాజులు లోపలికి రాగానే "ఉదయమే ఎక్కడికి బయల్దేరారు?" అంది.

తన ఆకారాన్ని చూసి సిగ్గుపడ్డాడు వరద. చినిగిన లాల్చీ, పీక్కుపోయిన ముఖం. యింకా భయంపోని కళ్ళూ ఎంత వేగంగా వెళ్ళిపోతే అంత మంచిదనిపించింది.

ఎర్రటి కెంపుచీర కట్టుకుని నిలబడ్డది నీలవేణి. స్వచ్ఛంగా, చాలా స్వచ్ఛంగా పవిత్రతకి చిహ్నంలాగ వుంది.

అనుకోకుండా దుఃఖం, ఉదాసీనత తోసుకొచ్చింది వరదకి.

ఆమె ప్రశ్న మరిచిపోయాడు. నీలవేణి తన దగ్గర ఎన్నో నేర్చుకుని - స్థాయిగా బ్రతకడం, నిశ్చలంగా వుండటం - యివన్నీ తీసుకువెళ్ళిపోయినట్టనిపించింది.

**అవన్నీ లేని** బలహీనతల పోగుగా మిగిలాడతను.

"నువ్వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ నా మనస్సేం బాగుండడం లేదు నీలవేణీ!" అన్నాడు మెల్లగా.

ఆమె దిమ్మెరపోయింది. కూర్చోబోతున్నదల్లా ఆగి అతని ముఖంలోకి విచిత్రంగా చూసింది.

"ఆయన మీతో చెప్తానన్నారు" వినిపించీ వినిపించనట్లు గొణిగింది.

తర్వాత తన ప్రశ్న తనకే వెగటుగా కనిపించి నవ్వేశాడు వరద. లేచి చేతులు ఆడిస్తూ గోడల చుట్టూ తిరిగాడు.

గదికి మధ్యగా బల్లదగ్గర నిలబడిపోయింది నీలవేణి.

"ఏరీ? పీతాంబరం?"

"ఉదయాన్నే బీచికి వెళ్తారాయన, వచ్చేవేళయింది."

కిటికీలోంచి వెనకతోట కనిపిస్తోంది.

టేబులు మీద ఉన్న అగరొత్తుల వాసన గదంతా సుళ్ళు తిరిగి మత్తు కలిగిస్తోంది.

"ఇక్కడెలా వుంది నీకు?"

జవాబు రాకపోయేసరికి వెనక్కి తిరిగాడు. బల్లమీద ముద్దలా కూచుని జడ అల్లుకుంటోంది నీలవేణి.

ఆమెను చూడకుండా తప్పించుకోవాలని కళ్ళు చేస్తున్న ప్రయత్నాలన్నీ ముగింపుకు వచ్చాయి.

కోరికతో పెనుగులాడుతున్నట్లున్న శరీరం బిగువూ, దేనికోసమో వెదుకుతున్నట్లున్న కళ్ళూ, మాట్లాడే ముందు తడిచేసుకునే చిన్ననోరూ, ఇప్పుడిప్పుడే ఎర్రదనాన్ని కూడదీసుకుంటున్న పల్చటి చెక్కిళ్ళూ, ఎర్రటి బొట్టూ, మెరుస్తున్న లోతుపడిన నుదురూ, చీరకి పైన కనిపించే శరీరం మెరుపు, స్థిరమైన ఆకారాన్ని కూడదీసుకోలేక క్రిందకి లాగుతున్నట్టున్న రొమ్ములూ..

అందంలో తలతిరిగింది వరదకి.

రుచి తెలిసిన పులి ఎగిరిపడ్డట్టు రక్తమంతా కదిలింది. కళ్ళు పట్టుగా ఎరుపెక్కాయి. రాత్రి ఉప్పెన మళ్ళీ శరీరాన్ని కదిపింది. పాత అనుభవం క్రమంగా మనస్సును వివశపర్చసాగింది. అలానే ఉండిపోయాడు.

అతని స్తబ్దత చూసి విస్తుపోయింది నీలవేణి. అతని కళ్ళు చూసి భయపడింది.

"అలా చూస్తున్నారేం?"

తుళ్ళిపడ్డాడు వరదరాజులు. వెనకపాటునే తలమీద తీరని అఘాతం కలిగించినప్పటి బాధ ఒళ్ళంతా జివ్వుమనిపించింది.

"మీరు బాగా అలిసిపోయినట్లున్నారు ఉండండి కాఫీ తెస్తాను" అని లేవబోయింది నీలవేణి.

ఏహ్యంతో తనమీద తనకే జుగుప్సతో, సిగ్గుతో తలయెత్తలేక పోయాడు వరద. నీలవేణి కంఠంలో భయం శరీరాన్ని కాలుస్తోంది. మరి కాస్సేపు నిలబడితే ఈ విభిన్న శక్తుల మధ్య భోరు ఏడ్పు వస్తుందేమోననిపించింది.

"వస్తాను నీలవేణీ. మనస్సేం బాగుండలేదు" అని తొందరగా నడిచి బయటికి వచ్చేశాడు.

ఆమె ఏదో చెప్పబోతోంది.

పీతాంబరం దూరం నుంచి అరుస్తున్నాడు.

అయినా అదేం పట్టలేదు వరదకి.

దైవోపహతుడిలాగా ఏదో శక్తి అతడ్ని వెనకనుంచి తోసేస్తున్నట్లు ముందుకి పరుగెత్తిపోయాడు వరద.

పూర్తిగా అలిసిపోయి, వంటిమీద స్పృహలేనట్లు వచ్చిన అన్నయ్యని చూసి బెదిరిపోయింది గులాబి.

"అదేం? అలాగున్నావేం అన్నయ్యా?"

మాట్లాడలేదతను.

కాఫీ యిస్తూ అంది మెల్లగా "నిన్నరాత్రి రాలేదేం అన్నయ్యా, నాకు భలే భయమేసింది"

ఏం చెప్పడానికీ తోచక తికమకపడ్డాడు, ఎండవాలులో పొగపాకుతోంది మీదికి.

"రామ్మూర్తిగారు రాలేదా నిన్న?"

"ఉహూఁ. మొన్న రాత్రి చలిలో పడుకునేసరికి జ్వరం వచ్చిందో యేమో?"

ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"డాలీ వచ్చి పడుకుంది"

"ఆమెను తీసుకు రాకుండా ఉండవలసింది"

"ఏం?"

తువాలు తీసుకుని స్నానానికి లేచాడు.

"ఉదయం లేచేసరికి తలుపు తీసి ఉందన్నయ్యా. బంతిపువ్వులన్నీ పాడుచేశాయి పశువులొచ్చి"

వేన్నీళ్ళు పోసుకున్నా వొళ్ళంతా చల్లగానే ఉన్నట్లు తోచింది వరదకి.

"ఇంకెప్పుడూ రాత్రి రావడం మానెయ్యకు నువ్వు"

వొళ్ళు తుడుచుకుని లోపలికి వస్తూంటే పక్క యింట్లో ఎవరో డాక్టరుతో మాట్లాడుతున్నట్లనిపించింది వరదకి.

ఏమిటని అడిగితే -

"రాత్రి చలిలో పడుకోవడం వల్ల డాలీకి జ్వరం వచ్చిందట. అంతమాత్రాన జ్వరం వస్తుందన్నయ్యా ఎక్కడయినా?" అంది

వరద గుండె ఝల్లుమంది.

**7**

"ఏమండోయ్ ప్రపంచమంతా తల్లక్రిందులయిపోతోంది. మీరు విన్నారో లేదో ఉత్తరధృవం, దక్షిణధృవం భుజం మీద చెయ్యేసి హనీమూన్‌కి తీసుకుపోయింది అండమాన్స్‌కి. ఉత్తరధృవం సెక్సును నిర్ణయించలేక ఛస్తున్నారు శాస్త్రజ్ఞులు. అరే! భోజనం వేళకి వచ్చేశానన్నమాటే" అంటూ ఏపిల్ పళ్ళ బుట్టతో వచ్చాడు పీతాంబరం ఎనిమిదికి.

తుఫానులా వచ్చిపడిన అతడ్ని చూసి నవ్వుకొంది గులాబి. కొంగు బొడ్డులోంచి తప్పించుకుని దూరంగా పోయి నిలబడింది. పీతాంబరం పీటలాక్కుని చతికిలబడ్డాడు.

"ఏవండీ బావగారూ! బంధుత్వం కలిపేస్తున్నాను ఏమీ అనుకోకండి. బంధుత్వం కలపడం అంటే 'మర్యాద'కి గాగుల్స్ తొడిగి 'మంచితనం' వెనక అత్తవారింటికి పంపడమంటాడు మా స్రరియలిస్టు స్నేహితుడొకడు, కమింగ్ టు ది పాయింట్ ప్రొద్దుట కాశ్మీర్ కాందిశీకుడిలాగా అలా ఉడాయించారేం?" నీలవేణి ఒకటే నవ్వు.

వరద మాట్లాడలేకపోయాడు. వెక్కిళ్ళతో మంచినీళ్ళగ్లాస్ ఎత్తుకోబోయి వణుకుదలతో చేయి జారుతుందేమోనని భయపడి మానేశాడు.

భుజం మీద చిరుగును కప్పుకోవడం ఎలాగో తెలీక కొంగు నడుం మీంచి లాక్కుంది గులాబి. జాకెట్టు కింద వొళ్ళు తెల్లబోయి పీతాంబరం కళ్ళదగ్గర ఆగింది.

"నీలవేణిని చూసొచ్చావా అన్నయ్యా? మరి నాకు చెప్పలేదేం?"

"అసలీ రచయితల్లో వున్న బలహీనత యిదేనండి. ఏదో గొప్ప పని చెయ్యబోయి ఏమీ చెయ్యలేక జ్ఞానాన్ని లోకానికమ్మేసుకుని చేతులు నరుక్కుని కూచుంటారు. భోజనం కానివ్వండి సార్? మీ పని పూర్తయ్యేవరకూ నేనిలా మాట్లాడుతూనే వుంటాను."

"లేచి వాకిట్లోకి వచ్చాక నోటీసివ్వకుండా నీలవేణిని తీసుకుపోతే మీరు నా గురించి ఏమనుకున్నారో చెప్పండి ముందు. అక్కడ ప్రపంచమంతా తల్లక్రిందులు చేస్తోంది ఆవిడగారు"

"అనుకోడానికేముంది? మొన్న మీరు చెప్పారుగా?"

"మీరు ప్రొద్దుట మాట్లాడకుండా వెళ్ళిపోయారని భాధపడుతోంది నీలవేణి. వెళ్ళి మా స్నేహం రెన్యూల్ చేయించుకు వస్తేగానీ యింటికి రానిచ్చేట్టు లేదని యిలా వచ్చాను. అలా పారిపోయారేం ఉదయం? వెనుక నేను పిలుస్తూనే వున్నాను"

నవ్వాడు వరద.

"ఉదయం మనస్సేం బాగుండలేదు. అందుకని"

"డామ్ డర్టీ మనస్సు. యీ మనస్సు అన్నది దేవుడు మనలో వదిలేసి పోయిన పెద్ద బలహీనత. ఒక్కొక్కప్పుడు ఇది తనని తానే నిర్వచించుకోలేదు. దీన్ని నమ్ముకుని ఆడది ప్రేమ అనే పెద్ద గొయ్యి తవ్వుకుంటుంది. మొగాడు వెళ్ళి ఆ గోతిలో పడ్తాడు. సరి, నామీద కోపం లేదని మరోసారి చెప్పండి చాలు."

చాలాసేపు ఆలోచించాడు వరద.

"మీలాంటి తమ్ముడుంటే బావుండును నాకు. చాలా చికాకుల్నుంచి మీలో విశ్రాంతిని వెదుక్కున్నాన్నేను."

నిజంగా కదిలిపోయాడు పీతాంబరం.

"భేష్! వరూధిని ప్రవరాఖ్యుడ్యుతో ఈ టోన్‌లోనే మాట్లాడిందట. నేను మనుచరిత్ర చదవలేదు. మరి నేవెళ్ళేదా. మీ కోపానికి కవరింగ్ డిన్నర్ రేపు ఏర్పాటు చేశాం. మనస్సుని మీ గన్నేరు చెట్టుమీద వదిలేసి గులాబిని వెంటబెట్టుకు రమ్మని ఆవిడ ఆజ్ఞ మరి నాకు సెలవా? "

లేవబోయేసరికి గేటు తోసుకువచ్చాడు రవణమూర్తి. తెల్లటి షరాయీ, ఉల్లిపొరలాంటి లాల్చీ, సన్నగా రేకులా ఉన్న అతడ్ని చూసి విస్తుపోయాడు పీతాంబరం.

టోపీ సూటుతో ఉన్న పీతాంబరాన్ని చూసి బిత్తరపోయాడు రవణ. చెట్టుదగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

కుర్చీ వెనక్కి చేరబడినవాడల్లా వరదరాజులు వంగి "ఈయన నా మిత్రుడు" అని పరిచయం చేశాడు.

"రైట్. మీ స్నేహితులందర్నీ నా స్నేహితులుగా అబ్డీలీ చేసుకునేందుకు నాకభ్యంతరంలేదు. రండిసార్ ఈ కుర్చీలోకి. నా పేరు పీతాంబరం. మొదట మెకానికల్ సూపర్ వైజర్ కాబోయి, కాలేక యిప్పుడు పొదుపు ఉద్యమం గురించి స్టడీ చేస్తున్నాను. అదీ మన ఎడ్రసు. కూచోండి."

టోపీ తీసి దులిపి చెట్టుకు తగిలించాడు పీతాంబరం.

"సుజీకి ఎలా వుంది?"

"ఇంకా నీరసం తగ్గలేదు. వారానికి రెండుసార్లయినా ఫిట్స్ వస్తున్నాయి"

"ఫిట్సేమిటి సార్?"

"ఆయన చెల్లెలు హాస్పిటల్లో ఉందండి. ఫిట్సు వస్తున్నాయి. మొన్న చేర్పించాడు."

"అరెరే! పోనీ బెంగుళూరులో ట్రై చెయ్యలేకపోయారా?" ఇద్దరూ మాట్లాడకపోవడం చూసి నవ్వేసి "సరి. అంతా నా దృష్ట్యా ఆలోచించేస్తున్నాను. మరి నే వెళ్తా సార్? రేపు మీ గురించి ఎదురుచూసేదా?"

"వస్తాను రేపు"

"రైటో, నమస్కారం రవణమూర్తి సాబ్! ఓసారి మీతో హాస్పిటల్‌కు వస్తాను" అనేసి వెళ్ళిపోయాడు.

ఎంతోసేపటికి "ఇప్పుడేం చేస్తా?" అని అడిగితే ఎటో చూస్తూ తుళ్ళిపడ్డాడు.

"ఎవరతను?"

"పీతాంబరం మంచివాడు, మనస్సులో ఏం ఉండదు . నీలవేణి తెలీదూ?"

"పోనీలే ఆ విషయం"

ఊరుకున్నాడు వరద.

అవసరాల్ని చూసుకోలేక అనవసరమైనవన్నీ భుజానికెత్తుకుని అంతా బెడద చేసుకున్న వాళ్ళ గురించి ఆలోచిస్తున్నాడతను. విపర్యయానికి రవణ నిదర్శనం. కానీ నీలవేణి మీద అతని అలక్ష్యం గొప్పది. నిజంగా అది అతని అలక్ష్యమే అయితే తనకంటే చాలా గొప్పవాడు రవణ.

రవణమూర్తి వెళ్ళేసరికి తొమ్మిది దాటింది. గదిలో మంచానికి అడ్డంగా పడుకుని నిద్రపోతోంది గులాబి.

దీపాన్ని తీసుకుని లోపలికి రాబోయేసరికి రామ్మూర్తిగారు నల్లటి శాలువా వొళ్ళంతా తిప్పుకువచ్చారు నైట్ డ్యూటీ కోసం.

తాళాలు యిస్తూ "ఎలా వుంది వొంట్లో?" అంటే, నవ్వి వెళ్ళిపోయాడాయన.

లేపేసి గంటసేపటికి బద్ధకంగా వొళ్ళు విరుచుకుని లేచింది గులాబి.

"రామ్మూర్తిగారు వచ్చారు. జ్వరం ఏమీలేదట"

"ఏరీ?" అంది కళ్ళు పెద్దవి చేసి.

"తాళాలు తీసుకుని వెళ్ళిపోయారు"

క్షణం ఆగి "ఛీ! పాడు నిద్ర" విసుక్కుంటూ పరుపు పట్టుకుని వాకిట్లోకి వచ్చింది.

కిటికీలోంచి ఒకే నక్షత్రం చీకటి ఆకాశం మీద కనిపిస్తోంది. జీవితంలో చాలావాటికి అర్థంలేదు. ఒంటరితనానికి ఆ నక్షత్రమిచ్చే సాక్ష్యమది. అదే ఆలోచిస్తూ చెల్లెలి మాటలు మరిచిపోయాడు

## 2

ఏడు నెలలు తరువాత.

చలికి పదునెక్కి, మెత్తబడి నిద్రపోయిన ప్రకృతంతా వేడికి మెల్లిగా లేచి వొళ్ళు దులుపుకుంటుంది. దాహంతో గాలి ప్రపంచాన్ని వెదుక్కుంటోంది.

ప్రియుడి మొదటి స్పర్శకు ముకుళితమయి, సంత్రస్తమయిన హృదయం దగ్గరికిలాగ కొమ్మల్ని దగ్గరికి లాక్కుంది గన్నేరు చెట్టు.

ఇవాళ మరీ బద్ధకంగా వుంది. లేవడానికి శరీరం తిరుగుబాటు చేస్తోంది. కిటికీలోంచి కనిపించే పుట్టెడు ఆకాశపు వెలుగు కళ్ళల్లో పడి చీలుతోంది. సగం బద్ధకంతో, సగం మత్తుతో కళ్ళు మూసుకున్నాడు వరద.

ఎంత నిద్రలో ఉన్నా గోవర్ధనరావుగారి గొంతు తనకి గుర్తే. గేటు మెల్లగా తెరిచిన చప్పుడూ, ఆయన చేతికర్ర టకటకలూ, సకిలింపూ "వరద భయ్యా" అన్న పిలుపు ఆయన రాకని నిర్ధారణ చేశాయి.

"ఇంత ఉదయమే వచ్చారేమా?" అని ఆశ్చర్యపడడానికయినా వ్యవధి యివ్వకుండా తుఫానులాగా వచ్చిపడ్డారాయన. వస్తూనే కుర్చీ అయినా లాక్కోకుండా మంచం మీదే బైఠాయించి "కళ్ళు విప్పకుండానే చెప్పాలోయ్. ఓ మంచివార్త తెచ్చాను. ఏమిటో చెప్పుకో చూద్దాం."

వరదరాజులు ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఆయన కంఠంలో స్ఫుటంగా అత్యంత ఆనందం, ఉత్సాహం తెలుస్తూనే ఉన్నాయి.

"కాశీపతికి ఉద్యోగం వచ్చిందా?"

"ఉష్! పరీక్షలో ఫెయిలయ్యావ్. అమ్మా గులాబీ!" అని పిలిచారు. హడావుడిగా స్నానం చేస్తున్నదల్లా ఆదరాబాదరాగా ముగించుకు వచ్చిందామె.

"నువ్వు చెప్పమ్మా చూద్దాం. ఏం విశేషం తెచ్చానో?"

ఆయన చేతిలో పొట్లాం చూసింది. చేతికర్ర అటూ ఇటూ ఆడిస్తూ టకటకమని శబ్దం చేస్తున్నారు తీరుబాటుగా -

"కొత్తరకం పువ్వులేవైనా.."

గుక్కతిప్పుకోకుండా నవ్వు సాగించారాయన.

"భలే! భలే చెల్లెల్ని సంపాయించావోయ్. అమాయకత్వానికి యీమె ప్రమాణం. ఓ చెట్టుపువ్వులూ, ఓ బుట్టడు అమాయకత్వం, యిదీ గులాబి. వినమ్మా, వినతకి కూతురు పుట్టిందట. ఉదయమే కబురందింది."

"నిజంగా! మరి ఇదివరకు విషయమన్నా తెలీదే? యింత హఠాత్తుగానా?"

"వినతకి కూతురు పుడితే ప్రపంచమంతా నిలిచిపోవాలమ్మా నీ పిచ్చిగాని. తల్లి కాబోతున్నదన్న విషయం కనీసం మనకు తెలియజేయాలనయినా తట్టింది కాదు ఆ ఎమ్మే గ్రాడ్యుయేటు గారికి. ఏం చెయ్యం? సరి, ఇదీ కథ. ఇహపోతే.."

"నిజంగా?"

"ఇంకా నమ్మకం లేదూ? " ఈ మిఠాయి సాక్షిగా అంటూ పొట్లాం విప్పారాయన.

"శుభవార్త ఎవరికి ముందు చెప్పాలో అని ఆలోచించానోయ్. మొదట నువ్వే కనిపించావు. శుభవార్తతోపాటు ఏదో తీపి తినిపించాలట కానియ్" గులాబి వేపు తిరిగి "అమ్మాయికి ఏం పేరు పెట్టాలో నువ్వో లిస్టు రాసి యివ్వాలమ్మా - వినతకి పంపుతాను. పోనీ 'గులాబి' అని పిలవమనేదా? నీ మంచితనం చూశాక నీ పేరంటే యిష్టం నాకు. నీ అంతవుతే మనకు చాలు" గులాబి ముఖం కప్పుకుని పారిపోతే "నాక్కాఫీ మరిచిపోయేవు సుమా" అన్నారు బిగ్గరగా.

కిటికీలోంచి పడే లేత వెలుగునే యింకా చూస్తున్నాడు వరదరాజులు. ఆడది ఎంత సులువుగా ఎదిగిపోతుంది? ఇంకా ఎలక్ట్రిక్ దీపం వెలుగులో తన ఎదురుగ్గా కుచుని "నేను కావాలా నీకు?" అనడిగిన పిచ్చి వినతే గుర్తు. ఓ మొగ్గ తొడగడం, రేకు విడడం ప్రకృతితో కలిసి నవ్వడం. రాలిపోవడం - ఓ పువ్వు పూసిందన్న జ్ఞాపకం తప్ప ఇంకేమీ మిగలకపోవడం - యిదీ జీవితం, ముఖ్యంగా స్త్రీకి.

వినతని చూడాలని మొదటిసారి అనిపించింది. రక్తం పైపొరలోకి చేరి, మాతృత్వపు భారంతో, తననుంచి తీసేసిన ఓ ప్రత్యయం మీది మమతతో, "అబ్బ! ఏమిటి బాబూ యీ బరువు?" అనుకుంటూ వుంటుందేమో. తనలో ఏదో పేగు కదలడం చూసి భయపడి కళ్ళు గట్టిగా కప్పుకుని "తీసెయ్ ఈ బాధని నానుంచి యింకేమీ వద్దునాకు. ఈ అనుభవం చాలు. ఈ బరువు నాకు అసహ్యం" అని తాత్సారం చేస్తూ కాశీపతిని కావలించుకుని ఉంటుంది. నవ్వుకున్నాడు వరద.

వరదరాజులు ఎంతకు మాట్లాడకపోవడం చూసి "ఏంవోయ్! నీకూ నమ్మకం లేదా యీ వార్తమీద. స్త్రీ జీవితానికి రెండే అధ్యాయాలోయ్. అందంగా బ్రతకడం, పిల్లల్ని కనడం. రెండో అధ్యాయం ప్రారంభంలోనే ముగింపు ప్రారంభమవుతుంది. పూర్తిగా తెలుసుకునేసరికి అంతా ముగుస్తుంది. ఇప్పటి వినతని నేనూహించలేను."

భయపడ్డాడు వరద, తన మనస్సులో సగం భాగానికి అర్థం చెప్పిన ఆయన్ని చూసి -

చలించి - "కాశీపతి ఎలా ఉన్నాట్ట?" ఏదో అడగాలి కాబట్టి ఆమె విషయం తప్ప మిగతాది ఎత్తుకున్నాడు.

"అతనికేం? భేషుగ్గా వుంటాడు. ఓ పక్క తన ప్రయోగం బాగయిందట. నిన్ను కలసి, నీతో మాట్లాడాలని ఉందన్నాడు. అప్పుడు లైబ్రరీలూ, అవీ పిచ్చిగా చెప్పేవాడు కదూ? తను ఊహించినవన్నీ నిజమయ్యాయట. నాకు దిగ్భ్రమగా ఉంది. ఓసారి ఎప్పుడన్నా ఓపిక చేసుకుని వెళ్ళి చూసి రావాలి"

పాలుపొంగి నిప్పులో పడి కాలిన వాసన గదంతా గుప్పుమంది. దూరంగా అద్దంలో గోవర్ధనరావుగారి ముఖంలో సంతోషం గమనించాడు వరద.

"ఆరోగ్యం నిన్ను రమ్మని మరీ మరీ చెప్పిందోయ్. ఏదో హడావుడి చేసేట్లుంది. ఫ్రీస్టులందర్నీ పిలిచి ప్రార్థనలూ అవీ మొదలు పెట్టిందంటే నేను బికారినయి ఊరుకుంటాను. దాని ధర్మమా అని. దానికయితే ఏసుప్రభువు ఉన్నాడు. కానీ నా బుద్ధుడు బీదవాడే మరి. తప్పకుండా సాయంకాలం వస్తావు కదూ!"

"ఆఫీసులో బోలెడంత పని.."

"ఉష్! అవన్నీ వదిలెయ్. వినతకి కూతురు పుట్టిన రోజు నీ శలవుకు ఏదీ అడ్డురాకూడదు."

గులాబి తెచ్చిన కాఫీ గుటక వేస్తూ "ఇక గులాబిక్కూడా పెళ్ళికానిచ్చెయ్. ఏడాదికి మంచి కూతుర్ని ఎత్తుకుంటే ఆరోగ్యానికి విడాకులిచ్చేసి నేను పెళ్ళిచేసుకుంటాను. పెళ్ళి అంటే బెంగాలీ రసగుల్లా అంత తీపి నాకు"

ఇవాళ యీయన ఉత్సాహాన్నీ, చురుకుతనాన్నీ చూసి విస్తుపోయాడు వరద. గోవర్ధనరావుగారికేం తోచడంలేదు. "మరి వెళ్తానోయ్" అంటూ పదిసార్లు లేచి చదికిలబడ్డారు. గేటు వరకూ వెళ్ళి చేతిక్రర్రకోసం ఓసారి లోపలికి వచ్చారు.

"ఈ హడావుడిలో పోయి ఏ లారీకిందనో పడేట్లున్నాను" అంటూ గడపదాటిపోయారు చివరికి.

గులాబి ఒకటే నవ్వు 'ఇవాళ యిలా మారిపోయారేమిటీయన? తనే కూతుర్ని కన్నట్టు'

జీవితంలో మరో అధ్యాయం ముందుకి గడిచి, పెరిగి గతాన్ని మరిచి ముందుకు పోతోంది వినత.

తన జీవితమింకా మొదలే లేదు.

ఈర్ష్యా తనకి ఆమెమీద.

స్నానానికని లేవబోతే ఎర్రటి కెంపురంగు వల్లెవాటు వేసుకువచ్చింది అమీనా.

జుత్తు రెండుపాయలుగా విడి వెనకన ముడిగా చుట్టుకుంది. పల్చటి కోలముఖం గన్నేరు చెట్టూ ఎరుపుదనంతో కలిసిపోయింది.

"నాన్న రమ్మన్నాడు మిమ్మల్ని"

"డబ్బుకావాలా మళ్ళీ"

"అదికాదు. మిమ్మల్ని రమ్మని" ముందుమాటను ముందుగానే కూడబలుక్కుని వేగంగా ముగించేసి నిశ్శబ్ధంలోకి పాకుతాయి ఆమె మాటలు. అందుకని సగం అర్ధమయి, సగం కానట్లూను. "సరేలే, వస్తాను సాయంకాలం"

ఆమె వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

తొందరగా ఎందుకు జవాబు చెప్పానా అని కించపడ్డాడు తర్వాత. గేటుకి తగిలి ఎర్రటి వల్లెవాటు చిరిగింది. తుళ్ళిపడి వెనక్కి తిరిగి చూసుకుంది. వరద తన వేపే చూస్తున్నాడని గ్రహించి తలెత్తకుండానే వెళ్ళిపోయింది అమీనా. ఇంకా ఎండలో ఆమె వెళ్ళిన మేర ఎరుపుచార ఊహించుకుంటూనే ఉన్నాడు. ఏదో పాతస్నేహాన్ని వదులుకుంటున్నట్లు కదుల్తోంది.

"నీళ్ళు చల్లారిపోతున్నాయి అన్నయ్యా ఎంతసేపు" అంది గులాబి.

పెరట్లోకి వెళ్ళాడు అనుభూతుల పరిధుల్లోంచి పట్టు తప్పించుకుని

సాయంకాలం ముంగిట్లో అడుగుపెట్టేసరికి ఖాసిం దగ్గుతూ మంచంమీద కనిపించాడు.

"ఏం ఖాసిం? అలా ఉన్నావు"

"ఏం చెప్పను బాబూ! యీ రోగం ఓ పక్క, ఇదో పక్క కొరికేస్తున్నారు నన్ను" అని వాపోయాడు.

దీపం తీసుకువచ్చి చీకటి మధ్య నిలబడింది అమీనా.

"రమ్మన్నావేం?"

క్షణం మాట్లాడలేదు ఖాసిం. తలెత్తకుండా చీకట్లోకి తలతిప్పి అమీనాను ఉద్దేశించి "చెప్పేదా?" అన్నాడు, అమీనా 'ఊఁ' అన్నదో, ఊరుకున్నదో తెలియలేదు.

"ఏమిటి ఖాసిం అది?"

"అదిక చదవదట బాబూ!"

"అదేం?

"ఈ ఆడవాళ్ళు యివాళేం చేస్తారో రేపెలా పోతారో పాతకాలం వాళ్ళం మనకు అర్థమయి ఏడిస్తేనా? యీ దంతబ్బొమ్మని ఎవడో చూశాట్ట."

"చూసి...!"

అమీనా ముఖం తెల్లగా, మంచుముద్దలా కనిపిస్తోంది చీకటిమధ్య. సిగ్గుమాని కోపంతో చూస్తోంది తండ్రివేపు, ప్రపంచంలో కోపాన్ని మొదటిసారిగా ఎరువుతెచ్చుకున్నట్లు.

"వాడు చూడడంలేదు బాబూ! ఇదే చూసింది వాణ్ణి. ఏం అమీ అంతేనా?"

అమీనా మాట్లాడలేదు.

"పెళ్ళి చేసుకుంటాననంటుంది వాణ్ణి. చదువూ, తండ్రీ ఎవరూ అక్కర్లేదు మరి. సత్తువ లేకపోయింది గానీ వాణ్ణి చంపివద్దును"

వరద క్షణం మాట్లాడలేకపోయాడు.

ప్రపంచాన్ని నిటారుగా చూడలేక, అది పరిచే దృక్కుల్నీ జీర్ణం చేసుకోలేక సిగ్గుతో కుంచుకుపోయే అమీనా మనస్సు చేసిన తిరుగుబాటు ఫలితం యీ సంఘటన కాదని అతనికి బాగా తెలుసు.

"చేసుకుంటే ఏం? తప్పా?"

తుళ్ళిపడ్డాడు ఖాసిం, కళ్ళు పెద్దవి చేసి వరదరాజులు వేపు చూస్తున్నాడు. అమీనా అప్పటికే అక్కణ్ణుంచి పారిపోయింది.

"అదేమిటి బాబూ - ఎవరో హిందు"

నవ్వొచ్చింది, "నీ మతాలూ, నీ పట్టుదలలూ తిండిపెట్టవు ఖాసిం, చూస్తున్నావుగా? ప్రతిదానికీ తలవొంచి బ్రతకాలనుకుంటే జరగదు, ఎదురు తిరిగి ఊరు బయటికి నువ్వు వచ్చావు, తిరగలేక నేను అలాగే ఉండి పోయాను. కానీ ఒక్కటిమాత్రం - అమీనా మంచితనం నన్ను మోసం చేసిందంటే చెప్పలేను. అసలు నీకున్నదల్లా అది తప్పుతోవతొక్కుతున్నదనే కించకాదు. పాతతోవ పట్టక కొత్తదారి పడుతోందని. నన్ను తీర్పు చెప్పమంటే ఎవరి మనస్సు చెప్పినట్లు వాళ్ళు పోవడం మంచిదంటాను."

చీకటిని పూర్తిగా జయించలేని దీపం నిస్పృహతో చివరి నిట్టూర్పులు వదులుతున్నట్లుంది.

నిశ్శబ్ధం వహించాడు ఖాసిం, వరద నవ్వుకున్నాడు. ఇక ఏం చెప్పినా ఖాసింతో లాభంలేదు. అతనిది వేడిరక్తం ఈ మాటలు చెప్పినందుకు ఇంకోర్నయితే ప్రాణం తీసేసేవాడే

తలుపు టకటకలాడిస్తే అమీనాను వెనకనుంచి చూసి గులాబీలాగా కనిపించేసరికి తుళ్ళిపడ్డాడు - ఆ పరిస్థితిలో తన గులాబి వుంటే?

లేచి "వెళ్తానోయ్? ధైర్యం వుంటే బయటికి వచ్చి పెళ్ళికి పిలువ్. ధైర్యం లేదన్నా ఆశ్చర్యపడను. చాలామందిలో నువ్వూ ఒకడివి. పోతా"

గుమ్మం దగ్గర అమీనా చీకట్లో తనకేసి విచిత్రంగా చూస్తూ నిలబడితే నిస్తేజుడయాడు వరద.

"అలా నాతో కాస్సేపు నడుస్తావా?" అన్నాడు.

ఇంకేం మాట్లాడలేదు. అమీనా వెనక నడుస్తోంది.

తాటితోపు దగ్గర బల్లకట్టు దీపపు వెలుగులోకి వచ్చాక "ఆడదానివి కావడం బ్రతకడానికి ఓ అనర్హత నీకు. మరోసారి ఆలోచించుకో ఏ పని చేసే ముందయినా.."

ఎంత ప్రయత్నించినా అంతకంటే సరళంగా చెప్పలేకపోయాడు.

తెలుగు సరిగా అర్థంకాదు అమీనాకు. ముఖ్యంగా వరదరాజులు మాటలకు ఏమీ జవాబు చెప్పలేదు. వెళ్ళు అనేవరకూ నడుస్తూనే ఉంది. అన్నాక మరి కనిపించలేదు. నవ్వుకున్నాడు వరద గోవర్ధనరావుగారింటివైపు నడుస్తూ.

ఆఫీసునుండి అయితే తిన్నగ యిక్కడికి రాలేకపోయేవాడే కాని కాశి యింటికి వెళ్ళిరావడం స్థిమితాన్నిచ్చింది. చీకటిలో కూడా అమీనా ముఖం తనని ప్రశ్నిస్తున్నట్లేవుంది.

గోవర్ధనరావుగారింటి ముంగిట్లోకి వచ్చేసరికి రవణమూర్తి గొంతు విన్పిస్తే చకితుడయాడు. ఏదో ప్రోత్సాహం, ఎత్తుబడీ ఉంటేనే గాని కదలడు రవణ.

వరదని చూడడంతోనే "నే చెప్పానుకానూ? బ్రిటిష్ క్లాక్ లాంటివాడు వరద. కోరుకోవోయ్ నీ యిష్టం వచ్చిన ఫలహారం సిద్ధంగా వుంటుంది" అన్నారు గోవర్ధనరావుగారు.

"మిఠాయి"

"భేష్! నువ్వేం అడుగుతావో దానికి బాగా తెలుసు. రెండు వీశెల మిఠాయి శాంక్షను. ఏమండోయ్ ఇంటావిడగారు" కేకేశారు.

ఇంకా పొద్దుట ఉడుటు తగ్గకపోవడం చూసి నవ్వుకున్నాడు వరద.

"మీలో సగంపాటి సత్తా, ఉత్సాహం వుంటే మేమంతా బాగుపడి పోయేవాళ్ళం" అన్నాడు

"రైట్, ఇప్పుడు నిన్ను నువ్వు బాగా చెప్పుకున్నావు. నీక్కావల్సింది మిఠాయికాదు ఉత్సాహం. సత్తాకావాలి - బ్రతకడానికి తగిన ఫ్యూయల్" ఆరోగ్యం మిఠాయి తీసుకొస్తే "అలా పళ్ళెం ఆపు అమ్మీ - వరదకి చిన్న ఉపన్యాసంతో ఉత్సాహాన్ని అందిస్తాను" అన్నారు.

"ఇంకా పిచ్చితగ్గలేదే మీకు, మనవరాలు కాదు, మనవరాలికి కూతురు పుట్టాక ఉపన్యాసాలు యిద్దురుగాని లెండి. నువ్వు మరీ అలా చొరవ యివ్వకూడదోయ్ యిలాంటి పిచ్చివాళ్ళకి. చూశావుగా నేను లేకపోతే మిఠాయి తినే అవకాశం పోయేదినీకు" అంది పళ్ళెం ముందు ఉంచి.

తింటూ "ఎలా వుంది ఉద్యోగం?" అని రవణమూర్తిని కదిపితే బావుందన్నట్టు తలూపి వెనక్కి చేరబడ్డాడు.

"నయం. అమ్మాయి పుట్టింది వినతకి. అబ్బాయి పుట్టాడుకాదు"

"ఏం?" అంది ఆరోగ్యం పువ్వులు సవరించుకుంటున్నదల్లా.

"పుట్టిన కుర్రవాడు కాశీపతి అంత తెలివైనవాడూ, వినత అంత అందమైన వాడూ అయితే ఫరవాలేదు. కాశీపతి అంత అందమైనవాడూ, వినత అంత తెలివయినవాడూ అయితేనే చిక్కు. ఎటొచ్చి స్త్రీకి ఆ రెండూ అక్కరలేదు - ఉదాహరణకి నువ్వు"

మాటలో దెప్పుదల తోచినా నవ్వకుండా ఉండలేకపోయింది ఆరోగ్యం. అంతా ఘొల్లున నవ్వేశాడు.

మిఠాయి సంగతిని మరిచిపోయాడు వరద.

"మిఠాయి తినడానికి బాధపడతావేమిటోయ్, మిఠాయి కావాలా, మినిష్టరు పదవికావాలా అని ఎవరన్నా నన్నడిగితే అడగరనుకో - మిఠాయే కావాలంటాను. సరి, ఇప్పుడు నాకు రెండూ లేవనుకో. ఏం? అంతేనా?" అని ఆరోగ్యం వంక సాభిప్రాయంగా చూసారు.

"మీకు తర్వాత"

"సరి, కేసు డిస్మిస్, ఇక మా అమ్మాయికి శుభాకాంక్షలు అందజేయండోయ్ పోస్టులో పంపుతాను" అన్నారు చుట్టవెలిగిస్తూ.

రవణమూర్తి కుర్చీలో కదిలి లేచాడు. "ఇక వెళ్తానండి"

"శుభాకాంక్షలంటే వెళ్ళడం కాదయ్యా - కాస్సేపు కూచో, వెళ్దువుగానిలే"

"వెళ్ళాలండి, పనివుంది."

"సరే అయితే, సుజాతకి ఏవైనా యిచ్చిపంపు" అన్నారు ఆరోగ్యంతో ఆరోగ్యం వచ్చేలోపల వరద కూడా లేచాడు నేనూ వెళ్ళాలంటూ.

"ఇద్దరూ వెళ్తే నా సాయంకాలం ప్రోగ్రాం సరి - ఇక నేనూ యీవిడా మిగులు. పాతగ్రామఫోను రికార్డులాగా నేను వాగుతూ కూచోవాలి. పదండి అల్లంత వరకూ దిగబెట్టివస్తాను" అని లేచారు.

గోవర్ధనరావుగారు వెళ్ళిపోయేవరకూ నిశ్శబ్దంగా నడిచారు యిద్దరూ, సందుమలుపు తిరిగి సాయిబు దుకాణం దాటారు.

"కనిపించడం మానేశావేం అప్పట్నుంచీ?" అన్నాడు వరదరాజులు,

"వద్దామనుకుంటే ఓ పక్క పనులూ, మరోపక్క సుజీ"

"ఎలావుందిప్పుడు"

నవ్వాడు రవణ - అదిచాలు ఆ ప్రశ్నకు.

"ఈ ఊరు దరిద్రం. అన్నివిధాలా నీకు సరిపోలేదనుకుంటాను. ఇల్లు, ఊరు, అన్నీ మార్చెయ్"

రవణ చీకట్లో వరదరాజులువేపు తలతిప్పి భుజం మీద చెయ్యివేశాడు.

"అనిపిస్తుందేగాని, అన్నీ మారినా మనుష్యులం పాతేగా, నేపోయేదా యిక?" బజారు మొగిలో నిలబడి అడిగాడు.

"ఉండు నేనూ వస్తాను"

తొమ్మిదిగంటల రాత్రి యింటిలో అడుగుపెట్టి అక్కడ నీలవేణిని చూసి దిమ్మరపోయారు యిద్దరు. సుజీపక్కన కూచుని మందు కలిపి యిస్తోంది నీలవేణి. నీరసంగా తల పక్కకివాల్చి పడుకునివుంది సుజీ.

ఇద్దర్నీ చూసి మొదట తికమకపడినా సర్దుకుంది నీలవేణి.

"మరీ అంత ఆలస్యంగా యింటికి రావడం మంచిదికాదు, సుజాతకి మళ్ళీ ఫిట్టు వచ్చింది" అంది రవణమూర్తిని ఉద్దేశించి.

తుళ్ళిపడ్డాడు రవణ.

ఈమె యిక్కడికెలా వచ్చిందా అని ఆలోచిస్తున్నాడు వరద, ఆలోచనలకు జవాబు దొరకకముందే పలకరించింది నీలవేణి.

"మరిచిపోయారా నన్ను?"

ముఖంలో నిర్వేదాన్ని తెల్లబోయి చూసి మాటమరిచి పోయాడు.

"అపాయాన్ని చూసి పారిపోతారు కాబోలు మొగాళ్ళు. నాకు తెలీదు, అలాగయితే రవణమూర్తిగారు పరిగెత్తి, పరిగెత్తి యీపాటికి హిమాలయాలుదాటి ఉండవలసింది"

రవణమూర్తికి యిటు దృష్టిలేదు. వచ్చి సుజాత మంచం పక్కన చతికిలపడ్డాడు.

ఇన్ని మాటలు నీలవేణి ఎప్పుడు నేర్చుకుందా అని విస్తుపోయాడు వరద. ఈ తరహా ప్రవృత్తి అతనికి కొత్త. తననుంచి దూరమయిన నీలవేణి కొత్తపాఠాలు నేర్చుకుంది - ఈ పరిణామపు వ్యుత్పత్తిని పీతాంబరం చురుకుదనంలోనూ, అక్కడి కొత్త అనుభవాలలోనూ గుణించికొంది ఆమె బహుశా.

కళ్ళని బలహీనంగా కదిపి వరదని పలకరించింది సుజాత. ఏదో చెప్పబోతే వద్దని వారించాడు చేతితో. చర్చిగంటలు నిశ్శబ్దం గుండెమీద పగిలాయి. సుజాత కాస్సేపటికి నిద్రపోయాక మోకాళ్ళుమీద తల ఆనించుకుని కూచున్న నీలవేణితో 'థాంక్స్' అన్నాడు మాటలురాని రవణ.

విచిత్రంగా ఆమె అతని ముఖంలోకి చూస్తే ఏదో తప్పుచేసినట్లు చిన్నబుచ్చుకున్నాడు.

వెళ్తానని లేచి "మీరూ వస్తారా?" అంది నీలవేణి వరదతో, "కాస్సేపు ఉంటాను" అనబోయాడు.

"నన్నా యింటి దగ్గర వదలి వద్దురుగాని పదండి" అంది.

ఇద్దరూ బయటికి వస్తే చలి వంటిచుట్టూ తిరిగింది.

ఆకాశం నిండుబొట్టు పెట్టుకున్నట్లున్న చందమామ, ఏదో కోరికలకు రెక్కలు కడుతున్నాడు. నీలవేణి పచ్చరంగు చీర వెన్నెల్లో రెపరెపలాడుతూ మెరుస్తోంది. వంటినిండా తిప్పుకుని తప్పనట్లు అడుగులు వేస్తోంది నీలవేణి.

చాలా విషయాల్ని అడుగుతుందని ఎదురు చూస్తున్నాడతను.

చాలా విషయాలకు జవాబు యీ నడకలో దొరకదా అనుకున్నదామె.

అనుకుని యిద్దరూ మాట్లాడడం మానేశారు.

"పిలిచినా గుర్తురానంతగా మరిచిపోయారా మమ్మల్ని?"

"వినతకి కూతురు పుట్టిందని గోవర్ధనరావుగారు పిలిస్తే వెళ్ళాను"

రాత్రి చల్లదనపు బిగువు తెచ్చిన ఉదుటులో నీలవేణి భుజాన్ని గుద్దుకున్నాడు వరద అడుగు తడబడి.

"పారిపోయారేం ఆనాడు?"

రెండోసారి అడిగేసరికి యిక దాటేయలేక "చెప్పేదా?" అన్నాడు.

క్షణం ఆలోచించి "చీకటిని చూసి భయపడాలని నాకెవరూ చెప్పలేదు. చివరికి నువ్వు కూడాను. నువ్వెళ్ళిపోయాక పొరపాటున దారి తప్పి చీకట్లోకి పోయాను. తీరా వెలుగొచ్చాక అంత వెలుగు ఒక్కసారి చూడలేక పారిపోయాను, అదీ సంగతి"

పకపకా నవ్వేసింది నీలవేణి. ఆ నవ్వు ఉధృతంలో ఏం చేస్తున్నదో తెలీకుండా జారిపడబోయి అతని భుజాన్ని ఆసరా చేసుకుంది.

"బాగా మాట్లాడతారే మీరు. రచయితగా మిమ్మల్ని గుర్తించలేకపోవడం దురదృష్టం. మీకు మనస్సుంది కానీ మార్గంలేదు. మీ దారి యిటు" అని తోవ తప్పిపోతున్న అతనికి సహాయం చేసి వెనక్కి తిరక్కుండా నడిచి వెళ్ళిపోయింది యింటివేపు.

కనిపించేవరకూ చూస్తూ నిశ్శబ్దం మధ్య నిలిచిపోయాడు వరదరాజులు.

తోవతప్పిన వరదరాజులు.

రెండు శరత్తులు మారినప్పటి సాయంకాలం అపస్మారంలో సోమరిగా నడుస్తోంది చీకటివేపు. చాలాగాలుల్ని చూసేసి, వర్షాలకి బోరవిరిచి, యిహవేటికీ భయపడని నిర్లక్ష్యం, పెలుసూ చూపుతోంది గన్నేరు చెట్టు, కూడబెట్టుకున్న పువ్వుల్ని ఎవరికివ్వడానికీ మనసులేక తన దగ్గరే చంపుకుంటోంది.

కోవెల ముందు బీడుని చూస్తూ కూచున్నాడు వరద. యౌవనంతో ఊగే పల్చటిమొక్కలు మరీ అంత బలంలేని గాలిలో ఊగుతున్నాయి. పొడువుపాటి పచ్చికంతా యౌవన సామ్రాజ్యంలాగా ఉంది.

మైదానం చివర డాలీ.

కోవెల గట్టుమీద కుచుని కాళ్ళు ఆడిస్తున్న ఆమెను చూసి తుళ్ళిపడ్డాడు వరదరాజులు.

అబ్బో! రెండేళ్ళయింది ఆ రాత్రి గడిచి.

అయినా యిప్పుడు ఆ పాత జ్ఞాపకం. ఆ శరీరంలో కసీ, ఆ చేతుల బిగువు యింకా గుర్తే. యిప్పటికీ ఆ అనుభవాల జ్ఞాపకం మెదడుకి రక్తాన్ని పాకిస్తుంది.

నేరేడుపండు రంగు కమీజు చీకటిమధ్య డాగు కట్టినట్లు కలిసి క్రమంగా కనిపించడం మానేసింది డాలీ.

సన్నగా ఏదో పాట గొణుగుకుంటోంది.

అందం తన ఔన్నత్యాన్ని డాలీలో వెదుక్కుంది. ప్రపంచమంతా మారినా ఆమె సౌకుమార్యం చెడదు. సగం తయారీలో మిగిలిపోయిన యీ ప్రపంచపు నగ్నత్వాన్ని తిరుగుబాటుతో దర్పంతో చూసే ఏదో అవ్యక్తపు మాధుర్యం చీకటిలో చీలికలాగా మిగిలిందనిపించింది. దీపం పుచ్చుకుని ఆ ముఖానికి దగ్గరగా, యింకా దగ్గరగా వెదికితే పోగొట్టుకున్న వస్తువు దొరుకుతుందేమో.

చల్లటి నీటి తుంపర నుదుటిమీద రాల్చింది చెట్టు. తుళ్ళిపడి వొళ్ళంతా జలదరిస్తే కుంచుకుపోయాడు వరద.

మళ్ళీ అప్పటి రాత్రి జ్ఞాపకం.

గాజుపలకమీద పడిన మంచు బిందువులాగా జారిపోయింది కల. అది కల మాత్రం - యింకేదీకాదు. కాకపోతే అంతటి స్నిగ్ధ కోమలత్వం, అంతటి పిచ్చి మాధుర్యం అంత అమాయకపు అందం ఈ జీవితానికి సాధ్యమా అని మాటిమాటికీ అనిపించసాగింది వరదకి. ఆ జ్ఞాపకాల మాధుర్యంలో అతనికి స్పృహ తప్పింది.

''నిద్రపోతున్నావేం అన్నయ్యా'' అని గులాబి లేపితే బెదిరి లేచాడు.

పద్మనాభస్వామి ఆలయంలో దీపాలు వెలిగించారు. పచ్చిక చీకటి వెలుగుల మధ్య గాజుపలకలా మెరుస్తోంది. డాలీ కూర్చున్నప్పటి గోడ పాతజ్ఞాపకాన్ని తల్చుకుని దిగాలు పడినట్లుంది.

కల కరిగిపోయింది.

వరదరాజులు మాట్లాడకపోయేసరికి నవ్వుకుంది గులాబి. చీకట్లోనూ కనిపించేట్టుగా తీర్చిదిద్దిన గుండ్రటిబొట్టూ, మెడకు గంధపు చారలూ, చేతిలో పళ్ళూ చూసి ''ఎక్కడికెళ్ళావు?'' అన్నాడు.

''చెప్పేదా! ఉండు వస్తాను'' తొందరగా వెళ్ళి తలుపులు తీసి పళ్ళు యింట్లో పడేసి మల్లెచెండు ఎగరేస్తూ వచ్చి గట్టుమీద కూచుంది.

''వినత వచ్చిందన్నయ్యా'' అని గులాబి ఉన్నట్లుండి చెపితే దిగ్భ్రమతో అటు తిరిగాడూ వరద.

అతని అదురుపాటు చూసి నవ్వింది - ''ఉండు మరీ, నిన్ను వెంటనే గోవర్ధనరావుగారు రమ్మని అన్నారు. నువ్వక్కడే భోజనం చెయ్యాలిట''

వరదెంతకీ మాట్లాడకపోవడం చూసి ''ఏమో బాబు, నే చెప్పడం చెప్పేశాను, హైదరాబాదులో యింతమంచి పువ్వులుంటాయా అన్నయ్యా'' లేచి లోపలికి వెళ్ళిపోయింది.

''శివ దీక్షాపరురాలనురా'' పాడుతున్నారు పక్కయింట్లో ఎవరో.

వినత ఈసరికి ఎంత పెరిగివుంటుందా అనుకున్నాడు.

మాతృత్వం అనుభవపు స్థాయిని పెంచి అవయవాల్ని వికృతంగా మలిచివుంటుంది. నవ్వులో బరువుతేరి, కళ్ళు అలసి, మరీ నిండుగా, వికారంగా తయారయిన వినత కళ్ళల్లో కదలింది. నవ్వితే వెయ్యిపువ్వులు ఒక్కసారిగా సువాసన గుమ్మరించినప్పటి విసుగుదల కనిపిస్తోంది. తీపి ఎక్కువయినప్పటి పానీయపు వెగటుదనం ఎలా ఉంటుంది.

వెళ్ళకూడదనుకుని కళ్ళు మూసుకుని వెనక్కు చేరబడ్డాడు.

తాళాల కోసం రామ్మూర్తిగారు వస్తే గులాబి బయటికి వచ్చింది.

ఇంకా అన్నయ్య అక్కడే కూర్చుని ఉండడం చూసి నిర్ఘాంతపోయింది లేపి "వెళ్ళలేదేం అన్నయ్యా?" అంటే

"నువ్వు ఒంటరిగా ఉండాలి, పోనీలే" అన్నాడు.

"ఇదేం కొత్త? గోవర్ధనరావుగారు బాధపడతారు."

"ఇవాళకాదులే, బాగా అలసిపోయాను, రేపు వెళ్తాను" అంటూ ఆమె కళ్ళను తప్పించుకుని లోపలికి వచ్చేశాడు.

తెలతెలవారుతూ, యింకా సగం చీకటి ఉన్నదనగానే తుంపర్లుగా ఎత్తుకున్న వర్షం "యింతింతై" అన్నట్లుగా పెరిగి హోరు పెట్టింది. ఝుంకారం చేస్తూ గాలి పరవళ్ళు తొక్కింది. భయంతో తల ఆడించి కిందికి వంగింది గన్నేరు.

రోజంతా చెమ్మగానే ఉంది. అడపా తడపా జారే నీటిధారల్తో చెత్తంతా రోడ్డుమీదికి పాకి నీటిమీద ఊగుతోంది. ఎన్నాళ్ళగానో ప్రకృతిమీద మిగుల్చుకున్న కసి తీర్చుకున్నప్పటి రొప్పుదల అనుభవిస్తున్నాయి మేఘాలు.

ఎక్కడికి పోవడానికీ మనసొప్పక మధ్యాహ్నమే వరదరాజులు యిల్లు చేరితే అరుస్తూ ఎదురొచ్చింది గులాబి. "అడుగో అన్నయ్య వచ్చేశాడు. వినత వచ్చిందన్నయ్యా నువ్వు వచ్చేస్తావని తెల్సుట తనకి."

వసారా ముందు మట్టిభాగమంతా ఎవరో కెలికినట్లు గండ్లు పడింది. ఆకులమీద నీరు చుక్కకట్టి ముత్యాల్లా మెరుస్తున్నాయి.

"ఎలా తెల్సు వచ్చేస్తానని?"

"ఏమో? ఆవిడ్నే అడుగు - అబ్బో సిగ్గుపడడంకూడా తెల్సే యీవిడగారికి. కనిపించిందా చెట్టుచాటున?"

వెనక్కి చేతులు కట్టుకుని నవ్వుతూ నిలబడింది గులాబి.

తడి చీరని పిండి తల తుడుచుకుంటూ ముందుకు వచ్చింది వినత.

వరదని మొదట నివ్వెరపోయి చూస్తూ నిలబడి అంతలో నవ్వేసింది "అంత చిక్కిపోయావేం మరీను?"

జాకెట్టుకీ, చీరెకీ మధ్య మిగిలిపోయిన తెల్లటి ముడుతలకేసి ధ్యాసగా చూస్తూండడం గమనించి సిగ్గుపడి చీర వొళ్ళంతా తిప్పుకుంది.

"అక్కడే నిలబడిపోయావే? లోపలికిరా, పాత వినతేలే" అంది.

యాంత్రికంగా లోపలికి వచ్చి కూచున్నాడు.

"అబ్బ! చలిగా ఉంది బాబూ - వేడి కాఫీ యిచ్చావా, మంచి మొగుణ్ణి చూడమని సిఫార్సు చేస్తాను గులాబీ, నీ యిష్టం" అంది.

గులాబి సుడులు తిరిగిపోతూ నవ్వి "లంచాలివ్వటం బాగా నేర్పినట్లున్నాడే మీ ఆయన. ఆయన డబ్బుగురించీ, నువ్వు కాఫీ గురించీ అంతే తేడా. పుస్తకాల వర్తకం కాదు కావలసిన ధరకట్టుకొందుకు. ఇప్పుడే వస్తానుండు" అని లోపలికి పరుగెత్తింది.

వినత యిటు తిరిగేసరికి లాల్చీ మార్చుకుని తువాలుతో తలతుడుచుకుంటూ అద్దంలోకి చూస్తున్న వరదరాజులు కనిపించాడు. భుజం మీంచి అద్దంలో అతని కళ్ళు తనని పృచ్ఛిస్తున్నట్లున్నాయి - ఆమె ప్రతీ అవయవాన్నీ విస్మయంతో వెదుకుతున్నాయి.

"కూతురేదీ?" అని గోడ పెల్లులూడదీసున్న వినతని అడిగితే "భుజం మీద వేసుకు తిరగమంటావా ఊరంతా? చూడడానికయినా వస్తావుకదా అని యింటిదగ్గరే వదిలి వచ్చాను" కళ్ళు తప్పించుకుని బయటికి చూస్తోంది.

వినత చాలా మారిపోయింది. అన్నివిధాలాను.

గిల్లితే నీరుకారే పొట్లకాయిలాగ మెలికలు తిరిగి, యౌవనపు వంపులన్నీ పూడుకుని పూత పిందెలాగ తయారయింది వినత. బలంగా, నిండుగా ఆకారం కూడదీసుకున్న భుజాలూ, పల్చటి రక్తాన్ని గుడుకట్టిన చెక్కిళ్ళూ, బరువుగా బద్ధకంగా కదిలే పెదవులూ, లోతులు చూడలేక, సోమరితనాన్ని పెంచుకునే కళ్ళూ నిద్రకోసం వంగిపోయే శరీరం ఒకే కోరికగా, ఒకే ఆశగా, ఒకే మాంసపు ముద్దలా మిగిలింది వినత.

అనుభవం అందాన్ని మింగి ఏదో ఆకారాన్ని మిగిల్చింది.

బరువెక్కి మొనలుదేరి నిర్లక్ష్యంగా ఊగుతున్న రొమ్ములు, మాతృత్వం మాత్రం మిగుల్చుకున్న మెత్తటి కండరాలుగా తోచాయి.

స్త్రీత్వానికి అదే పరిపూర్ణత అయితే ఆ స్త్రీత్వం ఆమెకి అతకనట్లు ఉంది.

నవ్వులో అందం మారింది, పెదాలు గుండ్రంగా తిప్పి ప్రపంచాన్ని చూసిన మనిషిలాగ యిప్పుడు నిండుగా నవ్వగలదు వినత. ఏ విషయానికయినా ప్రయత్నం అక్కర్లేని నిరుత్సాహం చులకనగా చూపగలదు.

కళ్ళింకా ఆతృతతో రెపరెపలాడుతూ `మాలో యింకా అందం ఉన్నది` అని వృధాగా మూలుగుతున్నట్లున్నాయి. అనుభవంతో మెత్తబడి, మందంగా అటూ ఇటూ కదలాడే యింద్రియాలుగా మిగిలాయవి.

సుఖం కోసం అందం వదులుకుంటారా ఎవరన్నా!

ఆనాటి చిలిపి వ్యక్తికీ, యీనాటి మాతృత్వపు సమిష్టిరూపానికీ పోలికలు వెదకడానికి ప్రయత్నించాడు. ఆ ముక్కువంపు, పై పెదవి మెలిక తిరిగినప్పటి అహంకారం, లోతుపడి మెరిసే పల్చటి నుదురూ, వంపులు తిరిగి కళ్ళను తాకే శిరోజాలూ యివి తప్పిస్తే పాత వినత అనేందుకు ఆమెలో నిదర్శనాలేవీ లేవు.

**నవ్వొచ్చింది వరదకి.**

"ఏమిటాలోచిస్తున్నావ్?"

"చాలా మారావు నువ్వు"

"ఊ నాకు తెలీదే! ఇంకా చెప్పు వింటాను" మంచం మీదకి ఎగిరి కూచుని కాళ్ళు వేలాడేస్తూ అంది.

అద్దంలో స్పష్టంగా ఆమె మెడదగ్గరి నీలినరం వణుకుదల కనిపిస్తూంది. ఎంతకీ వరద మాట్లాడకపోయేసరికి తనే కల్పించుకుని "ఎలా బ్రతుకున్నావు ఒక్కడివి?" అంది ఎంతోసేపటికి.

నిర్ఘాంతపోయాడతను "అంటే?"

"ఏమో బాబూ, నీకు అర్థాలు చెప్పలేను - అందరూ యింత ఒంటరిగా - నీదంతా విచిత్రం"

"నన్నూ ఓ కాశీపతిని సంపాయించుకోమంటావా బ్రతకడం నేర్పడానికి? " నవ్వేసి "కొత్తబ్రతుకు ఎలా వుంటుందో తెలీదు నాకు. అందుకనే యిదే లోకమని బ్రతుకుతున్నాను. నువ్వు కొత్తపుంతతొక్కావు. బావుందని దాటిపోయావు. అంతే తేడా?"

"అబ్బో! చాలా నేర్చుకున్నావే?"

"......"

"అయితే యిదెక్కడా నీ పుస్తకాల్లో లేదా?"

"ఏదీ?"

"ఎందుకలా విచిత్రంగా చూస్తావ్ - నువ్వు బాగా బెంగపెట్టుకున్నావ్"

"దేనికోసం?"

"చెప్పనా దేనికనో?" గాలి విసురుగా వీస్తుంటే కిటికీ తలుపు మూస్తూ అడిగింది.

"ఊ"

"నీ కేం కావాలో చెప్పేదా?"

"చెప్పు"

"ప్రేమ - అదీ నీక్కావాలి"

"దాని అర్థం నాకేం తెలీలేదు యింతవరకూ నీక్కనిపించిందా పోనీ"

"అంతా వేళాకోళం నీకు?"

"పోనీ నువ్వే చెప్పు"

ముఖం తప్పించుకుని "అవును. అదే నీక్కావాలి నువ్వు కావల్సిన ఒక్క వ్యక్తి ఉన్నారనే తృప్తి. కనీసం ఒకరికయినా నువ్వు కావాలనే ధైర్యం"

అతను నవ్వితే బాధపడింది వినత.

"నీకు తెలీదు వరదా? నిజంగా నేనాయన్ని మొదటిసారి చూశాక అనుకున్నాను. అసలు మొదట్లో బ్రతకలేననిపించింది. ఏదో లోపంతో అక్కడికి వెళ్ళాను. కాని ఎలా మరిచిపోగలిగానో అంతా మరిచిపోగలిగాను. ఆలోచిస్తే యిదే కారణం తోచింది. ఆ తృప్తిచాలు మనం ఎన్నయినా సహించడానికి"

తలుపుకి ఆనుకుని చెయ్యి వెనక్కి చేరేసి బయటికి చూస్తున్న వినతని చూస్తూ నిలబడి పోయాడు వరద. ఇన్నాళ్ళలో ఎంత పెరిగిందా అనుకున్నాడు.

"నే చెప్పినమాట ఏం చేసేవ్?" అంది టేబులుకు ఆనుకుని నిలబడుతూ.

"ఏమిటి?"

"పెళ్ళి చేసుకుని"

"నీకింకా పిచ్చి"

"మాటల్ని చులకన చెయ్యడం బాగా తెల్సు నీకు - పోనీలే"

బలంగా వంపులన్నీ కూడుకుని గట్టిపడిన వీపుని చూస్తున్నాడు.

"ఆనాడు రాత్రి ఎందుకు వెనుకంజ వేశానా అని అనుకుంటూంటాను అప్పుడప్పుడూ. ఈ మనస్సు లేకపోతే ఆనాడే నీ చెయ్యి పట్టుకునే వాణ్ణి" వినత తుళ్ళిపడి యిటు తిరిగితే నవ్వేసి "నాకు తెల్సులే. కాశీపతి యిది వింటే యుద్ధానికి తయారవుతాడు"

ఆ రెండు మాటలు చాలు వినతకి - మరి మాట్లాడలేకపోయింది.

"నువ్వంత సుఖంగా బ్రతకడం మంచిదే ఓసారి ఎప్పుడన్నా మీ యింటికి వస్తాను"

"....."

"నా స్థిమితానికి మార్గాలేవిటో యింకా చెప్పు"

ఉదాసీనతతో తలెత్తింది - "నీకు తెలీదా ఏమిటి? ఇంకా చిన్నపిల్లాడివా? నే చెప్పను"

"ఇక వెళ్ళి పువ్వుల్ని చూడు, కాఫీ తాగి"

వినతకి కోపం వచ్చింది. దగ్గరికి వచ్చి ఎదురుగ్గా నిలబడి ఏదో అనబోయింది కాని అతని కళ్ళు చూసేసరికి సరి.

''నా మాట విను వరదా? నీకింకా ఏమంత వయస్సు దాటిందని? నన్ను చూడు పెళ్ళి చేసుకుని''

''స్త్రీ జ్ఞానానికి యౌవనం నాంది, వివాహం భరతవాక్యం''

''అబ్బ, నీతో ఎంత చెప్పి లాభంలేదు'' తల చేత్తో పట్టుకుని మంచం మీద కూచుంది.

''కాశీపతి రాలేదేం?''

''నాకేం తెలుసు. ఉత్తరం వ్రాయి''

''ఎలావుంది నీ ఆరోగ్యం?''

''అబ్బో. చాలా సానుభూతులు పలకడం అలవాటయిందే నే పోతాను. నా మాటలు వినకపోతే ఎందుకూ ఉండడం?'' లేచింది, పగటిపూటే వెలిగించిన ఆ దీపపు వెలుగులో, ఆనాటి పార్కు నీడలో కోపంతో మెరిసిన ముఖం చూచాయగా తోచింది వరదకి. ఏవో పాతస్మృతులు కదిలాయి.

''వెళ్తే ఆ తలుపు వేసేసి వెళ్ళు'' అని అన్నాడేకాని వినత వెళ్ళదని అతనికి బాగా తెలుసు. అప్పటి విషయాలు ఆలోచిస్తూండిపోయాడు.

చాలామందిలాగే మామూలు జీవితానికి అలవాటు పడిపోయింది వినత. ''నీలో ఏ ప్రత్యేకతా లేదు'' అంటే దిగ్భ్రమతో చూసి సిగ్గుపడుతుంది. కామం, వాంఛ ఉద్రేకాలని మొగాడిలో రేపి వాటికి ఆహుతయ్యే చాలామంది స్త్రీలలో ఆమె ఒకటి.

''వినత ఏదన్నయ్యా?'' అని కాఫీతో గులాబి వస్తే తెలివి తెచ్చుకుని చుట్టూ చూశాడు. తెరచి ఉంచిన తలుపులోంచి చారలా జల్లుపడుతోంది. గది సగం పయిన తడిసింది. చూరులోంచి జారే చుక్కల శబ్దం రణగొణధ్వనిలా వినిపిస్తోంది. అలసిపోయిన ప్రకృతి మరో క్షణంలోనో సగంలోనో తన ప్రయాణం ఆపుకునేట్లుంది.

వినత నిజంగానే వెళ్ళిపోయిందనేసరికి ఆశ్చర్యపోయాడు వరద.

''ఛ, నువ్వెప్పుడూ యింతే. యింత వర్షంలో పంపేశావేం?'' అని మూతి ముడుచుకుంది గులాబి.

సాయంకాలం బట్టలు మార్చుకుంటూనే వచ్చి నిలబడి ''మధ్యాహ్నం వినత నా పెళ్ళి గురించేమైనా చెప్పిందా అన్నయ్యా?'' అంది జడకుచ్చుల్లో పోగులు తీస్తూ.

''అదేమిటి?''

''చెప్పు మరి. అడిగిందా లేదా?''

''ఇప్పుడెందుకా విషయం?''

''నేనే చెప్పమన్నాను. అసలు వినత వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ నువ్వు మారిపోయావన్నయ్యా. నే చూస్తున్నానుగా? నువ్వు పెళ్ళిచేసుకోవాలి. వదినె యింటికొస్తే అన్ని బాగుపడతాయి'' వసారాలోకి పూర్తిగా తల వొంచుకుంది.

తల దువ్వుకుంటున్న వాడల్లా ఆగిపోయాడు చేతులు కదలక కాస్త తేరుకుని ''ఇప్పుడేమంత తొందరలే'' అన్నాడు అపస్మారంలో.

''అదికాదన్నయ్యా. ఓ రోజు నీకు జ్ఞాపకుందా? నువ్వు రాలేదని డాలీ మనింట్లో నిద్రపోయిన రోజు''

శరీరంలో చాలా అవయవాలు తను చెప్పినట్లు వినడం మానేస్తున్నాయి. గోడను అనుకున్నాడు వరద.

''అవును. ఏం?''

"ఆ రోజురాత్రి" సూటిగా అతని కళ్ళల్లోకి చూసి నవ్వేసింది. "నాకంతా తెలుసు అన్నయ్యా. డాలీ మర్నాడే నాతో చెప్పేసింది. మంచి పిల్లే లే. నీమీద ఏమీ కోపంలేదు. ఉండు ఇప్పుడే వస్తాను" అనేసి పారిపోయింది. మరి రాలేదు.

జడునిలాగ నిలబడిపోయాడు వరదరాజులు, చేతన ప్రకృతంతా స్తంభించినట్లనిపించింది. రక్తమంతా ముఖంలోకి పాకింది. సిగ్గు, అవమానాల మధ్య యింకేమీ తెలియడంలేదు. మరో యుగానికి కళ్ళప్పితే ఎదురుగ్గా గులాబి లేదు. ఉన్నప్పుడన్న మాటలే మిగులు.

పక్కయింట్లో డాలీ నవ్వు వినిపిస్తోంది.

డాలీ.. డాలీ.. డాలీ

వర్షం తగ్గు ముఖం పట్టింది. ఎక్కడికో నడిచిపోవాలనిపించి బయటికి వచ్చేశాడు.

ఎక్కడో జనసంచారంలేని స్థలానికి వచ్చాడు వరద.

వాన వెలిసింది.

సరిగ్గా నాలుగురోజుల తర్వాత ఆఫీసులో యింకా అరగంట పని ఉందనగానే హడావుడిగా వచ్చేశాడు పీతాంబరం, "ఆంధ్రా జోరాస్టర్ వరదరాజులుగారు ఎక్కడ?" అంటూ.

"అదేమిటండీ" అంటే

"మనిషి బ్రతకడం గురించీ, స్త్రీ గురించీ, రసగుల్లాల గురించీ ఆలోచించలేక వాడెవడో ఆత్మగురించీ, ఆలోచనగురించీ ఆలోచించి చచ్చాడట. ఫూర్‌మేన్. అయితే ఆలోచన మీ యిద్దరికీ సామాన్యం గనక పేరు బదిలీచేశాను. బాధపడ్డారా! సారీ సరేపదండి గోవర్ధనరావుగారింటికి వెళ్దాం"

ఓ పెద్ద దస్తా కాగితాలు కూర్చుందుకు ఏర్పాటు చేసుకుని చదికిలబడ్డాడు.

"ఆయన మీకెలా తెలుసు?"

"అదేమిటిసార్. తెలియడానికి రోజులూ, సంవత్సరాలు కావాలా? బుద్బుదప్రాయమైన యీ జీవితంలో స్నేహం అనగా ఎంత? నా ఫిలాసఫీకి ఆశ్చర్యపోతున్నారు మీరు నాకు తెలుసు. అంతా గోవర్ధనరావుగారి ఇన్‌ఫ్లూయన్స్, ఇక నడవండి"

"ఇంకా కాస్త పనివుంది మరి" ఏదో చెప్పబోయాడు.

"అవన్నీ మన దగ్గర చెల్లవుసార్. రెండేపనులు. ఆ వాచీని అయిదుకి మార్చమంటారా? మీ మేనేజర్ని లేవదీయమంటారా?"

అప్పటికి అరగంట గడవనే గడిచింది. ఆఫీసంతా గొడవ చేసేస్తాడేమోనని భయపడి వెంటనే లేచి "పదండి" అన్నాడు.

బైట జట్కా సిద్ధంగా వుంది.

"ఏమిటి విశేషం?"

"ఏమీ లేకపోవడమన్నదే యివాళ్టి విశేషం, ఒక్క అనుబంధం మాత్రం ఉంది. కాశీపతి, దిగ్రేట్ ఐడియలిస్ట్ మీకు తెలిసేవుంటుంది. వాడితో నాకు కాస్త పరిచయం వుంది వాడు చేస్తున్న ప్రయోగానికి నేనూ కాస్త డబ్బు పెట్టుబడి పెట్టాను. నీలవేణి ఎలాగో ఆడవాళ్ళ పరిచయం కొట్టేసింది. ఇదీ ఇవాళ ప్రోగ్రాంకు నాంది"

జట్కా దిగేసరికి గోవర్ధవనరావుగారు మనవరాలితో రైలాట ఆడుకుంటున్నారు. ఆరోగ్యం నీలవేణి ఓ పక్కకూచుని మాట్లాడుకుంటున్నారు. కాశీపతి, వినత కనిపించలేదు.

నీలవేణిని చూడగానే వరదరాజులు తలబడ్డాడు ఆరోగ్యం నవ్వుతూ పలకరించింది. "చూశావోయ్, నువ్వుచెయ్యలేనిపని నేను చేశాను. నీలవేణిని పసిగట్టెను" అంది.

నీలవేణి కుడివేపు గుమ్మాన్ని అనుకుని నిలబడ్డది. సిగ్గు కొందరి ముఖానికి అతకదు. ముఖ్యంగా నీలవేణి - ఇదే ఆలోచిస్తున్నాడు.

ఇంతలో యితన్ని చూసి మనవరాల్ని భుజానికి ఎత్తుకుని పరిగెత్తుకు వచ్చారు గోవర్ధనరావుగారు. "ఎలా ఉందోయ్ మనవరాలు? ఇది ఝాన్సీరాణి కావాలని వాళ్ళమ్మ కోరిక" అన్నారు.

"ఆడవాళ్ళంతే సార్, ఝాన్సీకి రాణి కావాలనుకుని, ఝాన్సీ దొరక్క ఏ యింటికో రాణి అయి కూచుంటారు. ఏమంటారు వరదా సాబ్? చచ్చాం. మీకు ఆశయాలమీద నమ్మకం కాబోలు ఇహ బుద్ధం శరణం గచ్ఛామి."

గోవర్ధనరావుగారు ఘొల్లున నవ్వడం సాగించారు.

"భలేగా మాట్లాడతావే నువ్వు. మా వెంకు ఉంటే సరైన ఉజ్జీ దొరికినందుకు సంతోషించేవాడు"

"కాశీపతిగారు వచ్చారటగా?"

"హైదరాబాదు వెళ్ళి కాశీ నిద్రబాగా అలవాటు చేసుకున్నాడు. లేచాడో, లేదో, అమ్మా వినతా!" అని పిలిచారు.

ఎక్కడో వస్తున్నానన్న మాట వినిపించింది, జారిన ముడి సవరించుకుంటూ వినత వచ్చింది. వరదని చూసి "అబ్బో, వరదరాజులు వచ్చేశాడే, ప్రత్యేకంగా పిలవందే రాకూడదని నియమం పెట్టుకున్నాడేమోననుకున్నాను - ఏం నాన్నా?"

"అదేమిటమ్మా! వరదరాజులు ఎప్పుడు రాలేదని?" అన్నారు కూచుంటూ.

"ఏమో మరి? నేనొచ్చానని హంగు చేస్తున్నాడేమో? ఏం? అంతేనా?" అంది యిటు తిరిగి.

"ఏరీ కాశీపతి?"

"మేమంతా మనుషులమేనే, మాతో మాట్లాడు"

"ఆడది మాట్లాడమన్నప్పుడు మొగాడు మాట్లాడలేకపోవడం సహజం, ఇదీ మన రీడింగు. క్షమించండి" అన్నాడు పీతాంబరం చివరి మాటకు వినతను ఉద్దేశిస్తూ.

వినత కాస్త తెల్లబోయి, విచిత్రంగా చూసి ఫక్కున నవ్వేసింది.

"కనిపించడం మానేశావేమోయ్, అమ్మాయి ఎలా ఉంది?" అంది ఆరోగ్యం.

"ఏ అమ్మాయి? మీ అమ్మాయా, మీ అమ్మాయి అమ్మాయా?"

"అబ్బో పరిహాసం కూడా తెలుసే నీకు" అంది వినత నిర్లక్ష్యంగా కుర్చీలో వెనక్కి వాలుతూ.

నీలవేణి గోడకి చేరబడి చోద్యం చూస్తోంది.

"ఇద్దరి గురించి చెప్పు పోనీ" అంది ఆరోగ్యం.

"చెప్పనా?" అన్నాడు వరద వినతవేపు తిరిగి.

"వద్దులే" అంది.

"అల్లుడు ఢిల్లీలో ఉండగా పుట్టిందటోయ్ యిది. బారసాల, అవీ అన్నీ ఎత్తేసారు. ఏం పేరు పెట్టాలంటావ్?"

"దానికంత ఆలోచన ఎందుకుసార్? ఢిల్లీ ప్రయాణపు రోజుల్లో పుట్టింది కనుక 'ఢిల్లీ' అని పిలిస్తే సరిపోతుంది"

నవ్వలేక ఉమ్మ తిరిగిపోయారు గోవర్ధనరావుగారు. "భలేబాగుందోయ్, ఏమమ్మా అలా పిలుస్తావా అమ్మాయిని?"

వినతకి ఉదాసీనత కలిగింది.

"మరి హైదరాబాదులో పుట్టింది కనుక ఏమీ మంచిపేరు లేదా మీ డిక్షనరీలో" అంది పీతాంబరం వేపు తిరిగి.

"లేకేం భేషయిన పేరు ఉంది, హైదరాబాదు స్త్రీత్వం పుచ్చుకుంటే 'హైదరీ' అవుతుంది, కాదంబరి, కామేశ్వరిలాగ"

పక్కున నవ్వేశాడు వరద.

కోపంతో వినత లేచిపోయింది.

"ఏదైనా క్రిష్టియను పేరు ఉంచాలంటోందోయ్ యీవిడగారు"

"మీకు మామూలు పేరు ఉంచాలనిపిస్తోందా? మరీ మంచిది. ఇద్దరికీ సంధి కుదిరేలాగా పద్మినీమరియా అనో, సీతారోజ్ అనో పిలవండి తీరిపోతుంది"

ఆరోగ్యం ఏదీ అనేలోగా సిల్కుపైజమా, లాల్చీతో వచ్చాడు కాశీపతి.

అతన్ని చూస్తూనే ఆశ్చర్యపోయాడు వరద. ఇదివరకటికంటే బాగా తెల్లబడి, బలంగా తయారయాడు. నిటరుగా ఠీవిగా, నిండుగా కనిపించాడు.

వరదరాజుల్ని పలకరిస్తూ "కులాసాగా ఉన్నారా?" అన్నాడు.

"మీరు?"

"నాకేం? బాగానే ఉన్నాను. నా ప్రయత్నాల విషయం మామగారి ద్వారా వింటున్నారుగా? మీకెప్పటికప్పుడు ఉత్తరాలు వ్రాయాలనుకుంటూనే మరచిపోయేవాణ్ణి. వినత జ్ఞాపకం చేస్తూ ఉండేది" అన్నాడు. కుర్చీ దూరంగా లాక్కుని వెనక్కి వంగి ఊగుతూ.

ధనం, హోదా, తన ప్రయత్నాల సాధన వీటివల్ల లభించిన గర్వం ప్రతిమాటలోనూ, కదలికలోనూ తెలుస్తున్నా ఎందుకో అతని ముఖం మీద ఆ గర్వానికి స్థానం ఉన్నట్లనిపించింది. కాస్తపాటి నిర్లక్ష్యం, సోమరితనం కూడా తెలుస్తూనే ఉంది.

"అప్పుడు మీరు చెప్పిన విషయాల్ని ఎలా సాధించారో చెప్పండి, వినాలని ఉంది"

చిన్నకుర్రాణ్ణి చూసినట్లు తేలిక చూపు చూసి నవ్వాడు. నెమ్మదిగా ప్రారంభించాడు. "పట్టుదల లేని వాడి దగ్గర కుక్క కూడా ఉండడానికి యిష్టపడదండి. చాలామంది మాటలకి నిరుత్సాహపడి ఆనాడే మానేసి ఉంటే యీపాటికి నా పని సరి. ఏ హార్బరులోనో గుమస్తాగిరీ చేస్తూండేవాణ్ణి. ఇప్పటికి నా పని ఓ కొలిక్కి వచ్చింది. ఇప్పుడు పరిస్థితి ఎలా వుందా అని అడుగుతున్నారా? ఏభై మంది షేర్ల గురించి ఉత్తరాలు వ్రాస్తున్నారు. రెండు లక్షలు పైగా కూడదీశాను. పుస్తకాల మారకం త్వరత్వరగా సాగుతోంది. రానురానూ ప్రజలకి ఈ తరహా కొనుగోలు విషయంలో నమ్మకం కుదురుతోంది. ఇంకేం కావాలి?"

గోవర్ధనరావుగారు వెనక్కి చేరబడి కళ్ళు మూసుకుని అంతా విన్నారు.

పీతాంబరం లేచి సిగరెట్టు కాల్చుకుందుకు బయటికి వచ్చేశాడు.

"అయితే లాభమే కాని నష్టం లేదంటావ్?"

ఇటు తిరిగాడు కాశీపతి "లాభనష్టాల గురించి మాట్లాడలేదు నేను. లాభం విషయం యిప్పుడే గుణించడం కష్టం. నష్టం మాత్రం లేదు. అందుకు యిన్నాళ్ళయి పని సాగుదలే నిదర్శనం. ఏమంటారు?"

తలూపాడు వరద. ఇదంతా అతనికి అగమ్యగోచరంగా ఉంది. ఏదో కలలోంచి లేచిన మనిషి హఠాత్తుగా ఆకాశానికి ఎగిరి విశ్వరూపం దాల్చి ప్రపంచమంతా వ్యాపిస్తే కలిగే సంభ్రమం, ఆశ్చర్యం అతని ముఖంలో ద్యోతకమయింది.

నవ్వేశాడు కాశీపతి, అటు తిరగబోతే మోచేతి దగ్గర వినత వచ్చి నిలబడింది. వరద వెల్లబాటును చూసి తనూ నవ్వేసింది. ''ఓసారి అక్కడికి రమ్మని పిలవండి వరదని. మీరయినా పిలిస్తే వస్తాడేమో?''

''ఓ దానికేం? రేపు సమ్మర్‌కి అక్కడికి రండి. వ్యాపారమంతా చూద్దురుగాని. అంతా బావుంటే వచ్చేయేటికి ప్రెస్ ప్రారంభించాలనుకుంటున్నాను'' అన్నాడు.

ఎడతెగని పనీ, ఆలోచనల మధ్య వ్యక్తిగతమైన ఉద్వేగం, ఉద్రేకాలూ, భావాలూ అన్నీ నలిగిపోతాయి. మాములు స్పందనలతో, సుఖదుఃఖాలతో బ్రతికే మనిషి చచ్చిపోయి, యాంత్రికంగా, అచేతనంగా బ్రతికే ఓ తరహా జడాకృతి మిగులుతుంది. వాటి సమిష్టి రూపం కాశీపతి. జీవితంలో చాలా సున్నిత విషయాలని మరిచిపోయి ఏవేవో పొడివిషయాలకు పాకులాడుతున్నాడు. కాశీపతే మానసికంగా అందంగా కనిపించాడు. మార్పే పెరుగుదల అయితే ఈ విధమైన పెరుగుదలకు తను ఈర్ష్య పడనక్కరలేదనుకున్నాడు వరద.

అనుకుని సంతృప్తిపడ్డాడు.

''అర్జంటు పని ఉందిసార్. అమెరికను దొర ఒకణ్ణి దువ్వి ఆనావా సిగార్లు తెచ్చుకోవాలి'' అని లోపలికి వచ్చాడు పీతాంబరం.

''రేపు కలుస్తావా?'' కాశీపతి అడిగాడు.

''మనకి టైంటేబులు లేదు. మరోగంటలోనే కలవొచ్చు, లేదా వచ్చే క్రిస్‌మస్‌కి. గుడ్‌బై. లేస్తారా వరదరాజులుగారూ?''

పక్కకి తిరిగితే నీలవేణి కనిపించలేదు.

కూతురు ఏడుస్తోందని వినత మేడమీదకి వెళ్ళిపోయింది.

''నేనూ వెళతానండి'' అని లేచాడు వరద.

''అక్కడే ఉంటున్నారా? వెళ్ళే లోపల ఓసారి కలుస్తాలెండి'' అన్నాడు కాశీపతి.

పీతాంబరంతో కలిసి బయటికి వచ్చేసరికి తూర్పు ఆకాశం వెలుగుని తీరిగ్గా నెమరువేస్తోంది. ''మనిషి మరీ తేలికయినా, మరీ గొప్పవాడయినా ప్రపంచానికి పనికిరాని చెత్తగా తయారవుతాడు సార్. ఉదాహరణకి నేనూ, కాశీపతి'' అంటున్నాడు పీతాంబరం.

ఏదో ఆలోచిస్తున్నాడు వరదరాజులు.

**బాగా రోజు** గడవనిచ్చి చీకటి రాత్రులలో ఒకనాడు మలిఝాము గడిచాక వరదరాజులు యింటికి వచ్చేశాడు ఖాసిం. పీకవరకూ తాగేసిన మత్తులో ఊగిపోతున్నాడు. మెట్ల దగ్గర ముద్దలా చతికిలబడి ఒక్కటే కేకలు వేసి వరదరాజుల్ని లేపేశాడు. గులాబి కూడా తుళ్ళిపడి లేచింది.

దీపం వెలుగులో ఖాసిం ఎర్రబడిన కళ్ళు చూసేసరికి వరదకి వణుకు పుట్టుకొచ్చింది.

''ఏమిటి ఖాసిం ఇది?'' అంటే ఓ క్షణం తటపటాయించి వరద కాళ్ళదగ్గర కూచున్నాడు ఖాసిం.

''మాకు మీరొక్కరే బంధువులు బాబూ! అంతా చెప్తాను పదండి'' అన్నాడు.

''ఎక్కడికి?'' అని అడగడానికి వరదరాజులుకి అవకాశం యివ్వలేదు.

మందువాసన మొహం తిప్పుతోంది. అతను యింకా వెనకాడడం చూసి ''నేను చాలా మంచోణ్ణిబాబూ! తెలివి పూర్తిగా పోలేదు. నా తల మీ కాళ్ళదగ్గర ఉంది. నిషా కోసం తాగాను. రండి నాతో'' అన్నాడు. వాడి మొహంలో సంతోషం, ఉత్సాహంలో కూడా

తొందరపాటు తప్పిస్తే యింకేమీ కనిపించకపోయేసరికి కాస్త స్థిమితపడ్డాడు. నిజమే ఖాసిం మీద తనకి నమ్మకమే. దీపం పట్టుకుని నించున్న గులాబి వేపు తిరిగి 'ఓసారి వెళ్ళొచ్చేదా!' అన్నాడు.

గులాబికి భయమేసింది. "నాకేదో భయంగా ఉందన్నయ్యా. నేను వస్తాను" అంది.

ఓ క్షణం ఆలోచించి "సరే పద" అన్నాడు.

దారిలో విషయమేమిటని కదలేస్తే నవ్వేశాడు ఖాసిం.

"పిల్లాడి తండ్రి చెడ్డ దురుసు బాబూ! ఇది చెపితే వినలేదు. అందుకని ఎవరికీ తెలీకుండా గుప్‌చుప్‌గా అంతా జరిపేయాలనుకున్నాను."

"ఏ విషయం?"

"అదేనండి - దాని పెళ్ళి"

నవ్వొచ్చింది వరదకి "దానికి యింత అర్ధరాత్రిలో హడావిడా?" అన్నాడు.

"పగలన్నీ చిక్కులేనండి. అందర్నీ పిలవాలి. మీరుంటే చాలు. అంతా అప్పుడే పకడ్బందీ చేసేశాను. మరీ ధైర్యం చాలకపోతే చురుగ్గా ఉంటుందని కాస్త మందు వేసుకున్నాను" అన్నాడు నవ్వుతూ.

"భలే మనిషివయ్యా, నన్ను ఊరికే భయపెట్టేశాడు" అంది గులాబి.

"అమ్మగారిని తీసుకురావడం మంచిపని చేశారు బాబూ. దానికి యీవిడే తోడు"

గుడిసెనిండా అక్కడక్కడ రంగు కాగితాలు అంటించాడు ఖాసిం. ఎక్కణ్ణుంచో ఓ దీపం మరీ పెద్దది తీసుకొచ్చాడు. ఓ పళ్ళెం నిండా కుప్పగా పువ్వులు పోసివున్నాయి. బయటే నిలబడ్డాడు ఓ కుర్రాడు. తలుపు చప్పుడయేసరికి బెదురుచూపులు చూసింది అమీనా.

ఆ కాస్తపాటి వెలుగులో ఆమెను చూసేసరికి కళ్ళు చెదిరాయి వరదకి. తెల్లటి కోలముఖానికి రెండు ప్రక్కలా వేలాడుతున్న ఎర్రటి పూలరేకులూ, రక్తం చెక్కిళ్ళకి జారినట్లు, మధ్య చీకటి నీడల్లో ఎవరో చిత్రకారుడు గీసిపోయిన కుంచె మెరుపులాగా ఉంది.

"ఇంకా నమ్మకం లేదా బాబూ నా మీద? మీరే అన్నారని చేశాను" అంటున్నాడు ఖాసిం, వరదరాజులు మౌనానికి భయపడి.తెలివి తెచ్చుకుని చూస్తే అమీనా తన వేపే జాలిగా చూస్తోంది. గులాబి ఆమె ప్రక్కనే కూచుంది.

కుర్రాడు లోపలికి వచ్చాడు. "ఇతనేనా నువ్వు చెప్పినతను?"

"ఇతనే బాబూ శ్యామలరావంటే. ఏదో కంపెనీలో గుమాస్తా"

కుర్రాడు సన్నగా, పొడవుగా కనిపించాడు. అతని భుజం పట్టుకుని పైకి తీసుకొచ్చాడు వరదరాజులు. తాటితోపువరకూ నడిచాక వెనక్కి తిరిగి 'నిజంగా అమీనా కావాలా నీకు?' అనేసరికి కుర్రాడు బిత్తరపోయాడు. మెల్లిగా తలతిప్పాడు.

"కావాలంటే మామూలుగా కాదు. నీ రక్తం చెప్పిన ఉద్రేకాలకు లోనవడం వేరు. మనస్సు తెలుసుకుని నిర్ణయానికి రావడం వేరు. పదేళ్ళ తర్వాత యీ అందం, యీ వయసు తెచ్చే ఉద్రేకాలు ఏవీ ఉండవు. ఒక్కసారి ఆలోచించుకో. అప్పుడూ నీకు అమీనా అవసరమనిపిస్తే వెనక్కి వెళ్దాం పద. ఆమెను నీది చేసుకుందువు గాని, లేదా ఇప్పుడు పోయిందేమీ లేదు. ఇంకా అవకాశం ఉంది."

ఇంకేం మాట్లాడలేదు వరద. రెండు జీవితాల పోకడను నిర్ణయించే న్యాయాధికారిలాగ్గా ముందుకు నడిచాడు. వెనక అడుగులు తెలుస్తూనే ఉన్నాయి.

కాస్సేపటికి మళ్ళీ కదిపితే "ఏమో? నాకేం తెలీడంలేదు. అంతగా ఆలోచించలేక పోతున్నాను. కానీ ఒక్కటి మాత్రం నిజం. అమీనా కావాలి నాకు" బీదగా అన్నాడు.

ఓసారి అతని ముఖం గమనించి "పోదాం పద" అన్నాడు.

గుడిసె దగ్గరికి వచ్చేసరికి చుట్ట వెలిగిస్తున్నవాడల్లా ఆతృతతో లేచి నిలబడ్డాడు ఖాసిం.

అమీనా గోడకి చేరబడి కూచుని గులాబితో ఏదో మాట్లాడుతోంది. అతను లోపలికి రాగానే "ఏం అన్నయ్యా, ఏం చేశారు?" అంది.

"జరగాల్సింది జరిపెయ్ ఖాసిం. అంతా నిర్ణయమయిపోయింది."

"ఏం చెయ్యాలో మీరే చెప్పండి" అన్నాడు ఖాసిం లోపలికి వచ్చి.

"నిజానికి ఏమీ చెయ్యనక్కరలేదు. కానీ ఏదో ఒకటి ఈ రాత్రి జ్ఞాపకానికి గుర్తుగా జరగాలి" అని తతంగమంతా చెప్పాడు.

"ఎంత పాత ఆనవాయితీలను వదిలేసుకోవాలన్నా మనస్సు ఒప్పుకోదు. రేపు ఇద్దర్నీ మసీదుకు పంపించు. ఇక నీ బాధ్యత తీరిపోయింది. వెళ్ళి చెరువుగట్టున పక్కవేసుకుని పడుకో" అన్నాడు వరదరాజులు లేస్తూ.

పళ్ళెంలో మల్లె సువాసన గదంతా కుదిపేస్తోంది. అన్నిటినీ కుప్పగా ఎత్తి అమీనా తలమీద గుమ్మరించింది గులాబి. "ఇక పద అన్నయ్యా" అంది.

ఇద్దరూ నవ్వుకుంటూ బయటికి వచ్చేశారు.

సగం తోవ వరకూ ఖాసిం ఏవో కబుర్లు చెపుతూ నడిచి వెనక్కి తిరిగిపోయాడు.

నిశ్శబ్దం మధ్య కాలు తీసి కాలువేస్తే శబ్దం వినిపిస్తోంది.

"ఈ ఆడవాళ్ళు పెళ్ళిచేసుకుందుకు ఎందుకంత ఆతృత పడతారన్నయ్యా! అమీనా మరీను. మాటలు వింటూంటే నాకు ఆశ్చర్యమేసింది. అదిగో నీలవేణి" అంటూ ముందుకు పరిగెత్తింది ఉన్నట్లుండి.

ఏం జరిగిందో వరద ఆలోచించేలోపల గులాబి వరదరాజులు ముందుకిపోయి నీలవేణి రెక్కపుచ్చుకుంది. చిన్న ఎలక్ట్రిదీపం వెలుగులో నీలవేణి ముఖాన్ని గుర్తుపట్టాడు వరదరాజులు, పక్కనే పీతాంబరం కనిపించాడు.

"ఏమండోయ్! రాత్రికి చరిత్ర కల్పిస్తున్నారు. రచయితలూ, రాజకీయవేత్తలకు పగలూ, నాలాంటి సోమరులకూ, నైటింగేల్సుకీ రాత్రి కేటాయించాడు భగవంతుడు. క్వయిట్ అనెక్స్‌పెక్ట్‌డ్! మాంఛి సాయిబు టీ దొరుకుతుంది - యిటు పోదామా?" గుక్క తిప్పుకోకుండా అన్నాడు.

గులాబినీ, వరదనీ చూసి నీలవేణి సిగ్గుపడింది.

"ఎక్కణ్ణుంచి వస్తున్నారు?" అంది గులాబిని ఉద్దేశించి,

"చెప్పనా అన్నయ్యా?" అంది గులాబి నవ్వుతూ.

"ఏదో మిస్టరీ వేడి టీ పడ్డాక టెంపో వస్తుంది. మొదట నడవండి" మఫ్లర్ మెడచుట్టూ తిప్పి ముడివేశాడు. ఎవరూ తన మాటకి జవాబు చెప్పకపోయేసరికి నిరుత్సాహపడి "పోనీ, యిలా బీచికి వెళదాం. కాస్త గాలి తినవచ్చు - మీ ఇష్టం -" అన్నాడు.

"ఓ! రెడీ" అంది గులాబి.

మాట్లాడకుండా అంతా అటువేపే నడక ప్రారంభించారు.

"ఎక్కణ్ణుంచి?" అంది నీలవేణి ఈసారి వరదని ఉద్దేశించి.

"ఓ పెళ్ళి చేసి వస్తున్నాం"

ఉప్పెనలా నవ్వాడు పీతాంబరం. ."వెల్‌సెడ్! బెర్నార్డుషా విట్టు వేశారు. మీరే స్వయంగా టీక చెప్పుకోండి. నవ్వుతాము మేము"

"నిజం. మేం పెళ్ళికే వెళ్ళివస్తున్నాం" అంది గులాబి నీలవేణి చెయ్యిపట్టుకుని నడుస్తూ.

ఈసారి పీతాంబరం నమ్మక తప్పలేదు.

"ఎవరి పెళ్ళి? ఎక్కడ? ఏమిటి కథా, కమామీషూ"

నవ్వాడు వరదరాజులు, "అంతా వినండి చెప్తున్నానుగా? వింటే నిజంగా నాకు పిచ్చెక్కిందనుకుంటారు"

"అనుకున్నా యీ హెచ్చరిక గుర్తుంటుందిలెండి - నముసాయిదా నిబంధన, కానివ్వండి"

"ఓ మహమ్మదీయుల అమ్మాయి - హిందూ కుర్రాణ్ణి పెళ్ళిచేసుకోవాలనుకుంది, దీన్ని మీరేమంటారు మరి. తండ్రి భయపడ్డాడు, నా సహాయం కావాలన్నాడు. వెళ్ళి వచ్చాను, గులాబితో కలిసి"

"త్రీ చీర్స్ టూ వీరేశలింగం, వరదరాజులు ఎక్సెట్రా? ఎవరండీ ఆ అమ్మాయి?"

"ఇంకా ఏం చెప్పమన్నారు? - పేరు అమీనా"

నీలవేణి ఏమైనా మాట్లాడుతుందా అనుకున్నాడు. ఇసకలో చదికిలబడేవరకూ మాట్లాడకపోయేసరికి విసుగేసింది. చివరికి పీతాంబరమే అన్నాడు "నీలవేణి పెళ్ళిచేసుకుంటానంటోంది. చూశారా?"

"భలే! భలే!" అని చప్పట్లు కొట్టింది గులాబి.

సముద్రపు హోరులో మాటలు వినిపించలేదు వరదకి.

"ఏమంటారు?"

"నీలవేణి పెళ్ళి చేసుకుంటానంటోంది" పీతాంబరం ముఖంలో నవ్వు ఛాయలు కనిపిస్తున్నాయా అని వెదికాడు వరద. పరిహాసానికన్నట్లు లేదతను.

నీలవేణి ఇసకలో గీతలు పెడ్తోంది. ఆ విషయం కదపడం ఇష్టం లేనట్లు తలెత్తి పీతాంబరం ముఖం చూసింది.

"మంచిదే" అన్నాడు వరదరాజులు.

"నేను నవ్వులాటకు అనడంలేదు. నిజం" అన్నాడు పీతాంబరం గుప్పిటలో యిసుక తీసి ధారగా పోస్తూ.

"ఇక ఊరుకోండి" అంది నీలవేణి.

"నువ్వు మాట్లాడకు మధ్యలో. నేను కోపంగా ఉండటం ఎప్పుడన్నా చూశారా వరదరాజులుగారూ! నవ్వేవాడి ముఖం వెనకే ఎన్నో ప్రళయాలుంటాయి. ఏడ్చేవాడు ఏడుపులో తృప్తిని వెదుక్కోగలడు. నీలవేణి మనస్సు త్రాసులో వేసి తూచితే బరువుకి ఆగలేక తల్లక్రిందులవుతుంది" తెచ్చిపెట్టుకున్నట్లు బిగ్గరగా నవ్వి వెనక్కి యిసకలో వత్తిగిల్లి పడుకున్నాడు.

కావాలని ఏరుకుని పీతాంబరం ఏదో మాటలు చెప్పినట్లు తోచి నిర్ఘాంతపోయాడు వరద. కానీ ఈ పేర్పిడి వెనక ఏదో కథనం ఉంది - అది యీ చీకటిలో యీ హోరు మధ్య తెలుసుకోవడం పడదు.

కాస్సేపయాక పీతాంబరం మళ్ళీ ముందుకు వంగి 'అసలు యీ తిరకాసంతా' అని ప్రారంభించకపోతే మాటలో అడ్డొచ్చి "నే పోతానిలా అయితే" అని ఉదాసీనంగా లేవబోయింది నీలవేణి.

"సరే మాట్లాడనులే" అని విసురుగా ఆమె భుజం పట్టుక్కూచోపెట్టాడు.

"మంచి రచయితని - మా అన్నయ్యలాంటి వాణ్ణి చూసి పెళ్ళి చేయండి నీలవేణికి" అంది గులాబి నవ్వుతూ.

నీలవేణికి కోపం వచ్చి కళ్ళల్లో యిసిక పోస్తే ఉక్కిరిబిక్కిరయింది గులాబి.

"రేపు సాయంకాలం మీ యింటికొస్తాను ఎక్కడకూ వెళ్ళొద్దు" అన్నాడు పీతాంబరం కళ్ళు మూసుకునే.

వచ్చినప్పటి ఉత్సాహం అందరికీ పోయింది. లేచిపోతే బావుణ్ణని అందరి మనసుల్లోనూ అనిపించినా ఎవరూ బయటపెట్టలేక నిశ్శబ్దంగా గంటసేపు గడిపేశారు.

ఉండుండి పీతాంబరం ఏదో మాట్లాడుతున్నాడు. వరద జవాబిస్తున్నాడు.

"విశ్వేశ్వరం విషయమేమన్నా తెలిసిందా" వరద అడిగాడు.

మోకాళ్ల మధ్య తల ఆనించుకుని కూర్చున్నదల్లా నీలవేణి కదిలింది.

"నెలక్రితం ఓ ఉత్తరం వచ్చింది గూడూరునుంచి. మామయ్య వ్రాశాడు. గనిలో పని మానేశాడట. పదినెలలక్రితం కనిపించకుండా పోయాడట. నే చెప్పలేదూ? ఉత్తచేతకాని..."

"ఇక పోదాం పదండి" అంది నీలవేణి లేస్తూ.

పక్కకి తిరిగి చూస్తే గులాబి యిసకలో వెల్లకిలా పడుకుని నిద్రపోతోంది.

మర్నాడు పీతాంబరం కోసం ఎదురుచూస్తుంటే నీలవేణి వచ్చింది. దిమ్మెరపోయాడు వరదరాజులు.

"ఆయనేరీ?" అంటే.

"ఏమో తెలీదు" అంది గుమ్మం దగ్గరే ఆగిపోయి.

పెరట్లో ఎక్కడో ఉన్నదేమో, గులాబి అలజడి వినిపించడంలేదు.

ఎండవాలుపట్టి యింకా చురుక్కుమనిపిస్తూనే ఉంది. వాకిట్లో ఆరబోసిన కుంకం వెలుగుతో కలిసి మెరుస్తోంది - ఏం మాట్లాడాలో తోచలేదు వరదకి.

"నిన్నరాత్రి ఆయన చెప్పినదంతా నిజమేనా?"

"..."

"నేను మాత్రం నమ్మలేదు. ముఖ్యంగా అతను మాట్లాడే తీరు.."

నీలవేణి లేచి నిలబడింది. "ఏం లేచిపోయావేం?" అంటూండగానే గేటు తోసుకుని వినత వచ్చింది కూతుర్ని ఎత్తుకుని.

వరద తడబడ్డాడు మొదట.

నీలవేణిని చూసి వినత మొదట దిమ్మెరపోయినా అంతలో సర్దుకుని నవ్వేసి పలకరించింది.

"మీరు కూడా యిక్కడ భలే, తమాషాగా కలిశామే. నేను రేపు వెళ్ళిపోతున్నాను" అని వరదవేపు తిరిగి "ఏదీ గులాబి?" అంది గ్రంథాలు మాట్లాడే కళ్ళని యిటుతిప్పి.

వరద ఏమీ మాట్లాడలేకపోతే నీలవేణికీ అతనికీ మధ్య వచ్చి నిలబడి ఏదో అర్థమయినట్లు సగం నవ్వు నవ్వింది అతణ్ణి చూసి -

"ఏదీ గులాబి? త్వరగా చెప్పు?"

"లోపల ఉంది" అంటూండగానే పిలుస్తూ లోపలకు వెళ్ళింది వినత.

బిత్తరపోయి తలుపుకు చేరబడ్డది నీలవేణి.

"కూర్చో. నిలబడిపోయావేం?" అంటే తుళ్ళిపడింది.

"ఇల్లు కొత్తకాదుగా నీకు? వినతని మొన్ననే చూసినట్లున్నావు. అందుకనే ఆశ్చర్యపోతున్నావు -" నవ్వాడు.

వినత కూతురు ఏడుపు పెరట్లోంచి వినిపిస్తోంది.

"నువ్వు ఒక్కసారి వినతలాగ మాట్లాడితే చూడాలనివుంది. వినత నీలాగా నిశ్శబ్దంగా ఉంటే చూడాలనీను."

నీలవేణికి నవ్వొచ్చింది. ఇద్దరూ నవ్వుతూంటే ఏడుస్తున్న కూతుర్ని ఎత్తుకుని వచ్చింది వినత "అబ్బ! యీ పిల్లల్తో బాధబాబూ" అంటూ.

"పోనీ మీ నాన్నగారి దగ్గర వదిలెయ్. మరో వినతని చేసి పెట్తారు"

"అబ్బో! తెలివి. నీకేం తెలుస్తుంది పిల్లల సంగతి?" అని నీలవేణివేపు తిరిగి వరదని పెళ్ళిచేసుకోమని వందసార్లు చెప్పానండి - మీలాంటివాళ్ళు తల్చుకుంటే చెవిమెలేసి బుద్ధిచెప్పేవాళ్ళు" అనేసి మళ్ళీ నాలిక కొడుక్కుంది.

తెల్లబోయింది నీలవేణి ఆ మాటలకి.

వరద ఏదో అనేలోగానే "రేపు ఉదయం వెళ్ళిపోతున్నాను నాన్నగారు నీగురించి పలవరిస్తున్నారు. రేపు వస్తావా?" అంది.

"రేపు రవణమూర్తి చెల్లెలికి ఎక్సరే తీయిస్తున్నారు. రావడానికి వీలుండదు"

"మళ్ళీ ఏమొచ్చింది?"

"ఇంకా ఫిట్సు తగ్గలేదు. ఊపిరితిత్తులు పరీక్షచెయ్యాలన్నారు?"

"భేష్! ప్రజాహితోద్యమం లేవదియ్యి ఉద్యోగం మానేసి" అని "వెళ్తానండి. మీరూ రండి వీలయితే" అంది నీలవేణితో.

నీలవేణి మాట్లాడకుండా తలూపింది.

"ఒసారి గేటుదాకా రావయ్యా - అతిధుల్ని ఎలా గౌరవించాలో తెలీదు మరీను" అని వరద చెయ్యి పుచ్చుకుని లేవదీసింది. మరొకరిముందు ఎదుటి వ్యక్తిమీద తన అధికారాన్ని వ్యక్తం చేయడం ఒక సరదాయేమో మరి. ముఖ్యంగా స్త్రీకి - తప్పనిసరిగా లేచాడు.

గేటు దగ్గరికి వచ్చాక నీలవేణికి వినిపించకుండా "దొంగా! చెప్పవేం?" అంది సగం చూపు చూస్తూ.

"ఏమిటి?"

"తెలీనట్టు మాట్టాడుతావేం? నీలవేణి నీకెలా తెలుసు - పెళ్ళి చేసుకో బావుంటుంది" ఫక్కున నవ్వేసింది.

"ఇష్! వింటుంది" అన్నాడు వరద.

సూటిగా చూసి వెళ్ళిపోయింది వినత. ఆ చూపులో వక్రత్వం, నిరసన వరదలోని లోపాల్ని పట్టిచ్చాయి.

చివరి చూపులో మొదటి పాఠాన్ని చెప్పి వెళ్ళినట్టనిపించింది వినత.

"నువ్వు బ్రతకలేవు. ఈ బలహీనతల మధ్య బ్రతుకుతున్నావని భ్రమపడుతున్నావు" అని ఎచ్చిస్తున్నట్టున్నాయి ఆమె కళ్ళు.

వెనక్కి తిరిగితే స్తబ్ధుగా కూర్చునేవుంది నీలవేణి.

ఇంత నిశ్శబ్దం గుండెలో నీలవేణి ఎలా దాచుకోగలుగుతోందా అని ఆశ్చర్యం వరదకి. ప్రయత్నించికూడా సాధించలేని స్తబ్ధత అది.

వరదని చూసి లేచి నిలబడింది. "ఇంక వెళతాను."

"వినతకి ఏమీ తెలీదు. నోటికి వచ్చినట్టల్లా అనేస్తుంది. ఏమైనా అనుకున్నావా?"

"అబ్బే! అదేంలేదు."

"ఎందుకొచ్చావో చెప్పవా?"

"ఎప్పుడూ రాలేదంటారని - వెళతాను."

"అదికాదు విషయం - పోనీలే గులాబిని పిలిచేదా?"

"వద్దు. ఆయనవచ్చి ఏమైనా మాట్లాడుతారేమో. అవేమీ పట్టించుకోకండి. తెల్పుగా నిన్నరాత్రి మాట్లాడిన విషయాలు?"

"ఏం?"

"కారణం లేదు. ఆ మాటలన్నీ మరచిపోవడం మంచిది. అదే చెప్పాలనుకున్నాను. సుజాతకి ఎలా ఉంటోంది?"

"మెదడులో నరాలు ముడతలు పడ్డాయన్నారు. లేకపోతే ఊపిరి తిత్తులయినా పాడయి ఉండాలనుకున్నారు. ఇంకా ఏ విషయం తేలలేదు. 'నిన్న కనిపించాడు రవణ.'

"ఇవాళ కాఫీకి వస్తానన్నారు, ఈ పాటికి వచ్చేఉంటారేమో - వెళతాను."

"రవణమూర్తా?"

"అవును. ఏం?"

"వాడు కాఫీ తాగడు."

"అదేం? నేను రమ్మంటే సరే నన్నారే?"

"ఈ మధ్య అలవాటయిందేమో?"

వెళ్ళిపోయింది నీలవేణి.

రోజంతా పొందిన అలసటని సాయంకాలం చల్లదనంతో తీర్చుకుంటున్నట్లు ఊగుతోంది గన్నేరుచెట్టు.

ఉన్న రెండు పువ్వులూ కమిలి వంగిపోయాయి. దారి మేరకు పాతిన చెట్టు మధ్యాహ్నపు ఎండపొడకు నడుం వాల్చేయి.

మరీ ఎత్తున వున్న కోవెల గాలిగోపురం సూర్యుడి చివరికి కిరణం తాకిడితో వెలుగునీడ సంకలనంగా కనిపించింది.

కాలం ప్రకృతిని జోకొట్టి నిద్రపుచ్చుతోంది.

ప్రపంచంలో చాలావాటికి అర్థం తెలుసుకోవాలని బయల్దేరిన వరదరాజులు మొదట తన మనస్సును ఎక్కడో పారేసుకున్నాడు. తన ప్రయత్నాలకి యింకా చాలా కావాలి. తను చాలా తెలుసుకోవాలి, తెలుసుకోవడానికి ఈ జనసత్వాలు చాలవు. అని తెలుసుకోని విషయాల్లో ఒక విషయం తెలుసుకున్న వరదరాజులు నిర్ధారణకు వచ్చాడు.

తెలుసుకున్న విషయం - నీలవేణి.

వరదరాజుల్ని గుమ్మంలో చూడగానే అరుస్తూ ఎదురొచ్చారు గోవర్ధనరావుగారు. "నువ్వు లేకుండా యీ హడావుడి అంతా జరపడం నా కిష్టం లేదోయ్. అమ్మాయిని పంపితే పనంతా పాడుచేసి వచ్చిందేమోనని భయం వేసింది. 'అతను రాడట నాన్నగారూ' స్నేహితులయినా నీ మనస్సుని నేను తెలుసుకున్నంతగా అది తెలుసుకోలేదోయ్ - ఇంక నేనే వద్దామనుకుంటున్నాను."

అతని భుజం చుట్టూ చెయ్యి తిప్పి ఆనుకుని నడుస్తూ అన్నారు గోవర్ధనరావుగారు. ఇంట్లో ఎవ్వరి అలికిడి వినిపించడంలేదు. ఊరికి వెళ్ళాల్సిన సామాన్లన్నింటినీ గది మధ్యకి కుప్పలా చేరేస్తున్నారు.

"వినత ఏదీ?"

"కూతుర్ని పంపడానికి యిష్టంలేనట్లుంది. ఇద్దరూ ఏడుస్తున్నారు. ఆ గదిలో కూచుంది. చూడు వెళ్ళి" అంటూ శాల్తీల్ని చేతికర్రతో లెక్క జూస్తున్నారు గోవర్ధనరావుగారి.

గదిలోకి వచ్చేసరికి కూతురికి వెల్వెట్ గౌను తొడుగుతోన్న వినత చూసి -

"ఓహో! వచ్చావే! నీకు తీరుబాటు ఉండదేమోననుకున్నాను."

"...."

"అయినా మేం జ్ఞాపకమా నీకు? ప్రపంచంలో చాలామంది ఉన్నారు నీకు" గౌను బిగువయేసరికి బాధలు పడుతోంది.

తలుపురెక్కలు పట్టుకుని మారిపోయిన వినతని చోద్యం చూస్తున్నాడు.

గౌను తొడగడం పూర్తిచేసి బేబీని ఎత్తుకుని "అయితే పేరు ఏది ఖాయం చేయమన్నావ్? 'నీలవేణి' అని పిలిస్తే బావుండదూ? - అలా తెల్లబోతావేం? కూచో"

వరదరాజులికి మాటలు దొరకడం లేదు. వచ్చి మంచం మీద కూచున్నాడు. కాలికిందపడి ఏనుగుబొమ్మ విరిగింది.

కూతురు ఏడుపు మొదలెట్టేసరికి "అబ్బ! దీనితో చికాకు - అమ్మకు యిచ్చేసి వస్తానుండు లేకపోతే పనుందని పారిపోతావా?" నవ్వేసింది. తొందరగా నడిచి వెళ్ళిపోయింది.

ఇవాళ వినత ఏం మాట్లాడిన వరదకి కోపం రావడంలేదు. ఉదాసీనత లేదు.

ఒడ్డు చేరిన చేప గింజుకోకుండా తిరుగుబాటు సాగిస్తే కలిగినప్పటి ఆశ్చర్యం అతనిది.

మంచి నగిషి చెక్కిన కూజాలో చర్మం తెలీకుండా తారట్లాడుతున్న మంచినీళ్ళ చేప వినత.

మరీ తెల్లటి చీర కట్టుకువచ్చింది. పాము కుబుసంలాగ సన్నగా మెలికలు తిరిగిన వొంటిని పట్టుకుని తప్పనట్టు వేలాడుతోంది చీర. ముఖం నిండవడం, రొమ్ములు బరువు మనిషి అనుభవాలకి చిహ్నంగా మిగిలాయి. ముందుకూ వెనక్కూ ఊగే కుర్చీలో కూర్చుని వెనక్కి వాలింది.

"ఏడుస్తున్నావటగా?" అన్నాడు వరద కూర్చున్నాక, కళ్ళు పెద్దవిచేసి "అదేమిటి?" అంది.

"మీ నాన్నగారన్నారు."

"ఎందుకని?"

"నేను రాలేదని."

ఫక్కున నవ్వేసింది "ఇంకా పార్కులో మనిషే గుర్తునీకు. చాలా వాటికి మరచిపోగలగడం నేర్చుకున్నాను. ముఖ్యంగా నిన్ను"

వరద ఎంతకీ మాట్లాడకపోయేసరికి "కోపం వచ్చిందా?" అంది.

వరద ఆశ్చర్యంతో తల తిప్పాడు.

"చాలా మారిపోయాను నేను. కదూ? యిదివరకు నువ్వు నన్ను మాటలంటే తెల్లబోయేదాన్ని, ఇప్పుడు నేను యిలా అయిపోయానేం" కిలకిలా నవ్వుతోంది.

ఏమైనా మిగిలివుంటే తనలోని ఒక్కొక్క అహంకారపు పొరనూ చీల్చేస్తోంది వినత. మానసికంగా ఎన్నో నేర్చుకుంది. ముఖ్యంగా తన మనస్సు తుత్తునియలు చేసే భాషతో సహా.

"మరీ అలా మతిపోయి కూచోకు. నీకు కోపం వచ్చిదంటే అమ్మో! బ్రతగ్గలమా మేము?"

"కాశీపతి ఏడీ?"

ఈసారి మరీ బిగ్గరగా నవ్వేసింది - పక్క గదిలోంచి గోవర్ధనరావుగారు "ఏమిటమ్మా అది?" అని పలకరించారు.

**"నాతో** మాట్లాడలేక ఆయన ప్రసక్తి ఎరువు తెచ్చుకుంటావే? నా కంటె వ్యాపారం ముఖ్యం ఆయనకి. ఏదో పేపరు మార్కెట్టులోకి వస్తే రైలు స్టేషను దగ్గర కలుస్తానని వెళ్ళిపోయారు"

అద్దంలో ఆమె ముఖం కనిపిస్తోంది. దొంగతనంగా అటువేపు చూస్తూ ముఖం యిటు తిప్పుకున్నాడు.

"మరోసారి అడుగుతున్నాను - ఎప్పుడన్నా మా ఊరు రాకూడదూ?"

"ఎందుకూ?"

"అబ్బో! చాలా పెద్ద సందేహమే వచ్చిందే నీకు? ఎందుకు రావాలో తెలీదూ? పోనీ మా అమ్మాయికి పాఠాలు నేర్పుదువుగాని - వచ్చి"

వరదరాజులు చటుక్కున ముఖం కదిపితే "ఇవాళ నా మీద చాలా కోపం వచ్చింది నీకు. యిక మాట్లాడనులే" అంది పమిటతో నవ్వాపుకుంటూ.

"ఒకటి చెప్తావా నాతో?" కాస్సేపటికి అంటే. గొంతులో మార్పు చూసి గాభరా పడ్డాడు వరద. పరిహాసం, నవ్వూ ఎక్కడా కనిపించక పోయేసరికి స్థిమితపడి 'అడుగు' అన్నాడు.

"నీలవేణి యిక్కడికెలా వచ్చిందసలు? మీ యింట్లో చాలా రోజులు ఉందటగా?"

"ఎవరన్నారు?"

"గులాబి"

"....."

"ఏమో బాబూ, అంత నెమ్మదిగా ఉండే వాళ్ళని చూస్తే నాకు భయం. అయితే పెళ్ళిచేసుకుంటావా? నిజం చెప్పు. అంతమాత్రాన కోపం తెచ్చుకోవాలా యేమిటి, నేనాడదాన్ని'

"ఇక వెళతాను" అని లేచాడు వరద.

వినతకూడా లేచి గుమ్మం దగ్గరికి వచ్చింది.

"కాశీపతిని అడిగానని చెప్పు. మరోసారి ఆయనతో మాట్లాడగలిగితే బావుణ్ణు"

"అంతా నీ పిచ్చి, అందుకే హైదరాబాదు రమ్మన్నది. నా ముఖం చుస్తూ కూర్చోడానికి కాదు. ఉండు అమ్మాయిని ఎత్తుకు వస్తాను."

లోపలికి వెళ్ళింది.

గది మధ్య తీరిగ్గా కూర్చుని ప్రతి శాల్తీకి కాశీపతి అడ్రసు అంటిస్తున్నారు గోవర్ధనరావుగారు.

"నా కర్మాన్ని బుద్ధిజంలో చేరాను గాని, ఏ రైల్వే గుమస్తాగానో చేరితే యీ పనయినా సరిగా వచ్చేది. ఇంకా ఏదో తక్కువయింది" అని మళ్ళీ లెక్కచూస్తున్నారు.

"నేను వెళతానండి"

"అదేమిటి, స్టేషన్‌కి రావూ - కాశీపతిని కలుస్తావనుకున్నానే"

"మరోపని ఉందండి - తీరిగ్గా ఆయనకి ఉత్తరం వ్రాస్తాను."

"వినతతో చెప్పావా?" అంటూండగానే కూతుర్ని ఎత్తుకు వచ్చింది.

"చూశావా అమ్మా, వరదకి వేరే.."

"అవును నాన్నగారూ, నాకోసమే కూర్చుంటాడేమిటి అతను, పెద్దవాడయిపోయాడిప్పుడు, వెళ్ళనివ్వండి" అంది.

అప్పుడే ఏదో వాగ్వాదం యిద్దరికీ మధ్య జరిగివుంటుందని పసిగట్టి యింకేమీ మాట్లాడలేదు గోవర్ధనరావుగారు.

మెట్ల దగ్గరికి వస్తే గుమ్మానికి ఆనుకుని వినత ఆగిపోయింది. సగం దిగి వెనక్కి తిరిగి చూస్తే దేనికోసమే తననే వెదుక్కుంటున్నట్లున్నాయి కళ్ళు. తనని చూసి నవ్వి "తప్పకుండా వస్తావుకదూ! ఎప్పుడూ నీ గురించే అనుకుంటాన్నేను" అంది. ఈ నవ్వుకి వేరే అర్థం వుంది. దాని నిర్వచనం సగమే తెలుసు, కానీ చివరిమాటల్లో ఆమె మనసంతా కనిపించింది.

గేటు దాటిపోయాక అల్లంత దూరంలో వెనక్కితిరిగితే వినత అక్కడే నిలబడి కనిపించింది.

మెల్లిగా అడుగులో అడుగు వేసుకుని నడుస్తూ మొదటిసారి అనుకున్నాడు.

"వినతని వెళ్ళి చూడాలి"

ఆకులు పురుగుపట్టి చివికి జారిపోతున్నాయి.

చెట్టుకే వణికి చరమం కోసం ఎదురుచూస్తున్నట్లున్నాయి పువ్వులు. అనిశ్చితమైన లక్ష్యం కోసం తప్పనిసరిగా నడుస్తున్నట్లుంది ఉదయం.

మూడు నెలల తరువాత గ్రీష్మపు తొలిరోజుల్లో ఒకనాడు వరద గుమ్మం దిగబోయే వేళకి పరుగెత్తుకు వచ్చాడు పీతాంబరం, అతని అలసటా ఆతృతా చూసి నివ్వెరపోయాడు వరదరాజులు.

"ఏమిటండీ, అలా.."

ఊపిరి పీల్చుకుందుకు ఆగాడు.

"నీలవేణి రవణమూర్తిని పెళ్ళిచేసుకుంటుందట" రెట్టించాడు.

ప్రపంచంలో సంబవా సంభవాల పుర్తి పరిణామం అర్థంకాని వరదరాజులు యిది సాధ్యమా అని ఆలోచిస్తున్నాడు. ఇంత విన్నాక తనకేమీ తెలీదనిపించింది. ఇంకా తాను ప్రారంభంలోనే ఉన్నాడు. మనస్సుకి, ప్రవృత్తికీ పూర్తి అర్థాలు తనకు తెలియవు.

కానీ ఒక్కటి మాత్రం..

"చేసుకుంటేనేం?"

నిర్విణ్ణుడయిపోయాడు పీతాంబరం.

"అదేమిటండీ, మీరొక్కరే యీ విషయాన్నికాదంటారేమోనని పరిగెత్తుకు వచ్చాను.'

నవ్వొస్తోంది అంత ఆశ్చర్యంలోనూ.

చెయ్యి కాలినవాడు "అక్కడ నిప్పు ఉంది. జాగ్రత్త" అని చెప్పడు. వాడి చెయ్యి కాలాక "నీకూ కాలిందా? ఇక పద. పోయి మందు వెదుక్కుందాం" అంటాడు.

పీతాంబరం భుజం పట్టుకుని లోపలికి తీసుకువచ్చాడు వరద.

కుర్చీలో కూర్చున్నాక "ఇప్పుడు చెప్పండి స్థిమితంగా" అన్నాడు.

కూర్చోలేకపోయాడు పీతాంబరం, లేచి వాకిట్లో పచార్లు ప్రారంభించాడు. "నిన్నరాత్రి ఉన్నట్లుండి వచ్చిందిసార్ విషయం, ఏదో మాటమీద మాటరేగింది. నేను నవ్వుతూ ఉండగానే చూశారు మీరు. కోపంతో ఏదో అరిచేసరికి రెచ్చిపోయింది తెలుసుగా, నీలవేణి ఎప్పుడూ నోరిప్పదు. తక్కువ మాట్లాడేవాళ్ళ మనస్సుల్లోనే ఎక్కువ ప్రళయాలుంటాయి సార్, ఉదాహరణకి నీలవేణి - కోపంతో వొళ్ళు మరిచి యీ విషయం అనేసింది" ఆగి పైపు వెలిగించాడు

"అప్పుడు నా ఆశ్చర్యం చెప్పమంటారా సార్, మామూలుగా అయితే నిన్నరాత్రి ఓ హత్యచేసి జైలుకి వెళ్ళేవాణ్ణి, కానీ చాలా మార్పు జరిగిపోయింది. ఉన్నట్లుండి గాలికి కిటికీ కదిలి బుద్ధుడి విగ్రహం నేలపడి విరిగింది. ఎక్కడో ఉండుండి ఎవరో కేరుమని ఏడ్చారు. పెరటి తలుపు కర్టెను తెగి గాలికి నామీద పడింది. తెలివితెచ్చుకుని చూస్తే పేపర్ నైఫ్ నా చేతిలో ఉంది. అప్పటికే క్రిందపడి ఏడుస్తోంది నీలవేణి. మొదటిసారిగా భయమేసింది నాకు. పారిపోయాను అక్కణ్ణుంచి, రాత్రి ఎక్కడున్నానో తెలీదు, పొద్దుట మీ దగ్గరికి వచ్చేశాను."

అతను తెచ్చిన వార్తకంటే అతని ఉద్ధృతానికి అనుకంపన కలిగింది వరదకి. రాత్రి నిద్రలేనప్పటి నీరసం, ఆకస్మిక వార్త యిచ్చినప్పటి దిగ్భ్రమ, సంచలనం తప్పిస్తే పీతాంబరం అంతపనీ చెయ్యగలడనిపించింది. ఇంతవరకు పీతాంబరాన్ని మరో వ్యక్తితో పోల్చుకుంటున్నాడు వరద - వెంకటపతి. మాటల్లో, కదలికల్లో కూడా సుమారు ఇద్దరూ ఓ తరహా. వీళ్ళిద్దరూ అన్నదమ్ములు ఎందుకు కాలేదా అనిపించేది - కానీ యివాళ పీతాంబరం దిగజారడం చూసేసరికి వెంకటపతి గొప్పతనం స్పష్టంగా తోచింది.

చాలా బాధల్ని మరిచిపోవడానికి నవ్వు అనే కవచాన్ని తొడుక్కున్నాడు పీతాంబరం, అసలు బాధలే లేని వెంకటపతి నవ్వుతునే బ్రతుకుతున్నాడు.

గోడను పట్టుకుని పైపు పొగలు వదులుతున్నాడు. ఎంతకీ వరద మాట్లాడకపోయేసరికి యిటు తిరిగాడు. "ఏమిటి మీ అభిప్రాయం?"

ఎర్రబడిన కళ్ళని చూసి భయపడ్డాడు వరద.

"అసలు యీ విషయానికి ఎందుకింత బాధపడాలో నాకర్థం కావడంలేదు. మొదట స్థిమితంగా ఉండండి."

ఏదో చెప్పబోయి, ఊరుకున్నాడు, వచ్చినేలని మఠం వేసుకుని కూచుని "ఇప్పుడు చెప్పండి" అన్నాడు.

"ఇది చాలా చిన్న విషయం. ఎప్పుడూ ఆలోచించని వార్త విన్నప్పుడు కలిగే ఆశ్చర్యం తప్ప యిది విన్నాక నాకే దిగ్భ్రమ కలగలేదు"

"అయితే యిదివరకే ఊహించారా యిదంతా?"

"ఊహించనక్కరలేదసలు, ఇలాంటి అద్భుతాలన్నీ మనకు ఒక వ్యక్తి జవాబు చెప్తుంది - నీలవేణి, బైబిల్లో ఒకమాట ఉంది. ఆమె పాపాలే ఆమెను క్షమించాయి ఎందుకంటే ఆమెలో ప్రేమశక్తి అధికం"

"కానీ యిలా జరగడానికి వీల్లేదుసార్ - మీకు తెలీదు. ఇలా అయితే చాలా నష్టాలు జరిగిపోతాయి"

వరదరాజులు మాట్లాడడంలేదు. అతని నిశ్శబ్దం చూసేసరికి భయంవేసింది.

"అంత జరిగాక యివాళ యింటికి వెళ్ళడానికి భయం నాకు. మీరొక్కసారి రండి నాతో, ఆమెతో మాట్లాడడానికి నాకు భయం, మీరు కాస్త దగ్గరుండండి" చాలా దీనంగా అమ్మ కోప్పడితే పారిపోయిన కుర్రాడిలా అడిగాడు

ఫక్కున నవ్వేశాడు వరదరాజులు.

"నీలవేణి దగ్గర అంత భయమా మీకు?"

పీతాంబరం మాట్లాడకుండా లేచి పచార్లు ప్రారంభించాడు. కాస్సేపయాక "ఇప్పుడొస్తారా?" అని అడిగాడు.

"నాకు ఉద్యోగం ఉంది, సాయంకాలం వస్తాను. కానీ నేను వచ్చినందువల్ల లాభం ఉండదు, ఇప్పటికే ఆమె మిమ్మల్ని అసహ్యించుకునే పని ఒకటి చేసి వచ్చారు. ఇహ నన్ను తీసుకెళితే నాకు జోక్యం కలిగించినందుకు మీ మీద కోపం రావచ్చు. ఆలోచించండి.

ఆలోచించాడు పీతాంబరం. "అదీ నిజమే ఇప్పుడెలా మరి?"

"అసలు ఆమెకలాంటి ఉద్దేశం ఎందుకు కలిగిందో తెలుసుకోండి. మొదట రవణమూర్తిని కలుసుకున్నారా?'

"ఊహూ"

"అయితే వాణ్ణి కలుసుకోండి, ఏమైనా అర్థమవుతుంది మీకు"

"నేనొక్కడినే ఎలా? ఇవాళ రాత్రి ఆయనను యిక్కడికి తెస్తాను - మీరుండండి యింట్లో" అంటూ వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు పీతాంబరం.

పద్మనాభస్వామి ఆలయంలో హారతుల పొగ ఎండలో మెలికలు తిరిగి గాలిలో ఆకారాలు తిరుగుతోంది.

పీతాంబరం వదిలి వెళ్ళిన వార్త యింకా మనస్సు పీకుతోంది.

నీలవేణి నీళ్ళుపోసిన చెట్లూ, గన్నేరు చెట్టు, పువ్వులు కోసిన పాత స్థలాలూ, చేరబడి నిలబడిన ప్రాంతాలూ, అన్నీ కొత్తరంగు వేసుకుని కాలుతున్నట్లున్నాయి, ఆమె ఊపిరి తగిలిన చోటల్లా భస్మీపటలమవుతోంది. ఆమె పరిమళం దావానలంలా చుట్టి గుండెచీల్చేస్తోంది.

ఆ మాట విన్న తర్వాత అమృతపు తీపి ఎక్కువయి విషంగా మారినట్టు, ఆమె ఆఘ్రాణింపు పొందిన ప్రతీ ధాతువూ ఆ ఆనందాన్ని తను దాచుకోలేక, అంత ఉదాత్తతను భరించలేక నీరసించి కాలిపోతున్నట్లు తోచింది.

ఇన్నాళ్ళ తర్వాత ఊహించలేని ఇన్ని ఘటనల తర్వాత తనెందుకు నీలవేణిని అర్థం చేసుకోలేదా అనుకున్నాడు. ఒక్కసారి యిప్పుడామెను చూస్తే బావుణ్ణు.

ఎంత ప్రయత్నించాలనుకున్నా రవణమూర్తి మీద ఈర్ష్యలేదు. నీలవేణిమీద జుగుప్స లేదు. కానీ ఆ నిశ్చల ప్రకృతిలో ఎక్కడన్నా ప్రేమ ఉన్నదా అన్నది ఆశ్చర్యకరం. ఓ గడ్డిపోచలేచి "నేనూ ప్రేమిస్తాను యివ్వాళ్ళనుంచీ" అంటే వచ్చేది ఆశ్చర్యంకాదు. ఉత్సుకత, "సరే, కానీ ఈ వింత సోయగం ప్రేమించడం ఎట్లావుంటుందో చూద్దాం" అన్న ఆసక్తి. అలానే నీలవేణి ప్రేమ.

ఇంకా పీతాంబరంతో అన్నమాటలే జ్ఞాపకం వస్తున్నాయి.

"ఆమె పాపాలే ఆమెను క్షమించాయి. ఎందుకంటే ఆమెలో ప్రేమశక్తి అధికం"

నవ్వుకున్నాడు వరద.

గుండె పగిలేట్లు చర్చిగంటలు మ్రోగుతున్న క్షణాన్న పీతాంబరం రవణమూర్తి ముంగిటలో ఉన్నాడు. చీర మార్చుకుంటున్నదల్లా అతడ్ని చూసి సిగ్గుపడి పక్కకి జరిగింది సుజాత. రవణమూర్తి అలికిడిలేదు.

"నిలబడిపోయారేం? రండి లోపలికి" అంది సుజాత తలుపులు బార్లాతీసి

అప్పుడే వెలిగినదీపం ఎగురుతోంది. బయటకన్నా లోపల చీకటిగా గాలి బరువెక్కినట్లు స్తబ్దుగా ఉంది. ఇంకా జుత్తుముడి బాగాలేదని వెనక్కి చేతులు తిప్పి సవరించుకుంటోంది సుజాత,

పీతాంబరం ఎంతకి మాట్లాడకపోయేసరికి నవ్వేసింది. "అదేమిటండోయ్ మూగనోము పట్టుక్కూర్చున్నారు? మాట్లాడడంలో యిద్దరికీ పందెమా?" అంది గుమ్మం మీద కూచుని గడ్డం కింద చేతిని ఉంచుకుంటూ.

పీతాంబరానికి నవ్వొచ్చింది ఒంటిగా చీకటి మధ్య కూచున్న ఆమె ముఖం చూడటానికే భయం వేసింది .

"పోనీలెండి నాతో ఎందుకు మాట్లాడతారు? అన్నయ్య కోసం వస్తారుగాని" అని చిన్నపిల్లలా ముక్కుతూ లేచి పెరటి తలుపు తీసుకుని లోపలికి వెళ్ళింది. కుంచెతో చిమ్మినట్లు పల్చటి గాలితెర పీతాంబరాన్ని వణికించింది. ఎందుకో ఒక్కసారిగా అతనికి భయమేసింది, అది భయంకాదు - ఓ తరహా తడబాటు, పిరికితనం, ఒక్కటి రెండుసార్లు పాత పరిచయం ఆ భయాన్ని ఆపలేకపోయింది. మళ్ళీ సుజాత రాకుండా వుంటే బావుణ్ణనుకున్నాడు. కానీ ఎలా గుప్పెట్లో మల్లెపువ్వులు కోసుకు వచ్చింది.

"అబ్బ, ఎంత బావున్నాయండీ పువ్వులు, మీకూ కావాలా ఒకటీ" పువ్వుని అతని ఒళ్ళో పడేసింది.

ఆ సువాసన పరిమళంలో చిన్న దీపం ముందు ఆమె అందం ఔన్నత్యంలో అతనికి మొహం తిరుగుతోంది.

"అబ్బ. అలా చూడకండి నావేపు. మాట్లాడకూడదు పోనీ?"

భయపడ్డాడు పీతాంబరం.

ఇంత చిలిపిదనం, యింత అమాయకత్వం ఎందుకూ ఈమెకు

"మీకు తెలుసా యీ విషయం. నీలవేణి మీ అన్నయ్యని పెళ్ళిచేసుకుంటుందంట"

తుళ్ళిపడింది మొదట.

"నిజం"

"అవును అందుకనే మాట్లాడాలని వచ్చాను"

ఉత్సాహంతో ఎగిరి గంతేసింది సుజాత, "పెళ్ళి చేసుకోమని ఎన్నిసార్లు చెప్పానండి అన్నయ్యకు. నీలవేణంటే నాకెంతో యిష్టం. అబ్బ మీరెంత మంచివారండీ. ఉండండి కాఫీ తెస్తాను" లోపలికి పరిగెత్తింది.

చీకటిపడిన కొద్దీ నీలిరంగు చీర మెరుస్తోంది. ఈ వార్త తెలియగానే చేసిన అల్లరికి జుత్తు ముడివిడి పిన్నులన్నీ చెదిరిపోయి.

"అబ్బ ఆ గదిలో యిరుకు" కుంపటితో వచ్చి ఎదురుగ్గా కూచుంది.

"ఇంకా చెప్పండి - అయితే ఎప్పుడట పెళ్ళి?"

"మీ అన్నయ్య చెప్పలేదూ?"

"సరి. వాడు చెప్పేసరికే అంతా అయిపోతుంది. వాడు ఆడదానిగా నేను మొగాడిగా పుడితే బావుండేది" పీతాంబరం తనని ఆశ్చర్యంతో చూస్తూంటే పకపకా నవ్వేసి ముఖం కప్పుకుంది.

"వచ్చినాడే నీవిభుడు" జావళీ గొణుగుతోంది.

నీళ్ళు మరుగుతున్నాయి. దీపం పెద్దది చేసి బల్లమీద ఉంచింది, చెమటపడుతోంది ఆమెకు.

"గాలి మరీలేదు" అబ్బబ్బ అని విసురుకుంటూ కూచుంది. జావళి శ్రుతి తప్పింది. రెండు చేతుల మధ్యా ముఖాన్ని ఆనించి సిగ్గుపడుతున్నాడు పీతాంబరం. తన హాస్యం ఎక్కడికి పోయిందో తెలీదు.

"మంచి యింట్లోకి పోవాలండీ, ఇది మరీ దరిద్రంగా ఉంది. మీకు తెలుసా? మా అమ్మ పోయింది - నాకిన్నాళ్ళు మా అన్నయ్య చెప్పకుండా దాచాడు. నాకు టి.బి వచ్చి శానిటోరియంలో ఉన్నప్పుడే పోయింది" అంత ఉత్సాహంలో యిదేమంత విచారం కలిగించనట్లు మామూలుగా అనేసింది.

"అన్నయ్య పూర్తిగా పిరికివాడు. నీలవేణి నా దగ్గర పదినెలలు తర్ఫీదు పొందాలండీ. సాయంకాలం ఆవిణ్ణి యిక్కడికి రమ్మంటాను. మంచి పాయసం చేస్తాను. అదేమిటి? నుదురు వణుకుతోందేమిటీ?"

మాటలు అంత తొందరగా ఎవరూ మాట్లాడలేరు. ఆ తొందరలో ఎవరో తోసినట్లు పరుగు చూసి భయపడ్డాడు పీతాంబరం.

పీతాంబరం బాధపడుతున్నాడేమోననుకుని "ఏమీ అనుకోకండి. నాకెలా మెలగాలో తెలీదు. అన్నయ్య చెప్తూంటాడు. అయినా అర్థంకాదు. నేనేం తప్పుచేశానని భయపడాలి? అబ్బ వొళ్ళు యిలా మెలికలు తిరిగి పోతూందేమిటి? వొళ్ళు విరుచుకుంటోంది."

వెళ్ళితే బావుణ్ణు అనుకున్నాడు పీతాంబరం.

నీళ్ళు మరిగి నిప్పులో పడుతున్నాయి. దీపంలో నూనె తక్కువయి మాగన్ను వేసింది.

సుజాత లేచి నిలబడి గోడకి ఆనుకుంది. ఉన్నట్టుండి ఆమె నవ్వులో జీవం అంతా మాయమైంది నుదుటిని గట్టిగా పట్టుకుని నిలబడింది.

"అదేమిటండీ?" అంటున్నాడు పీతాంబరం.

పెదాలు వంపు తిరుగుతున్నాయి. అపురూపంగా తెచ్చిపెట్టుకున్న పువ్వులు గోడకి తలకీ మధ్య నలిగిపోతున్నాయి ఉత్తేజాన్ని ఆపుకొందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తోంది సుజాత.

"ఏమిటండీ అలా?"

మాట్లాడడంలేదు. కళ్ళు మూసుకుంది. క్షణకాలం కుడిచెయ్యి అదురుతోంది భయంకరంగా. ఉన్నట్టుండి అరిచింది బిగ్గరగా.

"భగవాన్? మళ్ళీ తెలివితప్పుతోంది"

ఆధారంలేని కొమ్మ నేలని జారిపోతున్నట్లు గోడని ఆనుకునే నేలకు జారిపోతోంది.

కుంపటిమీద గిన్నె ఒరిగి నీళ్ళు నిప్పులో పడ్డాయి. నిప్పు చీకటి మధ్య ఎర్రగా మెరుస్తోంది.

కిందకి జారితే నిప్పులో పడుతుంది సుజాత. ఒక్కసారిగా చైతన్యం తెచ్చుకున్నాడు పీతాంబరం.

"దాహం" అంటోంది చివరగా.

ఒక్క ఉదుటునపోయి రెండు భుజాలూ పట్టుకుంటే చేతుల్లోకి జారిపోయింది.

ఎగిరిపోతున్న నల్లటి మేఘం బరువెక్కి కదలి చెదిరిపోయినట్లు నీరసంగా అతని భుజం మీద సొమ్మసిల్లి వాలిపోయింది. పల్చటి ఆ సౌకుమార్యానికి ఆ క్షణాన ఎంతో శక్తి వచ్చింది. ఆ చేతులు పిడికిళ్ళు తిరిగి వీపుని బలంగా గుచ్చుకున్నాయి. అంత బరువును మోయలేక తూలిపోతున్నాడు పీతాంబరం. ఆశ్చర్యం, వణుకు, భయం, స్పందన, నిశ్శబ్దం యిన్నిటి మధ్య తన చేతుల్లో శరీరమే కానీ జ్ఞానం మిగలని ఓ అపూర్వపదార్థం.

ఆమెకు స్పృహలేదని గుర్తించేసరికి అతనికి వణుకు పుట్టింది. వెచ్చటి శ్వాస మెడని కాల్చేస్తోంది. ఇంకా పూర్తిగా నిశ్చితానికి రాని యౌవనం అతని గుండెను కోసేస్తోంది. ఆ మరువం లాంటి మార్దవం, జుత్తు కమ్మదనం, వొంటిరాపిడిలో విద్యుత్తు - కంఠంలోను, మనస్సులోనూ బెరుకు ప్రవేశించి ఉన్నట్టుండి అతని కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి.

అదేమిటి - సౌందర్యం కౌగిలింతలో ఏడుస్తారా ఎవరన్నా!

కళ్ళు సగం మూతబడి, అనుభవం తీపి వొళ్ళంతా పాకి, రక్తం సుడులు తిరిగి, బలహీనమయి - తూలిపోయిన ఆమె శరీరపు పరిష్వంగంలో చైతన్యం లేకపోతేనేం గాక, ఆ అనుభూతికి అర్థముందా అసలు!?.

మెడచుట్టూ తిరిగిన ఆమె చేతులు ఎంతకీ విడటంలేదు. ఆ బలానికి సొమ్మసిల్లిన తన శరీరం ఎదురు తిరగలేకపోతోంది.

ఎక్కడో అంతరాంతరాల్లో ఆమె గుండె కొట్టుకోవటం బలహీనంగా తెలుస్తోంది. మరీ చల్లబడుతున్న ఆమె వక్షాలు అతనికి చలిపుట్టించి జలదరించేట్లు చేస్తున్నాయి. మంచులోంచి అగ్ని జ్వాలలేచి, సౌకుమార్యానికి చిచ్చురగిల్చి, స్వరూపంలేని ఆవేశాన్ని ఉత్పత్తం చేస్తున్నాయి.

అంతా క్షణికం.

భయం పోయింది. వణుకుదలా, సంశయం, అన్నీ దారులు వెతుక్కున్నాయి. అన్నిటికీ జవాబు ఆమె చల్లని శరీరం. యౌవనం, ఆమెను గట్టిగా శరీరానికి వత్తుకున్నాడు పీతాంబరం.

ఆవేశం ముందు సౌందర్యం తలవంచింది.

గిన్నెలో నీరంతా వేడికి యింకిపోయింది. నిప్పు ఎర్రగా మెరిసి కొడిగట్టి నుసులు రాలిపోయింది.

ఉన్నట్లుండి చర్చి గంటలు మ్రోగడం ప్రారంభించి ఆగడం మరిచిపోయాయి.

రవణమూర్తి వచ్చేసరికి అంతా సరి.

ఒళ్ళు తెలీక మంచానికి అడ్డంగా పడివున్న సుజాతని చూసి గుండె కొట్టుకున్నాడు రవణ. ఆమె స్పృహతప్పడం తనకేం కొత్తకాదు. కానీ యిదేమిటి?

ఒక్కటే తోవ అతనికి. వెనక్కి చూడకుండా పరిగెత్తి వరదని తీసుకొచ్చాడు. ఈ ఘటనల మధ్య తాను దుఃఖించాలి అన్న విషయం మరచిపోయాడు.

ఆసుపత్రికి చేర్చేసరికి తొలికోడి కూసింది. ఇంకా సుజాత బరువుగా ఊపిరి తీస్తూనే వుంది.

రవణమూర్తి నిర్లిప్తత చూసి భయపడ్డాడు వరద.

సుజాత అప్పుడే అలసి నిద్రపోయినట్లుగా నిశ్చింతగా కళ్ళు మూసుకుని వుంది.

శక్తి బలం, సంతోషం, వత్తిడి, రక్తం దూకుడు, శరీరాన్ని జివ్వుమనిపించిన అనుభవం మనసు సొమ్మసిల్లినప్పటి జ్ఞాపకం, అనుభూతిలో మూర్ఛ - యివన్నీ కలిసి నిశ్శబ్దంలో విచ్చుకుని, ధ్యానంలో మునిగి, తమలో తాము నవ్వుకుంటున్నాయి తాత్వికంగా.

డాక్టరు వెళ్ళిపోయాక మెట్లమీద ముణుకులపై తల ఆనించి కూచున్న రవణ దగ్గరకు వచ్చాడు వరదరాజులు.

దూరపు చీకటిలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు రవణ.

"ఏమ్రా అది?" అంటే మొదట తుళ్ళిపడ్డాడు.

"ఏమో నాకు తెలీదు, వచ్చేసరికే పడివుంది. అసలు యీ కష్టాలకు ఏమిటి? ఎందుకు? ఉంటుందంటావా?"

వాణ్ణి ఎలా ఓదార్చాలో తోచలేదు వరదకు.

తూర్పున తెలుపుచారలు దట్టమవుతున్నాయి. వసారా అంతా ఫినాయిల్ జల్లుతున్నాడు స్టాఫ్ ఫ్యూన్. వాసన గుప్పుమంది.

సుజాత పిలిచినట్లనిపించి ఇద్దరూ తుళ్ళిపడి లేచారు. "దాహం" అంది. కాఫీ తీసుకు రావడానికి పరిగెత్తాడు రవణమూర్తి.

అప్పుడే కలలోంచి మెలుకువ వచ్చినట్లుగా స్వచ్ఛంగా వుంది. ఒక్కసారిగా నుదురంతా చెమట పట్టింది. వరదరాజుల్ని చూసి మొదట ఆశ్చర్యపోయింది.

"వచ్చారా మీరూను?" అంది.

తలూపాడు "ఇప్పుడెలావుంది నీకు?"

"బద్ధకంగా వుంది. అంతా కొత్తగా, అబ్బ యింత వెలుగెందుకూ కళ్ళల్లోకి వస్తూ" అని ముఖం కప్పుకుంది. నీడలో సుజాత తెల్లని ముఖం మెరుస్తోంది. కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తోంది.

స్పృహతప్పి క్రిందకి జారిపోవడం గుర్తుంది. అంతే మళ్ళీ తెలివి వచ్చేసరికి ఏదో పెద్ద మార్పు జరిగిపోయినట్లుంది. ఒళ్ళంతా నిండుగా చిన్న గాలికయినా వణికిపోతూ, వెలుగుని చూడలేక కళ్ళు మూసుకుంటూ, శరీరమంతా గగుర్పాటు చెందుతూ అంతా కొత్తగా ఉంది.

కళ్ళు మూసుకుంటే వెయ్యి గులాబీలు గుత్తులు తీర్చినట్లూ, హోరు పెడుతున్న సముద్రతరగ లేచినట్లూ, ఆకాశంలో తెల్లటి మేఘాలన్నీ దూదిపింజల్లాగా లుమ్మతిరిగినట్టు - యిలా

కళ్ళు విప్పి ఎవర్ని చూడాలనిపించడంలేదు. అలా ఒంటిగా తనకు తనే వీలయినంతసేపు ఉండిపోవాలనిపిస్తోంది.

''మీరు వెళ్ళిపోండి. నాకు నిద్దరొస్తోంది''

వరదరాజులు నివ్వెరపోయాడు.

బయటికి వస్తే నైట్‌క్వీన్ యింకా చివరి వాసనల్ని నింపుతోంది. రవణమూర్తి కాఫీ తీసుకుని వస్తూ కనిపించాడు.

సుజాతకి యిచ్చి తిరిగి వస్తూ ''మళ్ళీ మొదలు. ఇంటికి ఎప్పుడు పోదాం అంటోంది'' అన్నాడు.

వరదరాజులు యింకా నిశ్శబ్ధంగానే కూచున్నాడు.

''సుజీకేం భయంలేదు - ముఖ్యంగా యీసారి'' అన్నాడు.

సుజాత మళ్ళీ ఎప్పుడు లేచిందో యేమో సన్నగా ఏదో పాట గొణుగుతోంది.

నవ్వుకున్నాడు వరద.

వెలుగులో ఎదురుగ్గా తోటలోని ఎర్రగులాబి కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది.

రవణమూర్తిని కాఫీకని లేపాడు.

మత్తుగా నడుస్తున్నాడు రవణ.

''నిన్ను పెళ్ళిచేసుకుంటానందిట నీలవేణి?'' అడిగాడు వరద, మాట్లాడలేదు రవణమూర్తి. ఆసుపత్రి దాటేసరికి రోడ్డుమీది హడావుడి వినిపిస్తోంది.

''నీతో అందా?''

''లేదు''

''చేసుకొంటావా?''

ఆవులించి ముఖం రెండు చేతుల్తో తుడుచుకున్నాడు.

''చెల్లెలికి కాస్త బాగుపడితే'' అన్నాడు.

రోడ్డుకి అడ్డంగా చిన్నపిల్ల పరిగెత్తుకు వచ్చిందని కారుకు హఠాత్తుగా బ్రేకువేశారెవరో, పెద్ద చప్పుడయింది. భయపడి ఏడుస్తోంది చిన్నపిల్ల.

ఓ కుక్క మొరగడం ప్రారంభించింది ఈ గొడవ చూసి.

హోటల్లో మరీ రద్దీగా ఉంది.

ప్రవృత్తి స్వరూపాన్ని యింకా గుర్తించలేని వరదరాజులు అప్పటికి కాఫీతాగి స్తిమితపడ్డాడు ప్రపంచంలో చాలామంది లాగా -

కుక్క యింకా అరుస్తూనే ఉంది.

**కుండపోతగా** వర్షాలు ఎత్తుకున్నాయి.

కత్తులు ఝుళిపించినట్లు మెరుపులు ఆకాశాన్ని వణికించాయి. ప్రకృతి ప్రపంచమీద కసితీర్చుకుంటున్నట్లుంది. వర్షపు బలానికి ఆపుకోలేక గన్నేరుచెట్టు సగం నడుం వంచి పవిత్రమై, మిగిలిన రెండు పువ్వుల్తో మెరుస్తోంది.

పగలూ, రాత్రీ ఒకలాగున్నాయి.

పదిరోజుల తరువాత ఓనాడు సాయంకాలం కాస్తపాటి తెరపి యిచ్చేసరికి "ఎక్కడికి వెళ్దామా?" అని ఆలోచించుకుంటే నీలవేణి గుర్తుకొచ్చింది వరదరాజులుకి.

మూడు నెలల క్రిందట యింటికి వచ్చింది. అంతే. మరి కనిపించలేదు.

ఉండుండి వీచే చెమ్మగాలి ఒంటిని ఒరుసుకుని జడిపిస్తోంది.

చూరునుంచి జారే చుక్కల చప్పుడు లయతో వినిపిస్తోంది.

అప్పుడే చీకటి కూడుకుంటున్న ఆకాశం యౌవనం చివరి భాగంలో నిలబడ్డ స్త్రీ దిగులు మనస్సులా ఉంది.

వాలిన మొక్కలికి మోపు కట్తోంది డాలీ. మధ్య మధ్య తనని చూస్తోంది తెలీనట్లు అక్కడ మరీ చలిగా వుంది. లేచి వీధిలోకి వచ్చాడు.

క్షణం క్రితంపడ్డ వర్షంతో నేలంతా తడిసి చెలమలు కట్టింది.

అప్పుడే ఓ పక్క పరుచుకున్న చుక్కల్తో ముత్యాలు జల్లినట్లు ఆకాశం వెలుగు ప్రతీ చెలమలోనూ రెట్టింపయి మెరుస్తోంది.

పీతాంబరం ఇన్నాళ్ళయి కన్పించకపోవడం ఆశ్చర్యమే మరి. ఎవరూ దగ్గర లేకపోతే చెట్ల ఎదురుగ్గా కూచుని వాటితో సావాసం చేసి మాట్లాడిస్తాడు.

లోపలికి వెళ్తే నీలవేణి ఒక్కతే కనిపించింది. చూస్తూనే నివ్వెరపోయాడు వరద. మూడు నెలల క్రితం చూసిన నీలవేణి పోలిక పట్టనంతగా మారిపోయింది.

"అదేం? అలా.." అంటే

సిగ్గుపడింది - "నాకేం? బాగానే ఉన్నాను. కూచోండి" అంది.

ఇదివరకంత శుభ్రంగా, అందంగా కన్పించడంలేదు యిల్లు. టేబిలు మీద వర్షానికి తడిసి మరీ ఒసిలిపోయిన రెండు గులాబీలు తప్పిస్తే గదితో కొత్తదనాన్ని చెప్పేవి ఏమీ మిగలలేదు. నీలవేణి పాతబడి మరీ పాతబడి వెలిసిపోయిన రంగు చిత్రంలా వుంది. నవ్వితే భయం. ముందు బ్రతుకు గురించి పిరికితనం, సంశయం తోస్తోంది.

ఎంతో ఊహించుకుని వచ్చిన వరద ఆమెను చూసి  సగం చచ్చిపోయాడు

మరీ పల్చగా లేని కనకాంబరం రంగు చీరె, తెల్లటి బ్లౌజు వేసుకుంది. పొడవాటి జుత్తును వీపు మీద విచ్చలవిడిగా జల్లేసి, ఎర్రటి బొట్టును నుదుటినిండా దిద్దుకుంది.

"నువ్విలా ఉండకూడదు - ఇంత విచారంగా"

నీలవేణి కుంచుకు పోయింది. రక్తంలోని ఎరుపు మరీ బలహీనంగా, నీరసంగా ప్రాకింది చెక్కిళ్ళకి.

కళ్ళు ఎత్తకుండానే కూచుంది.

"పీతాంబరం ఏడీ?"

"తెలీదు నాకు"

"అదేమిటి?"

"ఊరికి వెళ్ళాడా?"

"ఏమో తెలీదు."

నీలవేణి కంఠంలో ఉద్విగ్నత చూసి నిర్ఘాంతపోయాడు వరదరాజులు. చెప్పలేని దిగులూ, మెరిసే కళ్ళలోని శూన్యత్వానికి అర్థం తెలీడంలేదు.

లేచి గుమ్మానికి కర్టెను సరిచేస్తూ తనే ప్రారంభించింది.

"మీ యింటికి వచ్చినరోజునుంచీ ఆయన యింట్లో లేరు"

"ఎక్కడికి వెళ్ళారు?"

నవ్వింది 'చిన్నపిల్లాడిలా అడుగుతారేం?' అన్నట్లు

"ఏమో"

చూసి పీతాంబరం వర్షపుకోటు తీసుకొచ్చి యిచ్చింది. తొడుక్కుంటే భుజాల్ని పట్టుకు వదులుగా వేలాడుతోంది. ఇద్దరికీ నవ్వొచ్చింది.

"పీతాంబరం ఎప్పుడొస్తాడో తెలుసా పోనీ?"

"ఊహూ, తెలీదు" అంది గుమ్మం పట్టుకు నిలబడుతూ.

చూరునుంచి ధారలు కట్టి నీరు జారుతోంది.

"ఇప్పుడేం చేస్తావు నువ్వు?"

"అంటే?"

"ఒంటరిగా యిక్కడ"

తలుపుకి తల ఆనించి ముఖాన్ని అటు తిప్పుకుంది.

"నాకేం? నన్నెవరూ ఎత్తుకుపోరు"

పెద్ద శబ్దం చేస్తూ లారీ వెళ్ళి బురద చిమ్మింది.

ఏదో తోచి వర్షంలోకి వచ్చినవాడల్లా మళ్ళీ మీదకి వచ్చాడు.

నీలవేణి విస్తుపోతోంది.

"ఎప్పుడన్నా నా అవసరం కనిపిస్తే పిలుస్తానని మాట ఇయ్యి" అన్నాడు.

ఆమె హృదయం సంతృప్తయి మమతల మాధుర్యంలో నలిగి పోతోంది.

ఇంకా మౌనంగానే ఉండడం గమనించి "చెప్పిందే వెళ్ళనివాళ" అన్నాడు.

చివరికి సరేనంది.

అతను కంటికి కన్పించనంతగా చీకట్లో దూరమయాక తెలివి తెచ్చుకుని చూస్తే ఏడుస్తోంది తను.

ఇదేమిటి?

"పీతాంబరం కనిపించడంలేదట" అంది ఆరోగ్యం వరదని చూడగానే.

"పీతాంబరం ఎవరు?" అన్నారు గోవర్ధనరావుగారు కుర్చీలో వెనక్కి చేరబడి చుట్టపొగ హుందాగా వదుల్తూ.

గుర్తుచేసింది ఆరోగ్యం. "ఓహో, అతనా, ఎందుకు కనిపించడం లేదు? అలాంటివాళ్ళు చేసే ప్రతిపనికి ఏదో అర్థం ఉంటుంది. ఒప్పుకోదుగాని, మా వినతని వెంకటపతికిచ్చి పెళ్ళిచేసేవాణ్ణి" అన్నారు.

"మీకెలా తెలుసు" అన్నాడు వరద ఆరోగ్యంతో.

"మొన్న బజారుకి వెళుతూ అలావెళ్ళాను"

"నేనూ అలాగే విన్నాను"

కింద ఇన్‌కంటాక్సు ఆఫీసరుగారు మరో కుక్కను కూడా తీసుకొచ్చారు. రెండూ కలిసి ఇంటిని గందరగోళం చేస్తున్నాయి. పిల్లల అరుపులు, నౌకర్ల హడావుడీ అంతా దుర్భరంగా వుంది.

"మనిషి నిజాయితీ మీద నమ్మకం లేక కుక్కల్ని కూడా తెచ్చారోయ్ వాళ్ళు. కుక్క విశ్వాసానికి కాదు చిహ్నం, చికాకుకి" అంటూ లేచారు ఆఫీసరుగారితో చెప్పడానికి.

ఆయన కిందకి వెళ్ళాక ఊలు స్వెట్టరు అల్లుతున్నదల్లా ఆరోగ్యం వరద దగ్గరికి వచ్చింది.

"అమ్మాయి బాగా నీరసించిందోయ్ గుర్తుపట్టావా?" అంది. ఆశ్చర్యపోయాడు.

"ఎవరు?"

"నీలవేణి - మొన్నవెళితే దిగులుగా వుంది. బ్రతకడం తెలీని మనిషి. పాపం" అంది.

"ఏమిటాలోచిస్తున్నావ్?"

"నోరువిడిచి ఏమీ చెప్పదు. అడిగితే నవ్వి ఊరుకుంటుంది ఎలా?"

ఫక్కున నవ్వేసి చిన్న కుర్రాణ్ణి చూసిన చూపు చూసింది.

ఆ నవ్వులో వినత చిలిపితనం, వయస్సు మలచిన అందాలు తోచాయి. "అందరూ వినతలాగే ఉండరోయ్. నువ్వింకా ప్రపంచాన్ని చాలా చూడాలి. నీలవేణిలో సగం ఉంటే వినత బావుండేది" అంది.

లోపల్లోపల ఆ ప్రశంస గిలిగింతలు పెట్టింది వరదని, శుష్కించి శూన్యం కేసి చూస్తూ కూచునే నీలవేణి నల్లని ముఖం గుర్తుకొచ్చింది. ఆనాడు అలా ఒంటరిగా ఎందుకు వదిలేసి వచ్చేశానా అనుకున్నాడు.

ఆరోగ్యం చేతిలో ఎర్రటి ఊలు మెలికలు తిరుగుతోంది. వరద ఏదో చెప్పబోతే "ఆయన వస్తున్నారు, ఊరుకో" అంది మెల్లగా.

కర్ర చప్పుడు చేసుకుంటూ వచ్చారు గోవర్ధనరావుగారు. "కుక్కల అరుపుల్ని తగ్గించవయ్యా మహానుభావా అంటే ఓ కుక్కని యిస్తాను పెంచుకోకూడదూ అంటున్నాడాయన. ఆఫీసరు గారి కుక్కలు కూడా బంగారమే తింటాయోయ్. నేను విద్వాంసుణ్ణన్న విషయం కూడా మరిచిపోయి నన్ను కరవడానికి లేచాయి. రేపట్నుంచీ ఆశ్చర్యపోతున్నావు? ఇప్పుడిప్పుడు ఆరోగ్యం నాకు విడాకులిస్తుందన్నా బాధపడను నేను. ఇదిగో, ఈ చుట్ట సరిగ్గా వెలగడం లేదంటే మనసు పీకుతుంది. ఒక్కటి చెప్తాను భాయ్. ఏదైనా సరే మన దగ్గరికి. యింకా దగ్గరికి మన అనుభవాల పరిసరంలోకి వచ్చి పోయిందంటే కించపడాలి, దుఃఖించి తల పగులగొట్టుకోవడం కాదు. నీలవేణి గురించి నువ్వు విచారించావంటే ఆమె నీకు కావాలని మనస్సులో ఏమూలో ఆశ కదిలిందన్నమాట."

భయపడ్డాడు వరదరాజులు. మనస్సును పూర్తిగా చదవడం చేతనయితే జీవితం ఎంత దుర్భరమయేదా అనిపించింది. గోవర్ధనరావుగారు అలా చెప్పాక తన మనస్సును తానే శస్త్ర చికిత్స చేసుకోలేకపోతున్నాడు. కానీ ఒక్కటి మాత్రం నిజం "నీలవేణి గురించి ఏమీ ఆశపెట్టుకోలేదు తాను."

"స్వార్థానికీ, దుఃఖానికీ సంబంధం ఉన్నదంటారు మీరు? నేను నమ్మను. ఉదాహరణకి తల్లిపోయిందనుకోండి"

నవ్వారు గోవర్ధనరావుగారు, "తల్లినుంచి తనకి వచ్చే ఆదరం, ఆ అభిమానం తనకు లేదే అని ఏడ్చేవాళ్ళే తప్ప 'ఆమె తనది' అన్న భావం పోయిందనే దుఃఖాన్ని పొందే వారెందరుంటారంటావ్? తల్లి కోసం కాదు. మంచి వ్యక్తిలేని తన అసహాయత్వాన్ని చూసి ఏడవడమన్న మాట అది. ఎప్పుడూ ఊహించని ఓ పని జరిగితే అదీ మన ప్రక్కవాడే చేస్తే ఎలా జరిగిందన్న ఆశ్చర్యం కంటే నాకు అందని పనివారికెట్లా సాధ్యమయిందన్న కించ మిగులుతుంది. మనస్సుకి స్వతహాగా వున్న బలహీనతే అది. అందుకనే మనస్సు చెప్పేమాట వినకపోవడం మొదట అలవాటు చేసుకోవాలి. అంత అసంబద్ధపు, అనవసరపు ఆర్గాన్ మన శరీరంలో మరొకటి లేదు దాన్ని ఆలోచించకుండానన్నా చేయాలి. ఆలోచనల్ని పట్టించుకోకపోవడమన్నా నేర్చుకోవాలి. అచేతనంగా కూర్చున్న వరదరాజుల్ని పట్టించుకోకపోవడమన్నా నేర్చుకోవాలి."

అచేతనంగా కూర్చున్న వరదరాజుల్ని చూసి నవ్వుకున్నారు గోవర్ధనరావుగారు.

"నిన్ను మళ్ళీ పాత సంశయాలు కలవరపెట్టినట్లున్నాయి. ఉండు, నిన్ను కాస్త మరమ్మత్తు చేయాలి" అని "ఏమండోయ్ ఇంటావిడగారూ వరదరాజులుకి మంచి కాఫీ తయారుచేయాలి. కొత్త పాఠాలు నేర్చుకుంటున్నాడు" అని అరిచారు ఆరోగ్యాన్ని ఉద్దేశించి.

లోపల ఏదో పాట గొణుగుతోంది ఆరోగ్యం,

కుర్చీ వేసుకుని కూచుని ప్రారంభించారు గోవర్ధనరావుగారు.

మూడు నెలల తరువాత ఓ రోజు సాయంకాలం నీలవేణి దగ్గర్నుంచి ఉత్తరం తీసుకొచ్చాడొక కుర్రాడు.

'ఈ పాటికి నన్ను మరిచిపోయి ఉంటారు. ఓసారి యిక్కడికి రాగలరా? మీ యిష్టం?'

వర్షాకాలపు రోజులవి.

భూమంతా చెమ్మపట్టి, చివికి నానుతోంది. ఎండకోసం, మొహం వాచి మోరచాచినట్లుంది ప్రకృతి. అంతా మందకొండిగా, జీవితంలో అన్ని ఆశలూ పోగొట్టుకున్న దరిద్రుడి బ్రతుకులాగా వుంది.

గన్నేరు చెట్టు అలసిపోయింది. ఎప్పుడన్నా ఓ పువ్వు తలెత్తి, నవ్వి, రాలితే వుంది లేకపోతే లేదు.

నీలవేణి వ్రాత చూడగానే ఏదో చేసిన వాగ్దానం తప్పినట్లు బాధపడ్డాడు. మూఖీభావంతో, ప్రత్యేకత లేకుండా వరసగా జారిపోతున్న రోజుల మధ్య పాతవ్యక్తులూ, పాత ఆలోచనలూ అన్నీ తెలీకుండానే వెలిసిపోతున్నాయి. మెదడుకి వృద్ధాప్యం వచ్చిందేమోనని భయం వేసింది.

ఎంత చదివినా రెండే వాక్యాలు.

ఆలోచించుకోడానికయినా వ్యవధి లేకుండా బయల్దేరాడు.

నవ్వుతోనే పలకరించింది నీలవేణి. ఆ నవ్వుతో యెంత శిక్షవిధించగలదా? అనిపించింది వరదకి. అంత దిక్కారం, తగాదా మరిచిపోయి దూరంగా పోవాలనుకుంటున్న మిమ్మల్ని కదుపుతున్నానంటూ క్షమాపణ అన్నీ అంత చిన్న నవ్వులోనే.

"ఎలా వున్నావ్? నన్ను పిలుస్తావని తెలుసు"

"అంతవరకూ రాదల్చుకోలేదా?"

"ఉద్యోగం తీసేస్తారేమోనని భయం వేసింది. నా సత్తామీద చాలామందికి నమ్మకం పోయింది. అందులో బలరాందాసు ఒకడు"

దుమ్ముకొట్టి పాతబడినట్లున్నాయి గదులు. కర్టెన్లు తీసేశారు. నీలవేణి మాత్రం మామూలుగా లేదు. కళ్ళల్లో ఆకాశం నీడలు ప్రతిఫలించినట్లు చల్లదనం, పూర్తి పెరుగుదల లేని మొగ్గ సగంలో రాలినప్పటి నిర్వేదం, పర్వతాలు బీటలు వారి ఏవో జలపాతాలు లేచి చెదిరినప్పటి భీభత్సం ఆ కళ్ళల్లో కదిలింది. తనకి తెలీకుండా తనలో తానే నశించిపోతోంది నీలవేణి.

"ఏం పిలిచావ్?" అని అడిగినా యింకా ఆలోచిస్తోంది.

"ఒక్కసారి ఊరు వెళ్ళిరావాలి" అంది నేలకేసి చూస్తూ.

"ఏ ఊరు?"

"ఇక్కడికి ఇరవైమైళ్ళుంటుంది. పక్క స్టేషన్లో దిగితే ఎనిమిది మైళ్ళు"

"ఇక్కడిప్పుడేం నీకు?"

నవ్వింది. అప్పటి నిస్పృహ, నిరీక్షాభావం అన్నీ తెలిసొచ్చాయి.

"పీతాంబరం మళ్ళీ తిరిగి వస్తాడేమోననుకున్నాను"

"నేనూ అలానే అనుకున్నాను."

"ఇలా పారిపోయాడేం? అసలు విషయం ఏమిటి? నువ్వేదో దాస్తున్నావ్ నా దగ్గర్నుంచి"

ఈసారి నీలవేణి ముఖంలో ఉదాసీనత కనిపించింది. "ఎందుకు దాచాలి నేను? నా విషయమే నాకు పూర్తిగా తెలీదు" అని గొణిగింది.

వరద నిర్విణుడయ్యాడు.

మరి కాస్సేపటికి స్థిమితపడింది. కావాలని తెచ్చిపెట్టుకున్న నవ్వుతో తలెత్తి "ఓసారి మీరు నాతో రావాలి. నాకెవ్వరూ లేరు. ఆ ప్రాంతాలన్నీ కొత్తనాకు" అంది తొందరగా.

వరద ఇంకా మాట్లాడకపోవడం చూసి నొచ్చుకుంది.

"మర్యాదగా బ్రతికే వ్యక్తుల మధ్య తిరగలేదు నేను. ఎలా మెలగాలో తెలీదు నాకు. మంచిదనిపిస్తేనే రండి" ద్వారం దగ్గర ఏదో పని కల్పించుకుని లేచింది.

కంఠంలో వణుకు కనిపించేసరికి భయపడ్డాడు.

"ఇప్పుడావూరు వెళ్ళడం ఎందుకు? ఇక్కడేం నీకు?"

చటుక్కున యిటు తిరిగింది. "అర్థం కాదేం మీకు? పట్నంలో బ్రతకడానికి చాలా కావాలి"

ఆమెలో ఉద్వేగం చూసి చకితుడయాడు.

వరద తనవేపే విచిత్రంగా చూస్తూండడం గమనించి దృష్టి మళ్ళించుకుని బుద్ధుడి దగ్గర ఊదొత్తులు వెలిగించింది. పొగ మెలికలు తిరిగి సువాసన వొళ్ళంతా లుమ్మ తిరుగుతోంది.

నీలవేణి నిశ్శబ్దాన్ని తను బదిలీ చేసుకున్నట్టు స్తబ్ధుగా, చేతనారహితంగా కూచున్నాడు. ఎంతోసేపటికి ఆమె కదిపితే తెలివొచ్చింది.

"ఏమిటాలోచిస్తున్నారు?" అంటే –

గాభరాపడి ఏం చెప్పాలో తోచక "ఏంలేదు వెళ్ళాలి" అని లేచాడు. పకపకా నవ్వేసింది నీలవేణి.

చలికాలంలో వంటిమీద చల్లటి నీరుపడితే ఎలా వుంటుందో? అంత చల్లదనం మనస్సులో కమ్ముకొచ్చింది వరదకి.

"నవ్వుతావేం?" అన్నాడు.

"ఏం లేదు చాలా వేళయింది వెళ్ళండిక. తోవ తెలీదేమో? అక్కడ చాలామంది ఉంటారు. వాళ్ళకి తోవ తెల్సు. వాళ్ళ చేయి పుచ్చుకుంటే ఆ త్రోవనే మిమ్మల్ని తీసుకుపోతారు" అంది నవ్వాగడంలేదు.

వెనక్కి తిరిగకుండా నడిచి వచ్చేసాడు. మలుపు దగ్గర నిలబడి తిరిగి చూస్తే దూరంగా నీలవేణి నీడ కనిపిస్తోంది.

అంతా అయోమయంగా, చెరిపేసిన రంగు చిత్రం లీలలాగా అప్పటి జ్ఞాపకం మిగిలింది.

తీరా యింటికొచ్చి కుర్చీలో కూచుంటే ఒక విషయం వెన్నుతట్టినట్లు గుర్తుకొచ్చింది.

నీలవేణి ప్రశ్నకు తను జవాబు చెప్పలేదు.

నీలవేణి అన్న మాటలు ఒక్కొక్కటి గుర్తుకొచ్చి సిగ్గుతో కుంచుకుపోయాడు.

తన మౌన, బిడియం, మాట్లాడలేని మంకుతనం అన్నీ గుర్తుకొచ్చి అసహ్యంగా కనిపించాయి.

ఇంతసేపయాక నీలవేణి నవ్వుకి పూర్తి అర్థం తెలిసింది. నవ్వులో ప్రతీ శబ్దం యింకా గుండెను కోస్తోంది.

ఉద్రిక్తత దౌర్బల్యం. చాలామంది కంటే ఓ అడుగు ముందుకు వేశాననుకున్న వాణ్ణి సైతం గుంజి వెనక్కి లాగేస్తుంది. గంజాయిలాగా మత్తుకమ్మించి జోకొట్టి నిద్రపుచ్చుతుంది, లేవనయినా లేవకుండా. అమీనాకు పెళ్ళి జరిపితేనేం? నీలవేణిని నెలల తరబడి పోషిస్తేనేం? విశ్వేశ్వరాన్ని ఉద్ధరిస్తేనేం? ఒక్క నిముషం, ఒక్క క్షణం చాలు.

కుండ పింగాళీ చిప్పతో అన్నది, "ఛఛీ ఆవలికి పో మట్టి మొహమా?" అని వరదరాజులకి నవ్వొచ్చింది ఆలోచించుకున్న కొలదీను.

మర్నాడే వెళ్ళి "వెళదాం పద. సాయంకాలం సిద్ధంగా వుండు" అని వచ్చేశాడు ఈసారి నీలవేణి దిమ్మెరపోయింది.

విశాఖపట్నానికి దాదాపు యిరవై మైళ్ళు కొత్తవలస.

అక్కణ్ణుంచి రామాగ్రహారానికి పోవాలంటే ఎనిమిది మైళ్ళు. నాటుబండి ప్రయాణం తప్పదు. అదీ దొరికితే ఉంది. లేకపోతే లేదు.

రైలు దిగేసరికి సరిగ్గా పన్నెండయింది. అన్నీ తనే అయిన స్టేషన్ మాస్టరూ, చలికి వణికే బిచ్చగాడూ, కాలు తెగిన మేకపిల్లా తప్పిస్తే అక్కడెవరూ లేరు.

రైలు వెళ్ళిపోయాక జివ్వుమంటున్న అడవి మధ్యన వాళ్ళిద్దరూ మిగిలారు.

స్టేషన్‌కి ఊరు చాలా దూరం.

అతి కష్టం మీద అక్కడంతా గాలిస్తే నిండా ముసుగుదన్ని పడుకున్న ఓ బండివాడు ముసలి ఎద్దుని లేపి ముట్టు బిగించాడు.

అర్థరాత్రి దాటిందేమో చిరిగిన బండిగూడులోంచి వెన్నెల చుక్క చుక్కలుగా ముఖం మీద పడుతోంది. బండి బయల్దేరదీసేసరికి రెండయింది.

రోడ్డు గతుకుల్లో చక్రం పడి బండి జోగుతోంది.

నీలవేణితో చీకటి ప్రయాణం, మాటల్లేని స్తబ్ధత, మనస్సులో యిద్దరికీ అర్థం కాని ప్రళయాలు. కళ్ళతో చెప్పలేని భాష అంతా కొత్తగా, విచిత్రమయిన అనుభవంలా ఉంది. పాత పిరికిదనం పోవడంతో ప్రయాణంలో కొత్త ఆహ్లాదం కలిగింది. ఇలా నీలవేణితో ఎప్పుడూ ప్రయాణం చేస్తూనే వుంటే ఎంత బావుణ్ణు?

ఎర్రటి దళసరి చీర వెన్నెల్లో మరింత రంగుపులుముకున్నట్లుంది. మరో అంత చోటులేని గూడులో కూడుకుని మోకాలు మీద తల ఆనించి కూచుంది నీలవేణి. వరద చివరన కూచుంటే, కాళ్ళమీద జల్లినట్లు చీర కుచ్చిళ్ళు కప్పుకుంది.

అలవాటయిన పుంత వెంబట తప్పనట్లు బండి యీడుస్తుంది ఎద్దు. గుడ్డికంట్లో పాపలాగా చంద్రుడు, రాత్రికి పహారా యిస్తున్నట్లు వెదురు పొదలూ అంతా నిశ్శబ్దం. అప్పటప్పటి కీచురాళ్ళ రొద తప్పిస్తే.

"మనం ఎక్కడికి పోతున్నాం?" అన్నాడు కాస్సేపయాక.

తలెత్తితే నీలవేణి కళ్ళు వెన్నెల వెలుగులో స్పష్టంగా తెలుస్తున్నాయి.

మా మావయ్య ఒకరు యీ ప్రాంతంలో ఉండాలి. నాకూ బాగా తెలీదు.. రెండుసార్లు మాత్రం చూశాను."

వెనక్కి చేరబడి కళ్ళుమూసుకుంది.

"అమ్మానాన్నో?"

"ఏమో, వాళ్ళని నేనెరగను"

ప్రపంచమంతా అలసిపోయి ఒక్కసారి కళ్ళుమూసుకుంది. గాలి పలవరింతలకి మేఘాలన్నీ పులకరించాయి. వెన్నెలరాత్రి చంద్రుడు మత్తెక్కి తారని దగ్గరికి తీసుకున్నాడు. ఆకాశం గుండె పగిలింది. ఎవ్వరూ చూడనప్పుడు, ఎవరికీ తెలీకుండా ఓ రంగూ, వాసనా తెలీని చిత్రమయిన పువ్వు భూమిమీద రాలింది - అదీ నీలవేణి.

కళ్ళు మూసుకుంటే ఏవో రంగుచారలు వలయాలు చుట్టి సుళ్ళుతిరుగుతున్నట్లున్నాయి. కళ్ళిప్పితే బంగారు రజం జల్లినట్లు వెన్నెల - నీలవేణి.

ఎంతోసేపటికి మళ్ళీ శక్తి పూరించుకుని "పట్నం వదిలి వచ్చేయడం ఏమీ బాగుండదు నీలవేణి" అన్నాడు.

ఆమె అదిరిపడింది. విచిత్రంగా అతని ముఖం చూసింది.

చివరికి "మీకు తెలీదు" అంది. అంతే, ఇక వరదరాజులు మాట్లాడలేదు.

బండివాడు కునుకుతీస్తూ ఉండుండి ఎద్దును అదిలిస్తున్నాడు. మువ్వలు తెగిపోయాయని దారిలో బండి ఆపి ఎద్దు మెడలో మువ్వపట్టాలు విప్పేశాడు. ఆ శబ్దం కూడా ఆగిపోయింది.

వణుకు పుట్టి కాళ్ళు ముడుచుక్కూచున్నాడు వరద. నీలవేణి భుజానికి వీపు రాసుకుంటోంది.

"ఎంత దూరమోయ్?" అంటే

"అంత కలిపి రెండు కోసులు" అన్నాడు బండివాడు.

తల వెనక్కి చేరవేయడమే తడువుగా వొళ్ళు మరిచిపోయాడు. నిద్రకి సుఖమేమిటి? తెలివొచ్చేసరికి వెలుగు చూడలేక కళ్ళు తిరిగాయి. బండి యింకా నడుస్తూనే వుంది. బండివాడు దిగి మెల్లగా బండిని నడిపిస్తున్నాడు. నీలవేణి ముందుక్కూచుని మెలికలు తిరిగిన బాటవేపే చూస్తోంది.

"నీలవేణీ" అని పిలిస్తే యిటు తిరిగింది.

"బాగా నిద్రపట్టినట్లుంది. ఇలాంటి ప్రయాణాలకి మీరు అలవాటుపడి ఉండరు చాలా కష్టపెట్టాను" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

దూరాన రైలు స్టేషను కనిపిస్తోంది.

"ఎక్కడికి వెళ్తున్నాం మనం?"

"ఇంటికి"

తన నిద్ర తనకే అసహ్యంగా కనిపించింది. ఇంతగా ఎప్పుడూ తెలివి తప్పలేదు.

"మరి వచ్చిన పని అయిందా?" అన్నాడు.

"లేదు. వాళ్ళంతా చచ్చిపోయారు"

తురాయి చెట్టుకొమ్మల్లోకి చూస్తోంది నీలవేణి. కంఠంలో నిశ్చలత, శక్తి, తన దృక్పథాన్ని తాను నిర్ణయించుకోగల స్థైర్యం చూసి విస్మితుడయాడు.

ఇంతలో బండి రైలు కట్ట దగ్గరికి వచ్చేసింది.

**గుమ్మంలో** అడుగుపెట్టేసరికి పీతాంబరం కనిపించాడు.

ఎక్కడిదో పాత తుపాకీని తుడిచి శుభ్రం చేస్తున్నాడు. ఇద్దర్నీ చూసి కిటికీకి ఆనుకుని నిలబడి నవ్వాడు. ఎప్పుడూ మాట్లాడే వ్యక్తి మాట్లాడకపోతే వరదకు ఆశ్చర్యం వేసింది. అంతలో అందుకున్నాడు.

"ఏం సార్! చిన్న ప్లెజర్‌ట్రిప్ వేసినట్లున్నారు చూస్తుంటే. ఉండాలి, శరీరానికిలాగే మనస్సుకి కాస్త ఆటవిడుపు. పిక్నిక్‌కి తిప్పడానికీ, ఎదురుగ్గా కూర్చోపెట్టుకు చోద్యం చూడడానికి నీలవేణిలాంటి వాళ్ళే ఉండాలి, మంచి సెలక్షను"

ట్రిగ్గర్ పనిచేస్తోందో లేదో నొక్కి చూస్తున్నాడు.

ఏదో తప్పు చేసినవాడిలాగా ముడుచుకుని కుర్చీలో కూచున్నాడు వరద.

ఎంతసేపూ పీతాంబరమే మాట్లాడుతున్నాడు. "పొయిట్రీ రాసే కవి ఉండేవాడు. ఆంధ్రా అంతా తిరిగి మనస్సుని సొలేస్ చేసే ఊరు ఏదీ కనిపించక తిన్నగా పోయి ఒరిస్సాలో ఒడ్డులో కూచున్నాడు. ముగ్గురమ్మాయిల్ని ప్రేమించి మూడుసార్లూ ఫెయిలయిన నన్ను, చచ్చేంత సమస్య వస్తే తన దగ్గరకి రమ్మన్నాడు. మొన్న హఠాత్తుగా గుర్తుకొస్తే అక్కడికిపోయి మనస్సుకి మరమ్మత్తు చేయించి తెచ్చుకున్నాను."

ఇద్దరూ మాట్లాడకుండా కూర్చున్నకొద్దీ పీతాంబరానికి ఉత్సాహం వస్తోంది.

"అతను చెప్పిన సలహా ఏమిటో తెలుసా సార్? ఇల్లంతా వెదికి ఓ బొక్కి తుపాకీ నామీద పారేశాడు. ఒక్కటే చెప్పాడు 'నీ ఆనందానికి అడ్డొచ్చిన వార్నెవర్నీ స్పేర్ చెయ్యకు. నీ ఆనందం కోసం అవసరమైతే ప్రపంచాన్ని అమ్మెయ్' " నవ్వు సాగించాడు. హాలంతా దద్దరిల్లింది.

"ఊరుకోండి" అంది నీలవేణి పువ్వుల్ని టేబిలు మీద ఉంచుతూ.

"అరగంటకి మాట్లాడినా ఆడది చెప్పేమాట చెప్పేమాటచెప్పావు. అన్నీ నేర్చుకుని, అంతా ఆలోచించి ఆడదాని దగ్గర రాజీపడతాడు మొగవాడు. ఏమంటారు సార్ మీరు? అదిగో, మీకు నిద్దరొస్తోంది. ఇంటికి వెళ్ళి పడుకోండి"

వరదరాజులు మంత్రముగ్ధుడిలాగా లేచాడు. తలంతా దిమ్మెక్కి స్వాధీనం తప్పుతోంది.

"ఇంటివరకూ నడిచేదా?" అన్నాడు.

"అక్కర్లేదు"

నీలవేణి లోపల ఎక్కడో ఉన్నట్లుంది ఆగకుండా బయటికి నడిచాడు. గుమ్మం దగ్గరికి వచ్చాక "మీమీద నాకు కోపం లేదు సార్" అన్నాడు పీతాంబరం.

వరదరాజులు తెల్లబోయి చూడు.

కొత్తగా, మొదటిసారి భుజం తట్టి "వెళ్ళిరండి" అన్నాడు పీతాంబరం.

నీలవేణి వచ్చి గుమ్మానికి ఆనుకుని నిలబడింది.

ఏదో తెలీని శక్తి తనలో ప్రవేశించి కిందకి, యింకా కిందకి లాగేస్తోంది.

పీతాంబరం దగ్గర్నుంచి అన్నిమాటలు విన్నాక ఇలా చేశానేమిటి నేను? అనుకున్నాడు.

నిప్పులో చెయ్యిపెట్టి 'నాకు కాలలేదు' అని నవ్వేస్తే నమ్ముతారా ఎవరన్నా? 'నిప్పుకాలుస్తుందని మా అందరికీ తెల్సు. కాలలేదంటే నీ శరీరానిదయినా లోపమవాలి, కాలిన అనుభూతిపొందే నీ జ్ఞానేంద్రియాలన్నా లోపించి ఉండాలి. అది నిప్పు, కాలదంటే ఎట్లా?'

పద్మనాభస్వామి ఆలయం బోసిపోయినట్లు ఎడారిలో కాళ్ళు తెగిన ఒంటరి ఒంటెలా మిగిలింది.

గేటుదాటి లోపలికి వచ్చేసరికి రవణమూర్తి తనకోసం ఎదురుచూస్తున్నాడు.

జవం పూరించుకుని, మళ్ళీ పాత నవనవ తెచ్చుకుని కులుకుతూన్న జవరాలిలా ఉంది గన్నేరు చెట్టు.

బంతులు సుళ్ళు తిరిగి అంత అందాన్ని మోయలేక సగం వంగాయి బంతిచెట్లు.

సుజాత యిప్పుడు చాలా తేరుకుంది. ఈ రెండు నెలల్లో రోగం శరీరాన్నీ, మనస్సునీ పరిశుభ్రం చేసి, పవిత్రంగా మిగిల్చింది.

అంతా ఆశ్చర్యంగా, దుస్వప్నంలాగా అప్పటి ఫిట్సూ, బాధలూ అన్నీ మాయమయాయి.

సుజాత ఓ రోజు మసక చీకటి వేళకి గులాబి కోసం వచ్చి దీపం వెలుగులో నిలబడితే ఆశ్చర్యపోయాడు వరదరాజులు.

సుజాతలో చాలామార్పు వచ్చేసింది. చీకటిమధ్య అగ్నిశిఖలాగ కనిపించింది.

ఇలాంటి సుజీని ఎప్పుడూ చూడలేదు తను.

"సుజీ" అంటే.

ఇదివరకులా కాకుండా సిగ్గుపడింది. పదిమాటలు చెపితే ఒక్కసారి జవాబు. బద్ధకంగా, స్థిమితంగా తయారయింది సుజాత. ఎందుకో భయమేసింది వరదకి.

మనిషిలోంచి ఉత్సుకత తీసేస్తే కాస్తపాటి ఇంగితం, మరికాస్త సిగ్గు, నిద్ర నిస్సహాయత, బరువూ మిగుల్తుంది కాబోలు.

ఆలోచిస్తే నిదర్శనాలన్నీ సుజాతలో కనిపించాయి.

"రోజులు మారుతున్నాయి. వయస్సు అలాంటిది" అనుకున్నాడు చివరికి.

ఓ రోజు ఆరోగ్యం కనిపించి "నీలవేణిని రవణమూర్తి పెళ్ళి చేసుకుంటున్నాట్ట" అని చెప్పింది.

ఆశ్చర్యపడ్డాడు "ఎవరన్నారు?"

"నిజమో కాదో చెప్పుమరి"

"అనుకున్నదానికంటే వేగంగా కోలుకుంది సుజాత. వాడి ఆరోగ్యం బాగానే వుంది. అంతా సరిగావుంటే వైశాఖానికి జరిగేట్లుంది"

క్షణం మాట్లాడలేదు ఆరోగ్యం.

"నాకు మట్టుకు ఎందుకో సంతుష్టి కలగడం లేదోయ్. నీలవేణి అమాయకురాలు రవణమూర్తి ఎప్పుడూ ఆరోగ్యంగా ఉంటాడని నమ్మకం ఏమిటి? ఆమె జీవితంలో మోసపోవడం నాకిష్టంలేదు" వరద తెల్లబోయి చూస్తే "అతని మీద నాకు కోపం ఉందని అనుకోకు. ఓ రోజు నువ్వే అన్నావు గుర్తుందా?"

ఏమీ జవాబు చెప్పలేకపోయాడు వరద. "ఆలోచించు" అనేసి వెళ్ళిపోయింది ఆరోగ్యం.

ఓ రోజు..

పద్మనాభస్వామి ఆలయ ధ్వజస్థంబం ముందు దీపం వెలిగి వెలిగి కునికిపాట్లు పడుతున్న సమయాన.

ఉన్నట్టుండి పరిగెత్తుకుని వచ్చాడు రవణమూర్తి. అప్పటి అతని ముఖం చూస్తే గగుర్పాటు కలిగింది వరదకు.

గేటుని ఆనుకుని నిలబడ్డాడు రవణ వరదరాజుల్ని ఓ క్షణం చూసి చేతులమధ్య ముఖం ఉంచుకుని ఏడ్చేశాడు.

అతని భుజం మీద చెయ్యేసి లోపలికి తీసుకొచ్చాడు వరద.

"ఏమిటి విషయం?"

దుఃఖంతో కాస్త స్థిమితపడ్డాడు రవణమూర్తి.

మెల్లగా అన్నాడు "సుజాత తల్లి కాబోతోంది"

వరదరాజులు ఉలికిపడ్డాడు.

మెదడు ఆలోచించడం మానేసి జడమయింది.

రవణ యింకేం చెప్పలేదు. "ఇక సుఖం లేదు నాకు, పారిపోవాలి వీటన్నిటినుంచీ అంటున్నాడు."

"అసలు ఎలా జరిగింది యిదంతా?"

"తెలీదు నాకు. కొన్నాళ్ళనుంచీ సుజీ మారుతోంది. బాగుపడిందని సంతోషించాను. నిన్న పనిచేస్తూ మొహం తిరిగింది. అడిగితే చెప్పింది"

"ఎవరు కారణమో చెప్పిందా?"

రవణ మరి మాట్లాడలేకపోతున్నాడు "చెప్పదు. అడిగితే ఏడుస్తుంది"

సుజాత తప్పుపని చేసిందంటే మనసు ఒప్పుకోవడంలేదు ఎందుచేతనో. పువ్వు తన అందానికి తనకే ఈర్ష్య కలిగి చెట్టునుంచి రాలిపోయిందంటే అర్థం ఉందా!

"రూఢిగా తెలుసుకున్నావా మరోసారి?"

"దాచితే దాగేవా యిలాంటి విషయాలు. చాలా రోజులయి సుజీని చూడలేదు నువ్వు. ముఖంలో నిండుదనం చూస్తే అంతా అర్థమవుతుంది."

చిలిపిగా, ప్రపంచంలో మొదటిసారిగా కన్ను విప్పినట్లు అల్లరి చేసే కళ్ళల్లో పాపం, పొరపాటుల సమ్మేళనం ఎట్లా వుంటుందో చూడాలనిపించింది.

"అవుతే అవనీ. భరించేదాన్ని నేనా మీరా? నా నడవడి యిష్టంలేదా మీ అందరికీ? అయితే కట్టకట్టుకు చావండి అంతా కలిసి" అంటుందేమో!

నవ్వేసేవాడే గానీ రవణమూర్తి బాధపడతాడేమోనని చీకటివేపు ముఖం తిప్పుకున్నాడు.

ఏదెలా వున్నా సుజాతతో ఓసారి మాట్లాడాలి.

"ఏం చేస్తావిప్పుడు?"

"ఏమీ తోచడంలేదు. తల బ్రద్దలవుతోంది. చచ్చినా బావుణ్ణు. అంత అల్లరిపిల్ల యీ పాపాన్ని కూడా ఎలా? నాకేం అర్థంకావడంలేదు"

"మరీ బెంబేలు పడి గొడవచెయ్యకు. నెమ్మదిగా కదిపితే పేరు చెప్తుందేమో? వాడెవడో మరీ పశువయి ఉండడు."

ఎంతోసేపు మౌనంగా కూచుని లేచాడు రవణమూర్తి.

"రేపు వస్తావా?"

"అలాగే"

హఠాత్తుగా వరదకి ఓ భయంకరమైన అనుమానం తోచింది.

తీతువు వికృతంగా అరించింది.

పద్మనాభస్వామి ఆలయంలోని గబ్బిలాలు చీకట్లో దిక్కుతోచక రెపరెపలాడుతున్నాయి.

గుమ్మం దిగబోతుంటే రవణమూర్తి భుజం పట్టుకుని మనస్సులో వున్న అనుమానం అనేశాడు వరద.

"నామీద నీకు నమ్మకమేనా?"

అంత చీకట్లోనూ రవణమూర్తి కళ్ళలో ఆశ్చర్యం స్పష్టంగా కనిపించింది.

"అదేమ్మిటా అలా అంటావ్?" అన్నాడు బలహీనంగా.

తలవొంచుకుని వెళ్ళిపోయాడు రవణమూర్తి.

మర్నాడు గులాబిని వెళ్ళి రమ్మంటే "నాకు సిగ్గుబాబూ! ఎలా అడగను?" అంది.

"ఏమీ అడక్కు. ఊరికినే పలకరించిరా" అన్నాడు.

గులాబి వచ్చేసరికి సుజాత తలకి స్నానం చేసి వదులుగా జడవేసుకుని కూచుంది. పల్చటి నేతచీర కడుపుని గట్టిగా పట్టి మనిషిలో నిండుతనాన్నీ, బిగువునీ చెప్తోంది. నుదుటిని ఎర్రటి బొట్టు వెలిగించి సుజాత మరి పదేళ్ళు పెద్దదిగా కనిపించింది.

మొదట గులాబిని చూడగానే సిగ్గుపడింది సుజాత.

"చెప్పాడా మీ అన్నయ్యకి. ఛీ అన్నయ్య మరీను. ప్రతి చిన్న విషయానికి బెంబేలు పడిపోయి ఊరంతా చాటేస్తాడు" అంది. గులాబి తెల్లబోయి సుజాతని చూస్తోంది. లోపల్లోపల కుంచుకుపోయినా బయటికి మాత్రం ఫక్కున నవ్వేసింది సుజాత.

"ఏవిటలా చూస్తావ్?"

"నిజమేనా?" అంది గులాబి మంచం మీద ఓ పక్కకి చేరబడుతూ.

"ఏం? నమ్మకం లేదా నీకు? అయితే చూడు" అని ఆమె చేతిని తీసుకుని పొత్తి కడుపుకి ఆనించింది. ఏదో తెలీని కదలిక, జీవం వున్న మరో ధాతువు సృష్టిరహస్యాన్నంతా పంచుకుని కదుల్తోండడం తోచి వణికింది గులాబి.

"ఎందుకు చేశావ్ యిలాంటి పని?"

"నేనేం చేశాను?"

"లేకపోతే ఏమిటిది?"

"...."

"నా ముఖం చూసి చెప్పు"

"నాకేం తెలీదు. నన్నేం అడక్కు. ఎందుకు ఏడవాలో కూడా నాకు తెలీదు" అంది సుజాత వెల్లకిలా పడుకుని కాళ్ళు ఆడిస్తూ. ముఖంలో పాత చిలిపిదనం తెలుస్తోంది.

"ఇది విని అన్నయ్య చాలా బాధపడ్డాడు" అంది గులాబి ఏం చెప్పాలో తెలీక.

"ఎందుకు బాధపడాలి నా గురించి నాకే బాధలేనప్పుడు?"

"బాధలేదూ నిజంగా?"

ఒక్క ఉదుటున లేచి కూచుంది సుజాత. "ఏమీలేదు. నాకు ఎంత హాయిగా వుంటుందో తెల్సా? ఎప్పుడూ నిద్రపోవాలన్నంత బద్ధకం. ఏమీ ఆలోచనలు తోచవు. ఇంతే. ఇంకేం చెప్పడం రాదు" ముఖం చేతుల్తో కప్పుకుని గులాబి భుజం మీద తల ఆనించింది.

మరి కాస్సేపు మాట్లాడితే తనకి పిచ్చి ఎత్తుతుందేమోననిపించింది. విచారంతో, సిగ్గుతో క్రుంగిపోతున్న సుజాతను ఎలా సముదాయించలా అనుకుంటూ వచ్చింది గులాబి. కానీ తీరా ఆమె తనకంటే ఉత్సాహంగా, నవ్వుతూ కనిపించేసరికి దిమ్మరపోయింది.

ఎంతోసేపు కూర్చున్నాక లేచింది. చివరగా సుజాత చెప్పిన మాటలు ఆమెలో దిగ్భ్రమను కలిగించాయి.

రాత్రి వరద అడిగితే సరిగా చెప్పలేకపోయింది. చెప్పడానికి ఏమీ తోచలేదు. "మరీ పిచ్చిగా తయారయింది సుజీ. అడిగితే నవ్వుతుంది. ఒక్కటి చెప్పనా అన్నయ్యా?" అంది.

"ఊఁ" అన్నాడు.

"నువ్వు సుజాతని పెళ్ళిచేసుకుంటే మంచిదన్నయ్యా"

చీకటి మధ్య ఏవో చీలికలు విరుచుకుని మెరిసినట్లయింది.

"సుజాత కాస్త పాలిపోయింది. కానీ చిత్రం ఎంత వొళ్ళు వచ్చిందనుకున్నావ్? పచ్చగా, నిండుగా, నవ్వుతే మరీ అందంగా కనిపించింది. అంత పిచ్చిపిల్లకి యీ పాపం ఎలా చుట్టుకుందో మరి. నువ్వు పడుకున్నావల్లే ఉందే"

వరదకివేమీ వినిపించడంలేదు.

సుజాత నవ్వులో మార్పు చూడాలనిపిస్తోంది.

ఎక్కడో చిలక కేరుమంది.

"రేపు సుజీని చూడాలి" అనుకున్నాడు.

గుడ్డిరాతిరి నిశ్శబ్దం వొళ్ళో నిద్రపోయింది.

శిశిరం పురివిచ్చి ఆకాశానికి కొత్త అంగీ తొడిగింది.

కల్మషాన్ని కడిగేసుకున్నట్లు ఎండుటాకుల్ని రెపరెపా రాల్చుకుని పవిత్రమౌతున్నాయి చెట్లు.

రోజంతటిలో ఏ క్షణమూ వరదరాజులు మనస్సుకి స్థాయినివ్వడం లేదు. మనస్సులో ఆలోచనలు పొత్తు కుదరక ఘర్షణ పడుతున్నాయి.

సుజాతను చూడాలన్న విషయం మళ్ళీ గుర్తుకొచ్చింది.

తొందరగా నడిస్తే ఆలోచనలు వాటంతటవే చెదిరిపోతాయనుకుంటే కాలు సాగటంలేదు.

అంతా అస్తవ్యస్తమవుతున్నట్లుంది.

పది నిముషాలు తోచకుండా గడిచాక ఎదురుగ్గా చర్చీ, రవణమూర్తి యిల్లూ కనిపించాయి.

సాయంకాలం రవణ యింట్లో ఉంటాడనే నమ్మకం లేదు వరదకి. అయినా సుజాత అలసత్వాన్ని గమనించాలన్న ఉద్దేశానికి రవణతో పనిలేదు. రాత్రి గులాబి మాటలు ఓ ప్రక్క దిగ్భ్రమ కలుగజేస్తూనే ఉన్నాయి.

ఇంటి ముంగిటికి వచ్చి ఆగాడు వరదరాజులు.

మధ్య ఇంట్లోంచి పొగలేచి సుళ్ళు చుట్టింది. పొగ గాలిలో ఏవో ఆకారాలు చుట్టి మాయమవుతోంది. కనిపించిన ఆకారం కనిపించకుండా సాగి, పల్చబడి శూన్యమైపోతోంది. మానవుడి విశిష్టచరిత్రకు పర్యవసానంలాగ.

ఆలోచనలు మాని గుమ్మం దాటితే గుమ్మానికి ఆనుకుని దిగాలుగా కూచున్న సుజాతని గుర్తుపట్టగలిగాడు. జాగ్రత్తగా చూస్తే కళ్ళల్లో నీరు స్పష్టంగా తెలిసింది.

"సుజీ!" అన్నాడు నివ్వెరపాటుతో

ఉలిక్కిపడిందే కానీ యిదివరకంత ఉదుటుగా లేవలేక పోతోంది.

లేచి గుమ్మాన్ని ఆనుకుని నిలబడ్డది. ఇదివరకులా తలెత్తి చూడలేకపోతోంది. అల్లరిగా పలకరించలేకపోతోంది.

"ఎలావున్నావు?" అంటే -

"నాకేం చాలా హాయిగా ఉన్నాను. అన్నయ్య మాటలేం నమ్మకండి. నేనేం తప్పుచెయ్యలేదు" తొందరగా అనేసి వరద విస్తుపోతే సిగ్గుతో ముఖం కప్పుకుంది.

పచ్చటి ఖద్దరు చీర వొంటిలో కలిసిపోయింది. దీపం చుట్టూ పురుగులు చేరితే పుస్తకం అడ్డుపెట్టి మళ్ళీ నిలబడింది.

ఎటువేపో చూస్తూ అన్నాడు. "మొదట నేను నమ్మలేదు. వాడు చూస్తే అసలే పిరికి మనిషి. ఊరికే బెంబేలు పడ్డాడేమోననుకున్నాను" ఆగాడు.

"ఏం ఇంకా నమ్మకం లేదా మీకు అయితే చూడండి" అతని రెండు చేతులూ తీసుకుని పొట్టకు ఆనించుకుంది. వరదరాజులు మొదటిసారిగా భయపడ్డాడు. ఇదివరకెన్నడూ ఎరగని వెలుగులు మెరుస్తున్నాయి ఆమె కళ్ళలో. మరో జీవితపు వెలుగు కూడా పుణికిపుచ్చుకున్నట్టు సృష్టికి చేయూత నిచ్చిన ధీమా, అసాధరణమైన నిర్లక్ష్యాన్ని ముఖంలో చూస్తూ నివ్వెరపోయాడు.

అతని స్తబ్ధత చూసి కిలకిలా నవ్వుతోంది. "మీరూ భయపడిపోయారేం? నాకేం తెలీదు. అంతా విచిత్రం" అంటోంది గుమ్మం మీద కూచుంటూ.

ఎన్నో అడగాలని వస్తే ఆమె నవ్వులో అన్నిటికీ జవాబు దొరికింది.

ఈ ఘటన కాదుగదా, మరి వెయ్యి ప్రళయాలు వచ్చిన సుజాత మారదనిపించింది.

"సుజాత నీమీద నాకేం కోపం లేదు సుజీ. నిజం చెపుతున్నాను. అందరికంటే నిన్ను నేను బాగా అర్థం చేసుకోగలను. నా దగ్గర నువ్వు సిగ్గుపడాల్సిన పనిలేదు." అతనెవరో చెప్పుపోనీ అన్నాడు.

ఒక్కక్షణం అతని ముఖంలోకి సూటిగా చూసి తలుపు పట్టుకుని విరగబడి నవ్వింది సుజాత.

ఏదో పక్షి దారి తెలీక గదిలోకి ఎగిరివచ్చి నుదుటిని కొట్టుకుంటే భయపడింది.

"నీకు అన్యాయం జరగనివ్వను. నీ అంతట నువ్వు చేసి వుండవు. చెప్పు"

"మీ కర్థంకాలేదు. నన్ను వదిలేయండి ఒంటరిగా" అంది స్థిమితం తెచ్చుకుని.

తెల్లబోయి చూశాడు.

"చెప్పు అర్థమవుతుంది"

"అయితే వినండి. నాకీ అవస్థ బావుంది. దీనివల్ల నేనెందుకు విచారపడాలో అర్థంకాదు. నా సుఖం కంటే తన మర్యాదల గురించి ఎక్కువ భయంగా వుంది అన్నయ్యకు. కానీ నాకు మాత్రం హాయి. ఇదివరకు యీ మార్పు ఎందుకులేదా అనుకుంటాను"

ఇంకా అతడు తనవేపే సూటిగా చూస్తూండడం గమనించి ప్రయత్నపూర్వకంగా బరువుతెచ్చిపెట్టుకుంది సుజాత.

"నాకేం తెలీదు నిజంగా. నన్ను నమ్మండి" అంది మళ్ళీ.

పాత జ్ఞాపకాల తియ్యటి కల సుజాత. ద్వారానికి చేరబడి ఏదో ఆలోచిస్తున్నట్లు గుర్తించాడు. మెల్లగా అన్నాడు "దాచితే ఎవరూ ఏమీ చేసేదిలేదు. నీకు తెలియకుండానే చాలామంది అపాయంలో ఇరుక్కొంటారు. మీ అన్నయ్య సరే"

విచిత్రంగా చూసింది.

"నిన్న నీ దగ్గర్నుంచి వచ్చాక నా మీద అనుమానం చూపింది గులాబి" సుజాత బెదిరిపోతే "భయపడకు అప్పుడే గులాబి నా చెల్లెలే. నేను కాదంటే నమ్ముతుంది. కానీ ప్రపంచం నోరు పెద్దది. ఇదొక్కటే కాదు సమస్య. నువ్వింకా చిన్నపిల్లవి" ఏదో శక్తి వెనకనుంచి ప్రేరేపిస్తున్నట్లు చర్చిమీద సిలువ వేపు చూస్తూనే యిన్ని మాటలూ అనేవాడు వరదరాజులు.

ఇటు తిరిగి చూస్తే సుజాత అక్కడే కూచుని మోకాళ్ళ మీద తల ఆనించుకుని నడుస్తోంది.

నిర్విణ్ణుడయాడు క్షణకాలం.

"ఏడుస్తే ఎట్లా? ఇప్పుడు నీకేం బాధలేదు. రవణ, నేనూ ఏదో చేస్తాం" అంటున్నాడు.

"మీమీద నాకేం అపోహల్లేవు. ఛీ! యీ మనుషులు" అంది సుజాత దుఃఖం మధ్య.

ఏ విధంగానూ ఆమెను సముదాయించడం చేతగాక అచేనుడయిపోయాడు వరదరాజులు.

ఉన్నట్లుండి రవణమూర్తి వస్తే యిద్దరూ బెదిరిపోయారు. ఏడుస్తున్న సుజాత, పిరికిగా కూచున్న వరదరాజుల్ని చూసి మాట పెగల్లేదు రవణమూర్తికి.

వరద ఏదో చెప్పబోయి చెప్పలేకపోయాడు.

సుజాత ప్రయత్నించి కూడా దుఃఖం ఆపుకోలేకపోయింది. అప్పటికి తన అసహాయత పూర్తిగా తెలిసివచ్చింది.

వరదరాజుల్ని పలకరించలేదు రవణ. పెరటిలోకి వెళ్ళాడు. నీళ్ళు నేలని తాకుతున్న శబ్దం వినిపిస్తోంది. మళ్ళీ తిరిగి రాలేదతను. సుజాత తలెత్తలేదు.

ప్రతిక్షణం గుండెమీద సమ్మెటతో కొడుతున్నట్లుంది వరదరాజులుకి. లేచి వచ్చేశాడు.

అన్నటికంటే రవణమూర్తి స్థబ్ధత గుండెల్ని కోస్తోంది.

మనస్సులో మహారణ్యం తగులబడిపోతున్నది.

మానవుడి మంచితనం, సౌహార్ధం, దయ, నమ్మకం అన్నీ సమిధలయి భగ్గుమంటున్నాయి. ఏవో పిరికితనాలూ, శంకలూ, భయాలూ, సగం కాలిన రెక్కల్తో తప్పించుకుంటున్నాయి.

"అంతాపోయింది. రవణ మనస్సులో ఏదో ప్రళయం వుంది. సగం చచ్చిపోయాను" అనుకున్నాడు వరదరాజులు.

మర్నాడు గోవర్ధనరావుగారు వరదరాజులుకి కబురు పంపించారు రమ్మని.

ఇటీవల రాకపోకలు చాలావరకూ తగ్గుముఖం పట్టాక ఇవాళ మళ్ళీ గోవర్ధనరావుగారి దగ్గర్నుంచి కబురు అందేసరికి వరదరాజులు మొదట తెల్లబోయాడు.

"ఆఫీసునుంచి యింటికి వెళ్ళకు. కాఫీ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తోంది ఆరోగ్యం" అని వ్రాశారు.

వేరే కారణం ఏమీ లేకపోయినా వినత వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ అటు పరిపాటిగా పోలేకపోతున్నాడు.

ఇన్‌కంటాక్సు ఆఫీసరుగారి పిల్లలకి వరసగా నలత చేసిందనీ, మరీ రోడ్డు మీదకి యిల్లు ఉండడం వల్ల బొజ్జుకుక్కకి కాలు విరిగిందనీ యిల్లు మార్చేశారు.

మళ్ళీ హాలు మధ్య టేబులూ కుర్చీలూ అన్నీ వెలిశాయి. ఎదురుగ్గా శిలువకు బలియైన ఏసుక్రీస్తు కరుణాత్మక దృక్కులు, ప్రక్కనే ప్రణయ తాండవ చేస్తున్న శివుడి రూపం, అందంగా అలంకరించింది ఆరోగ్యం.

ముంగిటదాటి లోపలికి అడుగుపెట్టేసరికి గోవర్ధనరావుగారి గొంతు వినిపిస్తోంది. ఏదో చెప్తూ బిగ్గరగా నవ్వుతున్నారాయన. అంతా నవ్వుకి స్థాయి కలిపి హాలంతా గందరగోళం చేస్తున్నారు.

వరదని చూసేసరికి నవ్వులు ఆగిపోయాయి. కాలచక్రం పరిభ్రమణలో ఓ క్షణం సళ్ళిచ్చినట్లు నిశ్శబ్దమయింది.

గుమ్మానికి ఆనుకుని నిలబడ్డ ఆరోగ్యం, కాలు మడిచి చుట్టుతిప్పుతూ పొగలోకి చూస్తున్న గోవర్ధనరావుగారూ, తల వొంచుకుని ఎదురుగ్గా కూర్చున్న రవణమూర్తీ, ఏదో పుస్తకాన్ని పనివున్నట్లు తిరగేస్తున్న లాయరు కృష్ణశాస్త్రిగారు అందరూ నిశ్శబ్దంగా కూచునేసరికి భయపడ్డాడు వరదరాజులు. మొదట ఎవ్వరూ పలకరించలేదు. తన రాకని గమనించనట్లు, ఏదో అవ్యక్తమయిన కార్యాచరణకు నిమిగ్నమైనట్లు తీరుబాటుగా ఉండిపోయారు అంతా.

మొదట లాయరు కృష్ణశాస్త్రి సకిలించి పలకరించారు.

"రావోయ్ వరదరాజులూ! అంతా కొత్తగా చూస్తావేం?"

మాట్లాడకుండా వచ్చి కూచున్నాడు.

ఆరోగ్యం పనివున్నట్లు లోనికి వెళ్ళింది. గోవర్ధనరావుగారు చుట్ట బాగులేదనిపారేసి మరో చుట్ట కోసం జేబులు వెదుక్కుంటున్నారు. అక్కడ కూచోడానికే మనస్సు వేనకంజ వేస్తోంది. రవణమూర్తి మాటలు నేలవేపు చూస్తూ కూచున్నాడు.

"మీ ఉత్తరం అందింది" అన్నాడు చివరికి.

గోవర్ధనరావుగారు నవ్వారు జవాబు తెలీక.

"వస్తావనుకున్నాను. కాఫీ త్రాగుతావా?"

"వద్దు నాకు. పిలిచారని..."

కృష్ణశాస్త్రిగారు ఉన్నట్లుండి ప్రారంభించారు.

"మోరల్ వాల్యూస్ పోయాక మనిషి బ్రతికి లాభంలేదండి. మనకేం ఆస్థివుంది చెప్పండి? మనమంచి, ప్రవర్తనా తప్పిస్తే!"

వరదరాజులు విచిత్రంగా చూస్తే "అబ్బే నీ గురించి కాదు నేననేది? ప్రవర్తన తెల్లకాగితంలాంటిదన్నారు. ఒక్కసారి నలుపు యింకితే తెలుపు చేయడం కష్టం"

"నిజమే" అన్నారు గోవర్ధనరావుగారు కుర్చీలో యిటు కదిలి.

ఈ వ్యంగాల అర్థం ఓ పక్క అవగాహన అవుతూనే వుంది. వీరి మధ్య కూర్చోవడం దుర్భరమనిపించి చటుక్కున వెళతానని లేచాడు.

రవణమూర్తి యింకా మాట్లాడడం లేదు.

"నీతో ఓ మాట చెప్పాలి కూర్చోవోయ్" అని, ఆరోగ్యం కాఫీ తెస్తే "కాఫీ తాగుముందు" అన్నారు గోవర్ధనరావుగారు.

ఆరోగ్యం యిదివరకులాగ తనని పలకరించడంలేదు.

కాఫీ త్రాగాలనిపించలేదు వరదరాజులుకి.

అక్కడి మనుషులతో తనకి సంబంధం లేనట్లు అంతా పాడుకలలా వుంది. లేస్తే బావుణ్ణనిపించింది.

కుర్చీలో ముడుచుక్కూచుంటే ఎంతోసేపటికి మాట్లాడారు గోవర్ధనరావుగారు.

"సుజాత.. పాపం అమాయకురాలు"

"ఎవరు మాత్రం ఏం చేస్తారండీ, ఎందరు తనని మోసం చేసినా, తను ప్రేమించిన వ్యక్తి మాత్రం తనను మోసం చేయడనే నమ్ముకుంది స్త్రీ. అందుకనే ఆమె అంతగా ప్రేమించగలుగుతుంది" అని ప్రేమను వ్యాఖ్యానించారు కృష్ణశాస్త్రిగారు నిమీలిత నేత్రులయి.

ఫక్కున నవ్వేసింది ఆరోగ్యం.

"సుజాత వింటే మీ మాటలకి నవ్వుతుంది. పుస్తకాల్లో వ్రాయండి మీ కబుర్లని" అంది.

గోవర్ధనరావుగారికి కోపం వచ్చి "నువ్వు లోపలకి వెళ్ళు" అన్నారు.

వెళ్ళలేదు ఆరోగ్యం.

వరదరాజులుకి విసుగేస్తోంది.

"ఆవిడనలాగ వదిలేయడం బాగులేదోయ్" చివరికి అన్నారు గోవర్ధనరావుగారు వరదరాజులు వేపు తిరిగి.

వరదరాజులు నిర్ఘాంతపోయి తలెత్తాడు.

రవణమూర్తి కూడా కదిలి అటు తిరిగాడు.

"ఏమిటి మీరనేది?"

"తప్పుచేశావని నేనేం అనడంలేదు. నాకూ తెలుసు వయస్సు బాధ, కాని ఆ క్షణం అలాంటిది" అన్నారు సుళువుగా.

అతని అదురుపాటు చూసి ఆరోగ్యం కల్పించుకుంది. "పోనీండి ఇప్పుడెందుకు అవన్నీ? అతనికి తెలియదా ఏమిటి? నెమ్మదిగా ఆలోచించుకుంటాడు"

కృష్ణశాస్త్రిగారు "ఆలోచన ముందమ్మా విషయం తేలిపోలే! అసలు యిలాంటివి జరగనేకూడదు. అదీ మన సమాజంలో.. శిష్ట సమాజం కాదూ? మనుస్మృతిలో ఏమన్నారు?"

రవణమూర్తివేపు తిరిగి సూటిగా అడిగాడు వరద. "నీకూ యిలాంటి అభిప్రాయమే ఉందేమిటి చెప్పు?"

రవణమూర్తి అతని ముఖం చూడలేక తల దించుకుంటే పూర్తిగా అర్థమయి నడుం విరిగినట్లయిందతనికి. అవమానం గుండెల్ని పీకుతోంది.

"అతనేమిటి చెప్తాడోయ్. చిన్నవాడు. అదీగాక, నువ్వంటే కోపం గనకనా. పెళ్ళి అయిపోతే సరి. ఏం రవణా?" అన్నారు గోవర్ధనరావుగారు.

కృష్ణశాస్త్రిగారి చేయి తగిలి కాఫీగ్లాసు కిందపడి పగిలింది.

వరదరాజులు మనస్సు భగ్గుమంది. ఉద్విగ్నత కరళ్ళు కరళ్ళుగా మీదికెగసి సంవత్సరాలుగా దాచుకున్న ఓర్పుకు చితిపేర్చింది. కళ్ళల్లోకి రక్తం పాకి ముఖాన్ని జేవురింపజేసింది. రవణ భయపడ్డాడు.

గోవర్ధనరావుగారు అతని ముఖం చూడడంలేదు.

కర్తవ్యం ఎంత ముందుకు తోస్తున్నా తప్పు చేస్తున్నానేమోనన్న చింతన ఆయన్ని వెనక్కి లాగుతోంది. ఆరోగ్యం ఊరుకొమ్మని సంజ్ఞ చేస్తోంది. ఇంకా మాట్లాడడం భావ్యం కాదనుకుని కిక్కురుమనలేదు గోవర్ధనరావుగారు.

కానీ కృష్ణశాస్త్రిగారు యిదేమీ పట్టించుకోలేదు. "ఈ కాలంలో బుద్ధిగడ్డితిని వెనక్కి తిరిగి రావడం మరిచిపోతోంది. వరదరాజులు ఇంకా చిన్నవాడు. లోకజ్ఞానం కాస్త తక్కువ అనుకున్నా చేసిన పనికి క్షమించవచ్చు. కాకపోతే యింకా యీ విధంగానే చాలామంది మితిమిరి.." ఇలాపోతోంది ధోరణి.

ఇక ఉండలేక లేచాడు వరదరాజులు.

"కూర్చోవోయ్" అంటోంది ఆరోగ్యం.

అవధులు దాటిన ఆవేశం మధ్య అంతఃకరణ నలిగి పిచ్చి కోపాన్నీ, ఉదాసీనతనీ రెచ్చగొట్టింది.

"సుజాత నడిచినచోటల్లా పదేళ్ళు దాస్యం చేస్తేనే కానీ మీరు ఆమె గురించి మాట్లాడడానికి కూడా తగరు. ఇప్పుడనిపిస్తోంది. సుజాత కష్టానికి నేను కారణమయివుంటే బాగుండేదే అని - నేనే అయితే అలాంటి మనిషిని మీ అందరికీ దూరంగా తీసుకుపోయి ఎవరికీ కనిపించని చోట దాచుకునేవాణ్ణి. వస్తాను"

ఉన్మత్తుడిలాగా నడిచిపోయాడు వరదరాజులు.

గోవర్ధనరావుగారు తెల్లబోయారు.

ఆరోగ్యం ముఖంలో విస్మయం మధ్య చిరునవ్వు తెలుస్తూనే వుంది.

కృష్ణశాస్త్రిగారు ప్రపంచం పాడయిందని రెండోసారి రూఢి చేసుకున్నాడు.

రవణ భయపడి, వణికి ముఖం కప్పుకున్నాడు.

**ఎంతమానుకుందామన్నా** రవణ తిరస్కారం, కృష్ణశాస్త్రి వ్యంగ్యధోరణీ, ఆరోగ్యం స్తబ్దత గుర్తుకొస్తున్నాయి. తన నిజాయితీకి, తన మంచితనానికీ వీళ్ళు ప్రమాణాలు.

ఖాసిం కనిపించి పలకరించాడు. అతని నవ్వు, ఆదరం చూశాక ఈ బాధలన్నీ దూరమయిపోతున్నట్లనిపించాయి.

"కనిపించలేదేం సార్! ఎప్పుడన్నా వస్తారనుకున్నాం" అన్నాడు ఖాసిం.

అమీనా గుర్తుకొచ్చింది. పెళ్ళి తర్వాత ఒక్కసారి మాత్రం చూశాడు. భర్తతో వెళ్తూ బజార్లో తటస్థపడింది. పలకరిస్తే నవ్వేసి మొహం తిప్పుకుంది. నమస్కారం చేసి మాట్లాడాడు శ్యామలరావు. ఆత్మీయతకూ, ప్రేమకూ చిహ్నాగా కనిపించారు వారిద్దరూ. దీపక్ నీడలో మలుపు తిరిగిపోతుంటే అప్పుడు అనుకున్నాడు.

"ఇదొక్కటే నేను చేసిన మంచిపని" అని.

ఇరవైనాలుగ్గంటల క్రిందటి సంఘటన లేపిన దుమారం మనస్సులో యింకా సుళ్ళు తిరుగుతూనే వుంది. ఇప్పుడిక ఖాసిం కనిపించాక అతనికేదో విచిత్రమైన ఆటవిడుపు కనిపించినట్లయింది.

"అమీనా ఎలా వుంది?"

"బావుంది. మీ గురించే ఎప్పుడూ అడుగుతుంది. రండి ఓసారి" అన్నాడు.

"పద" అన్నాడు వరద తటపటాయించకుండా.

అమీనా ఏదో పాటపాడుతూ వంట చేస్తోంది వచ్చేసరికి. వరదరాజుల్ని చూసేసరికి మొదట భయపడింది. ఎప్పుడూ లేనిది నమస్కారం చేసి దీపం నీడకి వత్తిగిలి నిలబడింది. "బావున్నావా అమీనా?" అన్నాడు.

ఓ బల్ల ముందుకు తోసి కూర్చోమంది.

వెలుగులోకి వస్తే ముఖం మీద ముసుగు తొలిగి తెల్లటి ముఖం మెరిసింది. పాలపిట్ట ఆకారంలో వంపు తిరిగిన నడుం, చిన్నకళ్ళల్లో బెదురు చాలా తగ్గి ఓ నిండుదనం బరువు, అనుభవంతో ఠీవి ఇదివరకటి కంటే సన్నబడిపీలగా ఉంది.

"ఏరీ ఆయన?"

తలెత్తి ప్రశ్నార్థకంగా చూసింది. కోలముఖం చుట్టూ అంచుకట్టినట్లు చెవిమీదుగా జారిన బంగారపు పోగులూ, పాపిడి మధ్యగా పాముపొరలా వెండిచార, విశాలమైన నీటిగాజుతొట్టెలో అటోయిటో తిరుగాడుతున్న చేపల్లా కళ్ళు చూడడమే గాని మాట్లాడడం తెలీని అమీనా.

"వస్తారిప్పుడే" అంది వినిపించీ వినిపించనట్టు.

భాషలో అలవాటు లేని వాలుతనం, నెమ్మదితనం తోచింది. సరిగ్గా చెప్పలేక పోయానేమోనని సిగ్గుపడింది.

శ్యామలరావును వెంటబెట్టుకుని, అరటిపళ్ళతో వచ్చాడు ఖాసిం.

ఆనాటి రాత్రి కర్తవ్యా కర్తవ్యాలతో తటస్థంగా వుండి సరిగ్గా చూడలేదు శ్యామలరావుని.

ఇప్పుడు బలంగా, తెల్లగా, నిండుగా కనిపించాడు. నుదుటి పక్క నల్లటి మచ్చ. సగం వరకూ మీదికిపోయిన జుత్తూ, కాస్త వయస్సు మీరిన వ్యక్తిత్వం కనిపిస్తుంది. కళ్ళు మరీ పెద్దవి. తప్పించుకోలేనంత సూటిగా కోపంతో ఉన్నట్లుంటాయి నవ్వులోనయినా.

ఎంతో అభిమానం, ఆదరంతో పలకరించాడు. వద్దని ఎంత చెప్పినా పళ్ళు యిచ్చిగాని వదల్లేదు ఖాసిం.

వెళ్తానని లేవబోతే శ్యామలరావు కలిసి నడిచాడు. "ఎలావుంది యిక్కడి జీవితం?" అన్నాడు మలుపు దాటాక.

"బాగానే"

"చేసినపనికి విసుగూ, విరక్తీ కలగడం లేదా మీకు?"

"అదేం లేదు - అమీనా నాక్కావాలి"

"అయితే మంచిదే" అని వచ్చేశాడు వరద.

ఇంతసేపయాక కాస్త స్థిమితం చిక్కినట్లనిపించింది. అక్కడి మనుషుల్నీ, వాళ్ళనీ పోల్చి చూసుకుని నవ్వుకున్నాడు.

జీవితంలో సుఖాన్ని వెతుక్కోబోయి, సంఘంతో రాజీపడి పక్కవాడి పరపతి మీద దాడిచేయడంలో సరిపుచ్చుకున్నారు వాళ్ళు. సుఖం వెదుక్కోవడం ఎందుకో తెలీక, జీవితం యిచ్చేదంతా పుచ్చుకుని అమాయకతకు అలంకరించుకున్నారు యిక్కడివాళ్ళు.

ఇప్పటికి మనస్సు ప్రశాంతమైంది.

బజారుదాటి నడుస్తూంటే పీతాంబరం యిల్లు కనిపించేసరికి అటు నడిచాడు. అప్పుడే భోజనం ముగించి వసారాలో పైపు వెలిగించి పచార్లు చేస్తున్నాడు.

చూడగానే పలకరించాడు. కానీ యిదివరకటి ఉత్సాహం చూపకపోయేసరికి ఆశ్చర్యపోయాడు వరద.

"ఏం? అలా ఉన్నారు?" అంటే

"ఎలా ఉండాలో తెలీక యిటీవల ప్రయోగాలు చేస్తున్నాను. ఇది వరకు అనుకున్నట్లు విచ్చలవిడిగా బ్రతకడంలో అంత సుఖం లేదనిపిస్తోంది. ఒక్కొక్కప్పుడు ప్రమాదం కూడాను. "

నిర్ఘాంతపోయాడు వరద.

"అదేం అలా అంటున్నారు?"

"మరి రెండేళ్ళకి ఆ శాస్త్రంలో నిష్ణాతుణ్ణయాక వివరాలు చెప్తాను. అంతవరకూ నా విచారాన్ని కూడా క్షమించాలి మీరు. అప్పుడే నన్ను చూసి తెల్లబోతున్నారు. లోపల నీలవేణి ఉంది వెళ్ళండి."

ఏమైనా యిదివరకు మనిషిలా లేడు. గోవర్ధనరావుగార్ని కలిశాడేమోననుకున్నాడు.

"సుజాత విషయం తెల్సా?"

పైపు పొగ వదుల్తున్నవాడల్లా ఒక్కసారి ఆగాడు పీతాంబరం.

"విన్నాను సాయంకాలమే? గోవర్ధనరావుగారింటికి వెళ్ళాను. ఒక్కొక్కప్పుడు ఎప్పుడూ ఊహించలేని విషయాలు జరిగిపోతూంటాయి. నీలవేణిని కలవండి" అన్నాడు మళ్ళీ పచార్లు ప్రారంభించి.

లోపలికి వచ్చేసరికి భోజనం చేస్తోంది నీలవేణి.

అతన్ని చూసి లేవబోతే "కూచో. అతిథిని ఆహ్వానించడమంటే ఆకలిని చంపుకోవడం కాదు" అన్నాడు.

నవ్వి మళ్ళీ కూచుంది.

రెక్కలు తెగిన పురుగులు విధిలేక నేలమీద పాకుతున్నాయి.

నీలవేణి నీళ్ళు తాగబోతే పురుగు గ్లాసులో పడింది.

"నే తెస్తానుండు" అని లేచి నీళ్ళు పారబోసి మళ్ళీ తెచ్చి యిచ్చాడు.

"ఇన్నాళ్ళూ రాలేదేం అని అడగవేం?"

"చెప్పండి" అంటోంది మరోమాట లేకుండా.

భోజనం చేసి చెయ్యి కడుక్కుని మజ్జిగ గ్లాసు తెచ్చి ముందు ఉంచింది.

ఎంతకీ సుజాత విషయం అడక్కపోయేసరికి కించపడ్డాడు.

పీట ఎత్తడానికి వంగితే, ముఖం దగ్గరపడినప్పుడు పలకరించాడు.

"సుజాత విషయం.."

కళ్ళన్నా ఎత్తకుండా "ఏమిటి?" అంది.

"తల్లికాబోతోంది తెలుసా?"

"విన్నాను"

గోడమీద నీడలు రెండు భూతాలుగా ఏకమయ్యాయి. చప్పుడు చేయకుండా వచి పిల్లి అన్నం ముట్టుకుంది.

"నేనే కారణమని అందరూ అంటున్నారు"

"..."

"చివరికి చెల్లెలు కూడా అనుమానపడింది పైకి అనకపోయినాను"

తడిబారిన చేతుల్ని కొంగుతో తుడుచుకుంటూ నీలవేణి మాట్లాడక ఊరుకుంది.

"రవణ యిప్పుడు నా దగ్గరికి రావడం మానేశాడు"

మూడోసారి కూడా మౌనమే జవాబయే సరికి సంజాయిషీ చెప్పుకునే కుర్రాడి పరిస్థితికి వచ్చాడు వరదరాజులు. ఉదాసీనత మనస్సును కెలికింది.

"చూస్తూంటే నీకూ నామీద అనుమానంలా వుందే?"

అంతకీ ఆమె మాట్లాడకపోయేసరికి, కోపం వచ్చి "ఎవరికీ నేనేం సమాధానం చెప్పుకోవాల్సిన పనిలేదు. నీ నుంచి నాకేం క్షమాపణ.."

"మీరు త్వరగా పెళ్ళిచేసుకోండి. చాలామంది మాటలనుంచి తప్పుకోవచ్చు"

ఆశ్చర్యంతో ఆమె ముఖం చూస్తే నీడవేపు ముఖం తిప్పుకుంది నీలవేణి.

"ఎవరిని?"

"ఎవరినో ఒకరిని"

గుండెలో ఏదో మొండితనం రాయిలా ఎదురయింది.

"నిన్నా? సుజాతనా?"

ఇందుకు నీలవేణి దెబ్బ తింటుందనుకుంటే -

"సుజాత చాలా మంచిపిల్ల, తప్పేంలేదు. మీ మనస్సు ఇష్టపడితే" అంది.

ఫక్కున నవ్వేశాడు.

ఆమె విస్తుపోయింది.

"ఇంతకుముందే ఈ జవాబు సిద్ధం చేసుకున్నావల్లే వుందే?"

హాల్లో రేడియో సరిచేస్తున్నాడు పీతాంబరం. పాట స్పష్టంగా రాక నిర్ణయానికి రాని మనస్సు గొనుగుడులాగా ఉంది. గుమ్మానికి వరదరాజులు అడ్డమయాడని ఆగిపోయింది నీలవేణి. తెలిసి కూడా తప్పుకోలేదు వరద.

"నాదికాని వస్తువు నేనెలా అనుభవించను?"

"అది మీ యిష్టం"

"ఒకరోజు ఆటకాదు. భోజనం చేసి మరిచిపోయేదికాదు. అవసరమైతే మళ్ళీ నీ సలహాకే వస్తాలే" అని పక్కకి తప్పుకున్నాడు.

వస్తూన్న నవ్వుని ఆపుకుని వెళ్ళిపోయింది నీలవేణి.

మనస్సులో సంశయం తీరలేదు. నిలబడితే నీడ ఏటవాలయి కురచయింది.

"ఎప్పుడయినా వస్తూండండి పీతాంబరంగారూ! మీరొక్కరే నా స్నేహితులు మిగిలారు" అన్నాడు.

"నాకూ అంతే అనిపిస్తోంది. తీసివేతలు పోగా, మీరూ, ఈ రేడియో నాకు స్నేహితులుగా మిగిలారు. మనస్సులోని వన్నీ మీ దగ్గర చెప్పెయ్యాలనిపిస్తోంది, ఓ క్రిస్టమస్డే నాడు కేక్ తింటూ నా జీవితంలోని ఎడ్వెంచర్ని నంచుకుంటే ఫైన్గా ఉంటుంది. అందుకని రిజర్వు చేశాను."

వీధిలో చీకటి పలకరించి నక్షత్రాల్ని తోడిచ్చింది.

ఇటీవల పని మరీ సట్టుపడిందని బలరాందాసుకు మరీ గుర్రుగా ఉంది.

"ఉద్యోగం నీకు నచ్చలేదా? ఉద్యోగానికే నువ్వు నచ్చలేదా?" అన్నాడు ఓ రోజు ఫైళ్ళముందు కూచుని ఆలోచిస్తూంటేను.

ఆ రెండూనేమోననిపించింది.

కమల నవ్వుతూ పలకరించిపోయింది.

"వరదరాజులుగారూ అలా ఉన్నారా, చూస్తూండండి. ఆయన ఎప్పుడో ఒకనాడు బుద్ధిష్టు అయిపూరుకుంటారు" మరో టైపిస్టుతో యితనికి వినపడేలాగు చెప్తోంది.

ఇద్దరూ ఒకటే నవ్వు, గడియారం పదకొండు చూపి నీరసంతో ఒకటే గంట కొట్టింది.

బీచ్‌లో గోవర్ధనరావుగారి సముదాయింపూ, ఆరోగ్యం నవ్వూ, గుర్తుకొచ్చాయి. ఒక్కసారిగా ఉదాసీనతతో, నిస్పృహతో దుఃఖంలాంటి జీరకంఠంతో నరాల్ని ఉమ్మతిప్పింది. వాళ్ళంతా ఇప్పుడు మాట్లాడడం మానేశారు. నెలరోజుల క్రిందటి సంఘటన తరువాత ఎవరూ కనిపించడంలేదు. ఏమీ చెయ్యని తన స్థిమితానికి, ఏమీ చెయ్యని పాపానికి, ప్రపంచం ఒక విచిత్రమయిన శిక్ష విధించింది తనకు. నిశ్శబ్దం... నిశ్శబ్దం.

పరాకుగా ఉన్నప్పుడు టేబులు మీంచి ఫైళ్ళన్నీ జారిపడ్డాయి. కమల సర్దుతోంది. మధ్య మధ్య జాలిని కనపరుస్తూ "ఏం అలా ఉన్నారు? శలవు పెట్టలేకపోయారా?"

పీతాంబరం ఊపిరి తిరక్కుండా పరిగెత్తుకు వచ్చాడు. వరదరాజులు కోసం హాలంతా వెదికాడు మొదటే.

"వరదరాజులుగారు.. మీకు తెలుసా యిది?" అన్నాడు పీతాంబరం ముందుకు వంగి.

కమల నిర్ఘాంతపోయి చూస్తోంది.

"...."

"సుజాత విషం తాగి చచ్చిపోయింది."

"వేగంగ పదండి ప్లీజ్" అన్నాడు పీతాంబరం అతని చెయ్యిపట్టుకుని

"నేను బలరాందాసుగారితో చెప్తాను. మీరు వెళ్ళండి" అంటోంది కమల.

ఇద్దరూ బయటికి వచ్చాక పీతాంబరం చెప్పడం ప్రారంభించాడు. "రోజులు మనవికావు సార్. ఇలా నవ్వుతూ ఎందుకుంటానా అనిపిస్తోంది యిప్పుడిప్పుడు. మీలా బ్రతగ్గలిగితే ఎంత హాయి?"

మాటలేం మిగల్లేదు తనకు. వింటూ నడుస్తున్నాడు వరదరాజులు. ఆలోచనలతో శరీరం వశం తప్పుతుందేమోనని పీతాంబరం భుజంమీద చెయ్యివేశాడు.

"పోనీండి అదంతా, సుజాత చచ్చిపోతుందంటే ఎవరన్నా నమ్ముతారా?"

నివ్వెరపోయాడు వరద "ఎవరన్నా చంపారని మీ అనుమానమా?"

"ఛ, ఛ అదేం కాదు" అని యింకేమో చెప్పబోయాడు. ఉప్పెనలా మాట్లాడే అతని గొంతుకు ఏదో అడ్డుపడుతోంది.

రవణమూర్తి ఇంటికి వస్తే వేయి ప్రళయాలు ముగిశాక యేర్పడ్డ స్తబ్ధత తోచింది. అందరి నిర్లిప్తతా చూస్తూంటే కాలికింద భూమికదులుతున్నట్లనిపించింది.

వరదరాజుల్ని చూస్తూనే గోవర్ధనరావుగారు చుట్ట వెలిగించడానికి గోడ దగ్గరికి వెళ్ళారు. అతని కళ్ళల్లో ఎరుపూ, నిశ్శబ్దం చూసి భయపడ్డాడు వరద.

ఆరోగ్యం, వరద వచ్చిన అలికిడి విని కూడా ఏమీ పట్టనట్లు నీలవేణి భుజం మీద చెయ్యేసి కూచుంది. నీలవేణి గుమ్మానికి చేరబడి మునుకుల మీద తల ఆనించుకుంది.

అందరి మధ్యా తన పాపానికి తనే శిక్ష విధించుకున్న సుజాత, యింకా మృత్యువుకు పూర్తి అర్ధం తెలియని సుజాత, వెయ్యేళ్ళు నిద్రపోవడానికి సిద్ధపడినట్లు స్థిమితంగా పడుకుంది. పట్టుదలా, అమాయకత్వం సడలిపోని ఆమె ముఖాన్ని చూసి "చావు యింత సులువా?" అనుకున్నాడు వరదరాజులు.

సుజాత చచ్చిపోలేదేమోననిపించింది. దగ్గరికి వెళ్ళి చెక్కిలి ముట్టుకోబోతే అందరూ అతని వేపే ఆతృతతో చూశారు, చెక్కిళ్ళు చల్లబడి వేలు తాకినచోటు పాలు పాకినట్లు తెల్లబడింది. పద్దెనిమిదేళ్ళుగా రంజితం చేసుకున్న నుదుటి కుంకుమ ఎరుపు చెరగక కెంపులా మెరుస్తోంది. లోపలికి వెళితే గది కాస్తపాటి వెలుగులో వంటినిండా శాలువా కప్పుకుని ముడుచుకు కూచున్న రవణ కనిపించాడు. ఏడుస్తున్నాడేమోనని మొదట అనుకున్నాడు వరద. గదిలో ముక్కలయివున్న చిన్న అద్దంలో రవణ ముఖం పది ప్రతిబింబాలుగా విరిగి అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. జాగ్రత్తగా గమనిస్తే ఏడవడం లేదని ఋజువైంది. గుమ్మం దాటబోతే నీలవేణి పక్కకి వంగింది.

గుమ్మానికి చేరబడి ఎవరయినా పలకరిస్తారేమోనని చూశాడు.

ఒక పక్క సుజాత రూపం ఎదుటపడి మనస్సు కెలుకుతున్నా యిందరూ తనపై చూపే నిర్లక్ష్యం ముందు యిది ఏపాటిదనిపించింది.

మెట్లమీద కూర్చుని సిగరెట్లు ఒక్కటొక్కటే కాలుస్తున్నాడు పీతాంబరం.

గోవర్ధనరావుగారు గోడ దగ్గరే నిలబడి యిటు ముఖం తిప్పడం మరిచిపోయారు.

పది యుగాలు గడిచాక నీలవేణి మొదటిసారి "కూచోండి" అంది.

చూస్తున్నకొద్దీ శానిటోరియంలో సుజీ పరుగులూ, అప్పటి అల్లరీ అన్నీ గుర్తుకొచ్చి కళ్ళనీళ్ళు తిరుగుతున్నాయి. నిలబడలేక గోడకి ఆనుకుని ముఖం దాచుకున్నాడు.

ప్రతిక్షణం భరించరానిదవుతోంది.

పీతాంబరం ఆవులించి స్థంభానికి చేరబడ్డాడు.

ఎవరికి చెప్పకుండానే బయల్దేరాడు వరద.

"వెళుతున్నారా?" అంది నీలవేణి.

"ఇంకేం చెయ్యను? అంతకన్న నాకేం చేతకాదు" అని వచ్చేశాడు.

"నన్ను రమ్మంటారా?" అని పీతాంబరం పలకరిస్తే -

"నాకంటే యిక్కడ మీ ఉపయోగం ఉంటుందేమో? ఉండండి, నే పోతాను" అన్నాడు.

రాత్రి యింటికి చేరగానే "సుజాత పోయిందట అన్నయ్యా" అంది గులాబి.

దిగులుపడి భయంతో ఏడ్చిన ముఖాన్ని చూస్తూ ఏమీ అనలేకపోయాడు.

ఇదంతా స్వయంకల్పితమేమో ననిపించేంత సంచలనం పుట్టింది మనస్సులో. మమతలు పెంచుకోవడం ఒక నేరం - తర్వాత దిగులు పడడమూను.

చీకటి వెలుగులమధ్య గడ్డిపరకలు సొమ్మసిల్లి నేలని కరుచుకున్నాయి.

మాట్లాడకుండా వసారాలోకి పోతున్న అన్నయ్యను చూసి భయపడింది గులాబి.

ఆత్మ సంయమనం తెలీని చిన్న మనస్సు సందేహంతో, సందిగ్ధంతో రెపరెపలాడింది, మొన్న ఆరోగ్యం కనిపించి చెపితే తప్ప గులాబికేమీ తెలియలేదు. సుజాత పాపం యెందుకు మోయాల్సి వచ్చిందో యెందుకు చనిపోవాలో, ఎంత ప్రయత్నించినా ఆకళింపుకు తెచ్చుకోలేకపోతోంది. ఆరోగ్యం ఏదో చెపితే, అన్నయ్య అంత దారి తప్పగలదా అని దిమ్మరబోయింది.

లోపలికి వస్తే మంచానికి ఆనుకుని కూచుని మొహం కప్పుకున్నాడు వరద.

ఏవో ఆలోచనలూ, అనుమానాలూ గులాబి మనస్సులో కదులుతున్నాయి.

ఇక ఆగలేక అంది, 'పాపం, సుజీ మంచిమనిషి. నువ్వు పెళ్ళిచేసుకుంటే బ్రతికేది'

తుళ్ళిపడ్డాడు వరదరాజులు. అప్పటివరకూ యాతన ఒక యెత్తూ యీమాట ఒక్కటి మరొక యెత్తు అయింది.

"ఎవరన్నారు?"

"నాకేం తెలీదు. ఆరోగ్యంగారు అన్నారు. నిజమని నేననుకోలేదన్నయ్యా, కాని యిదేమిటి? నువ్వు ఏడుస్తున్నావేం?"

నవ్వేశాడు.

"ఏడవడంలేదు గులాబీ, ఓ చిన్నపిల్ల గుర్తుకొస్తోంది. అమ్మ కోసం ఏడుస్తూ, ఇంటికి పోదాం అని మారాం చేసే సుజీ - తల్లి కాబోతున్నందుకు కాదు. మా యిద్దరికీ సంబంధం ఉన్నదని ప్రచారం చేసినందుకు చచ్చిపోయింది. నాకు తెలుసు - ఇలా నేను చెపితే ఎవరు నమ్ముతారు? పద, భోజనం పెట్టు" అని లేచాడు.

అతని ముఖంలో నైరాశ్యం చూసి బెదిరిపోయి, ఏమైనాకానీ అన్నయ్య ఆరోగ్యం పాడవకూడదని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంది.

సరిగ్గా పదిరోజుల తరువాత మొదటిసారిగా వినత ఉత్తరం వ్రాసింది.

ఉత్తరం చదువుతుంటే కొత్తజీవితానికి పూర్తిగా అతకని మనస్సూ, పాత తరహాలో ఉండాలని ఆరాటం - అల్లరి అంతా పోయాక తిరిగి గుణించుకోవడానికి చేసే చివరి ప్రయత్నం - పిల్లని ఎత్తుకుని నిండుగా నిలబడ్డ వినత తోచింది.

"సుజాత పోయిందటగా? నాన్నగారు వ్రాశారు. చాలా మంచి పిల్ల ఎలా పోయింది? ఎవరో ఆమెను - నువ్వేనని అమ్మ రాసింది. నాకు తెలీదు. చ ఛ నేను నమ్మలేదు. నిన్ను పూర్తిగా తెలుసుకోలేదు వాళ్ళు, అయినా ఒక్క మాట అడిగేదా? నీతో ఎన్నో మాట్లాడాలని వుంది. ఎలా? నేను రావడం పడదు. మళ్ళీ ఆరునెలల్లో పాపాయి ఓసారి నువ్వు యిక్కడికి రాకూడదూ?" వినత.

ఉత్తరం చదువుకుని నవ్వుకున్నాడు వరద, ఎక్కడో యీ ప్రచారం ప్రారంభమయి ప్రపంచమంతా పాకుతున్నట్లుంది. ప్రపంచానికంతటికీ తనొక్కడే 'వరద' అయినట్లు అంతా ఒక్కో వార్తను మోసుకుపోతున్నారు. తమకు ప్రత్యేకంగా మిగిలిన సంఘం దేన్నీ వృధా పోనీయడం లేదు, ఆ ఉత్తరాన్ని చూపి "నేను నిర్దోషిని ఈమె సాక్ష్యం" అంటే, తనని వదిలేసి ఆమె మంచితనాన్ని అందుకుంటారు. నవ్వొచ్చింది.

"ఎవరు రాశారు?" అనడిగింది గులాబి.

"వినత"

"ఏమనీ?"

"నన్నెవరూ నమ్మడంలేదు, రవణ కేసు పెడితే వీళ్ళంతా సాక్షులుగా నిలుస్తారు. "

అన్నయ్య మనస్సులో ప్రళయం అర్థమవుతోంది యిప్పుడిప్పుడు,

"ఒక్కసారి రమ్మంది అక్కడికి. ఏవో విషయాలు చాలా చెప్పాలిట"

"అయితే తప్పకుండా వెళ్ళిరా, కొన్నాళ్ళు తిరిగివస్తే మనస్సు కుదుటపడుతుంది"

"మరి నువ్వు?"

"...."

"నీకు తెలీదు. వెళితే బావుండదు, పిలవాల్సింది వినతకాదు - కాశీపతి నీకంటే ఏమి పెద్దదికాలేదు వినత. ఈ ఉత్తరాన్ని చదివికాల్చెయ్" అన్నాడు.

గులాబి విస్తుపోయింది.

పక్కవాటా చెట్లు తోసుకుని డాలీ తండ్రి వచ్చాడు.

ఒకటి రెండుసార్లు తప్పిస్తే ఇంటి యజమానితో ఎప్పుడూ మాట్లాడలేదు వరద. కామ్‌దార్ కూడా తానయి ఎప్పుడూ ఎదురుపడలేదు. గులాబి డాలీకే అద్దె యిచ్చేసేది.

కూర్చున్న రెండు క్షణాలు తటపటాయించి అన్నాడు కామ్‌దార్. "మీ స్నేహితుడి చెల్లెలెవరో పోయారటగా?"

"అవును"

"పాపం. చాలా విచిత్రంగా పోయారని చెప్పారు. మీకు చాలా దగ్గర స్నేహితుడనుకుంటాను"

విసుగేసి "మీ యింటి అద్దె మొన్న పంపేశానే!" అన్నాడు.

మొదట తెల్లబోయి, మళ్ళీ చెప్పడం ఆరంభించాడు కామ్‌దార్. "రేపు వైశాఖంలో డాలీ పెళ్ళి తలపెట్టానండి"

"మంచిదే"

"మీరు మా యిల్లు ఖాళీచెయ్యాల్సి ఉంటుంది. ఆ ఒక్క యిల్లూ చాలదు మా బంధువులకి"

నిర్ఘాంతపోయాడు వరదరాజులు.

"ఇంత త్వరగా యిల్లెక్కడ దొరుకుతుంది? అయినా కారణం అదికాదు నిజం చెప్పండి"

నవ్వేశాడు కామ్‌దార్.

"నాకు ఆడపిల్లలున్నారు సార్ - మనింటివేపే అంతా చూస్తూ నడవడం నాకేం బాగుండదు, మా ఆవిడ చెప్పమంది. పెళ్ళి నిజం కాదనుకునేరు. వైశాఖంలో ఖాయం" అనేసి వెళ్ళిపోయాడు.

అంతవరకూ గుమ్మంచాటున నిలబడ్డ గులాబి ముందుకొస్తే వణికే పెదాల్ని చూపలేక గన్నేరుచెట్టు వేపు తిరిగి నిలబడ్డాడు.

క్షోభ, అవమానం తల యెత్తుకోలేకుండా చేస్తున్నాయి. తెలీని గోడలమధ్య అమాయకంగా తనది కాని శిక్ష అనుభవిస్తున్నాడతను.

గోవర్ధనరావుగారి దగ్గరికిప్పుడు పోవడంలేదు వరదరాజులు. ఆయనా రమ్మని కబుర్లు చేయడంలేదు. ఎవరికి ప్రయోజనం? కూర్చుని కాలువలాగా ఒడ్డును ఒరుసుకుపోతోంది కాలం ఒకటా, రెండా? - ఆరునెలలు.

మనస్సుకు కాస్త ఆటవిడుపునిచ్చే పీతాంబరం కూడా మానేశాడు. క్రమంగా సుజాత విషయం వెనకపడుతున్నా మంచి బ్రతుకు బ్రతికి జడమైన జీవితంలా ప్రతిష్ఠంబన వహించిన దినాలు ఏమీ తృప్తినివ్వడంలేదు.

గులాబి స్థిమితం చిక్కించుకుంది. ఇదివరకూ ఏమీ విచారించలేని ఆమె తాటస్థ్యం ఎప్పటిలానే ఉంది. రామ్మూర్తిగారికి ప్రమోషను దొరికింది. ఇప్పుడు మరీ అణుకువతో, కళ్ళనిండా కృతజ్ఞతను తెచ్చుకుని వరద సహాయాన్ని ఎప్పుడూ గుర్తు తెచ్చేలా కనిపించసాగాడతను. ఏమంత గుర్తించరాని వ్యవధిలోనే ముదిమి ఆవహించినట్లుగా నడుం వంచి, వయస్సు తెచ్చిపెట్టే స్థిమితాన్ని అలవర్చుకున్నాడు ఇంతా చేస్తే 35 రామ్మూర్తికి.

రవణ ఉద్యోగం మానేశాడనగానే మొదట నిర్ఘాంతపోయాడు వరద, ఎంత తనమీద అనుకోకుండా నిందపడినా, ఆ కారణంగా చేస్తున్న ఉద్యోగం వదులుకుంటాడనుకోలేదు. ఆ సాయంకాలం అటువేపునుంచి వస్తూ రవణ యిల్లు తాళం వేసి ఉండడం చూసి దిమ్మెరపోయాడు ఆరాటం ఎక్కువయి యజమానిని కదిపితే, "ఆరోగ్యం పాడయిందండి - వెళ్ళిపోయారు" అన్నాడు.

"ఎక్కడికో చెప్పాడా!"

"విజయవాడ వెళతానని అనుకోవడం విన్నానండి"

తన కళవకళ్ళి దిగ్భ్రమనీ గుర్తించేలోగా వచ్చేశాడు వరదరాజులు. తననుంచి ఒక్కొక్కరే దూరం పోతున్నట్లూ తనుమాత్రం నైరాశ్యంతో మొదటిసారి దుఃఖం వచ్చింది వరదకి.

దారిలో పీతాంబరం ఇల్లు కనిపిస్తే ఆగాడు.

వేడినీళ్ళు తీసుకువెళుతున్న నీలవేణి వరదరాజుల్ని చూసి తెల్లబోయింది. ఆహ్వానంకంటే, ఆశ్చర్యం ఎక్కువ తోచడంతో, సంకోచంతో ముందడుగు వేయడానికి తటపటాయించాడు.

"రండి, ఆయనకేం బాగులేదు" అని పక్కగదిలోకి నడిచింది.

పీతాంబరం మంచానికి అంటిపెట్టుకుని పడుకుని ఏదో పాత మేగజైను చదువుతూ కనిపించేసరికి, నిశ్చేష్టుడయాడు వరద.

వరదరాజుల్ని చూడగానే పాతబలాన్ని కూడదీసుకుందుకు ప్రయత్నిస్తూ నవ్వు తెచ్చుకుని "రండి వరదాసాబ్! మీకు కబురు చెయ్యమని వెయ్యిసార్లు చెప్పాను. నీలూతో - కాని ఏం చెయ్యను? జ్ఞాపకాల్ని నామందుతోపాటు కలిపి నాకే పట్టేస్తోంది అన్నాడు.

శరీరానికీ, మనస్సుకీ సంబంధం లేదేమోననిపించింది. అలా అయితే పీతాంబరం యీసరికి అరవైఏళ్ళవాడయిపోయేవాడు. ఐతే శరీరపు రుగ్మత మనస్సు బలాన్ని తగ్గించలేదు. కాస్త ఆరోగ్యం కూర్చుకోగల శక్తివుంటే పీతాంబరం గ్రంధాలు మాట్లాడగలిగేవాడేమోనని అనిపించింది.

లేవబోతే ప్రయత్నపూర్వకంగా ఆపి "నీరసంగా ఉన్నారు, పడుకోండి, నేనిక్కడ కూచుంటాను" అని కుర్చీ దగ్గరికి లాక్కుని కూర్చున్నాడు వరద.

నీళ్ళతో కాపడం పెట్టి తీసుకుపోయింది నీలవేణి.

"ఒక్కసారన్నా యీ విషయం నాకు తెలియకపోవడం ఆశ్చర్యం"

"చెప్పానుగా? ఆనందానికి ఆటవిడుపు కావాలంటే మధ్య మధ్య రోగాలుండాలి. ఈ మధ్య మనస్సు చెదిరింది. సుజాత చచ్చిపోయిన దగ్గర్నుంచీను. చాలా రోజుల క్రిందటినుంచే పేషెంటునే అనుకోండి. మళ్ళీ ఇన్నాళ్ళకి పాత డైబెటీస్ కేసు తిరగబెట్టింది. "

నీలవేణి వచ్చి గుమ్మానికి ఆనుకుని నిలబడ్డది.

"నాకు చెప్పలేదే యీ విషయం - మనిషినైనా తోడుగా ఉండేవాణ్ణేగా?

నీలవేణి ఆ మాటకు జవాబు చెప్పలేదు. సగం వెలిసిపోతున్న చీర అంచు పువ్వుల్ని లెక్కబెడుతూ "గులాబి ఎలావుంది?" అంది.

ఉప్పెనలా ఒక్క పెట్టున నవ్వడానికి ప్రయత్నించి దగ్గుతో ఆగాడు పీతాంబరం.

"యాభైమంది ఫెర్‌ఫెక్టు లేడీస్‌ని తీసుకొచ్చి నీలవేణి వరసలో నిలబెట్టండి. ఈ ఒక్క గుణం చేతా వాళ్ళందరికంటే వేరుపడుతుంది. ఇప్పుడు మాట్లాడండి. ఆమెలో ఏ విధంగా తప్పు పట్టగలరో చూస్తాను."

నీలవేణి వరదకూడా ఫక్కున నవ్వేశారు.

దగ్గుతెచ్చిన ఆయాసం యింకా శ్వాసకి ఆటంకం కలిగిస్తూండగా తల వెనక్కి వేలాడేసి కళ్ళు మూసుకున్నాడు పీతాంబరం.

"ఎప్పటికప్పుడు రావాలనే అనుకుంటాను, ముఖ్యంగా గులాబిని చూడాలని" అని ఆగింది నీలవేణి.

"కానీ వెళ్ళి వచ్చేలోగా నేను చచ్చిపోతానేమోనని భయం. దుష్టశిక్షనా, శిష్టరక్షణ కోసం, పుట్టినవాళ్ళు అంత త్వరగా చచ్చిపోతారా వరదగారు. పదహారువేల గోపికల్ని, ఓ పెద్ద వరల్డ్‌వార్ అంత భారత యుద్ధాన్నీ నడిపిగాని - చావలేదు కృష్ణుడు. ఈ మధ్యే కాస్త తాత్వికదృష్టి అలవడింది లెండి. భగవద్గీత ప్రాథమిక సూత్రాలను గురించి రిసెర్చి చేస్తున్నాను డెత్‌బెడ్ మీద" అన్నాడు.

"ఛ అలా అనకండి" అన్నాడు చివరిమాటకి నొచ్చుకుంటూ.

జాలిగా, ఆర్ద్రతతో చూశాడు పీతాంబరం, ఆ మాటలకు చలించి ఒక్కసారిగా వరద చేతులు రెంటినీ పట్టుకున్నాడు.

"ఎప్పుడయినా మిమ్మల్ని రహస్యంగా పిలిచే సమయం తప్పకుండా వస్తుంది సార్! వీడి మాటలకేం అని కొట్టిపారేయకుండా తప్పకరండి, అప్పుడు జీవితంలో ఎన్నడూ మరిచిపోలేని రహస్యాన్ని చెప్తాను" అన్నాడు.

నీలవేణి అచేతనంగా నిలబడ్డది.

"ఇక నేను వెళతాను" అని లేచాడు వరద.

"మిమ్మల్ని చాలామంది అర్థం చేసుకోలేకపోయారనుకుంటాను. మీలా గడపడం ఒక అవకాశం అని నా ఉద్దేశం. ఓ పదిపౌనుల సంతోషాన్ని పంచి యిచ్చేసి వెళ్ళిపోతున్నారు" అన్నాడు.

గది దాటబోతే "లేచే ఓపిక లేదుగాని, లేకపోతే జుంజున్‌వాలా మిఠాయి కొట్టువరకూ మీతో హుషారుగా నడిచి వచ్చేవాణ్ణి."

అప్రయత్నంగా కళ్ళనీళ్ళు తిరిగాయి వరదకి. అమాయకంగా, ప్రపంచానికి కాస్త ఆహ్లాదాన్ని పంచిపెడుతూ బ్రతికే పువ్వు రెమ్మ విరగడం ఎంత నష్టమో పీతాంబరం మంచం పట్టడం అంతేననిపించింది. ఓ విధంగా జీవితంపట్ల నిర్లక్ష్యాన్ని ప్రశాంతతనీ ఏర్పరచుకొందుకు అతనే కారణమేమో!

బైటికి వచ్చేసరికి నీలవేణి కాఫీ తెచ్చి యిచ్చింది. ఆశ్చర్యంతో చూస్తే "ఆయన కాఫీ తాగకూడదు" అని మాత్రం అంది.

నీలవేణిని పరిశీలనగా గమనించి, చాలా మారిపోయిందా అనుకున్నాడు. తనవికాని ఒడుదుడుకుల్ని గోప్యంగా, సహనంతో భరించగల శక్తి, అన్నిటినీ ఆకళింపుకు తెచ్చుకుని దాచుకోగలిగే నేర్పూ యివన్నీ వయస్సుకి మించినవయి ఆమెను అలిసిపోయేటట్లు చేసినాయి. అయినా పవిత్రంగా మెరిసే కళ్ళల్లో నలుపూ, ప్రసన్నంతో ఎదురయే ముఖంలో చల్లదనం, వయస్సు దిద్దిన హొయలు పాత నీలవేణిని పట్టిచ్చాయి.

ఏదో అడగాలని యింతవరకూ దాచుకుంటున్న విషయాన్ని అనేశాడు వరద.

"రవణమూర్తి వెళ్ళిపోయాడట?"

నీలవేణి స్థంభానికి ఆనుకుని నిలబడింది, "అవును"

"అయితే నీకో విషయం తెలుసా"

"ఊఁ"

"నాతో ఎవరూ చెప్పలేదు"

"...."

పీతాంబరం ఏదో పాటను గొణుగుతున్న శబ్దం వినిపిస్తోంది.

కాఫీగ్లాసు అందించి అసంకల్పితంగా అడగాలనిపించిన ప్రశ్న అడిగేశాడు.

"వైశాఖంలో మీ పెళ్ళి విషయం?"

"అదేం లేదు" అంది. జవాబు చెప్పడానికి ముఖంలో కనిపించిన తడబాటుతో మిగతా విషయం అర్థమైంది.

"ఏం?"

"ఆయనకు టి.బి సూచనలు కనిపించాయి. మొన్న ఉన్నట్లుండి రక్తం పడింది. వెళ్ళిపోయే ముందురోజు యిక్కడి కొచ్చి చెప్పారు."

"ఆ విషయం అడగలేదా నువ్వు"

"లేదు. ఆ సంగతే మరిచిపోయినట్టున్నారాయన."

ఇదంతా ఏవో కలల్లో జరిగిపోతున్న విషయంగా తోచింది. నిర్విణ్ణుడయి నిలబడిపోతే నీలవేణి లోలోపల నవ్వుకున్నది.

వెళ్ళబోతూంటే "రేపు తప్పకుండారండి. ఈ మాత్రం నవ్వుతూనయినా ఈ మధ్య ఉండలేదాయన" అంది.

**ప్రళయ ఝంఝా** ప్రభంజనం హేలాతిశయంతో వీస్తోంది. వెలుగు చీకట్లు ఏకమయేట్లున్న వర్షపు హోరు, గుండె బద్దలు చేసే మెరుపుల మధ్య డాలీ పెళ్ళి జరిగిపోతోంది.

కనుచూపు మేరలో వధూవరులిద్దరూ బంతి చెట్ల అవతల పందిరి క్రింద.

ప్రకృతి సైతం విధికి ఎదురీదలేకపోయింది.

వర్షమయేది, ప్రళయమయేది పట్టుబట్టి పెళ్ళి కానిచ్చాడు కామ్‌దార్.

డాలీ కోలముఖం నీటిధారల వెనక, మసకగా కనిపిస్తూ మల్లెపూల మధ్య గుర్తుపట్టకుండా చెదిరిపోయింది. పక్కన నిలబడ్డ వరుని ముఖానికి అరటిచెట్టు అడ్డంగా వుంది. కాస్త కదిలి పక్కకి తప్పుకుని చూస్తే వయస్సు ముదిరిన వ్యక్తిలాగా, జీవితంలో రెండోభాగంలో అడుగుపెట్టిన వాడిలాగా కనిపించాడు.

సమస్యలు ఏ సమాజంలోనన్నా ఒక్కటే. తనని గురించి తను పూర్తిగా ఆలోచించుకోలేని డాలీమీద వయస్సు అవ్యక్తంగా పెద్ద శిక్ష విధిస్తూన్నది. పెద్దలంతా ఆచారాల్నీ ఆనవాయితీల్నీ ఆధారంగా చేసుకుని దాన్ని బలపరుస్తున్నారు. మంచిగానీ, చెడుగానీగాక, ఆ రాత్రి ఇద్దరి జీవితాల్నీ ఒకే ముడికి బిగించింది సంఘం.

గదిలో గులాబి గుర్రుపెట్టడం వినిపిస్తోంది. కూర్చున్నంతసేపు పెళ్ళివారితో కలిసి కూచుని తిరిగి వచ్చేసింది గులాబి.

డాలీకి ఏం బహుమతి యివ్వాలో తెలీక అయిదురోజులు ఆలోచించి, వరదరాజుల్ని సలహా అడిగింది.

బంతిపూల మధ్య ఒద్దికగా కనిపించే డాలీ ముఖంలో వెన్నెల, ఆ రాత్రి నడుంకి శ్వాస బిగించినప్పటి కళ్ళల్లో విచిత్రం, నవ్వుతున్నప్పుడు దొంగతనంగా చూసిన చల్లదనం గుర్తుకొచ్చి "ఎరుపు రంగు చున్నీ వంటికి అతుకుతుందేమో" అన్నాడు.

ఎగిరి గెంతేసి మర్నాడే కొనుక్కుని వచ్చింది గులాబి. పెళ్ళి హడావుడి రాత్రయేసరికి తగ్గింది. ఆడంగులంతా కలిసి ఏవో జానపదాలు పాడుతూ మధ్య నవ్వుకుంటున్నారు. మొగాళ్ళంతా పందిరి మొగలో కూచుని బాతాఖానీ ప్రారంభించారు.

డాలీ తల్లి ఒడిలో తలపెట్టుకుని పడుకోవడం ఇక్కడినుంచి సగమే కనిపిస్తోంది. చేతులు తివాసీ మీద మెలికలు తిరిగి, మల్లెపువ్వులు చెదిరి చుట్టూ జల్లినట్లుపడి మత్తు నిద్రపోయింది డాలీ.

క్రమంగా తనకి తెలీకుండానే కుర్చీలోనే నిద్రపట్టేసింది.

మబ్బుతెర మూడో ఝాముకి విడి, చెట్ల పచ్చివాసన గుప్పుమంది, నైట్‌క్వీన్ వాసన దూరంగా ఎక్కడినుంచో పిరికివాడి కోరికలాగా వ్యాపించింది.

ఏ రాత్రికో ఎవరో పిలిచినట్లయి తుళ్ళిపడి కళ్ళు విప్పితే నీడలో ఎవరో వత్తిగిలి నిల్చున్నట్లయింది.

తుళ్ళిపడ్డాడు వరద.

పిరికిగా "ఎవరూ?" అన్నాడు సగం రాని గొంతుతో.

"నీలవేణిని" అన్నమాట విని విచలితుడయాడు.

అసంకల్పితంగా ఆమె తన ముందుండేసరికి అచేతనుడయాడు. క్షణకాలం కర్తవ్యం స్ఫురించలేదు.

చల్లటి రొజ్జగాలి యింకా వీస్తూనే వుంది. తుంపర్లుగా మళ్ళీ వర్షం ఆరంభమౌతోంది. పెళ్ళిపందిరిలోని దీపం వెలుగు చారికలుగా చీలి, చీకటిలో చీలికలయింది.

నీలవేణి అలానే నిలబడింది.

ఎంతకూ వరదరాజులు మాట్లాడకపోయేసరికి - స్వరం కల్పించుకుని "తడిసిపోయాను. దారేదయినా చూడండి" అంది.

అప్పటికి స్పృహ కలిగింది వరదకు, వెంటనే లేచి దీపం వెలుగులో ఆమెను చూసి భయంతో దిగ్భ్రాంతుడయాడు.

ఒక పక్క వర్షంలో చీర తడిబారి శరీరంతో కలిసిపోయింది. తల నుంచి నీటి చుక్కలు టపటపా రాలుతున్నాయి. కుడివేపు నుదురు పగిలి రక్తంధారగా కంటిమీంచి పాకి చెక్కిలి మీద వరసకట్టి గడ్డం దగ్గర అంతమయింది.

నీటిలో తడిసిన ఎర్రటి బొట్టు జాజ్వలమయింది. రక్తంతో కుడి చెంప మెరుస్తున్నది. ఆమె యింకా తలవొంచుకుని స్థిమితంగానే నిలబడింది.

ఈ బీభత్స దృశ్యాన్ని చూడగానే కంపితుడయి "నీలవేణీ" అన్నాడు.

"అవును, నేనే"

"ఏమిటిది?"

"అంతా చెప్తాను, మొదట గులాబీని లేపండి ఒక్కసారి" అన్నదామె గాంభీర్యం చెడని కంఠంతో.

మంత్రముగ్ధునిలాగా గులాబిని లేపాడు వరద. "నీలవేణి వచ్చింది" అన్నాడు.

తెల్లబోయింది గులాబి.

"ఏమీ గాభరా పడక్కరలేదు. ఎందుకనో నుదుటి మీద దెబ్బ తగిలినట్లుంది. కారణం అడక్కు, ఏం కావాలో చూడు" అన్నాడు క్రమంగా స్వాస్థ్యం చిక్కబట్టుకుంటూ.

చావడిలోకి వస్తే "మీకు అర్ధరాత్రి కష్టం కలిగించాను" అంది నీలవేణి.

"అవన్నీ తర్వాత, మొదట లోపలికి వెళ్ళు, ఇప్పుడేం చెప్పకు. ఉదయం మాట్లాడవచ్చు" అన్నాడు.

గులాబి విచిత్రంగా నీలవేణి ముఖం చూస్తూ గుమ్మానికి చేరబడింది. ఏదో అడగబోయి మానేసింది.

గదిలో పెట్టి తీసిన చప్పుడూ, కలరావుండల వాసనా, గులాబి మాటలూ వినిపిస్తున్నాయి. పాలవాళ్ళు పెళ్ళివారిని లేపుతున్నారు. పిల్లల ఏడుపులూ, ఆడవాళ్ళ మేలుకొలుపు పాటలూ, ఏవో మాటలూ వినిపిస్తున్నాయి. మళ్ళీ తుంపర్లు ఎక్కువయి జల్లుగా వర్షం ఎత్తుకుంది.

గదిలో గులాబితో ఏదో చెప్తోంది నీలవేణి.

ఆ భయంకర దృశ్యాన్ని యింకా మనస్సు ఆకట్టుకోలేక రెపరెపలాడుతోంది.

నిద్రరాక చావడిలో పచార్లు ప్రారంభించాడు.

దూరాన చర్చిగడియారం అయిదు కొట్టడం స్పష్టంగా తెలిసింది.

ఎనిమిది గంటలకి మెలుకువ వస్తే అంతవరకూ నిద్రపోయినందుకు ఆశ్చర్యపోయాడు వరదరాజులు.

గదిలోకి వస్తే కుంపటి దగ్గర కూచుని చలికాచుకుంటున్న నీలవేణి కనిపించింది.

ముఖం కడుక్కుని లోపలికి వచ్చేసరికి కాఫీ తెచ్చి యిచ్చింది. నీలవేణి గాయం తగిలినచోట జుత్తు వెనక్కి తీసి చీర అంచు ముడివేసింది.

అద్దంలో పాలిపోయిన ఆమె ముఖం తెలుస్తూనే వుంది.

రాత్రంతా కూడదీసుకున్న మాటని చివరికి అనేశాడు. ''నువ్వేం మంచిపని చేయలేదు నీలవేణి''

తెల్లబోయి చూసిందామె.

''మనస్సులు గొప్పవైనంత మాత్రాన బ్రతకడం కష్టమని యిటీవలి అనుభవం చాలా పాఠాలు నేర్పింది. సుజాత విషయం యింకా మరిచిపోలేకపోతున్నాను.''

నిశ్శబ్దంగా కాఫీగ్లాసు తీసుకుని వెళ్ళిపోబోతే

''ఏం జరిగింది?'' అన్నాడు.

అప్పటికీ మాట్లాడలేదు నీలవేణి. దిమ్మెరపోయాడు వరద.

దుఃఖాన్ని, కించనీ, విచారాన్నీ ఎక్కడో మరిచిపోయి నిశ్శబ్దంగా నక్షత్రాల నిరీక్షణలో నిలిచిపోయిన రాత్రిలాగా నీలవేణి నల్లటి ముఖం.

రెండు క్షణాల తర్వాత వంటింట్లోకి వచ్చి చూస్తే తలుపుకు చేరబడి కంటనీరు పెట్టుకుంటున్నదల్లా తుళ్ళిపడి కళ్ళు తుడుచుకుంది.

ఆర్ద్రతతో, దయతో మనస్సు కదిలి అనుకోకుండా ఆమె శిరస్సున చేయి ఆనించాడు.

''ఒకటి, రెండుకాదు - ఇన్నాళ్ళు చూసినా నన్నింకా నమ్మలేదు నువ్వు, బహుశా నీమీద నీకే నమ్మకం లేదేమోననిపిస్తుంది. నీ కిష్టంలేకపోతే వద్దు - చెప్పకు'' అన్నాడు.

దుఃఖం ఆపుకోడానికేం ప్రయత్నం చెయ్యలేదు నీలవేణి. అతని చేతుల్లో తలానించి చిన్నపిల్లలా ఏడ్చేసింది.

వెచ్చని ఊపిరి చేతుల్ని కాలుస్తోంది - నిస్సహాయత, దైన్యం అంతగా ఎప్పుడు స్పష్టపరుచుకోలేదు నీలవేణి. కృత్రిమ గాంభీర్యం, తాటస్థ్యం క్షణంలో మరుగుపడి స్త్రీ సహజమయిన బలహీనతల్తో మిగిలిందామె.

ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి గుండెకు హత్తుకున్నాడు. నిస్సహాయతతో అతని చేతుల్లో అసంకల్పితంగా ఒదిగిపోయింది.

చలితో వణుకుతూ క్షేత్రయ్య పదం ఎత్తుకుంది గులాబి.

యిద్దరూ తుళ్ళిపడ్డారు.

చావిడిలోకి కామ్‌దార్ వచ్చి నిలబడ్డాడు. ''వరదరాజులుగారూ'' అంటూ. అతను బయటికి వస్తే ఏదో చెప్పబోయి, తలకి కట్టుతోవున్న నీలవేణిని చూసి నిర్ఘాంతపోయాడు. కామ్‌దార్, క్షణంలో అర్థమైనట్లు పెదవి రెండు విరుపులు విరిచాడు.

''ఇంటి అద్దెకోసం కాదుకానీ - మా వాళ్ళంతా ఎంత బాధపడ్డారో చూస్తున్నారుగా? ఈ వర్షాల సమయంలో ఈ ఇల్లువుంటే కాస్త అక్కరకు వచ్చేది. ఈ నెలయినా ఖాళీచెయ్యండి'' అన్నాడు సౌమ్యంగా.

విసుగేసింది వరదకు.

"అంత త్వరగా చెయ్యడం సాధ్యం కాదండి, అయినా యిప్పట్లో చెయ్యలేను.

ఇంకా వాదించేవాడే కానీ, అవతల పెళ్ళి హడావుడి ఎక్కువగా ఉండటం మూలాన "సరే. ఈ నెల అద్దె పంపించండి. వచ్చే నెల చూద్దాం. ఏదేమైనా మీరు ఖాళీ చేయడం మాత్రం ఖాయం, తర్వాత తగవులూ, మాటరావడం నాకిష్టం ఉండదు" అనేసిపోయాడు.

వెనక్కి తిరిగితే తల తుడుచుకుంటూ గులాబి కనిపించింది, తలుపుకు ఆనుకుని నీలవేణి కనబడ్డది.

సిగ్గుతో కుంచుకుపోయాడు వరదరాజులు.

బజారు నుండి వస్తుంటే ఓ రోజు గోవర్ధనరావుగారు వరదని చూస్తూనే పెద్ద కేకలు వేస్తూ బండి ఆపుచేయించాడు.

చాలా రోజుల తర్వాత హఠాత్తుగా గోవర్ధనరావుగార్ని చూసేసరికి ఆశ్చర్యపోయాడు వరదరాజులు, నునుపటికన్నా బాగా చిక్కిపోయి, ఏదో బెంగతో మనస్సులో సతమతమౌతున్నట్లు కనిపించారు. ఇది వరకటి ధీమా తప్పి కళ్ళలో కాస్త దైన్యత, నిస్సహాయత కమ్ముకున్నట్లనిపించింది.

బండి దగ్గరికి వచ్చి ఆగాడు.

భుజం మీద చెయ్యేసి రెండు క్షణాలు మాట్లాడకుండానే వరద రాజుల్ని ఆపాదమస్తకం పరికించారు.

"చాలా మారిపోయావోయ్ నువ్వు. అనుకున్నాను మారిపోతావని ఆరోగ్యం చెప్పింది" అన్నారు నవ్వుతూ.

తలొంచుకుని అలానే నిలబడ్డాడు వరద.

"కులాసాగా ఉన్నారా?"

"ఉన్నానని చెపితే ముఖప్రీతి అవుతుంది. కులాసాగా లేనయ్యా ఆరోగ్యం కూడా పేరు మాత్రం మిగుల్చుకుని ఆరోగ్యం పోగొట్టుకుంది. నువ్వొస్తే బావుణ్ణని ఎప్పుడన్నా అనుకునేవాళ్ళం. కానీ ఎలా? మా వినత రావడం ఎంత అసాధ్యమో, నువ్వూ అలాగే. అనవసరంగా దూరమయిపోయాను"

వరద యింకా మాట్లాడక పోవడం చూసి "ఏం? వంట్లో బాగోలేదా?" అన్నాడు.

"బాగానే వుంది"

"నీతో చాలా చెప్పాలనుకుంటాను ఎప్పటికప్పుడు. కానీ ఉన్నపాటునే యీ బజారులో ఎలా? పోనీ ఒక్కసారి యింటికి రాకూడదూ? కాస్సేపు కూచుని వెళ్ళవచ్చు. ఆ కిరస్తానీ ఆవిడ కూడా సంతోషిస్తుంది."

ఆయన మాటలు యిదివరకంత ఉత్సాహం తెచ్చిపెట్టేవిగా లేకపోయినా లోపల్లోపల నవ్వుకున్నాడు వరద.

"ఇప్పుడు కాదులెండి. మళ్ళీ ఎప్పుడన్నా వస్తాను" అన్నాడు పరధ్యానంగా.

"నువ్వు చాలా మారిపోయావ్ - అదీ నేను గ్రహించిన విషయం, ఆ సందు మలుపుదాకా దిగబెట్తాను. బండి ఎక్కు" అన్నారు.

ఇక విధిలేక మెల్లిగా లోపలికి పాకాడు వరద.

చాలా విషయాలు చెప్పడానికి తికమకపడుతూ ఏమీ చెప్పలేక పోతున్నారు గోవర్ధనరావుగారు.

ఉండుండి ప్రారంభించారు. "కాశీపతి పత్రికల వ్యాపారం బాగా సాగుతోందట - నీకెప్పుడయినా వ్రాశాడా?"

తల అడ్డంగా తిప్పాడు వరద.

"ఇప్పుడు చాలా లాభాలు వస్తున్నాయి. నన్నూ ఆరోగ్యాన్ని అక్కడికే వచ్చేయమని వ్రాస్తాడు" అని ఫక్కున నవ్వేసి "అమ్మాయి ప్రోత్సాహంతోనే అలా వ్రాస్తున్నాడని అప్పుడే పోల్చేశాననుకో. అయినా మనం వెళ్ళి అతని మీద కూచుంటే బావుంటుందంటావా?

బావుండదు నాకు తెలుసు. అరే అప్పుడే బండి వీధిమొగకి వచ్చేసిందే. అవసరమయినప్పుడు తొందరగా నడవదు. మన మాటల్లో మూడంగల్లో దాటేసింది'' అని నవ్వాడు.

వరదరాజులుకూ నవ్వొచ్చింది.

దిగిపోయాక ''రేపే ఒకసారి యింటికి రా, నీతో అతి ముఖ్యమయిన విషయం చెప్పాలి'' అన్నారు గోవర్ధనరావుగారు.

అదేమిటో అర్థంకాక వరద ఆశ్చర్యంగా చూస్తే నవ్వేశారు ఆయన. ''ఈ మధ్య నీలవేణి మీ యింటికి వచ్చిందట''

తెల్లబోయాడు.

''ఎవరన్నారు?

''ఎవరయితేనేంలే, వరదరాజులు జీవిత చరిత్ర వ్రాయాలంటే వరదరాజుల్ని కాదు. నన్నడగాలి విషయమంతా. అదీ పద్ధతి - ఒక్కటి చెప్పేదా?'' అన్నారు రూఢీగా చెప్పడానికి నిశ్చయించి.

వరద అవునూ అనలేదు, కాదు అనలేదు.

''నువ్వు ఓ యింటివాడివి కావడం ముఖ్యమోయ్. నీలవేణి తెగిన గాలిపటంలా వుంది. తర్వాత నీ యిష్టం'' అని బండివేపు తిరిగి ''పోనీవోయ్'' అన్నారు వరదరాజులు యింకోమాట చెప్పేలోగా.

అతను నిశ్చేష్టుడయాడు.

ఏదో వెలుగులేని గుబులులోకి తన జీవితం జరిగిపోతున్నట్లూ అక్కడ శిక్షించేవారే తప్ప, సానుభూతి చూపేవారు కనిపించని అప్రీతికరమైన వాతావరణంలోకి దిగిపోతున్నట్లు మనస్సు గుంజుకులాడింది. ఆ చీకట్లో దూరంగా ఎవరో తోచారు. దగ్గరికి వెళ్ళి చూడబోతే - చీకట్లో కూడా మెరిసే కళ్ళతో, నా అనుకున్న అందరినుంచీ దూరమయి ఒంటరిగా నిలబడ్డది నీలవేణి.

ఆవరిస్తున్న నిశి నిశ్శబ్ధంలో వెలుగులేక తికమకపడితే ఆమె చెయ్యి అందిపుచ్చుకుంది. తన మనస్సు పిరికి తనంతో, బాధతో, భయంతో ఒదిగి వ్యక్తిత్వాన్ని వదులుకుని ''నిరాడంబరత'' అనే కొత్త అంగీని ధరించినట్లయింది. తనులేడు. తన బలహీనతలన్నీ 'తను' అయి తనకి వేరే లేని మార్గం వెంట పోతున్నాడు.

కలలోంచి మేల్కొంటే ఎలక్ట్రిక్ స్థంభానికి నుదురు కొట్టుకుంది. చుట్టూ ఓసారి పరికించి తనలో తానే నవ్వుకున్నాడు వరద.

గోవర్ధనరావుగారు కలిసిన విషయం గులాబికి చెపితే ''అవునన్నయ్, అదే మంచిది'' అంది.

గాజు పలకమీది నీటి బిందువులాగా పొత్తుకుదరని ఆలోచనలకు ఒకదారంటూ కనిపిస్తున్నది. చాలాకాలంగా మనస్సుకు తగిలించుకున్న శృంఖలాలు, అసంకల్పితంగా తెగిపడినట్లయి, తన మనస్సును పూర్తిగా తనే అర్థం చేసుకోలేని వరద ఇన్నాళ్ళకి కోరిక కొత్తదనాన్ని చూసి క్షణం బిత్తరపోయాడు.

ఇక తప్పదు. ఏమైనా కానీ వెంటనే నీలవేణి యింటికి బయలుదేరాడు.

సగం కాలిన ఊదొత్తులూ, దూలాలకూ, తలుపులకూ కండెలు కట్టి వేలాడే బూజుతో దిమ్ముమంటున్న యింటిని చూసి విస్తుబోయాడు. ఇక్కడెవరన్నా మనుషులున్నారా అనిపించింది. గట్టిగా పిలిస్తే పిలుపు మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చింది.

పెరట్లో మెట్లమీద మౌనంగా కూర్చున్నది నీలవేణి.

పలకరిస్తే తుళ్ళిపడింది.

''ఒంటరిగా ఉన్నావేం? పీతాంబరం ఎలా ఉన్నాడు?''

''ఆనాడే వెళ్ళిపోయారు. ఎక్కడికి వెళ్ళారో తెలీదు''

మాటలో ఏ భావమూ వ్యక్తం కాకపోయేసరికి అనుమానం కలిగింది.

"నిజంగా ఆనాడు ఎందుకు కొట్టాడు చెప్పు"

ఎదురుగ్గా కూర్చున్న అతణ్ణి విచిత్రంగా చుసింది.

తటపటాయించడం గుర్తించి "ఇంకా చెప్పాలని అనిపించక పోతే వద్దు" అన్నాడు. బాగుపడదేమో అనుకున్నారు. నన్ను రమ్మన్నారు. నేనే రానన్నాను"

"ఏం?"

ముఖం మరీ ఎర్రబారి మాటలు రావడం లేదు నీలవేణికి "ఏమీ లేదు"

చటుక్కున ప్రశ్న వేశాడు "మళ్ళీ రవణ తిరిగి వస్తాడని ఆశా?"

దిగ్భ్రమతో చూసిందతణ్ణి. కాస్సేపు ఆగిపోయాడు.

చెప్పాలనుకున్న పాఠమంతా యివాళ చెప్పదలచుకున్నాడు వరద నిశ్చయంగా.

కళ్ళల్లో వెలుగుపడి మెరిస్తే ఏడుస్తోందా అనుకున్నాడు మొదట.

"సుజాత విషయంలో నన్ను వెలివేసిన వారంతా మొన్నరాత్రి నువ్వు మా యింటికి వచ్చి వెళ్ళడంతో నన్ను మరీ దూరంగా ఉంచుతున్నారు"

నివ్వెరపోయిందామె. చేతిచుట్టూ కొంగును తిప్పుకుని భుజం మీదకి చీర లాక్కుంది.

"ఎవరు?"

"మన సంఘం - అంటే గోవర్ధనరావుగారు, ఆరోగ్యం, మా యింటి యజమాని, గులాబి, ఆఫీసు గుమాస్తా, కృష్ణశాస్త్రిగారు వీళ్ళు"

తనకే నవ్వొచ్చింది.

నీలవేణి నవ్వలేదు. మరి కాస్సేపటికి కళ్ళు బరువెక్కి ముఖం కప్పుకుంటుందేమోననిపించింది.

"మా చెల్లెలు మాత్రం నన్ను నమ్మగలుగుతోంది. నిన్ను కొంచెం అర్థం చేసుకుంది గనక"

"........."

"గులాబి నమ్మితే వీళ్ళందర్నీ మరిచిపోగలను"

ఎంతోసేపు నిశ్శబ్దంగా కూర్చుండిపోయారిద్దరూ.

నీలవేణి లేచి దీపం వెలిగించి వచ్చింది. మెట్లచుట్టూ గదిలోని వస్తువుల నీడలు పొడుగయి సాగాయి.

"సుజాత విషయంలో నా గురించి ఏమనుకున్నావు నువ్వు?" అన్నాడు ఆమె వచ్చాక.

"అంటే?"

ఒక్కసారిగా వివరణ చెప్పడం తెలియలేదు. మాటలు దొరకలేదు. "ఆమె చచ్చిపోవడంలో నా బాధ్యత."

జవాబు చెప్పకుండా ఉండడానికి చాలా ప్రయత్నిస్తున్నట్లు కనిపించింది నీలవేణి గమనించి ముందుకు వంగి "జవాబు చెప్పితీరాలి నువ్వు. చాలా రోజుల నుండి ఈ విషయం నాకే బోధపడడం లేదు."

"ఆమె అపనిందకు మీరే కారణమయితే బాధ్యత అంతా మీదే" నిశ్చయంగా ఏ మాత్రం చలించకుండా అన్నది.

"నా మాటని నమ్మలేదా నువ్వు?"

"కాదని మీరు ఒక్క రోజూ అనలేదుగా? అసలు నమ్మడానికీ, నమ్మకపోవడానికీను అదే నేను చేసిన తప్పు" అన్నాళ్ళ తర్వాత తన పొరపాటు అర్థమయింది. చాలా విషయాల్లో తన మౌనం తననే కసితో, నిందితుణ్ణి చేస్తోంది.

"అయితే విను. సుజాతలాంటి చెల్లెలుంటే ప్రపంచాన్నంతా మరిచిపోగలిగేవాణ్ణి" నీలవేణి మాట్లాడలేదు.

"ఇప్పుడన్నా నమ్ముతావా?"

"ఊఁ" అంది.

ఇంకేం చెప్పాలో అర్థం కావడంలేదు. గాలి రానురానూ చల్లబడుతోంది.

నీలవేణి లేచి గదిలోకి వచ్చింది.

"ఇక్కడే ఉండదలిచావా?"

"ఇంకా ఏం నిర్ణయించుకోలేదు. బహుశా వారం రోజుల్లో వెళ్ళిపోతాను"

"ఎక్కడికి?"

"ఏమో తెలీదు. గూడూరులో మా మావయ్య ఒకాయన ఉండాలి"

"విశ్వేశ్వరం సంగతులు ఏవన్నా తెలిశాయా?"

ఫక్కున నవ్వేసింది "అలా అడగకూడదు. ఎప్పుడన్నా ఆయన కనిపిస్తే 'నీలవేణి' అన్న మనిషి తెలుసా మీకు అని అడగండి. జవాబు దొరుకుతుంది"

అతనికీ నవ్వొచ్చింది. ఉండుండి మాట్లాడాడు "మొన్న గోవర్ధనరావుగారు కనిపించి ఓ మాట అన్నారు"

"ఏ విషయం?" కిటికీ కర్టెన్లు సరిచేస్తూ అంది.

"నీ పెళ్ళి విషయం?"

"....."

"నువ్వు ఆనాటి రాత్రి నా యింట్లో ఉండడం విన్నారాయన. నీలవేణి ఒంటరితనాన్ని నువ్విలా ఉపయోగించుకోవడం బాగోలేదు" అన్నారు. ఆమె కిటికీ ఊచలకి తల ఆనించి కళ్ళనీళ్ళు పెట్టడం గమనించి నవ్వుకున్నాడు. "నువ్వింకా ధైర్యవంతురాలివనుకున్నాను. నా పరిస్థితిలో నువ్వుంటే ఏడుపుతో గుండె బద్దలయ్యేది" మాట్లాడలేదు నీలవేణి.

లేచాడు వరద.

ఏదో అసంకల్పిత ప్రోద్బలంతో అడిగాడు "మా యింటికి వస్తావా?"

ఆశ్చర్యంతో తలెత్తింది.

"నా మీద నమ్మకం ఉంటేనే"

ఇంకేమీ మాట్లాడకుండా "పదండి" అంది నిర్లిప్తంగా ఆపాడు.

"ఇప్పుడు కాదు. ఎప్పటికీను" నిశ్చేష్టురాలయింది.

కాస్సేపాగి "ఈ విషయం కూడా ఆయనే చెప్పారా?" అంది.

అప్పుడే చిక్కపడిన చీకట్లోకి చూస్తున్నాడు.

"ఎవరు?"

"గోవర్ధనరావుగారు"

"మాట మాత్రంగా అన్నారు. లేకపోతే నీ జీవితం కూడా సుజాత జీవితంలాగే అవుతుందేమోనని అతని భయం. మీ అందరి మధ్యా ఓ రాక్షసుడు బ్రతుకుతున్నాడిక్కడ. అతని పేరు వరద."

"మీరేమన్నారు?"

"ఇలాంటి విషయాల్లో మాటలు సులువుగా తోచవు. నిన్నడిగితే నువ్వేం చెపుతావు"

"అలాంటి ఆలోచనలెప్పుడూ తెచ్చుకోకండి" మనస్సులో నిశ్చయం ప్రతీ అక్షరంలోనూ పొల్లుపోకుండా వ్యక్తమయింది.

ఆశ్చర్యం కలగలేదు వరదకి. చాలాకాలం క్రిందట తెలిసిన విషయంలాగా ఆ వాక్యం విన్నాక నవ్వొచ్చింది. "ఆరోజు అతనితో ఈ మాట అనలేకనే తలవొంచుకుని వచ్చేశాను" అని బయటికి నడిచి వచ్చేశాను.

ఎంత మానుకుందామనిపించినా నీలవేణి తిరస్కారం, ఆ నిర్లక్ష్యం, మనస్సుని క్షోభ పెట్టసాగాయి. అందని వస్తువు కోసం తాపత్రయం, అసంతృప్తిలో సంతోషం సహజమయితే వరదరాజులు తపనకు ఆశ్చర్యపడాల్సిన పని ఉండదు.

కానీ నీలవేణి తనదిగా, తన మనస్సులా, తన ఆలోచనల్లా అతి దగ్గరగా తనలో భాగంగా ఊహించుకున్న తరువాత ఇవాళ భంగపడి ఖిన్నుడయాడు. హృదయంలో వ్యక్తి సహజమైన వాంచా, దర్పాలు తలెత్తాయి. ప్రపంచంలోని లక్షలాది మందిలో తనూ ఒకడయిపోయి, అందరిలాగే పాతనవ్వు నవ్వుకున్నాడు వరద.

అప్పుడతను వరదకాడు - మానవుడు.

***

"మీకు పెళ్ళయిందా?" అనడిగింది పద్మిని.

ఏం చెప్పాలో తెలీక నవ్వేశాడు వరదరాజులు.

అర్థమైనట్లు మూతి సున్నాలా చుట్టి నవ్వింది. భుజానికున్న కుర్రవాడు బెలూన్లు చూపించి అరుస్తున్నాడు. నిలబడ్డ అమ్మాయి పోదామని చెయ్యిపుచ్చుకుని లాగుతోంది.

"ఏం? మిమ్మల్ని చూస్తే ఎవరూ పెళ్ళికాలేదని అనుకోరు. అప్పుడే అయిదుగురు పిల్లల తండ్రిలా అవుపిస్తున్నారు. మహా అయితే నాకంటే మూడేళ్ళు పెద్ద, అంతేనా?"

మళ్ళీ ఆ బరువెక్కిన కళ్ళల్లో చిలిపిదనం చూసి నవ్వుకున్నాడు వరద.

ఉన్నట్లుండి పార్కులో ప్రతీ చెట్టుకీ ఒక్కొక్క రంగుదీపం వెలిగింది.

పద్మిని గుండ్రటి ముఖం వెలుగునీడల మధ్య వింతగా కనిపిస్తోంది అమ్మాయి యింటికి రమ్మని అల్లరి చేస్తోంది.

"ఇంకా అదే ఉద్యోగమా?"

"ఊఁ"

ఫక్కున నవ్వేసింది. "ఓసారి యింటికి రాకూడదూ? మా వార్ని పరిచయం చేస్తాను. నేను హెచ్చుగా మాట్లాడతానని ఆయన విసుక్కుంటారు. మీరయితే ఆయనకి నచ్చవచ్చు"

"కాపురం చెయ్యడానికా?"

ఇద్దరూ నవ్వారు.

అమ్మాయి అల్లరి చేస్తే కసురుకుంది. అంతలో వరద ముఖం చూసి నవ్వేసింది. "వీళ్ళతో యిలా ఈడిగిలపడడంలోనూ తృప్తి ఉంది. ఎంత చెపితే మీకు అర్థమవుతుంది? పిల్లల కోసమన్నా పెళ్ళి చేసుకోండి"

"ఆయనేరీ?" అనడిగాడు మాటమార్చే ఉద్దేశంతో.

"విశ్రాంతి కావలసివచ్చినప్పుడల్లా నాతో షికారుకు రారు మాటల్తో ప్రాణం తీస్తానని. తీరుబాటుగా ఉన్నప్పుడెప్పుడయినా యిద్దరం కలిసి వెళ్తాం. ఇవాళ సర్కస్‌కి వెళ్ళారు నన్నువొదిలి. ఆయనతో మరి యిద్దరు పిల్లలున్నారు. మొత్తం నాలుగు"

ఉద్యోగం చేసే రోజుల్లో ఆమె చిలిపితనం, ఆ నిర్లక్ష్యం తెచ్చుకోడానికి పడే గుంజాటన, కళ్ళూ, ముఖం చెప్తున్నాయి. ఈ బంధాలన్నీ బాధగా వున్నా ఏవీ లేవనుకుని తృప్తితో, వాటికి అతికిపోవడానికి ప్రయత్నం తెలుస్తోంది.

"వెళ్తాను" అన్నాడు వరద.

"ఉద్యోగం కోసం కాదు పోనీ, ఒకసారి రండి. ఆయన నిజంగా సంతోషిస్తారు. మీ గురించి చెప్పాను. తెలుసుగా? లైట్‌హౌస్ దగ్గర"

తలూపి పార్కు దాటాడు వరదరాజులు.

ఎవరో పాతబంధువుని కలిసినట్లనిపించింది పద్మినితో మాట్లాడుతున్నంతసేపూ.

మర్నాడు ఉదయాన్నే ఆఫీసుకి బయల్దేరేవేళకి గుమ్మంలో ఆరోగ్యం ఎదురుపడితే దిగ్భ్రాంతుడయాడు వరదరాజులు.

"ఆఫీసుకేనా? నేనప్పుడే అనుకున్నాను నువ్వుండవేమోనని" అంటూ పలకరించింది.

మునుపటి కంటే అంటీ అంటనట్లు పలకరింపు కృత్రిమంగా కనిపించేసరికి కించపడ్డాడు.

"కనిపించావే యిప్పటికయినా?" అన్నాడు.

మొదట ఆరోగ్యం తెల్లబోయింది. ఏం చెప్పాలో తెలీక అంతలో నవ్వేసింది.

"ఇద్దరు వ్యక్తులే ప్రపంచమనుకుంటే బ్రతకలేమోయ్! నిజం తెలీకపోతే తప్పు అభిప్రాయ పడడంలో తప్పులేదు. అయినా నాకేం దివ్యదృష్టిలేదు నీ మంచితనాన్ని కనిపెట్టడానికి"

"మరిప్పుడెలా తెలిసింది"

"భలే! గుమ్మం దగ్గరే అన్నీ అడిగేసి తిప్పి పంపేసేటట్లున్నావే. నిన్నుకాదు ముఖ్యంగా గులాబిని చూసిపోదామని వచ్చాను. అయినా నువ్వూ వుండాలి. లోపలికి పద"

ఓ పక్క ఆఫీసుకి వేళవుతున్నా ఇక తప్పనిసరయి లోపలికి వచ్చాడు. ఇందాకటి ప్రశ్నకు సమాధానమిస్తూ "ఇప్పటికాలంలో నోరు లేకుండా బ్రతకడం కూడా నేరమే. ఎప్పుడన్నా విశ్వేశ్వరం గారు కనిపిస్తే అడుగు. ఆయనింకా విపులంగా చెప్తారు. నిన్న నీలవేణి చెప్పింది నీదేం తప్పులేదని, "ఏం? యిప్పుడు నమ్మావా?"

దిమ్మెరపోయాడు వరద.

"నాకు మొదట్నుంచీ యీ విషయంలో అపనమ్మకమే. పైగా నా మనస్సులో యిదివరకటి నుంచీ ఓ ఆలోచన ఉండిపోయింది" గులాబి చావిడిలో కనిపిస్తే "ఇంత అందాన్ని యిలా యింట్లోనే వదిలేస్తే బాగోలేదోయ్. నేనిదివరకే చెప్పాను. త్వరగా పెళ్ళి చేసేయ్" అంది.

కూచుని కాస్సేపు ఆ మాటా యీ మాటా చెప్పాక మెల్లగా అసలు విషయానికి వచ్చింది ఆరోగ్యం.

"నీలవేణిని అలా వదిలేయడం బాగోలేదు. ఎవరేమన్నా నీమీద నాకు నమ్మకం వుంది"

గులాబి లేవబోతే "నువ్వూ వుండు, ఫరవాలేదు" అని భుజం పట్టుకుని కూర్చోబెట్టింది.

"చాలా సంతోషం" అన్నాడు.

"చాలారోజుల క్రిందటే చెప్పాలనుకున్నాను. అయినా సమయం రాలేదు. నీలవేణి యీ యింటికి వస్తే తప్పా?" అనడిగింది ఆరోగ్యం అంత అర్థాన్నీ చివరివాక్యంలో యిముడుస్తూ.

"గోవర్ధనరావుగారే ఈ విషయాన్ని చెప్పి పంపించారనుకుంటాను"

వింతగా చూసి నవ్వేసింది ఆరోగ్యం.

"ఆయన చెప్పకపోతే కాదా యేం. వేటి మాట ఎలా వున్నా, తెలివిని కూడా ఆయన దత్తం చేయలేదు నేను. విషయం మార్చకు. బాగా ఆలోచించి నీ వుద్దేశం చెప్పు"

"నాతో చెప్పి లాభం లేదు. మీకు నీలవేణి  విషయం తెలీదు" అన్నాడు.

ఆ మాటకి గుక్క తిప్పుకోకుండా నవ్వేసింది ఆరోగ్యం.

"అయితే నన్ను ఓ విషయం చెప్పనీ. నీలవేణి నువ్వనుకున్నంత ధైర్యవంతురాలూ, గంభీరమైన మనిషీ కాదు. చాలా పిరికితనాన్నీ, నిస్సహాయతనీ దాచుకొందుకు వాటిని సాధనాలు చేసుకుంది. ఈ విషయంలో నీకంటే నాకే ఎక్కువ తెలుసు."

జవాబు చెప్పలేకపోయాడు వరద. ఏమీ అర్థంకాక తెల్లబోయి చూస్తున్న గులాబి తల ఆప్యాయంగా నిమిరింది. ఆరోగ్యం వరద జవాబుని ఆశిస్తూ. ఎంతకీ సమాధానం రాకపోయేసరికి "ఇవాళేదో తేల్చుకు వెళతాను. ఆడవాళ్ళని అర్థం చేసుకోవడం యింకా తెలీదోయ్ నీకు. నువ్వు సరేనంటే నీలవేణిని నేను ఒప్పిస్తాను"

గులాబి ఆ ప్రశ్నకు సమాధానమిచ్చింది.

"మీరు నీలవేణిని ఒప్పించండి. అన్నయ్య పూచీ నాది" అంది నిశ్చయంగా.

ఆరోగ్యం నవ్వుతూ గులాబి చెక్కిలి ముద్దుపెట్టుకుని "నువ్వు చాలా తెలివైనదానివి. నా కూతురయితే కలెక్టరుకిచ్చి పెళ్ళి చేసేదాన్ని" అని లేచింది.

ఏదో పరాకుగా ఆలోచిస్తూ నిలబడిపోయాడు వరదరాజులు.

ఆఫీసుకొచ్చి కుర్చీలో కూర్చోగానే హెడ్ గుమాస్తా బలరాం దాసు పిలిచాడు. వెళితే ఎప్పుడూ లేనిది నవ్వుతూ కుర్చీ చూపించాడు కూర్చోమని. బలరాం దాసు నవ్వినప్పుడల్లా ఎవడిదో గొంతుకోస్తున్నట్లే లెక్క.

క్షణం గడిచాక ఒకసారి వరదరాజుల్ని నిలువునా పరిశీలించి "చాలా చిక్కిపోయావోయ్ అవును మరి, ఇటీవల నీకు చాలా కష్టాలు ఎదురయ్యాయని విన్నాను" తమలపాకు చిలకచుట్టి నోట్లోకి విసురుకున్నాడు. రాక్షసి బొగ్గు వేయడానికి కప్పు ఊడతీసిన యింజను కొలిమిలాగా ఎర్రగా కనిపించింది దాసు నోరు. బట్టతల మీద ముత్యాల్లా పోగయిన చెమటను చూసి, జాలిపడి ఫ్యాన్ విసరడం సాగించాడు. సంభాషణ యెంతకీ సాగకపోయేసరికి విసుగేసి లేవబోయాడు వరద.

"ఇక్కడ నీ ఉద్యోగం బాగుంటున్నట్లు లేదు పాపం. అంతా ఆలోచించాను. నీకంటే నేను పెద్దవాణ్ణని ఒప్పుకోముందు"

"విషయం చెప్పండి"

"ఇక్కడ నువ్వు బ్రతకలేవు. మద్రాసు వెళ్తావా బదిలీ చేయిస్తాను?"

వరద మొదట ఆశ్చర్యపోయాడు. అయినా జవాబు సిద్ధంగానే వుంది.

"ఇప్పట్లో వెళ్ళడం పడదు" అన్నాడు.

వెంటనే బలరాందాసు ఒక్కసారి భ్రుకుటి ముడిచి, అంతలో సంతాపం ప్రకటిస్తూ "అరెరె! అప్పుడే పైకి కాగితాలు పంపేశానే? సరేలే, అంతకీ అవసరమైతే ఆర్డర్సు వచ్చాక ఆలోచిద్దాం" అన్నాడు.

❦❦❦

**హడావుడిగా** వరదరాజులుకీ, నీలవేణికీ పెళ్ళి జరిగిపోయింది. ఓ పక్క యిద్దరికీ ఆశ్చర్యంగానే వుంది. అవతల అనంతపద్మనాభస్వామి ఆలయ గోపురానికి మరమ్మత్తు జరుగుతూంటే ఆలయ ప్రాంగణంలో రెండు జీవితాలకు పొత్తు కలిపింది సంఘం. పెళ్ళికి గోవర్ధనరావుగారే పెత్తనం వహించారు. బలరాం దాసు కూడా వచ్చి వధూవరులపై నాలుకు అక్షతలు జల్లిపోయాడు. ఇతర పనులన్నీ చూసే బాధ్యత రామ్మూర్తి పుచ్చుకున్నాడు. చాలా సామాన్యంగా ఒకే రాత్రిలో అంతా ముగిసిపోయింది.

పీతాంబరం కూడా సమయానికి లేడు.

వినత శుభలేఖ అందుకోగానే వధూవరులిద్దరికీ వ్రాసింది. దంపతులు మధుపర్కాలు కట్టుకుని ఉండగానే గులాబి ఉత్తరం తీసుకొచ్చి అన్నయ్యకు ఇచ్చింది. నీలవేణి ఎదురుగ్గానే కూచుంది.

ఎన్నాళ్ళో ఆలోచించి వ్రాసినట్లుగా, దీర్ఘంగా ఉంది ఉత్తరం. విషయం యిది.

"శుభలేఖ చూడగానే నేనేం ఆశ్చర్యపడలేదు. ఇన్నాళ్ళు ఆలశ్యం చేశావేమా అనుకున్నానంతే. నిన్ను సలహాలు అడిగి, ఏడ్చే వినత అంత పిరికిమనిషేం కాదు నీలవేణి. ఒక్కొక్కమాట చెప్పనా? నేను ఆనాడు మీ యింట్లో ఆమెను చూసినప్పుడే అనుకున్నాను ఇలా జరిగితీరుతుందని. కానీ నువ్వు ఉత్త భయస్థుడివి. అందుకనే యిన్నాళ్ళయిందని తెలుసు నాకు. అమ్మకు ఇందులో సంబంధం వుందని తెలిసి ఆశ్చర్యపోయాను. కానీ సుజాత విషయం విచారమేస్తోంది. నిజమేనా ఆ విషయం? పోనీ, నీ మనస్సుని బాధపెట్టనులే. నేనిప్పుడు చాలా మారిపోయాను. నన్ను చూస్తే ఆశ్చర్యపోతావేమో నువ్వు. బలిశావని ఆయన అంటూంటారు. నీ పెళ్ళికి రమ్మని ఆయన్ని బలవంతం చేసేదాన్నేగానీ, అమ్మాయికి బాగాలేదు. ఆయనా పని తొందర్లో ఉన్నారు. క్షమించు. ఎప్పుడయినా నువ్వే ఒకసారి రాకూడదూ? ఈసారి నువ్వూ, మీ ఆవిడా కలిసి రావాలి. నీతో చాలా మాట్లాడాలి. తప్పక వస్తావనిఅలుస్తాను. నీలవేణితో నాకట్టే పరిచయం లేదు. అయినా ఈ క్రింది ఉత్తరం ఆవిడకు చూపు.

**- వినత.**

క్రింద నీలవేణికి నాలుగు వాక్యాలు వ్రాసింది.

"మీకు తోడుగా మంచి వ్యక్తిని ఎంచుకున్నారు. చూడండి నా మాట అబద్ధమైతే, పది సంవత్సరాల తర్వాత మీరే ఆమాట అంటారు. ఓసారి మీ యిద్దరూ ఎప్పుడన్నా మా యింటికి రావాలి ఏం?"

దగ్గరకి వెళ్ళి ఆ నాలుగు వాక్యాలూ మాత్రం నీలవేణికి చూపించాడు వరదరాజులు. చదువుకుని మొదటి వాక్యానికి జవాబు ఒక్కసారి అతని ముఖం చూసి మౌనంగా ఉండిపోయింది నీలవేణి.

దంపతులు పీటలమీద కూర్చునే వేళకి వెంకటపతి దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది. తెలుగునే ఇంగ్లీషులో టైపు చేయించి పంపాడు. సారాంశం యిది. "శుభవార్త చూసి తల్లక్రిందులయిపోయాను. పెళ్ళిని సద్వినియోగం చేసుకుని, వరద బాధితుల్లాగా ప్రేమకోసం తపిస్తున్న సైనిక దళాలకు రొమాంటిక్ పొయిట్రీ సరఫరా చేస్తారని ఆశిస్తున్నాను. శాంతియుత గృహస్థాశ్రమ స్వీకారానికి యిప్పుడిప్పుడే పంచవర్షప్రణాళిక వేశాను. త్వరలో ఫలితానికి రాగలదు. దంపతులిద్దరికీ నా శుభాకాంక్షలు."

రవణమూర్తి ఉనికి కనుక్కునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయాయి. అతను విజయవాడలో లేడని ఎవరో చెప్పారు.

అన్ని బాధ్యతలూ నెత్తిన వేసుకుని పెళ్ళంతా క్లుప్తంగా ముగించేశారు గోవర్ధనరావుగారు. అంతా అయి నూతన వధూవరులు నమస్కారం చెయ్యడానికి తన దగ్గరికి వస్తే భుజం తట్టి "హాయిగా బ్రతకడానికి ఇక సంఘం నీకో సర్టిఫికెట్ ఇచ్చిందోయ్" అని ఆరోగ్యాన్ని చూపుతూ "దీన్ని సంపాయించినందుకు కాదు. కాస్త మంచి సర్టిఫికేట్ దొరికినందుకు సంతోషించాను నేను" అన్నారు.

గడిచిపోయిన జీవితమంతా చాలా పాఠాలు నేర్పింది వరదరాజులుకి. ఆశకు వడపోతలూ, సుఖాలకు బేడీలూ, ఆదర్శాలకు యావజ్జీవ కారాగారం, అపలబ్ధ వస్తువుకు అసంకల్పిత ఆహ్వానం, తృప్తికి నో వేకెన్సీ - యివన్నీ కలిసి మనిషిని ఓ దారంట నడిపిస్తున్నాయి. అన్నిటికీ పయిన యీ ఒడుదుడుకులకు సముదాయింపు. నష్టపరిహారంగా నీలవేణి మిగిలింది.

ఉద్విగ్నతా, అసహాయతల వల్ల కొట్టుకుపోయే తన జీవితం మీద నీలవేణి రాక పన్నీరు జల్లినట్లు ఆ ఒక్క బహుమానాన్నీ చాలా సుఖాలకి అరణంగా తెచ్చుకున్నట్లూ మనస్సు ఒదగని సంతోషంతో గెంతులాడింది.

తన 33 ఏళ్ళ వయసు నేర్పిన విషయాలు ఓ కొలిక్కి తీసుకురావడానికి మనస్సు యాతనపడుతోంది. ఇదివరకు తన విపరీతమైన కలలూ, అధిక వాస్తవిక పోకడలూ అన్నీ అసమంజసంగా, అసంపూర్తిగా తోచినయి. వాస్తవికతను పరిహసించే పోకడలు నిరుపయోగాలనే విషయం ఇన్నేళ్ళ తర్వాత అర్థమయింది. "నేను భూమికి 80 అడుగుల పైన ఉండేట్లు బ్రతుకుతాను" అంటే ఎవ్వరూ ఒప్పుకోరు. "చేతనయితే ఉండి మాట్లాడు. చేతకాదా? మాతోపాటే బ్రతకాలి. గత్యంతరం లేదు" అంటారు. ఇందుకు గోవర్ధనరావు. ఆరోగ్యం, బలరాం దాసు - అంతా జవాబు.

మనస్సు నమూనాలను తీసి పంచిపెట్టగల యంత్రం ఒకటి అవతరిస్తే అధివాస్తవికత చెప్పే 'బూచీ' కథలకూ కాస్త ఆసరా వుంటుందేమో? కానీ యింకా ప్రతి వ్యక్తికీ, స్త్రీకీ, చివరికి తను అర్థం చెప్పుకోలేని మానవుడికి ఇవన్నీ ఎట్లా సాధ్యం? మానవుడా? అమ్మో! తనకు తెలీని వేలు, లక్షలు, విషయాలను వెనకేసుకుని తెలిసిన ఒక్క విషయాన్నీ పూసుకు తిరిగే అల్పసంతోషి - 'సంతోషి' కూడా కాదు.

మనస్సులో భావాలన్నీ ఒక్కసారి చెప్పేసి స్థిమితం పొందాలన్న ఉబలాటం ఎక్కువవుతోంది వరదలో. తెలీని జిజ్ఞాస, దుగ్ధ కసి ఎక్కువవుతోంది. "ఇది నాకు తెలుసు. కానీ ఎలా చెప్పడం?" అన్న బాధ తెలిస్తే చాలదు. తెలిసేది చెప్పగలగాలి. ఇదిగో ఇక్కడే మళ్ళీ పాత కలలకి స్థానం ఏర్పడింది.

మనస్సుపడే గుంజాటనా, పొత్తు కుదరని ఆలోచనలూ, ప్రపంచం మీద అసంతృప్తీ ఏవో అజ్ఞాతశక్తుల్ని పునాదుల్తో కదిపి, పెకలించి, గుంజి ఆ దారి పట్టేశాయేమో మరి ఏదో వ్రాయాలనే ఆరాటం ఎక్కువయింది.

కిక్కిరిసిన ఒరిపిడితో భావాలన్నీ జాగృతమవడానికి పెనుగులాడాయి. ఫలితంగా వరద మొదటిసారి నిజంగా మొదటిసారే కలం ఎత్తుకున్నాడు. తను వ్రాస్తున్నాడా అనిపించేంత తొందరగా పోతోంది కలం. తనకు తెలీని భాష, విషయాలూ కాగితం మీదకి విచిత్రంగా వస్తున్నాయి. 'ఎందుకు వ్రాస్తున్నావం'టే "నాలో ఏదో మిగిలిపోయింది. ఎవరికోసమో కాదు. అదంతా పైకి చెప్పేస్తే నాకు హాయి. అందుకని వ్రాసుకుంటున్నాను" అని తనకు తానే రాజీ పడుతోంది మనస్సు.

వ్రాస్తున్నాడు వరదరాజులు. తనుగా చూసిన ప్రపంచాన్ని, నిజాయితీగా, నిండుగా ఓ గోవర్ధనరావునీ, ఓ బలరాందాసునీ, ఓ వరదనీ వండుతున్నాడు - తన మనస్సుకోసం, తన కోసం.

నీలవేణి మొదట ఆశ్చర్యపోయినా ఏమీ అడ్డుచెప్పలేదు. పాతవే మళ్ళీ వెనక్కి తిరిగినట్లు రోజులు పునర్విమర్శ చేసుకుంటున్నాయి. ఏమీ భేదం లేకుండా ఇదివరకులానే నీలవేణి జీవితం గన్నేరు చెట్టుకి ఎదురుగ్గా గడిచిపోయింది.

రచన, తనకు తెలీకుండానే జీవితం మీద ప్రభావం చూపుతోంది. అనుకోకుండానే ఆఫీసు పనిమీద క్రమంగా ఆసక్తి తగ్గింది. ఏ విషయం మీదా దృష్టి నిలపలేకపోతున్నాడు. అయినా తనకేం విచారం లేదు. గంటలు, రోజులూ, వారాలూ రూపేణా కాకుండా తృప్తి, ఉపశమనం, స్థిమితంతో కాలం నడుస్తున్నట్లుంది.

రామ్మూర్తి అణుకువ ఆఫీసంతటినీ ఆకర్షించింది. అది అణుకువ కాదు. అతని బలహీనత అని అర్థమయింది. అతనికి అంతకన్నా వేరేవిధంగా బ్రతకడం చేతకాదు. కానీ వేరే విధంగా బ్రతకడం మాత్రమే చేతనయిన వాళ్ళంతా అతన్ని పూర్తిగా వినియోగించుకున్నారు. చెప్పడం కూడా తెలీని రామ్మూర్తి ఉపాధికోసం వారి ఉపాయాలకు బందీ అయాడు అయినా బ్రతుకుతున్నాడు అదొక్కటే తనకు తెలుసు కాబట్టి.

రెండు పరుగులు తీసి కాలం 'హేమంతం' ముసుగులో దూరింది.

చలి.. చలి..

ప్రతిదీ, మరేదో వస్తువు కోసం వెదుక్కుంటూ తనలో తనే ఒదిగిపోతోంది. ఆకాశం చీకటి డొక్కలో కాళ్ళుదన్ని పడుకునేవాళ్ళకి, గాలి దిక్కుమాలిన బికారిలా రాత్రంతా పచార్లు చేస్తోంది.

డాలీకి కొడుకు పుట్టాడంటే ఆశ్చర్యం వేసింది.

డాలీకి పెళ్ళి చేసిన ప్రపంచం తనకు దొరికిన ఓ గొప్ప బహుమానాన్ని పోగొట్టుకుంది.

కొత్త బరువుతో తెలీని నిస్త్రాణతో, శయ్యమీద నలిగిన మల్లెలాగా, గుప్పెట్లో వాడిన నైట్‌క్వీన్‌లాగా, పాత సువాసన జ్ఞప్తికి తెస్తూ కొడుకు పక్కన నిద్రపోయే డాలీని ఊహించుకుని నవ్వుకున్నాడు.

అర్ధరాత్రిలో నీలవేణి పక్కకి వచ్చి నిలబడితే ఆశ్చర్యపోయాడు. సాంఘికంగా ఏర్పడిన బంధాలు యింకా దగ్గరికి లాగలేకపోతున్నాయి యిన్నేళ్ళయినా. ఎవరికీ దొరకని వస్తువు దాచుకున్నప్పటి తృప్తి తనకూ, కృతజ్ఞతతో ప్రతిఫలం యిచ్చిన తృప్తి ఎదుటి వ్యక్తికీ మిగలడం తప్పిస్తే అసంపూర్తి చిత్రంలా వుంది జీవితం.

"ఏమిటాలోచిస్తున్నారు? "

తనని తనే ఆ ప్రశ్న వేసుకుని నవ్వుకున్నాడు "డాలీ యిప్పుడెలా వుంటుందా అనుకుంటున్నాను."

"..."

"ఆ బంతి పువ్వులు వెనకనించి విచిత్రంగా చూసే చిన్నపిల్లే నాకు గుర్తు"

చీకటి కుప్పవోసినట్లున్న గన్నేరు చెట్టులోకి చూస్తోంది నీలవేణి. లేచి తలచూసుకుంటే చల్లబడి నరాలు జివ్వుమన్నాయి. "అబ్బ! యింతవేళయిందా?" అని గొణిగాడు.

గదిలోకి వస్తే పక్క సరిచేసింది నీలవేణి. కళ్ళు మూసుకున్నా నిద్ర రావడంలేదు. దగ్గర్లో నీలవేణి శ్వాస తెలుస్తోంది. ఉన్నట్లుండి ఏదో చెప్పాలని యిటు తిరిగింది.

"ఏమిటి?"

"గులాబి విషయం?"

"ఏం?"

"రామ్మూర్తిగారిని ప్రేమిస్తోంది"

తుళ్ళిపడ్డాడు వరద.

పక్కకి ఒత్తిగిల్లితే నీలవేణి సిగలో మల్లెలు గుప్పుమన్నాయి.

ఆశ్చర్యాన్ని వెంటనే తట్టుకోలేక "నిజం!?" అన్నాడు.

"బహుశా నే పొరబడలేదనుకుంటాను. ఇంకా ఏం తెలీదు మనస్సులో దాచుకుందుకి. నేనడిగితే బాధపడవచ్చు. మీరే కదపండి"

సరేనన్నాడు.

"అయినా ఆమె మనస్సు బాధపడకుండా చూడాలి" హెచ్చరించింది.

"అలాగే"

మంచినీళ్ళు కావాలని లేచాడు. మంచం మీద మెలికలు తిరిగి నిశ్చలంగా నిద్రపోతూ కనిపించింది గులాబి. ఆతృతగా కదిలే గుండె కదిలికకు మెడలో తెల్లటి పూసలు గుడ్డి వెలుగులో వెలిగి ఆరే దీపాల్లాగా కనిపించాయి.

ఇంకా అమాయకత్వంపోని ముఖం, తిరుగుబాటులేని సౌమ్యత, మనస్సుదాకా ఏదీపోని స్వచ్ఛత తెలుస్తోంది.

రామ్మూర్తి అయితేనే?

"రామ్మూర్తి మంచివాడేగా?" నీలవేణి అడిగింది.

ఆలోచించాడు. చెడ్డతనానికి అర్థం ఏమిటా అని. బలరాందాసులో డబ్బుపై దుగ్ధ, విశ్వేశ్వరంలో సోమరితనం, వెంకటపతిలో నిర్లక్ష్యం, తనలో ఆలోచన యివన్నీ - తగ్గిస్తే అందరూ మంచివాళ్ళే. "ఇది మంచి" అంటూ వేరే ఏదీలేదు. "దీనికంటే మంచి" ఉంటుంది. సామ్యమే కానీ, స్వాభావికం కాదు మంచితనం.

"పెళ్ళి చేస్తే? తప్పేం?" అంది చివరికి.

ఆలోచించాడు వరద. అవును, ఏమీ ఉండదు. "ముందు గులాబితో మాట్లాడనీ" అన్నాడు.

మర్నాటి సాయంకాలం యింటికి వస్తూనే గులాబిని తీసుకుని రైలుకట్ట దగ్గరికి బయల్దేరాడు.

గులాబి ఎక్కడికని అడగలేదు.

వాలుపట్టిన ఎండ కమ్మీల మీద పడి జిగేలు మనిపించే వేళకి యిద్దరూ అక్కడికి వచ్చారు. కళ్ళకి చెయ్యి అడ్డం వుంచుకుని నడుస్తోంది గులాబి. ప్రత్యేకంగా నీలవేణి చెప్పిన విషయాలు కదిపేందుకు తీసుకువచ్చాడే గాని, ఎలా ప్రారంభించాలో తెలీక యాతనపడ్డాడు. ఈ సమయంలో గోవర్ధనరావుగారు, ఆరోగ్యం అయితే యుక్తిగా సన్నివేశం నడిపేవారు. పైగా చెల్లెలి దగ్గర్నుంచి అలాంటి విషయాలు తెలుసుకోవడం కొత్త.

ఏదో చెప్తాడనిపించి మాట్లాడకుండా నడుస్తోంది.

"వెళ్ళిపోదాం పదన్నయ్యా. అబ్బ! యీ గాలి ఊపిరి తిరగనివ్వడంలేదు" అంది.

మెల్లగా ఎత్తుకున్నాడు.

"ఒక్కటి అడగాలనుకున్నాను గులాబీ!"

"చెప్పు"

"నా విషయం ఎలాగో జరిగిపోయింది. ఇక నువ్వు మిగిలావు"

"ఏమిటి?"

"రవణ ఉండి ఉంటే ఇదంతా మరో విధంగా జరిగేదేమోననిపిస్తోంది. కుటుంబంలో అందరిలాగా వాడూ కాకుండా వుంటే, మొదట వాడితోటే యీ ప్రసక్తిని తెచ్చేవాడిని"

గులాబి మాట్లాడలేదు.

"ఇది చెప్పు ముందు, నా దగ్గర నువ్వే భయపడనక్కరలేదు. నా దగ్గర నీ రహస్యాన్ని చెప్పలేకపోతే యింకెవరి దగ్గరా చెప్పలేవు."

గులాబి ఆలోచిస్తోంది అన్నయ్య ఏం చెప్తాడా అని. ప్రతిదానికీ అతను యింత ప్రాధాన్యమిచ్చి, ఇంత జాగ్రత్తగానూ ఆలోచించడం తనకు ముందు నుంచీ పరిచయమే. అందుకని ఆ తరహా ప్రసక్తి యేమీ కొత్త అనిపించలేదు.

"రామ్మూర్తి మంచివాడేనా?" ఉండుండి అడిగితే నివ్వెరపోయింది.

"నాకెలా తెలుస్తుంది?"

"నీ వుద్దేశం చెప్పు పోనీ"

"మంచి" అంతే మాట్లాడింది తప్పనిసరిగా.

"నీ పెళ్ళి విషయం అతనితో మాట్లాడితే ఎలా వుంటుందంటావ్?"

దిగ్భ్రమతో "అన్నయ్యా" అంది.

"గాభరాపడకు. అంతా ముందే ఊహించుకున్నాను. అతనంటే నీకిష్టమేగా?"

మాట్లాడలేకపోయింది గులాబి.

అప్పుడే వెలుగు తగ్గిన పడమటి ఆకాశం మీద ఎరుపుచారలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. కాస్సేపాగి ప్రశ్న మరిచిపోయిందేమోనని మళ్ళీ అడిగాడు వరద. "ఫర్వాలేదమ్మా! నీకిష్టమయితే రామ్మూర్తిని రేపే కదుపుతాను. అతని మంచితనాన్ని యింతవరకూ అంతా ఉపయోగించుకున్నారు. నేనీవిధంగా ఉపయోగించుకుంటాను"

"పోదాం పద, ఇక్కడంతా గాలి.." అంది ఎంతోసేపటికి.

నవ్వుకున్నాడు. "అలాగే నీ యిష్టం" అని యింటి ముఖం పట్టాడు.

రాత్రి నీలవేణి అడిగితే "అవున్నిజమే. ఆడదాని మనస్సు కనిపెట్టడం అందరికీ సాధ్యం కాని పనే" అన్నాడు.

"ఏం?"

"గులాబి ఒప్పుకుంది. ఇక రేపు రామ్మూర్తిని అడుగుతాను."

ఎంతోసేపటికీ మాట్లాడపోయేసరికి నీలవేణి నిద్రపోతోందనుకున్నాడు వరదరాజులు. సగం రాత్రికి మెలుకువ వస్తే టేబులు ముందు కూచుని ఉంది.

నిర్ఘాంతపోయాడు. లేచి చూస్తే తను వ్రాస్తున్న నవలని ఆతృతగా చదువుతోంది.

"ఆడవాళ్ళని అర్థం చేసుకోవడం పూర్తిగా తెలియలేదు నాకు. అందుకని నా నవలలోని పాత్ర అసంపూర్తిగా ఉండిపోయింది" అంటే తుళ్ళిపడి వెనక్కి తిరిగి చూసింది. పక్కనే వరదరాజులు నిలబడి వుండడం గమనించేసరికి ముఖం వివర్ణమైంది. తత్తరపాటుని దాచుకోడానికి చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమయాయి. వెంటనే లేచి ఆ అదురుపాటుని ఆపుకోలేక వాకిట్లోకి వచ్చి నిలబడింద్ది.

నవ్వుకున్నాడతను. తలుపుతీస్తే చలి శరీరాన్ని వణికిస్తోంది. ప్రపంచమంతా ఘనీభవించినట్లు నిశ్శబ్దమయింది.

భుజం మీద చెయ్యి వేసినా స్థంభానికి అలానే చేరబడి నిలబడింది నీలవేణి.

"తప్పేం? నాకేం తెలీదు నీ గురించి. అయినా తెలియాల్సిన పనిలేదు"

మాట్లాడలేదు నీలవేణి. ఇంకా ఎక్కడో రేడియోలో సన్నని వాద్యం వినవస్తోంది.

నిశ్శబ్దం మనస్సుని కలుక్కుమనిపించి ఖిన్నుడయ్యాడు వరద. ఇంత చిన్న తత్తరపాటుకి అంత తాత్సారం అనవసరమనిపించింది. ఎంతకీ కదలకపోతే విసుగేసింది. గదిలోకి వచ్చి దీపం తగ్గించి పడుకున్నాడు.

అనవసరంగా నిద్ర చెదిరి, ఆలోచనలు మెదడుని కొరుకుతున్నాయి.

గంట తర్వాత నీలవేణి మెల్లగా మంచం మీద వత్తిగిలి పడుకోబోతే "రవణని పెళ్ళి చేసుకుంటే బావుండేది కదూ" అన్నాడు.

అంత తక్కువ వెలుగులోనూ ఆమె విచితురాలవడం గమనించాడు.

"ఇంకా నిద్రపోలేదూ?" అని ఆమె అంటూంటే కంఠం వొణుకు స్పష్టంగా తెలిసింది. మాటలో ఆర్ద్రత మనస్సును కదిపింది. కావాలని లేచి చటుక్కున దీపం హెచ్చిస్తే నీలవేణి కన్నీటితో దొరికిపోయింది. జాలితో ఆమె ముఖాన్ని చూసి దగ్గరికి వచ్చి నిలబడ్డాడు. గుండెకి తల ఆనించి ఏడ్చేసింది.

"ప్రశాంతంగా బ్రతకడం కూడా ప్రయత్నం వల్లే సాధించాలి. కానీ నువ్వు ఆలోచననీ ఆరాటాన్నీ అభ్యాసంగా పెట్టుకున్నావ్" అన్నాడు ఆమెను గుండెకు హత్తుకుని.

మరీ క్రిందకి జారిపోతున్న మనస్సుకి ఆసరా దొరికినట్లు స్తబ్ధుగా వుండిపోయింది నీలవేణి. స్థిమితం చిక్కిన తరువాత "నన్నెందుకు చేసుకున్నావ్?" అనడిగాడు, ఆమె మనస్సు బాధపెడుతున్నట్లు తెలిసికూడా. వెలుగులో విచిత్రంగా అతని ముఖం చేసింది. ఒక తరహా నిర్లక్ష్యం. తెలిసిన జవాబునే మళ్ళీ చెప్పించాలన్న ప్రయత్నం అతని ముఖంలో గుర్తించేసరికి దుఃఖం ఉద్విగ్నతగా మారింది. జవాబు చెప్పాలి అన్న నిభాలో స్పష్టంగా అంది. 'ఇంతవరకూ నే చేసిన ఏ పనికీ కారణం చెప్పలేను. కారణం చెప్పగలిగేట్లు ఏదీ జరగలేదు. అలాగే యిదీను'

ఏమైనా జవాబు చెప్తాడా అని ఎదురు చూసింది. మాట్లాడకుండానే అలా అచేతనంగా నిలబడ్డాడు. కాస్సేపాగి తలెత్తకుండానే వెళ్ళి దీపం ఆర్పి వచ్చి పక్కమీద పడుకుంది. మరి కాస్సేపటికి చూస్తే అతనింకా అలానే నిలబడినట్లు గ్రహించింది.

ఉదయం ఆఫీసుకు వెళ్తూ "అక్కడ రామ్మూర్తిగారిని అడిగితే బాగుండదు. సాయంకాలం వస్తే నేను వచ్చేవరకూ యింటిదగ్గర ఆగమని చెప్పు" అని నీలవేణితో చెప్పి వెళ్ళిపోయాడు.

కానీ ఆ రోజు రామ్మూర్తి ఆఫీసుకు కూడా రాలేదు. అంతకు ముందు రోజు పాత సైకిలుతోనే వచ్చి సైకిలు తీసుకువెళ్ళకుండానే వెళ్ళిపోయాడని నైట్ వాచర్ చెప్పాడు. సరే. రేపు అడగవచ్చుననుకున్నాడు వరదరాజులు.

మధ్యాహ్నం కాఫీ త్రాగే సమయంలో బలరాందాసు మళ్ళీ కబురంపించాడు.

వెళితే ప్రత్యేకంగా కాఫీ తెప్పించి చెప్పాడు. "బదిలీ ఆర్డర్లు కూడా వచ్చేశాయోయ్. సంక్రాంతికి మద్రాసులో నీ మకాం. అదృష్టవంతుడివే" అని ఆగి ఆగి నవ్వాడు.

ఎన్నాళ్ళుగానో తీర్చుకోవాలన్న ప్రతీకారం తీరినప్పటి హాయీ, నిర్లక్ష్యం, నవ్వులో ప్రత్యేకంగా వ్యక్తపరచడానికి అన్ని జాగ్రత్తలూ తీసుకుని ఒకసారి పిలకని జాడించి మళ్ళీ ముడివేసుకున్నాడు.

"ఇప్పట్లో వెళ్ళలేను" అన్నాడు వరద.

"అవును. నేనూ అదే అనుకున్నాను. ఈ మధ్యే పెళ్ళయిందని కూడా రాశాను పైకి. కానీ పెద్ద ఘటాలు మనకి లొంగవు మరి. వెళ్ళి పది నెలలక్కడ ఉండి మళ్ళీ ప్రయత్నించు. కావాలంటే అప్పుడు నేనూ మాట సాయం చేస్తాను" అని నసిగాడు.

దాసుని తెలీని వారెవరయినా ఆ మాటలకి తబ్బిబ్బు అవడానికి సందేహం వుండదు.

ఇంకేం మాట్లాడలేదు వరదరాజులు. ఆవేశం తలకెక్కింది. బలరాం దాసు గొంతులో పరిహాసం, హేళన అభిమానానికి చిచ్చుపెట్టడంతో వొళ్ళు తెలీకుండా పోయి, మూడయేసరికి రాజీనామా కాగితం వ్రాసి యిచ్చి యింటికి వచ్చేశాడు. గుమాస్తాలందరూ దిమ్మెరపోయారు మొదట. వీలయినంతవరకూ ఆపుజేయజూశారు.

రాజీనామా కాగితం దాసు చూసి, ఓ వీశెడు జున్ను తిన్నట్లు మొదట గ్రరున త్రేన్చి "మంచిది కాదు, మరోసారి ఆలోచించు, ఈ కాగితం నా దగ్గరే వుంటుంది" అన్నాడు.

"మీరే అంతా ఆలోచించుకుని, మంచిరోజు చూసి పై అధికారులకు పంపించండి" అని వచ్చేశాడు.

ఇంటికి వచ్చి హఠాత్తుగా "ఉద్యోగం మానేశాను" అంటే నీలవేణి నిశ్చేష్టురాలయింది.

మనసు బాగా కుదుటపడ్డాక "ఎందుకు చేశానో తెలీదు. చేసిన పనికి యింకా పశ్చాత్తాపం కలగడంలేదు. బహుశా నా స్థలంలో రామ్మూర్తిగారిని వేయవచ్చు" అన్నాడు నీలవేణితో.

"మరి ఎలా బ్రతకడం?" అమాయకంగా గులాబి అడిగింది.

"అదంతా ఆలోచించలేదు నేను" అన్నాడు పరాకుగా.

కానీ మనస్సులో ఏదో సంశయం పీకుతూనే వుంది. ఉన్నట్లుండి అప్పటి తన అసహాయం, యింట్లో చేతకానితనం... భవిష్యత్తు పెద్ద భూతంలా కనిపించడం అన్నీ ఏకమయి మనస్సుని వికలపరిచాయి.

ఒక్కమాటు కూడా నీలవేణి ఎదురు ప్రశ్నవేయకబోయేసరికి తప్పు మరీ బలమైందిగా కనిపించింది. ఒంటరిగా వున్నప్పుడు అమాయకంగా అడిగాడు "నేనేం తప్పుచేశానా?" అని.

నవ్వింది నీలవేణి. "ఇప్పుడేం ఫరవాలేదు. మరో పదిరోజులు పోయాక ఆలోచిద్దాం" అంది.

గులాబి కూడా వరద తెగింపును ఒక్కసారిగా సమర్థింపు లేకపోయినా "అన్నయ్య ఏ పనయినా చేస్తాడు" అని తనకి తాను సమాధానం చెప్పుకుంది.

**కాలం గడుస్తున్న** కొద్దీ తన తొందరపాటు తెలిసి వచ్చింది. కోపం, అభిమానం అన్నీ క్రమంగా తుడిచిపెట్టుకుపోయి వాటి స్థానే భయం, పిరికితనం, దైన్యతా తలెత్తాయి. దైనందిన కార్యక్రమమంతా తలక్రిందులయి ఏదో పెద్ద శూన్యం ఏర్పడింది. ఇంటిలోనే భరించలేని తీరికకూ, విశ్రాంతికీ బందీ అయ్యాడు.

ఎన్నాళ్ళుగానో పూనుకున్న రచన ముగింపుకు రాసాగింది. కొవ్వొత్తిలా తనకు తానే కాల్చుకునే వ్యక్తి ఎటూ చేతకానివాడయి తన మనస్సు మీదే తనకి విశ్వాసం పోయి, తనకి తెలీని శక్తులేవో తనలోనే ప్రతిఘటిస్తున్నట్లనిపించి, ఆత్మహత్య చేసుకుంటాడు ప్రశాంతత కోసం. అదీ కథ.

పూర్తిచేసి బీచిలోకి వచ్చి కూచున్నాడు.

ఒక్కోసారి మరీ సానుభూతి కరువై బలరాందాసు దగ్గరికి పరిగెత్తి క్షమాపణ చెప్పుకుంటే బావుణ్ణనిపించేది. కానీ ఒక్క తిరుగుబాటుకి లొంగిపోతే మొదట నీలవేణి యింట్లో ఉంచుకోవడం, అమీనా పెళ్ళి, రవణకు సహాయం, తన వివాహం, వీటన్నిటికీ అర్థం వుండదు.

అప్పుడు వేయి సమస్యలౌతాయి. ఇదయితే ఒక్కటే. విసురుగా ముందుకు తోసుకు పరిగెత్తితే దాటుకుపోవచ్చు. లేచి ఇంటివేపు బయల్దేరితే, హఠాత్తుగా వచ్చి పద్మిని చెయ్యి పట్టుకుంది. వెనక్కి తిరిగి ఆశ్చర్యపోయాడు.

నిశ్శబ్దంగా ఉండిపోతే "ఉద్యోగం పోయిందటగా?" అంది మెల్లగా.

తలూపాడు.

తరంగాలు లేస్తున్నాయి పడుతున్నాయి. కలలు విరిగి తిరిగి రూపొందుతున్నాయి.

"ఓసారి మా యింటికి రండి. అదిగో ఎదురుగ్గా కనిపించేదే"

మాట్లాడకుండా నడిచాడు. పద్మిని ఏదో చెప్పుకుపోతోంది. "మీతో పరిచయం లేకుండానే ఆయనకు మీరంటే చాలా యిష్టం. నేనే మీ గురించి అంతా చెప్పాను. చివరికి ఆఫీసులో మిమ్మల్ని ఏడిపించే విషయం కూడా ఇద్దరం నవ్వుకున్నాం. మొన్న మీ కోసం ఆఫీసుకు ఫోన్ చెయ్యమన్నాను. తీరా చూస్తే మీరు ఉద్యోగం మానేశారని తెలిసింది. ఎందుకు మానేశారు?"

"ఏమో తెలీదు"

"అదేమిటి? మరెలా రోజులు గడవడం. ఏమీ తెలీకుండా గడపడానికి మీకెవరైనా జీతం యిస్తే బావుణ్ణు"

నవ్వుతూ యాదృచ్ఛికంగా అనేసినా ఎంతో అర్థం తోచి విస్తుబోయాడు.

అతను బాధపడడం గమనించి "ఏమీ అనుకోకండి. నేను సాధారణంగా మాట్లాడే మాటల్లో ఏమీ అర్థం వుండదని అంటారాయన. అరుగో అబ్బాయిని ఎత్తుకు గుమ్మంలో నిలబడ్డారు ఆయన" అంది.

తలెత్తాడు వరదరాజులు. సన్నగా, పొడుగ్గా పద్మినికి వ్యతిరేకంగా కనిపించాడతను. సగం వరకూ బట్టతలా, కళ్ళద్దాలతో చూస్తే 40 ఏళ్ళ మనిషిలా కనిపిస్తాడు. సూటిగా మొనతేలిన ముక్కూ, భ్రుకుటి దగ్గర కలిసిన కనుబొమలూ, పెద్దకళ్ళూ.

నమస్కారం చేశాడు వరద.

"మిమ్మల్ని చూడగానే పోల్చేశాను నేను. మీరేం చెప్పనక్కర్లేదు. ఉన్నపాటునే మీ జీవితచరిత్రను వ్రాయగలన్నేను. అదంతా మీ స్నేహితురాలి ప్రత్యేకత" అన్నారాయన.

వీధి తలుపు మీద ఎర్రటి అక్షరాల్తో బోర్డు అతికించారు "టి. అశ్వత్థనారాయణ" అని.

"మీరు నా మాటల్ని లెక్కచేయని విషయం కూడా చెప్పాను లెండి" అంది పద్మిని.

మాట్లాడే నాలుగు క్షణాల్లోనూ శలవు దినాన్ని పిక్నిక్ బయల్దేరిన స్నేహితుల్లాగా వాళ్ళిద్దరూ బ్రతుకుతున్నట్లు తోచింది వరదరాజులుకి. ఇద్దరి మధ్య ఏ తగాదాలూ లేవు.

ఏ దాపరికాలూ లేవు. కాకపోతే ఆమె కంటే అతను బాగా పెద్దవాడేమోననిపించింది. మిగతా పిల్లల్లాగ ఆమెను కూడా బుజ్జగిస్తూ మాట్లాడడం వరదకి నవ్వు తెప్పించింది.

"ఉద్యోగం మానేశారీయన" మళ్ళీ జ్ఞాపకం చేసింది పద్మిని ఉండుండి.

ఆ విషయం గురించి ఏదో చెప్పాలనుకున్నట్లు, భుజం మీద వున్న కుర్రవాణ్ణి కింద వదిలేసి తువాలు భుజం చుట్టూ తిప్పుకున్నారు అశ్వద్దనారాయణ.

"ఎందుకు మానేశారు సార్. కొన్ని కష్టాల్ని, అవమానాల్నీ భరిస్తూ పోతుండాలి. మాట పట్టింపులు ప్రాణం తీస్తాయి. ఓసారిలాగే ఖర్గపూర్ మా స్నేహితుడొకడు"

"సరే, ఇప్పటి విషయానికి రండి" అంది పద్మిని సిగలో పిన్నులు ఒక్కటొక్కటే తీసి పక్కన పెడుతూ. మధ్యలో ఆపుజేసినందుకు బాధపడకపోవడమే కాకుండా వరద వేపు చూసి నవ్వేసి "చూశారా సార్ ఉద్యోగం కన్నా కష్టం ఇలాంటి భార్యను భరించడం. దీన్ని భరిస్తున్నాక నాకు ఉద్యోగం భరించలేనన్న భయంలేదు. నా పిల్లలందర్నీ కాన్వెంట్ చదువు మాన్పించి, యింటిదగ్గరే ట్యూషన్ పెట్టి, దీన్ని మాత్రం కాన్వెంట్‌లో జాయినుచేయాలనుకుంటున్నాను" అన్నాడు.

పద్మిని ఫక్కున నవ్వేసి చిన్నవాణ్ణి తీసుకు లోపలికి వెళ్ళిపోయింది.

అప్పటికి స్థిమితపడి "అయితే ఇప్పుడేం చెయ్యదలచుకున్నారు?" అనడిగాడు అశ్వత్థ నారాయణ.

"ఇంకా ఏమీ ఆలోచించలేదు నేను" అన్నాడు నిర్లిప్తంగా.

మూడు క్షణాల నిశ్శబ్దంగా కూచుండిపోయాడు అశ్వత్థ నారాయణ ఏదో ఆలోచిస్తూ.

బోర్న్‌విటా కలుపుకుని, పద్మిని వచ్చింది ఏం చేశారంటూ.

"అదే, యింకా ఏం చెయ్యాలో తెలీలేదు" అని క్షమాపణలు చెప్పుకున్నాడు ఆయన.

బోర్న్‌విటా సగం గొంతులో వుండగా ఏదో గుర్తుకొచ్చి చెప్పబోయి పొలమారి, నెత్తికొట్టుకున్నాడు ఊపిరి తిరక్క.

పద్మిని ఒకటే నవ్వు. ఆమెను చూసి పిల్లలంతా నవ్వు ప్రారంభించారు. వరదరాజులుకీ నవ్వాగలేదు.

క్షణంలో తేరుకుని "చూశారండీ వీళ్ళు? సర్కసులో జంతువునిలాగా ఆడిస్తారు వీలయితే" అని లేచి పెళ్ళానికి ఓ మొట్టికాయ పెట్టాడు.

"ఏదైనా తేల్చిచెప్పి పంపాలి అతన్ని. లేకపోతే మీ ఆఫీసులో చేర్చుకోండి" అంది అల్లరిగా.

"పోనీ నీ పిల్లలందరికి ప్రైవేటు మేష్టారిగా వేసుకో, అంతా తేల్చేశాను. నువ్వా గ్లాసులు పెట్టిరా ముందు" అన్నాడు.

మళ్ళీ కుర్చీలో కుదురుగా కూచుని "మద్రాసు వెళ్తారా? నాకో మంచి స్నేహితుడున్నాడక్కడ. నన్ను చూసి వాణ్ణి చూడనక్కర్లేదు. అచ్చు నాలాగే వుంటాడు. ఈ మధ్య ఓ పత్రిక ప్రారంభిస్తున్నానని చెప్పాడు. మీరు వెళ్తానంటే ఉత్తరం వ్రాసి యిస్తాను. మీకా ఉద్యోగం సరిపోతుందని నా వుద్దేశం"

ఆలోచిస్తున్నాడు వరద.

"ఏమిటేమిటి?" అని వచ్చింది పద్మిని.

మళ్ళీ అంతా ఓపిగ్గా చెప్పాడు అశ్వత్థనారాయణ. పూర్తిగా వినకుండానే "భేష్! అసలిలాంటి వుద్యోగమే ఈయనకి బావుంటుంది. నాకు తెలుసు. నేనూ చూసేదాన్ని. ఈయన ఫైళ్ళన్నీ తప్పుల తడకగా వుండేవి. వాటిని దిద్దడానికి మరో గుమస్తాని వేసుకోవలసి వచ్చింది" అంది నవ్వుతూ.

"ఏమంటారు చెప్పండి. మీరూ సరేనంటే యిప్పుడే రాస్తాను. మొదట బ్రతుకులో దారి ఏర్పరచుకున్నాకే ఏదన్నా చేస్తే బావుంటుందని నా వుద్దేశం" అన్నాడు.

"ఆయన యింకా ఏం చెప్తారండీ. మీరు మొదట వ్రాయండి" అని తొందరపెట్టింది పద్మిని.

ఉన్నట్లుండి "వెళ్ళలేనండి" అని వరద అంటే యిద్దరూ తెల్లబోయారు.

"అదేం?" అంది పద్మిని ఆశ్చర్యపోతూ.

"చెల్లెలి పెళ్ళి తలపెట్టే ప్రయత్నంలో వున్నాను. ఇప్పట్లో ఆ పని చాలా అవసరం. ఈ పరిస్థితుల్లో ఊరుదాటి పోవడం పడదు" అన్నాడు నిశ్చయంగా.

అశ్వత్థనారాయణ ఏదో చెప్పబోయి మళ్ళీ మామూలుగా వూరుకున్నాడు. పద్మిని కూడా ఏదో చెప్పబోయి బాధపడతాడేమోనన్న భయంతో ఆగిపోయింది. అతని వ్యక్తిగత విషయంలో జోక్యం చేసుకోలేక ఇద్దరూ ఒకరినొకరు చూసుకు ఆగిపోయారు. అరగంట తర్వాత వెళ్తానని లేస్తే "మద్రాసు వెళ్ళడం మంచిది. మళ్ళీ ఆలోచించి చూడండి. అందువల్ల మీ పనులేం ఆగిపోవు" అంది పద్మిని.

సహకారం చెయ్యాలని తప్ప యింకే ఆతృతలేని పెద్దకళ్ళని చూసి నీరసంగా నవ్వుకున్నాడు వరద.

"నీకు తెలీదు పద్మినీ, నా పరిస్థితి అంతగా బాగోలేదు. ఇది విచిత్రమయిన సమయం. గులాబికి వయస్సు మించిపోయింది."

కనిపించినంత వరకూ వరదరాజుల్ని చూస్తూ నిలబడింది. ఉద్యోగం యిప్పిస్తానంటే ఎవరన్నా మానుకుంటారా అని ఆశ్చర్యపడింది. తనకు తెలిసినంతవరకూ బ్రతకడం ఒక్కటే ధ్యేయం.

ఆమె దిగ్భ్రమ చూసి అశ్వత్థనారాయణ నవ్వాడు. "ఆయనకేమీ అక్కరలేదు. ఇంటి దగ్గర వున్న ప్రశాంతి, నిశ్శబ్దం కావాలి. అందుకే ఎక్కడికి వెళ్ళడానికి యిష్టం లేదు" అన్నాడు.

నిజమేనేమో అనుకుంది పద్మిని.

ఆలస్యంగా వరద యింటికొచ్చేసరికి గులాబి, నీలవేణి తన కోసం ఆతృతగా కనిపెట్టుకుని కూచున్నారు.

"ఇంత ఆలశ్యమయిందేం అన్నయ్యా! నాకు భయమేసింది."

ఆమె ముఖాన్ని చూసి ఆశ్చర్యపోయాడు వరదరాజులు. ఉద్యోగం లేని తనకు ఆత్మహత్య చేసుకోవడానికి హక్కు లేదని అప్పుడు అర్థమైంది. నవ్వుకొన్నాడు. నీలవేణి ముఖంలోనూ భయం తెలుస్తోంది.

బట్టలు మార్చుకొందుకి యింట్లోకి నడుస్తూ "నేను చచ్చిపోను" అన్నాడు యిద్దరికీ వినిపించేట్లు.

భోజనం చేస్తూంటే అసలు విషయం చెప్పాడు. అంతా చెప్పి "ముఖ్యంగా ఒకటే కారణం గులాబి విషయం. అది జరగనిదే ఏ పనీ చెయ్యదల్చుకొలేదు" అంటే మొదటి సారిగా చికాకుతో, అతని బలహీనత మీద తిరగబడింది గులాబి.

"అంతకంటే నాకు చేతకాదని చెప్పవలసింది. నువ్వేపనయినా ధైర్యంగా చేస్తావనుకునేదాన్ని. ఈ పెళ్ళి మిషతో మానేసి నువ్వు సాధించేదేమిటి? వున్నపాటునే వుద్యోగం మానేశావు. అభిమానం పేరు చెప్పుకుని. కానీ నీ చేతకానితనం చూసి నేనూ, వదినా ఎంత బాధపడుతున్నామో నీకు తెలీదు. ఛీ! అంతా తారుమారు చేసేస్తావు నువ్వు" అని విసుక్కుంటూ అక్కణ్ణుంచి లేచిపోయింది.

భోజనం చేస్తున్నవాడల్లా వరదరాజులు అప్రతిభుడయి స్తంభించిపోయాడు.

తలెత్తితే ఎప్పుడూ మాట్లాడని గులాబి ఆవేశం చూసి, ఈ హఠాత్పరిణామానికి నిర్విణ్ణురాలయిన నీలవేణి ముఖం ఎదురయింది.

ఓ రోజు వుదయాన్నే ఎనిమిదేళ్ళ కుర్రాడు గేటు తలుపు తెరుచుకుని లోపలికి వస్తే గన్నేరు చెట్టు పువ్వులు కోస్తున్న గులాబి ఆశ్చర్యపోతూ చూసింది.

తెల్లలాగూ, ఎర్రచారల బనీనూ, తొడుక్కున్న ఆ ఉంగరాల జుత్తు అబ్బాయిని ఎంతగా చూస్తూండిపోయింది.

గన్నేరు చెట్టువరకూ నడిచివచ్చి పెద్ద కొమ్మనీడలో నించున్నాడు.

కాస్సేపాలోచించి "మా నాన్నగారి సైకిలు మీ యింట్లో వుండిపోయిందండి" అన్నాడు.

ఆ కుర్రాడి మాటల్లో అణకువ, సాత్వికత ఎవరినో గుర్తుపట్టిస్తున్నాయి. కళ్ళల్లో సామ్యత తనకు చాలాకాలంగా తెలిసినట్లు గులాబి మనస్సుకు తోచసాగింది. మాటల్ని మరిచిపోయి ముఖాన్ని చూస్తూ నిలబడింది. సంస్కారం లేక నుదుటిమీద పడ్డ జుత్తును లాగు జేబులోంచి చేయి తీసి చెవిపక్క దోపుకున్నాడు.

"నీ పేరేమిటి బాబూ?"

సగం బొట్టు చెరిగిన ఆమె ముఖాన్ని చూసి చెప్పనా, వద్దా అని క్షణం తటపటాయించాడు.

"కవి"

"ఎందుకొచ్చావు?"

"మా నాన్నగారి సైకిలు యిక్కడ వుండిపోయింది."

మాటలు విని వరదరాజులు పైకి వచ్చాడు. తమాషాగా అతన్ని చూడగానే ఎవరో చెప్పినట్లు నమస్కారం చేసేశాడు కుర్రాడు.

"మా నాన్నగారి సైకిలు" అన్నాడు మళ్ళీ.

"మీ నాన్నగారెవరు?"

ఎలా చెప్పాలో తెలీక చెట్లవేపు తలతిప్పి అటూ యిటూ చూసి, చివరకి వరద ముఖంలో ఆశ్చర్యం చూసి తెల్లబోయాడు. వస్తారా మెట్లన్నీ వరసగా ఎక్కిలాగు జేబులోంచి ఫోటో తీసి అతనికిచ్చాడు.

ఫోటో చూస్తూనే నివ్వెరపోయాడు వరదరాజులు. "రామ్మూర్తిగారు మీ నాన్నగారా?" అంటే గులాబి తుళ్ళిపడింది.

"ఆయనేరీ?"

కాస్సేపాగి "మొన్న ఆదివారం చచ్చిపోయాడండి నాన్న" ఏడవడం కూడా తెలీని గొంతుకతో చెప్పాడు కవి. చిన్న పెదాలు మాటలకి వణికాయి.

అచేతనంగా శిలాప్రతిమలా వుండిపోయాడు వరద.

గులాబి రెండు చేతుల్తో ముఖం కప్పుకుని గన్నేరు చెట్టుకు ఆనుకుంది. మంచునీళ్ళు వర్షంలా నేలనపడి వాకిలంతా తడిసింది. దుఃఖంతో గొంతు బొంగురయింది. అన్నయ్య చేయి తనని తాకేసరికి దుఃఖం కట్లు తెగింది. ఒక్కమాటన్నా చెప్పకుండా లోపలికి పరిగెత్తింది గులాబి.

నీలవేణి నిర్ఘాంతపోతూ బయటికి వచ్చింది. "ఏమిటి?"

మాటకి ముందు జీర అడ్డుపడి ఎంత ప్రయత్నించినా మాట పెగలడం లేదు వరదకి. తన ఆశలమీద యిది చివరి గొడ్డలిపెట్టులాగ, తలమీద ఉన్నట్లుండి ఎవరో తీరని అఘాతం కలిగించినట్లూ అనిపించింది. నోరిప్పితే ఏడుపు తోసుకొస్తుందేమోననిపించింది.

ఇటు తిరిగితే కళ్ళ నీరు నింపుకున్న వరద, దిమ్మరపోయి నిలబడ్డ నీలవేణి కనిపించేసరికి ఏమీ అర్ధంకాక విస్తుపోయాడు. నాన్న జ్ఞాపకం వచ్చేసరికి, ఏడవాలనిపించి పెదాలు వణికాయి. కానీ భయపడి వూరుకున్నాడు.

"రామ్మూర్తిగారు చచ్చిపోయారు. ఆయన కొడుకు ఈ కుర్రాడు. సైకిలు కోసం వచ్చాడు"

ఉన్నట్లుండి ఏమీ జబ్బులేకుండా రామ్మూర్తి మరణించినట్లు తెలిసింది.

ఇన్ని నిరాశల మధ్య వెంకటపతి మాటలు హఠాత్తుగా గుర్తుకొచ్చాయి.

"జీవితం నుంచి ఏమీ ఆశించకుండా అది యిచ్చేవన్నీ పుచ్చుకుని తృప్తిపడడంలో ఎంతో ఆనందం వుంది"

కవిని వెంటబెట్టుకుని పాత ఆఫీసుకు వస్తే గుమాస్తాలందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుని, కళ్ళతో అర్థాలు మార్చుకుని నవ్వుకున్నారు. బలరాందాసు పాతనవ్వునే నవ్వి, సకిలించి, పిలకముడి వేసాడు.

"నేనెప్పుడో అనుకున్నాను, నువ్వు కాస్త ఆలోచించే మనిషివని. అయితే ఎప్పుడు జాయినవుతావు ఉద్యోగంలో? నీ సీటింకా ఖాళీగానే వుంది. రాజీనామా కాగితం కూడా నా దగ్గరే వుంది" అన్నాడు తను గుక్క తిప్పుకోకుండా.

వరదరాజులు నవ్వాడు. "ఉండనీయండి దాన్ని - అనవసరమని మరోసారి నిర్ధారణ చేసుకున్నాక పంపవచ్చు. ఇవాళ రెండోసారి ఉద్యోగం మానేయడం అనే మంచిపని చేశానని నిర్ధారణ చేసుకున్నాను."

గది బయట గుమాస్తాలందరూ వినేట్లు చెపితే బలరాందాసు మొదట తెల్లబోయాడు. పాతబిగువుతో భ్రకుటిముడిచి, వరద నీడలో ఒదిగి నిలబడ్డ కవిని పలకరించాడు.

"మరెందుకొచ్చా? పనిచెయ్యక ఎవర్నీ సాధించేది లేదు. పెద్దవాణ్ణి కనక చెప్పాను. మానేస్తే ఆ సీటు రామ్మూర్తికి యిస్తాను" అని పనిచూసుకోవడానికి ఫైళ్ళ కట్టముందుకి లాక్కున్నాడు బలరాం దాసు.

బలరాందాసు గది చుట్టూ గుమస్తాల చెవులు మొలిచాయి.

"ఈసారి వరదరాజులుకి మరీ మతిపోయినట్లుంది" అనుకున్నారంతా.

"నా గురించి రాలేదివాళ. ఈ కుర్రాణ్ణి చూడండి."

కళ్ళద్దాల మీద నుంచి సగం క్రిందనుంచి సగం చూసి "ఏమిటి?" అన్నాడు దాసు.

"రామ్మూర్తిగారి కొడుకు యితను. అయిదురోజుల క్రిందట ఆయన పోయారు"

నిర్ఘాంతపోయాడు బలరాందాసు.

"నిజం"

"కుర్రాడికి అంతా చెప్పడం చేతకాలేదు. కానీ ఆయన సైకిలు యిక్కడ వదిలేసినట్లున్నారు. దాన్ని తీసుకుపోవడానికి వచ్చాడు"

క్షణకాలం మాట్లాడలేకపోయాడు దాసు. నిజంగానే కుర్రాడిని చూస్తూ చాలా బాధపడ్డాడు. ఏదో జాలిపడుతూ గొణిగాడు. లేచి ఓసారి బయటికివెళ్ళి వచ్చి కూచున్నాడు.

"అయితే యిప్పుడేం చేద్దామంటావ్?" అనడిగాడు అమాయకంగా.

"మీకు సాధమయితే ఆఫీసులో ఏదైనా వసూలు చేసి యీ కుర్రాడికి యిచ్చి పంపండి. చూస్తూంటే రామ్మూర్తిగారి కుటుంబమంతా బీదస్థితిలో ఉన్నట్లుంది" అని. బలరాందాసు యింకేమో చెప్పేలోగా బయటికి వచ్చాడు.

కుర్రాడు బిత్తరపోయి అక్కడే నిలబడిపోయాడు.

తలకు పోసిన చెమటను తుడుచుకుంటూ లేచి కుర్రాడి తల నిమిరాడు దాసు. ఎన్నాళ్ళుగానో ఉన్న కర్కశత్వం, కుటిలత్వం వాడి మొహం చూస్తూనే జారిపోయినట్లనిపించాయి.

"ఎంతపని జరిగిందిరా బాబూ!" అన్నాడు.

వాడిని వెంటబెట్టుకుని స్వయంగా ఆఫీసంతా తిరిగి రెండు వందలు పోగుచేసి నౌకరుకు యిచ్చి కుర్రాడిని యింటికి పంపించాడు.

"నువ్వు కావాలి నాకు" అని వినత చీకట్లో కళ్ళు విప్పి అంటే మనస్సంతా దాచుకుని నవ్వి "నీకేం కావాలో నీకు తెలీదు" అనేశాడు.

అయిదేళ్ళ తర్వాత మళ్ళీ యిప్పుడు తనే ఆ ప్రశ్న వేస్తే "అమ్మో! సంఘం" అంటుందేమో.

లేకపోతే విచిత్రంగా చూసి, అంతలో నవ్వేసి "ఈ పిల్లలూ, నా భర్తా కాపురం" అంటుంది బహుశా.

నవ్వొచ్చింది వరదరాజులుకి.

చీకటిపడుతున్న కొద్దీ నడక అలసట కలిగిస్తోంది. కాలనీకి రెండు ఫర్లాంగుల చివర దింపేశాడు. బస్సులో దూరంగా ఫ్యాక్టరీ పొగలూ, సంస్కారం లేని పనివాళ్ళ గుంపులూ, ఇసుకలో పేర్చిన బొమ్మరిళ్ళలాగా కనుచూపు మేర వరకూ ఒకే రకం యిళ్ళూ వాటి వెనక రెక్క తెగిపడిన పక్షుల్లా విమానాలతో ఎయిరోడ్రోం హైదరాబాదు నగరం దాటి వచ్చి మొదటిసారి విశ్రాంతిగా గాలి పీల్చుకున్నాడు వరద.

వెలుగునీడలతో ఆకాశం సందిగ్ధంలో పడ్డ నేరస్థుడి మనస్సులా వుంది 165వ నెంబరు యిల్లు వెదుక్కుంటూ నడిచాడు వరద. 164 దాటేసరికి వినత గొంతు గుర్తుపట్టాడు. కూతురుతో ఏదో అరుస్తోంది. ముందు వాకిలి దాటాక పెద్ద గేటు. వసారాలోని సోఫాలో వెల్లకిలా పడుకుంది. గుండెమీద తలపెట్టుకుని కూతురు పడుకుని వచ్చీరాని ఇంగ్లీషు భాషలో పద్యం చదువుతోంది.

వరదగేటు తలుపు తీసుకుని లోపలికి వస్తే మొదట అమ్మాయి లేచి "ఎవరు?" అంది.

వినత తుళ్ళిపడి లేచి మనిషిని గుర్తుపట్టలేక వాకిట్లో దీపం వెలిగించింది.

అతన్ని పోలిక పడుతూనే "వరదా, నేననుకుంటూనే వున్నాను నువ్వు వస్తావని నిన్ననే ఆయనతో ఉత్తరం వ్రాయమని చెప్పాను. మీ ఆవిణ్ణి తీసుకురాలేదేం? ఆమె అందాన్నీ, మంచితనాన్నీ కొరుక్కు తినేస్తానని భయమా? నిలబడిపోయావేం? కూచో" అని నౌకర్ని పిలిచింది.

వెనకనుంచి దీపపు వెలుగు పడుతూండడం వల్ల ఇంకా వంపులు మలచని రాతి విగ్రహంలాగా కనిపిస్తోంది వినత.

కుర్చీలో కూచుంటే క్రిందికి లాగేస్తున్నట్లనిపించింది.

"మా రెండోవాణ్ణి చూశావా? వీడిపేరు శివుడు. నాకంటే బాగా అల్లరి చేస్తాడు" అంది సన్నజాజి మొగ్గల్ని వాకిలంతా జల్లుతూ పచార్లు చేస్తున్న కుర్రాణ్ణి చూపిస్తూ.

"దీని పేరు కాశీ. మా పెద్దమ్మాయి. అంతా మా నాన్న పోలిక. కొన్నాళ్ళు అమ్మా, నాన్నా దగ్గర ఉంచితే మరో వినత తయారవుతుందని నువ్వే అన్నావుగా? సందేహం లేదు" అంది నవ్వుతూ.

ఇవేవీ పట్టటం లేదు తనకి. స్తంభం నీడలోకి ముఖాన్ని తిప్పుకుని కాలం కొత్తగా మలచిన ఆకృతిని చూస్తూ కూచున్నాడు వరదరాజులు.

"అలా చూస్తావేం నన్ను?" అంది కొడుకు తలమీద చుబుకం ఆనిస్తూ.

ఇంకా వరద మాట్లాడకపోతే "చాలా అసహ్యంగా తయారయాను కదూ? బొద్దుగా, నిండుగా. మళ్ళీ నీలాంటి వాళ్ళతో మాట్లాడితే చాలు మామూలు మనిషినయిపోతాను.

"ఇక్కడెలా వుంటోంది నీకు?"

"నాకేం హాయిగా వున్నాను. మొన్ననే అంటే దీపావళి తొలి రోజుల్లో ఈ సన్నజాజి వేశాను. అప్పుడే చూడు ఎలా పాకిపోయిందో" అతని ముఖంలో పరిహాసాన్ని చూసి ఆగిపోయింది. "పోనీ అవన్నీ. నాకేం మాట్లాడాలో తెలియడంలేదు. అక్కడి విషయం చెప్పు. నీలవేణి నీతో సరిగా వుంటోందా?"

"ఉండటం లేదు"

"అదేం?" అని దిగ్భ్రమ చెంది, వరద ముఖం సూటిగా చూసి నవ్వేసింది. "ఓ! నువ్వేం చెప్పవు. అందుకే ఆవిణ్ణి తీసుకురమ్మన్నాను. ఒక్కటి చెప్పు. నేనంటే ఈర్ష్యా ఆవిడకి?"

వింతగా చూశాడు. "ఎందుకూ?"

"నువ్వన్నీ ఆమెతో చెప్పేసి వుంటావు అప్పటి విషయాలు. ఇద్దరూ నా పిచ్చికి నవ్వుకుని వుంటారు. అవునా?"

ఆలోచిస్తున్నాడు వరద. "ఆ విషయాలన్నీ నేనే మరిచిపోయాను."

"పోనీలే అదంతా సుజాత ఎందుకు ఆత్మహత్య చేసుకుందంటావ్?"

"సుఖం కోసం"

ఫక్కున నవ్వేసింది. "అయితే సుఖం కావాల్సిన వాళ్ళంతా చచ్చిపోవాలంటావ్? నాకు మాత్రం వెయ్యేళ్ళు బ్రతకాలని వుంది బాబూ!"

కుర్రాణ్ణి గుండెకు గట్టిగా హత్తుకుని ముందుకూ, వెనక్కూ ఊగుతూ అంది.

**"వేగంగా వచ్చెయ్యండి.** నేను ఒక్కదాన్నే ఉండలేను" అంటోంది వినత.

దీపాలన్నీ చీకటిలో తెగిపడి బారులు తీర్చిన నక్షత్రాల్లా వున్నాయి.

"ఎలా వుంది యిక్కడి బ్రతుకు?" అనడిగాడు వరద.

ఏదో ఆలోచిస్తున్నాడు కాశీపతి. అంతలో తేరుకుని ఇటు తిరిగాడు.

"ఇక్కడి బ్రతుకు అనకండి ఎలావుంది మీ బ్రతుకు? అనండి."

"మీకేం?"

"మీతో ఆనాడు అన్నాను జ్ఞాపకం వుందా? వినత గురించి భయపడ్డానని. ఈ పని తొందరలో, ఈ బాదరబందీలో ఆమెను నిర్లక్ష్యం చేస్తున్నానేమో అనిపిస్తుంది. స్త్రీకి చాలా కావాలి. అంతవరకూ వినతదేమీ తప్పులేదు. కానీ నాకు వాటన్నిటి గురించి ఆలోచించడానికి తీరిక లేకపోవడం, స్వయంగా వాటిని తీర్చలేకపోవడం దురదృష్టం. ఉదాహరణకు యివాళ నెక్లెస్ కావాలని చెప్పింది. ఇదిగో యిప్పుడు ఆఫీసు నుంచి వచ్చాను" నవ్వాడు. ఇందాకటి నవ్వుకీ, యిప్పటిదానికీ చాలా తేడా కనిపించి ఆశ్చర్యపోయాడు.

"దైనందిన జీవితంలో అయితే ఫరవాలేదు. మానసికంగా విడిపోతేనే కష్టం"

"ఎవరు? మేమిద్దరమూనా?" దీపం క్రింద ఆగాడు కాశీపతి.

"అవును"

"అలాంటి ప్రమాదమేమీ లేదండి. ఎప్పుడూ ఆమె ముఖంలో అసంతృప్తి చూడలేదు నేను. అయినా యింకా ఏదో నేను యివ్వలేనిది నా నుంచి ఆమెకు కావాలేమోననిపిస్తుంది. ఏమైనా నేనింక చేయగలిగిందేమీ లేదు. అదిగో! క్లబ్బుకి వచ్చేశాం."

అక్కడ కూర్చున్నంతసేపూ ఏవో పుస్తకాలు తిరగేసి, నలుగురు స్నేహితుల్ని పరిచయం చేశాడు కాశీపతి.

ఇంటికి తిరిగి వస్తూంటే "నే చెప్పినవన్నీ వినతతో అనకండి. బాధపడుతుంది" అన్నాడు.

"మీ వ్యాపారం ఎలా వుంది?"

"నా ప్రయోగమంతా సాఫీగా జరిగిపోయింది. అయితే ఒకచోట పప్పులో కాలేశానా అనిపించింది. కానీ లైబ్రరీల విషయం మాత్రం రైటు. ఒక్కొక్క రోజు 2,500 మంది వచ్చి పుస్తకాలు మార్పిడి చేసుకు వెళ్తారు. ఇప్పుడు పద్దతులన్నీ మార్చేశాను. లైబ్రరీ నా ప్రయోగంలో ఒక భాగం మాత్రం పుస్తకాల కాంట్రాక్టులు, ముద్రణ, దినపత్రికలు మిగతా భాగాలు. రేపు అవన్నీ చూద్దురుగాని"

ఇంటికి వచ్చేసరికి వాకిట్లో మంచాలు అమరుస్తోంది వినత. దోమతెరలు గాలికి ఎగురుతున్నాయి.

వచ్చేసరికి తెరలు మీదకి ఎత్తి వెల్లకిలా పడుకుని వుంది. కాశీపతిని చూసి చటుక్కున లేచి కూచుంది. "దోమలు కూడా ఒక్కొక్కప్పుడు అవసరమేననిపిస్తుంది. లేకపోతే ఇలా గాలిలో ముసుగు పెట్టుకు పడుకోవడం ఎలా వీలవుతుంది?" అంది నవ్వుతూ.

పిల్లలిద్దరూ నిద్రపోయారు.

బట్టలు మార్చుకుందుకని కాశీపతి లోపలికి వెళ్ళాడు.

మంచం మీద కూచునే కాళ్ళూగిస్తూ బద్ధకంగా ఆవులిస్తోంది వినత.

"మీ యిద్దరూ యిక్కడ?"

"మరి నువ్వో?"

"మధ్యలో లేస్తూంటాడు రెండోవాడు. మెలుకువ వస్తే ఆయన విసుక్కుంటారు. అందుకని నేనెప్పుడూ ఆ గదిలోనే" ముఖం చూసి అతను తెల్లబోతే నవ్వేసింది.

ఎంత దాచుకోవాలన్నా నువ్వు ఆమె మనస్సుని పట్టి యిచ్చింది. కళ్ళకింద నీడల్లో అలసట, అసంతృప్తి తెలిసింది.

ఎదురుగ్గా మంచం మీద కూచుని "ఒక్కటి అడగనా?" అన్నాడు.

ఆశ్చర్యంతో అతని ముఖం చుసింది. ఆ కాస్తపాటి వెలుగులో అతని ముఖం స్పష్టంగా కనిపించడంలేదు.

క్షణం ఆగి, ఏమనుకుందో యేమో "నీదంతా విచిత్రం. ఏమీ అడగవద్దులే" అంది.

వదులు చారల పైజమా, గుండ్రటి మెడవరకూ పట్టిన ఎర్రల చారల బనీనూ వేసుకుని తువాలుతో బయటికి వచ్చాడు కాశీపతి. అతన్ని చూస్తూనే నవ్వొచ్చింది వరదకి.

బట్టతలతో, వయస్సు మీరినట్లు కనిపించే కాశీపతికి పైజమా అతకలేదు.

వయస్సు సంస్కారాన్ని చాలా వెకిలిగా అలంకరించుకుంది.

"మీరు పంచెకట్టే బావుంటారు" అని లేచాడు.

నీళ్ళు తీసుకురావడానికి లోపలికి వెళ్తున్న వినత వెనక్కి తిరిగి పకపక నవ్వేసింది.

"నన్నుకాదు, వరదరాజుల్ని మీరు పెళ్ళాడితే మిమ్మల్ని పెద్ద వేదాంతిని చేసేవాడు" అనేసి వెళ్ళిపోయింది.

మొదట ఆశ్చర్యపోయి, ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసి నవ్వుకున్నారు.

"సరిగ్గా మిమ్మల్ని తెలీనివాళ్ళు చూస్తే 35 దాటినట్లు అవుపిస్తారు మీరు" అని వరద అంటూండగానే బకెట్‌తో నీళ్ళు తెచ్చి మెట్లమీద వుంచింది వినత. వరద, కాశీపతి జవాబుకి ఎదురుచూస్తూ కాళ్ళు కడుక్కునేందుకు వెళ్ళాడు. కాళ్ళమీద నీళ్ళు పడితే వేడికి చురికి చటుక్కున కాలు తీసేసుకున్నాడు.

భోజనం చేస్తూంటే సుజాత విషయం ఎత్తాడు కాశీపతి.

"నాకు ఎక్కువ తెలీదు ఆ అమ్మాయి గురించి. చచ్చిపోయిందని వినత అంటే జాలిపడ్డాను. కారణం తెలుసా మీకు?"

"ప్రపంచం ఆమె మంచితనాన్ని చూడలేక అన్యాయంగా ఆమెను చంపేసిందంట. వరద చెప్పాడు. అలాగయితే మా అమ్మను ఎందుకు వదిలిపెట్టిందో అర్థంకాదు" అంది వినత అన్నం వడ్డిస్తూ.

కాశీపతి నిర్ఘాంతపోయాడు.

"అన్నిటికీ ఆశ్చర్యపడకూడదు. పడినా పైకి కనిపించకూడదు. వరదని అడిగి తెలుసుకోండి" అంది.

వీలు చూసుకుని మాట మార్చాడు వరదరాజులు.

భోజనం అయాక లేస్తూంటే "నీళ్ళెక్కడ ఉన్నాయో తెలీదు నీకు. నేనిస్తానుండు" అని పెరట్లోకి వచ్చి లైటు వేసింది.

దీపం వెలుగులో నవ్వుతున్న ఆమె ముఖాన్ని వింతగా చూశాడు వరదరాజులు.

చేతిమీద నీళ్ళు పోస్తూ "నటన కూడా తెలీదు నీకు? నీ ముఖం చూసి నేను చెప్పేవన్నీ నిజమేనని నమ్మేట్లున్నారాయన" అంది మెల్లిగా.

"ఇదేనా నువ్వు కోరుకున్న బ్రతుకు?"

వింతగా చూసింది.

"బ్రతుకు తర్వాత. మొదట చెయ్యి కడుక్కో ఆయన లేస్తారు" అంది చెవి పక్క గొణుగుతూ. కంఠంలో చిన్నపిల్లాడిని సముదాయించే తీరు తోచింది.

తువాలు తెచ్చి యిస్తూ "మీ ఆవిడ యింకా భోజనం ఎలా చేయాలో చెప్పినట్లు లేదు" అంది.

కళ్ళలో ఈర్ష్య స్పష్టంగా తెలుస్తూనే వుంది. దీనివల్ల ప్రయోజనం మాట అలా వుంచి, ఈర్ష్యపడడం స్త్రీకి గాలి పీల్చడంలాగ. కళ్ళని ఆయుధాలుగా చేయడంలాగ. కన్నీటితో మనసుని పవిత్రం చేసుకొనడం లాగ ఒక అలవాటేమోననిపించింది.

ఉదయమే కాఫీ తీసుకొచ్చి లేపింది.

"హైదరాబాదు అలవాట్లు కొంచెం పాటించు. బెడ్ కాఫీ యివ్వమన్నారాయన"

ఎండ మంచం మీదకి మెల్లగా పాకుతోంది. కాశీపతి అప్పుడే లేచి ఎక్కడికో వెళ్ళాడు. "నిన్ను ఉదయం నడకకి తీసుకువెళ్తానని లేపబోయారు. నీకు పద్మనాభస్వామి ఆలయం ముందు కూర్చోవడం తప్ప ఏ అలవాటుంది కనుక? అందుకని వద్దన్నాను. బాగా నిద్రపోతావే"

కాళ్ళు వేలాడేసి మంచం మీద కూచుంది.

కాఫీ తీసుకోబోయి, వేడికి చేయి వణికితే చటుక్కున వినత అందుకుని ఒకటే నవ్వు. "ఆ మాత్రం ఓర్చుకోలేవా? పాపం" అంది.

"ఎందుకు చాలా మామూలుగా ఉన్నట్లు ప్రయత్నిస్తావు. నీలో మార్పు నువ్వు దాచుకోలేనిది"

మొదట తెల్లబోయింది వినత. అంతలో నవ్వేసి "అదేమిటి?" అంది.

మళ్ళీ తలగడ మీద తల ఆనిస్తే తెల్లవారుఝామున పడ్డ మంచు చల్లగా తగిలింది.

"చాలా మారిపోయావు నువ్వు"

"వయస్సులోనా?"

"మనస్సులో"

"అబ్బో! నాకో మనస్సూ, అది మారడమూను. చాలా కనిపెట్టావే? ఎలా చెప్పుమరి?"

లేచి దోమతెరని మీదకి వేసింది. ఎంతకీ మాట్లాడకపోతే కళ్ళు మూసుకుని పడుకున్న వరదరాజులు వేపు వింతగా చూసింది.

ఉన్నట్లుండి వినతకి ఏవో పాత విషయాలు గుర్తుకొచ్చి గుండె గొంతులో కొట్లాడింది. మనస్సు చాపల్యానికి అంతలో సిగ్గుపడి ఎవరన్నా చూశారా అని చుట్టూ చూసి పరుపు తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

మళ్ళీ వచ్చేసరికి వరద యింకా నిద్రపోతూనే వున్నాడు.

"ఇంకా నిద్రేనా?" అంటే

"లేదు. నువ్వెంత మారావా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"చెప్పయితే"

ఫక్కున నవ్వేశాడు వరద.

"ఎంత మభ్యపెట్టాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చివరికి అమాయకంగా ఎదురు తిరిగావు. సంఘం నీ మీద కొన్ని శిక్షలు విధించింది. నీకిష్టం లేకపోయినా వాటిని అనుభవించాలి"

దిమ్మెరపోయి చూసింది వినత.

"ఏవో పిచ్చి ఆలోచనలన్నీ చెప్పి నన్ను భయపెట్టాలని చూస్తావు. నాకేం బాధల్లేవు. హాయిగా వున్నాను."

"ఏం హాయి?"

"ఈ పిల్లలూ, భర్తా, యిల్లూ యివన్నీ చెపితే ఎలా తెలుస్తుంది నీకు?"

నవ్వొచ్చింది మళ్ళీ. నవ్వితే సిగ్గుపడుతుందని ఆపుకున్నాడు.

కాశీపతి మరో కొత్త కంపెనీ విశాఖపట్నంలో ప్రారంభిస్తున్నట్లు చెప్పింది.

"నెక్లెసు కొంటానన్నారు. బహుశా సెప్టెంబరులో కొంటారనుకుంటాను" అంది చాలా ఉత్సాహంగా.

అన్నీ ఓపిగ్గా వింటూ కూచున్నాడు. ఇప్పుడిక ఆశ్చర్యం లేదు. ఇదికాక ఆకాశం నీలిమ గురించీ, వెన్నెల చల్లదనం గురించీ, పువ్వుల్లో మత్తు గురించీ, తన గురించి మాట్లాడితే ఆశ్చర్యపడాలి.

ఈ వినత వేరు. సంఘంలో తనూ ఒకర్తై, మనస్సు అవసరం లేని వింత మమతల్లో మాధుర్యాన్ని వెదుక్కొంటోంది.

చూసి పలకరించి "ఇదేనా నువ్వు కోరుకున్న జీవితం?" అంటే కళ్ళు విచిత్రంగా తిప్పుతుంది. ఆ కళ్ళకు అర్థం "ఇంతకన్నా యింకేం కావాలి?" అని.

"ఈ పిల్లల్తో యీ చీదర, విసుగు - యింత తేలికా నీకు కావల్సిన సుఖం" అని అంటే.

"పో, నీదంతా పిచ్చి" కూతుర్ని గుండెలకు హత్తుకుని "ఈ సుఖం నీకెట్లా తెలుస్తుంది" అంటుంది.

తనవేపు అలా సూటిగా చూస్తుంటే భయపడింది వినత.

చేతికర్ర నేలకేసి టకటకలాడిస్తూ వచ్చాడు కాశీపతి.

"రాత్రి చాలా వింత కలలొచ్చాయిట యీయనకి నేను పెద్ద భూతమయినట్లూ, యితను భయపడి పారిపోతున్నట్లూ యింకా యిలాగ"

అబద్ధం సుళువుగా చెప్పేసి వరదరాజులు ముఖం చూసి నవ్వుతోంది.

చేతికర్ర తిప్పుతూ, ముణుకుల దిగనిపొంటూ, బనీనుతో వున్న కాశీపతిని చూసి "అంతా దొరల పద్ధతి అమలులో పెట్టేశారే" అన్నాడు వరద.

"ఓసారి లండన్ నుంచి ఓ కష్టమర్ వచ్చాడండి. నెలరోజులు మా కంపెనీ అతిథిగా వున్నాడు. అతనితో తిరగడంలో యిలా అలవాట్లన్నీ చేశాడు. పదేళ్ళ క్రితం అరబిందో ఆశ్రమానికి వెళ్ళాడట. పది ఆసనాలు నేర్చుకుపోయి, పదివందల మందికి శిక్షణ యిస్తూ చిన్న ఎసోసియేషన్ ప్రారంభించాడట లండన్లో. మనవాళ్ళు ఉత్తఫూల్స్. మాకేం తెలీదని డప్పుకొట్టుకు తిరగడం తప్ప వీళ్ళకేం తెలీదుండండి. వెంటనే 'డెట్టాల్' వాటర్ స్నానం చేస్తే స్వర్గంలో ఉన్నట్లుంటుంది" అని లోపలికి వెళ్ళాడు.

రెండు రోజులు గడిచినా వచ్చినపని అలాగే వుండిపోయింది. నవలని కాశీపతికి యివ్వాలన్నది మొదటి లక్ష్యం. అది చూపడంలో విసుగూ, విరక్తీ కాదు. అన్ని విధాలా భౌతిక దృక్పథం అలవర్చుకున్న కాశీపతిని చూశాక తన రచనల మీద తనకే అపనమ్మకం కలిగింది. ఈ కాలంలో అలాంటి బ్రతుకే మంచిదేమోననిపించింది.

ఇహ యీ రచనలా? ఉఫ్!

భర్తృహరి సుభాషితాలూ, భారత రామాయణాలూ బడిలో పాఠాలు చెప్పుకుందుకి, బహిరంగ సభల్లో ప్రసంగాలు చేయడానికి ప్రమాణాలుగా మిగిలాయి. కాలం వెయ్యిమంది భర్తృహరుల్నీ, వెయ్యిమంది తిక్కనల్నీ మింగేసి యింకా ఆకలితో నోరు విప్పుకుని చూస్తోంది. స్వరూపాన్ని లేకుండా చేయడం కాదు కాలం లక్ష్యం. స్వభావాన్ని రూపుమాపితే చాలు.

"కేసరి జీర్ణతృణంబు మేయదు" అంటే ఒప్పుకుని, నిజమేనని పద్యాల్ని వల్లెవేసుకున్నారు పూర్వులు. అప్పటి 'కేసరి' అలా వుండేది కూడాను. ఇప్పుడలా కాదు. కేసరి అదిన్నీ 'సంత్రాసమదేభకుంభ పిసిత గ్రహలాలస శీల సాగ్రహాగ్రేసర భాసమానమగు కేసరి సైతం జీర్ణతృణం మేస్తుందంటాడు. ఈ కాలం వ్యక్తి చెలం, శ్రీశ్రీ కొ.కు. మలచిన వ్యక్తి. భర్తృహరి కాదిప్పుడు, భౌతిక దృక్పథం - అదీ యిప్పుడు ప్రజలను ఆకర్షిస్తున్న విషయం.

తర్కం మిగిలింది. ప్రేమ అర్థం మారింది. జీవితానికీ అంతే. సాహిత్యపు పడికట్టురాళ్ళు మారాయి. కళకళ కోసం కాదు. ప్రేమకి భర్తల పొదుపు అనవసరం ఇహ 'కేసరి' కేనా వచ్చింది?

ఇదివరకు సాహిత్యం మానసికమైన తృప్తి. జీవితంలో ఏ విధంగానూ ప్రదర్శించలేని ఆవేశాలకూ, ఉద్రేకాలకూ ఆటవిడుపుగా సాహిత్యం మిగిలేది. కుక్కకు దెబ్బ తగిల్తే అరుస్తుంది. సంతోషం వస్తే తోకాడిస్తుంది. సంస్కారం చేతిలో, భౌగోళిక పరిమితులకు లోనయిన మానవుడు అరవనూ లేడు. తోకాడించలేడు? యిహ మిగిలింది సాహిత్యం.

20 వ శతాబ్దపు సాహిత్యాన్ని 'అవసరం, వినియోగం'తో ముడిపెట్టింది కాలం. ఈ సాహిత్యపు తులనాత్మక శక్తిని ఏ గణాంక లెక్కలూ తేల్చలేవు.

వ్యక్తిగతమయిన తృప్తికీ, అనిర్వచనీయమైన ఆనందానికి తలలెత్తిన సాహిత్యపురీతులు క్రమంగా బూజుపడుతున్నాయి. నువ్వొక్కడు బాగుపడితే చాలదు. పదిమంది బాగుపడాలి. నీకొక్కడికీ ఆనందం లభిస్తే చాలదు. పదిమందికీ ఆ ఆనందాన్ని పంచగలిగే 'చేవ' ఉండాలి.

ఇప్పటి సాహిత్యానికి ప్రమాణాలు దినపత్రికలూ, బోర్డు కట్టుకు అరిచే విమర్శకులూ, సినిమాలూ, అకాడమీ బహుమతులూను. నోబెల్ బహుమానం యిచ్చాక తనని అందలం ఎక్కించే ప్రజల మనస్సు చిన్నతనాన్ని చూసి ఠాగూర్, తనకు మరణశిక్ష విధించాక

సానుభూతినీ, తన మేధాశక్తికి ప్రశంసలనూ అందజేసే ఏథెన్సు పౌరుల అల్పత్వానికి సోక్రటీసు ఎంత బాధపడివుంటారో వూహించడం కష్టం.

కాలం మారితే కాలంతోపాటు మనుషులూ మారాలి. కాలం తనకు అనుకూలంగా మారలేదని ఏడ్చేవాడి కంటే, కాలానికి అనుగుణంగా మారగలిగినవాడే విజ్ఞుడు. కాలాన్ని మార్చుకోగలిగినవాడు మేధావి.

కానీ యింత ఆలోచించే దెవరిప్పుడు?

ఓ క్షణం కాశీపతిని ఆపి పాత రచనల్ని ఎత్తి చూపితే, యిదివరకటి శ్రద్ధతో వింటాడన్న నమ్మకం కుదరలేదు.

ఆ సంఘటనకి సిద్ధపడేకంటే ప్రయత్నం మానుకుంటేనే మంచిదనిపించింది. తెలీని పిరికితనం తనని ఆవహించింది.

వచ్చినపని చెప్పకుండానే ఆ రాత్రే బయలుదేరుతానంటే కాశీపతి, వినత ఆశ్చర్యపోయారు.

ఒంటరిగా చూసి అడిగింది. "ఎందుకొచ్చావో చెప్పకుండానే వెళ్ళిపోతావా?"

"ఊరికే చూసిపోదామని"

"అదికాదులే. ఏదో దాస్తున్నావు"

"ఏముంది దాచడానికి? ఇంత అందమైన ఊరు, మనుషులు, అంతకు మించి నిన్ను చూడాలనిపిస్తే బయల్దేరాను"

"మమ్మల్ని చూస్తే నీకు విసుగు పుట్టిందేమోలే. నువ్వు చెప్పే విషయాలు మాకర్థం కావేమోనని భయం."

ఉదాసీనతకి అన్నా ఆ మాటల్లో అమాయకత గుర్తించి నవ్వుకున్నాడు.

"నువ్వెలా వుంటావో చూడాలనిపించి వచ్చాను. ముఖ్యంగా అమ్మాయి నెత్తుకుంటే చూద్దామని"

తృప్తిగా ఫక్కున నవ్వేసింది.

"అంతేనా?" అది అదొక్కటే అయితే ఫరవాలేదనిపించేట్లు.

నవ్వులో వక్రత్వం గుండె ఝుళ్ళుమనిపించింది.

బయల్దేరుతూంటే "నీలవేణిని తీసుకురా ఎప్పుడన్నా, గులాబిని అడిగానని చెప్పు" అంది.

రైలు ఎక్కిస్తూ "మీరు ఏదో చెప్పాలని వచ్చి ఏమీ చెప్పకుండా వెళ్ళిపోతున్నారు. నాకు తెలుసు" అన్నాడు కాశీపతి.

నవ్వేసి మాట మార్చాడు వరదరాజులు.

"విశాఖపట్నంలో కంపెనీ పెడతారటగా"

నవ్వాడు కాశీ. "వినత అందా? ఇప్పుడిప్పుడే కాదులెండి. అంతా కలిసి వస్తే మరో సంవత్సరం నాటిమాట"

"కంపెనీ ప్రారంభిస్తే, నేనంతా నిర్వహిస్తాను. ముందు మీ దగ్గర ఆరునెలలు తర్ఫీదు పొందుతాను" అన్నాడు వరద.

రైలు కదుల్తోంటే కాశీపతి కిటికీ దగ్గరకు వచ్చి అడిగాడు.

"వినత నా గురించి ఏమన్నా చెప్పిందా?"

నివ్వెరపోయాడు వరద.

"ఏం చెప్తుంది?"

"ఊరికే అడిగాను లెండి. మామగారిని అడిగానని చెప్పండి" అని చెయ్యి ఆడించాడు.

నీలవేణి గురించి ఆలోచిస్తున్నాడు వరద.

వాళ్ళిద్దరి మధ్య ఏవో అభిప్రాయభేదాలున్నట్లు స్పష్టంగా తెలిసిపోయింది.

వినతకి యింకా ఏదో కావాలి. చాలా రోజుల తర్వాత వరద రాజుల్ని చూశాక ఆమెకు మళ్ళీ ఆ విషయం గుర్తుకొచ్చింది.

కాశీపతికి ఏదో పారేసుకున్న దిగులువుంది. ఆ విషయమూ వరదని చూశాకనే అనిపించింది.

ఏమైనా గానీ, వాళ్ళ మనస్సులకి మరింత ఆలోచనని జతపరిచి వచ్చేశాడు వరద.

ఏవో పట్టుదలలు, అనుమానాలకు పోయి చెప్పాలనుకున్న విషయం కాశీపతితో చెప్పకుండానే తిరిగి వచ్చేశాడు. తీరా యింట్లో అడుగుపెట్టి ఆశతో చూస్తున్న గులాబి, నీలవేణిని చూడగానే మనస్సు చివుక్కుమంది.

"ఏమయిందంటే?" విసుక్కుని మీకు బుద్దిలేదన్నాడు.

కానీ బుద్దిలేనిది తనకు.

పార్కు దగ్గర ఎవరో పలకరించారు. "ఏమండోయ్ కులాసాగా వున్నారా? మీ గురించి పద్మిని రెండుమూడుసార్లు అడిగింది. ఓసారి యింటికి వస్తారా?" అన్నాడు.

ఎంతో ఆలోచించిన మీద పద్మిని భర్త గుర్తుకొచ్చాడు.

ఇదివరకు కన్నా కాస్త బలంగా, మరింత తెల్లగా, అప్పటికంటే కుర్రాడిలాగా కనిపించాడు అశ్వత్థనారాయణ.

"బాగా చిక్కిపోయారు మీరు?" అన్నాడు సైకిలు పట్టుకు నడుస్తూ.

పార్కు కార్నర్‌కు వచ్చాక "ఇంటికి రాకూడదూ ఓసారి? మంచి బోర్నవిటా యిస్తుంది పద్మిని. అంతకు మించి నాకు చాలా ఉబుసుపోతుంది. మళ్ళీ యిక్కడివరకూ తీసుకొచ్చి వదుల్తాను."

కాదనలేకపోయాడు వరద.

ముఖం చూడగానే అతని పరిస్థితి యిట్టే కనిపెట్టేసింది పద్మిని.

"ఇంకా ఉద్యోగం దొరకలేదు. అవునా?" అంది అతను లోపలికి వెళ్ళాక.

ఈసారి విషయం దాచలేదు. తలుపాడు.

"ఇప్పుడన్నా మద్రాసు వెళతారా? ఆయనతో చెప్తాను"

ఏమిటేమిటంటూ తల దువ్వుకుంటూ వచ్చాడు అశ్వత్థనారాయణ.

వరద మౌనంలోనే జవాబును ఊహించుకుని "వరదరాజులుగారు మద్రాసు వెళ్తారట. ఉద్యోగం యిప్పించండి" అంది.

తెల్లబోయాడు అశ్వత్థనారాయన.

"మీకు ఉద్యోగం కావాలా? నాకు తెలీదే? ఏదో ఉద్యోగంలో చేరారనే అనుకుంటున్నాను"

"అదే ఆడవాళ్ళకూ, మొగవాళ్ళకూ ఉన్న తేడా. ముఖం చూడగానే పోల్చేశాను నేను.

"ఉద్యోగాలు లేవన్న విషయం కూడా మొహంలో చూసే పోల్చుకోగలిగితే, నిరుద్యోగులకు ప్రేమ సమస్యే ఉండకపోను. ఆడవాళ్ళంతా ముందు జాగ్రత్తపడేవారు"

"సరే, ఉద్యోగం విషయం..."

"అప్పుడే గోవిందాచారి పత్రిక ప్రారంభించి చాలారోజులు కావస్తోంది. ఉత్తరం వ్రాసి యిస్తాను. మాటని తోసిపారేయడని నమ్మకం వుంది. వెళ్ళి ప్రయత్నిస్తారా?" అన్నాడు.

వరద మాట్లాడడానికి అవకాశం యివ్వడంలేదు పద్మిని. "ప్రయత్నిస్తారా? కాదు 'ప్రయత్నించండి' అనాలి" అంది.

పత్రిక నడపడానికి, మొదట బాధ్యత వహించగల వ్యక్తులు దొరక్క తికమకపడుతున్నాడు గోవిందాచారి. అశ్వత్థనారాయణ ఉత్తరం చూసేసరికి కాస్త సంతోషం వేసినా, నిర్వాహకుడిగా కాస్త లాంఛనప్రాయమైన హుందాతనం నెరిపాడు. అవీ యివీ అడిగాడు వరదని. అనుభవాన్ని పునిర్విమర్శ చేశాడు. పత్రికంటే మాటలు కాదన్నాడు వరదకి యిదంతా కొత్త.

"జర్నలిస్టుకీ, రచయితకీ శతసహస్రాంతం తేడా వుంది. జర్నలిస్టు మిషను, రచయిత ఫ్యూయల్" అని క్లుప్తంగా వర్ణించాడు.

తెల్లబోతూ గోవిందాచారిని చూస్తూ కూచున్నాడు వరదరాజులు.

నాలుగైదు పేపర్లల్లో పనిచేసి ఢక్కా మొక్కీలు తిని, రాటు తేలి, కూడేసిన నాలుగు రాళ్ళతో ఓ పత్రిక నడపాలన్న చిరకాల వాంఛని నెరవేర్చుకోవాలని మద్రాసు నడిబొడ్డులో ఓ కారుషెడ్డు, ఎత్తేసిన కిళ్ళీకొట్టు వెనకభాగాన్ని అద్దెకు తీసుకున్నాడు గోవిందాచారి. గత ఆరునెలలలోనూ అతని సంపాదకీయంతో, రెండు పిచ్చాపాటీ వ్యాసాలతో, సినిమా వార్తలతో, తారల తరహా అన్న ప్రత్యేక శీర్షికతో, సంపాదకుని లేఖల్తో రెండే రెండు పత్రికలు వెలువడి ముప్పాతిక కాపీలు పోనూ, మిగతా వెయ్యిన్నీ తొమ్మన్నూట ఆరువందల ఎనభై కాపీలు కుర్చీకింద ఎత్తుపెట్టుకోవడానికీ, చిత్తుకాగితాల పనికీ మిగిలిపోయాయి. అయితే యింకా మరిన్ని రూపాయలు జేబులో మిగిలిపోవడం వల్ల మూడో పత్రిక ముఖచిత్రానికి ఏర్పాట్లు సాగిస్తున్నాడు గోవిందాచారి. సరిగ్గా యిదే సమయంలో అశ్వత్థనారాయణ యిచ్చిన వుత్తరం పుచ్చుకుని వరదరాజులు వచ్చాడు.

మనిషి ముచ్చటగా, మితభాషిగా, చెయ్యాల్సిందేదో బేషజం, బెట్టుసరి లేకుండా చేసుకుపోయేవాడుగా కనిపించాడు గోవిందాచారికి. చూడగానే వరదరాజులు అతని మనస్సుకి హత్తుకుపోయాడు.

రాసి కథలు నాలుగు చదివి, ఇటీవల వచ్చిన తరహా సాహిత్యంలో వేటిలోనూ అతని కథలకి పోలిక లేకపోవడం చూసి విస్తుపోయి, అంతకు మించి దిగ్భ్రాంతుడయి ఇదో కొత్తపోకడ అనుకుని తనలో తాను తృప్తిపడి, నెలజీతం మీద ఉద్యోగం యివ్వడం మరేం బేసబబుగా వుండదని నిశ్చయించుకున్నాడు. అంతవరకు అక్కడక్కడ ప్రెస్సులో పనిచేస్తున్నవాళ్ళు ఓసారి ఈ కథ వ్రాసో, ఓసారి ఆ వ్యాసం వ్రాసో అతని పత్రికను మేపుతున్నారు. పత్రిక పేరు 'ప్రజ.'

ఉద్యోగం దొరికిందనగానే నీలవేణికీ, కృతజ్ఞతలు తెల్పుతూ పద్మిని భర్తకూ ఉత్తరాలు వ్రాశాడు. జీతం నూరు. అంత పట్టణంలో నూరు రూపాయలకి విలువలేదని నెలరోజుల తర్వాత తెలిసింది. గోవిందాచారిని అడిగితే, పత్రికా కార్యాలయం వెనుకనే మరొక కిరాణా దుకాణం ఖాళీ అయితే దాన్ని బేరమాడి, సరసమైన అద్దెకిట్టుబాటు చేయించి అది యిప్పించాడు. మర్నాడే వారం రోజులు శలవు తీసుకుని గులాబినీ, నీలవేణిని తెచ్చుకునేందుకు యింటికి వచ్చాడు వరదరాజులు.

మార్పులో కూడా ఆనందం వుంది. దుఃఖం నుంచి పతనానికయినా.

ఉఫ్!

ఆనందం అంటే ఏమంత గొప్ప విషయం కాదు. ఓ పెద్దమంట పక్క మండే చిన్నమంట. కోరిక పక్క తృప్తి సెగ. ఒకటి తగ్గితే రెండవది ప్రజ్వలిస్తుంది. ఒకటి హెచ్చుడంవల్ల రెండవది ప్రజ్వలిస్తుంది.

రెండేళ్ళు గడిచాక పూర్తిగా మారిన కుటుంబాన్ని చూసుకుని ఆ రెండూ తనకు లేవేమోననుకున్నాడు.

దేనికయినా ఎందుకు విచారించాలో అర్థంకాలేదు. ఇదివరకు చాలావాటికి అర్థం తెలీకనే వాటి గురించి విచారించడం మానుకున్నాడు.  మనసులో ఏ అసంతృప్తి వున్నా వినత పెళ్ళికి నవ్వుతూ హాజరయేసరికి చాలామంది విస్తుపోయారు. ముఖ్యంగా ఆరోగ్యం.

అదంతా తెలుసు వరదకి అయినా వినతని వదులుకోవడం ఏ విధంగా తనకి నష్టమో అర్థంకాలేదు. చివరిసారి ఆమెను చూసేవరకూ అప్పుడయినా ప్రపంచంలో చాలామందిలాగా జన్మతః వచ్చిన బలహీనతలన్నిటితో వున్న స్త్రీగానే గుర్తించడం తప్ప. ఏదో అపూర్వమైన శక్తిగా చూడలేకపోయాడు. కాకపోతే ఆ అమాయకత వెయ్యిమందిలో ఆమెకు ప్రత్యేకం.

అందుకని నీలవేణికి మతి చలించిందని డాక్టర్లు చెపితే, తనకి మతి చలించలేదు. ఒక్కటే ఆశ్చర్యం. యిన్నాళ్ళుగా నీలవేణికి ఎందుకు మతి చలించలేదా, అని.

అంతకు మించి 'కారణం ఏమిటా?' అని మనస్సు పరిపరివిధాల పోయింది. ఆమెకు మతి చలించిందన్న వార్త కంటే, అందుకు కారణం మరింత ఆశ్చర్యం కలిగించేదిగా వుండవచ్చు.

ఇదివరకటికంటే మరీ నిశ్శబ్దంగా వుండటం, నిర్లిప్తంగా చూసి అంతలో నిద్రపోవడం, మొదలైన విచిత్రమైన అలవాట్లయ్యాయి నీలవేణికి.

గులాబి మొదట భయపడింది.

ఓ రోజు అర్థరాత్రి మంచానికి చేరబడి కూచున్న నీలవేణిని చూసి మరీ దిమ్మరపోయాడు వరద.

పలకరిస్తే తుళ్ళిపడి "ఎందుకు కదిపారు నన్ను?" అని గుడ్లనీరు కుక్కుకుంది.

"చెప్పడానికే అంత భయపడే ఆలోచనలు, నువ్వొక్కదానివే ఎలా భరిస్తావ్? నాక్కూడా కాస్త పంచు. రవణ గురించేనా?"

దుఃఖాన్నంతా మరిచిపోయి ద్వైదీభావంతో కళ్ళు పెద్దవి చేసి చూసింది. హృదయవేగం, నిస్సహాయతలోని ఔదాసీన్యం ముఖాన్ని ఎర్రబరిచాయి.

"మాటల్తోనే నన్ను చంపేశారు. చచ్చిపోయాను. చచ్చిపోయాను" అని అరిచింది.

నిశ్చేష్టుడయి శిలాప్రతిమలా నిలబడిపోయాడు వరద.

"నేనెవరో నన్ను తెలుసుకునే అవకాశం యివ్వలేదు ఎవరూ. నావల్ల ఎవరికీ ఏ ఉపయోగమో ఆలోచించుకున్నారు. మీరంటే నాకు అసహ్యం" ముఖం కప్పుకు ఏడ్చింది.

నిర్విణ్ణుడయి గది తలుపుకు ఆనుకుని నిలబడితే, ఒక్క క్షణం ముఖం చూసి ఒక్కసారిగా అతన్ని పెనవేసుకుని ఉప్పెనలా వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక ఏడ్చేసింది.

ఆ ఒక్క రాత్రే బాగా జ్ఞాపకం. మర్నాటి ఉదయం కాఫీ తెస్తూ హఠాత్తుగా 'ఫిట్' వచ్చి పడిపోయింది. నిద్రపోదు, కాళ్ళూ చేతులూ కొట్టుకోదు, కేకలు వెయ్యదు, ఏదో దూరపు వస్తువు పైన దృష్టి నిలిపేస్తుంది. రెప్ప పడదు, రాయిలా నిశ్చలంగా వుండిపోతుంది.

ఆసుపత్రికి తీసుకువెళితే మర్నాటికి గానీ తెలివిరాలేదు.

అప్పటికే బాగా పాలిపోయింది. శరీరంలోని రక్తమంతా నీరయినట్లు, ఆ కొద్ది వ్యవధిలో జీవితమంతా పూర్తిగా మారిపోయినట్లనిపించింది.

నిశ్చలంగా కూచున్న వరదని చూసి నవ్వింది.

దగ్గరికి వచ్చి "ఒంట్లో ఎలా వుంది?" అన్నాడు.

"రాత్రి చచ్చిపోతే బావుణ్ణనిపించింది. ఇప్పుడు ఫరవాలేదు."

వింతగా ఆమెవేపు చూశాడు. మళ్ళీ ఏడుస్తోంది. "నాకు పిచ్చెక్కింది" అంది.

నిజంగానే పిచ్చెక్కిందన్నారు డాక్టర్లు. ఒక తరంగంలాగా వుండుండి ఏదో మైకం వస్తోంది. అంతలో తగ్గుతుంది. అప్పటి ఆమె చర్యలకు అర్థం వుండదు. అది రోగం, వింత ప్రకృతి.

కానీ నీలవేణి బాగానే వుంది. అన్నీ జరిగిపోయాక యిది జీవితంలో మరో కొత్త అధ్యాయంలాగ. వరదతో మాట్లాడుతూ, గులాబితో కబుర్లు చెప్తూ ఆసుపత్రిలోనే గడిపింది.

డాక్టర్లు తమ పరీక్షలో పొరపాటు జరిగిందేమోనని నాలిక కరుచుకున్నారు.

స్త్రీత్వపు మానసిక పరిమితుల్ని కొలవలేక జ్ఞానం తెల్లబోయింది.

నిజంగా పిచ్చికాదేమో ! మర్నాడు నీలవేణిని రిలీవ్ చేశారు.

బయటికి నవ్వుతూ కనిపిస్తోందేకానీ అంతకంతకూ వేరులా అయిపోతుండడం గమనిస్తూనే వున్నాడు వరద.

నీలవేణిని చూస్తే జాలేస్తోంది.

పదిరోజుల తరువాత ఉన్నట్లుండి వరద పలకరిస్తే విరుచుకుపడింది. నివ్వెరపోయి ఆమె వేపు చూస్తూ కూచున్నాడు. ఉన్నట్లుండి హఠాత్తుగా అతని చేతుల్లో పడింది. మళ్ళీ 'ఫిట్' వచ్చింది. ఈసారి మర్నాటి సాయంకాలం వరకూ తెలివిరాలేదు. లేచాక పదిరోజులు భోజనం లేనంత నీరసంతో కళ్ళు రెపరెపలాడించింది. వరదని చూసి కూడా పోలికపట్టలేనంతగా కళ్ళు నిశ్చలమయ్యాయి. భయపడ్డాడు.

కొన్నాళ్ళవరకూ ఆసుపత్రిలో ఉండడమే మంచిదన్నారు డాక్టర్లు. వాళ్ళకే యిలాంటి కేసు కొత్త. అయిదుమంది ప్రత్యేకమైన నమూనాగా రోగాన్ని గుర్తించడానికి వస్తూపోయేవారు. ఆసుపత్రిలో చిన్న వింత వస్తువులాగా తయారయింది నీలవేణి. అంతా కలిసి చివరికి రోగానికి పేరు పెట్టారు "మెంటల్ ఎపిలప్సీ"

ఈసారి మరీ పూర్తిగా స్మృతిపోయేలా ఫిట్స్ రాకపోయినా అప్పుడప్పుడు మగత కమ్మి గంటల తరబడి వంటిమీద స్పృహలేకుండా వుండిపోయేది నీలవేణి.

గులాబి భయపడిపోయింది.

పిచ్చిగా ప్రతీదానికి నవ్వడం, ఏదో బాధనీ, దిగులునీ దాచుకుందుకు ప్రయయ్త్నం నీలవేణి నవ్వులో గుర్తుపట్టేశాడు వరద.

ఓ రోజు స్థిమితంగా కూచుంటే నవ్వుతూ అంది 'వినతని మీరు చేసుకుంటే బావుండేది' అని.

నిర్ఘాంతపోయాడు వరద.

"ఇప్పుడెందుకు గుర్తుకొచ్చింది?"

"ఆమె పెళ్ళినాడు చూసి అనుకున్నాను. మనిషిలో అల్లరిని చూసేనా భయపడ్డారు?"

ముఖాన్ని చూసి మనస్సు గుర్తిస్తుందేమోనని భయపడ్డాడు.

"మీరు మంచివారేగా అని వినత అడిగిందారోజు"

"ఏం చెప్పావు?"

"ఏమీ చెప్పలేదు. మీ గురించి ఆ రోజే మొదటిసారి ఆలోచించాను. నన్ను చెట్టు దగ్గర పలకరించారు. ఏడుపొచ్చింది. నాకెవరూ లేనట్లనిపించింది"

ఉత్తరం వచ్చిందని తీసుకొచ్చింది గులాబి.

నీలవేణికి తీవ్రంగా వుందని తెలిసి ఆతృతతో ఉత్తరం వ్రాసింది ఆరోగ్యం.

"పుంగనూరులో విశ్వేశ్వరం వున్నాడు. ఉత్తరం వ్రాస్తే వస్తారు. అవసరానికి మనిషి సాయం వుంటాడు. నీలవేణికి ఎలా వున్నదీ తెలియజేస్తూండు" మూడే వాక్యాలు వ్రాసింది. క్రింద విశ్వేశ్వరం అడ్రసు వుంది.

ఉత్తరం వినగానే నీలవేణి భయంతో, వణుకుతూ మెలికలు తిరిగింది. ఏదో ప్రమాదానికి గురయినట్లు అటూ యిటూ మంచం మీద దొర్లింది.

"విశ్వేశ్వరాన్ని రమ్మనేదా?" అంటే కళ్ళయినా ఎత్తకుండా "మీ యిష్టం" అంది.

ఆ రాత్రే మూడోసారి ఫిట్ వచ్చింది.

ఉత్తరాన్ని చూసుకుని మూడోనాడు వచ్చాడు విశ్వేశ్వరం.

విశ్వేశ్వరం గురించి విన్నప్పటి నుంచీ విచిత్రంగా మారిపోయింది నీలవేణి. చూడడానికే భయపడుతున్నట్లు, ఏదో ప్రళయాన్ని ఎదుర్కోబోతున్నట్లూ అతని మాట విన్నప్పుడల్లా వణికేది.

మొత్తం మీద మూడోసారి ఫిట్ వచ్చినప్పుడు యిదివరకంత బాగా తేరుకోలేకపోయింది. రోగానికి సహజమైన 'మగత' కాస్త కళ్ళని అంటిపెట్టుకుని నిలిచిపోయింది. మాటల్లో మందకొండితనం వ్యాపించింది. ఇది వరకులాగా ఎక్కువ ఆలోచించలేకపోయేది.

ఓనాడు సాయంకాలం ఎనిమిది గంటలకి విశ్వేశ్వరం, వచ్చేసరికి నీలవేణి దగ్గర వున్నాడు వరదరాజులు.

గులాబి వచ్చి చెప్పింది.

నీలవేణి మంచానికి చేరబడి వాలుగా కూచుంది.

"విశ్వేశ్వరం వచ్చాడట. చూస్తావా?" అంటే ఒక్కసారి తుళ్ళిపడింది. వెర్రిగా వరదరాజులు ముఖం చూసింది. అంతలో భయంతో ముఖం కప్పుకుంది.

"వద్దు. ఆయన్ని చూడన్నేను" అంది.

ఇద్దరూ నిర్ఘాంతపోయారు.

"నేను వచ్చేవరకూ గదిలో వుండమను విశ్వేశ్వరాన్ని" అని మెల్లిగా చెప్పాడు.

ఆనాటి రాత్రంతా స్థిమితంగా వుండలేకపోయింది.

ఉదయం వరద వచ్చేసరికి తలగడలో ముఖం దాచుకుని ఏడుస్తోంది.

వచ్చి "విశ్వేశ్వరం వెళ్ళిపోయాడు" అన్నాడు.

తెల్లబోతూ చూసింది. "అదేం?"

"ఏదో పని వుందట. ఉత్తరం వ్రాశానని వచ్చాడు. ఉదయమే రైలుకి పంపించి వచ్చాను"

వెల్లకిలా పడుకుని నీలిదుప్పటి మెడవరకూ లాక్కుంది.

ఆ సాయంకాలమే మళ్ళీ టెంపరేచరు ఎక్కువయిందంటే డాక్టర్లకే భయం కలిగించింది.

ఈ పరిస్థితుల్లో మరో అవాంఛిత సంఘటన జరిగిపోయింది.

గోవిందాచారి "ప్రజ" నాలుగవ సంచిక బజారు షాపుల్లో వేలాడింది. అటుపడి, యిటుపడి పుస్తకానికి అట్టతొడిగి బజారుకు తెప్పించగలిగాడు వరద. ఏదో ఆఫీసుకు వచ్చి వెళ్తున్నా దృష్టంతా దాదాపు యిటే వుంచుకునేవాడు. అదీగాక అతని కథలు ఆరింటినీ రెండు పత్రికల్లో మూడు చొప్పున సరిచేసి ప్రచురించి ఓ ప్రత్యేక ప్రకటన చేశాడు గోవిందాచారి. అప్పటికవే డబ్బు యివ్వనక్కర్లేని రచనలు అందుబాటులోకి వచ్చాయి.

అయితే అంత కొత్తదనం, వింతపోకడ, కథల్లో అంత తీవి చూసి ప్రజలకి అజీర్ణం చేసింది. మార్పుని అంత సులువుగా ఆకళింపుకు తెచ్చుకోవడం ఎవరికీ యింకా సాధ్యం కాలేదు. ఎక్కువ కాంతి కళ్ళు చెదిరినట్లు, ఎక్కువ శబ్దం చెవుల్ని బ్రద్దలు చేసినట్లు, మరీ పెద్ద సత్యం వారి గుండెల్ని బ్రద్దలు చేసింది. కథలు చదివి "ఇలాంటివి సాధ్యమా?" అని ఆలోచించేవారేగానీ, ఎంతవరకూ సాధ్యమో ఎవరూ యోచించలేరు.

వరద వింతపోకడలూ, ఏవో మాటలకు దొరకని భావాలూ, కొత్త తీరును వాళ్ళు ఒక్కసారిగా విశ్వసించలేకపోయారు.

ఓరోజు అభ్యుదయ రచయితలు పదిమంది గోవిందాచారికి బజారులో తారసపడి "ఆ రచయితనన్నా వదులుకో, లేదా పత్రికన్నా ఎత్తెయ్. మా కలాలు చాలా బలం. మర్నాటి దుమ్ము లేచిపోతుంది" అని భయపెట్టారు.

గోవిందాచారి చాలా భయపడిపోయాడు.

తర్వాత సంచిక పని ప్రారంభించాలంటే జేబులో రెండువందలూ, మరికాస్త చిల్లరా కనిపించేసరికి గుండె ఝల్లుమంది.

సంచిక యిహ వస్తుందన్న నమ్మకం లేదు. బాకీ తీర్చనిదే పేపరు మిషను ఎక్కదన్నాడు ప్రెస్సు యజమాని. మధ్యలో దుస్స్వప్నంలాగ ఈ కథల రభస ఒకటి వచ్చిపడింది.

గాభరాపడి, నాలుగురోజులు ఒంటరిగా ఆలోచించి, ఓరోజు ఎవరికీ కనిపించకుండా స్టేషన్‌కు బయలుదేరి కలకత్తాకు పోయే రైలు ఎక్కేశాడు గోవిందాచారి.

వరదస్థితి యిప్పుడిక మరీ గడ్డు సమస్య అయిపోయింది. నీలవేణి రోగం రాను రాను మరీ విషమంగా తయారవుతోంది. రోజులు గడుస్తున్నకొద్దీ ఎంత డబ్బయినా చాలడంలేదు. ఇక మర్నాటికి అంతా సరి అనగా, విశ్వేశ్వరం ఏభైతో వచ్చాడు. తీసుకోక తప్పలేదు.

అప్పటికీ, యిప్పటికీ చాలా మార్పు కనిపించింది విశ్వేశ్వరంలో. వయస్సు మళ్ళిన లక్షణాలు ముఖంలో, మాటల్లో తోచాయి.

"ఏం చేస్తున్నా?"వంటే

"ఇంకా నాకే తెలీదు" అన్నాడు. కాస్సేపాగి "ఇప్పటివరకూ బడిపంతులు" అన్నాడు.

మరి పదిరోజులాగి, చేతిలో ఏమీ మిగలకపోతే తన దగ్గరున్న రచనలన్నీ కట్టగట్టి కాశీపతికి పంపుతూ వుత్తరం వ్రాశాడు.

"అవసరానికి డబ్బుకావాలి. ఈ రచనలన్నీ మీ దగ్గరే ఉంచుకోండి. బాగుంటే వాటిని తీసుకోండి. లేకపోతే అప్పుగా యివ్వండి" అని వ్రాశాడు.

జీవితంలో మొదటిసారి కోరిన అప్పు యిది. నాలుగురోజులకి 200రూపాయలు మనియార్డరు వస్తే పుచ్చుకుంటూ నవ్వుకున్నాడు.

మనిషికి ఆదర్శం వుండకూడదు. ఆనందం వుండకూడదు. ఆశ వుండకూడదు. ఉంటే పిచ్చెక్కుతుంది అనుకున్నాడు.

అప్పటికప్పుడే మూడు రోజులనుంచీ నిశ్శబ్దంగా అలవాటు చేసుకుంది నీలవేణి. అంతకన్నా ఆమె భావాన్ని వ్యక్తం చేయగల భాషలేదు. కళ్ళల్లో రక్తం చారలు కట్టి బెరుకుగా, దైన్యంతో రెపరెపలాడుతూంటే చూసి వణికాడు వరదరాజులు. ఆమెకప్పట్లో ఎలాంటి అనునయం కావాలో, ఏం చేస్తే ఆమెకు స్థాయి కలిగించగలడో తెలీక మనస్సులో వేయి విధాల ఘర్షణ పడ్డాడు.

ఎప్పుడయినా శక్తి వచ్చి కనురెప్పలు లేపగలిగితే, వరద కోసం గదంతా వెదుక్కునేవి ఆమె కళ్ళు.

ఎంత ప్రయత్నించినా అన్ని రోజుల అలసటనీ, రోగితోపాటు రాత్రింబవళ్ళు కూర్చోవడానికే తట్టుకోలేక మంచం పక్క కూర్చుని కునికిపాటు పడితే చూసి నవ్వేది.

ఆ రాత్రి రెండుఝాములయినా ఆమెకు నిద్ర రాకపోయేసరికి వరదరాజులు భయపడ్డాడు. అనవసరంగా రాత్రి సమయాల్లో, రోగిని కదిలించవద్దని మరీ మరీ చెప్పివెళ్ళాడు డాక్టరు. నర్సు నిద్రను జయించడానికి ప్రయత్నిస్తోంది. గుమ్మం దాటి మెల్లిగా హాలు మధ్యకు వచ్చాడు. ఫైళ్ళన్నీ వత్తుగా పెట్టుకుని నిద్రపోతోంది నర్సు.

"సిస్టర్" అన్నాడు మాటలు కూడదీసుకుని

ఉలిక్కిపడి లేచింది.

"మీరా! యిలా వచ్చారేం?" అందామె నిర్ఘాంతపోయి,

జవాబు వెంటనే చెప్పడం తెలీక కూచున్నాడు. గదంతా మరీ నిశ్శబ్దంగా వుంటే భయమేసింది. గోడకున్న గడియారం ఆగిపోయింది.

"ఇప్పుడు యెంతయి వుంటుందంటారు?"

వాచీని చూసి చెప్పింది "పన్నెండు"

గోడవేపు వేలు చూపిస్తూ అన్నాడు "గడియారం ఆగిపోయింది. సరిచేయండి. ఎవరన్నా చచ్చిపోతే టైము తెలీదు" నవ్వాడు.

అతని వేపు దిమ్మెరపోయి చూస్తూ బల్లవేసుకుని గడియారం సరిచేస్తోంది.

"సిస్టర్" 'సుఖం' అంటే ఏమిటో మీకు తెల్సుకదూ"

గడియారం కొట్టుకోవడం ప్రారంభించింది, లోలకం ఆశ నిరాశల మధ్య మనస్సులాగా ఊగిసలాడుతోంది. నర్సు కూచున్నాక మళ్ళీ అడిగాడు.

"సుఖం అంటే ఏమిటో మీకు తెలుసుకదూ?"

అంతలో పక్కున నవ్వేసింది.

"నవ్వకండి. ఎంత సుఖంగా నిద్రపోయారో మీ ముఖం చూస్తే అర్థమవుతుంది."

"సారీ. వారం రోజుల్నుంచీ నైట్ డ్యూటీ, నిద్ర ఆపుకోలేకపోయాను"

"మీరు చాలా అదృష్టవంతులు, జీవితమంతా నిద్రపోనివాళ్ళని చూశారా ఎప్పుడన్నా?"

"విచిత్రంగా మాట్లాడతారే మీరు"

"జవాబు చెప్పండి"

"చూడలేదు నేను"

"కాదు చూశారు. ఆ పేషెంటుని గమనించండి"

పక్కగదిలో మంచం మీద నీలవేణిని చూసి నివ్వెరపోయింది నర్సు. ఇంకా అలాగ నిశ్చలంగా చూస్తూనేవుంది ఆమె.

"అయ్యో ఆవిణ్ణి చూడలేదు. స్లీపింగ్ డోస్ ఇస్తాను" అని లేవబోతే చెయ్యిపుచ్చుకుని ఆపాడు ఆమెని.

"ఎందుకూ అది"

"అదేమిటి అలా అంటారు? సుఖంగా నిద్రపట్టడానికి"

"అదొక్కటే ఆమెకు లేనిది" అన్నాడు.

జాలిపడింది నర్సు, భార్యమీద అంతగా ప్రేమను వ్యక్తం చేసే వ్యక్తిని ముఖ్యంగా ప్రేమకంటే జాలి చూపగల వ్యక్తిని యింతవరకూ చూడలేదామె.

కూచుని "విచారపడకండి. తప్పకుండా నెలరోజుల్లో ఆవిడ కోలుకుంటారు" అంది.

ఆమె ముఖం చూసి ఫక్కున నవ్వేశాడు.

"బ్రతకడం అంత సుళువా సిస్టర్! నాకు తెలీదే" అన్నాడు. ఆమె చిన్నబుచ్చుకుంది. "సుఖంగా ఉండగలదని తోస్తే వెళ్ళి మందు యిచ్చి రండి" అన్నాడు. కూర్చున్నచోటునుంచి కదల్లేదు నర్సు.

"ఈ రాత్రి మాత్రం ఒక్క ఉపకారం చేసి పెట్టండి నాకు. ఆ పేషెంటుకి ఏం కావాలో నాకు తెలుసు. నన్ను ఎటెండ్ కానివ్వండి"

"క్షమించండి, అదొక్కటే నేను చెయ్యలేను, రెండు మూడు రోజులుగా ఆమెకు మరీ బాగుండడంలేదు. రాత్రి డిస్‌చార్జ్ చేస్తే రేపు ఆపరేషన్ సరిగా కాదు"

మళ్ళీ నవ్వాడు "రేపు ఆపరేషన్ వేళవరకూ బ్రతికివుండాలి కద"

"మీరు మరీ అలా వేదాంతం చెప్పకూడదు" అంది విసుగుతో.

"ఈ ఒక్క సహాయం చేయండి సిస్టర్. నన్ను చూస్తే కాస్త స్థిమిత పడుతుంది ప్లీజ్" అన్నాడు.

ఆమె యింకేమీ చెయ్యలేకపోయింది.

కాస్సేపాగి "మీ ఇష్టం వెళ్ళిరండి, హెచ్చు మాట్లాడిస్తే ఆమెను మీరే పాడుచేసిన వారౌతారు" అని లేచాడు.

నిద్రరాక అటు తిరగబోతున్నదల్లా నీలవేణి వరదని చూడగానే తెల్లబోయి "వచ్చారా?" అంది.

"నువ్వు నిద్రపోకపోతే నాకు భయం, ఎవరి గురించి ఆలోచిస్తున్నావు చెప్పుపోనీ" అన్నాడు మంచం పక్కనే కూచుని.

పరీక్షగా అతని కళ్ళవేపు చూసింది, అంతలో నవ్వేసింది.

ఉన్నట్లుండి వరదరాజులు అడిగాడు

"విశ్వేశ్వరాన్ని చూస్తావా?"

తుళ్ళిపడింది నీలవేణి.

"ఇంకా వెళ్ళిపోలేదా?" అంది కళ్ళు నీరసంగా మూసుకుని.

నవ్వాడు "యెక్కడికి పోతాడు వాడు? నువ్వు ఎవరికి చెందుతావో చెప్పమంటే వాడిపేరే చెప్తారు ఎవరన్నా. నువ్వంటే వాడికి ప్రేమకాదు. జాలేమోననిపిస్తోంది" వాడి కళ్ళు చూస్తే

ఎంతోసేపు ఆలోచించింది.

"ఏం చెప్పారాయన నాగురించి?"

"ఏం చెప్తాడు? యెలావుందని అడుగుతాడు. తోటంతా తిరుగుతాడు. నువ్వు పడుకుంటే కిటికీ దగ్గరికి నిశ్శబ్దంగా వచ్చి నిలబడతాడు" ఇంకా ఏమో చెప్పబోఏ ఆమె కళ్ళలో నీళ్ళు అడ్డొచ్చాయి.

"ఇంకా ఏడుస్తున్నావా నువ్వు. నువ్వే ఏడవకూడదు. నిన్ను తెలిసినవాళ్ళంతా నీ గురించి ఏడ్చేట్లు చేయాలి" కన్నీళ్ళు తుడవబోతే చెయ్యిపట్టుకుని గుండె మీద వుంచుకుంది.

"నిజం చెప్పండి, నన్నెప్పుడన్నా అసహ్యించుకున్నారా మీరు?"

నీలవేణి దగ్గర్నుంచి ఎప్పుడూ ఊహించని ప్రశ్న విని దిమ్మరపోయాడు. వినతలాగా అంతకంటే అమాయకంగా అడిగిన ఆమె ముఖం చూశాక అసలు నీలవేని తెలిసి వచ్చింది. అంత పిరికి మనిషి అనుకోలేదు. ఉన్నదల్లా నిశ్శబ్దం. బలహీనతల్ని దాచుకోగల నిశ్శబ్దం - నవ్వొచ్చింది.

**విశ్వేశ్వరం** నీలవేణిని తనదగ్గర వదిలిపెట్టిపోయిన రోజే ఈ ప్రశ్న అడిగివుంటే ఫలితాలు మరోకలాగా వుండేవి.

నీరసంగా సొమ్మసిల్లినట్లున్న కళ్ళకేసి చూసి నిశ్చలంగా వుండిపోయాడు. జవాబు కోసం ఎదురు చూస్తోందని గ్రహించాడు. నుదుటిమీద చెయ్యివేస్తే కాలుతోంది. ఒక్కసారి వంగి వణికే ఆమె పెదాల్ని ముద్దుపెట్టుకున్నాడు.

గడియారం రెండుగంటలు కొట్టింది.

స్టాఫ్ నర్సు ఆవులిస్తోంది.

మోచేతులమీద ఆనుకుని మంచం మీదకి వంగి "నీ మీద అసహ్యమెందుకు నాకు, నామీదే నీకు కలగాల్సింది" అన్నాడు.

దుఃఖం ఆగడంలేదు నీలవేణికి. వరదరాజులులోని సౌహార్దం మరీ భరించరానిదయి గుండెల్ని కోస్తోంది. కళ్ళనీళ్ళు తిరిగితే కిటికీవేపు తలతిప్పింది. వెన్నెల కన్నులెత్తినచోట అమృతం వర్షిస్తున్నట్లుంది.

ఏదో కలలో చిత్రంలాగా తోటంతా కనిపిస్తోంది.

త్రాణ నశించిన మూగ హృదయం బాధతో, తీరని కోరికతో జివ్వుమంది. ఒక్కసారి పాత ఉత్సాహం శరీరాన్ని గుంజినట్లనిపించింది. ఏదో చిన్నతనపు కోర్కె మనస్సును పెకలించింది. వెన్నెట్లో వరద పక్కన కూచుంటే బావుండుననిపించింది.

చటుక్కున వరదవేపు ముఖం తిప్పి అంది.

"తోటలోకిపోయి కూచుందాం"

విస్తుపోయాడతను. ఓ క్షణం ఆగి "సిస్టర్‌ను అడిగివస్తానుండు" అని లేచాడు.

"అయితే వద్దు"

చివరి కోరికలు ఏవో నీడలులాగా, బలహీనంగా, మనస్సును పట్టుకు పీకుతూ ప్రతీ చిన్న అనుభూతికీ కదిలి ఘర్షణ పడుతున్నాయి.

తృప్తికోసం కోరిక పెనిగి నిరాశలో నిద్రపోయింది.

ఆమెను చూసి జాలేసింది వరదకి - ప్రపంచంలో తను ఎవరికి చెందుతుందో తెలీదు - ఇప్పటికీను. ఏదో వింత చిత్రంలాగ, గజిబిజి అయిన అర్థంకాని ప్రళయం అది - కోరికలూ, ఆశయాలు కలిగిన వ్యక్తి  వర్షం పడ్డ తరువాత నిశ్చలమయిన నీటి తెట్టుకింద నిశ్చలం. ఆమె మనస్సు నిర్లిప్తత జీవితమంతా కమ్ముకుని, సంఘంతో వ్యక్తుల్లో విధించిన శిక్ష యీ స్థితి. చేసిన పాపం - నిశ్శబ్దం. నేర్చుకున్న పాఠం చిరునవ్వు. తర్వాత? 'తర్వాత' అక్కర్లేదు నీలవేణికి.

"నీలవేణి చచ్చిపోయినా బాధలేదు" మొదటిసారిగా అనుకున్నాడు వరద.

అనుకుని "సిస్టర్‌ని అడగనక్కరలేదు. వెళ్దాం పద" అని చెయ్యిపట్టుకు ఆమెను లేవదీయబోయాడు.

నీలవేణి లేవబోతే నరాలన్నీ తిరుగుబాటు చేస్తున్నాయి. ఒంట్లో రక్తమంతా తలలోనే గుడుకట్టుకున్నట్లు యింకేమీ చేయకుండా ముద్దలా పడివుంటే బావుణ్ణనిపించేట్లు వుంది.

కానీ మళ్ళీ ఆ క్షణం గడపడం మరొకసారి సాధ్యంకాదేమోనన్న ఆలోచన శరీరాన్ని లేవదీస్తోంది.

పూర్తిగా వరదని అనుకుని లేచింది నీలవేణి.

శరీరం తూలిపోతుందేమోనని భయం వేసింది.

ఇన్నాళ్ళ తర్వాత మానసికంగా కూడా నీలవేణి దగ్గరపడినట్లు శరీరానికి గట్టిగా హత్తుకుని నడిచాడు వరద.

స్టాఫ్‌నర్సు లేస్తుందేమోనని భయం వేసింది.

నీలవేణి శ్వాస వేడిగా మెడని కాలుస్తోంది. చెక్కిళ్ళు చెంపల్ని తాకుతూ ఒరిపిడి పెట్టున్నాయి.

"ఎంత మారిపోయావు నువ్వు?" అని గొణిగాడు ఆమె చెవి దగ్గర.

నీలవేణి నీరసంతో వివశమయి, తనదంతా అతనికిచ్చేసుకుని అతనిలో కలిసి పోయింది.

గేటు చప్పుడయితే గుండె ఝుళ్ళుమంది వరదకి. అయినా స్టాఫ్ నర్సు లేవలేదు. గడియారం శబ్దం వరస తప్పకుండా వినిపిస్తోంది.

తలుపు తెరిస్తే తోటలో వెన్నెల కళ్ళు చెదిరించింది.

మెట్లమీద కూచున్న వ్యక్తిని యిద్దరూ చూసి నిర్ఘాంతపోయారు.

మనిషిని ఒక్కసారి గుర్తుపట్టి వరద ఆశ్చర్యంతో గొణిగాడు. "విశ్వేశ్వరం" సిగ్గుతో, భయంతో కుంచించుకుపోయాడు విశ్వేశ్వరం. ఒక్కసారయినా తలెత్తి నీలవేణిని చూడలేదు.

"అవును నేనే, పువ్వులు తీసుకొచ్చాను" అని వరదకి అందించాడు. నీలవేణి ఏమన్నా మాట్లాడుతుందా అని నిశ్శబ్ధంగా ఎదురు చూశాడు వరదరాజులు.

కానీ ఏమీ మాట్లాడలేదు నీలవేణి. తన చేతుల్లో నీలవేణి శరీరం యావత్తూ వణికింది.

"బావున్నారా?" అంది నీలవేణి తలెత్తకుండానే.

విశ్వేశ్వరం జవాబు అంత నిశ్శబ్ధం మధ్య వినిపించలేదు.

నీరసంగా నీలవేణి అతని భుజం మీద తల ఆనించడం కనిపెట్టి "అలా నిల్చోడం బావోలేదు. నీలవేణిని తీసుకువెళ్ళు" అనేసి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు విశ్వేశ్వరం.

నీలవేణి నివ్వెరపోయింది.

వెన్నెల్లో కూర్చోవాలన్న చివరి ఉత్సాహంకూడా అంతటితో ముగిసింది. వరద భుజానికి అనుకుని వాలుగా కూచుంది.

ఎంతకీ ఆమె మాట్లాడకపోయేసరికి భయపడి "ఇక్కడుంటాడనుకోలేదు వాడు. మరిచేపోయాను ఆ విషయం" అన్నాడు.

"ఏ విషయం"

"నువ్వు పువ్వులు కావాలన్నావు"

పొట్లాం విడదీసి పువ్వులన్నిటినీ బెంచీ చుట్టు జల్లేసింది. సగం తడిసిన పువ్వులు వెన్నెల్లో ముత్యాల్లా మెరుస్తున్నాయి. నైట్‌క్వీన్‌తో, మల్లెల వాసన పోటీ పడుతోంది.

"విశ్వేశ్వరం అంటే ఎందుకంత కోపం?"

ఈసారి తుళ్ళిపడలేదు నీలవేణి. కళ్ళలో వెలుగు పడుతోందని అతని చేతుల్ని చెంపమీద అనించుకుంది.

"కోపం కాదు.. ఆయనంటే నాకు చాలా అభిమానం. అందుకనే దూరంగా వచ్చేశాను" అంది.

ఆ వాక్యానికి అర్థమే తెలియలేదు. ఏదో అడగాలనుకున్నాడు. కానీ ఎలా అడగాలో తెలీక వూరుకున్నాడు.

మరొక విషయమేదో అడగాలని మనస్సు తహతహ పడుతోంది. వాళ్ళిద్దరికీ ఆ రాత్రే చివరిదయినట్లూ ఇక యీ అవకాశం తప్పిస్తే ఆమెను తెలుసుకోవడానికి మరి సమయమే చిక్కినట్లూ మనస్సు ఉరకలు వేసింది.

పడమటి ఆకాశం మీద చంద్రుడి చుట్టూ ఎరుపు, పుండు చుట్టు రక్తంలా కూడింది.

చల్లగాలి చెట్లని కదిలిస్తోంది - నిశ్శబ్దాన్ని భరించలేక, "పోదామా లోపలికి?" అన్నాడు. అప్పటికి ఎంతో సేపయింది నీలవేణి మాట్లాడడం మానేసి. జవాబు యివ్వకపోతే తలమీద చెయ్యివేశాడు. బరువుగా ఊపిరి పీలుస్తోంది. తల తడివితే మంచు చేతికి చల్లగా తగిలింది. కాళ్ళు దగ్గరికి ముడుచుకుని వొళ్ళో తల ఆనించుకుని నిద్రపోయింది నీలవేణి.

విశ్వేశ్వరం ఉంటే బావుణ్ణనుకున్నాడు.

సుమారు నాలుగయి వుంటుంది. నైట్‌డ్యూటికి వచ్చిన డాక్టరు మాటలు హాల్లో వినిపించి భయపడ్డాడు వరద.

స్టాఫ్ నర్సు ఆందోళనతో ఏదో మాట్లాడుతోంది.

మరోక్షణంలో తోట వేపు దీపం వెలిగింది. వీళ్ళద్దరినీ చూసి నర్సు దిమ్మరపోయి "డాక్టర్, పేషెంటు యిక్కడ వుంది" అంది.

డాక్టరు ముఖంలో చికాకు స్ఫుటంగా కనిపిస్తోంది. దగ్గరికి వచ్చి విసుగుగా అడిగాడు డాక్టరు "చెప్పండి, రోగి బాగుపడడం మీకిష్టం లేదా?

"ఇష్టంలేక కాదు డాక్టర్. ఆమె యిక బాగుపడదు" అన్నాడు వరద స్థిమితంగా.

నీలవేణి బరువుగా ఊపిరి పీల్చి యిటు తిరిగి నిద్రపోయింది. మర్నాడు సరిగా మధ్యాహ్నానికి, డాక్టర్లంతా యింటికి వెళ్ళిపోయాక ఫిట్ వచ్చింది నీలవేణికి. అప్పుడే భోజనానికి వెళ్ళిన వరదకి కబురుంపితే భయపడి పరిగెత్తుకు వచ్చాడు. స్ట్రెచర్‌లో ఉంచి నీలవేణిని అప్పుడే ఆపరేషన్ థియేటర్ వేపు తీసుకు వెళ్తున్నారు. ఇద్దరు డాక్టర్లు కారుమీద వచ్చారు.

"మీరేనా పేషెంట్ గార్డియను?" అన్నాడొకాయన.

"అవును"

"రాత్రి ఆమెకు ఓపెన్ ఎయిర్‌లో వదిలేయడం మరీ ప్రమాదించింది. ఆపరేషన్‌లో ఏ విషయమన్నా తేలవచ్చు. అయితే రోగి క్షేమం గురించి ఏ హామీ యివ్వలేము. ఇది ప్రయత్నం. హామీ మాత్రం కాదు - గుర్తుంచుకోండి" అన్నాడు డాక్టరు.

ఫలితం తెలిసినప్పటి నిశ్చలత అతని ముఖంలో చూస్తూ వణికాడు వరదరాజులు "పేషెంట్ ఏమవుతుంది డాక్టర్"

నవ్వుతూ స్థిమితంగా భుజం తట్టాడు డాక్టరు. ఆపరేషన్ రూం యివతల బెంచీమీద చదికిలబడ్డాడు వరద. అవసరమేమోనని విశ్వేశ్వరం కాఫీ తీసుకొచ్చాడు. ఏం ఆలోచించడానికీ వరద మనసు జడమైంది. ఎవర్నీ ఏమీ ప్రశ్నించకుండా, కనీసం ఆతృతన్నా ప్రకటించకుండా, నీలవేణి తనది కాదన్నట్లు హాల్లో బల్లమీద కూచున్నాడు. పన్నెండు గంటలకి స్టాఫ్ నర్సు పలకరించింది.

"ఎగ్రిమెంటు మీద సంతకం చెయ్యాలి సార్"

తేరుకున్నాడు వరద. అర్థం తెలీక వింతగా చూశాడు. "ఏమయింది?" అన్నాడు.

"గుండె బీట్ వదులుతోంది పేషెంట్‌కి. కాళ్ళు పట్లు తప్పినట్లున్నాయి. మరొక్క ప్రయత్నం మాత్రం మిగిలింది."

ఏమిటన్నాడు.

"ఆక్సిజన్ టెస్టు జరపాలి"

వరదరాజులు నిర్జీవంగా చూస్తూ కూర్చోవడం గమనించి, "జరపండి" అన్నాడు విశ్వేశ్వరం మాటలు కూడదీసుకుని.

"పేషెంట్ గార్డియన్, బాధ్యతగల వ్యక్తి ఎగ్రిమెంటు మీద సంతకం చేయాలి."

"ఎందుకూ?"

"ఇది ప్రయత్నం మాత్రం, పేషెంట్ బ్రతకడం విషయమై హామీ కాదు. అందుకని గార్డియన్ యిష్టపడితేనేగాని చెయ్యడానికి వీలుపడదు."

వరద తేరుకుని "చెయ్యండి" అన్నాడు. లేచి అగ్రిమెంటు మీద సంతకం చేస్తుంటే డాక్టరు అన్నాడు. "మీరు చాలా దురదృష్టవంతులు సార్ - రాత్రి ఆమెను ఓపెన్ ఎయిర్‌లో ఉంచకుండావుంటే"

"రాత్రి ఒక్కటే సుఖంగా గడిచినరోజు డాక్టర్. ఇహ తర్వాత ఏం జరిగినా నాకేం భయంలేదు. మీ ప్రయత్నం కానివ్వండి"

డాక్టర్ ఆశ్చర్యపోయాడు.

సాయంకాలం ఆరుగంటలకి డాక్టర్ మళ్ళీ వరదని పలకరించాడు.

"నీరసం, అలసట శరీరాన్ని మరీ పాడుచేసింది సార్. రోగికి ఒక్కసారి తెలివి వస్తే అదృష్టమే" అనేసి వెళ్ళిపోయాడు.

నవ్వుకున్నాడు వరద.

తెలివొస్తే ఒక్కసారి ఏం మాట్లాడేది? అనుకున్నాడు.

ఉదయం భోజనం చెయ్యలేదని గుర్తుచేస్తూ కాఫీ తెచ్చి యిచ్చాడు విశ్వేశ్వరం. గులాబికి మాత్రం లోపల పేషెంటు దగ్గర ఉండటానికి అనుమతి యిచ్చారు.

స్టాఫ్ అంతా డ్యూటీ మారాక, గతరాత్రి వున్న నర్సు కనిపించింది. పేషెంట్‌ని చూసి వచ్చి "సారీ సార్ - చేతులారా కేసు పాడుచేసుకున్నారు" అంది.

నవ్వాడు వరదరాజులు "మరొక్కసారి ఆమెకు తెలివి వస్తుందని డాక్టర్ చెప్పారు సిస్టర్. అందుకే కూచున్నాను. ఈసారి తెలివొస్తే మీరు నిన్న చేసిన సహాయం ఆమెకు చెప్తాను."

ఓసారి మళ్ళీ స్పెషల్ వార్డులోకి వెళ్ళివచ్చి "మీరు పేషెంట్ దగ్గర ఉండవచ్చునన్నారు డాక్టరు" అంది నర్సు.

గదిలో విపరీతంగా ఏదో లోషన్ వాసన వేస్తోంది.

మంచం మీద ఉన్న నీలవేణి చుట్టూ ఏవో శాస్త్రీయ పరికరాలన్నీ పేర్చి వున్నాయి. ముక్కువరకూ వింత వింత గొట్టాలూ, మరో మార్గం లేక గొట్టాలలో ముందు వెనక రెపరెపలాడే నీటి బుడగలూ, వీటిన్నిటి మధ్యా నిశ్చలంగా, నిద్రపోతూంది నీలవేణి. గులాబి దిగులుగా కిటికీ దగ్గర కూచుంది.

ఇదంతా విచిత్రంగా వుంది వరదకి. ఎంత చూసిన దుఃఖం రావడంలేదు తనకు. నీలవేణి మరీ దగ్గరగా బల్లలాక్కుని వింతగా ఏదో అద్భుతాన్ని చూస్తున్నట్లు నీలవేణి ముఖాన్ని చూస్తూ కూచున్నాడు వరదరాజులు.

అన్నయ్య ముఖం చూసి భయపడింది గులాబి.

నీలవేణి గుండె బద్ధకంగా ఎగిరి పడుతోంది.

ఎన్నాళ్ళుగానో వంటిని వున్న కనకాంబరం రంగుచీరె నలిగి చేతి చుట్టూ తిరిగి వుంది. చీకటి పెదవుల మీది చిరునవ్వుని గమనిస్తూ కూచున్నాడు. ఒక్కసారి పెదాల్ని చేతుల్తో తాకాలనిపించింది.

ముఖంలో ఏదో తెలీని తీవి, నిర్లక్ష్యం కనిపిస్తోంది - ఆ నిర్లక్ష్యం చాలు ఆమె జీవితం అర్థం చెప్పడానికి. "నేను నమ్మిన మనుషులూ, కావాలనుకున్న తృప్తీ, ఆశలూ అన్నీ ఎదురు తిరిగి మోసం చేశాయి. ఇంక యీ ప్రపంచంతో నాకేం పని?" అన్న వైరాగ్యం తెలుస్తోంది.

అర్ధరాత్రిలో కళ్ళముందు నీడలు పడి, నీరసంగా. నీలవేణిపక్కనే తలవంచాడు. ఎప్పుడు కన్ను మూతపడిందో తెలీదు.

చివరి ఝాముున ఏదో పిట్ట కీచుమని అరిచేసరికి తుళ్ళిపడి లేచాడు. గాలికి గది రెక్క రెపరెప కొట్టుకుంటూంది. ఎలక్ట్రిక్ దీపం వణుకుతోంది. గొట్టంలోంచి పాకుతున్న ఆక్సిజను బుడగలు నెమ్మదిగ శబ్దం చేస్తున్నాయి. నిద్రమత్తులో కళ్ళు విడడంలేదు తనకు. నీలవేణి యింకా నిద్రపోతున్నట్లే ఉంది.

చూశాడు.

ఆసుపత్రి అంతా నీరవమైన నిశీధి నిశ్శబ్దం కమ్ముకుంది. హఠాత్తుగా తెలివిరావడంతో ముఖమంతా చెమట పట్టింది.

నీలవేణిలో చలనం లేకపోవడాన్ని గమనించాడు. గుండె కొట్టుకుంటున్న శబ్దం వినిపించడంలేదు. అనుమానం తీరేవరకూ గుండెదగ్గర తల ఆనించి చూశాడు.

ఎన్నో సంవత్సరాల అలసటను ఆ ఒక్క రాత్రిలోనే తీర్చుకుంటున్నట్లు, తృప్తిగా, నిశ్చింతగా, ప్రశాంతంగా తీరని నిద్రపోతోంది నీలవేణి.

లేవబోతే కాలు తిమ్మిరెక్కి కదల్లేదు.

హాలులో సిస్టర్ నిద్రపోయింది. వాచీ పన్నెండు దగ్గర ఆగిపోయింది - నవ్వుకున్నాడు.

సిస్టర్‌ను లేపి "పేషెంట్ చచ్చిపోయింది. ఆక్సిజన్ వృథా అవుతుంది. సిలెండర్లు తీసేయండి" అనేసి బయటకు వచ్చాడు.

మెట్ల దగ్గర విశ్వేశ్వరం స్తంభానికి చేరబడి నిద్రపోతున్నాడు. భుజానికి యింకా ఫ్లాస్కు వేలాడుతూనే వుంది.

మెట్లమీద కూచుని అతన్ని తట్టిలేపితే తుళ్ళిపడ్డాడు విశ్వేశ్వరం. "నీలవేణి చచ్చిపోయింది"

దిమ్మరపోయి, వెర్రివాడిలాగా చూశాడు "చివరిసారి తెలివి వచ్చిందా?"

ఆలోచించాడు వరద, "ఏమో తెలీదు, నేను లేచేసరికి అంతాసరి. గదికి పోదాం పద" ఫ్లాస్కు తీసుకుని లేచాడు.

విశ్వేశ్వరానికి యింకా నిద్ర ఆగడంలేదు.

తనపై విశ్వాసం, నమ్మకం లేని వ్యక్తి శ్రేయస్సుకయి తపన పడుతూ యిన్నిరోజులూ గుంజాటన పడి పడి యిప్పుడిక పగలంతా హాయిగా నిద్రపోయాడు విశ్వేశ్వరం.

నీలవేణి పోయిందన్న విచారం అతన్ని కదిలించలేకపోయింది.

మొదటినుంచి ఒక తరహా ప్రశాంతతకు అలవాటు పడ్డ మనస్సు ఊపిరి సలపని దుఃఖంలో మునిగిన తర్వాత కలిగిన ఆటవిడుపు విశ్వేశ్వరానిది.

తెల్లవారుఝామున నాలుగు గంటలకి నీలవేణిని చూసి వచ్చి గదిలో నేలమీద వెల్లకిలా పడుకున్నాడు.

గులాబి కుర్చీలోనే నిద్రపోయింది.

వరదరాజులకి నిద్ర రావడంలేదు. ఏవో ఆదర్శాలను సాధించినప్పటికంటే, అందుకు ప్రయత్నం అతన్ని మరీ అలసిపోయేట్లు చేసింది.

కిటికీ ఊచలకి చేరబడి తూర్పు ఆకాశం మీది చీకటివేపు చూస్తూ కూచున్నాడు వరద.

జీవితంలో పెద్ద అధ్యాయం గడిచిన తర్వాత శూన్యం గుండెల్ని కోస్తోంది. ఏదో గొప్ప సంఘటన ముగిసిపోయినట్లూ, ఇన్నాళ్ళూ తనకు జవసత్త్వాలనిచ్చిన, తన జీవితానికి అర్థం కల్పించిన శక్తిపోయినట్లూ అనిపించింది.

శానిటోరియం వరండాలో గుడ్డిదీపాలు చీకటితో పెనుగులాడుతున్నాయి.

ఇటు తిరిగితే విశ్వేశ్వరం వొళ్ళు మరిచి నిద్రపోతున్నాడు. చలికి అసంకల్పితంగా నరాలన్నీ కూడదీసుకుని ముద్దలా పడుకున్నాడు విశ్వేశ్వరం.

ఆశలూ, కోరికలూ, ప్రేమ, అభిమానం, బంధాలు తెలీని హృదయం నిర్లిప్తస్థితి అలానే వుంటుందనిపించింది. నీలవేణిని తన దగ్గర ఎంత నిశ్చింతగా వదిలేసి గూడూరు గనుల్లో దిగాడో, ఆమె పోయినా అంత నిశ్చింతగానూ నేలమీద నిద్రపోయాడు. ఇంతకాలం తర్వాత విశ్వేశ్వరం జీవితానికి అర్థం తెలిసింది వరదరాజులుకి అంతగా ఏమీ అక్కర్లేనితనాన్ని దృష్టిలో వుంచుకు బ్రతకడం అందరికీ సాధ్యంకాదేమోననిపించింది. ఇంతకాలం తర్వాత విశ్వేశ్వరం జీవితానికి అర్థ తెలిసింది వరదరాజులుకి అంతగా ఏమీ అక్కర్లేని తనాన్ని దృష్టిలో వుంచుకుని బ్రతకడం అందరికీ సాధ్యంకాదేమోననిపించింది. లేచి చలితో ముడుచుకు పడుకున్న విశ్వేశ్వరం మీద దుప్పటి కప్పితే వొళ్ళు విరుచుకు పక్కకి దొర్లాడు.

మర్నాటి సాయంకాలం మసక చీకటి పడేవేళకి వళ్ళు దులుపుకుని లేచాడు విశ్వేశ్వరం.

తలంతా 18 గంటల విశ్రాంతితో దిమ్మెక్కి పనిచేయడం మానేసింది. శరీరమంతా తిమ్మిరెక్కి మొద్దుబారింది. గదంతా చీకటిగా వుంటే లైటు వేసి గదిమధ్య కూచున్నాడు. ముందురోజు విషయాలన్నీ, హఠాత్తుగా గుర్తుకొచ్చాయి. శానిటోరియంలో దీపాలన్నీ కిటికీలోంచి కనిపిస్తున్నాయి.

సాయంకాలం ఆకాశం గుబులు వంక చూస్తూంటే నీలవేణి గుర్తుకొచ్చింది ఏభై ఏళ్ళ జీవితంలో మొదటిసారిగా నరాలన్నీ సళ్ళిచ్చి వశం తప్పి ఏదో పేగును మెలికలు తిప్పాయి. కిటికీకి తల ఆనించి నీలవేణిని గుర్తు తెచ్చుకు బావురుమని చిన్న పిల్లాడిలా ఏడ్చాడు. పాత జీవితం స్మృతులు గుర్తుకొస్తున్న కొలదీ ఆ దుఃఖానికి అవధిలేకుండా పోయింది.

ఏడుపు విని గులాబి భయంతో అన్నయ్యని పిలుచుకొచ్చింది. ఫౌంటెను దగ్గర కూచున్నవాడల్లా ఆతృతగా లోపలికి వచ్చాడు. నీరసంగా మాసిన బట్టల్తో నిన్నరాత్రికి, యిప్పటికీ బేధంలేకుండా నిలబడ్డ వరదని చూడగానే విశ్వేశ్వరానికి గుండె చెరువయింది. ఉన్న పాటునే లేచి రెండు చేతుల్తో అతన్ని కావలించుకున్నాడు.

ఎప్పుడూ చలించని విశ్వేశ్వరం యిలా అయేసరికి మతి చలించిందేమోనని వణికిపోయాడు వరదరాజులు.

ఏడుపు విని నర్సు పరిగెత్తుకు వచ్చింది.

కాస్సేపటికి తెలివి తెచ్చుకుని సిగ్గుపడిపోయాడు విశ్వేశ్వరం. హఠాత్తుగా కళ్ళు తుడుచుకుని కిటికీ దగ్గరికి వచ్చి మోకాళ్ళ మీద తల ఆనించి కూచున్నాడు.

ఎదురుగ్గా వరదరాజులు వచ్చి కూచుంటే తలెత్తి చూడనన్నా చూడలేకపోయాడు.

ఎంతో సేపటికి భుజం మీద చెయ్యేసి "నాకూ ఉంది దుఃఖం. ఎవరితో చెప్పుకోను?" అన్నాడు వరదరాజులు.

కన్నీళ్ళు తిరుగుతున్నాయి విశ్వేశ్వరానికి ఇటు తిరిగి జాలిగా వరద కళ్ళల్లోకి చూస్తూ ప్రయత్నంతో పెదాలు నొక్కుకుని దుఃఖాన్ని ఆపుకున్నాడు.

"చచ్చిపోయినందుకు కాదు. కనీసం చివరిరోజుల్లోనన్నా నన్ను చూడడానికి యిష్టపడనందుకు బాధగా వుంది. చివరకు ఈ చేతకాని తనంతో ఆమెకు నామీద నమ్మకాన్ని కూడా పోగొట్టుకున్నాను."

తల రెండు చేతుల్తో పట్టుకుని నిశ్శబ్దంగా వుండిపోయాడు.

ఈ ఆలోచనల్తో నిజంగానే మతి స్థిమితం తప్పుతుందేమోనని భయపడ్డాడు.

"కాఫీ త్రాగుతావా?" అనడిగాడు వరద.

తలూపి లేచాడు విశ్వేశ్వరం.

---

**కాంటిన్ నుంచి** తిరిగివస్తూంటే దారి మళ్ళించి కావాలని పొలాల వేపు నడిచాడు విశ్వేశ్వరం వరద భుజం మీద చెయ్యేసి.

ఆకాశంలోని చీకటి చీలికలయి దుగ్దతో పెనిగే జీవితానికి సాక్షిలా వుంది.

మనిషి ఆకారం కనిపించని అంధకారం మధ్య కూర్చోబోతే –

"వద్దు. ఇక్కడ భయం నాకు" అన్నాడు విశ్వేశ్వరం వరద భుజం పట్టుకుని.

మునిసిపాలిటీ దీపం దగ్గరికి వస్తూ "ఇప్పుడేం చేస్తావు?" అనడిగాడు వరదరాజులు ఉన్నట్లుండి.

"ఇంకా ఏమీ ఆలోచించలేదు."

ఇంకేం ప్రశ్నించలేదు వరద. అంతలో విశ్వేశ్వరం అతనివేపు తిరిగి "నామీద యింకా నీకు కోపం వుందా?" అనడిగాడు.

ఒక్కసారి ఆర్ద్రతతో నిలువునా కంపించిపోయాడు వరదరాజులు. మాటల్లోని నిస్సహాయత, కళ్ళల్లో దైన్యం అతని గుండెను కాల్చింది. జీవితానికి తన క్షమాపణే చివరితృప్తిని యిచ్చేట్లు, దానికోసమే యిన్నాళ్ళూ జాగరణ చేస్తున్నట్లు, అతని భవిష్యత్తంతా ఆ నాలుగుమాటలకు జవాబులోనే వున్నట్లు అడిగాడు విశ్వేశ్వరం.

కాస్సేపాగి "నీమీద నాకెప్పుడూ కోపం లేదు" అన్నాడు మామూలుగా.

ఒక్కసారి ఆగి వరదరాజుల్ని రెండు చేతుల్తో బలంగా తనవేపు తిప్పుకుని "నామీద ఎప్పుడూ కోపం తెచ్చుకోకు భయ్యా, నేను శక్తిలేని వెధవని" అన్నాడు.

అతని కంఠంలో దుఃఖం జీర గమనించేసరికి మళ్ళీ భయం పట్టుకుంది వరదకి.

"వద్దు. అవేం చెప్పకిప్పుడు, పోదాం పద" అనబోతే విశ్వేశ్వరం విదిలించుకుని,

"ఈ ఒక్కరోజూ నాతో గడుపు. రేపట్నుంచీ నేను కనిపించను. చచ్చిపోను, అంత ధైర్యం నాకు లేదు. కానీ చెప్పదలిచినవేవో చెప్పేసి పోతాను"

నిర్విణ్ణుడయి కూచుండిపోయాడు వరద. నిన్నటి దుర్ఘటనకంటే, విశ్వేశ్వరం విచలత అతన్ని మరీ కృంగదీసింది.

కూచున్నాక "ఎందుకిలా దిగజారిపోయానా అని భయపడుతున్నావు కదూ నువ్వు? కూతురుపోతే ఏడుపురాదూ నీకు? నీలవేణి ఎవరనుకుంటున్నావు?"

శరీరం పట్టుతప్పి నరాలన్నీ బిగుతయి, జ్ఞానాన్ని మెలికలు తిప్పింది రక్తం. అచేతనుడయి మాటలు వింటున్నాడు వరదరాజులు.

"ఈ రక్తాన్ని పంచుకుని ఎప్పటిదో నా పాపం ఫలితంగా పుట్టింది నీలవేణి"

ఇప్పుడిక విశ్వేశరం కంఠంలో దుఃఖం పూర్తిగా పోయింది. నిర్ధారణగా శూన్యంలోకి చూస్తూ చెప్పడం ప్రారంభించాడు.

చలి మరీ ఉధృతమైతే మఫ్లర్ తీసి తలకి చుట్టుకున్నాడు.

"ఈ విషయాన్ని నీ కెప్పటికప్పుడు చెప్పేయ్యాలనుకున్నాను. నీలవేణిని ఆ రోజు మీ యింట్లో వదిలేసినప్పుడూ, నువ్వు నన్ను గూడూరులో చూడడానికి వచ్చినప్పుడూ, మొన్న యిక్కడికి వచ్చినప్పుడూను. అయినా స్వార్థం, పిరికితనం నన్ను ఎప్పటికప్పుడు వెనక్కిలాగాయి. నన్ను అసహ్యించుకుంటావేమోనని భయం. నిర్లక్ష్యంతో నీలవేణిని వదులుకుంటావేమోనన్న బెదురుతో ఆగిపోయాను. నీలవేణిని నువ్వు పెళ్ళిచేసుకున్నావంటే ఎక్కడో మూలన కూచుని, సంతోషం పట్టలేక ఏడ్చాను. నేను రాలేకపోయానే అన్న బాధ మిగిలిపోయింది ఆ రోజు నీ శ్రేయస్సు కోసం, నీ బాగుకోసం నేను చేసినన్ని ప్రార్థనలు ఎవరూ చేసి వుండరు.

జడునిలా కూచుని వెయ్యిసార్లు ప్రయత్నించినా ఊహించలేని విశ్వేశ్వరం రహస్యాన్ని చీకటి మధ్య ఆకళింపుకు తెచ్చుకొందుకు ప్రయత్నిస్తున్నాడు.

చీకటిలోకే చూస్తున్నాడు విశ్వేశ్వరం. మధ్య మధ్య కంఠం వణుకుతోంది. అయినా చెప్పాలన్న నిశ్చయం, తెలియని తెగింపు అతన్ని ముందుకు లాక్కుపోవడం స్పష్టంగా తెలుస్తోంది.

"నీలవేణి విషయం విపులంగా చెపితే ఆశ్చర్యపోతావు నువ్వు. ఇలాంటివి జరుగుతాయా అని నాకే అనిపిస్తుంది. నిడదవోలులో ఉండే రోజుల్లో మా యింటికి నాలుగు అంగల దూరంలో వుండేది ఆరోగ్యం యిల్లు. ఆరోగ్యం తెలుసుగా."

తలూపాడు.

"పూర్తిగా చెప్పనక్కరలేదు. అప్పట్లో ఏమీ తెలిసేదికాదు నాకు. బ్రతకడం అంటే విచ్చలవిడిగా తిరగడమేననిపించింది. తర్వాత ఈ పిరికితనం ఎలా సంక్రమించిందా అని ఆశ్చర్యం వేసింది. ఆరోగ్యం తండ్రి చర్చిలో బిషప్. ఆరోగ్యాన్ని చూసినప్పటినుంచీ నేనూ చర్చికి వెళ్తూండేవాడిని. అప్పట్లో ఓ ముసలిమేనమామ తప్ప నాకు అడ్డుచెప్పేవారెవరూ లేకపోయారు. ఓరోజు చర్చినుంచి తిరిగి వస్తూ బలవంతానా ఆరోగ్యాన్ని కావలించుకున్నాను. భయపడి నన్ను విదిలించుకుని పారిపోయింది. మర్నాడు ఆమె తండ్రి నన్ను పిలిచి ఏవో నీతులు చెప్పాడు. నాకు వళ్ళుమండింది. ఈసారి ఆరోగ్యం మీద కోపంతో, ఉదాసీనతతో లోబరుచుకొనడానికి ప్రయత్నించాను. మొదట మొరాయించింది. కానీ వయస్సు చాలా వాటికి జవాబు చెప్తుంది. క్రమంగా ఈ చేరిక మామూలయిపోయింది. కానీ పదినెలల తర్వాత ఆరోగ్యంలో మార్పు గమనించి వణికిపోయాను. ఓ రోజు అసలు విషయం తెలిసిపోయింది. ఆరోగ్యం వుత్తమనిషి కాదని విని బెదిరిపోయాను. మర్నాడే యింట్లోంచి పారిపోయాను. అయితే ఆమె తండ్రికి యిది తెలియగానే వళ్ళు మరిచి గెంతులు వేయలేదు. గుంభనగా రహస్యాన్ని దాచి ఏదో నెపంతో ఉద్యోగం వదులుకుని ఢిల్లీ చేరారు. తర్వాత విల్లింగ్టన్ ఆసుపత్రిలో నీలవేణి పుట్టింది. ఎన్నోయేళ్ళ తర్వాత కాకతాళీయంగా ఢిల్లీ వస్తే మళ్ళీ ఆరోగ్యం కనిపించింది. మనిషి చాలా మారింది. నవ్వుతూ పలకరించింది. కానీ ఆమెను చూస్తూనే పాతజ్ఞాపకాలు గుర్తుకొచ్చి వణికిపోయాను. ఇంకా వయస్సులో చేసిన తప్పు నన్ను పీకుతూనే వుంది. ఆ తప్పు నన్ను పారిపోనీయకుండా ఆపింది. అదీగాక నీలవేణి విషయం మొదటిసారిగా అప్పుడు విన్నాను. నా రక్తం పంచుకున్న మరోవ్యక్తి ఎట్లావుంటుందా అన్న ఉత్సుకత యెక్కువయింది. నీలవేణి విషయం అంతా చెప్పి ఇప్పుడు తన అమ్మా, నాన్న దగ్గర గూడూరులో వుందని చెప్పింది. ఇప్పుడయినా ఆమెను ఆదరించమని బ్రతిమాలింది. తను ఎవరినో పెళ్ళిచేసుకున్నట్లు చెప్పింది. మొదట భయపడినా కూతురు ఎక్కడో తెలీనిచోట బ్రతికి వుందనేసరికి మనస్సు వింత అభిమానంతో గుబగుబలాడింది. సరేనన్నాను. కానీ నేనెవరో తెలీకుండా

నన్ను విశ్వసించలేకపోయింది నీలవేణి. ఇదంతా చెప్పి ఎలా ఊరట కలిగించాలో తెలీక, మళ్ళీ పిరికితనంతో వెనకంజ వేశాను. ఆమెను సాకటం నాకు చేతకాదనిపించింది. కొన్నాళ్ళు నాతో ఉన్న తర్వాత ఆమెను అనంతశయనంగారి దగ్గర వదిలేసి మిలటరీకి పోయాను. ఉన్నట్లుండి ఆమె ఆక్కణ్ణుంచి వచ్చేసినట్లు పీతాంబరం ఉత్తరం వ్రాశాడు. అంతవరకూ పీతాంబరాన్ని కొద్దిగానే ఎరుగుదును నేను. విషయం తెలియగానే వెంటనే వచ్చేశాను. తీరా నేను వచ్చేసరికి నీలవేణిని అంతవరకూ కనిపెట్టుకుని వుంటున్న కామేశ్వరమ్మగారు పోయారని తెలిసింది. ఆమె ముఖం చూస్తూ గడిపే శక్తి నాకు లేకపోయింది. పిరికితనం. ఎక్కడికో దూరంగా పోయి యివన్నీ మరిచిపోయి నిశ్చింతగా బ్రతకాలనిపించింది. యింతలో నువ్వు కనిపించావు. నీ దగ్గర ఆమెను పూర్తిగా వదిలేసిపోవడానికే ఆ రోజు వచ్చాను. అయితే నీలవేణి అందుకు ఒప్పుకోలేదు. అప్పుడిక పాతవిషయాలు చెప్పక తప్పలేదు. అంతా విని వొళ్ళో తలవుంచుకుని ఏడ్చింది. నాకు ఊరట కలిగించడానికే నీ దగ్గర వుండడానికి యిష్టపడింది. అయితే నా నిర్లక్ష్యాన్ని ఎప్పుడూ క్షమించలేదు. నిజం తెలిశాక మరీ బాధపడింది. నేనెందుకూ చేతకానివాణ్ణని తెలుసుకుంది. చివరికి నామీద సానుభూతి కూడా మిగల్లేదు ఆమెకు. పోతూ పోతూ నామీద ఘోరమైన శిక్ష విధించింది. కనీసం నన్ను చివరిక్షణాల్లో చూడడానికయినా యిష్టపడకపోవడానికి యిదే కారణం"

మళ్ళీ క్రిందటి రోజు విషయమంతా గుర్తుకొచ్చింది.

అతన్ని ఊరడించాలన్న ఆలోచన కలగలేదు వరదకి. మంత్రముగ్ధునిలాగా అతను చెప్పనవన్నీ వింటూ అపస్మారంలో పడిపోయాడు.

విశ్వేశ్వరం చెయ్యి హఠాత్తుగా పట్టుకుని "ఆరోగ్యం ఆమె తల్లి అన్న విషయం చెప్పావా నీలవేణికి"

నిర్ఘాంతపోయాడు విశ్వేశ్వరం 'లే'దన్నాడు.

కాస్సేపాగి "అదొక్కటే నువ్వు చేసిన మంచిపని, మరి కొన్నాళ్ళు నీలవేణి బ్రతకడానికి ఆస్కారం కలిగించావు" అన్నాడు.

ఎంతకీ అతను మాట్లాడకపోతే భయపడి "ఇకపోదామా?" అని గొణిగాడు విశ్వేశ్వరం.

బదులు పలకకుండానే లేచి నడిచాడు. శానిటోరియం వెలుగు అల్లంతదూరంలో కనిపిస్తోంది.

"ఇదంతా విన్నాక నా మీద అసహ్యం పుట్టిందా నీకు?"

అంతా మరిచిపోయి విశ్వేశ్వరం, ఆరోగ్యాన్ని ఉపయోగించుకున్న సత్యం గురించి ఆలోచిస్తున్నాడు. ఎంత తర్కించుకున్నా ఆ పని తప్పనిపించడంలేదు. అనుభవం నేర్పిన పాఠం అది.

చటుక్కున విశ్వేశ్వరానికీ తనకీ తేడాలేదు. అతని పాపానికి ఫలితం విషమించింది. అతను అదృష్టవంతుడు.

అతని భుజం తట్టి "నిన్ను క్షమించే యోగ్యత నాకు లేదు. కానీ నిన్ను అర్థంచేసుకోగల అనుభవం వుంది. నీమీద నాకేం కోపం లేదు" అన్నాడు.

విశ్వేశ్వరం నిట్టూర్చి వెలుగువేపు చూస్తూనే మెల్లిగా శానిటోరియం వేపు అడుగులు వేశాడు.

విధి దష్టమయిన జీవితానికి ప్రమాణంగా నిలిచాడు వరదరాజులు.

తనతో ఎవరూ లేరిప్పుడు ఒక్క గులాబి తప్పించి. అన్నయ్యను కదపడానికే భయపడి విజిటర్స్ రూములో కూచుని వచ్చేపోయే వాళ్ళను చూస్తుండేది. పొరపాటునన్నా నీలవేణి చివరి క్షణాల్లో గడిపిన గదివేపు రావడం మానేసింది. సాయంకాలం ఎప్పుడన్నా అన్నయ్య పిలిస్తే పొలాలవేపు వెళ్ళి వచ్చేది.

విశ్వేశరం ఆరోజే వెళ్ళిపోయాడు.

శానిటోరియంలో గడిపే కాలం అయిపోయిందని రెండుసార్లు నోటీసు యిచ్చారు అధికారులు.

చివరిరాత్రి ఆమె దగ్గర కూర్చున్న క్షణాల్ని గుర్తుతెచ్చుకుంటూ, ఆ గదిలోని ఖాళీమంచాన్ని గమనిస్తూ వెళ్ళాలనిపించలేదు వరదరాజులకి.

ఓ రోజు ఉన్నట్లుండి ఏదో ఉత్తరం వచ్చిందని తీసుకొచ్చింది గులాబి. పీతాంబరం వ్రాశాడు.

ఉత్తరంలో అక్షరాలు వెయ్యి వంకరలు పోయి నీరసంతో, తప్పక వ్రాసినట్లున్న పీతాంబరం స్థితిని తెలియజేశాయి. ఉత్తరంలో విషయాలు మరింత విశదపరిచాయి. పదిరోజులు క్రిందటి తారీఖు దానిమీద వేసి వుంది.

"మీరక్కడ ఉన్నారని ఎలాగో తెలిసింది. ఒక్కసారి వస్తారా నన్ను చూడడానికి? ఆశ్చర్యపోతారు నన్ను చూస్తే. మీతో చాలా విషయాలు మాట్లాడలి. నీలవేణిని మీతో తీసుకురావద్దు. ఒక్కరే రండి."

చదివి నవ్వుకున్నాడు వరద. మళ్ళీ నీలవేణి ముఖం గుర్తుకొచ్చింది. ఉత్తరం చూసి "నువ్వు రాకూడదన్నాడు పీతాంబరం" అంటే నవ్వుకుని ఊరుకుంటుంది బహుశా.

కిటికీ ఊచలకి చేరబడి అన్నయ్య ముఖం వేపే చూస్తోంది గులాబి. ఇటీవల సంఘటన ఆమెను మరీ ఒసిలిపోయేట్లుగా చేసి, ముఖంలో ఛాయను తెచ్చాయి.

"ఏం చేద్దాం?" అన్నాడు సలహా తీసుకోవడానికి మిగిలిన ఒక్క వ్యక్తినీ పలకరిస్తు.

"అంతా భయం భయంగా వుంది. పీతాంబరం చచ్చిపోతూ యీ వుత్తరం వ్రాశాడేమో? బహుశా ఏదన్నా పెద్దరోగం.."

నివ్వెరపడి చెల్లెలి ముఖం చూశాడు. డైబెటీస్‌తో పీతాంబరం బాధపడిన విషయం హఠాత్తుగా గుర్తుకొచ్చింది.

"మీతో చాలా విషయాలు చెప్పాలి" అన్న మాటలో అర్థం అతన్ని మాటిమాటికీ పృచ్ఛించింది.

రహస్యాలమీదా, మనస్సు లోతులమీదా విశ్వేశ్వరం కథ విన్న తర్వాత తగని అనుమానం పెరిగిపోయింది. ఓ విచిత్రమైన క్షణాన తను నీలవేణి తమ్ముడుగా నిరూపణ కావచ్చు.

ఏమైనా సరే వెళ్ళాలనిపించింది.

ఉత్తరంలో ఓ మూల ఆసుపత్రి పేరు మాత్రం వ్రాసి, విజయవాడ అని వ్రాశాడు పీతాంబరం.

ఆ రాత్రే చెల్లెల్ని తీసుకుని బయల్దేరాడు.

"దూరపు కొండలు.." లోకోక్తికి అర్థం విజయవాడ వచ్చాక తెలిసింది. మొదటిసారి కృష్ణానది నిశ్చలత, మనుషుల్లో చిత్తశుద్ధి ఆకర్షణీయంగా కనిపించాయి.

నిర్దుష్టత లేకుండా గజిబిజిగా అక్కడికి చేరితే పీతాంబరం పేరు విని మరీ గాలి సరిగ్గా జొరబడని గది దగ్గరికి తీసుకొచ్చారు. గాలిరాకపోవడం ఆ గది చేసుకున్న పాపం కాదు. ఆ వూరు చేసుకున్నది.

వరదని చూస్తూనే సన్నగా రివటలా వున్న వ్యక్తి పలకరించి రెండు చేతులూ పట్టుకుని బయటకు తీసుకు వచ్చాడు. వెనకనే గులాబిని చూసి క్షణకాలం దిమ్మరపోయాడు.

"నీలవేణిని తీసుకొచ్చినట్లున్నారే. వాడు ఉత్తరంలో వ్రాశాడు గమనించలేదేమో మీరు" ప్రతీ మాటలోనూ కించను వ్యక్తం చేస్తూ అన్నాడతను.

"ఆమె నీలవేణి కాదు. నా చెల్లెలు. ఈమెను చూస్తే అతనేం బాధపడడు" అన్నాడు మెల్లగా.

అనుమానంగా ఆమె వేపు చూశాడతను. అంతలో వరద భుజం మీద చెయ్యేసి "ఒక్క క్షణం మీతో రహస్యంగా మాట్లాడాలి. మీ విషయమంతా నాకు బాగు తెలుసు. నా పేరు కుటుంబరావు" అని ఆగాడు.

గులాబి అచేతనంగా గోడకి నిలబడిపోయింది.

ఆసుపత్రి వరండాలోకి వచ్చాక మెల్లగా అడిగాడు కుటుంబరావు.

"నీలవేణి ఎక్కడుంది?"

"ఎందుకా విషయం?"

"ఏదో నాకూ తెలీని పెద్ద రహస్యాన్ని మీకు చెప్పడానికి పిలిపించాడతను. నీలవేణి అంటే అతనికి చెప్పలేనంత గౌరవం. అందుకని ఆ విషయం చెప్పే సమయంలో ఆమె ఉండకూడదని అతని ఉద్దేశం."

నవ్వొచ్చింది వరదరాజులుకి.

"మరొక్క విషయం. పీతాంబరానికి నిన్ననే పెద్ద ఆపరేషన్ జరిగింది. మూడు నెలలు డయాబెటీస్‌తో పెనుగులాడాక నీరసంగా ఉన్నాడు. తప్పనిసరిగా నిన్న ఆపరేషన్ జరిపారు. దురదృష్టవశాత్తూ సరిగా జరగలేదు. ఇంకెంతో కాలం వాడు బ్రతకడంటే మీరు నమ్మకపోవచ్చు."

నవ్వుతూ "బ్రతుకుకి అర్ధం సంతోషం, ఆనందం. అంతకు తప్ప యింకేమీ లేదు" అని చెప్పే పీతాంబరం గుర్తుకొచ్చి నోరు పెగల్లేదు వరదకు.

అంతకు ముందే ఎదుర్కొని పెద్ద దెబ్బమీద యిది మరొకటి అనిపించింది. తెలియకుండానే కళ్ళనీళ్ళు తిరిగాయి.

"అతని పరిస్థితి చూసి ఏ సానుభూతీ ప్రకటించవద్దు. మనస్సు కూడదీసుకోండి ముందు. మీతో మాట్లాడాలని పదిహేను రోజులుగా ఉబలాటంగా వుంది. ఎలాగో వెతికి మీ అడ్రసు సంపాదించాను" అన్నాడు కుటుంబరావు.

"ఎక్కడ ఉన్నాడతను?"

"ఆ గదిలో" వేలితో చూపించాడు.

"చూద్దామా అతన్ని?" అన్నాడు వరద కంఠం కూడదీసుకుని.

"మీరు స్థిమితపడండి మొదట. ఈమెను కూడా లోపలికి తీసుకువెళ్ళడం మంచిదంటారా?" గులాబీవేపు చూపుతూ అడిగాడు కుటుంబరావు. తెల్లబోయి బొమ్మలా నిలబడ్డ గులాబీవేపు చూస్తూ మళ్ళీ పాత రోజుల్ని గుర్తు తెచ్చుకున్నాడు వరదరాజులు. గోడకి చేతులు ఆనించి, ఏమీ అర్ధంకాని చూపులు చూస్తోంది గులాబి.

"దగ్గరున్నా ఫరవాలేదులెండి. గులాబిని చూస్తే సంతోషిస్తాడు" అన్నాడు వరద కాస్సేపటికి. ప్రయత్నంతో తనని తాను కూడదీసుకుని దగ్గరికి వచ్చి గులాబి భుజం మీద చెయ్యివేశాడు. "పీతాంబరం చావు బ్రతుకుల మధ్య ఉన్నాడట. చూస్తావా?"

నిర్ఘాంతపోయి అన్నయ్య ముఖం చూసిందామె. నవ్వి ఆమె తలని భుజానికి ఆనించుకున్నాడు. "ఫర్వాలేదులే. ఇదే చివరిసారి చూస్తున్నామేమో బహుశా. ఒక్క క్షణం కూచుని వచ్చేదాం" ఆమె చెయ్యిపుచ్చుకుని కుటుంబరావు వెంట గదిలోకి నడిచాడు.

అసలే గాలి తక్కువగా ఉన్న గదిలో వెలుగు తీవ్రతను తగ్గించడానికి నీలిరంగు దీపాల్ని వెలిగించారు. ఒకేరంగు పులిమినట్లు గదిలో ప్రతి వస్తువూ ఓ రంగు చిత్రంలాగా లీలగా కనిపిస్తోంది.

కుటుంబరావు బల్ల దగ్గరికి వెళ్ళి మరో చిన్న దీపం వెలిగిస్తే కుడివేపున ఉన్న మంచం కనిపించింది. అటు చూస్తూనే వరద, గులాబి యిద్దరూ ఒక్కసారిగా తుళ్ళిపడ్డారు.

వొత్తుగా వేసిన పరుపు దిండ్లపై తలని వాలుగా అమర్చి పొత్తి కడుపు భాగాన్ని మీదకి వుండేలాగ గొలుసుల్తో ఏర్పాటు చేశారు. శరీరమంతటా తెల్లటి దుప్పటి కప్పివుంది. గొలుసుల మధ్యనుంచి ఏదో విచిత్రమయిన ఆకారం నేలమీదకి వేలాడుతున్నట్లు కనిపించింది. దుప్పటి చివర నల్లటి, పల్చటి ముఖం మాత్రం గుర్తుపట్టగలిగేదిగా వుంది. బొమికలన్నీ పోగుదేరి కళ్ళల్లో కాస్తపాటి జీవం, పెదాల కదలిక శ్వాసకోస్మ, ముక్కుపుటాల అదురు తప్పిస్తే ప్రేతకళ ఆవరించిన అతని ముఖాన్ని చూసి యిద్దరూ క్షణకాలం నోటమాట రాకుండా ఉండిపోయారు.

దీపం వెలిగితే బద్ధకంగా కళ్ళు యిటువేపు తిప్పాడు పీతాంబరం. అంత క్షీణతలోనూ కళ్ళ వైశాల్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది.

''వరదరాజులుగారొచ్చారు చూడు'' అన్నాడు కుటుంబరావు వంగి.

కుర్చీ లాక్కుని దగ్గరగా కూర్చున్నాడు వరద. బల్లకి ఆనుకుని నిలబడ్డది గులాబి.

కళ్ళు పెద్దవి చేసి జ్ఞాపకశక్తిని తెచ్చుకోవడానికి గుంజాటన పడ్డాడు పీతాంబరం. వరదని నిండు చూపు చూసి, ఆతృతగా కళ్ళు రెపరెపలాడించి ఒక్కసారి కళ్ళు మూసుకుని నీరసంగా నవ్వాడు.

మళ్ళీ కాస్సేపటికి తలతిప్పి ''గుర్తున్నానా నేను?'' అన్నాడు.

ఏమీ మాట్లాడక అలానే చూస్తున్నాడు వరదరాజులు.

''ఒక్కతెనూ వదిలి రావడం యిష్టంలేక వెంట తీసుకొచ్చాను'' అన్నాడు క్షమాపణగా.

నవ్వు తెచ్చిపెట్టుకుంటూ ''కులాసాగా ఉన్నారా?'' అని పలకరించాడు గులాబిని.

తలూపిందామె.

''నీలవేణి ఎలా వుంది?''

చెప్పటానికి తటపటాయించాడు వరద. ఎదురుగ్గా కూచున్న కుటుంబరావు ముఖం చూశాడు ఏం చెప్పాలో తెలీక.

అతని సందిగ్ధాన్ని పసిగట్టి పీతాంబరం నవ్వాడు. ''ఆమెను కూడా మీతో తీసుకొచ్చారు అవునా? నా దగ్గర దాచకండి'' అన్నాడు.

ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికింది వరదకి. దుప్పటి కిందవున్న అతని రెండు చేతుల్నీ స్పృశించాడు.

''అదేం లేదు పీతాంబరంగారూ! నీలవేణి చనిపోయింది. సరిగ్గా 20 రోజుల క్రితం''

ఒక్కసారిగా కుటుంబరావు, పీతాంబరం తుళ్ళిపడ్డారు.

ఆశ్చర్యంతో మనిషంతా వణికాడు. నడుం దగ్గర నరం కదిలి బాధతో అరిచాడు పీతాంబరం. కుటుంబరావు లేచి అతన్ని స్థిమితపరిచాడు.

''చచ్చిపోయింది'' అని ఒకటి రెండుసార్లు గొణుక్కుని అటు తిరిగి పడుకున్నాడు పీతాంబరం.

కుటుంబరావు టేబుల్ మీద టెంపరేచరు పాడ్ తీస్తూ 'ఇంకా విషయం ఏమీ చెప్పకండి' అని వరద చెవిలో రహస్యంగా గొణిగాడు.

గోడ గడియారం చేసే శబ్దం గదిలో ప్రతిధ్వనిస్తోంది.

ఏమైనా చెప్తాడేమోనని అంతా ఎదురు చూస్తూ కూర్చుండిపోయారు. కానీ అతనికి హఠాత్తుగా నిద్రపట్టినట్లుంది. అలానే చలనం లేకుండా పడుకున్నాడు.

''పోదాం పదండి. నీరసంతో నిద్రపట్టినట్లుంది. సాయంకాలం మాట్లాడవచ్చు'' అన్నాడు కుటుంబరావు వరద భుజం మీద చెయ్యేసి.

కళ్ళు మూసుకునే "లేదు. ఇప్పుడే మాట్లాడాలి, విషయం ఎలా ప్రారంభించాలా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు పీతాంబరం.

ముగ్గురూ దిగ్భ్రాంతులయ్యారు.

మెల్లగా యిటు తిరిగి వరద చెయ్యి పట్టుకున్నాడు.

"మీతో యీ విషయాలు చెప్పకపోయినా నష్టం లేదు. మీరు హాయిగా బ్రతగ్గలరు యివన్నీ తెలియకుండానే. కానీ యివన్నీ చెప్పకుండా నేను హాయిగా చచ్చిపోలేను. ఇప్పుడు నీలవేణి లేనందువల్ల చెప్పినా ఫరవాలేదు."

"హెచ్చు అలసట పడకండి, చెప్పగలిగితేనే చెప్పండి. అవసరమయితే రెండు రోజులు యిక్కడే ఉండగలను నేను" అన్నాడూ వరద అనునయింపుగా.

మందహాసం చేశాడు పీతాంబరం. కాస్సేపాగి "నీలవేణి మీ చేతుల్లో ప్రాణం వదులుకోగలగడం ఆమె అదృష్టం ఆమెను వదిలి దూరంగా పారిపోవడంలో నేను మంచిపని చేశానేమోనని యిప్పుడనిపిస్తోంది. నీలవేణిని పెళ్ళిచేసుకున్నారటగా మీరు?"

నెమ్మదిగా తలూపాడు వరదరాజులు.

ప్రయత్నంతో నవ్వుకున్నాడు పీతాంబరం. "ఇదివరకే నీలవేణికి పెళ్ళయిందంటే ఆశ్చర్యపోతారు మీరు" ఆగాడు.

కొలిమిలోంచి తీసిన యినుము మీద చల్లటి నీరు హఠాత్తుగా పడినప్పటి వేడిలాగా మనస్సు ఉత్తప్తమయింది. గులాబికి ఆశ్చర్యం మధ్య దుఃఖం పొర్లుకొచ్చింది. అనవసరంగా, అసంకల్పితంగా పెదాలు వణికాయి. వరద చెయ్యి పుచ్చుకుంది.

"అవును. మామయ్య దగ్గరికి నీలవేణి వచ్చేసరికి నేనక్కడే ఉన్నాను. విశ్వేశ్వరం ఆమెను వదిలి వెళ్ళడం తెలుసు నాకు. ఆమెను నాకు ముడిపెట్టాలని మామయ్య తలంపు. నీలవేణిని అడిగితే మాట్లాడకుండా ఊరుకుంది. నేనే ఓ రోజు కదిపితే ఏడ్చింది. ఆమెతో మాట్లాడాలంటే భయం నాకు. నా మాటల్లాగా, మీ మౌనంలాగ. గోవర్ధనరావుగారి చమత్కారంలాగ. ఆరోగ్యం నవ్వుల్లాగా ఆమెకు కన్నీళ్ళు ఓ ఆయుధం. పాత విషయమేదో గుర్తు తెచ్చుకుని నవ్వుకున్నాడు కాస్సేపు. మళ్ళీ యిటు తిరిగి "నీలవేణి తప్పుపని చేసి వుంటుందని మీకు అనుమానమా?" అనడిగాడు.

ఆ ప్రశ్న అడగడంలో ఆతృత వరదని విస్మితుణ్ణి చేసింది.

"అనుమానంలేదు. అయినా అదంతా యిప్పుడు అనవసరం. నీలవేణి యిప్పుడిక లేదు."

"అవును. లేదు" అన్నాడు పీతాంబరం. "పెళ్ళి జరగడం అంటే విందులూ, ఊరేగింపులూ అయితే జరగనట్లే. కానీ ఒక్కరోజూ నీలవేణిని నేను భార్యగా చూడలేకపోయాను. లౌకికమైన బంధం మా పెళ్ళి. అంతే. అంతకు తప్పించి యింకేమీ కాదు. అదీ ఎంతోకాలం నిలవలేదు. ఓ రోజు ఉన్నట్లుండి అక్కణ్ణుంచి వెళ్ళిపోతానంది. నేను అడ్డు చెప్పలేదు. తమాషాగా ఉంది కదూ?"

"మళ్ళీ నీలవేణిని ఎప్పుడు కలిశారు మీరు?"

"ఆ తర్వాత నేనే గూడూరు నుంచి వచ్చేశాను. మొదటిసారిగా మీ యింటికి వచ్చిన రోజు గుర్తుంది కదూ? అదే ఆమెను కలవడం"

వరద గులాబి చెయ్యి పుచ్చుకుని అలానే కూచున్నాడు.

"అంత నిరాడంబరంగా బ్రతికే వ్యక్తిని నేనెప్పుడూ చూడలేదు. నాకెప్పుడూ జీవితంలో కష్టాలు రాలేదు. వచ్చిన కష్టమల్లా యిదొక్కటే. కానీ కష్టాలు లేకుండా ఉండగా ఆమెను చూడలేదు. అయినా ఆ కళ్ళల్లో స్థాయి, మాటల్లో నిలకడతనం, ఓర్పూ ఒదులుకునేది కాదు. ఈ గుణాలు కాకపోతే ఆమె నా భార్య ఎప్పుడో అయేది. కానీ యివన్నీ చూశాక ఆమెను భార్యగా చూడలేకపోయేవాణ్ణి. నన్ను మరిచిపోయిన శక్తి ఆమెలో కనిపించేది. ఎప్పటికీ ఆమె నాకు 'నీలవేణి'గానే మిగిలిపోయింది" కాస్త ఆగి

యిటు తిరిగి ''నా చెల్లెలని మీ దగ్గర అబద్ధమాడాను. విషయం నీలవేణి చెప్పవద్దంది. మోసం చేయాలని కాదు. మిమ్మల్ని బాధపెట్టడం యిష్టంలేక.''

మందు వేళయిందని వచ్చాడు కుటుంబరావు. భారంగా మందు గుటక వేసి ''ఇదంతా విని బాధపడ్డారా మీరు?'' అనడిగాడు.

''అంతా విచిత్రంగా వుంది. నాకేం బాధలేదు. ఇంత విన్నాక నీలవేణిని నేనేం తెలుసుకోలేదేమోననిపిస్తోంది.''

''**ఆమెను** కలుసుకున్నవాళ్ళంతా అలానే అనుకుంటారు. అదే ఆమెలో ప్రత్యేకత, రహస్యాల్ని అంత అందంగా, ఆకర్షణీయంగా దాచుకున్న వాళ్ళని ఎప్పుడన్నా చూశారా?''

వరద మాట్లాడలేదు.

''అలసటగా వుంది నాకు, సాయంకాలం వరకూ ఆగండి చాలు, మరొక్క విషయం చెప్తాను'' అన్నాడు ఆగిఆగి.

తలూపి లేచాడు వరద.

గులాబి నమస్కారం చేసి వెళ్ళబోతే 'మీరు చేస్తే మళ్ళీ కాఫీ తాగాలని వుంది నాకు' అని నవ్వాడు పీతాంబరం.

సాయంకాలం ఆసుపత్రికి బయల్దేరబోతూండగా కుటుంబరావు ఎదురుగ్గా వచ్చాడు.

''మీరొక్కరే వస్తే బావుంటుంది. అలా చెప్పమన్నాడు పీతాంబరం'' అన్నాడు.

గులాబిని హోటల్లోనే వదిలి బయల్దేరారిద్దరూ.

వచ్చేసరికి మంచానికి చేరబడి వాలుగానే కూర్చుని వున్నాడు. ఏదో యింగ్లీషు మేగజైను తిప్పుతూ ద్రాక్షపళ్ళు నములుతున్నాడు.

చూడగానే పలకరించాడు. పొద్దుట కంటే కాస్త హుషారుగా కనిపించాడు. అయినా నానాటికీ రక్తమాంసాల్ని పీల్చేసే రోగం. ఆపరేషన్ ప్రభావాలను అతని కళ్ళకింద నీడలు స్పష్టంగా చెపుతున్నాయి.

''మీరు వచ్చాక పొద్దుటకీ, ఇప్పటికి సగం జ్వరం తగ్గిపోయినట్లనిపించింది'' అన్నాడు.

డాక్టరు వచ్చినా మాట్లాడడం తగ్గించలేదు.

ఉన్నట్లుండి మాట మధ్యలో ఆగాడు.

''మీకో విషయం చెప్పాలనుకున్నాను'' అన్నాడు.

క్రమంగా అతని ముఖం నల్లబడడం, విషయం ఎలా చెప్పాలో తెలీక తికమకపడడం చూసి మళ్ళీ ఏం చెప్తాడోనని భయపడ్డాడు వరదరాజులు.

ఉన్నట్లుండి ''సుజాత గుర్తుంది కదూ?'' అనగానే ఉలిక్కిపడ్డాడు. తలూపాడు.

''ఆమె ఆత్మహత్య కూడా?''

''గుర్తుంది''

''ఆ సంఘటనే నన్నింత పతనానికి తీసుకొచ్చింది. నేనెంతో విచ్చలవిడిగా తిరిగాను మొదట్నుంచీ. నిర్లక్ష్యంగా బ్రతికాను. అయినా అంత విపరీత ఫలితం. అంత గుండె బ్రద్దలు చేసే సంఘటన ఎప్పుడూ జరగలేదు. వరదరాజులుగారూ సుజాత ఆత్మహత్యకు నేనే కారణం'' అన్నాడు.

''పీతాంబరం గారూ..'' అన్నాడు ఆశ్చర్యపోతూ.

నీలవేణి, ఆరోగ్యం, విశ్వేశ్వరం బంధుత్వాల రహస్యం కంటే నీలవేణి, పీతాంబరం సాహచర్యం కంటే, ఈ సుజాత విషయం అతణ్ణి నిర్విణుణ్ణి చేసింది. ఇన్ని అద్భుతాలు విన్నాక ప్రపంచంలో అసాధ్యమయినదీ, అసంభవమయినదీ ఏదీ లేదనిపించింది. తన చుట్టూ తిరిగిన ప్రతీ వ్యక్తీ ఒక సముద్రంలాగా, మానవాతీతమయిన విపరీత శక్తితో వెయ్యి ప్రళయాలను హృదయాంతరాళాలలో దాచుకు బ్రతికారు.

"నీలవేణి గురించి మీతో మాట్లాడడానికి రవణమూర్తిని మీ దగ్గరకు తీసుకురావడానికి ఓ రోజు అక్కడికి వెళ్ళాను. ఆనాడు ఎందుకలా పిచ్చవాణ్ణి అయినా అని యిప్పటికీ ఆశ్చర్యపోతాను. ఫలితం విన్నాక అప్పట్లో మతి చలించినట్లనిపించింది. ఏం చెయ్యాలో తెలీక భయంతో యిల్లు కదలలేకపోయాను. ఆమె ఆత్మహత్య చేసుకున్నదని విన్నాక నా తప్పు మరీ తెలిసి వచ్చింది. ఈ విషయం ఎవరితోనూ చెప్పలేక పోయేవాణ్ణి. ఆ సమయంలో మీ మీద నిందలు వేసిన విషయం కూడా తెలుసు. నా చేతకానితనానికి మనస్సులోనే ఏడ్చేవాణ్ణి. ఉన్నట్లుండి ఈ అంతర్యుద్ధంలో పాతరోగం తిరగబడింది. అప్పట్నుంచీ మరి తగ్గనే లేదు. చివరికి యీ పరిస్థితికి వచ్చాను. నీలవేణి విషయం చెప్పడానికే మిమ్మల్ని యిక్కడికి పిలిపించాను. కాని ఉదయం మీ ముఖం చూశాక ఈ రహస్యం కూడా చెప్పడం నా విధి అనిపించింది. అందరి మాటా ఎలా వున్నా ఈ తప్పుతో మిమ్మల్ని చాలా బాధపెట్టాను. చివరివరకూ నా తప్పుకు ఫలితాన్ని మీరే అనుభవించారు."

ఏం చెప్పడానికి నోరు పెగల్లేదు వరదకి. చల్లటి లెమన్ తీసుకొచ్చి యిచ్చాడు కుటుంబరావు. బెడ్ సరిచేసి మళ్ళీ పీతాంబరం నిశ్చలంగా కళ్ళు మూసుకుని "ఈ రహస్యాన్ని యింతవరకూ ఎవరితోనూ చెప్పలేదు వరదరాజులుగారూ! నన్ను నిజంగా అర్థం చేసుకుని అసహ్యించుకోరనుకొన్నవాళ్ళతోనే చెప్పాను. మీరూ తప్పు అభిప్రాయపడితే బాధపడతాను" అన్నాడు.

ఒక్కసారి చైతన్యం తెచ్చుకుని తనని తాను కూడదీసుకున్నాడు వరదరాజులు.

ఎన్ని పొరపాట్లు చేసినా, ఎంత నిర్లక్ష్యంగా బ్రతికినా, ఆ పొరపాట్లు, ఆ నిర్లక్ష్యం, పిరికితనం వెనక వీటన్నిటికీ అందని ఆత్మపరీక్ష విమర్శ పీతాంబరంలో కనిపించింది. అందుకు సాక్ష్యం ఇప్పటి అతని యీ పరిస్థితి. కాలుజారిన తర్వాత ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక్క క్షణాన పశ్చాత్తాప పడి ఉండకపోతే ఈ క్షణానికి యిలా వుండేవాడు కాదేమో.

తప్పులు చేయడం ఎంత సామాన్యమో, పశ్చాత్తాప పడడమూ అంత సామాన్యమే అయితే ప్రపంచం ఒక స్వర్గంలా వుండేది.

"మీమీద నాకేం దురభిప్రాయం లేదు పీతాంబరంగారూ. ఎప్పుడన్నా మనస్పంతటితో ఎవరి గురించయినా పూర్తి సానుభూతితో ఆలోచించి వుంటే అది మీరే. నీలవేణి కూడా కాదు. మీలాంటి తమ్ముండుంటే బావుణ్ణనుకునేవాణ్ణి. రహస్యం నాకు తెలీకపోయినా సుజాత అప్పట్లో చచ్చిపోవడమే మంచిదనిపించింది, తర్వాత ఆలోచిస్తే మీరేం చేస్తారు? వయస్సు అలాంటిది"

లేచాడు.

ఇంకా ఏదో చెప్పబోయి ఏమీ చెప్పలేక వరదరాజులు వేపు అలానే చూస్తున్నాడు పీతాంబరం. అతని చెయ్యిపుచ్చుకుని ఊరికినే కన్నీళ్ళు కార్చాడు.

"మళ్ళీ ఎప్పుడన్నా రోగం నయమయాక మిమ్మల్ని కలుస్తాను" అన్నాడు నీరసంగా.

మసక చీకటివేళకి బయటికి వచ్చేవాడు వరదరాజులు.

ఇక ఎప్పటికీ పీతాంబరాన్ని కలవలేదతను.

మళ్ళీ పాత యింటికే వచ్చాడు వరదరాజులు. ఊరికి దూరమని ఎవరూ ఆ యిల్లు తీసుకోలేదు అందుకని ఖాళీగా పడివుందది.

ఎదురుగ్గా అనంతపద్మనాభస్వామి ఆలయ ధ్వజస్థంభం సగానికి విరిగింది రాక్షసుడి మొండితలలాగా సగానికి విరిగిన మొన గాలిలో నిలబడ్డది. ప్రజల దృష్టిని ఆకర్షించలేని దేవుడు ఆ పాడుపడిన దేవాలయంలోనే మూలుగుతున్నాడు. రెండేళ్ళ క్రిందట వచ్చిన గాలివాన ఆలయం స్వరూపాన్ని పూర్తిగా మార్చింది. మర్రిచెట్టు పెద్దకొమ్మ విరిగి సింహద్వారానికి అడ్డంగా పడింది. "దేవుడి వెన్ను మీద పిడుగుపడింది. ధ్వజస్థంబం కూలితే ఊరంతటికీ నష్టం" అన్నారెవరో. కానీ దేవుడు ఆ చీకటిగుడిలో బాగనే వున్నాడు. ఊరూ బాగానే వుంది. అయితే కష్టకాలంలో ఆదరించిన ఆప్తుల్లాగ దేవాలయంలో గూళ్ళు వదిలి గబ్బిలాలు మరెక్కడో చోటు చేసుకున్నాయి. ఇప్పుడిక పావురాలు అక్కడికి రావడంలేదు. ఊరు పాడుపడలేదు గాని, దేవాలయం పాడుపడింది. రంగుమాసి, కవళికలు మార్చుకుని మొండిగోడలు మిగిలాయి.

దేవాలయానికి ఎదురుగ్గా ఉన్న యింట్లో కూడా ఉండడానికి ఎవరికీ మనస్కరించలేదు.

దేవాలయం దుస్థితి యింటికీ పట్టిందా అనిపించింది. బంతిపూల చెట్లన్నీ ఎండి నేలకి కరుచుకున్నాయి. ఎన్నాళ్ళ క్రిందటో మంచి బ్రతుక్కి చిహ్నాలుగా మిగిలాయి. గన్నేరు చెట్టు కుడివేపు కొమ్మవిరిగి వాకిట్లో అడ్డంగా పడి వుంది. డాలీ యింటికీ, ఈ యింటికీ మధ్య అడ్డంగా పెద్ద గోడ లేచింది. గోడమీద నుంచి డిసెంబరు పువ్వులు మాత్రం కనిపిస్తున్నాయి.

లోపలికి వస్తే రెండు మేకలు వళ్ళు దులుపుకుంటూ గన్నేరుకొమ్మ మధ్యనుంచి లేచి పారిపోయాయి.

"ఈ యిల్లు వద్దన్నయ్యా" అని గులాబి భయపడుతూ అంది.

"ఇంకెక్కడా వద్దులే. ఇక్కడ ఉండడానికే అలవాటు పడ్డాం. ఎప్పుడన్నా పాత విషయాలు గుర్తుకొస్తాయి."

అన్నయ్య ముఖం విస్తుపోయి చూసి వూరుకుంది. మరింకేం ప్రశ్నించలేదు.

డాలీ తండ్రి కామ్‌దార్ వచ్చి పలకరించాడు. "ఎవరికన్నా యిద్దామంటే మీ యింట్లో ఉండడానికి యిష్టపడలేదు" అన్నాడు నవ్వుతూనే.

మాటమార్చి "అమ్మాయి బాగుందా?" అనడిగాడు వరదరాజులు.

తలుపాడు కామ్‌దార్. సాయంకాలానికి యిల్లు మళ్ళీ ఓ రూపం తెచ్చుకుని, పాత ప్రశాంతతని పొందకపోయినా అంతంత మాత్రంగా కనిపించింది.

విరిగిన ధ్వజస్థంభం ముందు సంజె వెలుగులో దీపం వుంచి వచ్చింది గులాబి. దీపం చుట్టూ రెండు పిట్టలు కిచకిచలాడుతూ ఎగిరాయి. దేవుడు యిప్పుడే వొళ్ళు దులుపుకు నిద్రలేస్తున్నట్లనిపించింది.

సివప్పన్న కిళ్ళీ దుకాణం "యింతింతై వటుడింతై" అన్నట్లుగా పెరిగి పెరిగి పెద్ద ఫ్యాన్సీ షాపు అయి కూచుంది.

ఇప్పుడు కాళ్ళవరకూ చీరాడే పెద్దకోటు మోయడం నేర్చుకున్నాడు.

గంటస్థంభం గంటలు సరిగా చూపెట్టడం లేదని పట్టణంలో అందరికీ కోపం వచ్చి రాళ్ళు వేసి అద్దాలు విరగకొట్టే, మిగతావి మునిసిపాలిటీ వాళ్ళు ఎత్తేశారు. ఇప్పుడిక గంటలు చూపించని గంటస్థంభం మాత్రం మిగిలింది.

మర్నాటి ఉదయమే ఎవరో మనిషి వచ్చి "బుద్దుని మతం ఆయన పెళ్ళాం రమ్మంటున్నారండి" అని చెప్పాడు.

ఎవరా అని ఆలోచించాడు వరద. "ఆరోగ్యం" పేరు విన్నాక గుర్తుపట్టాడు. ఇన్నాళ్ళు గోవర్ధనరావుగారు యిక్కడే వున్నారా అని విస్తుబోయాడు. సాయకాలం నుంచి ఆ ఆలోచనే లేదు. వెంటనే పనికట్టుకుని బయల్దేరాడు.

ఆ యింటినంతా పెద్ద ఐస్‌క్రీం ఫ్యాక్టరీగా మార్చారు. మేడమీద "ఆఫీస్ రూం" అని బోర్డు కనిపిస్తోంది. పదిమంది సేట్‌లు ముందు వసారాలో కూర్చుని కనిపించారు.

గోవర్ధనరావుగారు యిల్లు అమ్మేశారా అనుకున్నాడు.

ఐస్క్రీం తీపి వాసన గేటుదాకా వస్తోంది. రంగునీళ్ళు వాకిలంతా పాకి చారికలు కట్టింది.

పక్కగా వున్న చిన్నభాగపు కిటికీలోంచి ఎవరో తనని పిలిచినట్టయింది. మరుక్షణంలో ఆరోగ్యం గొంతు గుర్తుపట్టాడు.

వరదరాజుల్ని చూడగానే నవ్వడానికి ప్రయత్నం ఆరోగ్యం ముఖంలో కనిపించింది. ఆమెను చూస్తూనే ఆశ్చర్యపోయాడతను. అంత తక్కువ వ్యవధిలో మరీ వయస్సు మీరినట్లు, కళ్ళు లోతుకుపోయి నీరసంగా కనిపించింది ఆరోగ్యం. వంగపువ్వు రంగు చీర సంప్రదాయ సిద్ధంగా సిగచుట్టూ తిప్పి తలమీద కప్పుకుంది.

"నాకు తెలుసు నువ్వు మళ్ళీ వస్తావని. నీ ఉద్యోగం పోయినట్లు కాశీపతి చెప్పాడు."

"ఇక్కడకు వచ్చారా ఆయన?"

"గుమ్మంలోనేనా అంతా. రా లోపలికి. నీకు చాలా చెప్పాల్సి వుంది" నవ్వింది.

కానీ యిదివరకటి హుందాతనం, చురుకు నవ్వులో కనిపించడంలేదు. ఏదో తెచ్చిపెట్టుకున్న తొందరతనం, మనిషిలో ఆతృత, అంతలో ముభావంగా వుండడం, ఆశ్చర్యపరిచాయతన్ని.

గదిని చూస్తే మరీ బిత్తరపోయాడు వరదరాజులు. ఇదివరకు కంటే మరీ బీదగా, నిరాడంబరంగా అవుపించింది.

అవసానంలో వున్న వాలుకుర్చీని వెలుగులోకి లాక్కుని "గోవర్ధనరావుగారేరీ?" అన్నాడు.

కిటికీలో ఊచలు పట్టుకు కూచుని నవ్వుతోంది ఆరోగ్యం.

వింతగా, అమాయకంగా ఆమె వేపు చూశాడు వరదరాజులు.

విషణ్ణతతో చీలికయింది.

"ఇన్ని విన్నాక ఏడవ వద్దంటావా నన్ను?" అంది.

ఈ అసంకల్పిత విషయాల ఆశ్చర్యం వెనక, అడగాల్సిన ప్రశ్నలెన్నో మిగిలిపోయాయి.

"వినత ఎలా చచ్చిపోయింది?"

"పురుడు పోసుకుందుకు యిక్కడకు రమ్మంటే రానంది. నేనే అక్కడికి వెళ్ళాలనుకున్నాను. కానీ దౌర్భాగ్యం, ఈయనకి వంట్లో బాగోలేదు. పదిరోజుల తర్వాత హఠాత్తుగా కాశీపతి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. పురుడు రాగానే ఒక్కసారిగా వాతం చేసిందట. మర్నాడే కుర్రాడు, వినత కూడా చచ్చిపోయారు. ఇది విన్నాక ఆయన మరీ చలించిపోయారు. కానీ పైకి ఒక్కమాట కూడా అనలేదు. హైదరాబాదు వెళ్దామంటే వీల్లేదన్నారు. అంతా అయాక కూతుర్నీ, కొడుకునీ వెంటబెట్టుకుని కాశీపతి యిక్కడికి వచ్చాడు. పదిరోజులుండి వెళ్ళిపోయాడు. ఒక్కసారి కూడా ఆయన వినత విషయం మాట్లాడలేదు. జ్వరం యింకా తగ్గలేదు. అందుకని అంతా నిశ్శబ్ధంగా నిద్రపోయేవారు. పదిహేను రోజుల తర్వాత లేచి తిరిగే సత్తువ వచ్చింది. అంతే, ఆ మర్నాటి నుంచీ ఆయన కనిపించలేదు" ఒక్కసారి నిట్టూర్చి చాపమీద కూచుంది ఆరోగ్యం.

చివరి సంఘటనని ఎలా ఎదుర్కొందా అని గమనించడానికి ఆమె ముఖం చూశాడు వరద. ఆరోగ్యం గమనించి నవ్వింది. "దేనికీ విచారపడడం నాకు తెలీదోయ్. ఇదీ ఆయన దగ్గరే నేర్చుకున్నాను నేను" అంది.

ఏం మాట్లాడటానికీ తోచలేదతనికి.

"ఇల్లంతా అమ్మేశారు యిదివరకే. ఈ యింటికి నేనే యిప్పుడు అద్దె యిస్తున్నాను" అంది.

"కాశీపతి ఎక్కడున్నాడిప్పుడు?"

"హైదరాబాదులోనే వున్నాడనుకుంటాను. ఈ మధ్య మళ్ళీ ఉత్తరం రాలేదు"

నిశ్శబ్ధంగా కూచుంటే "కాఫీ చేస్తానుండు. ఆ విషయమే మరిచిపోయాను" అంది.

"ఇప్పుడు వద్దులెండి మళ్ళీ వస్తాను"

లోపలికి వెళ్తున్నదల్లా ఆగి నవ్వింది ఆరోగ్యం. "మళ్ళీ వస్తే యీ కాఫీ దొరకదు నీకు. నిన్న వచ్చావని తెలిసి చాలా సంతోషపడ్డాను. నిన్ను చూడగలిగాను కదా అని. రేపే వెళ్ళిపోతున్నాను" అంది.

"ఎక్కడికి?"

"నిడదవోలులో మా బంధువులుండాలి. అక్కడికి వెళ్ళాలనుకుంటున్నాను ప్రస్తుతానికి" లోపలికి వెళ్ళింది.

గోవర్ధనరావుగారు పారిపోయారన్న విషయం విషయం మరీ ఆశ్చర్యపరుస్తోంది. "కష్టాలు నీకేం తెలుసు. నేనెన్ని చూశానో తెలుసా? నవ్వుతూ బ్రతికితే ఏవీ నిన్నేం చెయ్యలేవు. చేవ వుంటే నీ సుఖం ఎప్పుడూ నీ దగ్గరే వుంటుంది" అని ఆయన అంటే ఎప్పుడూ ఆ వాక్యానికి అర్థం తెలిసేది కాదు. ఇప్పుడు తెలిసింది.

"సుఖం" అంటూ వేరే యేదీ వుండదు. నీ మనస్సుకు నువ్వు నచ్చచెప్పుకునే తీరులో, నీ ధైర్యంలో, నీ తెగింపులోనే వుంటుందది. అయితే యిప్పటి గోవర్ధనరావుగారి చర్య విచిత్రం. సుఖానికి స్వార్థం కూడా అవసరం ఉన్నట్లయితే ఆయన పలాయనానికి అర్థం ఉన్నట్లే. ఒక్కసారి ఆయన కనిపిస్తే బావుణ్ణనిపించింది. ఇప్పుడే చేస్తూంటారు ఆయన.

"ఏమిటోయ్ ఆలోచిస్తున్నావ్! పోతూ పోతూ నీలవేణి ఏమన్నా చెప్పింది?" అంటూ వచ్చింది ఆరోగ్యం.

"ఏమీ చెప్పలేదు. కానీ విశ్వేశ్వరం వచ్చాడు. తెలుసుగా?" అన్నాడు ధైర్యంగా. ఆమె అంతలో ఉలిక్కిపడడం, ముఖం చాటు చేసుకోవడం కనిపించగానే నవ్వొచ్చింది.

"నువ్వేం చేస్తావిప్పుడు?" అని మాట మార్చింది ఉన్నట్లుండి.

"ఇప్పటి పరిస్థితి మీకూ నాకూ ఒకటే. ఇద్దరం చాలా నష్టపోయాం. వయస్సులో సంఘర్షణా, యౌవనపు తప్పటడుగూ మనల్నేమీ చెయ్యలేకపోయాయి. వృద్ధాప్యమన్నా అవకాశమిస్తుందేమో ఆగాలి" అన్నాడు.

ఆరోగ్యం భయంతో, దిగ్భ్రమతో అతనివేపు చూస్తే మందహాసం చేశాడు వరదరాజులు "విశ్వేశ్వరం అంతా చెప్పాడు నాకు. అయినా మీమీద నాకు చాలా గౌరవం. వినత పోవడం ఎంత దెబ్బో, నీలవేణి పోవడం కూడా మీకు అంతేనని నాకు తెలుసు. వినతని మీరూ, నీలవేణిని నేనూ రక్షించుకోలేకపోయాం"

తలెత్తితే గుమ్మానికి చేరబడి ఆరోగ్యం చిన్నపిల్లలా వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆమె కన్నీళ్ళు కార్చగా అదే మొదటిసారి చూడడం.

"ఊరుకోండి, మీకు నేను చెప్పాలా?" అన్నాడు.

"తెలియక ఎప్పుడో చేసిన తప్పు అది. తెలిసి మాత్రం చేసేదేముంది? జీవితమే ఓ పెద్ద నేరమనిపిస్తుంది" అని ఆగి ఆగి అంది.

కాఫీ తెచ్చి యిచ్చింది.

లేచాడు "రేపు రైలు దగ్గర కలుస్తాను" అని బయటికి వచ్చేశాడు.

ఆరోగ్యం గుమ్మంలో మౌనంగా చూస్తూ నిలబడింది.

ఐస్క్రీం కంపెనీ వసారాలో పెద్ద పెద్ద ఐసుముక్కల్ని గుట్టగా పోశారు. వేడికి నీరుకారి, ముక్కలు కిందకి జారి ఆవిర్లు చిమ్ముతున్నాయి.

ఉద్యోగం వెదికే ప్రయత్నంలో ఉండగా బలరాం దాసు కనిపించాడు. ఎంతో దగ్గరి ఆప్తుడిలాగ భుజం తట్టి కాఫీకి రమ్మని తీసికెళ్ళి కాఫీ తాగించాడు.

తన నిస్సహాయతకు జాలి చూపుతున్నాడో, తన చేతకాని తనానికి హర్షం వెలిబుచ్చుతున్నాడో తెలీక బిత్తరపోయి మౌనంగా వుండిపోయాడు వరదరాజులు.

పోతూ పోతూ "ఉద్యోగం మానేశావని తెలిస్తే ఎక్కడన్నా పెద్ద ఉద్యోగం వెదుక్కున్నావేమో ననుకున్నాను. పరోపకారం తలపెట్టడం చాలా మంచి పనే. కానీ ప్రపంచం మీద ఏదో పగబెట్టుకుని దానిని తీర్చుకోబూనడం గుండెల్తీసిన పని. అయినా నువ్వు గొప్పవాడివే. ఉద్యోగం వదిలేయగలిగావు" అని వెళ్ళిపోయాడు.

ఆ మాటల్లో ఏ ఒక్కటీ అతని మనస్సులోంచి రాలేదని వరదరాజులుకి తెలుసు. అసలు బలరాందాసు తరహాయే అది. అయితే మాటల్లో ఎంత హేళన ఉన్నా, ఎంత చులకనతం ద్యోతకమయినా, ఆ సత్యంలో నగ్నత్వం అతణ్ణి పలకరించింది.

ఎలక్ట్రిక్ దీపాన్ని తప్పించుకుని నడుచుకుపోతున్న బలరాందాసుని చూసి ఆశ్చర్యపడ్డాడు. ఉద్యోగం యివ్వమని ప్రాధేయపడితే బావుణ్ణని ఒక్కసారి అనిపించింది. అంతలో మళ్ళీ అభిమానం అడ్డొచ్చి ఆగిపోయాడు. విశ్వేశ్వరం కంటే యిప్పట్లో తానే విధంగా ఎక్కువకాదు.

హఠాత్తుగా పద్మిని గుర్తువస్తే బీచివైపు నడిచాడు. విషయం తెలిస్తే సానుభూతి చూపించకపోదు. ఉద్యోగం ఒక్కటే చాలదు తనకు. అది లేకపోయినా ఫరవాలేదు. కాస్తపాటి సానుభూతి చూపి, తనని అర్థం చేసుకోగల వ్యక్తి కలిస్తే చాలు.

పద్మిని గుమ్మం ముందు కొత్త కారొకటి ఆగి వుంది. గేటు మీద బోర్డుమారింది. "రూడోల్ఫ్ప్రిష్" అనే పేరు కనిపిస్తోందిప్పుడు.

గేటు తలుపును ఆనుకోబోతే గూర్ఖా ముందుకు వచ్చాడు. ఎవరో విదేశస్తుడు భార్యతో బయటికి వచ్చాడు.

వరదరాజులు ఉద్యోగ్మ కోసం వచ్చాడనుకుని ఇంగ్లీషులోనే పక్కకి తప్పుకోమన్నాడు. వెనకనే వచ్చిన 'ఇటాలియన్ బ్యూటీ' కుక్క ఓసారి అనుమానంగా వరదరాజుల్ని వాసన చూసి వెనక సీట్లో హుందాగా కూచుంది.

ఇంగ్లీషులోనే వెళ్ళిపొమ్మని దొరగారు మరొకసారి వరదరాజులుకి ఆర్డరిచ్చారు.

కారు వెళ్ళాక పెట్రోలు వాసన కన్నుకుంది.

పక్కకి తిరిగితే గూర్ఖా బీడీ వెలిగించుకుంటున్నాడు.

వచ్చీ రాని హిందీలో వివరాలు అడిగితే, ఇదివరకు ఉండేవాళ్ళు బొంబాయి వెళ్ళిపోయారన్నాడు.

**ఉన్నట్లుండి ఓ రోజు** కాశీపతి దగ్గర్నుంచి వందరూపాయలు మనియార్డరు వస్తే ఎందుకు పంపాడో తెలీక ఆశ్చర్యపోయాడు వరదరాజులు.

"మీ రచనలు చూశాను. నేనిచ్చిన దానికంటే ఎక్కువ విలువ చేసేట్లు కనిపించాయవి. ఈ డబ్బు తిప్పి పంపిస్తే బాధపడతాను. వినత పోయింది తెలుసుగా? నాకు త్వరలోనే పిచ్చెక్కేట్టుంది. మీరు వచ్చి యిక్కడ నాలుగురోజులు వుంటే బావుంటుందనుకుంటాను. అనుకోవడం కాదు. వస్తారని ఆశిస్తున్నాను" అని క్రింద వ్రాశాడు. "మీతో చాలా విషయాలు మాట్లాడాలి. రండి"

ఇంత ఉత్తరం ఎప్పుడూ రాయలేదు కాశీపతి.

ఆరోగ్యాన్ని రైలుకి దిగబెట్టి వచ్చాక ఒక్కసారీ అతని గురించి ఆలోచించలేదు. ఇప్పుడిప్పుడు జ్ఞాపకం తెచ్చుకుంటే వినత స్మృతులు కూడా క్రమంగా దూరమవుతున్నట్లు కనిపించాయి. హఠాత్తుగా ఆమె కూతురు, కొడుకు గుర్తుకొచ్చారు. ఇంకా పేర్లు

మరిచిపోలేదు. చంప, శివుడు. ఒక్కసారి వెళ్తే బావుణ్ణనిపించింది. ఉద్యోగం దొరకలేదనే విసుగుదలా, నిస్పృహ, నిరాశల మధ్య భవిష్యత్తు మీద పిరికితనం కాశీపతితో గడపడంతో తగ్గలేదేమోననిపించింది.

గులాబిని అడిగితే "నాకేం భయం? నేనిక్కడ వుండగలను. వెళ్ళిరా" అంది.

అయితే ఒంటరిగా వదిలిపోవడం సమంజసము కాదు, సాధ్యమూ కాదు. కాలం చెడ్డది.

సాయంకాలం ఖాసిం తటస్థపడితే చటుక్కున ఓ ఆలోచన వచ్చింది.

"అమీనా ఎలా వుంది ఖాసిం?" అన్నాడు.

చేతులు జోడించుకుని నిలబడి "ఇన్నేళ్ళు బ్రతికాక యింత సంతోషం చూడలేదు బాబూ. మీకు చెప్పాలంటే మీరు ఊళ్ళో లేరన్నారు. అమీనా నిండుమనిషయింది. మరి రెండు నెలల్లో నన్ను తాతని చేస్తోంది" అన్నాడు.

తన విషయం ఎలావున్నా, మరొకరికి చేసిన పని సాఫల్యం వల్ల వచ్చే తృప్తి అంతా యింతాకాదు.

తను ఎలాగూ పాడవడం యింతే అయితే ఫరవాలేదు. కానీ యివాళ 50 ఏళ్ళ వృద్ధుడు కళ్ళంతా నీళ్ళు చేసుకుని, ఎప్పుడో తను ముట్టిన చిన్నపనికి జీవితమంతా పొందలేని సుఖం పొందుతున్నానంటే వళ్ళు పులకలెత్తింది వరదకి.

క్షణం మాట్లాడలేక నిలబడి "హైదరాబాదు వెళ్ళాలి ఖాసిం. ఉద్యోగం దొరకలేదు. రెండురోజులపాటు నువ్వూ అమ్మాయీ వచ్చి గులాబికి తోడుగా వుంటారా?" అన్నాడు.

ఒక్క పెట్టున పొంగిపోయి వరదచేతులు పుచ్చుకున్నాడు ఖాసిం. "ఉంటారా అనికాదు బాబూ, ఉండండి అని చెప్పాలి. రాత్రికి మీ వాకిట్లో పక్కపరుచుకుంటాను. అమీనా నా రెండు కళ్ళూ అయితే, గులాబి నా ప్రాణం" అన్నాడు.

"అమీనా భర్తని అడిగానని చెప్పు. ఎలా వుంటున్నాడు? మంచివాడేనా?"

"అల్లా తిన్నగా చూశాడు బాబూ. ఎప్పుడూ మీ పేరే అంటాడు" అన్నాడు.

సాయంకాలానికి ఖాసిం వచ్చాడు. మర్నాటి ఉదయమే బయలుదేరాడు వరదరాజులు.

ప్రయాణానికి ఓ లక్ష్యం అంటూ లేదు. కాశీపతి రమ్మన్నాడు. రమ్మనడంలో లాంఛనం కంటే ఏదో ప్రాధేయత, దైన్యం కనిపించి కాదనలేకపోయాడు. మరో వాక్యం తనని కట్టిపడేసింది. "మీతో చాలా విషయాలు మాట్లాడాలి"

కాశీపతితో తాను గడిపిన రోజులు చాలా తక్కువ. అలాంటిది తనతో మాట్లాడవలసిన విషయాలేముంటాయని విస్తుపోయాడు. అయినా ఏమీ లేనిదే అలా ఒక్కనాటికి రాయడు కాశీపతి. మాట విలువ తెలుసతనికి. వినతపోయినప్పటి అతనిలో మార్పు విచిత్రంగా ఉండవచ్చు.

బయల్దేరుతున్నానని టెలిగ్రాం యిస్తే, స్టేషనుకు వచ్చాడు కాశీపతి. ఇదివరకు కంటే మరీ సన్నగా పాలిపోయినట్లు కనిపించాడు. పంచె, లాల్చీ వొంటికి అతకనట్లు వేలాడుతున్నాయి. కుర్రాణ్ణి ఎత్తుకుని నిలబడ్డాడు. అతని పక్కనే నిలబడ్డ అమ్మాయిని వెంటనే గుర్తుపట్టాడు వరదరాజులు. చంప అతణ్ణి విచిత్రంగా చూసింది. శివుడు చేత నమస్కారం చేయించాడు కాశీపతి. చంప కళ్ళు మళ్ళీ పాత వినతని గుర్తుతెస్తున్నాయి. క్రిందకి వంగి ముద్దుపెట్టుకున్నాడు.

"వ్రాశానేగాని మీరు వస్తారని నమ్మకం లేదు. ఏం పనిలో ఉంటారో అనుకున్నాను గులాబి యేదీ?"

"అక్కడే వుంచేశాను"

"ఒంటరిగానా?"

"ఫరవాలేదు. తోడుగా ఉండడానికి ఏర్పాట్లు చేసే వచ్చాను"

కాశీపతి ముఖంలో అసంతృప్తి కనిపించింది. చంప చెయ్యిపుచ్చుకున్నాడు. ఇంతలో డ్రైవరు ప్లాట్‌ఫారం మీదకి వచ్చాడు. శివుణ్ణి తీసుకుంటూ కారు సిద్ధంగా వుందన్నాడు.

పదండి. ఇవాళ్టినుంచీ ఓ పదిరోజులపాటు పనంతా మరిచిపోయి మీతో గడుపుతాను అన్నాడు.

కారు వెనక సీట్లో కూచుని తలవెనక్కి వేలాడేసి కళ్ళు మూసుకుంటూ ఉన్నపాటునే ఈ ఘర్మంతా పోయినా నేను విచారించనండి. కానీ వినతపోయిదంటే అలా బాధపడ్డాను అన్నాడు.

"మీరు మద్రాసులోనే ఉండగా వ్రాయాలనుకున్నాను. కానీ మీరు కూడా కష్టాల్లో వున్నారు. నా బాధ ఎందుకులే అని వూరుకున్నాను. మీకు తెలుసా యిది? చనిపోయే ముందు మిమ్మల్నోసారి చూడాలనుకుంది వినత" అన్నాడు.

వరదరాజులు ఆలోచిస్తున్నాడు. ఆ విషయం తెలిస్తే ఒక్కరోజన్నా ఎలాగో వీలుచేసుకుని వచ్చేవాడే, ఏం చెప్పాలనుకుందో చివరి క్షణాల్లో

"మీరు డబ్బు పంపమని ఉత్తరం వ్రాశారంటే, పంపేవరకూ నన్ను బ్రతకనివ్వలేదు. తర్వాత నాకు విషయం తెలిసింది. నీలవేణి కూడా పోయిందటగా?"

మందహాసం చేశాడు వరదరాజులు.

"అవును, పోయింది. ఇప్పుడు మీకంటే నేనేవిధంగా సుఖంగా వున్నానో అర్థం కాదు"

"పోనీలెండి ఆ విషయం, వాళ్ళు చనిపోవడం ఒక సంగతి. అంతకంటే వాళ్ళ మృతికి మనమే కారనమా అన్న అనుమానం భరించరానిది"

వరదరాజులు ఆ మాట విని తుళ్ళిపడ్డాడు. అతని దిగ్భ్రమ చూసి కాశీపతి నవ్వి భుజం తట్టాడు. "రాత్రి మాట్లాడుకుందాంలెండి. ప్రయాణంలో మీరు చాలా నలిగిపోయారు"

వరద మనస్సు పరిపరివిధాల పోయింది.

ఏమైనా కానీ, కాశీపతి ఏదో విచిత్రమయిన విషయం చెప్తాడనుకున్నాడు.

ఇల్లు యిదివరకటంత ఆడంబరంగా కనిపించడంలేదు. గదంతటికీ రేడియో ఒక్కటే కాస్త శుభ్రంగా కనిపిస్తోంది. ఎక్కడ కూచున్నా చేతిదూరంలో ఆటబొమ్మలు అందేట్లున్నాయి. వాటిమీద కాశీపతి కొన్ని వందలు ఖర్చుచేశాడా అనిపించింది.

వాటన్నిటినీ వరద ఆశ్చర్యంగా చూస్తూంటే నవ్వి "నాకు పిల్లల్ని ఆడించడం ఎలాగో తెలీదు. వినత పోయినదగ్గర్నుంచీ చంపతో, శివుడుతో ఆడడం అలవాటు చేసుకున్నాను. ఇదివరకయితే యిద్దరు ఆయాలుండేవారు, ఇప్పుడు వాళ్ళందరినీ మానిపించేశాను" అన్నాడు.

మేడమీద పోర్టికోకు చుట్టూ గుండ్రంగా పూలకుండీలు ఏర్పాటు చేశారు. మధ్యగా సన్నటి స్థంబం చివర నీలిదీపం వుంది. మేడంతటికీ రెండు గదులు మాత్రమే వున్నాయి.

"ఇంత యింటికీ మేమిద్దరమే వుండేవాళ్ళం. ఇప్పుడు ఆ గదిని మీకు ఏర్పాటు చేయించాను" అన్నాడు.

గదితలుపు తీస్తే ఇరవైరోజులపాటు బయట ఎవరి అవసరమూ లేకుండా గడపగలిగే సరంజామా అంతా ఆ గదిలో కనిపించింది. ఎదురుగ్గా మంచి గంధంతో చెక్కిన పల్చటి బోధిసత్త్వుడి శిరస్సూ, ప్రకృతి త్రైవర్ణిక దృశ్యాలూ, నగిషీలు చెక్కిన టేబిలూ, పక్కనే మంచం అనుభవించడానికి కాక, అక్కడివన్నీ ఏదో ప్రదర్శనలాగా చూసి సంతోషించడానికి సిద్ధం చేసినట్లు వున్నాయి.

"కంపెనీకి వెళ్ళను పదిరోజులవరకూ అన్ని ప్రయత్నాలూ చేశాను పాత విషయాల్ని మరిచిపోవడానికి. మీరు నన్నే విధంగా మార్చగలరో చూడాలి" పాత విషయాలు మరిచిపోవాలన్న దృఢవిశ్వాసం వున్నా, ప్రతి కదలికలో, ప్రతిమాటలో వినతని గుర్తుచేసుకోవాలనే ప్రయత్నం తెలుస్తోంది.

రాత్రి పోర్టికోలో కూర్చున్నాక మాటలు సాగిస్తూ ఉన్నట్లుండి లేచి నిలబడి పిట్టగోడ మీదికి వచ్చి కూచున్నాడు కాశీపతి.

"ఒక ప్రశ్న అడగనా?" అన్నాడు.

పిట్టగోడమీద ఆనుకున్న కాశీపతి నీడ పొడవుగా పోర్టికోకు అడ్డంగా పడింది.

"అడగండి" అన్నాడు వరదరాజులు కాస్సేపాగి.

"ఉత్తరాల్లో అడిగి తెల్సుకోవసిన సమస్యలు కావివి. ఎప్పుడన్నా యీ ప్రశ్నకు అడిగి మీ ముఖం చూడాలనిపించేది" అని అతనికి ఎదురుగ్గా కుర్చీ లాక్కుని "వినతని మీరెందుకు పెళ్ళి చేసుకోలేదు?" అన్నాడు.

ఊహించినంత అదురుపాటు వరదరాజులులో కనిపించకపోయేసరికి విస్తుపోయాడు కాశీపతి. కాశీపతి తనవేపే చూస్తున్నాడని గుర్తించి తలన్నా ఎత్తలేదతను.

అంతలో ఫక్కున నవ్వేసి "ఈ విషయం ఆమెనే యెప్పుడన్నా అడగలేదా?" అన్నాడు కుర్చీలో వెనక్కి చేరబడి.

"అడిగాను. అతనంటే నాకు భయం అంది"

ఆశ్చర్యపోయాడు వరద.

"అతనికేం చేతకాదు. అలాంటి వ్యక్తితో బ్రతకడం నాకు విసుగు" అన్నదేమోననుకున్నాడు.

భయం కలిగించేంత దగ్గరగా వినతని చూడలేదు. విచిత్రమయిన శిల్పంలాగ, సంఘం ఆపాదించిన అన్ని బలహీనతల్నీ మోసుకుని బ్రతికిన ఓ శక్తిగానే ఆమె తెలుసు తనకు.

ఆమెను సంఘం ఆవరించుకుని, అనుభవించి, నలిపేసి వెనక్కి తిరిగేసరికి ఏమీలేకుండా చేసిపోయింది.

నవ్వొచ్చింది. కాశీపతి ఉన్నాడన్న గుర్తులేకుండా ఫక్కున నవ్వేశాడు. కాశీపతి నివ్వెరపోయాడు.

"నవ్వుతారేం?"

"చివరిసారిగా నన్ను చూడాలని ఎందుకనుకున్నదని మీ ఉద్దేశం?"

తెల్లబోయి చూశాడు కాశీపతి "ఎందుకు?"

"నా మీద ఓ పెద్ద సవాలు చేయడానికి. జీవితంలో నీకేం కావాలో తెలీదని, నిర్లక్ష్యం చేసి దూరంగా పోయిన నాకు పాఠం నేర్పాలని. మీ వంటి సమర్థులనీ, ఈ పిల్లలనీ, తన మాతృత్వాన్నీ, చిరునవ్వునీ, ఈ బంగళానీ సాక్ష్యంగా తెచ్చుకుని నేనింకా ఇలాగే వుండడాన్ని చూసి, విజయాన్ని చాటుకుందామని" ఏదో తెలీని ఉద్రేకంలో ఒక్కసారిగా అనేశాడు. అంతలో అతనివేపు తిరిగి "వినత సుఖం కోసం బ్రతకలేదు. సుఖంగా బ్రతుకుతున్నానని చాటుకునేందుకు బ్రతికింది." అన్నాడు.

కాశీపతి ఆశ్చర్యానికి మేరలేదు. వరదరాజులు వేపు దిమ్మరపోయి చూస్తూ కూచున్నాడు.

"నా ప్రశ్నకు జవాబు చెప్పలేదు మీరు" అన్నాడు మరి కాస్సేపటికి.

ఆలోచిస్తున్న కొలదీ, వినత జీవితానికి అర్థం అవగాహనకి వస్తున్న కొలదీ ఉత్సాహంగా వుంది వరదరాజులుకి.

"నేను వినతని ఎందుకు పెళ్ళి చేసుకోలేదు? అని అడక్కండి. వినత ఎవరన్నా ఎందుకు పెళ్ళి చేసుకోవాలి? అని అడగండి. ఆమెకు పెళ్ళికాదు ముఖ్యం. ఇంకా అంతకుమించిన ఆశయం."

అంతలో ఆగిపోయి కళ్ళు మూసుకున్నాడు.

"పెళ్ళికి ముందు మీతో పార్కులో మాట్లాడిన విషయం నాతో చెప్పింది" అన్నాడు కాశీపతి.

"అది విని ఒక్కసారి నవ్వుకుని వుంటారు. అవునా?"

"లేదు. మీరెందుకు అభ్యంతరం చెప్పారా అని ఆశ్చర్యపోయాను"

బిగ్గరగా నవ్వాడు వరదరాజులు.

"ఇద్దరం ఆ రోజు యెంత విచిత్రంగా ప్రవర్తించామా అనుకుంటాను. జీవితంలో ఎప్పుడన్నా తెలివిగా ప్రవర్తించానా అంటే ఆ ఒక్కరోజేననాలి. ఆమెకు నేను అక్కర్లేదు. మీరూ అక్కర్లేదు. తాను సుఖంగా బ్రతుకుతున్నానన్న ఆలోచన, ఆ తృప్తి - అవీ కావాలి"

మరి ఒక్క ప్రశ్న కూడా వేయలేదు కాశీపతి.

కాస్సేపాగి "ఇక పోదాం పదండి. నాకు నిద్రవస్తోంది" అన్నాడు వరదరాజులు.

ఎందుకో ఒక్కసారి మనస్సంతా ఖాళీ అయిపోయినట్లనిపించింది వరదకు. వినత చివరిక్షణాల్లో రాగలిగితే బావుండేదనిపించింది. సాధ్యం కాదన్న పనిని సాధించానన్న గర్వంతో చూసేదేమో అప్పుడు. అయితే ఆ విషయాలన్నీ కాశీపతితో ఎందుకు చెప్పాల్సి వచ్చిందో అర్థంకాలేదు.

అదో వింత కల, ఇప్పుడు ఎవరు తీరుస్తారా సమస్యని?

ఉదయం కాశీపతి అన్నమాట గుర్తుకొచ్చింది. "మృతికి కారణం ఎవరు అయారన్న ఆలోచన బాధపెట్టోంది."

ఓ పిచ్చి ఆలోచన గుండెల్ని వణికించింది.

చివరివరకూ తనమీద ప్రేమతోనో బ్రతికిందా వినత?

ఆమె మృతికి ఎవరు కారణమన్న సమస్య.

అలా అయితే తనా, కాశీపతా అందుక్కారణం.

బైట నీలిరంగు దీపం ఆరిపోయింది. నిద్రపట్టడం లేదు వరదరాజులుకి.

నిజంగానే పదిరోజుల్లో చాలా తేరుకున్నాడు కాశీపతి.

కానీ ఇంకా యేదో చెప్పాలనుకున్న విషయం చెప్పలేక గుంజాటన పడటం స్పష్టంగా తెలిసిపోయింది వరదకి. ఓ రోజు ఆ విషయం అడిగితే, ఒక్కసారి వరదరాజులు ముఖం సూటిగా చూసి అంతలో నవ్వేసి "మీరిక్కడే యెప్పుడూ వుండిపోకూడదూ?" అన్నాడు కాశీపతి.

చిన్నపిల్లాడు రబ్బరు బొమ్మని కావాలన్నట్లు ప్రాధేయపడడం చూసి నవ్వొచ్చింది వరదకి.

"మీరు కాస్త 'నేను'గా మారండని అడిగినట్లుంది"

మరిక ఏమీ అడగలేదు కాశీపతి. పదిరోజుల తరువాత చంపతో కలిసి వరదరాజుల్ని దిగబెట్టడానికి స్టేషనుకు వచ్చాడు.

"మీ రచనలన్నీ చదివాను. ఇప్పుడిప్పుడు ఆలోచిస్తే బావుంటున్నాయి. అసాధ్యమేమీ లేదని అనుభవం వల్ల తెలుసుకోవడం చేతనేమో" అన్నాడు.

రైలెక్కుతూంటే "మిగతా రచనలన్నీ పంపండి. పోనీ ఇక్కడే వుండి నా పనిలో తోడ్పాటుగా వుండకూడదూ?" అన్నాడు.

డ్రైవరు పాపను ఎత్తుకుని నిలబడ్డాడు. సిల్కు కండువాను రెండు భుజాలమీంచి తిప్పుకుని చేతులు కట్టుకు నిలబడ్డాడు కాశీపతి. మొదట చూసినప్పటికంటే ఎందుకు మారిపోయాడా అని దిగ్భ్రమ కలిగింది. ఇదివరకటిలాగా కళ్ళల్లో ధైర్యం, పట్టుదల స్థానే క్రిందనీడలుపడి దిగులు, పిరికితనం కనిపించింది. వినతని ఒక్కన ఊహిస్తూ కాశీపతిని అలానే చూస్తూ వుండిపోయాడు.

"ఏం చూస్తున్నారు?" అనడిగాడు కాశీపతి.

"మీరు మళ్ళీ పెళ్ళిచేసుకోండి"

చంప డ్రైవరు భుజం దిగి కాశీపతి చేయిపట్టుకుని నిలబడింది.

తన మాటల్ని విని నవ్వుతాడేమోననుకున్నాడు వరద. కానీ అలసటగా వరదరాజులు ముఖం చూస్తూనే వుండిపోయాడు కాశీపతి.

ఇంజను పొగ నల్లగా నీడలు తిరిగి స్టేషనంతా వ్యాపించింది.

"అదే అనుకుంటున్నాను. చంపకు అన్యాయం జరగకుండా చూడాలి" అంటే వరద ఆశ్చర్యపోయాడు. నిజంగా అతనికా ఆలోచన వుందా అని.

రైలు కదులుతూంటే వరదరాజులు చెయ్యిపుచ్చుకుని "ఈ పదిరోజులూ మీకో విషయం చెప్పడానికి ప్రయత్నించి నోరు మెదపలేకపోయాను. మీరక్కడికి చేరగానే ఉత్తరం వ్రాస్తాను. తప్పక జవాబు వ్రాస్తారు కదూ?" అన్నాడు.

అతని కళ్ళల్లో దైన్యత చూసి చలించిపోయాడు వరదరాజులు.

"ఉత్తరం చూసి నన్ను మాత్రం అపార్థం చేసుకోకండి. మీరంటే గౌరవం నాకెప్పటికి వుంటుంది" అన్నాడు కాశీపతి చెయ్యిగాలిలో ఆడిస్తూ.

మరి నాలుగురోజులకి ఉత్తరం వస్తే చదువుకుని గుక్క తిప్పుకోకుండా నవ్వుకున్నాడు వరదరాజులు.

ఉత్తరంలో ఒక్కటే ముఖ్యమైన వాక్యం "గులాబిని నేను పెళ్ళిచేసుకుంటే మీకు అభ్యంతరమా?"

ఇన్నాళ్ళూ యిట్లాంటి విషయాలు ఆలోచించడానికయినా తీరికలేకుండా పరుగులు తీశాయి పరిస్థితులు. తన వ్యక్తిగత సమస్యల మధ్య పూర్తిగా సతమతమయింది గులాబి. ఇప్పుడాలోచిస్తే ఈ గందరగోళంలో ఆమెకు యెంత అపకారం చేశాడో అర్థమయింది. అన్ని చిక్కులలో తనతోపాటు నడిచి, సాయపడి దారేదో తెన్నేదో తెలీక ఆ గమ్యంలో ఆగిపోయింది గులాబి.

"ఇంత వేళాయనే.

సుంత కనుగొనవేమి?

కాంతదాసుడవంటే

అంత కినుకేలరా"

అని పాడుతోంది గులాబి.

ఉత్తరం పట్టుకుని లోపలికి నడిచాడు.

లోపల కూచుని మందారాలు కుప్పపోసుకుని దండ గుచ్చుతూ జావళి పాడుతోంది.

అన్నయ్యను చూసి "మళ్ళీ కాఫీ కావాలా?" అంది.

మాట్లాడకుండా యెదురుగ్గా పీట వేసుకుని కూచున్నాడు.

అతని చేతిలో చూసి "ఎవరు రాశారు? ఆరోగ్యం దగ్గర్నుంచా?" అంది.

"కాదు. కాశీపతి వ్రాశాడు"

"ఇంత తొందరలోనా? మొన్ననే కూడా వుండి వచ్చావుగా?"

జవాబు చెప్పకుండా గులాబి ముఖం గమనిస్తున్నాడు వరదరాజులు.

అన్నయ్య కళ్ళల్లో విస్మయాన్ని చూసి తెల్లబోయింది గులాబి.

"ఏమిటన్నయ్యా! అలా చూస్తున్నావు?"

"గులాబీ నా మీద నమ్మకం ఉందా?" అన్నాడు ఎంతోసేపటికి మాటలు కూడదీసుకు?

భయపడింది గులాబి.

"అదేమిటి?" అంది.

"నీకు తెలియకుండానే నీకు చాలా అన్యాయం చేశాను నేను. ఇవాళ యీ వుత్తరం వచ్చేవరకూ మళ్ళీ నాకా ఆలోచనేలేదు. అన్నీ పోయాయి నాకు. కానీ నాది అని చెప్పుకోగల ఒక్క ఆస్తి మాత్రం మిగిలింది. నువ్వు కాశీపతి నిన్ను పెళ్ళిచేసుకుంటావని ఉత్తరం వ్రాశాడు. ఏమంటావ్?"

పాలు పొంగితే తొందరపడి నీళ్ళు గుమ్మరించింది గులాబి. `కాశీపతి` అన్నమాటే గుర్తుందామెకు.

"ఏం దూరపు వ్యక్తికాదు. వినత పోయాక చాలా కృంగిపోయాడు. పెళ్ళి చేసుకుంటే కాశీపతి బాధ్యతేకాదు. వినత కూతురు, కొడుకూ ఉంటారు."

లేచి తువాలు తీసుకుని స్నానానికి వచ్చాడు. స్నానం చేసి వచ్చేసరికి గుమ్మానికి ఆనుకుని నిలబడింది గులాబి.

అతను వచ్చాక ఏం ఆలోచించిందో యేమో "చేసుకుంటాను" అంది అన్నయ్య ముఖం వేపు చూడకుండానే.

ఆమె కళ్ళల్లో నిశ్చయాన్ని గమనించి నిర్ఘాంతపోయాడు వరద.

ఆ సాయంకాలమే కాశీపతికి పెద్ద ఉత్తరం వ్రాశాడు.

**గులాబి** ఎర్రటి చీర గాలికి రెపరెపలాడడం కనిపించింది. తన సంస్కారంతో, నేర్పుతో గులాబిని కూడా కాస్త మార్చాడు కాశీపతి.

కనిపించే మేరకు వాళ్ళను చూస్తూ కూర్చుని "నేను చేసిన మంచి పని యిదొక్కటే కాబోలు" అనుకున్నాడు.

లక్ష్యాన్ని సాధించడానికి ప్రతి గవాక్షాన్నీ తట్టి అలిసిపోయిన పథికుడులాగా మూలుగుతోంది రైలు. పాత సంగతుల్ని ఆలోచించడానికి మనస్సు మొరాయిస్తోంది. తన ఒంటరితనానికి ఏదన్నా ఆస్కారం వుంటే బావుణ్ణనిపించింది. ఇంతకాలం ఆదర్శాలను, లక్ష్యాలను అండగా వుంచుకున్నాడు. వాటి అనావశ్యకత అంతా పూర్తయాక అర్థమయింది. గులాబి చివరగా చెప్పిన వాక్యం గుర్తుకొచ్చి మళ్ళీ నవ్వుకున్నాడు.

గోవర్ధనరావుగారుంటే ఓ కిరస్తానీ అమ్మాయిని చేసుకోమని సలహా యిచ్చేవారు.

వెంకటపతి అయితే భార్య వున్నదనుకుని బ్రతకడం నేర్చుకోమంటాడేమో?

పీతాంబరం "భార్యతో బ్రతకడం ఒక గేమ్ అనుకోవడం అలవాటు చేసుకోండి ముందు" అంటాడు.

విశ్వేశ్వరం "నువ్వు బ్రతుకుతున్నావా? అది మొదట ఆలోచించు" అంటాడు.

తెలతెలవారుతూండగా వరదరాజుల్ని ఎవరో తట్టిలేపారు.

రైలు గడగడలాడుతూ నీటిమీద పాకుతోంది.

ఒక్కసారిగా ఆ వ్యక్తిని పోలిక పట్టలేక తికమకపడ్డాడు వరద. "నేను కుటుంబరావును. గుర్తుందా?" అన్నాడతను. విజయవాడ దీపాలు కిటికీలోంచి కనిపిస్తున్నాయి.

తూర్పు ఆకాశం వెలుగులో కొండ రంగు వేసుకున్నట్లుంది.

"గుర్తుంది. పీతాంబరం ఎలా వున్నారు?" అన్నాడు వరదరాజులు.

"ఇప్పుడా? మీరు వెళ్ళిన పదిరోజులకే పోయాడు. సరి, రవణమూర్తిని చూస్తారా?"

తుళ్ళిపడ్డాడు.

"రవణమూర్తా, ఏ రవణమూర్తి?"

"నాకు తెలుసునతడు. ఓసారి పీతాంబరాన్ని చూడడానికి కూడా వచ్చాడు. ఇద్దరూ మీ గురించి మాట్లాడుకున్నారు కూడాను."

నిద్దరమత్తు యింకా వదల్లేదు.

మురికి కూపాల్ని దాటి గడబిడగా విజయవాడ వేపు పరిగెత్తుతోంది రైలు. కుటుంబరావు తలుపు పట్టుకుని నిలబడ్డాడు.

సన్నగా, వేరులా వుండే రవణని ఊహించడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు వరదరాజులు.

ఒక్కసారిగా కుటుంబరావు వేపు తిరిగి "చూస్తాను" అన్నాడు.

రైలు ప్లాటుఫారాన్ని పట్టుకుని మెల్లిగా ముందుకు నడుస్తోంది. సంచి పట్టుకుని దిగడానికి సిద్ధమవుతూ "అయితే యీ పక్క స్టేషనులో 'ముస్తాబాద్'లో దిగండి. రెండు మైళ్ళు నడిస్తే చిన్నవూరు వస్తుంది. పేరు 'పురుషోత్తమపురం'. అక్కడ అడిగితే చెప్తారు.

రైలు ఆగడంతోటే దిగి నమస్కారం చేశాడు. ఇంకేదో అడగబోయేలోగానే పది గజాలు దాటిపోయాడు. విస్తుపోయి అలానే చూస్తూ నిలబడ్డాడు వరద.

రైలు 'ముస్తాబాద్'లో ఆగీ ఆగడంతోటే మరో ఆలోచనలేకుండా దిగిపోయాడు.

రవణ ఎలా వున్నాడు? అన్న సందిగ్ధం కంటే ఎంతగా మారాడా అన్న ప్రశ్న మాటిమాటికీ వేధిస్తోంది.

వరసగా నలుగురు నిలబడడానికి చాలని చిన్నదొడ్డిలా వుంది ముస్తాబాద్.

ఎవర్నీ ఏమీ అడగకుండా బయలుదేరాడు వరదరాజులు.

అమ్మ, చెల్లెలు, ఆశలూ, కోరికలూ అన్నీ పోయాక యీ మారుమూల, ఈ కుగ్రామంలో రవణ ఏం చేస్తున్నాడా అన్న ఆశ్చర్యం పోను పోను ఎక్కువవుతోంది.

సగం విరిగిన బోర్డు మీద "పురుషో..." అన్న అక్షరాలు మాత్రం మిగిలాయి. కుటుంబరావు చెప్పిన విషయం తప్పు. ఇంకా మూడు మైళ్ళుంది ఊరు.

తూర్పు ఆకాశం మరీ ఎర్రబడింది.

బొగడచెట్టు కాస్త పాటి నీడలో అర్ధనగ్నంగా దిగుడుబావి దగ్గర స్నానం చేస్తున్న ఆడంగులు వరదని విచిత్రంగా చూశారు.

వాళ్ళని చూస్తూ బాటకు దూరంగా అడుగువేశాడు. అడుసులో కాలుజారి పడబోతే ఎవరో రైతు ఆదుకుని ఆపాడు.

"ఏంది బాబూ?" అంటున్నాడు.

"పురుషోత్తమపురం పోవాలి"

వేలెత్తి చూపించి అరకను భుజం మీద మార్చుకుని నడిచిపోయాడు. బాట కొండచుట్టూ తిరిగి వరిపొలాల మధ్య నుంచి దారి తీసింది. కనచూపు మేరవరకూ వరివెన్ను పచ్చదనం కళ్ళు చెదిరిస్తోంది. పొలం మధ్యగా వుండగా వీచిన గాలికి వెన్నులు కదిలి చేతికి తగిలితే గగుర్పాటు కలిగింది. నేలచెమ్మకు పంచె తడిసి జీరాడింది. మరయిదు నిముషాల్లో ఏభై గడపతో చిన్నగ్రామం కనిపించింది. ఆటకి పేర్చిన బొమ్మరిల్లులాగా, వరసగా తీర్చిన గుడిసెలు వింతగా కనిపించాయి. మర్రిచెట్టు పళ్ళెం మీద కూచున్నవాళ్ళంతా అతణ్ని విచిత్రంగా చూశాడు.

"రవణమూర్తి అని ఒకాయన వుండాలిక్కడ" అన్నాడు.

"సింగయ్య తాత తాలూకు" అన్నారెవరో.

బొద్దుగా పొట్టిగా వున్న కుర్రాడొకడు లేచి "రండయ్యో" అన్నాడు.

గ్రామమంతా మూడు వరసల్లో ఉంది.

ఊరికి మధ్యగా పందిరి వేసినట్లు పెద్ద మర్రిచెట్టు కుడివేపు. పొలాల్లోకి నీరుతోడే ఏతాం. యిటువేపు ఏదో అమ్మవారి గుడీను.

రెండో వరసలో మూడో యిల్లు చూపించి మాయమయాడు కుర్రాడు. వెదురు మద్దెలతో ముందు వసారాకు అడ్డుకట్టిన అరుగుల పక్కనే చిన్నగదీ, లోపలికి వెళ్ళడానికి యింటి తలుపూ కనిపించాయి.

ఇంతదూరం వచ్చి, యీ యిల్లు చూశాక మొదట వరదకి అనుమానం వేసింది. తనను కుటుంబరావు మోసపుచ్చాడేమోనని. రవణ యిలాంటి గ్రామంలో, యీ గుడిసెలో ఉంటాడన్నది నమ్మలేని విషయం. ఎడ్లబండి ఎదురుగ్గా వస్తే పక్కకి తప్పుకుని యింటిరాటను పట్టుకున్నాడు. యింట్లోంచి ఎవరో స్త్రీ పైకి రాబోయి వరదని చూసి ఆగిపోయింది.

వరద సంశయం మరీ ఎక్కువయింది. రవణ యిక్కడ ఉండడని నిస్సందేహంగా తోచింది.

ఇంట్లోంచి ఎవరో పాడుతున్నారు. ఒక కుర్రాణ్ణి భుజం మీద వేసుకుని ముందొక అమ్మాయిని చేతుల్తో ఎగరేస్తూ పాట చివరి పదాల్ని నానుస్తూ లోపల్నుంచి వచ్చాడొకాయన.

చివరిసారిగా ప్రయత్నించాలని రవణ విషయం అడగబోయాడు వరద.

అరుగువేపు తిరిగి ఆ వ్యక్తిని చూసి ఒక్కసారిగా నిశ్చేష్టుడయాడు. ఇద్దరి పిల్లల్తో ఆడుకుంటున్న రవణమూర్తి స్పష్టంగా గుర్తు తెలిశాడు.

వరదని చూస్తూనే అరుగుమీద చదికిలబడి, అతని రెండు చేతులూ పుచ్చుకుని "వరదా!" అన్నాడు రవణ.

గుమ్మానికి చేరబడి ఆ యిల్లాలు అలాగే నిలబడింది.

అంతా విచిత్రంగా, ఏదో కలలాగా జరిగిపోతున్నట్లుంది వరదకి.

పిల్లలిద్దరూ అతని రెండు భుజాల్నీ పట్టుకుని వదలడం లేదు. తేరుకునేసరికి వెయ్యి యుగాలు పట్టింది వరదరాజులుకి.

"ఎలా వచ్చావిక్కడికి?" అన్నాడు రవణమూర్తి మటం వేసుకుని అరుగుమీద కూచుంటూ.

మాట్లాడలేకపోతున్నాడు వరద.

"వీళ్ళిద్దరూ పిల్లలు" అన్నాడు రవణ యింకేం మాట్లాడడానికీ తోచక.

"ఉండవేమోననుకున్నానిక్కడ. చివరి క్షణం వరకూ అనుమానం వేసింది. నీకు పిల్లలంటే మరీ దిగ్భ్రమగానే ఉంది."

సిగ్గుపడ్డాడు రవణ. రవణలో చాలా మార్పు కనిపించింది. పాత పిరికితనం, భయం, తాటస్థ్యం అన్నీపోయాయి. ముఖంలో నిబ్బరం, ధైర్యం, అంతకు మించి తృప్తి కనిపించి ఆశ్చర్యపోయాడు వరదరాజులు.

రవణమూర్తి జీవితంలో యింత మారగలడన్నది కలలో కూడా ఊహించలేని విషయం. వీటన్నిటికీ వెనక యింత మార్పు కలిగించే ఏదో అనిర్వచనీయమైన శక్తి ఉండాలనిపించింది. ఆ ప్రశ్నే అతణ్ణి అడిగాడు.

"ఇంతగా ఎలా మారగలిగావ్?"

నవ్వాడు. "ఏమో, నాకే తెలీదు. మా ఆవిణ్ణి చూపిస్తాను రా" చెయ్యిపట్టుకుని లోపలకు తీసుకెళ్ళాడు.

వరదని చూసి నివ్వెరపోయి గోడని ఆనుకుని నిలబడ్డదామె.

"వరదరాజులు అని చెప్పేవాణ్ణే - యితను" అన్నాడు క్లుప్తంగా.

వింతగా, ఏదో అద్భుతాన్ని చూస్తున్నట్లు కళ్ళు పెద్దవి చేసి చూస్తూ నిలబడ్డదామె. ఎర్రటి కుంకుమ, బొద్దుగా మొండిగా మెడమీదకి తిరిగి వాలిన జుత్తూ, సన్నటి మెడని గట్టిగా కావలించుకున్న వెడల్పాటి ఆభరణం, ముక్కుకి విచిత్రమయిన అలంకారం పల్లెటూరి సంప్రదాయమంతా పూర్తిగా ఆమెలో కనిపించింది.

"నేనింతగా మారడానికి కారణం ఏమిటా అని అడుగుతున్నాడు" అన్నాడు రవణ నవ్వుతూ.

బెరుకుగా చూస్తూనే నవ్విందామె.

"ఇక్కడ కాఫీ అదో తమాషా. ఈ గ్రామమంతటికీ ఒక్క మా యింట్లోనే కాఫీ తయారవుతుంది. కూచుందాం రా" అన్నాడు.

మరీ ఎత్తులేని బల్లమీద కూచున్నాక "ఎలావచ్చావిక్కడికి?" అన్నాడు వరద.

"ఏమో నాకే తెలీదు. పాత విషయాలేవీ గుర్తులేవు నాకు" అన్నాడు చిన్నమ్మాయిని మోకాళ్ళకు ఆనించుకుంటూ.

"ఏవీఁ గుర్తులేవా?"

"ఊహూఁ"

"నీలవేణి?"

తెల్లబోయి ఒక్కసారి వరద ముఖం చూశాడు.

"ఇప్పుడెక్కడుంది?"

సూటిగా రవణ కళ్ళల్లోకి చూశాడు "ఏం? మీ ఆవిడనీ, పిల్లల్నీ పరిచయం చేస్తావా?"

"........"

"పోనీ యిక్కడికి నేను తీసుకొచ్చేదా?"

"ఇక్కడికా! ఎందుకు?" అన్నాడు ఆతృతగా.

ఫక్కున నవ్వాడు వరదరాజులు అతని అదురుపాటు చూసి.

"ఒక్కటి చెప్పు పోనీ, నీలవేణి నన్ను పెళ్ళి చేసుకున్న విషయం తెలుసా?"

"పీతాంబరం చెప్పాడు"

"వినత చచ్చిపోయిన విషయం తెలుసా?"

ఒక్క క్షణం నిశ్శబ్దంగా వుండిపోయాడు.

"తెలీదు" అన్నాడు.

''ఇప్పుడు మరొక విషయం చెప్తాను విను. నీలవేణి కూడా చచ్చిపోయింది''

అతని కళ్ళల్లో భీతి, ద్వైధీభావం స్పష్టంగా గుర్తించాడు వరద.

''ఎలా చచ్చిపోయింది?''

''`ఎలా` అని అడక్కు. `ఎందుకు` అని అడుగు''

''..........''

''మొదట్నుంచీ అందరిమీదా సానుభూతి చూపించడమే తెలుసు నీలవేణికి. నీ దైన్యతనూ, నా చేతకాని తనాన్నీ ప్రేమించింది. ఓ విధంగా చెప్పాలంటే, నాకోసం కాక, నన్ను ఓదార్చడానికి నన్ను తృప్తిపరచడానికి పెళ్ళికి వప్పుకుంది. అందర్నీ, అన్నిటినీ తప్ప తనని తాను ప్రేమించుఓలేని నీలవేణి నిశ్శబ్దంగా కన్నుమూసి స్థిమితపడింది. తనని తానే హత్యచేసుకుంది. అదీ కథ.''

మంత్రముగ్ధుడిలాగ వింటూ కూచున్నాడు రవణ. ''అవన్నీ వద్దులే యిప్పుడు. గులాబి కాశీపతిని పెళ్ళి చేసుకుంది'' అన్నాడు.

ఆశ్చర్యంతో వరదరాజులు ముఖం చూశాడు రవణ.

''ఎప్పుడన్నా మళ్ళీ నిన్ను జీవితంలో కలుస్తానా అనుకునేవాణ్ణి. నాకేం తెలుసు? యింకా నా మీద నీకు పాత దురభిప్రాయం వుందా?''

''ఏమిటి?''

''తెలీదూ నీకు సుజాత విషయం?''

రవణ లేచి నిలబడి అమ్మాయిని ఎత్తుకుని పచార్లు సాగించాడు.

తన తొందరపాటుకు, కనిపిస్తే ఎప్పుడన్నా చెప్పాలన్న విషయాలన్నీ ఒక్కసారి బయటికి వచ్చినప్పటి తీవ్రత - తనకి తానే సిగ్గుపడ్డాడు వరదరాజులు.

కాస్సేపాగి ''పీతాంబరం ఏదన్నా చెప్పాడా నీకు?'' అనడిగాడు.

''లేదు''

ఆ విషయం వెల్లడించడం మంచిదా, కాదా అన్న సందిగ్ధంలో పడ్డాడు. నిందకు కారణమయిన వ్యక్తీ, ఫలితం అనుభవించిన వ్యక్తీ లేరిప్పుడు.

అప్పటి అభిప్రాయం ఏదన్నా కానీ, యిప్పుడు రవణమూర్తి కూడా స్థిమితంగానే వున్నాడు. ఇకపోతే ఆ నిందను మాపుకోవలసిన బాధ్యత తనది. ఇంతవరకూ వచ్చాక, దానిఫలితాలు దాదాపు పూర్తిగా అనుభవించాక యిప్పుడిక ఆ విషయం చెప్పకపోతే అందువల్ల లాభం ఏవిధంగానూ ఉండకపోగా, పీతాంబరం మీద జుగుప్స, మానవతమీద అపనమ్మకం మిగలడమే జరుగుతుంది.

అందుకని చెప్పబోయి, నాలిక చివరివరకూ వచ్చిన విషయాన్ని నవ్వులో దాచుకుని మాట మార్చాడు.

''ఏం చేస్తావిక్కడ?''

''ఏమీ చెయ్యను''

''మరి భోజనం?''

''పొలాలున్నాయి. మావగారు యిప్పుడే వస్తారు. చూపిస్తాను''

''శానిటోరియంలో ఒంటరిగా చెట్టుకింద కూచున్న నిన్ను చూసి ఒక్కడివీ ఎలా బతుకుతావా అనుకునేవాణ్ణి. యిప్పుడు నిన్ను చూస్తే యింకా నేనే నేర్చుకోవలసిన విషయాలున్నాయనిపిస్తోంది''

ఐదేళ్ళ కుర్రాడు నీళ్ళు తీసుకొచ్చి యిచ్చాడు కాళ్ళు కడుక్కునేందుకు.

"వీడి పేరేమిటి"

"వాడినే అడుగు"

అడిగాడు.

"వరద"

నిర్ఘాంతపోయాడు వరదరాజులు. నీళ్ళు అలానే పట్టుకుని విచిత్రంగా రవణ ముఖం చూస్తూ నిలబడిపోయాడు.

"ఇలా పెరటివేపు వెళ్ళవచ్చు" అంటూ దారి చూపించింది రవణ భార్య.

ఆశ్చర్యాన్ని ఆకట్టుకోలేకపోతున్నాడు వరద. కాళ్ళు కడుక్కుని వస్తే బల్లమీద కాఫీ కనిపించింది.

ఆ కాస్తపాటి విచిత్రమయిన అనుభవాన్నీ, ఎన్నో ఏళ్ళ తర్వాత మళ్ళీ రవణను కలిసిన క్షణాలను యింకా పొడిగించి సామాన్యం చేయడం యిష్టంలేకపోయింది వరదకి. అందుకని కాఫీ త్రాగుతూనే లేచాడు "వెళ్ళాలి" అంటూ.

"రెండురోజులు ఉంటారనుకున్నాను" అంది రవణ భార్య గుమ్మానికి ఆనుకుని నిలబడి. వీధి వసారాలోకి వచ్చాడు రవణ.

తూర్పు ఆకాశాన్ని సూర్యుడు ఉదయించబోయే వేళకి ఈశాన్యం నుంచి నల్లటి మేఘాలు కమ్ముకొచ్చాయి. చీకటి పూర్తిగా విడలేదు. పైగా రానురాను దట్టమయింది.

మర్రిచెట్టు నీడవరకూ తనతో నడిచివచ్చాడు రవణ. ఇంటికి పదిగజాలు దూరం కాగానే అన్నాడు. "తనమీద తనకే నమ్మకం లేని వాడిని భవిష్యత్తు మరీ పిరికివాణ్ణి చేస్తోంది. భవిష్యత్తుని నమ్మే ముందు తనని తాను నమ్ముకోగలగడం నేర్చుకోవాలి" పెద్ద వేదాంతిలాగా చెట్టు నీడలవేపు చూస్తూ అన్నాడు.

"ఎప్పుడు నేర్చుకున్నావ్ యీ పాఠాన్ని?"

"సుజాత చచ్చిపోయినప్పుడు కొంచెం తెలిసింది. మిగతా పాఠం నీలవేణి దగ్గర నేర్చుకున్నాను. ఫలితం ఆమెను వదిలి దూరంగా పోవడం."

కుర్రాడు 'వరద' పరిగెత్తుకుని వచ్చి తండ్రి చేతిని పట్టుకుని నడిచాడు.

చెట్టువరకూ వచ్చి "ఇక వెళ్తాను" అని ఆగాడు రవణమూర్తి.

ఆ మాటలేమీ వినిపించడంలేదు వరదరాజులుకి.

తండ్రిపక్కన నిలబడ్డ కుర్రాడివేపు చూస్తూ, ఒక్కసారి వంగి ముద్దుపెట్టుకున్నాడు.

వెళ్తూ వెళ్తూ "నువ్వు చాలా పోగొట్టుకున్నావ్. కానీ గొప్ప విశేషాల్ని సాధించావు. నేను అన్నీ పోగొట్టుకుని, కనీసం నీలవేణినన్నా నిలబెట్టుకోలేకపోయాను" అన్నాడు.

నాలుగడుగులు వేశాక "మళ్ళీ ఎప్పుడన్నా వస్తావా?" అని అడిగాడు వరద.

వెనక్కి తిరగకుండానే ఆలోచించాడు వరద. 'మళ్ళీ ఎప్పుడన్నా వస్తానా?' అని. ఆలోచించి "రాలేను, ఇంత గొప్ప సత్యాన్ని ఆకళింపుకు తెచ్చుకోవడం నాకు సాధ్యంకాదు" అనుకున్నాడు.

"రాలేను" అని వినిపించీ వినిపించనట్లు గొణిగాడు.

పొలాలమీద మేఘాల చీకటినీడలు సుడులు తిరుగుతున్నట్లున్నాయి.

రవణమూర్తిని చూశాక తృప్తికన్నా. గుండెలోంచి ఎవరో చెయ్యిపెట్టి కదిపినట్లు తన జీవితంలో అసమగ్రత తెలిసి వచ్చింది. శుష్కంగా, ఆవేశాలతో, అలక్ష్యంతో వ్యక్తిత్వాలపై పగతో ఒక దశ గడిచిపోయింది. రోడ్డంతా ఎత్తుపల్లాలుగా ఉంది. తొందరగా నడుస్తూంటే క్రిందకీ మీదకీ శరీరం తేలిపోతున్నట్లుంది. కొండపక్కనుంచి నడిస్తే వేడిగాలి శరీరాన్ని తాకుతోంది. ఎంతసేపూ పాత అనుభవమే గుర్తు వస్తోందతనికి. మళ్ళీ వెనక్కు వెళ్ళి రవణమూర్తి దగ్గర పదిరోజులు వుంటే బావుణ్ణనిపిస్తోంది.

మానసిక, తాత్త్విక సమస్యలతో సతమతమయింది అతని జీవితం. ప్రకృతికీ, దుష్టశక్తులకీ మధ్యపోరాటం, ఆశనిరాశల మధ్య అంతర్యుద్ధం, ప్రేమకూ, మనస్సు అభిరుచులకూ మధ్య వైరుధ్యం, సంక్షుభితమయి, ముకుళితమయి, దారేదో తెన్నేదో తెలీకుండా రిచ్చవడిన మూగ హృదయం, వీటన్నిటికీ వెనక నశింపులేక, పూర్తిగా వదులుకోవడానికి యిష్టపడి "ఆత్మవిశ్వాసం" ఎంత దిగుజారుతున్నా ముందుకు తోసేసే వదలని కోరికా, బ్రతుకు బరువులో ఆయాసం, స్వప్నాల కనువిప్పు, ఆశ, నిరసన నైష్కల్యం వీటన్నిటికీ ప్రతినిధి వరదరాజులు.

ప్రతి విషయంలోనూ సంశయం, ప్రతి సంఘటన గురించి భయం, ప్రపంచం గురించి పీడకలలు వీటన్నిటి మధ్య నలిగి, తమస్సులో కళ్ళు విప్పి 'ఏమీ లేద'ని తిరిగి వచ్చిన వ్యక్తి మిగిలాడు.

అతను వరదరాజులు.

వెంకటపతి మాటలు యిప్పుడిప్పుడు గుర్తుకొస్తున్నాయి.

"జీవితం నుంచి అన్నీ ఆశించి ఏమీ యివ్వలేదని ఏడ్చేవాడి కంటే జీవితం నుంచి ఏమీ ఆశించకుండా అది యిచ్చేదల్లా పుచ్చుకున్నవాడు గొప్పవాడు" అసలు జీవితం నుంచి ఏదన్నా ఎందుకు ఆశించాలి?

మేఘాలు మరీ దట్టమయాయి. క్షణంలోనో, సగంలోనో ఉధృతంగా వర్షం ఎత్తుకొనేట్లుంది. ఎదురుగ్గా స్టేషన్ మసక మసకగా కనిపిస్తోంది. ఈ ఒంటరితనం భరించరానిదిగా వుంది. ఎవరన్నా తోడు వుంటే బావుణ్ణు.

సావధానంగా ఆలోచిస్తే విశ్వేశ్వరం కుక్కని పెంచడంలో, గోవర్ధనరావుగారు కిరస్తానీ అమ్మాయిని పెళ్ళాడడంలో, పీతాంబరం నవ్వులో, వెంకటపతి నిర్లక్ష్యంలో, రవణ నిశ్శబ్దంలో, కాశీపతి దైన్యంలో అర్థం అవగాహనకు వస్తోంది.

స్టేషన్లో రైలు సిద్ధంగా వుంది.

వెనక్కు తిరిగి చూస్తే నునుపు తీరి ఏదో వికృతమైన ఆకారాన్ని గుర్తుతెచ్చే కొండ వాస్తవికతకు నిదర్శనంగా కనిపిస్తోంది.

రవణ తనకోసం పరిగెత్తుకు వస్తాడేమోనని కొండపక్క సన్నటి బాటవేపు ఆశగా చూశాడు.

వంట్లో నీరసంగా వుంది. ఇటువేపు తిరిగేసరికి రైలు వెళ్ళిపోయింది. తన పరాకకు తనకే నవ్వొచ్చింది. కనుచూపు మేరలో విజయవాడ ఇళ్ళు కనిపిస్తున్నాయి. ఉన్నట్లుండి గాలి ఉధృతంగా హోరు పెట్టూ స్టేషనుకు అడ్డంగా వీచింది.

"విజయవాడ ఎంతదూరం?" అనడిగితే "మూడు" అన్నారెవరో.

చీకటి ఎక్కువవుతున్నట్లుంది. విజయవాడ స్టేషన్లో దీపాలు చీకటిలో చీలికలులాగా కనిపిస్తున్నాయి. అటువేపే చూస్తూ నడక ప్రారంభించాడు.

అలసట క్రమంగా ఎక్కువవుతున్నట్లుంది. మనస్సు మోసపుచ్చడంలో రైలు తప్పిపోయిన వరదరాజులు నడుస్తున్నాడు. వరదరాజులు అలా నడుస్తూనే ఉన్నాడు.